ఆర్షవిద్యా తరంగిణి

# తైత్తిరీయోపనిషత్

Inspired by the teachings of

**SWAMI PARAMARTHANANDAJI**

# Taittiriyopanishad

సత్యం జ్ఞానమనంతం బ్రహ్మ
ఆనందమే నా స్వరూపం

**స్వామి పరమార్థానంద బోధనల స్ఫూర్తితో**

**వారి ఆశీస్సులతో**

**తెలుగు సేత – మద్దూరి / కస్తూరి రాజ్యశ్రీ**

First Edition - Gita Jayanthi, 3rd December 2022
1000 copies

Title - Taittiriyopanishad
Sanskrit Support – Sri Desu Chaitanya Krishna
DTP - Sri S Rajendra Kumar 98661 15622

For Copies
K V Raghava Rao
C - 804 Aparna Cyberzon
Nallagandla, Hyderabad 500019
Mobile: 9849092368
Email: raghavkasturi@gmail.com
for softcopy www.telugubhakti.com

Printed at
Sai Sri Printers
8-3-945, # 21 Pancom Business Centre
Ameerpet, Hyderabad - 500073
e-mail: saisriprinters@yahoo.com
Ph.No.040-23730222,Cell:9985530222
Price Rs. 400

# బ్రహ్మయజ్ఞం

**శ్రీ బండి కుటుంబరావు గారు,** ఇటు జీవితంలో లౌకికంగా నిచ్చెనమెట్లు ఎక్కుతూ, అటు ఆధ్యాత్మికంగా ఎన్నో దశలు దాటుకుంటూ వచ్చారు. 78 వత్సరాలు నిండిన ఆయన జీవితానుభవం ఆయనకు నేర్పిన అద్భుతమైన సూత్రం, 'భగవంతుడు సర్వవ్యాపకుడు, ఆయనే మన జీవితాలను నడిపిస్తాడు.'

ఉద్యోగపర్వంలో 1970–1994 వరకూ హెచ్.ఎమ్.టి సంస్థలో మేనేజరుగా కార్యనిర్వహణ వహించి, ఆ అనుభవంతో అనేక ప్రైవేటు రంగాలలో ఉన్నత పదవులలో అనేక భాధ్యతలు స్వీకరించినా, 'ముందుగా తల్లిలా ఆదరించిన హెచ్.ఎమ్.టి సంస్థను మాత్రం ఎన్నటికీ మరువలేను,' అంటారు శ్రీ కుటుంబరావుగారు. ఆధ్యాత్మికంగా ట్రాన్సెండెంటల్ మెడిటేషన్, పిరమిడ్ మెడిటేషన్, రమేష్ జైన్‌గారి బోధలు, ఆర్ట్ ఆఫ్ లివింగ్, చిన్మయ మిషన్ వారి బోధలు, రామకృష్ణ మిషన్ వారి గ్రంథములు – ఒకటేమిటి, ఇవన్నీ ఆయన జీవితంలోని విభిన్న మైలురాళ్ళలో, అప్పటికవసరమైన చేయూత నిచ్చాయి.

ఈమధ్యనే మా ఆన్‌లైన్ క్లాసులు గురించి తెలిసి, జ్ఞానమార్గంలో ప్రవేశించి, తనకు ఒక దిశానిర్దేశం జరిగిందనీ, ఒక క్రమపద్ధతిలో భగవద్గీత, ఉపనిషత్తులు నేర్చుకోవటం జరుగుతున్నదనీ సంతసించారు. మా సత్సంగంలో చేరిన వారంలోపే ఈ బ్రహ్మయజ్ఞానికి నేను సైతం అంటూ ముందుకు వచ్చారు.

**శ్రీ బండి కుటుంబరావు** గారి తల్లిదండ్రులు, **కీర్తిశేషులు సత్యప్రసూనాంబ గారు, వెంకట నరసయ్య గారు.** జన్మనిచ్చిన తల్లిదండ్రుల పేరిట తైత్తిరీయోపనిషత్ గ్రంథప్రచురణ అనే **ఈ బ్రహ్మయజ్ఞానికి బృహత్తరంగా సహకరించారు శ్రీ బండి కుటుంబరావు గారు, వారి** సతీమణి **శ్రీమతి బండి సరోజిని గారు.** ఈ దంపతుల **కుమార్తె భవాని, కుమారుడు భాను**. వీరు, వీరి కూతురు–అల్లుడు, కొడుకు–కోడలు, మనుమలు, మనుమరాళ్ళు – వీరందరికీ భగవంతుడు ఆయురారోగ్యాలు, ఐశ్వర్యం, ఆధ్యాత్మిక చింతన, జ్ఞానప్రాప్తి కలుగచేయాలని ఆ భగవంతుణ్ణి వేడుకుంటున్నాము.

– రాఘవ రావు, రాజ్యశ్రీ

# విషయసూచిక


| | | |
|---|---|---|
| బ్రహ్మయజ్ఞం | | 03 |
| మంగళాశాసనములు | | 05 |
| తస్మై శ్రీగురవే నమః | | 07 |
| శ్రీ గురుభ్యో నమః | | 12 |
| తైత్తిరీయోపనిషత్ | – స్వరంతో | 15 |
| తైత్తిరీయోపనిషత్ | – ఉపోద్ఘాతం | 29 |
| తైత్తిరీయోపనిషత్ | – శీక్షావల్లీ | 57 |
| తైత్తిరీయోపనిషత్ | – శీక్షావల్లీ సారాంశం | 181 |
| తైత్తిరీయోపనిషత్ | – బ్రహ్మానందవల్లీ | 189 |
| తైత్తిరీయోపనిషత్ | – బ్రహ్మానందవల్లీ సారాంశం | 330 |
| తైత్తిరీయోపనిషత్ | – భృగువల్లీ | 340 |
| తైత్తిరీయోపనిషత్ | – భృగువల్ల్లీ సారాంశం | 398 |

# మంగళాశాసనములు

జై శ్రీ వేదమ్

## వేదం వందే జగద్గురుమ్

పరిపూర్ణ పరబ్రహ్మ స్వరూపులగు ప్రియ వేదాత్మ స్వరూపులారా!

ప్రప్రథమంగా వేదప్రబోధిత బ్రహ్మనిష్ఠులైన శ్రీ రాఘవరావు గారు, రాజ్యశ్రీ వేద దంపతులకు శ్రీ వేదభగవంతుని దివ్యమైన సంపూర్ణమైన ఆశీర్వచన మంగళాశాసనములు.

"వేదం" అంటేనే భగవంతుడు, పరమాత్మ, చైతన్యం, పరబ్రహ్మ అని సిద్ధాంతము. వేదేతర సమస్త స్మృతిపురాణేతిహాస దర్శనాది గ్రంథములకు సాధ్యస్వరూపము. "వేదం" సాధనము కాదు. అది ఒక అనంత దివ్యస్వరూపం. ఆత్యంతిక దుఃఖనివృత్తి పరమానంద ప్రాప్తిరూప పరబ్రహ్మ స్వరూపం. "వేదం నుండే" "ఛందోభ్యోఽ ధ్యమృతాత్సంబభూవ" అమృతస్వరూపమైన, శాశ్వతమైన వేదబ్రహ్మము నుండే "ఓం" కారము కూడ పుట్టెనను విషయమును చాలా చక్కగా వివరించారు. త్రిమూర్తులు, త్రిశక్తులు మరియు ఇంద్రాది త్రయస్త్రింశత్ కోటిదేవతలు భాసిస్తున్నారు. సైద్ధాంతికముగా "వేదం" అనాద్యనంతాఖండ సచ్చిదానంద స్వరూపం, అదే తత్త్వమస్యాది మహావాక్యార్థ స్వరూపమైన శుద్ధచైతన్యం పరమేశ్వరుడు. ఆ వేద భగవంతుని వివర్తమే దృశ్యప్రపంచము. ఆయన ప్రతిబింబమే మనము కూడ. "నాధిష్ఠానాత్ భిన్నత ఆరోపితస్య" అను నియమమునుబట్టి ఈశ్వరుడు, సృష్టి మరియు మనము ఒక్కటే. అందుకనే "బ్రహ్మ సత్యం జగన్మిథ్యా జీవో బ్రహ్మైవ నాపరః" అని శృతివచనము. కాబట్టి వేదానుభవముద్వారా (బ్రహ్మానుభవము ద్వారా) వేద భాగమైన తైత్తిరీయ శీక్షా, బ్రహ్మ, భృగువల్లుల వివరణమును, మరియు ప్రకరణ ప్రస్థానత్రయాది ప్రమాణ గ్రంథముల వివరణమును వేదముదిత సులభశైలిలో మృదుమధురానుభవ నిష్ఠతో విశాలదృక్పథముతో పండితులే కాకుండ సామాన్య సాధకులకు కూడ అందజేయాలన్న భావనతో శక్తిచైతన్య స్వరూపులైన "శ్రీ రాఘవరావు గారు, రాజ్యశ్రీ గార్లు" ఈ లోకమునకు అందజేస్తున్నారు.

కనుక శీక్షావల్లి ద్వారా శిక్షారూపమైన కర్మలు తత్ఫలప్రాప్తి ద్వారా అంతఃకరణశుద్ధిని, భృగువల్లిద్వారా ఉపాసనారూపమైన అనుష్ఠానమును, తద్వారా మనోనిశ్చలతను, బ్రహ్మానందవల్లిద్వారా వేదరూపోపనిషన్నిష్ఠ శబ్దార్థసంబంధైక్య పునరావృత్తి రహితాఖండ సచ్చిదానంద జీవబ్రహ్మైక్య జ్ఞానమును తెలుసుకొని "జ్ఞానాదేవ తు కైవల్యమ్" మోక్షమును పొందవచ్చని భావనతో రాజమార్గమును అందించిన ఈ దంపతులకు అనంతాశీర్వచనములు.

కాబట్టి ఇట్టి "ఉపనిషత్" జ్ఞానమును, సత్కర్మనిష్ఠను, భగవద్భక్తిని, సాధన చతుష్టయ సంపత్తిని, బ్రహ్మానందమును ప్రసాదించి ఆ వేదభగవంతుడు అందరిని రక్షిస్తాడని ఆశిస్తున్నాము.

**వేదవిద్యానన్దగిరి స్వామి**
సంస్థాపకులు
శ్రీ వేదభారతి పీఠం
బాసర, నిర్మల్ జిల్లా, తెలంగాణ

***

వేదభారతి పీఠం 2008లో స్వామి వేదవిద్యానందగిరి వారిచే స్థాపింపబడింది. ఈ పీఠం పేరిట బాసరలో, నిర్మల్ జిల్లాలో, తెలంగాణలో అన్ని వసతులతో, అన్ని సదుపాయాలతో ఒక ఆదర్శమైన వేదపాఠశాల నెలకొల్పబడింది. ఇందులో జాతి, మత, లింగ భేదం చూపకుండా అందరికీ వేదం సస్వరంగా నేర్పబడుతోంది. వేదభారతి పీఠం అందరికీ వేదం, ఇంటింటా వేదం అనే నినాదంతో ముందుకు సాగుతోంది. ఈ సంస్థద్వారా సుశిక్షితులైన విద్యార్థులు ఆలయ అర్చకత్వం, పూజాదికాలు, ఎంతో సమర్థవంతంగా చేస్తున్నారు. వీరు ప్రతిదినం సాయంత్ర సమయంలో గోదావరి మాతకు అద్భుతంగా, కనుల విందుగా, భక్తిశ్రద్ధలతో గంగా హారతి నిర్వహిస్తున్నారు. స్వామి వేదవిద్యానందగిరిజీ ఆన్‌లైన్‌ద్వారా కూడా వేలాది ఔత్సాహికులకు వేదం నేర్పుతున్నారు. విద్యాప్రాప్తికోసం చిన్నారులకు నాలుకమీద బీజాక్షరాలు రాస్తారు. బాసరలో వేదపాఠశాలతోపాటు వీరికి గోశాల కూడా ఉంది. స్వామీజీ గోవులను ఎంతో ప్రేమతో ఆదరిస్తున్నారు. వేదప్రచారంకోసం స్వామీజీ వేదమాతకు చేసే ఎనలేని సేవ ఎంతో కొనియాడతగినది. బాసరలోని వీరి ఆశ్రమం చూసితీరాలి, ఆతిథ్యం అనుభవించితీరాలి.

– రాఘవరావు, రాజ్యశ్రీ

# తస్మై శ్రీగురవే నమః

చెన్నై నగరవాసులది ఎంతటి మహద్భాగ్యమో! అక్కడ పరమార్థానంద స్వామీజీ బోధను వినటానికి హుటాహుటిన సూర్యుడు ఉదయిస్తాడు; ఆయన ప్రసంగం వింటూ ఆ రోజుకి అస్తమిస్తాడు. నగరం నలుమూలలా భగవద్గీత, ఉపనిషత్తులు, బ్రహ్మసూత్రాలు, ప్రకరణ గ్రంథాలు నిర్విరామంగా, నిరంతరంగా, నిస్వార్థంగా చెబుతూనే ఉంటారు. అలా నాలుగు పదుల సంవత్సరాలుగా బోధ చేస్తూనే ఉన్నారు. అలా ఆయన చేసిన బోధ సిడీల రూపంలో వేనవేల సంఖ్యకు చేరి గిన్నీస్‌బుక్‌లోకి ఎక్కాల్సినంతగా ఉన్నాయి. భగవద్గీత అయితే ఒక గంగాప్రవాహమే. ఏదో ఒకచోట భగవద్గీతను బోధిస్తూనే ఉంటారు.

'స్వామీజీ (పరమార్థానంద స్వామీజీ)యొక్క వస్తునిష్ఠ, సమన్వయ దృష్టి, విద్వత్తు వారి ప్రస్థానత్రయమూలం, భాష్యం, ప్రకరణం, సిద్ధి, పురాణ, ఇతిహాస గ్రంథాల వ్యాఖ్యానాలలో ప్రస్ఫుటంగా గోచరిస్తాయి. శాస్త్రంలో ఏ విషయమైనా, నిదానంగా, సూటిగా, సరళ పదప్రయోగంతో, హృద్యమైన విశ్లేషణ, వివరణలు తమదైన శైలిలో అందించటం స్వామీజీ ప్రత్యేకత,' అంటూ స్వామీజీమీద తమ గురుభావాన్ని ప్రదర్శిస్తుంటారు ఆత్మలీనానంద స్వామిని.

కేరళలో లౌకికవిద్యలో పట్టభద్రులయ్యారు పరమార్థానంద స్వామీజీ. చిన్మయానంద స్వామీజీ, దయానంద స్వామీజీ కలిసి అద్వైత వేదాంతబోధను మూడేళ్ళ కోర్సుగా తీర్చిదిద్దారు. ఆ కోర్సులో సంస్కృతం, ప్రస్థానత్రయం, కొన్ని ప్రకరణగ్రంథాలు బోధించేవారు. అలా ఆరు కోర్సులు నడిపారు – రెండు సాందీపని సాధనాలయంలోనూ, రెండు సైలేస్‌బర్గ్‌లోనూ, రెండు ఆనైకట్టిలోనూ. పరమార్థానంద స్వామీజీ సాందీపనీలో రెండవ కోర్సులో 1976–79 సంవత్సరాలలో అధ్యయనం చేశారు. అందువల్ల ఈ స్వామీజీకి తమ గురువులంటే ఎంతో పూజ్యభావం. దయానంద స్వామీజీని పూజ్య స్వామీజీ అని వ్యవహరిస్తారు అంతా. పరమార్థానంద స్వామీజీ అక్కడ తమ ఆశ్రమ జీవన విధానాన్ని వర్ణిస్తున్నప్పుడు చిన్మయానంద స్వామీజీ వారిని తండ్రిలా చూసుకుంటే, పూజ్యస్వామీజీ వారి అవసరాలను, వారి ఆలనాపాలనలను తల్లిలా చూసుకునేవారు అని చెబుతారు. అక్కడి విద్యార్థులకు అన్ని రంగాలనుంచీ వైద్యులను పిలిపించి, వారి ఆరోగ్య పరిరక్షణ చేయిస్తూ కూడా, సైకియాట్రిస్ట్‌ను పిలవలేదు. ఎందుకంటే ఆ అంశాన్ని పూజ్య స్వామీజీయే స్వయంగా చూసుకునేవారు.

**ఆచినోతి హి శాస్త్రాణి ఆచారే స్థాపయత్యపి।**
**స్వయమ్ ఆచరతే యస్మాత్తస్మాదాచార్య ఉచ్యతే॥**

శాస్త్రాన్ని ఆకళింపు చేసుకుని, వారు ఆచరిస్తూ, వారి బోధనల ద్వారా ఇతరులను ఆచరింపజేసేవారే ఆచార్యులు అని చెప్పబడింది. సందర్భం వచ్చినప్పుడల్లా ఆ ఆచార్యుని పదానికి తమ ఆచార్యులు ఎలా ధీటుగా నిలిచారో చెబుతూనే ఉంటారు స్వామీజీ.

ఒకసారి సాందీపని సాధనాలయంలో ఉండగా శిష్యులు కొందరు కలిసి చెట్లనుంచి రాలిన ఎండుటాకులన్నిటినీ శుభ్రం చేసి, వాటిని ఒక పెద్దచెట్టు కింద పోసి మంట పెట్టారుట. విద్యార్థుల దైనందిక కార్యక్రమంలో ఇలా తోటపని చేయటం కూడా ఉండేది. అలా వారు ఆకులను కాలుస్తున్న సమయంలో అనుకోకుండా అటువైపు వచ్చిన పూజ్య స్వామీజీ, 'అరెరె, చెట్టుకి వేడి తగలటం లేదా?' అన్నారుట. ఈ బోధ క్లాసురూపంలో చెప్పినది కాదు, ఆయన స్వయంగా నమ్మి, ఆచరించే సిద్ధాంతంనుంచి వచ్చింది. అప్పుడు వీరందరి మనస్సుల్లో ఈ మాట శిలాశాసనంలా చెక్కుచెదరకుండా నిలిచిపోయింది. భూతదయ అంటే ఏమిటో అర్థమయింది.

అదే విధంగా చిన్మయానంద స్వామీజీ ఏంచేసినా చాలా శ్రద్ధగా, ఒక తపస్సుగా చేస్తారని స్వామీజీ చెబుతుంటారు. చిన్మయానంద స్వామీజీ ఏదైనా పని చేసేటప్పుడు చూసితీరాలి. రెండు కళ్ళు చాలవు. ఏ పని చేసినా, ఎంత చిన్నదైనా సరే, దాన్ని పరిపూర్ణంగా చేయాలి. లెటర్‌ప్యాడ్‌నుంచి చింపిన కాగితాన్ని మడవటంలో కూడా ఒక ప్రజ్ఞ ఉంది. ఎలా పడితే అలా మడవకూడదు. కాగితంయొక్క రెండు కొనలూ సరిగ్గా కలుసుకోవాలి. దాన్ని కవరులో సరిగ్గా పెట్టాలి. కవరు సరిగ్గా అంటించాలి. దానికి అంటించే జిగురు బయటకు రాకూడదు. చిన్మయానంద స్వామీజీ ఏదైనా నిర్లక్ష్యంగా చేస్తే ఇష్టపడేవారు కాదు. ఎవరినైనా సరిగ్గా చెయ్యమంటే, వారు చెప్పే కుంటిసాకు, 'నాకు తీరికలేదు.' కాని చిన్మయానంద స్వామీజీ ప్రపంచంలో క్షణం తీరిక లేకుండా పనిచేసే వారిలో ఒకరు. అయినా ఏ చిన్నపని చేసినా దాన్ని సమర్థవంతంగా చేసేవారు.

అలా వారి ఆచరణలతో ప్రభావితులైతే, ఆ గురువులిద్దరి బోధను స్వామీజీ తన బోధలో ఎంతగా మలుచుకున్నారో చెప్పలేము. తమ గురువుల ప్రస్తావన రాకుండా ఉండదు ఆయన బోధలో. ఇద్దరు గురువులు చెప్పిన దృష్టాంతాలను, కథలను, హాస్యగుళికలను, వారి ప్రత్యేక వాక్యాలను నొక్కివక్కాణిస్తూనే ఉంటారు.

ఒక అమాయకుడు హొటలుకు వెళితే, 'నువ్వు కడుపునిండా తిను, తర్వాతే డబ్బు కట్టు,' అన్నాడుట మేనేజరు. ఇతను ఏడు వడలు తింటేకాని కడుపు నిండలేదు. కాని తనతో

వచ్చిన తన స్నేహితునికి ఒక్క వడకే కడుపు నిండి పోయింది. 'ఇది అన్యాయం, నాకు ఏడో వడని ముందు తీసుకురాలేదు సర్వరు. అతనికి మాత్రం ముందు తెచ్చాడు. నేను డబ్బు కట్టను,' అని పేచీ పెట్టుకున్నాడు. తీరా విచారిస్తే తెలిసిన విషయం, అతని స్నేహితుడు ఇంట్లో ఆరు వడలు తినే వచ్చాడు. అందువల్ల ఇక్కడికి వచ్చి, ఒక్క వడ తింటేనే అతని కడుపు నిండి పోయింది. అలా కొంతమంది పూర్వజన్మలోనే హోమ్‌వర్క్ చేసివస్తారు అంటారు పూజ్య స్వామీజీ. అంటే వారికి సాధన చతుష్టయ సంపత్తి ముందే ఉంది అని చెప్పటానికి ఈ కథను చమత్కారంగా చెబుతారని అంటారు స్వామీజీ. దాన్ని ఏడు వడల కథ అని కూడా అనేవారు.

ఎవరో వెళ్ళి, సూర్యభగవానునికి చెప్పారుట, 'నిశిరాత్రి అనే చాలా అందమైన స్త్రీ ఉంది, నువ్వు ఆమెను పెళ్ళి చేసుకో.' సహజంగా సూర్యభగవానునికి ఆసక్తి కలిగింది. ఆమెను వెతుక్కుంటూ బయలుదేరాడు. ఆమె భూగోళానికి అటువైపు ఉంది అన్నారుట. కష్టపడి అక్కడికి వెళితే ఇటులేదు, అటువైపు ఉంది అన్నారుట. అలా సూర్యభగవానుడు నిశాదేవిని వెతుకుతూనే ఉన్నాడు. అలా వచ్చినవే సూర్యోదయం, సూర్యాస్తమయం. సూర్యకాంతి ఉన్నచోట చీకటికి చోటులేదు. అంటే సూర్యకాంతి ఎంత శక్తివంతమైనదైనా కూడా చీకటిని ప్రకాశింపజేయలేదు. చైతన్యం ఒక్కటే చీకటిని చూపించగలదు అని చెప్పటానికి మనస్సుకు హత్తుకు పోయేలా చిన్మయానంద స్వామీజీ చెప్పే అద్భుతమైన కథను చెబుతారు స్వామీజీ.

ఇద్దరు గురువుల బోధలోనూ కొన్ని ప్రత్యేక వాక్యాలు ఉంటాయి. అవి కొన్ని చూద్దాము.

**పూజ్యస్వామీజీ ప్రత్యేక వాక్యాలు**

| | | |
|---|---|---|
| Fake it and make it | – | విలువలను నీకు ఉన్నట్టుగా ప్రయత్నిస్తే, అవి నెమ్మదిగా అలవాటై పోతాయి. |
| Born is gone | – | సృష్టి, స్థితి, లయలు |
| Problem is you, solution is you | – | సమస్య నువ్వు, పరిష్కారం నువ్వు. |

**చిన్మయానంద స్వామీజీ ప్రత్యేక బాణీ**

| | | |
|---|---|---|
| Alone to alone to all alone | – | వంటరిగా వచ్చి, వంటరిగా వెళతారు |
| Should change from animal-man to man-man to God-man | – | మనిషి పశుప్రవృత్తినుంచి, మనుష్య ప్రవృత్తికి ఎదిగి, దైవ ప్రవృత్తికి ఎదగాలి |
| Womb to tomb | – | కడుపునుంచి కాటికి సాగే ప్రయాణం |

పూజ్య స్వామీజీమీద వారికున్న గౌరవాభిమానాలను దయాపంచకంలో పొందుపరచి, మళ్ళీ దాన్ని విస్తారంగా ఒక సందర్భంలో వివరించారు స్వామీజీ.

**యతీనాం వరిష్ఠం గురూణాం గరిష్ఠం**
**దయానందరూపం మదాచార్యమీడే** – 2

సన్న్యాసుల్లో శ్రేష్ఠులు, గురువులలో శ్రేష్ఠులు, దయకు ప్రతిరూపమైన, నా గురువుకు నా ప్రణామాలు అని అంజలి ఘటించారు మన గురువులు పరమార్థానంద స్వామీజీ.

**చైతన్యః శాశ్వతః శాంతో వ్యోమాతీతో నిరంజనః**
**బిందునాదకలాతీతః తస్మై శ్రీగురవే నమః** – శ్రీ గురుస్తోత్రమ్

ఈ గురుస్తోత్రం తెలియని వారుండరు అనటంలో అతిశయోక్తి లేదు. కాని దీని వెనకున్న విశేషం ఎంతమందికి తెలుసన్నదే ప్రశ్న. ఎందరో స్వామీజీలను ఆచార్యులుగా తీర్చిదిద్ది, వారందరి మన్ననలందుకుంటూ, పూజ్యస్వామీజీగా కీర్తిగాంచిన శ్రీ దయానందస్వామి ఏర్చి, కూర్చి రాగం కట్టిన స్తోత్రం ఇది. పూజ్య స్వామీజీ, ఆయన గురువైన చిన్మయానంద స్వామీజీ దగ్గర ఉండగా ఒక సందర్భంలో గురుగీతనుంచి తన గురువుమీద తన భక్తి చాటుకోవటానికి కొన్ని శ్లోకాలను ఎంపిక చేశారు. దీన్నిబట్టే మన సంప్రదాయం ఎలా గురుపరంపరగా వస్తోందో తెలుస్తోంది.

**శంకరం శంకరాచార్యం కేశవం బాదరాయణమ్**
**సూత్రభాష్యకృతౌ వందే భగవన్తౌ పునః పునః**

శిష్యుడు శంకరాచార్యులకు, వ్యాసాచార్యులకు నమస్కారాలు చేస్తున్నాడు. వీరిద్దరూ మామూలు గురువులు కాదు, సాక్షాత్తూ భగవంతుని అవతారాలు. సాక్షాత్తూ శివుడు ఆదిశంకరులవారిగా అవతారమెత్తితే, విష్ణుమూర్తి వ్యాసాచార్యులవారిగా అవతారం ఎత్తాడు. అందువల్లనే మన హిందూ సంప్రదాయంలో వ్యాసపూర్ణిమను, శంకరజయంతిని వేడుకగా చేసుకుంటాము.

కాని మనం వీరినుంచి నేర్చుకోవాల్సింది ఎంతైనా ఉంది. మన ప్రస్థాన త్రయంలో భగవద్గీతను, బ్రహ్మసూత్రాలను మనకు వ్యాసాచార్యులవారు అందిస్తే ఈ ప్రస్థానత్రయం అంతటికీ భాష్యం రాసిన ధన్యజీవి శంకరాచార్యులవారు. ఈరోజు మనం అద్వైత వేదాంతం నేర్చుకుంటున్నామంటే, దానికి వీరి అపారమైన కరుణాకటాక్షాలే కారణం.

**శ్రుతి స్మృతి పురాణానామ్ ఆలయం కరుణాలయమ్।**
**నమామి భగవత్పాదం శంకరం లోకశంకరమ్॥**

ప్రస్థానత్రయానికి భాష్యం రాశారు శంకరులవారు. అంతేకాదు, స్మృతి, పురాణాలు, ఇతిహాసాలకు ఆయన ఆలయం.

ఆయన కరుణకు మారుపేరు కాబట్టే, శంకర భగవత్పాదులుగా వారిని కీర్తిస్తాము. కాని అంత ఆదిశంకరాచార్యులవారు, వారి వినమ్రతను ఎలా చాటిచెప్పుకున్నారో చూడండి!

**యై రిమే గురుభిః పూర్వం పదవాక్య ప్రమాణతః।**
**వ్యాఖ్యాతాః సర్వవేదాన్తా స్తాన్నిత్యం ప్రణతోఽస్మ్యహమ్॥**

ఈ శ్లోకాన్ని శంకరాచార్యులవారు తన తైత్తిరీయ భాష్యంలో రాశారు. 'నేను ఈ భాష్యం రాస్తున్నానంటే, ఆ గొప్పతనం నాది కానేకాదు; నా ముందు వచ్చిన ఆచార్యులు చెప్పిన విషయాలనే నేను మళ్ళీ చెబుతున్నాను.' ఆ గురువులు పదవాక్య ప్రమాణాలను ఉపయోగించి భాష్యాలు రాశారని, అందువల్ల వారికి నేను నిత్యం నమస్కారం చేస్తున్నానని వినయంగా చెప్పుకుంటున్నారు. ఈ గురుపరంపర సాక్షాత్తూ నారాయణునినుంచే మొదలయింది.

ఇటువంటి గురుపరంపరమీద మన భక్తిప్రపత్తులు చూపిస్తూ ఈ శ్లోకాన్ని పఠిద్దాము.

**నారాయణం పద్మభువం వసిష్ఠం శక్తిం చ తత్పుత్ర పరాశరం చ।**
**వ్యాసం శుకం గౌడపదం మహాన్తం గోవింద యోగీంద్రమథాస్య శిష్యమ్॥**
**శ్రీ శంకరాచార్యమథాస్య పద్మపాదం చ హస్తామలకం చ శిష్యమ్।**
**తం తోటకం వార్తికకారమన్యాన్ అస్మద్గురూన్ సంతతమానతోఽస్మి॥**

**– మద్దూరి రాజ్యశ్రీ**

# శ్రీ గురుభ్యో నమః

**దుర్లభో విషయత్యాగో।**
**దుర్లభం తత్త్వదర్శనమ్।**
**దుర్లభా సహజావస్థా।**
**సద్గురో కరుణాం వినా॥**

శ్రీ పూజ్యస్వామీజీ దయానందస్వామీ, శ్రీ స్వామీజీ పరమార్థానందస్వామీ మరియు గురుదంపతులు శ్రీ కస్తూరి వీరరాఘవరావు గారు, శ్రీమతి మద్దూరి/కస్తూరి రాజ్యశ్రీ గారికి ప్రణామములు.

కృష్ణ యజుర్వేద తైత్తిరీయశాఖకు చెందిన తైత్తిరీయోపనిషత్ నా భాగ్యవశాత్తు చదివాను. గ్రంథము ఆద్యంతము చాలా సరళమయిన భాషతో సామాన్యులకు కూడా తేలికగా అర్థం అయ్యేటట్టు ఉంది. ఉపోద్ఘాతంతో మొదలుపెట్టి మెల్లమెల్లగా లోతులలోకి తీసుకుని వెళ్ళారు. విస్తరించి చెప్పడంవల్ల తేలికగా బోధపడుతుంది.

శీక్షావల్లిలో వేదమంత్రాల ఉచ్చారణ, వాటి స్వరం, తదితర వివరాలు విపులంగా ఉన్నాయి. ఉచ్చారణ దోషంవల్ల మంత్రం అర్థం మారిపోతుంది. ఉచ్చారణ కర్మకాండలో ముఖ్యమైన అంగం. కానీ తప్పులు దొర్లితే ప్రాయశ్చిత్తం చేసుకునే అవకాశం ఉంది. అదే జ్ఞానమార్గంలో సాధకుడు తప్పుగా అర్థం చేసుకునే ప్రమాదం ఉంది. ఉదాహరణకి 'సకలం కురు' అనే పదాన్ని 'శకలం కురు' అని పలికితే కార్యం సమగ్రంగా చేయమని కాకుండా కార్యం ముక్కలు చేయమని అర్థం వస్తుంది. ఇటువంటి విషయాలు ఈ పుస్తకంలో ఉన్నాయి. అందరికి ఘనాపాటి అనే మాట తెలిసినదే. కానీ దీంట్లో ఘన, జట, క్రమ అనే వేదపఠనం వెనక ఇంత కష్టం ఉందని తెలిసిన తర్వాత వేదపండితుల విశిష్టత తెలిసి, వారిమీద మరింత గౌరవం పెరుగుతుంది.

ప్రతి పదానికీ అర్థం వ్రాయడం, వివరణ, వ్యాఖ్యానం ఇవ్వటంవల్ల క్లిష్టమయిన మంత్రాలు కూడా తేలికగా అర్థం అవుతున్నాయి. ఇది చాలా గొప్ప ప్రక్రియ. ముఖ్యంగా ఉపాసనలు, ఓంకారోపాసన వివరణ బాగా ఉపయోగపడుతుంది.

'సత్యం జ్ఞానమ్ అనంతమ్' శంకరులవారి విస్తారమయిన భాష్యంయొక్క సారాంశం వివరించిన తీరు అద్భుతంగా ఉంది. వేదాంత పరిభాష అయిన జహ, అజహ, జహదజహ లక్షణాలను సామాన్యమయిన ఉదాహరణలతో వివరించారు – నిర్వికారమయిన బ్రహ్మకి

లక్షణాలు ఎలా ఉంటాయి అనే ప్రశ్నకి భాగత్యాగ లక్షణంద్వారా వివరణ చాలా తేలికైన విషయంగా తెలియచేసారు. ప్రపంచంలో ఉచ్ఛిష్టం కానిది ఒక్క బ్రహ్మము మాత్రమే – అందువల్లనే బ్రహ్మ సూచించబడుతోంది, చెప్పబడడం లేదు – యతో వాచో నివర్తంతే అప్రాప్య మనసా సః. ఈ వివరణవల్ల చాలామందికి కనువిప్పు కలుగుతుందని అనిపిస్తోంది.

పంచకోశవివేకం పఠనంలో సామాన్యంగా శిష్యునికి వచ్చే ప్రశ్నలు, సందేహాలకి వివరణ, తర్కప్రధానమయిన జవాబులు బాగున్నాయి.

చాలామందికి వచ్చే అతి సామాన్యమయిన సందేహం 'సోఽకామయత' గురించి. బ్రహ్మకి కూడా కోరిక ఉంటుందా అని. దీనికి ఇచ్చిన వివరణ అత్యద్భుతంగా ఉంది. అత్యంత క్లిష్టమయిన విషయాలు శాస్త్రసమ్మతమయిన తర్కంతో వివరించారు. ఇక్కడ మామూలు తర్కం కాదు, శాస్త్ర సమ్మతమైన తర్కం అన్న విషయం గమనించాలి. చిన్నచిన్న ఉదాహరణలతోనే వివరించడం శ్రీమతి రాజ్యశ్రీ గారి అద్భుతశైలి.

ఆనందవివరణ మానుషానందంనుంచి హిరణ్యగర్భ ఆనందం వరకూ ఉంది. ముముక్షువుకి ప్రేరణ కలిగించే విధంగా ఉన్నది.

బ్రహ్మ విచారణ సద్గురువు, శాస్త్రంద్వారానే చేయాలి. అలాకాక సొంతంగా మొదలుపెడితే అది ఊహాగానం అవుతుంది అన్న హెచ్చరిక ఎందరికో కనువిప్పు.

ఈ అవకాశం నాకు యిచ్చిన శ్రీమతి మద్దూరి/కస్తూరి రాజ్యశ్రీ గారికి, శ్రీ కస్తూరి వీరరాఘవరావు గారికి నా ప్రణామాలు. సామాన్యమయిన శిష్యులని కూడా వారు ఎంతగా ప్రోత్సహిస్తారో చెప్పడానికి ఇదే ఉదాహరణ.

సద్గురువులు మనకు లభించడం మన అదృష్టం.

**గురురేవ పరం బ్రహ్మ।**
**గురురేవ పరా గతిః।**
**గురురేవ పరా విద్యా।**
**గురురేవ పరాయణమ్॥**

బుధజన విధేయుడు
**డా॥ జి. ఎస్. ఎన్. మూర్తి**

# శ్రీగణపతి ప్రార్థన

ఓం గణానాం త్వా గణపతిగ్ం హవామహే
కవిం కవీనాముపమశ్రవస్తమమ్।
జ్యేష్ఠరాజం బ్రహ్మణాం బ్రహ్మణస్పత ఆ నః
శృణ్వన్నూతిభిస్సీద సాదనమ్॥

ప్రణో దేవీ సరస్వతీ వాజేభిర్వాజినీవతీ।
ధీనామవిత్ర్యవతు। గణేశాయనమః।
సరస్వత్యైనమః। శ్రీ గురుభ్యోనమః।
హరిః ఓమ్॥

ఓం శాంతిః శాంతిః శాంతిః॥

# తైత్తిరీయోపనిషత్ – శీక్షావల్లీ

### అనువాకం 1

శాంతి పాఠం

ఓం శం నో మిత్రః శం వరుణః। శం నో భవత్వర్యమా। శం న ఇంద్రో బృహస్పతిః। శం నో విష్ణురురుక్రమః। నమో బ్రహ్మణే। నమస్తే వాయో। త్వమేవ ప్రత్యక్షం బ్రహ్మాసి। త్వమేవ ప్రత్యక్షం బ్రహ్మ వదిష్యామి। ఋతం వదిష్యామి। సత్యం వదిష్యామి। తన్మామవతు। తద్వక్తారమవతు। అవతు మామ్। అవతు వక్తారమ్।

ఓం శాన్తిః శాన్తిః శాన్తిః॥

### అనువాకం 2

శీక్షాం వ్యాఖ్యాస్యామః । వర్ణః స్వరః। మాత్రా బలమ్। సామ సంతానః। ఇత్యుక్తః శీక్షాధ్యాయః।

### అనువాకం 3

సహ నౌ యశః। సహ నౌ బ్రహ్మవర్చసమ్। అథాతస్సగ్ంహితాయా ఉపనిషదం వ్యాఖ్యాస్యామః। పంచస్వధికరణేషు। అధిలోకమధిజ్యౌతిషమధివిద్యమధిప్రజమధ్యాత్మమ్। తా మహాసగ్ంహితా ఇత్యాచక్షతే।

అథాధిలోకమ్। పృథివీ పూర్వరూపమ్। ద్యౌరుత్తరరూపమ్। ఆకాశస్సన్ధిః। వాయుస్సన్ధానమ్। ఇత్యధిలోకమ్।

అథాధిజ్యౌతిషమ్। అగ్నిః పూర్వరూపమ్। ఆదిత్య ఉత్తరరూపమ్। ఆపస్సన్ధిః। వైద్యుతస్సన్ధానమ్। ఇత్యధిజ్యౌతిషమ్।

అథాధివిద్యమ్। ఆచార్యః పూర్వరూపమ్। అంతేవాస్యుత్తర రూపమ్। విద్యా సన్ధిః। ప్రవచనగ్ం సన్ధానమ్। ఇత్యధివిద్యమ్।

అథాధిప్రజమ్। మాతా పూర్వరూపమ్। పితోత్తరరూపమ్। ప్రజాసన్ధిః। ప్రజననగ్ం సన్ధానమ్। ఇత్యధిప్రజమ్।

అథాధ్యాత్మమ్। అధరాహనుః పూర్వరూపమ్। ఉత్తరాహనురుత్తరరూపమ్। వాక్సన్ధిః జిహ్వా సన్ధానమ్। ఇత్యధ్యాత్మమ్।

ఇతీమా మహాసగ్ంహితాః। య ఏవమేతా మహాసగ్ంహితా వ్యాఖ్యాతా వేద। సంధీయతే ప్రజయా పశుభిః। బ్రహ్మవర్చసేనాన్నాద్యేన సువర్గ్యేణ లోకేన॥

## అనువాకం 4

యశ్ఛందసామృషభో విశ్వరూపః। ఛందోభ్యోఽధ్యమృతాత్సంబభూవ। స మేంద్రో మేధయా స్పృణోతు। అమృతస్య దేవధారణో భూయాసమ్। శరీరం మే విచర్షణమ్। జిహ్వా మే మధుమత్తమా। కర్ణాభ్యాం భూరి విశ్రువమ్। బ్రహ్మణః కోశోఽసి మేధయా పిహితః। శ్రుతం మే గోపాయ। ఆవహన్తీ వితన్వానా। కుర్వాణాచీరమాత్మనః। వాసాగ్ంసి మమ గావశ్చ। అన్నపానే చ సర్వదా। తతో మే శ్రియమావహ। లోమశాం పశుభిః సహ స్వాహా।

ఆమాయన్తు బ్రహ్మచారిణః స్వాహా। విమాయన్తు బ్రహ్మచారిణః స్వాహా। ప్రమాయన్తు బ్రహ్మచారిణః స్వాహా। దమాయన్తు బ్రహ్మచారిణః స్వాహా। శమాయన్తు బ్రహ్మచారిణః స్వాహా।

యశో జనేఽసాని స్వాహా। శ్రేయాన్ వస్యసోఽసాని స్వాహా। తం త్వా భగ ప్రవిశాని స్వాహా। స మా భగ ప్రవిశ స్వాహా। తస్మిన్ సహస్రశాఖే। నిభగాఽహం త్వయి మృజే స్వాహా। యథాఽఽపః ప్రవతా యంతి। యథా మాసా అహర్జరమ్। ఏవం మాం బ్రహ్మచారిణః। ధాతరాయంతు సర్వతః స్వాహా। ప్రతివేశోఽసి ప్ర మా భాహి ప్ర మా పద్యస్వ॥

## అనువాకం 5

భూర్భువస్సువరితి వా ఏతా స్తిస్రో వ్యాహృతయః। తాసాము హ స్మైతాం చతుర్థీమ్। మాహాచమస్యః ప్రవేదయతే। మహ ఇతి। తద్బ్రహ్మ। స ఆత్మా। అంగాన్యన్యా దేవతాః।

భూరితి వా అయం లోకః। భువ ఇత్యంతరిక్షమ్। సువరిత్యసౌ లోకః। మహ ఇత్యాదిత్యః। ఆదిత్యేన వావ సర్వే లోకా మహీయన్తే।

భూరితి వా అగ్నిః। భువ ఇతి వాయుః। సువరిత్యాదిత్యః। మహ ఇతి చంద్రమాః। చంద్రమసా వావ సర్వాణి జ్యోతీగ్ంషి మహీయన్తే।

భూరితి వా ఋచః। భువ ఇతి సామాని। సువరితి యజూగ్ంషి। మహ ఇతి బ్రహ్మ। బ్రహ్మణా వావ సర్వే వేదా మహీయన్తే।

భూరితి వై ప్రాణః। భువ ఇత్యపానః। సువరితి వ్యానః। మహ ఇత్యన్నమ్। అన్నేన వావ సర్వే ప్రాణా మహీయన్తే।

తా వా ఏతాశ్చతస్రశ్చతుర్ధా। చతస్రశ్చతస్రో వ్యాహృతయః। తా యో వేద। స వేద బ్రహ్మ। సర్వేఽస్మై దేవా బలిమావహన్తి॥

## అనువాకం 6

స య ఏషోఽన్తర్హృదయ ఆకాశః। తస్మిన్నయం పురుషో మనోమయః। అమృతో హిరణ్మయః। అన్తరేణ తాలుకే। య ఏష స్తన ఇవావలమ్బతే। సేంద్రయోనిః। యత్రాసౌ కేశాన్తో వివర్తతే। వ్యపోహ్య శీర్షకపాలే।

భూరిత్యగ్నౌ ప్రతితిష్ఠతి। భువ ఇతి వాయౌ। సువరిత్యాదిత్యే। మహ ఇతి బ్రహ్మణి। ఆప్నోతి స్వారాజ్యమ్। ఆప్నోతి మనసస్పతిమ్। వాక్పతిశ్చక్షుష్పతిః। శ్రోత్రపతిర్విజ్ఞానపతిః। ఏతత్తతో భవతి। ఆకాశ శరీరం బ్రహ్మ। సత్యాత్మ ప్రాణారామం మన ఆనందమ్। శాంతి సమృద్ధమమృతమ్। ఇతి ప్రాచీనయోగ్యోపాస్స్వ॥

## అనువాకం 7

పృథివ్యంతరిక్షం ద్యౌర్దిశోఽవాన్తరదిశః। అగ్నిర్వాయురాదిత్యశ్చన్ద్రమా నక్షత్రాణి। ఆప ఓషధయో వనస్పతయ ఆకాశ ఆత్మా। ఇత్యధిభూతమ్। అథాధ్యాత్మమ్। ప్రాణో వ్యానోఽపాన ఉదానస్సమానః। చక్షుశ్శ్రోత్రం మనో వాక్ త్వక్। చర్మమాగ్ంసగ్ం స్నావాస్థి మజ్జా। ఏతదధివిధాయ ఋషిరవోచత్। పాఙ్క్తం వా ఇదగ్ం సర్వమ్। పాఙ్క్తేనైవ పాఙ్క్తగ్ం స్పృణోతీతి॥

### అనువాకం 8

ఓమితి బ్రహ్మ। ఓమితీదగ్ం సర్వమ్। ఓమిత్యేతదనుకృతిర్హ స్మ వా అప్యో శ్రావయేత్యాశ్రావయన్తి। ఓమితి సామాని గాయన్తి। ఓగ్ం శో మితి శస్త్రాణి శగ్ంసన్తి। ఓమిత్యధ్వర్యుః ప్రతిగరం ప్రతిగృణాతి। ఓమితి బ్రహ్మా ప్రసౌతి। ఓమిత్యగ్నిహోత్రమనుజానాతి। ఓమితి బ్రాహ్మణః ప్రవక్ష్యన్నాహ బ్రహ్మోపాప్నవానీతి। బ్రహ్మైవోపాప్నోతి॥

### అనువాకం 9

ఋతం చ స్వాధ్యాయప్రవచనే చ। సత్యం చ స్వాధ్యాయప్రవచనే చ। తపశ్చ స్వాధ్యాయప్రవచనే చ। దమశ్చ స్వాధ్యాయప్రవచనే చ। శమశ్చ స్వాధ్యాయప్రవచనే చ। అగ్నయశ్చ స్వాధ్యాయప్రవచనే చ। అగ్నిహోత్రం చ స్వాధ్యాయప్రవచనే చ। అతిథయశ్చ స్వాధ్యాయప్రవచనే చ। మానుషం చ స్వాధ్యాయప్రవచనే చ। ప్రజా చ స్వాధ్యాయప్రవచనే చ। ప్రజనశ్చ స్వాధ్యాయప్రవచనే చ। ప్రజాతిశ్చ స్వాధ్యాయప్రవచనే చ। సత్యమితి సత్యవచారాథీతరః। తప ఇతి తపోనిత్యః పౌరుశిష్టిః। స్వాధాయప్రవచనే ఏవేతి నాకో మౌద్గల్యః। తద్ధి తపస్తద్ధి తపః॥

### అనువాకం 10

అహం వృక్షస్య రేరివా। కీర్తిః పృష్ఠం గిరేరివ। ఊర్ధ్వపవిత్రో వాజినీవ స్వమృతమస్మి। ద్రవిణగ్ం సవర్చసమ్। సుమేధా అమృతోఽక్షితః। ఇతి త్రిశంకోర్వేదానువచనమ్॥

### అనువాకం 11

వేదమనూచ్యాచార్యోఽన్తేవాసిన మనుశాస్తి। సత్యం వద। ధర్మం చర। స్వాధ్యాయాన్మా ప్రమదః। ఆచార్యాయ ప్రియం ధనమాహృత్య ప్రజాతంతుం మా వ్యవచ్ఛేత్సీః। సత్యాన్న ప్రమదితవ్యమ్। ధర్మాన్న ప్రమదితవ్యమ్। కుశలాన్న ప్రమదితవ్యమ్। భూత్యై న ప్రమదితవ్యమ్। స్వాధ్యాయప్రవచనాభ్యాం న ప్రమదితవ్యమ్। దేవపితృకార్యాభ్యాం న ప్రమదితవ్యమ్। మాతృదేవో భవ। పితృదేవో భవ। ఆచార్యదేవో భవ। అతిథిదేవో భవ।

యాన్యనవద్యాని కర్మాణి। తాని సేవితవ్యాని। నో ఇతరాణి। యాన్యస్మాకగ్ం సుచరితాని। తాని త్వయోపాస్యాని। నో ఇతరాణి।

యే కే చాస్మచ్ఛ్రేయాగ్ంసో బ్రాహ్మణాః। తేషాం త్వయాఽఽసనేన ప్రశ్వసితవ్యమ్। శ్రద్ధయా దేయమ్। అశ్రద్ధయాఽదేయమ్। శ్రియా దేయమ్। హ్రియా దేయమ్। భియా దేయమ్। సంవిదా దేయమ్।

అథ యది తే కర్మవిచికిత్సా వా వృత్తవిచికిత్సా వా స్యాత్। యే తత్ర బ్రాహ్మణాస్సమ్మర్శినః యుక్తా ఆయుక్తాః। అలూక్షా ధర్మకామాస్స్యుః। యథా తే తత్ర వర్తేరన్। తథా తత్ర వర్తేథాః। అథాభ్యాఖ్యాతేషు। యే తత్ర బ్రాహ్మణాస్సమ్మర్శినః యుక్తా ఆయుక్తాః। అలూక్షా ధర్మకామాస్స్యుః। యథా తే తేషు వర్తేరన్। తథా తేషు వర్తేథాః।

ఏష ఆదేశః। ఏష ఉపదేశః। ఏషా వేదోపనిషత్। ఏతదనుశాసనమ్। ఏవముపాసితవ్యమ్। ఏవము చైతదుపాస్యమ్॥

## అనువాకం 12

ఓం శం నో మిత్రశ్శం వరుణః। శం నో భవత్వర్యమా। శం న ఇంద్రో బృహస్పతిః। శం నో విష్ణురురుక్రమః। నమో బ్రహ్మణే। నమస్తే వాయో। త్వమేవ ప్రత్యక్షం బ్రహ్మాసి। త్వామేవ ప్రత్యక్షం బ్రహ్మావాదిషమ్। ఋతమవాదిషమ్। సత్యమవాదిషమ్। తన్మామావీత్। తద్వక్తారమావీత్। ఆవీన్మామ్। ఆవీద్వక్తారమ్।

ఓం శాంతిశ్శాంతిశ్శాంతిః॥

# తైత్తిరీయోపనిషత్ – బ్రహ్మానందవల్లీ

**శాంతి పాఠం**

ఓం సహ నావవతు। సహ నౌ భునక్తు। సహ వీర్యం కరవావహై। తేజస్వినావధీతమస్తు మా విద్విషావహై।

ఓం శాంతిశ్శాంతిశ్శాంతిః॥

**అనువాకం 1**

ఓం బ్రహ్మవిదాప్నోతి పరమ్। తదేషాఽభ్యుక్తా। సత్యం జ్ఞానమ్ అనంతం బ్రహ్మ। యో వేద నిహితం గుహాయాం పరమే వ్యోమన్। సోఽశ్నుతే సర్వాన్ కామాన్సహ। బ్రహ్మణా విపశ్చితేతి। తస్మాద్వా ఏతస్మాదాత్మన ఆకాశస్సంభూతః। ఆకాశాద్వాయుః। వాయోరగ్నిః। అగ్నేరాపః। అద్భ్యః పృథివీ। పృథివ్యా ఓషధయః। ఓషధీభ్యోఽన్నమ్। అన్నాత్పురుషః।

స వా ఏష పురుషోఽన్నరసమయః। తస్యేదమేవ శిరః। అయం దక్షిణః పక్షః। అయముత్తరః పక్షః। అయమాత్మా। ఇదం పుచ్ఛం ప్రతిష్ఠా। తదప్యేష శ్లోకో భవతి।

**అనువాకం 2**

అన్నాద్వై ప్రజాః ప్రజాయంతే। యాః కాశ్చ పృథివీగ్ంశ్రితాః। అథో అన్నేనైవ జీవంతి। అథైనదపియంత్యంతతః। అన్నగ్ం హి భూతానాం జ్యేష్ఠమ్। తస్మాత్సర్వౌషధముచ్యతే। సర్వం వై తేఽన్నమాప్నువంతి। యేఽన్నం బ్రహ్మోపాసతే। అన్నగ్ం హి భూతానాం జ్యేష్ఠమ్। తస్మాత్సర్వౌషధముచ్యతే। అన్నాద్భూతాని జాయంతే। జాతాన్యన్నేన వర్ధంతే। అద్యతేఽత్తి చ భూతాని। తస్మాదన్నం తదుచ్యత ఇతి।

తస్మాద్వా ఏతస్మాదన్నరసమయాత్। అన్యోఽంతర ఆత్మా ప్రాణమయః। తేనైష పూర్ణః। స వా ఏష పురుషవిధ ఏవ। తస్య పురుష విధతామ్। అన్వయం పురుషవిధః । తస్య ప్రాణ ఏవ శిరః। వ్యానో దక్షిణః పక్షః।అపాన ఉత్తరః పక్షః। ఆకాశ ఆత్మా। పృథివీ పుచ్ఛం ప్రతిష్ఠా। తదప్యేష శ్లోకో భవతి।

## అనువాకం 3

ప్రాణం దేవా అనుప్రాణన్తి। మనుష్యా పశవశ్చ యే। ప్రాణో హి భూతానామాయుః। తస్మాత్సర్వాయుషముచ్యతే। సర్వమేవ త ఆయుర్యంతి। యే ప్రాణం బ్రహ్మోపాసతే। ప్రాణో హి భూతానామాయుః। తస్మాత్సర్వాయుషముచ్యత ఇతి। తస్యైష ఏవ శారీర ఆత్మా। యః పూర్వస్య। తస్మాద్వా ఏతస్మాత్ప్రాణమయాత్। అన్యోఽన్తర ఆత్మా మనోమయః। తేనైష పూర్ణః । స వా ఏష పురుష విధ ఏవ। తస్య పురుష విధతామ్। అన్వయం పురుష విధః। తస్య యజురేవ శిరః। ఋగ్దక్షిణః పక్షః । సామోత్తరఃపక్షః। ఆదేశ ఆత్మా। అథర్వాంగిరసః పుచ్ఛం ప్రతిష్ఠా। తదప్యేష శ్లోకో భవతి।

## అనువాకం 4

యతో వాచో నివర్తంతే। అప్రాప్య మనసా సహ। ఆనందం బ్రహ్మణో విద్వాన్। న బిభేతి కదాచనేతి। తస్యైష ఏవ శారీర ఆత్మా। యః పూర్వస్య।
తస్మాద్వా ఏతస్మాన్మనోమయాత్। అన్యోఽన్తర ఆత్మా విజ్ఞానమయః । తేనైష పూర్ణః। స వా ఏష పురుషవిధ ఏవ। తస్య పురుషవిధతామ్। అన్వయం పురుషవిధః। తస్య శ్రద్ధైవ శిరః। ఋతం దక్షిణః పక్షః। సత్యముత్తరః పక్షః। యోగ ఆత్మా। మహః పుచ్ఛం ప్రతిష్ఠా। తదప్యేష శ్లోకో భవతి।

## అనువాకం 5

విజ్ఞానం యజ్ఞం తనుతే। కర్మాణి తనుతేఽపి చ। విజ్ఞానం దేవాస్సర్వే। బ్రహ్మ జ్యేష్ఠముపాసతే। విజ్ఞానం బ్రహ్మ చేద్వేద। తస్మాచ్చేన్న ప్రమాద్యతి। శరీరే పాప్మనో హిత్వా। సర్వాన్ కామాన్ సమశ్నుత ఇతి। తస్యైష ఏవ శారీర ఆత్మా। యః పూర్వస్య। తస్మాద్వా ఏతస్మాద్విజ్ఞానమయాత్। అన్యోఽన్తర ఆత్మాఽనన్దమయః। తేనైష పూర్ణః। స వా ఏష పురుషవిధ ఏవ। తస్య పురుషవిధతామ్। అన్వయం పురుషవిధః। తస్య ప్రియమేవ శిరః। మోదో దక్షిణః పక్షః। ప్రమోద ఉత్తరః పక్షః। ఆనంద ఆత్మా। బ్రహ్మ పుచ్ఛం ప్రతిష్ఠా। తదప్యేష శ్లోకో భవతి।

## అనువాకం 6

అసన్నేవ స భవతి। అసద్బ్రహ్మేతి వేద చేత్। అస్తి బ్రహ్మేతి చేద్వేద। సంతమేనం తతో విదురితి। తస్యైష ఏవ శారీర ఆత్మా। యః పూర్వస్య।

అథాతోఽనుప్రశ్నాః। ఉతావిద్వానముం లోకం ప్రేత్య। కశ్చన గచ్ఛతీ3। ఆహో విద్వానముం లోకం ప్రేత్య। కశ్చిత్సమశ్నుతా3 ఉ।

సోఽకామయత। బహుస్యాం ప్రజాయేయేతి। స తపోఽతప్యత। స తపస్తప్త్వా। ఇదగ్ం సర్వమసృజత। యదిదం కిఞ్చ। తత్ సృష్ట్వా। తదేవానుప్రావిశత్। తదనుప్రవిశ్య। సచ్చ త్యచ్చాభవత్। నిరుక్తం చానిరుక్తం చ। నిలయనం చానిలయనం చ। విజ్ఞానం చావిజ్ఞానం చ। సత్యం చానృతం చ సత్యమభవత్। యదిదం కించ। తత్సత్యమిత్యాచక్షతే। తదప్యేష శ్లోకో భవతి।

## అనువాకం 7

అసద్వా ఇదమగ్ర ఆసీత్। తతో వై సదజాయత। తదాత్మానగ్ం స్వయమకురుత। తస్మాత్తత్సుకృతముచ్యత ఇతి।

యద్వై తత్సుకృతమ్। రసో వై సః। రసగ్ం హ్యేవాయం లబ్ధ్వాఽఽనందీ భవతి। కోహ్యేవాన్యాత్ కః ప్రాణ్యాత్। యదేష ఆకాశ ఆనందో న స్యాత్। ఏష హ్యేవానందయాతి। యదా హ్యేవైష ఏతస్మిన్నదృశ్యేఽనాత్మ్యేఽనిరుక్తేఽనిలయనేఽభయం ప్రతిష్ఠాం విన్దతే। అథ సోఽభయం గతో భవతి। యదా హ్యేవైష ఏతస్మిన్నుదరమన్తరం కురుతే। అథ తస్య భయం భవతి। తత్త్వేవ భయం విదుషోఽమన్వానస్య। తదప్యేష శ్లోకో భవతి।

## అనువాకం 8

భీషాఽస్మాద్వాతః పవతే। భీషోదేతి సూర్యః। భీషాఽస్మాదగ్నిశ్చేంద్రశ్చ। మృత్యుర్ధావతి పంచమ ఇతి। సైషాఽఽనందస్య మీమాగ్ంసా భవతి। యువా స్యాత్సాధుయువాఽధ్యాయక। ఆశిష్ఠో దృఢిష్ఠో బలిష్ఠః। తస్యేయం పృథివీ సర్వా విత్తస్య పూర్ణా స్యాత్। స ఏకో మానుష ఆనందః।

తే యే శతం మానుషా ఆనందాః । స ఏకో మనుష్యగంధర్వాణామానందః । శ్రోత్రియస్య చాకామహతస్య।

తే యే శతం మనుష్యగంధర్వాణామానందాః । స ఏకో దేవగంధర్వాణామానందః శ్రోత్రియస్య చాకామహతస్య।

తే యే శతం దేవగంధర్వాణామానందాః। స ఏకః పితృణాం చిరలోక లోకానామానందః। శ్రోత్రియస్య చాకామహతస్య।

తే యే శతం పితృణామ్ చిరలోక లోకానామానందాః । స ఏక అజానజానాం దేవానామానందః। శ్రోత్రియస్య చాకామహతస్య।

తే యే శతమాజానజానాం దేవానామానందాః। స ఏకః కర్మదేవానాం దేవానామానందః। యే కర్మణా దేవానపియన్తి। శ్రోత్రియస్య చాకామహతస్య।

తే యే శతం కర్మదేవానాం దేవానామానందాః। స ఏకో దేవానామానందః। శ్రోత్రియస్య చాకామహతస్య।

తే యే శతం దేవానామానందాః। స ఏక ఇంద్రస్యానందః। శ్రోత్రియస్య చాకామహతస్య।

తే యే శతమింద్రస్యానందాః। స ఏకో బృహస్పతేరానందః। శ్రోత్రియస్య చాకామహతస్య।

తే యే శతం బృహస్పతేరానందాః। స ఏకః ప్రజాపతేరానందః। శ్రోత్రియస్య చాకామహతస్య।

తే యే శతం ప్రజాపతేరానందాః। స ఏకో బ్రహ్మణ ఆనందః। శ్రోత్రియస్య చాకామహతస్య।

స యశ్చాయం పురుషే । యశ్చాసావాదిత్యే। స ఏకః। స య ఏవంవిత్ । అస్మాల్లోకాత్ప్రేత్య। ఏతమన్నమయమాత్మానముపసంక్రామతి। ఏతం ప్రాణమయమాత్మానముపసంక్రామతి। ఏతం మనోమయమాత్మానముపసంక్రామతి। ఏతం విజ్ఞానమయమాత్మానముపసంక్రామతి। ఏతమానంద మయమాత్మానముపసంక్రామతి । తదప్యేష శ్లోకో భవతి।

## అనువాకం 9

య॒తో వా॒చో నివ॑ర్తం॒తే। అప్రా᳚ప్య॒ మన॑సా స॒హ। ఆనందం బ్రహ్మ॑ణో వి॒ద్వాన్। న బిభేతి
కుత॑శ్చనే॒తి। ఏతగ్ం హ వావ॑ న త॒పతి। కిమహగ్ం సాధు॑ నాక॒రవమ్। కిమహం పాపమక॑రవమి॒తి।
స య ఏవం విద్వానేతే ఆత్మా॑నగ్గ్ం స్పృ॒ణుతే। ఉ॒భే హ్యేవైష॒ ఏతే ఆత్మా॑నగ్గ్ం స్పృ॒ణుతే।
య ఏ॒వం వేద॑। ఇత్యు॑ప॒నిష॑త్॥

# తైత్తిరీయోపనిషత్ - భృగువల్లీ

## శాంతిపాఠం

ఓం సహ నావవతు। సహ నౌ భునక్తు। సహ వీర్యం కరవావహై।
తేజస్వినావధీతమస్తు మా విద్విషావహై।

ఓం శాంతిశ్శాంతిశ్శాంతిః॥

## అనువాకం 1

భృగుర్వై వారుణిః। వరుణం పితరముపససార। అధీహి భగవో బ్రహ్మేతి। తస్మా ఏతత్ ప్రోవాచ। అన్నం ప్రాణం చక్షుశ్శ్రోత్రం మనో వాచమితి। తగ్ం హోవాచ। యతో వా ఇమాని భూతాని జాయన్తే। యేన జాతాని జీవన్తి। యత్ప్రయన్త్యభిసంవిశన్తి। తద్విజిజ్ఞాసస్వ। తద్బ్రహ్మేతి। స తపోఽతప్యత। స తపస్తప్త్వా॥

## అనువాకం 2

అన్నం బ్రహ్మేతి వ్యజానాత్ । అన్నాద్ధ్యేవ ఖల్విమాని భూతాని జాయన్తే । అన్నేన జాతాని జీవన్తి। అన్నం ప్రయన్త్యభిసంవిశన్తీతి । తద్విజ్ఞాయ । పునరేవ వరుణం పితరముపససార। అధీహి భగవో బ్రహ్మేతి । తగ్ం హోవాచ । తపసా బ్రహ్మ విజిజ్ఞాసస్వ । తపో బ్రహ్మేతి। స తపోఽతప్యత । స తపస్తప్త్వా ॥

## అనువాకం 3

ప్రాణో బ్రహ్మేతి వ్యజానాత్। ప్రాణాద్ధ్యేవ ఖల్విమాని భూతాని జాయన్తే। ప్రాణేన జాతాని జీవన్తి। ప్రాణం ప్రయన్త్యభిసంవింశన్తీతి। తద్విజ్ఞాయ। పునరేవ వరుణం పితరముపససార। అధీహి భగవో బ్రహ్మేతి। తగ్ం హోవాచ। తపసా బ్రహ్మ విజిజ్ఞాసస్వ। తపో బ్రహ్మేతి। స తపోఽతప్యత। స తపస్తప్త్వా॥

## అనువాకం 4

మనో బ్రహ్మేతి వ్యజానాత్। మనసో హ్యేవ ఖల్విమాని భూతాని జాయన్తే। మనసా జాతాని జీవన్తి। మనః ప్రయన్త్యభిసంవిశన్తీతి। తద్విజ్ఞాయ। పునరేవ వరుణం పితరముపససార। అధీహి భగవో బ్రహ్మేతి। తగ్ంహోవాచ। తపసా బ్రహ్మ విజిజ్ఞాసస్వ। తపో బ్రహ్మేతి। స తపోఽతప్యత। స తపస్తప్త్వా॥

## అనువాకం 5

విజ్ఞానం బ్రహ్మేతి వ్యజానాత్। విజ్ఞానాద్ధ్యేవ ఖల్విమాని భూతాని జాయన్తే। విజ్ఞానేన జాతాని జీవన్తి । విజ్ఞానం ప్రయన్త్యభిసంవిశన్తీతి। తద్విజ్ఞాయ। పునరేవ వరుణం పితరముపససార। అధీహి భగవో బ్రహ్మేతి। తగ్ంహోవాచ। తపసా బ్రహ్మ విజిజ్ఞాసస్వ। తపో బ్రహ్మేతి। స తపోఽతప్యత। స తపస్తప్త్వా॥

## అనువాకం 6

ఆనందో బ్రహ్మేతి వ్యజానాత్। ఆనందాద్ధ్యేవ ఖల్విమాని భూతాని జాయన్తే। ఆనందేన జాతాని జీవన్తి। ఆనందం ప్రయన్త్యభిసంవిశన్తీతి। సైషా భార్గవీ వారుణీ విద్యా। పరమే వ్యోమన్ ప్రతిష్ఠితా। స య ఏవం వేద ప్రతితిష్ఠతి। అన్నవానన్నాదో భవతి। మహాన్ భవతి ప్రజయా పశుభిర్బ్రహ్మవర్చసేన। మహాన్ కీర్త్యా॥

## అనువాకం 7

అన్నం న నింద్యాత్। తద్వ్రతమ్। ప్రాణో వా అన్నమ్। శరీరమన్నాదమ్। ప్రాణే శరీరం ప్రతిష్ఠితమ్। శరీరే ప్రాణః ప్రతిష్ఠితః। తదేతదన్నమన్నే ప్రతిష్ఠితమ్। స య ఏతదన్నమన్నే ప్రతిష్ఠితం వేద ప్రతితిష్ఠతి। అన్నవానన్నాదో భవతి। మహాన్ భవతి ప్రజయా పశుభిర్బ్రహ్మవర్చసేన। మహాన్ కీర్త్యా॥

## అనువాకం 8

అన్నం న పరిచక్షీత। తద్వ్రతమ్। ఆపో వా అన్నమ్। జ్యోతిరన్నాదమ్। అప్సు జ్యోతిః ప్రతిష్ఠితమ్। జ్యోతిష్యాపః ప్రతిష్ఠితాః। తదేతదన్నమన్నే ప్రతిష్ఠితమ్। స య ఏతదన్నమన్నే ప్రతిష్ఠితం వేద ప్రతితిష్ఠతి। అన్నవానన్నాదో భవతి। మహాన్ భవతి ప్రజయా పశుభిర్బ్రహ్మవర్చసేన। మహాన్ కీర్త్యా॥

## అనువాకం 9

అన్నం బహుకుర్వీత। తద్వ్రతమ్।పృథివీ వా అన్నమ్। ఆకాశోఽన్నాదః। పృథివ్యామాకాశః ప్రతిష్ఠితః। ఆకాశే పృథివీ ప్రతిష్ఠితా। తదేతదన్నమన్నే ప్రతిష్ఠితమ్। స య ఏతదన్నమన్నే ప్రతిష్ఠితం వేద ప్రతితిష్ఠతి। అన్నవానన్నాదో భవతి। మహాన్ భవతి ప్రజయా పశుభిర్బ్రహ్మవర్చసేన మహాన్ కీర్త్యా॥

## అనువాకం 10

న కంచన వసతౌ ప్రత్యాచక్షీత। తద్వ్రతమ్। తస్మాద్యయా కయా చ విధయా బహ్వన్నమ్ ప్రాప్నుయాత్। ఆరాధ్యస్మా అన్నమిత్యాచక్షతే। ఏతద్వై ముఖతోఽన్నగ్ంం రాద్ధమ్। ముఖతోఽస్మా అన్నగ్ంం రాధ్యతే। ఏతద్వై మధ్యతోఽన్నగ్ంం రాద్ధమ్। మధ్యతోఽస్మా అన్నగ్ంం రాధ్యతే। ఏతద్వా అంతతోఽన్నగ్ంం రాద్ధమ్। అంతతోఽస్మా అన్నగ్ంం రాధ్యతే। య ఏవం వేద।

క్షేమ ఇతి వాచి। యోగక్షేమ ఇతి ప్రాణాపానయోః। కర్మేతి హస్తయోః। గతిరితి పాదయోః। విముక్తిరితి పాయౌ। ఇతి మానుషీః సమాజ్ఞాః।

అథ దైవీః। తృప్తిరితి వృష్టౌ। బలమితి విద్యుతి। యశ ఇతి పశుషు। జ్యోతిరితి నక్షత్రేషు। ప్రజాతిరమృతమానంద ఇత్యుపస్థే। సర్వమిత్యాకాశే।

తత్ ప్రతిష్ఠేత్యుపాసీత। ప్రతిష్ఠావాన్ భవతి। తన్మహ ఇత్యుపాసీత। మహాన్ భవతి। తన్మన ఇత్యుపాసీత। మానవాన్ భవతి। తన్నమ ఇత్యుపాసీత। నమ్యన్తేఽస్మై కామాః। తద్బ్రహ్మేత్యుపాసీత।

బ్రహ్మవాన్ భవతి। తద్ బ్రహ్మణః పరిమర ఇత్యుపాసీత। పర్యేణం మ్రియన్తే ద్విషన్తస్సపత్నాః। పరి యేఽప్రియా భ్రాతృవ్యాః।

స యశ్చాయం పురుషే। యశ్చాసావాదిత్యే। స ఏకః। స య ఏవంవిత్। అస్మాల్లోకాత్ ప్రేత్య। ఏతమన్నమయమాత్మానముపసంక్రమ్య। ఏతం ప్రాణమయమాత్మానముపసంక్రమ్య। ఏతం మనోమయమాత్మానముపసంక్రమ్య। ఏతం విజ్ఞానమయమాత్మానముపసంక్రమ్య। ఏతమానందమయమాత్మానముపసంక్రమ్య।

ఇమాంల్లోకాన్ కామాన్నీ కామరూప్యనుసంచరన్। ఏతత్సామ గాయన్నాస్తే। హా (3) వు। హా (3) వు। హా (3) వు। అహమన్నమహమన్నమహమన్నమ్। అహమన్నాదో(3) ఽహమన్నాదో(3) ఽహమన్నాదః। అహగ్గ్ం శ్లోకకృదహగ్గ్ం శ్లోకకృదహగ్గ్ం శ్లోకకృత్। అహమస్మి ప్రథమజా ఋతా (3) స్య। పూర్వం దేవేభ్యో అమృతస్య నా (3) భాయి। యో మా దదాతి స ఇదేవ మా (3) వాః। అహమన్నమన్నమదన్తమా (3) ద్మి। అహం విశ్వం భువనమభ్యభవామ్। సువర్న జ్యోతీః। య ఏవం వేద। ఇత్యుపనిషత్।

# తైత్తిరీయోపనిషత్ -ఉపోద్ఘాతం

మన ప్రాథమిక శాస్త్రాలను వేదాలు అంటారు. వేదం అంటే జ్ఞానాన్ని సమకూర్చే గ్రంథం. నాలుగు పురుషార్థాల గురించి చెప్పి, వాటిని పొందే మార్గాలని వివరిస్తాయి వేదాలు. ఈ వేదాలు నాలుగు. అవి ఋగ్వేదం, యజుర్వేదం, సామవేదం, అథర్వణ వేదం.

ఈ వేదాలలో ఉన్న విషయాలను బట్టి వాటిని రెండు భాగాలుగా విభజించవచ్చు. అవి వేద పూర్వభాగం, వేద అంతభాగం.

వేద పూర్వభాగంలో అంతులేని వైదికకర్మలు ఉన్నాయి. అందువల్ల దీన్ని కర్మకాండ అనికూడా అంటారు.

1. **సాధనత్రయమ్** – వేద పూర్వభాగంలో నిర్దేశించిన కర్మలను చేయటానికి వాడిన పరికరాన్నిబట్టి వాటిని మూడు భాగాలుగా విభజించవచ్చు.

ఎ) **కాయిక కర్మలు** – ఇవి భౌతికశరీరంతో చేసే పనులు. అన్నిరకాల పూజలు, ప్రదక్షిణలు, తీర్థయాత్రలు వస్తాయి దీనిలో.

బి) **వాచిక కర్మలు** – వాక్కు ప్రధానపాత్ర వహిస్తుంది. శారీరకంగా చూస్తే ఒకచోట కూర్చుని ఉంటారు. మనస్సు ఏదీ ఆలోచించకుండా స్థిరంగా ఉంటుంది. కేవలం వాక్కు పనిచేస్తుంటుంది. విష్ణుసహస్రనామం లేదా లలితా సహస్రనామపారాయణాలు, జపం వాచిక కర్మలు.

సి) **మానస కర్మలు** – శరీరం పనిచేయదు. వాక్కుకు ఏమీ పాత్ర లేదు. మనస్సు మాత్రమే పనిచేస్తుంది. మానస కర్మలలో మానసపూజ, మానసపారాయణం, మానసజపం చేయవచ్చు. మానసపూజ అంటే షోడశ ఉపచారాలను మనస్సులో చేయవచ్చు. దానికి చాలా ఏకాగ్రత కావాలి. ఫలం కూడా అధికంగానే ఉంటుంది. వాచిక కర్మలలో విష్ణు సహస్రనామాన్ని పైకి చదివితే, మానస పారాయణంలో మనస్సులో చదువుతారు. అలాగే జపం కూడా మనస్సులో చేసుకుంటే దాన్ని మానసజపం అంటారు.

ఈ మూడురకాల మానస కర్మలను ఉపాసన లేదా ధ్యానం అంటారు. ఈ మూడురకాల కర్మలు అనేక ఫలాలు పొందటానికి సూచించబడ్డాయి. అంటే ఇవి లక్ష్యాలు పొందే మార్గాలు–

**కర్మఫల ప్రాప్త్యర్థం కర్మాణి విహితాని**

ఈ విధంగా మూడు సాధనలు – కాయిక, వాచిక, మానసిక కర్మలు.

ఈ మూడురకాల కర్మలను సాధనత్రయం అంటారు.

2. **సాధ్యత్రయమ్** – ఈ మూడురకాల సాధనలు అనేక రకాల లక్ష్యాలను పొందేలా చేయగలవు. లక్ష్యాన్ని సాధ్యం అంటారు. మానవాళి కోరుకునే సాధ్యాలు అనేకానేకం ఉన్నాయి. శాస్త్రం వాటిని మూడు సాధ్యాలుగా క్రోడీకరించింది. అందువల్ల సాధనత్రయం అనే మార్గాలు సాధ్యత్రయం అనే లక్ష్యాలను చేరుకునేందుకు దోహదం చేస్తాయి. అవి,

ఎ) **ఉపాధిప్రాప్తి** – ఉపాధి అంటే ఇప్పుడున్న స్థూల, సూక్ష్మశరీరాలు. అంటే శరీరం, ఇంద్రియాలు, మనస్సు, బుద్ధి మరింత మెరుగ్గా అవటం కోసం చేసే సాధన. నిజానికి ఒక బ్రహ్మచారి సమిధాదానం చేస్తాడు, తన మేధాశక్తిని పెంపొందించు కోవటంకోసం.

**మయి మేధాం మయి ప్రజాం**
**మయ్యగ్నిస్తేజో దధాతు**
**మయి మేధాం మయి ప్రజాం**
**మయీంద్ర ఇంద్రియం దధాతు**
**మయి మేధాం మయి ప్రజాం**
**మయి సూర్యో భ్రాజో దధాతు॥** – మేధా సూక్తమ్

నా ఇంద్రియాలు చురుకుగా ఉండుగాక అని ప్రార్థన చేస్తాడు. అలా కొన్ని కర్మలు శారీరక దారుఢ్యం, ఇంద్రియ చురుకుతనం, మానసిక ఆరోగ్యం, బుద్ధిబలంకోసం నిర్దేశించబడ్డాయి. ఒక బ్రహ్మచారి సమిధాదానం చేసి శ్రద్ధాసూక్తం పఠిస్తాడు.

అతను కోరేవి ప్రజ్ఞ, మేధ, శ్రీ, బలం. ఇలా శారీరక, మానసిక ఆరోగ్యం కోరేది జీవన విధానం సుఖంగా, ఆనందంగా కొనసాగటంకోసం. ఏదైనా భాగం దెబ్బతింటే, దాన్ని మెరుగుపరచమని కోరుతాడు.

ఒక కారు విషయమే తీసుకోండి. అందులో ఒక్కొక్క భాగం పాడవుతూ వస్తుంది. మెకానిక్ దగ్గరికి తీసుకువెళుతూ ఉంటాము. చివరికి ఏ దశకి చేరుకుంటుందంటే, అందులోని ఏ భాగమూ కూడా ముందు వేసిన భాగం కాదు. మీకు విసుగు పుట్టదేమో కానీ, మెకానిక్‌కు దాన్ని రిపేరు చేసీ, చేసీ విసుగు పుడుతుంది. 'దీన్ని అమ్మేసి వేరే కారు కొనుక్కోరాదా?' అని అడుగుతాడు. అంతేకాదు, అలా అమ్మటానికి ఎక్స్‌ఛేంజ్ ఆఫర్లు కూడా ఉంటాయి.

ఇదే సూత్రం మన శరీరమనే వాహనానికి కూడా వర్తిస్తుంది. శరీరభాగాలు మార్చీ మార్చీ, వాటికి ఆపరేషన్లు చేసీ చేసీ అవి మార్చటానికి వీలులేని దశకు చేరుకుంటే, వేరే మంచి ఉపాధికోసం ప్రయత్నించటానికి కూడా కర్మలు ఉన్నాయి అంటుంది శాస్త్రం. ఈ జన్మలో అనుభవించగలిగినన్నాళ్ళు మంచి ఆరోగ్యం, చక్కటి మేధాశక్తి, మానసికబలం అనుభవించారు సరే. వచ్చే జన్మలో ఇంతకన్నా మెరుగైన ఆరోగ్యం, ఇంతకన్నా గొప్ప

మేధాశక్తి, ఇంతకన్నా మానసిక బలం కావాలంటే వేరే కర్మలు ఉన్నాయి, అవి చేయండి అంటుంది శాస్త్రం.

అందువల్ల ఉపాధిప్రాప్తికి రెండు అర్థాలు ఉన్నాయి. ఇప్పుడున్న ఉపాధిని మెరుగుపరచుకోవటం ఒకటి, లేదా వచ్చే జన్మలో మరింత మెరుగైన ఉపాధిని కోరుకోవటం ఇంకొకటి. ఈ ఫలం వ్యక్తిగతమైన ఫలం.

బి) **విషయప్రాప్తి** – మనం అనుభవించే విషయవస్తువులు ఇంకా మెరుగ్గా ఉండాలని కోరుతూ చేసే కర్మలు. విషయవస్తువులలోకి మన కుటుంబసభ్యులు, స్నేహితులు, చుట్టూ ఉన్నవారు కూడా వస్తారు. పిల్లలు వృద్ధిలోకి రావాలని కోరుకుంటాము మనము. చెప్పిన మాటవినే పిల్లలు, మనస్సుకు నచ్చినట్టుగా ఉండే భార్య, కష్టసుఖాలలో పాలుపంచుకునే స్నేహితుడు ఉండాలంటే ఎంతో పుణ్యం చేసుకుని ఉండాలి. అటువంటి పుణ్యం పొందటంకోసం కొన్ని కర్మలు ఉంటాయి. ఈ కర్మలవల్ల వచ్చే ఫలం బాహ్యమైన ఫలం.

సి) **లోకప్రాప్తి** – మన ఆరోగ్యం బ్రహ్మాండంగా ఉండి, మన కనుసన్నల్లో మెలిగే కుటుంబం ఉన్నంత మాత్రాన సరిపోదు; వారితో మనం వ్యవహారం నడిపే లోకం కూడా ప్రశాంతంగా, అనుకూలంగా, ఆహ్లాదకరంగా ఉండాలి. మనకు మంచి ఆరోగ్యం ఉండి, పెద్ద ఇల్లు ఉండి ఏం లాభం, చుట్టూ వాతావరణం బాగాలేకపోతే? అందుకని చుట్టూ పరిసరాలను లోకం అంటారు. ఈ మూడూ బాగుంటేనే, మనం బాగుండగలం!

లోకప్రాప్తి కూడా మళ్ళీ రెండు రకాలు – ఒకటి మనం ఉన్న ఈ భూలోకం మెరుగ్గా ఉండేలా కోరుకోవటం లేదా భూలోకంనుంచి భువర్లోకానికో లేదా సువర్లోకానికో వెళ్ళాలని కోరుకోవటం.

ఈ విధంగా మూడు సాధ్యాలు – ఉపాధిప్రాప్తి, విషయప్రాప్తి, లోకప్రాప్తి. ఈ మూడురకాల సాధ్యాలను సాధ్యత్రయం అంటారు.

3. **దోషత్రయమ్** – కర్మకాండ సాధనత్రయాన్ని, సాధ్యత్రయాన్ని వివరిస్తుంది. అంటే మూడురకాల మార్గాలను, మూడురకాల లక్ష్యాలను వివరిస్తుంది. మానవజాతి అంతా పాటుపడుతున్నది ఉపాధి, విషయం, లోకం అనే మూడు అంశాలకోసం. కర్మకాండలో ఈ మూడింటికోసం అనేక యజ్ఞాలు సూచించబడ్డాయి. ఈ లోకంలోనే కాదు, తక్కిన లోకాలకు వెళ్ళటానికి కూడా ఉన్నాయి. కాని మనం కష్టపడి ఈ మూడురకాల మార్గాలను పాటించి, మూడురకాల లక్ష్యాలను పొందినా కూడా, వాటిలో మూడు దోషాలు నిబిడీకృతమై ఉంటాయి.

**పరీక్ష్య లోకాన్ కర్మచితాన్ బ్రాహ్మణో**
**నిర్వేదమాయాత్ నాస్త్యకృతః కృతేన**

తెలివైన వ్యక్తి వైదికకర్మలద్వారా ఈ ప్రాపంచిక ఫలాలను పొందినా కూడా, ఆశ్చర్యకరంగా ఒక నిజం గ్రహించి, నిర్వేదం చెందుతాడు.

సత్త్వగుణం ప్రధానంగా ఉండి, స్థితప్రజ్ఞగల బ్రాహ్మణుడు తన అనుభవాలనుంచి సంఘాన్నో, పరిస్థితులనో తిట్టకుండా, మంచి నేర్చుకుంటాడు. ఏమిటా మంచి? ఈ లక్ష్యాలు అద్భుతమే కావచ్చు, వాటివల్ల ఆనందం, భద్రత వస్తే రావచ్చు గాక, కాని వాటన్నిటిలోనూ అంతర్లీనంగా ప్రాథమికదోషం ఉందని గ్రహిస్తాడు. ఆ సాధ్యాలు దోషాలతో కూడిన సాధ్యాలు. ఈ సాధ్యాలు ఇచ్చే ఆనందం, భద్రత తాత్కాలికమే కాని శాశ్వతం కాదు. ఒక కోణంలోంచి బాగుంటాయి కాని ఇంకో కోణంలోంచి చూస్తే అవి మంచివి కావు. తాత్కాలిక ఆనందాన్నిచ్చే వాటిని ప్రేయస్సు అని, శాశ్వతమైన ఆనందాన్నిచ్చేదాన్ని శ్రేయస్సు అని అంటారు. ప్రేయస్సు అంటే మనకు ప్రియమైనవి, శ్రేయస్సు అంటే మనకు శ్రేయస్కరమైనవి.

ఈ ప్రేయోమార్గం మనకు ప్రియమైనదే కాని, అది శ్రేయస్కరమైనది కాదు. ఎందుకంటే అది లోపభూయిష్టమైనది. అందులో కూడా మూడు దోషాలున్నాయి. ఎలాగైతే సాధనలు మూడు, సాధ్యాలు మూడు ఉన్నాయో అలాగే దోషాలు కూడా మూడు ఉన్నాయి. ఏమిటా మూడు దోషాలు?

ఎ) **దుఃఖమిశ్రితత్వమ్** – ప్రాపంచిక విషయాలు ఆనందం కలుగజేస్తాయి, నిజమే కాని అవి దుఃఖంతో కలగలిపి ఉంటాయి. ఏ విషయం కూడా కల్తీలేని ఆనందాన్ని ఇవ్వలేవు. వస్తువు పొందటానికి కష్టపడాలి, నిలబెట్టుకోవటానికి ఇంకా కష్టపడాలి. అందువల్ల వస్తువు పొందటం దుఃఖం, దాన్ని నిలబెట్టుకోవటం దుఃఖతరం, పోగొట్టుకుంటే దుఃఖతమం. దీన్ని దుఃఖమిశ్రితత్వం అంటారు. మిశ్రితత్వం అంటే దుఃఖంతో కూడినది అని అర్థం.

బి) **అతృప్తికరత్వమ్** – ఎంత పొందినా తృప్తి ఉండదు. మనకన్నా తక్కువ ఉన్నవారిని చూసి తృప్తి చెందే బదులు, మనకన్నా ఎక్కువ ఉన్నవారితో పోల్చుకుని బాధపడతాము. తాటిని తన్నేవాడు ఒకడుంటే, వాడి తలదన్నేవాడు ఇంకొకడు అని సామెత. అలా మనం ఎంత సంపాదించినా, ఎంత ఉన్నతి పొందినా, మనకన్నా పైస్థాయిలో ఎవరో ఒకరు ఉంటూనే ఉంటారు. అందువల్ల ఎంత ఉన్నా తనివి తీరదు. అతృప్తి రాజ్యమేలుతూనే ఉంటుంది.

సి) **బంధకత్వమ్** – కర్మఫలం పొందిన కొద్దీ, దానికి బంధీలమవుతూ వస్తాము. ఏ వస్తువైనా సరే మన దగ్గరికి పనివాడిగా వచ్చి, మనకే యజమాని అయి కూర్చుంటుంది. మనం యజమానిగా మొదలై, చివరికి దానికి బానిస అయిపోతాము. మనను బానిసలుగా చేసేది మందో, సిగరెట్టో కానవసరం లేదు, ఒక మామూలు రోజూ త్రాగే కాఫీ కూడా కావచ్చు. కాఫీగత ప్రాణులు ఉంటారు. వారు పొద్దున్న లేవగానే కాఫీ త్రాగకపోతే వారి ప్రాణం

గిల్లార్చుకు పోతుంది. దీన్ని బంధకత్వం అంటారు. అలా మనం పరాధీనతనుంచి స్వతంత్రంవైపు పయనించే బదులు, పరాధీనతనుంచి మరింత పరాధీనతవైపు సాగుతున్నాము. కాని ఇది చాలామంది గ్రహించరు. ఏ కొద్దిమందో కళ్ళు తెరుస్తారు.

ఈ విధంగా మూడు దోషాలు ఉన్నాయి. అవి దుఃఖమిశ్రితత్వం, అతృప్తికరత్వం, బంధకత్వం. ఈ మూడురకాల దోషాలను దోషత్రయం అంటారు.

చాలామందికి ఈ దోషత్రయం గురించి తెలియదు; కొంతమందికి తెలిసినా, వాటిని పట్టించుకోరు. వాటినుంచి బయటకు రావాలని చూడరు. గుడిసెల్లో ఉండేవారు వాటిలోనే ఆనందం పొందుతారు. ప్రభుత్వం వారి జీవితాన్ని మెరుగుపరచటానికి మంచి ఇళ్ళు కట్టించి ఇచ్చినా, వారు ఆ ఇళ్ళను అద్దెలకిచ్చి, హాయిగా వారి పూరిగుడిసెల్లోనే కాలక్షేపం చేసేస్తారు. అలాగే ఈ సంసారంలో కూరుకుపోయినవారు కూడా అది దుఃఖభూయిష్టమైనదని గ్రహించినా కూడా అందులోనే కాలం గడిపేస్తారు కాని, దాన్నించి బయటపడే మార్గం చూడరు. జీవించినంతకాలం భరించాలి తప్పదు అనుకుంటారు.

కాని కొందరు తెలివైనవారు మాత్రం ఇలాంటి లోపాలు లేని జీవితగమ్యం ఏదైనా ఉందా అని తెలుసుకోవటానికి ప్రయత్నిస్తారు. నిర్దోషలక్ష్యంకోసం వెతుకుతారు. వేదమే ఇస్తుంది దానికి జవాబు. నిర్దోషలక్ష్యం ఉంది కాని, అది కర్మకాండలో దొరకదు అంటుంది. కర్మకాండ పురుషార్థాలన్నీ సదోష పురుషార్థాలు (ధర్మ, అర్థ, కామ). నిర్దోష పురుషార్థం అందులో లేదు అంటుంది.

అయితే ఏం చేయాలి? వేదంలో ఇంకో భాగం ఉంది. వేద పూర్వభాగంలో దొరకదు కాబట్టి వేద అంతభాగానికి వెళ్ళాలి. వేదాంతంలో ఈ దోషత్రయం లేదు. అక్కడ స్వచ్ఛమైన ఆనందం ఉంటుంది. అసంతృప్తికి చోటులేదు. బానిసత్వం లేదు. వేద అంతభాగాన్ని జ్ఞానకాండ అంటారు. తీవ్రముముక్షుత్వం ఉన్నవ్యక్తి వేద పూర్వభాగంనుంచి వేద అంతభాగానికి వస్తాడు. అంటే కర్మకాండనుంచి జ్ఞానకాండకు వస్తాడు.

**తద్విజ్ఞానార్థం స గురుమేవాభి గచ్ఛేత్**

దోషరహితమైన లక్ష్యం ఏమిటి?

**బ్రహ్మవిదాప్నోతి పరమ్**

ఈ వాక్యాన్ని ఈ తైత్తిరీయోపనిషత్తులోనే వివరంగా నేర్చుకోబోతున్నాము. ఈ నిర్దోష పురుషార్థం మోక్షం అంటుంది వేదాంతం. దాన్ని బ్రహ్మ అని కూడా అంటారు. బ్రహ్మ=మోక్షం=పరమ పురుషార్థం (అత్యుత్తమ లక్ష్యం).

ఆ బ్రహ్మ ఎక్కడ దొరుకుతుంది, నాకు ఫోను నెంబరు ఇవ్వండి అని అడుగుతారు. వేదాంతం ఒక పిడుగులాంటి మాట వేస్తుంది. అది నీకు ఎక్కడా దొరకదు అంటుంది. ఒక పక్కన నిర్దోష పురుషార్థం ఉందని ఆశ పెడుతూ, అది బ్రహ్మ అని, అది నీకు ఎక్కడా దొరకదు అంటే ఏమిటి అర్థం? మీకు చాలా కోపం వస్తుంది. 'అసలలాంటి బ్రహ్మ ఉందా?' అని అడుగుతారు.

అప్పుడు ఉపనిషత్తు జవాబు చెబుతుంది – ఆ బ్రహ్మను నువ్వు ఎన్నడూ పొందలేవు అంటే బ్రహ్మ లేదని కాదు దాని అర్థం, ఆ బ్రహ్మవు నువ్వే అని అర్థం. **తత్ త్వమ్ అసి.**

ఆ బ్రహ్మ నీ అసలు స్వరూపం. ఆ బ్రహ్మ నువ్వే. నువ్వు వెతికే వస్తువులన్నీ లోపభూయిష్ఠం. ఆ వెతికే నువ్వు లోపాలకు అతీతమైన బ్రహ్మవు. లోపాలకు అతీతమైన సాధ్యం నీనుంచి దూరంగా లేదు.

**సాధకరూపేణ సాధ్యం వర్తతే**

దేన్నైతే వెతుకుతున్నావో అది నువ్వే. అందువల్లనే నువ్వు బ్రహ్మను పొందలేవు.

***గమనిక –*** 'బ్రహ్మ' అని దీర్ఘం ఇచ్చి రాస్తే చతుర్ముఖబ్రహ్మ అని అర్థం. బ్రహ్మ అంటే నిర్గుణ చైతన్యం. సచ్చిదానందబ్రహ్మ.

ఉపనిషత్తు నువ్వే దోషరహితమైన బ్రహ్మవు అంటే మనకు ఆశ్చర్యం వేస్తుంది. అంత తేలికగా నమ్మలేము. వేదాలమీద, గురువుమీద శ్రద్ధ ఉంది నిజమే, కాని నేను దోషరహితమైన బ్రహ్మను అనే విషయాన్ని జీర్ణించుకోవటం చాలా కష్టం. ఎందుకంటే ఇన్నాళ్ళూ నేను పరిమితి ఉన్న జీవిని, లోపభూయిష్ఠమైన జీవిని అనుకుంటూ వస్తున్నాను.

ఎందుకు? శారీరకంగా అనేక బాధలు పడుతూ ఉంటాను; ఇంద్రియాల శక్తి తగ్గుతూ వస్తుంది; రాగద్వేషాలు పట్టి మనస్సును కుదిపివేస్తాయి; బుద్ధి చురుకుతనం సన్నగిల్లుతుంది. ఏ విధంగానూ శాంతి లేదు. ఏ అనుభవం చూసినా బాధాకరమైనదే. పొద్దున్న లేచినప్పటినుంచి ఎవరో ఒకరు ఏదో ఒకటి అంటూనే ఉంటారు. అందువల్ల నేనెవరు? దోషరహిత బ్రహ్మనా? దోషభూయిష్ఠమైన మానవమాత్రుడినా?

నా అనుభవం నేను బ్రహ్మను అంటే ఒప్పుకోవటానికి ఇష్టపడటం లేదు. శాస్త్రం చెప్పినదానికీ, నా అనుభవానికీ మధ్య చాలా పెద్ద అంతరం ఉంది. అది కొంచెమే అయితే ఎలాగోలా స్వీకరించవచ్చు. ఉదాహరణకు నా జేబులో రూ.50 మాత్రమే ఉన్నాయి అనుకోండి. నేను దానితో ఒక వస్తువును కొందామనుకుని బజారుకు వెళ్ళాను. ఆ దుకాణదారుడు అది ఏ 60 రూపాయలో అంటే ఎలాగో అలాగ బేరమాడి 50 రూపాయలకే కొనవచ్చు. కాని అతను ఏకంగా ఆ వస్తువు ఖరీదు 750 రూపాయలు అంటే, బేరమాడటానికి ప్రయత్నించి

కూడా లాభంలేదు. మౌనంగా వెనక్కి తిరిగి వచ్చేస్తాను. ఎందుకు? నేను ఆశించినదానికీ, నిజానికీ మధ్య అంత పెద్ద అంతరం ఉంది కాబట్టి.

అదే విధంగా నాకు తెలిసిన నేను ఎక్కడ? ఉపనిషత్తు చూపించే నేను ఎక్కడ? హస్తిమశకాంతరమంత భేదం ఉంది. అందువల్ల నా శ్రద్ధ అంతంత మాత్రమే ఉంటే వెంటనే వదిలేయాలనుకుంటాను. నా ఆలోచనలను కాదు, ఉపనిషత్తును, అది బోధించే గురువును కూడా.

కాని నేను వైదిక సాంప్రదాయంలో పుట్టాను. ఇంతవరకూ వేదపూర్వభాగాన్ని నమ్ముతూ వచ్చాను. దానిమీద శ్రద్ధకొద్దీ అందులో చెప్పిన అనేక కర్మలు చేస్తూ వచ్చాను. అలాంటప్పుడు వేద అంతభాగంలో చెప్పిన అంశాన్ని పూర్తిగా ఎలా కొట్టివేయగలను? నా అనుభవానికీ, శాస్త్రం చెప్పిన బోధకూ చాలా పెద్ద అంతరమే ఉండవచ్చు గాక, కాని శాస్త్రంమీద నమ్మకం పోగొట్టుకోకూడదని గ్రహిస్తాను.

ఒక బ్రహ్మచారికి ఉపనయనం చేసినప్పుడు, అతను మూడు రోజులు కొన్ని నియమాలు పాటించాలి. నాలగవ రోజున అతను శ్రద్ధాసూక్తాన్ని పఠించాలి. శ్రద్ధను ఒక దేవతగా ఆరాధించాలి.

**శ్రద్ధయాగ్నిః సమిధ్యతే శ్రద్ధయా హూయతే హవిః**
**శ్రద్ధాం భగస్య మూర్ధని వచసా వేదయామసి** – శ్రద్ధాసూక్తమ్

అలా శ్రద్ధాసూక్తం పఠిస్తూ శ్రద్ధగా వేదాలను 10–12 సంవత్సరాలు అధ్యయనం చేయటంవల్ల తనకు తెలియకుండా వేదాలమీద శ్రద్ధ పెంచుకుంటాడు. అందువల్ల వేదం 'నువ్వు బ్రహ్మవు,' అని చెబితే, దాన్ని అసంబద్ధంగా భావించి కొట్టివేయకూడదని గ్రహిస్తాడు. 'కళ్ళారా చూసింది అక్షరాలా నిజం,' అంటారు. అలా కంటితో ప్రత్యక్షంగా చూసిన దానిమీద ఎంత నమ్మకం పెట్టుకుంటామో, అంత నమ్మకం వేదంమీద కూడా పెట్టుకోవాలి.

కన్ను ఒక ప్రత్యక్ష ప్రమాణం. కన్ను చూసిన సత్యానికి తిరుగులేదు. దాన్ని గట్టిగా నమ్ముతాము. కన్ను ప్రత్యక్ష ప్రమాణం అయితే వేదం శాస్త్రప్రమాణం. దాన్ని ఆరవ ప్రమాణం అంటారు. శాస్త్రం చెప్పింది కూడా తిరుగులేని సత్యం. అందువల్ల నా అనుభవం నేర్పింది శాస్త్రం బోధించేదానికి భిన్నంగా ఉంటే, శాస్త్రాన్ని శంకించకూడదు. నా అనుభవాన్ని ప్రశ్నించుకోవాలి. ఈ అనుభవాన్ని ఆధారంగా చేసుకుని నేను చేసుకున్న నిర్ణయాలు సబబేనా? లేక అవి నా ఊహాగానాలా? ఇన్నాళ్ళూ నేనొక పరిమితి ఉన్న జీవిని అనుకుంటూ వచ్చాను. దాన్ని ప్రశ్నించుకునే అవకాశం రాలేదు.

ఇప్పుడు శాస్త్రం చెప్పినదాన్ని విని లోతుగా విశ్లేషిస్తే, నా నిర్ణయాలను తిరగతోడాల్సిన సందర్భం వచ్చిందని అర్థమవుతుంది. నా అనుభవం సత్యమా, శాస్త్రం సత్యమా? ఇది ఆత్మవిశ్లేషణకు దారితీస్తుంది.

విజ్ఞానశాస్త్రంలో కూడా ఇలాంటి సందర్భం వస్తుంది. కొన్ని శతాబ్దాలుగా భూమిచుట్టూ సూర్యుడు తిరుగుతున్నాడని నమ్ముతూ వచ్చింది మానవజాతి. ఎందుకు? కంటికి సూర్యుని పయనం కనిపిస్తోంది కాబట్టి. అది ప్రత్యక్ష ప్రమాణం కాబట్టి. కాని ఒక శుభముహూర్తాన, ఒక శాస్త్రజ్ఞుడు వచ్చి మన నిర్ణయాలను ఖండించివేశాడు. భూమిచుట్టూ సూర్యుడు తిరగటం లేదు, భూమే సూర్యుని చుట్టూ తిరుగుతోంది అన్నాడు అతను. కాని మొదట్లో ఎవరూ అతనిని స్వీకరించలేదు. అతన్ని నానాబాధలూ పెట్టారు. ఎందుకు? అతను కనుగొన్న సత్యం ఇంకొక సత్యానికి భిన్నంగా ఉండటంవల్ల కాదు, అతను కనుగొన్న సత్యం వారిలో లోతుగా పాతుకుపోయిన వారి తప్పుడు భావనకు భిన్నంగా ఉండటంవల్ల. **పదుగురాడు మాట పాడియై ధరణి జెల్లు** అన్నారు పెద్దలు. అందువల్ల మానవాళి నమ్మిన సత్యానికి అసలు సత్యం భిన్నంగా ఉండటం వారు మొదట్లో జీర్ణించుకోలేకపోయారు. చివరికి నమ్మక తప్పలేదు.

అలాగే మనలో తరతరాలుగా జీర్ణించుకుపోయిన నమ్మకం – నేను పరిమితి ఉన్న జీవిని; అశాశ్వతమైన మానవమాత్రుడిని. కాని శాస్త్రం నేను పరిమితి లేని బ్రహ్మను, శాశ్వతమైన చైతన్యాన్ని అంటుంది. ఏది నిజమో తెలియాలంటే ఆత్మవిచారణ చేయాలి.

ఆత్మవిచారణ చేయటానికి ఒప్పుకున్నా కూడా సమస్య తీరలేదు. ఇప్పుడేమిటి సమస్య? ఆత్మవిచారణ చేయటానికి నాకొక పరికరం కావాలి. ఆకాశంలో సుదూరంగా ఉన్న నక్షత్రాలను చూడాలంటే నాకొక టెలిస్కోప్ ఉంది; కంటికి కనబడని సూక్ష్మక్రిములను చూడాలంటే నాకొక మైక్రోస్కోప్ ఉంది. అలా ఆత్మను చూడాలంటే ఆత్మనోస్కోప్ అంటూ ఏదైనా ఉందా? ఏదైనా జ్ఞానం పొందటానికి వాడే పరికరాన్ని ప్రమాణం అంటారు.

ఇంతవరకూ మనం పొందుతూ వస్తున్న జ్ఞానం బాహ్యప్రపంచం గురించిన జ్ఞానం. దాన్ని ఆబ్జెక్టు అంటారు. ఇప్పుడు మనం పొందాలనుకుంటున్న జ్ఞానం మన గురించి. మనను సబ్జెక్టు అంటారు. విచారణ చేసే వ్యక్తి గురించి విచారణ చేయాలి. దానికి ఏ ప్రమాణం ఉంది? కంటితో టెలిస్కోప్‌లో చూసి నక్షత్రాల గురించి, కంటితో మైక్రోస్కోప్‌లో చూసి సూక్ష్మక్రిముల గురించి తెలుసుకుంటున్నాము. కాని ఆ కంటిని చూసేందుకు ఏ టెలిస్కోప్ ఉంది? ఏ మైక్రోస్కోప్ ఉంది? మొట్టమొదటిసారిగా మనకున్న ప్రమాణాలు బాహ్యంగా ఉన్న ఆబ్జెక్టుల గురించి నేర్చుకోవటానికి పనికివచ్చే ప్రమాణాలే కాని, సబ్జెక్టు అయిన మన గురించి నేర్చుకోవటానికి పనికిరావు అని అర్థమవుతుంది. మనకు ఐదు

ప్రమాణాలు ఉన్నాయి. అవి ప్రత్యక్షప్రమాణం, అనుమానప్రమాణం, అర్థాపత్తి, అనుపలబ్ధి, ఉపమాన ప్రమాణం. మొదటిది ప్రత్యక్షంగా చూపిస్తే, తక్కిన నాలుగూ ప్రత్యక్షప్రమాణాన్ని ఆధారం చేసుకుని, తర్కం జోడించి సత్యాన్ని బోధిస్తాయి. కాని ముందే చూసినట్టుగా ఈ ఐదు ప్రమాణాలు కూడా బాహ్యవస్తువును చూపిస్తాయి కాని ఆత్మవిచారణకు పనికిరావు. వీటిని పౌరుషేయ ప్రమాణాలు అంటారు.

అంతటినీ చూసే కన్ను తనను తాను చూసుకోలేకపోతే ఏం చేస్తాను? అద్దాన్ని వాడతాను. అద్దం ఎదురుగుండా పెడితే, నా విశాలనేత్రాలనే కాదు, నా అందమైన ముఖారవిందాన్ని కూడా తనివితీరా చూడవచ్చు. కాని ఇక్కడ కూడా పరిమితి ఉంది. ఈ బాహ్యంగా ఉన్న అద్దం బాహ్యంగా ఉన్న నా శరీరం యొక్క సొగసులను చూపగలదే కాని నా ఆత్మస్వరూపాన్ని చూపలేదు. మరి ఆత్మజ్ఞానాన్ని పొందటమెలా? శాస్త్రం దానికి శబ్దప్రమాణం ఉంది అంటుంది. వేద అంతభాగాన్ని జ్ఞానకాండ అనీ, ఉపనిషత్తు అని అంటారు. వేదాలను శ్రుతులని కూడా అంటారు. ఋషులు సాక్షాత్తూ ఆ పరమాత్మనుంచి ఆ వేదాలను విని తరతరాలకు అందించారు కాబట్టి వాటిని శ్రుతులని అంటారు. అందువల్ల శ్రుతిని శబ్దప్రమాణం అంటారు. ఆత్మజ్ఞానం పొందటానికి ఈ శబ్దప్రమాణం ఒక్కటే తోడ్పడుతుంది. మామూలు దర్పణం మన మొహాన్ని చూపిస్తే, శాస్త్రదర్పణం మన స్వరూపాన్ని వెల్లడి చేస్తుంది.

ఎవరైనా నీ కళ్ళు ఎర్రగా ఉన్నాయేమిటి అనో, పచ్చగా ఉన్నాయేమిటి అనో అంటే, దాన్ని పరీక్షించుకోవటానికి మనమేం చేస్తాము? వెంటనే అద్దంలో చూసుకుంటాము. అలాగే శాస్త్రమనే దర్పణం మనం బ్రహ్మ ఎలా అవుతామో చూపిస్తుంది. అందువల్ల ఆత్మజ్ఞానాన్ని శాస్త్ర శబ్దప్రమాణంద్వారానే పొందగలము.

అలాగని శాస్త్రాన్ని మనం స్వంతంగా అధ్యయనం చేయటానికి ప్రయత్నించ కూడదు. ఎందుకు? ఇన్నాళ్ళు మనం నేర్చుకుంటున్న విద్య ఒక ఎత్తు, ఆత్మజ్ఞానం ఇంకొక ఎత్తు. మనం నేర్చుకునే లౌకికజ్ఞానాన్ని డైకాటమి సిస్టమ్ అంటారు. సబ్జెక్టు అయిన నేను, ఆబ్జెక్టు గురించి నేర్చుకుంటాను. ఉదాహరణకు మానస సరోవరం గురించి నేర్చుకుంటే దానికి వెళ్ళి ప్రత్యక్షంగా అనుభవం పొందాలి. అప్పుడే ఆ జ్ఞానం పూర్తి అవుతుంది. ఫిజిక్స్ నేర్చుకున్నా, ఎకనామిక్స్ నేర్చుకున్నా అవి బోధించేవి బాహ్యవస్తువుల గురించి. వాటిని ఏదో విధంగా చూస్తాము. దాన్ని **ఆబ్జెక్టిఫికేషన్ ఓరియెంటేషన్** అంటారు.

అదే పద్ధతి ఆత్మజ్ఞానానికి కూడా ఉపయోగిస్తే, పప్పులో కాలేస్తాము. బ్రహ్మ గురించి అంతా నేర్చుకున్నాక బ్రహ్మ, నేను ఒకటే అని తెలుసుకున్నాక, సరే నాకిప్పుడు బ్రహ్మ అంటే బాగా అర్థమయింది, కాని నాకు బ్రహ్మ గురించి పరోక్షజ్ఞానం మాత్రమే కలిగింది, నాకిప్పుడు బ్రహ్మను ముఖాముఖి కలుసుకోవాలని ఉంది అంటే ఎలా ఉంటుంది? లేదా బ్రహ్మ

దర్శనంకోసం ధ్యానంలో ఎన్ని గంటలు కూర్చోవాలి? బ్రహ్మ నాకు ఎప్పుడు దర్శనం ఇస్తాడు? ఎప్పుడు నన్ను చూసి చిరునవ్వులు చిందించి, నన్ను దీవిస్తాడు? ఇలా ప్రశ్నలు వేసే ఆస్కారం ఉంది.

దీనికి కర్ణుడి దృష్టాంతం చూద్దాము. కుంతి వచ్చి కర్ణుడితో, 'నాకు ఆరుగురు పుత్రులు ఉన్నారు, ఆరవ పుత్రుడివి నువ్వే,' అని చెప్పాక కర్ణుడు ఇలా ప్రశ్నించాడనుకోండి, 'నాకు నువ్వు చెప్పింది బాగా అర్థమయింది. ఇప్పుడు ఆ ఆరవపుత్రుడిని చూడాలని ఉంది. అతని దర్శనం నాకు ఎప్పుడు అవుతుంది?' అంటే ఎలా ఉంటుంది?

అందువల్ల ఉపనిషత్తుకు రెండు గురుతర బాధ్యతలు ఉన్నాయి. అటు ఆత్మజ్ఞానం బోధించాలి, ఆత్మను బాహ్యంగా వెతికే అలవాటును మాన్పించాలి. **బ్రహ్మ ఎవరో కాదు, బ్రహ్మను వెతుకుతున్న నువ్వే బ్రహ్మవు** అని గట్టిగా బోధించాలి. చైతన్యపరంగా బ్రహ్మ, నువ్వు ఒకటే అని బోధించాలి. దీనికి చాలా ప్రత్యేక నైపుణ్యం ఉండాలి. ఆ నైపుణ్యం లేకపోతే, ఇందాక చెప్పినట్టుగా ఆ బ్రహ్మ ఎప్పుడు వస్తాడు అంటాము.

ఆత్మజ్ఞానంలో జ్ఞానం–అనుభవం అనే విభజన లేదు. లౌకికజ్ఞానంలో ఉంది. మానస సరోవరం గురించిన జ్ఞానం వేరు, దాని గురించి మనం పొందే అనుభవం వేరు. ఈ విభజన చూడకుండా ఉండటానికి, ఉపనిషత్తు ప్రత్యేక మార్గాన్ని ఎన్నుకుంటుంది. అందువల్ల మనమే స్వయంగా ఉపనిషత్తును నేర్చుకోవటానికి ప్రయత్నిస్తే బోధ సరిగ్గా అర్థం కాదు. ఉపనిషత్తు మొదటి వాక్యంలో బ్రహ్మ దూరమైన వాటికన్నా దూరంగా ఉంది అంటుంది. అయితే టెలిస్కోప్‌లో చూడాలి అనుకుంటాము. కాని వెంటనే దగ్గర దానికన్నా దగ్గరిది అంటుంది. అయితే మైక్రోస్కోప్‌లో చూడాలి అనుకుంటాము.

**దూరాత్ సుదూరే తదిహాంతికే చ**

**అణోరణీయాన్ మహతో మహీయాన్**

అందువల్లనే ఉపనిషత్తును గురువు ద్వారానే నేర్చుకోవాలి. గురువు దగ్గర సంప్రదాయ తాళం చెవి ఉంటుంది. దానితో ఉపనిషత్తును తెరుస్తాడు. గురువుకు ఉపనిషత్తును అర్థం చేసుకుని, దాన్ని మనకు స్పష్టంగా వివరించగలిగే నేర్పు ఉంటుంది. ఆయన బోధ అరచేతిలో ఉసిరికాయను చూసినంత స్పష్టంగా ఉంటుంది – **హస్తామలకవత్**.

గురువు వాడే పద్ధతి ఏమిటి? ఉపనిషత్తులయొక్క తాత్పర్య నిర్ణయం చేయటానికి గురువు ఒక పద్ధతిని ఉపయోగిస్తాడు. దాన్ని **షడ్లింగాని** అంటారు. ఉపనిషత్తు ప్రాథమికంగా దేని గురించి బోధిస్తుందో అర్థం చేసుకోవాలి. ప్రాథమికంగా అని ప్రత్యేకించి ఎందుకు అంటున్నామంటే ఉపనిషత్తు అనేక అంశాలను విశ్లేషిస్తుంది. ఉదాహరణకు స్మృతిగ్రంథమైన భగవద్గీతను తీసుకోండి.

భగవద్గీతలో అనేక అంశాలు చర్చించబడ్డాయి. కర్మ, భక్తి, జ్ఞానం, ఉపాసన, ఆహార నియమాలు, విలువలు. ఇందులో ఏది ప్రధాన అంశం? దాని గురించి భిన్నాభిప్రాయాలు ఉన్నాయి. ప్రధాన అంశాన్ని **తాత్పర్యం** అంటారు. ఈ తాత్పర్యనిర్ణయం చేయటానికి శాస్త్రమే ఒక పద్ధతిని ఇచ్చింది. దాన్ని షడ్లింగాని అంటారు. గురువు ఈ పద్ధతిద్వారా ఉపనిషత్తు లేదా గీతయొక్క తాత్పర్యాన్ని నిర్ణయిస్తాడు.

ఏమిటా తాత్పర్యం? నువ్వు జీవితంలో ఏం కోరుకుంటున్నావో, అదే నువ్వు అంటుంది. నువ్వు భద్రత కోరుకుంటే, నువ్వే భద్రతవు అంటుంది. నువ్వు పరిపూర్ణత కోరుకుంటే, నువ్వే పరిపూర్ణుడవు అంటుంది; నువ్వు ఆనందాన్ని కోరుకుంటే, నువ్వే ఆనందస్వరూపుడవు అంటుంది. నిజానికి నువ్వు నిత్య, శుద్ధ, ముక్త, బుద్ధ, సత్య, పూర్ణ, అభయ, ఆనంద స్వరూపం అంటుంది. ఒక్కముక్కలో చెప్పాలంటే నువ్వు ఏది కోరుకుంటే అదే నువ్వు అంటుంది.

ఈ మాటలు వింటే మొదట్లో నమ్మకం కలుగదు. ఏదో మనని ఉబ్బేస్తున్నారు అనుకుంటాము. దీన్ని అర్థవాదం అంటారు. మొదట్లో కలిగే అపనమ్మకాన్ని **విపర్యః** అంటారు. విన్నకొద్దీ నిజం కావచ్చేమో అనే భావన కలుగుతుంది. దాన్ని **సంభావన** అంటారు. తరువాత నమ్మకం కలుగుతుంది. దాన్ని **నిశ్చయం** అంటారు. అర్జునునికి నమ్మకం కలిగాక ఏమన్నాడు?

**నష్టో మోహః స్మృతిర్లబ్ధా**

ఈ దశకు చేరుకునేదాకా గురువు పదేపదే బోధించాలి. ఏదో గురువు కష్టపడి చెబుతున్నాడని తల ఊపకూడదు. అదేదో ఉపనిషత్తు మాట వరసకు చెప్పే అంశం కాదు. అది మనకు సత్యంగా అర్థం కావాలి. దాన్ని వేదాంత విచారణ లేదా వేదాంత మీమాంసా అంటారు. ఒక విషయం గుర్తుంచుకోండి! ఆత్మజ్ఞానం పొందేది బుద్ధిని పదును పెట్టటానికో, ఒక కొత్త డిగ్రీ పొంది, మేధావి అనిపించుకోవటానికో కాదు. శాస్త్రం ఎంత బాగా అర్థమయితే, మన గురించి మనకు అంత లోతుగా అర్థమవుతుంది. శాస్త్రం స్పష్టంగా అర్థమయిందంటే, మన గురించి మనకు స్పష్టంగా అర్థమయినట్టు అర్థం.

అద్దంలో మన మొహం స్పష్టంగా కనబడాలంటే ఏం చేయాలి? అద్దం స్పష్టంగా ఉండాలి. అద్దం ఎంత స్పష్టంగా ఉంటే, మన మొహం అంత స్పష్టంగా కనిపిస్తుంది. అందువల్ల, ముందు అద్దాన్ని తుడవాలి. నా మొహం చూడటానికి అద్దాన్ని ఎందుకు తుడవాలి అనకూడదు. అదే విధంగా శాస్త్రాన్ని అర్థం చేసుకోవటానికి తర్కం, వ్యాకరణం నేర్చుకోవాలి. అవి ఎందుకు, అనవసర కాలయాపన అనకోకూడదు. శాస్త్రంలోని పదాలు ఎంత బాగా అర్థమయితే, మనకు మనం అంత బాగా అర్థమవుతాము.

ఆ విధంగా వేదాంత విచారణద్వారా ఆత్మజ్ఞానం పొందాలి. ఏమిటా జ్ఞానం? ఇన్నాళ్ళూ మన గురించి మనం అనుకుంటున్నది తప్పు అని తెలుసుకోవటం. నేను అశాశ్వతమైన, పరిమితి ఉన్న మానవమాత్రుడిని కాను. నేను శాశ్వతమైన, పరిమితి లేని బ్రహ్మను.

**అహం బ్రహ్మ అస్మి**

అహం బ్రహ్మ అస్మి శాస్త్రం చెప్పే ఒక వాక్యం కాదు; ఇది నిజంగా నిజం అని అర్థం చేసుకుంటాము. ఇది వేదప్రమాణంవల్లనే, అది కూడా గురువు బోధవల్లనే సుసాధ్యం.

ఈ ఉపోద్ఘాతం అంతా చాలా ముఖ్యం. లేకపోతే, వేదాంతంయొక్క విలువ తెలియదు. ఈ ఉపోద్ఘాతం చూడకపోతే వేదాంతం అవసరం లేదు. ధ్యానం చేసుకుంటే చాలు అనుకునే పొరపాటు ఉంది. ఒక విషయం అర్థం చేసుకోండి. బోధను వివరంగా వింటేనే రాని జ్ఞానం, మీ అంతట మీరు ధ్యానంలో కూర్చుని ధ్యానం చేస్తే వస్తుందా? శ్రవణం చేస్తే కలగని జ్ఞానం ఎన్నిసార్లు ధ్యానం చేసినా కలుగదు. అందువల్ల జ్ఞానం పొందాలంటే గురువు శాస్త్రదర్పణాన్ని చూపించి తీరాలి. అదొక్కటే మార్గం!

కొంతమందికి ఒక అపోహ ఉంది. నా గురించి నేను నేర్చుకోవటానికి నేను అంతర్ముఖుడనవాలి కాని, బాహ్యంగా ఉన్న శాస్త్రం ఏం చేయగలదు అంటారు. మళ్ళీ అద్దం ఉదాహరణే తీసుకోండి. మీ మొహాన్ని మీరు అద్దంలో చూసుకుంటారు. అవునా? అద్దంలో చూసినంత మాత్రాన మీరు బాహ్యముఖంగా చూసినట్టు కాదు. ఎందుకు? అద్దం బయట ఉంది కాబట్టి, మీరు బయటకు చూస్తున్నారు అనుకుంటున్నారు కాని మీరు అద్దంలో చూస్తున్నది దేనిని? సాక్షాత్తూ మీ ముఖాన్నే.

అలాగే శాస్త్ర అధ్యయనం చేయటం బాహ్యముఖంగా చేసినట్టు కాదు. మీ గురించి మీరు తెలుసుకోవాలనుకుంటే, గురువు బాహ్యంగా ఏదో పుస్తకం చూపిస్తున్నాడు అనుకోకూడదు. గురువు బాహ్యంగా ఉన్న పుస్తకంలో చూపిస్తున్నది ఏమిటో చూడండి! గురువు చూపిస్తున్నది అక్షరాలా మిమ్మల్నే! మీ ఆత్మస్వరూపాన్ని చూపిస్తున్నాడు. మీ మొహాన్ని ఎలాగైతే బాహ్యదర్పణంలో చూస్తారో, అలా మీ ఆత్మస్వరూపాన్ని బాహ్యశాస్త్రదర్పణంలో చూస్తారు. ఆ విధంగా శాస్త్రప్రమాణంద్వారా ఆత్మజ్ఞానం పొందాలి.

శాస్త్రంయొక్క తాళంచెవిని గురువు మాత్రమే తెరువగలడు అని చూశాము. ఎందుకంటే గురువు తన గురువునుంచి నేర్చుకున్నాడు. దాన్ని సంప్రదాయ కీ అంటారు. అందువల్ల శాస్త్రప్రమాణాన్ని గురువుద్వారానే ఉపయోగించాలి. అప్పుడు శాస్త్రప్రమాణం మనకు స్పష్టమైన ఆత్మజ్ఞానాన్ని అందిస్తుంది. ఈ పద్ధతిని **శాస్త్రవిచారణ** లేదా **వేదాంత విచారణ** లేదా **జ్ఞానయోగం** అంటారు.

ఈ వేదాంత విచారణలో మూడు అంశాలు ఉన్నాయి. అవి శ్రవణం, మననం, నిదిధ్యాసనం.

1. **శ్రవణమ్** – శ్రవణం అంటే ఒక క్రమపద్ధతిలో, క్రమం తప్పకుండా, కొన్ని సంవత్సరాల పాటు శాస్త్ర అధ్యయనం ఒక శ్రోత్రియ బ్రహ్మనిష్ఠ అయిన గురువు వద్ద చేయాలి. ఇందులో ప్రతి ఒక్క పదం కూడా ముఖ్యమే. ఈ శ్రవణంలో గురువు షడ్లింగాలద్వారా బోధ చేస్తాడు. అవి ఉపక్రమ ఉపసంహారం, అభ్యాసం, అపూర్వత, ఫలం, అర్థవాదం, ఉపపత్తి.

ఈ ఆరు లింగాలద్వారా శాస్త్రంయొక్క సారాంశాన్ని బోధించాలి గురువు. ముందే చూసినట్టుగా శాస్త్రం అనేక అంశాల గురించి బోధిస్తుంది. వాటిలో ఏది ప్రధాన అంశం? అది తెలుసుకోవటానికి షడ్లింగ విచారణ తోడ్పడుతుంది. అది ఉపయోగించకపోవటంవల్ల రకరకాల సిద్ధాంతాలు బయలుదేరాయి.

ద్వైతవాదులు పరమాత్మ వేరు, నేను వేరు అంటారు;

విశిష్టాద్వైతులు పరమాత్మ, నేను పూర్తిగా భిన్నం కాదు;

నేను పరమాత్మలో ఒక అంశాన్ని అంటారు. వారిది అంశ–అంశి సిద్ధాంతం.

ఈ రెండింటినీ ఖండిస్తుంది అద్వైతం. నేను పరమాత్మకు భిన్నం కాదు, నేను పరమాత్మలో ఒక అంశాన్ని కూడా కాదు అంటుంది అద్వైతం. మరి నేను ఎవరు?

**తత్త్వమేవ త్వమేవ తత్** – కైవల్యమ్

అది నువ్వే, నువ్వే అది. అంటే నువ్వు, పరమాత్మ ఒకటే. జీవాత్మ, పరమాత్మల ఐక్యాన్ని బోధిస్తుంది వేదాంతం.

అద్వైతానికి భిన్నంగా ఇన్ని సిద్ధాంతాలు ఉన్నాయంటేనే శాస్త్రాన్ని కూలంకషంగా చర్చించాలి అని అర్థం. దీన్ని మీమాంసా అంటారు. మీమాంసా అంటే గౌరవంతో కూడిన విచారణ. దీని శాస్త్రవిచారణకు వాడతారు. మీమాంసా అర్థం విచారణ, కాని ఈ విచారణ శాస్త్రానికి సంబంధించినదైతేనే, దాన్ని మీమాంసా అంటారు. **పూజిత విచారః మీమాంసా.**

ఈ మీమాంసా లేదా శ్రవణం లేదా వేదాంత విచారణ చేస్తే, శాస్త్రంయొక్క సారాంశం తెలుస్తుంది. శాస్త్రంయొక్క సారాంశం – **అహం బ్రహ్మ అస్మి** – నేను ఆ అనంతబ్రహ్మను. నేను అనంతబ్రహ్మను మాత్రమే కాదు, నేను కాక ఇంకొక వస్తువు లేదు.

**అహమ్ అద్వైత బ్రహ్మ అస్మి**

అద్వైతం అంటే రెండవది లేనిది. నేను అనంతం బ్రహ్మను. నేను కాక, వేరే ఏదీ లేదు.

**అహమేవ ఇదగ్ం సర్వమ్**

నేను బ్రహ్మను, నేను పరిపూర్ణుడను, నేను సచ్చిదానంద బ్రహ్మను అని నేర్చుకుంటాము శ్రవణంలో. శ్రవణం చేసేటప్పుడు, మధ్యలో సందేహాలు కలిగినా, వాటిని గుర్తు పెట్టుకోవాలి తప్ప అడగకూడదు. నేను బ్రహ్మను అని అంగీకరించగలిగే వరకూ శ్రవణం చేస్తూనే ఉండాలి. శ్రవణం అంటే **అజ్ఞాన నివృత్తి**.

2. **మననమ్** – మననం అంటే ఆత్మజ్ఞానం గురించి నేర్చుకునే క్రమంలో కలిగే సందేహాలను నివృత్తి చేసుకునే పద్ధతి. ఈ సంశయాలను బుద్ధిపరమైన ఆటంకాలు అంటారు. ఈ బుద్ధిపరమైన ఆటంకాలు జ్ఞానానికీ, నిశ్చయజ్ఞానానికీ మధ్యలో నిలుస్తాయి. జ్ఞానాన్ని నిశ్చయజ్ఞానంగా మలుచుకోవాలి. దీన్ని సంశయరహితజ్ఞానం అని కూడా అంటారు. సంశయసహితజ్ఞానం ఉన్నా లేనట్టే. అది అజ్ఞానంతో సమానమవుతుంది.

ఉదాహరణకు ఒక ఎలక్ట్రిక్ వైర్ వ్రేలాడుతోందనుకోండి. అది లైవ్‌వైరో కాదో మీకు తెలియదు. మీరు మీ పక్కనున్న ఎవరినో పిలిచి, ఇది లైవ్‌వైరా అని అడుగుతారు. అతను, 'కాదండి,' అని చెబుతాడు. 'సరే,' నని మీరు ధైర్యంగా దాన్ని ముట్టుకోబోతుండగా, 'నాకు కచ్చితంగా తెలియదు. 99 శాతం నిజమే కాని, ఒక శాతం చెప్పలేను,' అన్నాడనుకోండి. ఏం చేస్తారు మీరు? ఒక శాతమే కదా సందేహం అని ధైర్యం చేస్తారా? ఒక్కశాతం సందేహం ఉన్నా కూడా అది అజ్ఞానంతో సమానమే. అందువల్ల సంశయసహితజ్ఞానం ఉన్నా ఒకటే, లేకపోయినా ఒకటే.

వేదాంతబోధ విషయానికి వచ్చేసరికి సందేహాలు కూడా మామూలు సందేహాలు కావు. ఎందుకంటే వేదాంతం బోధించేది అసాధారణ అంశాలు. వేదాంతం బోధించే ప్రాథమిక అంశాలు అంత తేలిగ్గా జీర్ణించుకోలేని అంశాలు.

ఎ) **నువ్వు శాశ్వతం** – వేదాంతం నువ్వు శాశ్వతం అంటుంది. ఆ అంశాన్ని మన బుద్ధి అంత తేలిగ్గా స్వీకరించలేదు. ఎందుకు? మనకు మనం కాలపరిమితి ఉన్న అశాశ్వతమైన జీవులమని గట్టిగా తెలుసు. మనకొక పుట్టినరోజు ఉంది, మనకు ఇష్టం ఉన్నా, లేకపోయినా వయస్సు ఉడిగిపోతుంది. ఎప్పుడో ఒకరోజు పండుటాకులా రాలిపోతాము. ఇదీ మన దృఢనిశ్చయం. మన జీవనవిధానం కూడా ఈ నిశ్చయాన్ని ఆధారం చేసుకుని కొనసాగుతుంది. వృద్ధాప్యం అవస్థలు పడకుండా ఉండటానికి, మన పిల్లలు మన తర్వాత కూర్చుని తినటానికి వీలైనంత ఆస్తిపాస్తులు పోగేయటానికి నిముష నిముషమూ ప్రయత్నిస్తూనే ఉంటాము.

అలా మన వృద్ధాప్యానికి, మరణానికి మనం సంసిద్ధులమవుతుంటే, వేదాంతం నీకసలు చావు, పుట్టుకలే లేవు అంటుంది.

**న జాయతే మ్రియతే వా కదాచిత్** – గీత 2.20

వేదాంతంమీద జాలిపడతామే కాని దాన్ని తేలిగ్గా జీర్ణించుకోలేము. అందువల్ల వేదాంతం 'నువ్వు శాశ్వతం,' అంటే మనకు కొరుకుడు పడదు. ఇది వ్యష్టిపరంగా.

బి) **జగన్మిథ్యా** – ఇది జగత్తుకు సంబంధించిన సమస్య. కంటికి ప్రత్యక్షంగా కనబడుతున్న, మనం అనుభవిస్తున్న, మనం వ్యవహారం నడుపుతున్న జగత్తు అసలు లేనే లేదంటుంది శాస్త్రం. మరయితే ఏది ఉంది? కంటికి కనబడని, రూపమే లేని బ్రహ్మమీద జగత్తును ఆరోపిస్తున్నావు అంటుంది శాస్త్రం. నామరూపాత్మక జగత్తు, నిర్గుణబ్రహ్మ సగుణాకారం తప్ప ఏమీ కాదంటుంది. బ్రహ్మ లేకుండా, జగత్తుకు విడిగా ఉనికి లేదంటుంది.

తమాషా ఏమిటంటే **కంటికి ప్రత్యక్షంగా అక్షరాలా కనిపిస్తున్న జగత్తేమో లేనే లేదంటుంది. కంటికి ఎన్నడూ కనబడని, రూపమే లేని బ్రహ్మ ఉన్నాడంటుంది**. బ్రహ్మ సత్యం, జగన్మిథ్యా అంటుంది. ఇది సమష్టిపరంగా సమస్య.

సి) **జీవ–ఈశ్వర ఐక్యం** – అంతకన్నా పెద్ద నమ్మలేని నిజం చెబుతుంది. ఆ బ్రహ్మ ఎవరో కాదు, నువ్వే అంటుంది. ఉన్నదొకటే బ్రహ్మ; అది నువ్వే అంటుంది.

**జీవో బ్రహ్మైవ నాపరః**

జీవుడు బ్రహ్మ తప్పితే మరొకటి కాదు అంటుంది. ఇదే వేదాంతసారం అంటుంది. ఈ మూడు వాక్యాలే అర్థం కావు. ఏమిటా మూడు వాక్యాలు? జగత్తు మిథ్య, బ్రహ్మ సత్యం, నువ్వు ఆ బ్రహ్మవు.

జగత్తు మిథ్య కొంతవరకు అర్థం చేసుకోవచ్చు, బ్రహ్మ సత్యం కూడా నమ్మవచ్చు, కాని నేనూ, ఆ బ్రహ్మ ఒకటే అనేది అసలు మింగుడుపడని విషయం. అందువల్ల వేదాంతం నేర్చుకోవాలంటే అనేక సందేహాలు కలుగుతాయి.

ఎందుకు వేదాంతాన్ని జీర్ణించుకోలేకుండా ఉన్నాము? దానికి ప్రాథమిక కారణం ఇది. నా ఇంద్రియాలు, బుద్ధి చూపించేది వేరు, వేదాంతం బోధించేది వేరు. నా ఇంద్రియాలు, బుద్ధి నానాత్వాన్ని చూపిస్తాయి. మనకున్న ప్రమాణాలన్నీ ద్వైతాన్ని చూపిస్తాయి. కాని వేదాంతమేమో అద్వైతమే సత్యం అంటుంది. అందువల్ల నాకు ప్రమాణాలు చూపించేదానికి, వేదాంతం బోధించేదానికి పొత్తు కుదరటం లేదు. అలా ప్రత్యక్ష అనుభవానికి, శాస్త్రబోధకు మధ్య భేదం ఉన్నప్పుడు, మనం ప్రత్యక్ష అనుభవానికే పెద్దపీట వేయటానికి ప్రయత్నిస్తాము. అలా ప్రత్యక్ష ప్రమాణాన్నే నమ్మటం మనకు అలవాటు.

మన ప్రత్యక్ష ప్రమాణాన్ని నమ్మాలా? ఏవో గ్రంథాల్లో రాసిన విషయాలను నమ్మాలా? ఇలా సందిగ్ధంలో పడటాన్ని ప్రమేయ అసంభావన అంటారు. ప్రమేయం అంటే ఆబ్జెక్టు.

ఇప్పుడు మనకు రెండు ఆబ్జెక్టులు ఉన్నాయి – శాస్త్రం చూపించే ఆబ్జెక్టు, మన అనుభవ ప్రమాణం చూపించే ఆబ్జెక్టు. శాస్త్రం అద్వైతాన్ని వెల్లడిస్తే, అనుభవం ద్వైతాన్ని వెల్లడిస్తుంది. ఈ రెండింటిలో దేన్ని స్వీకరించాలి? రెండింటినీ స్వీకరిస్తాము అనలేరు. ఎందుకంటే రెండూ రెండు భిన్నధృవాలు. ఒకదాన్ని స్వీకరించాము అంటేనే రెండోదాన్ని తిరస్కరించినట్టే.

ఈ సమస్య పూర్తిగా బుద్ధికి సంబంధించిన సమస్య. అందువల్ల ఈ విషయాన్ని లోతుగా విశ్లేషించి, అందులో వివరంగా విచారణ చేయాలి. ఇలా సందేహనివృత్తి చేసుకోవటాన్ని మననం అంటారు. మననం ఒక్కటే సంశయరహిత నిశ్చయజ్ఞానాన్ని ఇవ్వగలదు. వేదాంతబోధను లోతుగా విశ్లేషించాలంటే బుద్ధి పదునుగా ఉండాలి.

ఈ విషయం చాలా స్పష్టంగా అర్థం చేసుకోవాలి. చాలామందిలో ఒక అపోహ ఉంది. ఏమిటది? శాస్త్రం బోధించినదాన్ని ఒక అసాధారణ అనుభవంద్వారానో, అనూహ్యమైన అనుభవంద్వారానో పొందాలి అనుకుంటారు. అది అసాధ్యం. ఏ అనుభవం కూడా బుద్ధిలో కలిగే సందేహాలను పారద్రోలలేదు. ఎందుకు? బుద్ధిలో కలిగే సందేహాలు ఒక విషయం గురించి సరియైన అవగాహన లేకపోతేనో, ఆ విషయం గురించి తప్పుగా ఆలోచిస్తేనో కలుగుతాయి. ఒక విషయం గురించి తప్పుడు ఆలోచనవల్ల కలిగిన సమస్యను ఆ ఆలోచనను సరిచేస్తే పోతుంది కాని, ధ్యానంలోనో, నిర్వికల్ప సమాధిలోనో కూర్చుంటే ఎలా పోతుంది?

ఒక విషయం గుర్తుంచుకోండి! ఇక్కడ మనం ధ్యానాన్ని గాని, నిర్వికల్ప సమాధిని గాని కించపరచటం లేదు. అందులో కలిగే అసాధారణ అనుభవాలను గాని, పొందే సిద్ధులను గాని త్రోసిపుచ్చుటం లేదు. కాని బుద్ధిలో కలిగే అజ్ఞానం తొలగించటానికి అది సరియైన మార్గం కాదు అంటున్నాము. తప్పు ఆలోచనవల్ల కలిగిన అజ్ఞానం సరియైన జ్ఞానం పొందితేనే పోతుంది. వేరే ఏమార్గం ద్వారా పోదు. అష్టాంగయోగం నేర్పించిన పతంజలి యోగిది కూడా ద్వైతవాదనే.

సమాధిలో కూర్చుంటే సందేహాలు పోతాయనుకుంటే, యోగశాస్త్రంలో సందేహాలే ఉండకూడదు. కాని యోగదర్శనం ద్వైతదర్శనాన్నే సూచిస్తోంది అంటేనే సమాధి సందేహాలను పారద్రోలి నిశ్చయజ్ఞానాన్ని ఇవ్వదని అర్థమవుతోంది. అజ్ఞానాన్ని జ్ఞానంతోనే పారద్రోలగలము. జ్ఞానాన్ని బుద్ధిలోనే పొందగలము. బుద్ధి చాలా పదునుగా, సూక్ష్మంగా ఉండాలని కఠోపనిషత్తు చెబుతుంది. బుద్ధిని ఉపయోగించి, లోతుగా విశ్లేషణ చేయాలి. ఎంతవరకు?

**బ్రహ్మ సత్యం జగన్మిథ్యా**
**జీవో బ్రహ్మైవ నాపరః**

ఈ సత్యం సత్యంగా మనం స్వీకరించేంత వరకూ విచారణ చేస్తూనే ఉండాలి. ఈ పద్ధతిని మననం అంటారు. మననం అంటే **సంశయనివృత్తి**. శ్రవణంలో జ్ఞానం కలిగితే, మననంలో ఆ జ్ఞానం దృఢజ్ఞానంగా మారుతుంది.

3. **నిదిధ్యాసనమ్** – నిదిధ్యాసనాన్ని అనేక విధాలుగా చేయవచ్చు. ఏ విధంగా చేసినా, అందులో ముఖ్యమైన లక్ష్యం, శ్రవణ, మననాల స్థాయిలో పొందిన నిశ్చయజ్ఞానాన్ని అణువణువునా జీర్ణించుకోవటానికి, శాస్త్రం బోధించిన సత్యాన్ని పదేపదే తలుచుకోవటం. ఒక రసగుల్లా పంచదార పాకంలో మునిగి, అణువణువూ ఎలా తియ్యగా మారుతుందో, అలా మన అణువణువులోనూ అద్వైతజ్ఞానమనే పాకం చేరుకోవాలి. నిదిధ్యాసనం చేసే మార్గాలు –

i) **పదేపదే శ్రవణం చేయటం** – శాస్త్రాన్ని పూర్తిగా విన్నా కూడా పదేపదే వింటూ రావటం. అలా పదేపదే వినటంవల్ల నిదిధ్యాసనంయొక్క ముఖ్యలక్ష్యం నెరవేరుతుంది. అది మీరు శాస్త్రంలో నిలిచి ఉండటానికి తోడ్పడుతుంది. మొదట్లో ఒకటి రెండుసార్లు మళ్ళీ విన్నప్పుడల్లా మరికొన్ని కొత్త కోణాల్లో అదే అంశాన్ని చూస్తారు. తర్వాత విషయం బాగా అర్థమయ్యాక, కొత్తకోణం రాదు కాని, మీకు విషయం బాగా లోతుగా జీర్ణించుకోవటానికి తోడ్పడుతుంది.

ఇలా పదేపదే వింటున్నప్పుడు, గురువు ఆత్మ లేదా బ్రహ్మ అని చెప్పినప్పుడల్లా ఆ పదాల బదులుగా నేను/అహం అనుకోవాలి. ఉదాహరణకు గురువు ఆత్మ అకర్తా, అభోక్తా అంటే మీరు, 'నేను అహం అకర్తా, అభోక్తా,' అనుకోవాలి.

ii) **పదేపదే చదవటం** – గురువు చెప్పినది విని ఊరుకోకుండా, ఆ బోధను పుస్తకంలోంచి పదేపదే చదవాలి. ఆ చదివేది గురువు బోధ చేస్తున్నప్పుడు మీరు రాసుకున్నదైతే మరీ మంచిది.

iii) **రాయటం** – గురువు చెప్పినదాన్ని క్లాసులో పాయింట్లుగా రాసుకున్నా, ఇంటికి వచ్చాక, తిరిగి వివరంగా రాసుకుంటే ఆ బోధ మరింత లోతుగా అర్థమవుతుంది.

iv) **చర్చించటం** – మీకు సమ ఉజ్జీలయిన, మీతోటి శిష్యులతో వేదాంత విషయాన్ని చర్చించాలి. దీన్ని **అన్యోన్యం తత్ ప్రబోధనమ్** అంటారు.

v) **బోధించటం** – అద్వైతం గురించి బొత్తిగా తెలియని వారికి బోధించటం, చర్చించటం అంటే సమ ఉజ్జీలతో చర్చ అని చూశాము; బోధించటంలో శిష్యుడు తక్కువస్థాయిలో ఉంటాడు. అతనికి అర్థమయ్యేలాగా విషయాన్ని తేలిగ్గా, సూటిగా, హత్తుకుపోయేలా బోధించాలి. అంటే శిష్యునికన్నా మీకు ఎక్కువ తెలిసివుండాలి.

vi) **అనుకరించటం** – ఇది చాలా ముఖ్యం. స్థితప్రజ్ఞుని లక్షణాలను భగవద్గీతలో చూశాము. ఆ లక్షణాలను మీరు గమనించి, వాటిని మీరు అనుకరించాలి. అది మీకు ఎంతగా అలవాటవ్వాలంటే, మీకు తెలియకుండానే అవి మీ రెండవ స్వభావంగా మారిపోవాలి. దయానంద స్వామీజీ 'ఫేక్ ఇట్ అండ్ మేక్ ఇట్,' అంటారు.

ఈ పద్ధతిని మీకు తెలియకుండానే పాటిస్తారు. మీ పిల్లలకు గుడిలో దేవునికో, ఇంటికి వచ్చిన పెద్దలకో, మహాత్ములైన స్వామీజీలకో నమస్కారం చేయటం నేర్పిస్తారు. వారు మొదట్లో ఆ నమస్కారాన్ని యాంత్రికంగా పెడతారు కాని పదేపదే చేసేసరికి అది వారికి అలవాటుగా మారుతుంది. పెద్దలు చెప్పేలోపే వారు నమస్కారాలు పెట్టేస్తారు. అలా మొదట్లో యాంత్రికంగా చేసినా కూడా, రానురాను ఆ చర్యలో ఇమిడివున్న గౌరవ మర్యాదలను కనుగొని మనస్ఫూర్తిగా పెడతారు. అప్పుడది వారి స్వభావంగా మారుతుంది.

ఇదే సూత్రాన్ని నిదిధ్యాసనానికి కూడా అన్వయించుకోవచ్చు. భగవద్గీత రెండవ అధ్యాయంలో చెప్పబడిన శ్లోకాలను (శ్లోకాలు 54–72), గీతలోనే పన్నెండవ అధ్యాయంలో చెప్పబడిన శ్లోకాలను (శ్లోకాలు 13–20), పద్నాలుగవ అధ్యాయంలో చెప్పబడిన శ్లోకాలను (శ్లోకాలు 21–27) చక్కగా అధ్యయనం చేస్తే, స్థితప్రజ్ఞుని లక్షణాలేమిటో ప్రస్ఫుటంగా తెలుస్తాయి. మొదట్లో మీకా లక్షణాలు లేకపోయినా, అవి మీకుంటే ఎలా ప్రవర్తిస్తారో, అలా ప్రవర్తించటం మొదలుపెడితే, అచిరకాలంలోనే మీకు తెలియకుండానే, మీకు ఆ లక్షణాలు అలవడుతాయి. ఆ విధంగా అనుకరించటం నేర్చుకోండి. దీన్ని అనుకరణ జీవనవిధానం అంటారు.

vii) **సమాధి అభ్యాసరూప నిదిధ్యాసనం** – పైన పేర్కొనబడిన వాటిలో ఏ విధమైన నిదిధ్యాసనం చేసినా కూడా, శాస్త్రం ఒక సాంకేతిక పద్ధతిని కూడా సూచిస్తుంది. ఇది తక్కినవాటికి భిన్నంగా ఉంటుంది. ఇంతవరకూ చెప్పబడిన నిదిధ్యాసనలను మీరు ఎక్కడైనా, ఎప్పుడైనా, ఎలాగైనా చేయవచ్చు. సముద్రపుటొడ్డున నడుస్తూ కూడా చేయవచ్చు. కాని ఈ రకమైన నిదిధ్యాసనాన్ని కూర్చుని చేయాలి. ఈ నిదిధ్యాసనలో శరీరస్థితి ఎలా ఉండాలో సూచిస్తుంది కైవల్యోపనిషత్తు.

**వివిక్తదేశే చ సుఖాసనస్థః । శుచిః సమగ్రీవశిరః శరీరః ।**

**అత్యాశ్రమస్థః సకలేంద్రియాణి నిరుధ్య భక్త్యా స్వగురుం ప్రణమ్య ।** – కైవల్యమ్ 5

ఒక ఏకాంత ప్రదేశంలో, సరియైన ఆసనంలో, సరియైన పద్ధతిలో కూర్చుని ఇంద్రియాలను అంతర్ముఖం చేయాలి. దీన్ని సమాధి అభ్యాస అంటారు. సమాధి అంటే ఏకాగ్రత చూపటం; అభ్యాస అంటే సాధన చేయటం. ఏకాగ్రత పెంపొందించుకోవాలి. దేనిమీద ఏకాగ్రత?

బ్రహ్మమీద ఏకాగ్రత చూపాలి. బ్రహ్మ బాహ్యవస్తువు కాదు, సాధన చేస్తున్న నేనే బ్రహ్మను అని చేయాలి.

వేదాంత బోధలో మీకు అవసరమనుకున్న అంశంమీద మీరు ఏకాగ్రత చూపాలి. అందరి సమస్యా ఒక్కలాగా ఉండదు. మీకు క్షమాగుణం తక్కువైతే, ఇంకొకరికి కోపం త్వరగా దూసుకురావచ్చు. కామక్రోధలోభమోహమదమాత్సర్యాలలో మీకు సరిపోయిన ఏదో ఒక భావోద్రేకాన్ని తీసుకుని దానిమీద బాగా దృష్టి పెట్టవచ్చు. ఉదాహరణకు –

మీకు కొన్ని వస్తువులు లేవనుకుంటే, పూర్ణత్వంమీద ధ్యానం చేయండి.

మీకు మృత్యువంటే భయమయితే, నిత్యత్వంమీద ధ్యానం చేయండి.

మీరు బంధాలకు బందీ అవుతుంటే, అసంగత్వంమీద ధ్యానం చేయండి.

ఆ విధంగా ఏ సమస్య మిమ్మల్ని పట్టి పీడిస్తుంటే ఆ సమస్యను పారద్రోలటానికి ధ్యానం చేయండి. ఆ సమస్య తొలిగి, మీరు బోధను జీర్ణించుకునేటంతగా ధ్యానం చేయండి.

ఇదే పద్ధతిలో ధ్యానం చేసితీరాలని ఎవరికీ షరతులు విధించము. ఒక సాధకుడు ఏ దశలో ఉంటే ఆ దశకు తగ్గ నిదిధ్యాసనాన్ని ఎన్నుకోవచ్చు అతను. అంటే ప్రతి ఒక్కరూ ఈ సమాధి అభ్యాసరూప నిదిధ్యాసనం చేసి తీరాలనే నియమమేమీ లేదు. అతను ముందు చెప్పినవాటిల్లో దేన్నైనా ఎన్నుకోవచ్చు. శ్రవణం చేయవచ్చు, రాయవచ్చు, చర్చించవచ్చు, ఏదైనా చేయవచ్చు. కాని ఒకటి మాత్రం చేసితీరాలి. ఏమిటది? ఏ మార్గాన్ని ఎన్నుకున్నా కూడా శాస్త్రం బోధించిన విషయాలమీద ఏకాగ్రత చూపాలి. అంతేకాదు, నిదిధ్యాసనం దేన్ని ఆశించి చేయకూడదో కూడా తెలుసుకోవాలి. అంటే దేనికోసం నిదిధ్యాసనం చేయాలో, దేనికోసం నిదిధ్యాసనం చేయకూడదో స్పష్టంగా తెలుసుకోవాలి.

## నిదిధ్యాసనం దేనికోసం చేయకూడదు?

ఎ) **మోక్షంకోసం** – నిదిధ్యాసనాన్ని మోక్షంకోసం చేయకూడదు. శ్రవణంలోనే మీరు స్పష్టంగా నేర్చుకుంటారు. మోక్షం ఎప్పుడో భవిష్యత్తులో వచ్చే సంఘటన కాదు. మోక్షం మీ స్వస్వరూపం. మీరు నిత్య, శుద్ధ, ముక్తపురుషులు. శాస్త్రం **తత్ త్వమ్ అసి** అంటుంది కాని తత్ త్వం భవిష్యసి అనదు. అంటే ఇప్పుడే నువ్వు బ్రహ్మవు, భవిష్యత్తులో ఎప్పుడో కాదు అంటుంది. ఇప్పుడే నువ్వు బ్రహ్మవు అంటే నువ్వు ముక్తపురుషుడవు అని అర్థం.

అందువల్ల మోక్షం ఎప్పుడో భవిష్యత్తులో వస్తుంది అనుకుంటే, మీకు శాస్త్రం సరిగ్గా అర్థం కానట్టు అర్థం. అప్పుడు మీరు వెనక్కి శ్రవణానికి వెళ్ళాలి. మీరు ఒక విషయం బాగా గుర్తుంచుకోవాలి. మీరు ఈ క్షణంలో బాధపడుతున్నా కూడా మీరు ఆనందస్వరూపులు. అంటే ముక్తపురుషులు. కాబట్టి మోక్షంకోసం నిదిధ్యాసన చేయబోవటం లేదు.

బి) **జ్ఞానంకోసం** – నిదిధ్యాసనం చేసేది జ్ఞానం పొందటంకోసం కూడా కాదు. జ్ఞానం శ్రవణంలో పొందలేరు. అజ్ఞాననివృత్తి శ్రవణం స్థాయిలోనే కలుగుతుంది.

సి) **నిశ్చయజ్ఞానంకోసం** – నిదిధ్యాసనం చేసేది నిశ్చయజ్ఞానం పొందటంకోసం కూడా కాదు. నిశ్చయజ్ఞానం మననంలో పొందుతారు. సంశయనివృత్తి మననం స్థాయిలోనే కలుగుతుంది.

డి) **సిద్ధులకోసం** – నిదిధ్యాసనం చేసేది అసాధారణ అనుభవాలకోసమో, సిద్ధులు పొందటంకోసమో చేసేది కాదు. వేదాంతజ్ఞానం పొంది, నిదిధ్యాసనకు వచ్చిన సాధకుడు ఇటువంటి సిద్ధులను ఆశించడు. ఎందుకు? ఈ అనుభవాలన్నీ అనాత్మకు చెందినవని తెలుసుకుంటాడు. సిద్ధులు వచ్చిపోయేవి అంటేనే, అవి అనాత్మకు చెందినవని అర్థం. మామూలు అనుభవాలు మామూలు అనాత్మకు చెందితే, అసాధారణ అనుభవాలు అసాధారణ అనాత్మకు చెందుతాయి.

ఒక విషయం బాగా గుర్తుపెట్టుకోండి! అసాధారణ అనుభవాలు లేవనటం లేదు. సిద్ధులు రావు అనీ అనటం లేదు. కాకపోతే ఈ సిద్ధులవల్ల ఆత్మజ్ఞానం పొందలేరు అంటున్నాము అంతే. అంటే ఒక వ్యక్తి జ్ఞానం పొంది ముక్తి పొందవచ్చు. అతనికి సిద్ధులు ఉండితీరాలనే నియమమేమీ లేదు. చాలామందికి జ్ఞానికి సిద్ధులు ఉంటాయనే అపోహ ఉంది. జ్ఞానికి సిద్ధులు కాని, అసాధారణ అనుభవాలు కాని ఉండి తీరనవసరం లేదు. అలాగని వీటిని కాదనటమూ లేదు.

నాలుగు రకాల మనుష్యులు ఉన్నారు –

1. ఇతను జ్ఞాని, సిద్ధపురుషుడు కూడా
2. ఇతను జ్ఞాని, కాని సిద్ధపురుషుడు కాదు
3. ఇతను అజ్ఞాని, కాని సిద్ధపురుషుడు
4. ఇతను అజ్ఞాని, సిద్ధపురుషుడు కూడా కాదు

ఈ నాలుగురకాల మనుష్యుల్లో ఎవరికి మోక్షం వస్తుంది? మొదటిరకం వ్యక్తికి మోక్షం వస్తుంది. రెండవరకం వ్యక్తికి కూడా మోక్షం వస్తుంది. అతనికి సిద్ధులు లేకపోయినా మోక్షం వస్తుంది. ఇది చాలా ముఖ్యం. సిద్ధులు లేవు కాబట్టి సగమే మోక్షం వస్తుంది అనకూడదు. దీనివల్ల మనకు ఒక విషయం స్పష్టంగా అర్థమవుతుంది. సిద్ధులు ఉన్నా లేకపోయినా, జ్ఞానం పొందితే, జ్ఞానికి మోక్షం వస్తుంది. అన్వయ వ్యతిరేకన్యాయం ప్రకారం సిద్ధులు ఉన్నా లేకపోయినా, జ్ఞానం పొందకపోతే అజ్ఞానికి మోక్షం రాదు. అంటే మూడు, నాలుగురకాల మనుష్యులకు మోక్షం రాదు. పురాణగాథల్లో రాక్షసులకు అనేక సిద్ధులు ఉన్నట్టు చూస్తాము. అంటే ధార్మికప్రవర్తన లేకపోయినా సిద్ధులు పొందేవారు ఉంటారు. అటువంటి

అధార్మిక పురుషుడు, తనకున్న సిద్ధులను దుర్వినియోగం చేస్తాడు. కాబట్టి నిదిధ్యాసనం సిద్ధులు పొందటంకోసం చేయబోవటం లేదు.

ఒక్కముక్కలో చెప్పాలంటే నిదిధ్యాసనం మోక్షంకోసం, జ్ఞానంకోసం, నిశ్చయజ్ఞానంకోసం, సిద్ధులకోసం చేయబోవటం లేదు. నిదిధ్యాసనం నేర్చుకున్న జ్ఞానాన్ని జీర్ణించుకోవటంకోసం చేస్తారు.

నేర్చుకున్న జ్ఞానాన్ని జీర్ణించుకున్నట్టు ఎలా తెలుస్తుంది? కొత్తగా మీ తల వెనుక ఒక మెరుపు వచ్చేయదు. మీరు జీవితంలో ఎదుర్కొనే సమస్యలకు మీరు చూపే స్పందనల్లో మార్పు వస్తుంది. ఏదైనా చెడువార్త వినగానే, అందరిలా ముందు మీరు కూడా, 'ఏమిటి?' అంటారు. కాని కొంతసేపు అయ్యాక, మీరు పొందిన జ్ఞానాన్ని గుర్తు చేసుకుని, 'అయితే ఏమిటి?' అంటారు. ఈ 'ఏమిటి?'కీ 'అయితే ఏమిటి?'కీ మధ్యనున్న దూరం తగ్గుతూ వస్తుంది. జ్ఞాని ఎలా ప్రవర్తిస్తాడో భగవద్గీతలో వస్తుందని ముందే చూశాము.

**దుఃఖేష్వనుద్విగ్నమనాః సుఖేషు విగతస్పృహః ।**
**వీతరాగభయక్రోధః స్థితధీర్మునిరుచ్యతే ॥** – గీత 2.56

నిదిధ్యాసనం సాధన చేసినకొద్దీ, ఈ మార్పు వస్తుంది. రాత్రికి రాత్రి మార్పు వచ్చేయదు కాని, చాలా నెమ్మదిగా మార్పు వస్తుంది. ఉదాహరణకు కోపం తీసుకుంటే, మీకు కోపం తగ్గిందో లేదో తెలుసుకోవటానికి FIR test మీకు మీరే చేసుకోవచ్చు. F-Frequency, I-Intensity, R-Recovery period. అంటే మీకు ఎంత కోపం ఎంత తరచు వస్తోంది, ఎంత తీవ్రంగా వస్తోంది, ఎంతసేపట్లో తగ్గుతోంది?

1. **ఎంత తరచు వస్తోంది?** – ఎవరైనా ఏదైనా అంటే మీకు కోపం వస్తుంది కదా! ఆ కోపం ఎంత తరచుగా వస్తోంది? నిదిధ్యాసనకు రాకముందు ఎవరైనా ఏదైనా అనగానే చర్రున కోపం వచ్చేది మీకు. ఎప్పుడైనా ప్రశాంతంగా ఉంటుంది మనస్సు. ఇప్పుడు నిదిధ్యాసన చేస్తున్నారు కాబట్టి పరిస్థితి తారుమారు అవాలి. అంటే ఎప్పుడూ ప్రశాంతంగా ఉండాలి మనస్సు. ఎప్పుడో అరుదుగా కోపం వచ్చే అవకాశం ఉంటుంది. కోపం తగ్గుతూ రావటంవల్ల మనస్సు ప్రశాంతంగా మారుతూ వస్తుంది. దీన్ని **బ్రహ్మజ్ఞానఫల అనుభవం** అంటారు. జాగ్రత్తగా చూడండి; బ్రహ్మ అనుభవం కాదు; బ్రహ్మజ్ఞానం పొందటంవల్ల కలిగే ఫలాన్ని అనుభవిస్తారు.

**మానావమానయోస్తుల్యః తుల్యో మిత్రారిపక్షయోః ।**
**సర్వారంభపరిత్యాగీ గుణాతీతః స ఉచ్యతే ॥** – గీత 14.25

మానావమానాలను సమభావనతో స్వీకరించే స్థితికి త్వరలోనే చేరుకుంటారు.

2. **ఎంత తీవ్రంగా వస్తోంది?** – నిదిధ్యాసనానికి రాకముందు మీకు చఱ్రున కోపం దూసుకురావటమే కాదు, చాలా తీవ్రంగా కూడా ఉండేది. ఇప్పుడు ఆ తీవ్రత తగ్గుతూ వస్తుంది. తీవ్రతను మూడు స్థాయిల్లో కొలవవచ్చు.

ఎ) కోపం చాలా ఎక్కువగా ఉంటే అది మూడు స్థాయిల్లో ప్రకటితమవుతుంది – మనస్సు, వాక్కు, శరీరం. మనస్సు బాగా కలత చెందినప్పుడు, అది శరీరానికి కూడా పాకుతుంది.

**సీదంతి మమ గాత్రాణి ముఖం చ పరిశుష్యతి ।**
**వేపథుశ్చ శరీరే మే రోమహర్షశ్చ జాయతే ॥** – గీత 1.29

బి) మధ్యరకం కోపం రెండుస్థాయిల్లో ప్రకటితమవుతుంది – మనస్సు, వాక్కుల్లో మాత్రమే ఉంటుంది. శరీరపరంగా ఉండదు. మాటలతో పొగలు గ్రక్కుతూ ఉంటారు.

సి) అధమస్థాయి కోపం ఒక్కస్థాయిలోనే ఉంటుంది. వాక్కు, శరీరపరంగా అది బయటకు ప్రకటితమవదు కాని మనస్సులో మండిపోతుంటారు. కాని ఆ కోపాన్ని వెంటనే ప్రదర్శించకుండా, దాన్ని అదుపులో పెట్టుకుంటారు. ఎలా మీ కోపాన్ని ప్రదర్శించాలో బేరీజు వేసుకుంటారు. కోపాన్ని ప్రదర్శించాలా లేక ఒక బెదిరింపు ఇచ్చి వదిలివేయాలా అని ఆలోచిస్తారు. ఒకవేళ అరిస్తే అందరి ఎదుటా అరవాలా, ఒంటరిగా గదిలోకి పిలిచి అరవాలా అని ఆలోచిస్తారు.

ఇప్పుడు నిదిధ్యాసన చేస్తున్నారు కాబట్టి మీకోపం ఎంత తీవ్రంగా వస్తోందో బేరీజు వేసుకోవచ్చు. మొదట్లో మూడు స్థాయిల్లో ప్రకటితమయ్యే కోపం రానురాను అధమస్థాయికి జారి, ఎదుటివ్యక్తిని ఒంటరిగా గదిలోకి పిలిచి అరిచే స్థాయికి మారతారు.

3. **ఎంతసేపట్లో తగ్గుతోంది?** – ఇది పై రెండు లక్షణాలను అనుసరించి వచ్చేది. నిదిధ్యాసనానికి రాకముందు మీకు చఱ్రున కోపం దూసుకురావటమే కాదు, చాలా తీవ్రంగా కూడా ఉండటమే కాదు, ఒక పట్టాన తగ్గేది కూడా కాదు. చాలా రోజులు దాన్నే తలుచుకుని మండిపోతూ ఉండేవారు. ఇప్పుడు ఆ కోపం ఎక్కువరోజులు నిలవదు. ఎవరికి ఎంతసేపు కోపం ఉంటుందో మన శాస్త్రం వివరిస్తుంది.

| | |
|---|---|
| ఉత్తమః క్షణకోపః స్యాత్ | – ఉత్తముని కోపం క్షణకాలం ఉంటుంది |
| మధ్యమే ఘటికాద్వయమ్ | – మధ్యముని కోపం గంటన్నర ఉంటుంది |
| అధమే స్యాత్ అహోరాత్రమ్ | – అధముని కోపం ఇరవైనాలుగు గంటలు ఉంటుంది |
| పాపిష్టే మరణాంతకః | – పాపి కోపం మరణించేవరకూ ఉంటుంది |

నిదిధ్యాసనం చేస్తుండగా మీ కోపం ఉండే సమయం తగ్గుతూ వస్తుంది. అధమస్థాయి కోపంనుంచి ఉత్తమస్థాయి కోపం స్థాయికి చేరుకోవాలి. అలా తగ్గుతూ వస్తే, మీరు ప్రశాంతతను

పొందుతున్నట్లు అర్థమవుతుంది. ఒక విషయం జాగ్రత్తగా గమనించండి. వేదాంతం మీకసలు కోపమే రాకూడదు అనదు. ఆరోగ్యకరమైన శరీరం అంటే అసలు అనారోగ్యం చేయని శరీరం అని కాదు అర్థం. ఏదైనా అనారోగ్యం వచ్చినా, శరీరంలో రోగనిరోధకశక్తి ఉంటే, శరీరం ఆరోగ్యకరంగా ఉన్నట్టే. ఆరోగ్యకరమైన శరీరానికి జలుబు, దగ్గు కూడా రాకూడదు అంటే అది సాధ్యం కాదు.

అదే విధంగా, మనస్సు అసలు స్పందించకూడదు అనలేము. మనస్సు లక్షణమే భావోద్రేకాలు కలిగివుండటం. వాటిని పూర్తిగా పారద్రోలలేరు. వాటిని వీలున్నంతగా తగ్గించుకోవాలి. ఈ విధంగా మిమ్మల్ని మీరు పరీక్షించుకుంటూ ఉండాలి. కోపం తరచూ రాకుండా, ఒకవేళ వచ్చినా తీవ్రరూపం దాల్చకుండా, ఒకవేళ తీవ్రరూపం దాల్చినా ఎక్కువకాలం నిలవకుండా ఉంటే మీరు మీ నిదిధ్యాసనలో విజయం సాధించినట్టే.

ఇలా మానసికస్థైర్యం పొందటాన్నే జీవన్ముక్తి అంటారు. అది ఏ విధమైన నిదిధ్యాసనం చేసినా సాధ్యమవుతుంది. ఆ విధంగా శ్రవణ, మనన, నిదిధ్యాసనలద్వారా మీరు బ్రహ్మజ్ఞానం పొందటమే కాదు, బ్రహ్మజ్ఞానఫల అనుభవాన్ని కూడా పొందుతారు.

## ఉపనిషత్

**వేద అంతభాగం** – బ్రహ్మజ్ఞానం వేద అంతభాగంలో లభ్యమవుతుంది. వేద అంతభాగానికి అనేక నామాలు ఉన్నాయి.

ఎ) **వేదాంతం** – వేదంయొక్క అంతభాగంలో వస్తుంది కాబట్టి దీన్ని వేదాంతం అంటారు.

బి) **జ్ఞానకాండ** – ఈ వేద అంతభాగంలో బ్రహ్మజ్ఞానం బోధించబడుతుంది కాబట్టి దీన్ని జ్ఞానకాండ అనికూడా అంటారు. ఇందులో కర్మకు ఆస్కారం లేదు. వేదపూర్వభాగం కర్మప్రధానంగా ఉంటే, వేద అంతభాగం జ్ఞానప్రధానంగా ఉంటుంది. అందువల్ల వేదపూర్వభాగాన్ని కర్మకాండ అనీ, వేద అంతభాగాన్ని జ్ఞానకాండ అనీ అంటారు.

సి) **ఆత్మవిద్య** – ఆత్మ అంటే నేను. నా స్వస్వరూపం గురించిన జ్ఞానాన్ని బోధిస్తుంది కాబట్టి దీన్ని ఆత్మవిద్య అనికూడా అంటారు. నేను సంసారంనుంచి విముక్తి పొందటానికి ప్రయత్నిస్తుంటే, నువ్వు ముందే ముక్తపురుషుడివి అంటుంది వేద అంతభాగం. నేను ముక్తి పొందటానికి ప్రయత్నం చేయనవసరం లేదని తెలుసుకోవటమే ఆత్మవిద్య.

డి) **బ్రహ్మవిద్య** – బ్రహ్మ గురించిన జ్ఞానం బోధిస్తుంది కాబట్టి దీన్ని బ్రహ్మవిద్య అనికూడా అంటారు. జీవాత్మ పరమాత్మ ఐక్యజ్ఞానాన్ని బోధిస్తుంది. ఆత్మ=బ్రహ్మ అని నేర్పిస్తుంది. నువ్వు వెతుకుతున్న బ్రహ్మవు నువ్వే అంటుంది. చైతన్యపరంగా ఆత్మ, బ్రహ్మ ఒకటే. బ్రహ్మ అంటే పూర్ణం, అనంతం, అపరిచ్ఛిన్నం.

ఇ) **ఉపనిషత్** – ఉపనిషత్తుకు అనేక అర్థాలు ఉన్నాయి. కాని ఈ తైత్తిరీయోపనిషత్తు భాష్యంలో శంకరాచార్యులవారు ఒక ప్రత్యేకమైన అర్థాన్ని ఇచ్చారు.

శంకరాచార్యులవారు పది ఉపనిషత్తులకు భాష్యాలు వ్రాసారు. అందులో తైత్తిరీయోపనిషత్‌కు, బృహదారణ్యకోపనిషత్‌లకు రాసిన భాష్యాలు వెలలేని వజ్రాలు. అందువల్లనే శంకరాచార్యులవారి శిష్యుడైన సురేశ్వరాచార్యులవారు ఈ రెండు ఉపనిషత్‌లకు శంకరాచార్యులవారు రాసిన భాష్యానికి ఉపభాష్యం రాశారు. వాటిని తైత్తిరీయ భాష్యవార్తికమ్ అనీ, బృహదారణ్య భాష్యవార్తికమ్ అనీ అంటారు. వార్తికం అంటే పద్యరూపంలో రాసిన భాష్యం. తైత్తిరీయ భాష్యవార్తికమ్‌లో వెయ్యి పైచిలుకు వార్తికలు ఉంటే, బృహదారణ్య భాష్యవార్తికమ్‌లో పన్నెండువేల పైచిలుకు వార్తికలు ఉన్నాయి.

**ఉపనిషణ్ణం వా అస్యాం పరం శ్రేయః ఇతి ।**
**తదర్థత్వాద్ గ్రంథః అపి ఉపనిషత్॥**

శంకరాచార్యులవారు తన భాష్యంలో ఉపనిషత్తును ఈ విధంగా నిర్వచించారు. ఈ జ్ఞానంలో సర్వోత్తమమైన మోక్షం ఆత్మరూపంగా కూర్చుని ఉంది అనే అర్థం వస్తుంది కాబట్టి ఇది ఉపనిషత్తు అయింది. ఆ జ్ఞానంకోసం ఉద్దేశింపబడిన గ్రంథాన్ని కూడా ఉపనిషత్తు అంటారు.

దీని అర్థం ఉపనిషత్తును అధ్యయనం చేస్తే, నువ్వే ముక్తపురుషునివి అని నేర్చుకుంటావు. దీన్ని ఏదో లౌకికవిద్య నేర్చుకున్నట్టుగా నేర్చుకోకూడదు. లౌకికవిద్య మీ మేధస్సును మెరుగుపరిస్తే, ఆత్మవిద్య మీ మనస్సును శుద్ధి చేస్తుంది. ఆత్మజ్ఞానం పొందితే ఇక్కడే, ఇప్పుడే ఆనందాన్ని పొందుతారు. మీరు వ్యక్తిగతంగా మార్పు పొందుతారు. మీరు బాహ్యంగా వెతికే శాంతి, భద్రత, ఆనందాలు బాహ్యంగా లేవు, మీలోనే ఉన్నాయని నేర్చుకుంటారు.

**ఆత్మన్యేవాత్మనా తుష్టః స్థితప్రజ్ఞస్తదోచ్యతే** – గీత 2.55

స్థితప్రజ్ఞుడు ఆత్మలోనే రమిస్తాడు. ఆ విధంగా మోక్షం గురించి ఈ బోధలో అంతర్లీనంగా ఉంది. ఈ ఉపనిషత్తు ఎప్పుడో మరణానంతరం వచ్చే ఫలం గురించి చెప్పదు. జీవన్ముక్తిని బోధిస్తుంది. జీవన్ముక్తి అంటే ఇక్కడే, ఇప్పుడే ఆనందాన్ని పొందుతారు.

ఉపనిషత్తు పదాన్ని ఉప+ని+షత్ గా విడదీయవచ్చు.

ఉప అంటే దగ్గర. గురువు దగ్గర.

ని అంటే నిశ్చయము. అంటే నిశ్చయ జ్ఞానము.

షత్ అంటే శిథిలం చేయటం, తొలగించటం. గతి.

ఇప్పుడు ఈ మూడు పదాల అర్థాన్నీ కలిపి చూస్తే, గురువు దగ్గర కూర్చుని, జీవ–ఈశ్వర ఐక్యజ్ఞానం పొందితే, సంసారాన్ని తొలగించుకుని, మోక్షం పొందుతారు.

ఉపనిషత్తులు సాధారణంగా నాలుగు వేదాల అంతభాగంలో ఉంటాయి. అంతేకాదు, ఉపనిషత్తులు సాధారణంగా గురు, శిష్యుల సంవాదరూపంలో ఉంటాయి. ఆ గురుశిష్యుల సంఖ్య మారుతూ ఉంటుంది. ఒక గురువు, ఒక శిష్యుడు ఉండవచ్చు; ఒక గురువు, అనేక శిష్యులు ఉండవచ్చు; అనేక గురువులు, అనేక శిష్యులు ఉండవచ్చు.

ఒక గురువు, ఒక శిష్యుడు – కేనోపనిషత్, ముండకోపనిషత్

ఒక గురువు, ఆరుగురు శిష్యులు – ప్రశ్నోపనిషత్

అనేక గురువులు, అనేక శిష్యులు – బృహదారణ్యకోపనిషత్, ఛాందోగ్యోపనిషత్

ఈ ఉపనిషత్తులు 1180 ఉన్నాయి. కాని కాలగర్భంలో అనేకం కలిసిపోయి, రెండువందల పైచిలుకు ఉపనిషత్తులు మాత్రమే మిగిలాయి. వాటిలో కూడా 108 మాత్రమే ప్రసిద్ధి చెందాయి. వాటిల్లోంచి పది ఉపనిషత్తులకు శంకరాచార్యులవారు భాష్యం రాశారు. నాలుగు వేదాల్లోంచి వాటి సారం ప్రతిబింబించేలా ఈ పదీ రాశారు. అవి –

**ఈశ కేన కఠ ప్రశ్న ముండ మాండూక్య తిత్తిరిః ।**
**ఐతరేయం చ ఛాందోగ్యం బృహదారణ్యకం తథా ॥**

మనం ఈ పది ఉపనిషత్తులను రెండు కారణాలవల్ల నేర్చుకోవాలి. ఒక కారణం, శంకరాచార్యులవారు వాటికి భాష్యం రాశారు కాబట్టి. రెండవ కారణం, బ్రహ్మసూత్రాలు ఈ పది ఉపనిషత్తులను ఆధారంగా చేసుకుని వచ్చాయి కాబట్టి.

తైత్తిరీయోపనిషత్ కృష్ణయజుర్వేదానికి చెందినది. మనము నాలుగు వేదాలు ఉన్నాయని చూశాము. అవి ఋగ్వేదం, యజుర్వేదం, సామవేదం, అథర్వణవేదం. యజుర్వేదం ఒక్కదానికే ప్రత్యేకించి రెండు శాఖలు ఉన్నాయి. వాటిని కృష్ణయజుర్వేదం అనీ, శుక్లయజుర్వేదం అనీ అంటారు. తైత్తిరీయోపనిషత్, కఠోపనిషత్ కృష్ణయజుర్వేదానికి చెందితే; ఈశావాస్యోపనిషత్, బృహదారణ్యకోపనిషత్ శుక్లయజుర్వేదానికి చెందుతాయి.

తైత్తిరీయోపనిషత్తు తైత్తిరీయ ఆరణ్యకంలో వస్తుంది. తైత్తిరీయ ఆరణ్యకంలో పది అధ్యాయాలు ఉన్నాయి. మొదటి ఆరు అధ్యాయాలు కర్మ, ఉపాసనల గురించి బోధిస్తే, తక్కిన నాలుగు అధ్యాయాలు జ్ఞానం గురించి బోధిస్తాయి. అరుణప్రశ్నగా పేరుపొందిన సూర్యనమస్కార మంత్రాలు, తైత్తిరీయ ఆరణ్యకంయొక్క మొదటి అధ్యాయంలో వస్తాయి.

తైత్తిరీయ ఆరణ్యకంలో చివరి నాలుగు అధ్యాయాలను (7–10 అధ్యాయాలు) తైత్తిరీయ ఉపనిషత్తు అంటారు. శంకరాచార్యులవారు 3 అధ్యాయాలకు (7–9 అధ్యాయాలు) మాత్రమే భాష్యం రాశారు. పదవ అధ్యాయాన్ని మహానారాయణ ఉపనిషత్తు అంటారు.

పది ఉపనిషత్తుల్లో కూడా రెండు ఉపనిషత్తులను మాత్రమే పారాయణకు ఉపయోగిస్తారు. ఎందుకంటే ఈ రెండు ఉపనిషత్తులకు మాత్రమే స్వరాలు అందుబాటులో ఉన్నాయి. కఠోపనిషత్తులో కొంతభాగానికి ఉన్నాయి కాని, ముండక, కేన ఉపనిషత్తులకు లేవు. బృహదారణ్యకోపనిషత్తుకు స్వరాలు ఉన్నాయి కాని, అవి అంతగా ప్రాచుర్యంలో లేవు. అందువల్ల దాన్ని కూడా ఎక్కువగా పారాయణం చేయరు.

## తైత్తిరీయోపనిషత్

ఒక్కొక్క ఉపనిషత్తుకు ఒక్కొక్క పద్ధతిలో పేరు పెడతారు.

అనేక ప్రశ్నలు ఉన్నాయి కాబట్టి దాన్ని ప్రశ్నోపనిషత్ అంటారు.

కేనేషితం అనే పదంతో మొదలయింది కాబట్టి దాన్ని కేనోపనిషత్ అంటారు.

ఈశావాస్యమిదగ్ం సర్వంతో మొదలయింది కాబట్టి దాన్ని ఈశావాస్యోపనిషత్ అంటారు.

ఐతరేయుడు అనే ఋషినుంచి వచ్చింది కాబట్టి దాన్ని ఐతరేయోపనిషత్ అంటారు.

తైత్తిరీయోపనిషత్తుకు ఆ పేరు ఎలా వచ్చింది? రెండు కారణాలు చెప్పవచ్చు దానికి. అవి –

1. తిత్తిరి పేరు ఉన్న ఒక ఋషి ఉన్నాడు. యజుర్వేద పరంపరలో అనేక ఋషులు ఉన్నారు. అందులో ఒక ఋషిని తిత్తిరిఋషి అంటారు. ఆ ఋషినుంచి ఈ ఉపనిషత్తు వచ్చింది కాబట్టి దీన్ని తైత్తిరీయ ఉపనిషత్తు అంటారు. ఇది తేలికైన, ప్రత్యక్ష కారణం, ఈ పేరు రావటానికి.

2. ఇంకొక కారణానికి ఒక కథ చెబుతారు. ఆ కథను అక్షరాలా తీసుకోకుండా, అందులో ఉన్న సారాన్ని తీసుకోవాలి.

వైశంపాయనుడు అనే పేరుగల ఒక యజుర్వేద ఆచార్యుడు ఉన్నాడు. ఆయనకు అనేక శిష్యులు ఉన్నారు. అందులో పేరున్న ఋషి యాజ్ఞవల్క్యుడు. బృహదారణ్యక ఉపనిషత్తులో ఈ యాజ్ఞవల్క్యుణ్ణి గురువుగా అనేకసార్లు చూస్తాము. బృహదారణ్యకంలో మైత్రేయీ బ్రాహ్మణం పేరెన్నిక గలది. అదికాక యాజ్ఞవల్క్యుడు జనకునికి ఆత్మబోధ చేస్తాడు. అది స్వయంజ్యోతి బ్రాహ్మణం పేరిట చాలా ప్రఖ్యాతి చెందింది. అదీకాక, ఎనిమిదిమంది బ్రాహ్మణులను వేదపూర్వభాగం, వేద అంతభాగాల గురించిన చర్చలో ఓడించి వేదవిత్తుడని నిరూపించుకుంటాడు.

ఆ యాజ్ఞవల్క్యుడే ఇప్పుడు వైశంపాయనుని శిష్యుడు. తక్కిన శిష్యులకన్నా విద్యలో బాగా ఆరితేరినవాడు. ఆ విద్యాగర్వంతో ఒకసారి తోటి శిష్యులను కించపరుస్తూ ఏదో అన్నాడు. గురువైన వైశంపాయనునికి ఈ విషయం తెలిసింది. యాజ్ఞవల్క్యుని గర్వం

అణచాలనుకున్నాడు. 'నానుంచి నేర్చుకున్న విద్యవల్ల నీకు ఈ గర్వం వచ్చింది కనుక, ఈ విద్యను వదులుకో,' అన్నాడు గురువు. ఆ రోజుల్లో గురువు మాటని జవదాటేవారు కాదు శిష్యులు. అందువల్ల యాజ్ఞవల్క్యుడు తను నేర్చుకున్న విద్యను వమనం చేశాడు.

దీని లక్ష్యార్థం తీసుకుంటే, అతను నేర్చుకున్న జ్ఞానాన్ని వదులుకున్నాడు. ఎలాగైతే ఒక్కోసారి తిన్న అన్నం మొత్తం వాంతి చేసుకుంటామో అలా యాజ్ఞవల్క్యుడు తన తిన్న అన్నాన్ని వాంతి చేసుకున్నాడు అంటే అర్థం తను నేర్చుకుని, జీర్ణించుకున్న జ్ఞానాన్ని బయటకు వదిలాడు. తక్కిన శిష్యులు ఈ వమనం చేసిన దాన్ని తిత్తిరి పక్షుల రూపంలో స్వీకరించారు.

ఇంతకుముందు తిత్తిరి ఒక ఋషిపేరు అని చూశాము. తిత్తిరి పేరిట పక్షులు కూడా ఉన్నాయి. తిత్తిరిపక్షులు స్వీకరించాయి కాబట్టి దీన్ని తైత్తిరీయ ఉపనిషత్తు అంటారు. ఇలా వమనం చేయబడింది కనుక ఈ యజుర్వేదం కృష్ణయజుర్వేదం అయింది.

తర్వాత యాజ్ఞవల్క్యుడు సూర్యభగవానుణ్ణి తనకు ఆత్మజ్ఞానం ప్రసాదించమని కోరితే అలాగే నేర్పిస్తాను కాని, 'నేను తిరుగుతూ ఉంటాను, నాతోపాటు నువ్వు కూడా తిరగగలవా?' అన్నాడు. అలాగే తిరుగుతూ నేర్చుకున్నాడు యాజ్ఞవల్క్యుడు. సూర్యభగవానుణ్ణి వాజసనేయుడు అనికూడా అంటారు. అందువల్ల యాజ్ఞవల్క్యుడు నేర్చుకున్న విద్యను వాజసనేయీ విద్య అని కూడా అంటారు. దీన్ని సూర్యభగవానుడు నేర్పించాడు కాబట్టి శుక్లయజుర్వేదం అంటారు.

ఇంతకుముందు ఒక్క యజుర్వేదానికే రెండు భాగాలు ఉన్నాయనీ, అది దాని ప్రత్యేకత అనీ చూశాము. ఆ రెండు భాగాలకూ కారకుడు యాజ్ఞవల్క్య ఋషి అవటం ఇంకొక ప్రత్యేకత. ముందే చూసినట్టుగా యాజ్ఞవల్క్యుడు వాంతి చేయటం ఏమిటి, అవి తక్కిన శిష్యులు తిత్తిరి రూపంలో తినటం ఏమిటని దీన్ని కాదనకూడదు. ఇక్కడ విషయం, మనం నేర్చుకునే విద్యను జీర్ణించుకోవాలి అని ఒక అర్థం; మనం జీర్ణించుకున్న విషయాన్ని తోటివారికి అందించాలి అని ఇంకొక అర్థం. ఇప్పటికీ చూడండి, కొంతమంది ఉత్తమవిద్యార్థిని అడిగి నేర్చుకుంటారు.

తైత్తిరీయోపనిషత్తులో నాలుగు అధ్యాయాలు ఉన్నాయి కాని, వాటిలో మూడింటికి శంకరులవారు భాష్యం రాశారు. ఇక్కడ అధ్యాయాన్ని వల్లీ అంటారు. ఒక్కొక్క వల్లీకి ఆ పేరు, ఆ వల్లీలో మొదలయ్యే మొదటిపదంవల్ల వచ్చింది.

1. శీక్షాం వ్యాఖ్యాస్యామః – అందువల్ల మొదటి వల్లీ – శీక్షావల్లీ
2. బ్రహ్మవిదాప్నోతి పరమ్ – అందువల్ల రెండవ వల్లీ – బ్రహ్మానందవల్లీ
3. భృగుర్వై వారుణిః – అందువల్ల మూడవ వల్లీ – భృగువల్లీ

తైత్తిరీయోపనిషత్తులోని ఈ వల్లీలన్నీ ఆత్మవిద్యను బోధించవు. ఒక్క రెండవ అధ్యాయమే బోధిస్తుంది. అందువల్ల అది చాలా ముఖ్యమైన అధ్యాయం. అందువల్ల శంకరాచార్యులవారు దానిమీద భాష్యం అద్భుతంగా రాశారు. ఒకటి, మూడవ అధ్యాయాలు ఎక్కువగా కర్మ, ఉపాసనల గురించి బోధిస్తాయి. అవి జ్ఞానయోగ్యతను పెంపొందించుకోవటానికి తోడ్పడతాయి. అందువల్ల ఒకటి, మూడు అధ్యాయాలను **జ్ఞానయోగ్యతా సాధనాని** అంటే రెండవ అధ్యాయాన్ని **జ్ఞానయోగం** అంటారు.

# తైత్తిరీయోపనిషత్ -శీక్షావల్లీ

**ఉపోద్ఘాతం** – ఈ ఉపనిషత్తు గద్యరూపంలో ఉంటుంది. తక్కిన ఉపనిషత్తుల్లాగా పద్యరూపంలో ఉండదు. గద్యంలో వచ్చే పారాగ్రాఫ్‌లను; చిన్నవైనా, పెద్దవైనా; అనువాకాలు అంటారు. శీక్షావల్లీలో 12 అనువాకాలు ఉన్నాయి.

**1. శాంతి పాఠం– అనువాకాలు 1, 12 –** ఈ అనువాకాల్లో మొదటి అనువాకం శాంతిపాఠం. అలాగే చివరి అనువాకం కూడా శాంతిపాఠమే. అందువల్ల ఈ రెండు అనువాకాలనీ పక్కన పెడితే తక్కిన అనువాకాల్లో అసలు బోధ వస్తుంది. అంటే 2–11 అనువాకాలు బోధను చేస్తాయి. కాకపోతే మొదటి వల్లీలో వేదాంతబోధ ఉండదని ముందే చూశాము. దీన్ని సాధన ప్రధానవల్లీ అంటారు.

**జ్ఞానయోగ్యతా సిద్ధ్యర్థం వివిధ సాధనాని**

**2. కర్మయోగసాధన – అనువాకం 9 –** జ్ఞానయోగ్యత పొందటానికి అనేక సాధనలు వివరించబడ్డాయి ఇందులో. అంటే యజ్ఞయాగాదుల రూపంలో కాయిక కర్మలు కొన్ని చెప్పబడ్డాయి. ఇందులో శరీరపరంగా చేసే కర్మలు ఉంటాయి. అవి చిత్తశుద్ధిని కలుగజేసి తమోగుణాన్ని పారద్రోలుతాయి. కాయిక కర్మలు చేయటంవల్ల శరీరం చురుకుగా ఉంటుంది. అందువల్ల ఈ అధ్యాయంలో కర్మయోగం లేదా పంచమహాయజ్ఞాల గురించి నొక్కిచెప్పటం అయింది.

**3. ఉపాసన – అనువాకాలు 3–8 –** కర్మకాండలో ఉపాసన కూడా వస్తుంది. అందువల్ల శీక్షావల్లీ ఉపాసనల గురించి కూడా బోధిస్తుంది. ఉపాసన మానసిక కర్మ కింద వస్తుంది. ఇది మనస్సుకు చెందినది; అంటే ఆలోచనలకు చెందినది. శీక్షావల్లీలో అటువంటి ఉపాసనలు ఐదింటిని చూస్తాము. ఇవి చాలా సాంకేతికపరంగా ఉంటాయి; నిజానికి ఇప్పుడు ఇటువంటి ఉపాసనలు తెరమరుగైపోయాయి. కాబట్టి వీటిని, వీటిగురించిన జ్ఞానం పొందటంకోసం నేర్చుకోవాలి అంతే.

**4. హోమసాధన – అనువాకం 4 –** ఈ హోమసాధన ద్వారా కూడా ఓంకారరూప పరమేశ్వరుణ్ణి ధ్యానిస్తున్నాడు శిష్యుడు. ఈ హోమం **ఆవహంతీ** పదంతో మొదలయింది కాబట్టి, ఇది ఆవహంతీ హోమంగా ప్రసిద్ధి చెందింది.

**5. జపసాధన – అనువాకాలు 4, 10 –** వాచిక కర్మలు కూడా సూచించబడ్డాయి. వాటిని పారాయణం, జపం అంటారు. మనం పారాయణం చేసే శ్లోకాలు లేదా మంత్రాల అర్థం తెలిసినా, తెలియక పోయినా కూడా, వాటిని పారాయణం చేస్తేనే చిత్తశుద్ధి కలుగుతుంది.

వాటి అర్థం తెలుసుకుని పారాయణం చేస్తే, వాటి ప్రభావం ఇంకా ఎక్కువగా ఉంటుంది. జపం కూడా వాచికకర్మలోకే వస్తుంది.

పారాయణానికీ, జపానికీ మధ్య భేదం ఏమిటంటే పారాయణంలో ఏ విష్ణుసహస్ర నామాన్నో, లలితాసహస్రనామాన్నో తీసుకుని దాన్ని చదువుతాము. జపంలో ఒక్కటే నామం తీసుకుని దాన్ని పదేపదే జపిస్తాము. ఉదా. ఓం నమశ్శివాయ. శీక్షావల్లీలో రెండురకాల జపాలను చూస్తాము. జ్ఞానయోగ్యతాప్రాప్తికోసం, జ్ఞానప్రాప్తికోసం చెప్పబడ్డాయి అవి.

శీక్షావల్లీలో ఆ విధంగా ఐదు అంశాలు ఉన్నాయి. అవి శాంతిపాఠం, కర్మయోగ సాధన, ఉపాసన, హోమసాధన, జపసాధన వస్తాయి. ఇవన్నీ మనస్సును జ్ఞానయోగ్యతకు సిద్ధపరుస్తాయి. ఈ నేపథ్యంతో శీక్షావల్లీలోకి అడుగుపెడదాము.

## అనువాకం – 1

**ఓం శం నో మిత్రః శం వరుణః। శం నో భవత్వర్యమా। శం న ఇంద్రో బృహస్పతిః। శం నో విష్ణురురుక్రమః। నమో బ్రహ్మణే। నమస్తే వాయో। త్వమేవ ప్రత్యక్షం బ్రహ్మాసి। త్వామేవ ప్రత్యక్షం బ్రహ్మ వదిష్యామి। ఋతం వదిష్యామి। సత్యం వదిష్యామి। తన్మామవతు। తద్వక్తారమవతు। అవతు మామ్। అవతు వక్తారమ్। ఓం శాంతిశ్శాంతిశ్శాంతిః॥**

**1.శాంతిపాఠం – 1.** ముందే చూసినట్టుగా ఇది ఒక శాంతిపాఠం. (శాంతి పాఠం 2 అనువాకం 12లో వస్తుంది.) ఈ శాంతిపాఠంద్వారా శిష్యుడు రెండు అంశాలను కోరుతున్నాడు.

1. **జ్ఞానయోగ్యతాప్రాప్తి** – జ్ఞానం పొందటానికి అర్హతను ప్రసాదించమని కోరుతున్నాడు. శరీరం, ఇంద్రియాలు, మనస్సు, బుద్ధి ఆరోగ్యకరంగా, పదునుగా ఉండాలి. తత్త్వబోధలో సూక్ష్మశరీరంలో 19 అంగాలు ఉంటాయని నేర్చుకున్నాము. అవి పంచజ్ఞానేంద్రియాలు, పంచకర్మేంద్రియాలు, పంచప్రాణాలు, చత్వారి అంతఃకరణాని (నాలుగు అంతఃకరణలు). నాలుగు అంతఃకరణలు మనస్సు, బుద్ధి, చిత్తం, అహంకారం. ఒక్కోచోట మనస్సును రెండుగా తీసుకుంటారు. అవి మనస్సు, బుద్ధి. అప్పుడు 17 అంగాలు అవుతాయి.

ఈ 17 అంగాలలో కొన్ని చురుకుగా పనిచేయాలి; కొన్ని కుదురుగా ఉండాలి. ఉదాహరణకు జ్ఞానబోధకు వెళ్ళినప్పుడు చెవులు, కళ్ళు చురుకుగా ఉండాలి. కాళ్ళు, చేతులు కుదురుగా ఉండాలి. ప్రతి ఒక్క అంగానికీ ఒక అధిష్ఠానదేవత ఉంటుంది. ఉదాహరణకు కన్నుకు సూర్యుడు, మనస్సుకు చంద్రుడు అధిష్ఠానదేవతలు. ఈ దేవతలకు ఆయా అంగాలను స్థిరంగా ఉంచమని ప్రార్థన చేస్తాము. అందువల్ల తన కరణాలను సిద్ధంగా ఉంచమని ప్రార్థన చేస్తాడు శిష్యుడు.

2. **ప్రతిబంధ నివృత్తిః** – శాంతిపాఠాన్ని గురుశిష్యులిద్దరూ జ్ఞానబోధకు ముందు చేస్తారు. వారు జ్ఞానబోధలో ఉన్నంతసేపూ ఏ విధమైన ఆటంకాలూ కలుగకూడదని చేసే ప్రార్థన అది. ఆ ఆటంకాలు మూడురకాలుగా కలుగవచ్చు. అవి అధ్యాత్మికం, అధిభౌతికం, అధిదైవికం. ఈ నేపథ్యంతో ఈ శాంతిమంత్రాన్ని చూద్దాము.

**మిత్రః** – మిత్రదేవత. మిత్రదేవత ప్రాణశక్తికి అధిష్ఠానదేవత. (ప్రాణః – ప్రాగ్ గమనవాన్ వాయుః) ఇది నిశ్వాసక్రియను సూచిస్తుంది.

**వరుణః** – వరుణదేవత. అపానానికి అధిష్ఠానదేవత. (అపానః – అధో గమనవాన్ వాయుః) అపానం ఉచ్ఛ్వాసక్రియను సూచిస్తుంది. అపానం విసర్జన క్రియ చేస్తుంది అని కూడా అర్థం ఉంది. ఇక్కడ ఊపిరి పీలిస్తే గాలి లోపలికి వెళుతుంది అని అర్థం వస్తుంది.

ఈ ప్రార్థన అర్థం – 'ఓ మిత్రదేవతా, వరుణదేవతా! నేను శ్రవణం చేసేటప్పుడు నా ఉచ్ఛ్వాస నిశ్వాసలు నిరాటంకంగా కొనసాగేలా చేయండి.' అంటే నాకు శ్వాసకు సంబంధించిన సమస్యలు రాకుండుగాక అని అర్థం.

**భవతు అర్యమా** – అర్యముడు అంటే సూర్యదేవత. ఆయన చక్షురింద్రియానికి అధిష్ఠాన దేవత. నా కళ్ళు బాగా పనిచేయుగాక!

**ఇంద్రః** – ఇంద్రుడు చేతులకు అధిష్ఠానదేవత. నా చేతులు శక్తివంతంగా పనిచేయుగాక! గురువు చెప్పే విషయాలను రాసుకునే శక్తి కావాలి.

**బృహస్పతిః** – బుద్ధికి అధిష్ఠానదేవత బృహస్పతి. ఆయనను వాచఃపతిః అనికూడా అంటారు. 'నేను నా ప్రశ్నలను, నా సందేహాలను సరిగ్గా అర్థమయ్యేలా చెప్పగలను గాక!' ప్రశ్న వేయటంలో కూడా నేర్పరితనం ఉండాలి. ప్రశ్నని సూటిగా, సూక్ష్మంగా వేయగలగాలి. లేకపోతే గురువు ప్రశ్నను మరొకలా అర్థం చేసుకునే ప్రమాదముంది.

**విష్ణురురుక్రమః** – విష్ణుమూర్తి పాదాలకు అధిష్ఠానదేవత. పాదయోః విష్ణుః. ఎక్కడికైనా వెళ్ళాలన్నా, గురుశుశ్రూష చేయాలన్నా కూడా పాదాలు శక్తివంతంగా ఉండాలి. వెళ్ళటానికే కాదు, ఒక గంటసేపు కదలకుండా కూర్చోవటానికి కూడా పాదాలలో శక్తి ఉండాలి. ఉరుక్రమః అంటే త్రివిక్రముడు. పొడుగాటి కాళ్ళు ఉన్నవాడు.

విష్ణుమూర్తి వామనావతారం ధరించి ఒక పాదంతో భూమండలాన్నంతా ఆక్రమించి, రెండవ పాదంతో ఆకాశాన్ని ఆక్రమించాడు. మూడవ పాదం ఎక్కడ పెట్టను అంటే తన శిరస్సుమీద పెట్టమని బలిచక్రవర్తి శిరస్సు వంచి మోకరిల్లాడు వామనమూర్తి ముందు. ఆ పాదంతో బలిచక్రవర్తిని పాతాళానికి పంపాడు విష్ణుమూర్తి. ఈ దశావతారాల కథ పురాణాల్లో వస్తుంది. పురాణాలు, ఇతిహాసాలు వేదాలు వచ్చాక తర్వాతెప్పుడో వచ్చాయి.

కాని ఉరుక్రముడు అనే సిద్ధాంతం వేదాల్లో అప్పుడే ఉంది. విష్ణుమూర్తి అనంతుడు.

**బ్రహ్మణే** – బ్రహ్మను వేదాల్లో హిరణ్యగర్భ అంటారు. హిరణ్యగర్భ సమష్టి సూక్ష్మ ప్రపంచ అధిష్ఠానదేవత. హిరణ్యగర్భ సూక్ష్మం కాబట్టి పరోక్షదేవత.

**వాయుః** – ఆ హిరణ్యగర్భే వాయురూపంలో మనం పీల్చే గాలిలో ఉన్నాడు. వ్యష్టిపరంగా గాలి వాయువు అయితే, సమష్టిపరంగా గాలి హిరణ్యగర్భ. అటువంటి హిరణ్యగర్భకు, వాయువుకు నా నమస్కారములు.

**త్వమేవ ప్రత్యక్షం బ్రహ్మాసి** – హిరణ్యగర్భగా పరోక్షంగా ఉన్న దేవతే ప్రత్యక్షంగా వాయువు రూపంలో మనకు ప్రత్యక్షదేవతగా అనుభవంలోకి వస్తున్నది. మన శ్వాసక్రియద్వారా వాయుదేవత తెలుస్తుంది.

**శం భవతు** – ఈ వాక్యాన్ని ప్రతి దేవతముందూ కలుపుకోవాలి. పైన చెప్పిన దేవతలు అందరూ నాకు శక్తిని ప్రసాదింతురు గాక!

**నో (నః)** – మాకు. ఈ ప్రార్థన గురుశిష్యులిద్దరూ చేస్తారని చూశాము. గురువు ఇంద్రియాలు, వాక్కు కూడా బాగా శక్తివంతంగా ఉండాలి. గురువుకు బుద్ధిలో జ్ఞాపకశక్తి బాగా ఉండాలి. లేకపోతే గురువునుంచి తను నేర్చుకున్న ఆత్మజ్ఞానాన్ని శిష్యునికి సరిగ్గా అందజేయలేకపోతాడు.

**నమః** – నేను వీరందరికీ నమస్కారం చేస్తున్నాను.

**బ్రహ్మణే** – ముఖ్యంగా హిరణ్యగర్భకు. హిరణ్యగర్భ దేవతలందరికీ అధిష్ఠానదేవత.

**నమః తే వాయో** – హిరణ్యగర్భే వాయురూపంలో ఉన్నాడని చూశాము. పంచభూతాలను మనం ప్రార్థిస్తాము. నీరుని, ఆకాశాన్ని సంధ్యావందనంలో, అగ్నిని యజ్ఞయాగాదులలో, పృథివిని భూదేవిగాను ప్రార్థిస్తాము.

**త్వమేవ ప్రత్యక్షం బ్రహ్మ అసి** – నువ్వు ప్రత్యక్ష దైవానివి. నువ్వు సర్వవ్యాపకంగా, అంతటా ఉన్నావు. నీ దర్శనంకోసం నేను ప్రత్యేకించి ఏ ఆలయానికీ వెళ్ళనవసరం లేదు. నేను తీసుకునే ఊపిరిలో నువ్వు వాయురూపంలో ఉన్నావు. మనం జీవించి ఉండటానికి భగవంతుడు అవసరమా? ఒక్కసారి ముక్కు, నోరు మూసుకుని చూడండి, మీకే అర్థమవుతుంది భగవంతుడు అవసరమో, కాదో!

**త్వామేవ ప్రత్యక్షం బ్రహ్మ వదిష్యామి** – నువ్వు వాయురూపంలో, ప్రత్యక్షం బ్రహ్మగా అంతటా ఉన్నావని నేను అందరికీ చాటి చెబుతాను.

**త్వామేవ ప్రత్యక్షం బ్రహ్మ ఇతి సర్వత్ర వదిష్యామి**

నువ్వు ప్రత్యక్షబ్రహ్మవు అని నేను అందరికీ చాటి చెబుతాను. అప్పుడు అందరూ నిన్ను విశ్వరూప ఈశ్వరునిగా కొలుస్తారు.

**ఋతం వదిష్యామి। సత్యం వదిష్యామి** – నువ్వే ఋతం అని, సత్యం అని నేను చాటి చెబుతాను. నిజానికి ఈ రెండు పదాలనూ పర్యాయపదాలుగా వాడవచ్చు. కాని వాటిని పక్కపక్కన వాడినప్పుడు పునరుక్తిదోషం రాకుండా, వాటిమధ్య ఉన్న సూక్ష్మమైన భేదాన్ని గమనించాలి.

సత్యం – సత్యం అంటే శాస్త్రంనుంచి పొందిన సరియైన జ్ఞానం. **యథాశాస్త్రం జ్ఞానమ్.** నేను పొందే జ్ఞానం సరియైనది కాకపోతే దానివల్ల ప్రయోజనం లేకపోగా, హానికరం కూడా. నేను పొందే జ్ఞానం శ్రుతి, యుక్తి, అనుభవ ప్రమాణాలనుంచి పొందేదై ఉండాలి. శ్రుతి అంటే శాస్త్రం; యుక్తి అంటే తార్కికంగా ఆలోచించటం; అనుభవం అంటే జీవితంలో కలిగే అనుభవాలనుంచి గ్రహించిన జ్ఞానం. ఈ మూడు ప్రమాణాలనుంచి నేర్చుకున్నదే సరియైన జ్ఞానం.

ఋతం – ఋతం అంటే నేర్చుకున్న జ్ఞానాన్ని ఆచరణలో పెట్టటం. అంటే పొందిన జ్ఞానానికి అనుగుణంగా జీవనాన్ని గడపటం. యథాజ్ఞానమ్ ఆచారః.

ఒక్కముక్కలో చెప్పాలంటే ఋతం అంటే సరియైన ఆచరణ; సత్యం అంటే సరియైన జ్ఞానం. హిరణ్యగర్భ మూర్తీభవించిన సరియైన ఆచారం, సరియైన జ్ఞానం. అంటే హిరణ్యగర్భే ఋతం, సత్యం.

ఇంతవరకూ చేసిన ప్రార్థన జ్ఞానయోగ్యతాప్రాప్తికోసం చేసిన ప్రార్థన. ముఖ్యంగా **శం** పదం మంగళకరమైన పదం. దాన్ని జ్ఞానయోగ్యతగా అర్థం చేసుకోవాలి.

**తన్మామవతు** – హిరణ్యగర్భ నన్ను ఆటంకాలనుంచి నివారించుగాక. అంటే ప్రతిబంధ నివృత్తికోసం చేసే ప్రార్థన ఇది. పూర్తిగా ఆటంకాలు తొలగకపోయినా బోధ జరిగేంతసేపూ ఎటువంటి ఆటంకాలు రాకుండుగాక. అంటే స్టేఆర్డర్ తెచ్చుకుంటున్నట్టు అన్నమాట. తన్మామవతుని తత్+మామ్+అవతు అని విడదీయాలి. తత్ అంటే హిరణ్యగర్భ; మామ్ అంటే నన్ను; అవతు అంటే రక్షించు. అంతా కలిపితే హిరణ్యగర్భ నన్ను రక్షించుగాక.

**తద్వక్తారమవతు** – గురువును కూడా ఆ భగవంతుడు ఆరోగ్యకరంగా ఉంచుగాక. వక్తారమ్ అంటే గురువు. గురువు ఆరోగ్యంకోసం, గురువు దీర్ఘాయుష్షుకోసం శిష్యుడు ప్రార్థన చేస్తున్నాడు. గురువు తన శరీరం గురించి తాపత్రయపడడు. ఎందుకంటే ఆయన తను అనాత్మ అయిన ఈ శరీరం కాదు, తను దానిని సాక్షిగా చూసే సాక్షి చైతన్యాన్ని అని తెలుసుకుంటాడు. గురువు బ్రహ్మనిష్ఠలో ఉంటాడు కాబట్టి అతను శరీరాన్ని ఎప్పుడైనా వదలటానికి సిద్ధంగానే ఉంటాడు.

ప్రతిబంధ నివృత్తి చాలా ముఖ్యం కాబట్టి, ఈ విషయాన్ని నొక్కివక్కాణించటంకోసం శిష్యుడు ప్రార్థనను మళ్ళీ చేస్తున్నాడు.

**అవతు మామ్** – నన్ను రక్షించు;

**అవతు వక్తారమ్** – నా గురువును రక్షించు;

**ఓం శాంతిః శాంతిః శాంతిః** – శాంతిః అంటే ప్రతిబంధాలను తొలగించు అని అర్థం. మూడుసార్లు శాంతిః అని చెప్పటంలోని ఉద్దేశం మూడురకాల ప్రతిబంధకాలనుంచి రక్షించు అని. అవి –

1. అధ్యాత్మిక – నా నుంచి ఆటంకాలు కలగకుండా చేయి. మనం మూడు అడుగులు ముందు వేద్దామని చూస్తే, మన మనస్సు మనను ఆరు అడుగులు వెనక్కి లాగుతుంది. నేనేమిటి ఆత్మజ్ఞానం పొందటమేమిటి, అది నా తలమీంచి పోతుంది అని అపోహ పడతాము మనము. ఈ ఆటంకాలను పోగొట్టుకోవటం పూర్తిగా మన చేతిలో ఉంది.

2. అధిభౌతిక – పరిసరాలనుంచి, పక్కవాళ్ళనుంచి, తోటి జీవరాసులనుంచి కలిగే ఆటంకాలు. వీటిమీద మనకు అంతగా అధికారం లేదు. ఈ ఆటంకాలు లేకుండా చేయి.

3. అధిదైవిక – తుఫాను, వాతావరణంలో మార్పులలాంటి ప్రకృతి వైపరీత్యాల ఆటంకాలు. వీటిమీద మనకి బొత్తిగా అధికారం లేదు. వీటినుంచి నన్ను కాపాడమని సర్వజ్ఞుడైన భగవంతుణ్ణి ప్రార్థిస్తున్నాము.

## అనువాకం – 2

**ఓం శీక్షాం వ్యాఖ్యాస్యామః । వర్ణః స్వరః। మాత్రా బలమ్। సామ సంతానః। ఇత్యుక్తః శీక్షాధ్యాయః।**

ఈ అధ్యాయం **శీక్షాం** పదంతో మొదలవుతుంది. అందువల్ల ఈ అధ్యాయానికి **శీక్షావల్లీ** అనే పేరు వచ్చింది. వల్లీ అంటే అధ్యాయం అని అర్థం.

**వేదపారాయణం** – ఈ చిన్న అనువాకంలో ఉపనిషత్తు పారాయణాన్ని ఒక సాధనగా వివరిస్తుంది. శాస్త్రాన్ని కేవలం పారాయణం చేస్తేనే చాలు, అది మనకు చిత్తశుద్ధిని కలుగజేస్తుంది. ఎందుకంటే అందులోని మంత్రాలే చాలా మంగళకరమైనవి. అవి సాక్షాత్తూ మహాత్ములనుంచి వచ్చాయి. అందువల్ల మనం ఆ మంత్రాలను పఠిస్తుంటే, వాటిని రచించిన రచయితతోనే అనుబంధం పెంచుకుంటున్నాము. మనకు ఆరు స్థాయిల్లో శాస్త్రం ఉంది; అన్ని స్థాయిల్లోకి ఉత్తమమైనది వేదపారాయణం. ఎందుకంటే వేదాలు అపౌరుషేయ గ్రంథాలు. అవి సాక్షాత్తూ ఆ పరమాత్మనుంచే వచ్చాయి. తక్కినవన్నీ స్మృతిగ్రంథాలు; అవి పౌరుషేయాలు. అవి పురుషబుద్ధిలోంచి వచ్చాయి. అందువల్ల ఇక్కడ వేదపారాయణాన్ని కీర్తిస్తున్నది ఉపనిషత్తు.

ఇక్కడ ఉపనిషత్తు ఒక విషయాన్ని ఎత్తిచూపుతోంది. ఎవరికైనా వేదపారాయణం చేయాలని ఉంటే, అతనికి వేదమంత్రాలను ఎలా ఉచ్చరించాలో తెలిసివుండాలి అంటున్నది.

వేదమంత్రాలను ఎలా పఠించాలో చెప్పటానికి అనేక నియమాలు ఉన్నాయి. ఈ నియమాలు చాలా ముఖ్యం కాబట్టి, దానికోసం ఒక ప్రత్యేక శాస్త్రమే తయారు చేయబడింది. ఈ శాస్త్రాన్ని శీక్షాశాస్త్రం అంటారు. అంటే ఒక పదాన్ని ఎలా పలకాలో అది చూపిస్తుంది.

ముండకోపనిషత్తు పరావిద్య, అపరావిద్యల గురించి పేర్కొనేటప్పుడు నాలుగు వేదాలు, ఆరు వేద అంగాలు ఉన్నాయని చెప్పింది.

**తత్ర అపరా ఋగ్వేదో యజుర్వేదః సామవేదోఽథర్వవేదః**
**శిక్షా కల్పో వ్యాకరణం నిరుక్తం ఛన్దో జ్యోతిషమితి అథ పరా యయా తదక్షరమధిగమ్యతే**
– ముండకమ్ 1.1.5

ఆ ఆరుఅంగాలు – శిక్ష, కల్పం, వ్యాకరణం, నిరుక్తం, ఛందస్సు, జ్యోతిష్యం.

శిక్షను వేదాల్లో శీక్షా అని చూస్తాము. వేదాలు దీన్ని శీక్షా అన్నప్పుడు మనం వేదాలను తప్పు పట్టకూడదు. దాన్ని ఛాందస ప్రయోగంగా స్వీకరించాలి.

**శీక్షామ్** – శీక్షాశాస్త్రం నేర్చుకోవాలంటే, అందులో ఆరు అంశాలను నేర్చుకోవాలి. అంటే మంత్రాన్ని ఎలా ఉచ్చరించాలో నేర్చుకునేముందు ఈ ఆరు అంశాలు కూలంకషంగా తెలిసివుండాలి. శీక్షాశాస్త్రానికి మకుటాయమైన శాస్త్రం పాణినీయ శీక్షాశాస్త్రం. పాణిని మహర్షి వ్యాకరణంలో దిట్ట. ఆయన ఉచ్చారణ ఎలా చేయాలో దాన్ని వివరించారు. ఈ ఉచ్చారణను ఇంగ్లీషులో **ఫొనెటిక్స్** అంటారు.

**వ్యాఖ్యాస్యామః** – నేను ఈ శీక్షాశాస్త్రంలోని అంశాలను పేర్కొంటాను అంటున్నది ఉపనిషత్తు. అది వాటి వివరాలు ఇవ్వబోవటం లేదు. ఆ ఆరు అంశాలు – వర్ణః, స్వరః, మాత్రాః, బలమ్, సామ, సంతానః.

**ఇతి** – ఇక్కడితో ఉపనిషత్తు చెప్పిన పలుకులు అయిపోయాయి. రాసేటప్పుడు ఇన్వర్టెడ్ కామాలు పెడతాము. ఇది శ్రుతి ప్రమాణం కాబట్టి చెప్పటం ముగిసింది అనటానికి సూచనగా ఇతి అని వస్తుంది.

**ఉక్తః** – ఈ విధంగా చెప్పబడినదానిని

**శీక్షాధ్యాయః** – శీక్షాధ్యాయము అంటారు.

మనం ఈ ఆరు అంశాలను టూకీగా చూద్దాము.

1. **వర్ణః** – ప్రతి ఒక్క అక్షరంయొక్క ఉచ్చారణ నేర్పబడుతుంది. దీన్నే ఫొనెటిక్స్ అంటారని చూశాము. శరీరంలో ఏ భాగంనుంచి ఆ అక్షరం పలకాలో చూపిస్తుంది.

**అష్టౌ స్థానాని వర్ణానామ్ – ఉరః కణ్ఠః శిరస్తథా। జిహ్వామూలం చ దన్తాశ్చ నాసికోష్ఠౌ చ తాలు చ॥**

శిరస్సులోని ఎనిమిది భాగాలనుంచి ఈ అక్షరాలు పుడతాయి. ఆ భాగాన్నిబట్టి, ఆ అక్షరమాలను ఏర్చికూర్చటం జరిగింది మన దేశభాషలో.

ఇంగ్లీషు భాషలో వవల్స్ (vowels), కాన్సొనెంట్స్ (consonants) అంటారు. వవల్స్ ఎ,ఇ,ఐ,ఒ,యు (a,e,i,o,u). అవి తక్కిన అక్షరాలతో కలిసివుంటాయి ఆంగ్లంలో. మన భాషల్లో అలా కాకుండా అచ్చులు, హల్లులు అంటూ విడదీయటం జరిగింది. ఆ హల్లులను శిరస్సులోంచి అవి వచ్చే భాగాన్ని ఆధారం చేసుకుని కూర్చటం జరిగింది. వాటి స్థానాలను తెలుసుకుని అలాగే పలకాలి.

| | | |
|---|---|---|
| అ, హ, క, ఖ, గ, ఘ, ఙ | – కంఠంనుండి పుడతాయి | – కంఠవ్యాలు |
| ఇ, య, శ, చ, ఛ, జ, ఝ, ఞ | – దవడలనుంచి పుడతాయి | – తాలవ్యాలు |
| ఋ, ర, ష, ట, ఠ, డ, ఢ, ణ | – నాలుక పైన ఉన్న అంగుటి మధ్యభాగాన్ని స్పృశించటంవల్ల పుడతాయి | – మూర్ధన్యాలు |
| ల,స,త, థ, ద, ధ, న | – నాలుక దంతంయొక్క మొనను స్పృశించటంవల్ల పుడతాయి | – దంతవ్యాలు |
| ఉ, ప, ఫ, బ, భ, మ | – రెండు పెదాల కలయిక వల్ల పుడతాయి | – ఓష్ఠ్యాలు |
| క, చ, ట, త, ప | – వీటికి ఎక్కువ వాయువు | |
| గ,జ,డ,ద,బ,య,వ,ర,ల | అవసరం లేదు | – అల్పప్రాణాలు |
| ఖ, ఘ, ఛ, ఝ, | వీటికి ఎక్కువ | |
| ఠ, ఢ, థ, ధ, హ,శ, ష,స | – వాయువు కావాలి | – మహాప్రాణాలు |

పలికేటప్పుడు 'భ' అనే చోట బ అనకూడదు. చాలామంది భారతం అనటానికి బారతం అంటారు. అలా పలకకూడదు. కొంతమంది కొన్ని అక్షరాలను పలకలేరు. ఉదాహరణకు వంగదేశస్థులకు 'వ' పలకదు. దానికి బదులుగా 'బ' వాడతారు. రవీంద్రనాథ్ టాగూర్‌ను రబీంద్రనాథ్ టాగూర్ అంటారు. వివాహభోజనంబు వింతైన వంటకంబు వియ్యాలవారి విందు అనాలంటే బిబాహ భోజనంబు బింతైన బంటకంబు బియ్యాలబారి బిందు అంటారు. అక్షరాలు ఎలా పలకాలో అలాగే పలకాలి. దాన్ని అక్షరశుద్ధి అంటారు.

2. **స్వరః** – వేదపారాయణంలో స్వరం చాలా ముఖ్యమైనది. వేదం అపౌరుషేయం. ఇది కర్ణపరంపరగా ఈ రోజువరకు కాపాడబడింది అంటే స్వరమే కారణం. స్వరం అంటే పారాయణం చేసేటప్పుడు స్థాయీ భేదం పాటించడం.

మొదటిది ఉచ్చస్థాయిలో పలికే స్వరం. దీనిని స్వరితం అంటారు. స్వరితం వచ్చే అక్షరాలపైన ' । ' గుర్తు ఉంటుంది.

రెండవది కిందస్థాయిలో పలికే స్వరం – అనుదాత్తం అంటారు. అనుదాత్తం వచ్చే అక్షరాల కింద ' – ' గుర్తు ఉంటుంది.

మూడవది దీర్ఘస్వరితం: అక్షరాన్ని దీర్ఘంగా రెండు మాత్రలకాలం పలకాలి. దీర్ఘస్వరితం వచ్చే అక్షరాలపైన ' ॥ ' గుర్తు ఉంటుంది.

నాలుగవది ఉదాత్తం: ఇది ఏ గుర్తు లేకుండా సాధారణమైన అక్షరం. దీనిని పైస్థాయి, క్రిందస్థాయి కాకుండా మామూలుగా పలకాలి. ఇప్పటి సంప్రదాయం బట్టి ఉదాత్త, అనుదాత్త, స్వరిత, దీర్ఘస్వరితాలు ఇలా ఉన్నాయి. అయితే వ్యాకరణ పితామహ పాణిని తన సూత్రాలలో ఉచ్చైరుదాత్తః, నీచైరనుదాత్తః, సమాహారః స్వరితః అని చెప్పారు.

స్వరనిర్వచనంలో అనేక రకాల వైవిధ్యాలు ఉన్నాయి. (శుకబ్రహ్మాశ్రమ పీఠాధిపతులు, శ్రీ విద్యాస్వరూపానందగిరి స్వామి రచించిన **వేదసదస్సు** అనే పుస్తకంలో ఈ విషయం చాలా వివరంగా ఉంది. ఔత్సాహికులు చదివి తెలుసుకొనగలరు.)

స్వరాలను గుర్తించి పలకడం స్వరశుద్ధి. వేదపఠనంలో దైవప్రీతి స్వరశుద్ధివల్లే కలుగుతుంది.

స్వరాన్ని సరిగ్గా పలకాలి. సరిగ్గా పలకకపోతే అర్థం మారిపోయి, అనర్థాలు కలిగే ప్రమాదముంది. అది నిరూపించటానికి వేదమే ఒక కథ చెబుతుంది.

ఒకప్పుడు దేవతలకు ఒక పురోహితుడు ఉండేవాడు. అతని పేరు విశ్వరూపుడు. అవటానికి ఆయన దేవతలకు పురోహితుడే అయినా, దేవతలకు బద్ధశత్రువులైన అసురులమీద ఆయనకు కనబడని అభిమానం ఉండేది. దేవతల కొలువులో ఉంటూ, రాక్షసులను అభిమానించేవాడు. ఇదెలాగో తెలిసిన ఇంద్రుడు ఈ విశ్వరూపుణ్ణి హతమార్చాడు.

ఈ వార్త విన్న విశ్వరూపుని తండ్రికి సహజంగానే ఇంద్రునిమీద చాలా కోపం వచ్చింది. విశ్వరూపుని తండ్రిపేరు త్వష్టుడు. త్వష్టుడు ఎలాగైనా ఇంద్రునిమీద పగ తీర్చుకోవాలనుకున్నాడు. పగ అనేదే చాలా హానికరమైన భావోద్రేకం. ఈ ద్వేషం ఎవరిలోనైనా ఎంతగా ఉంటుందంటే, ఎవరినీ ప్రత్యక్షంగా హాని చేయలేకపోయినా, వారికి ఏదైనా చెడు జరిగితే బాగా జరిగిందని ఆనందిస్తారు చాలామంది.

ఇక్కడ త్వష్టుడు చేతులు ముడుచుకుని కూర్చోదలుచుకోలేదు. ఇంద్రుణ్ణి హతమార్చటానికి తనకింకొక పుత్రుడు కావాలనుకున్నాడు. అందువల్ల ఇంకొక పుత్రుడు పుట్టటంకోసం ఒక యాగం చేశాడు. అలాగే పుత్రుడు పుట్టాడు. అతని పేరు వృత్రాసురుడు. అతన్ని కోరిందే ఇంద్రుణ్ణి చంపటంకోసం. అందువల్ల త్వష్టుడు ఇలా ప్రార్థన చేశాడు, 'నాకు వృత్ర అనే

కొడుకు కావాలి. అతను ఇంద్రసంహారి అవాలి.' సంస్కృతంలో ఆ పదాన్ని ఇంద్రశత్రుః అంటారు. అంటే ఇంద్రుణ్ణి సంహరించాలి.

కాని నిజానికి ఏం జరిగింది? వృత్రుడు ఇంద్రుణ్ణి సంహరించేబదులు, ఇంద్రుడే వృత్రుణ్ణి సంహరించాడు. అంటే పరిస్థితి తారుమారయింది. తను ఇంత ప్రత్యేకించి చేసిన యాగం అలా ఎందుకు బెడిసికొట్టిందో అర్థం కాలేదు త్వష్టునికి. విచారణ చేయగా అసలు విషయం తెలిసింది.

అతను వాడిన పదం **ఇంద్రశత్రువు**. అది సరియైనదే. కాని స్వరభేదం రావటంవల్ల అర్థం మారిపోయింది. ఆ పదం తత్పురుష సమాసం అవటానికి బదులుగా, బహువ్రీహి సమాసంగా మారుతుంది. స్వరం పలకటంలోని స్థాయీభేదాలవల్ల ఈ సమాస భేదాలు వస్తాయి.

దానివల్ల మారిన అర్థం ఏమిటి? ఇంద్రశత్రువు పదాన్ని తత్పురుష సమాసంగా చూస్తే – వృత్ర – ఇంద్రుణ్ణి సంహరించేవాడు అని అర్థం వస్తుంది. కాని త్వష్టుడు దాన్ని తప్పుగా పలకటంవల్ల బహువ్రీహి సమాసంగా వచ్చింది. దాని ప్రకారం ఇంద్రశత్రువు అంటే ఇంద్రుడు సంహరించేవాడుగా కలవాడు వృత్రుడు అని అర్థం వస్తుంది. అంటే ఇంద్రునిచే సంహరించబడే కొడుకు కావాలి అని కోరి ప్రార్థన చేసినట్టు అయింది. అలా స్వరభేదంవల్ల అతని ప్రయత్నమంతా బూడిదలో పోసిన పన్నీరైంది.

అలాగే కుంభకర్ణుని కథ చెబుతారు రామాయణంలో. కుంభకర్ణుడు **నిర్దేవత్వమ్** కోరితే, అతని స్వరం సరిగ్గా పలకక **నిద్రావత్వమ్** అని అర్థం వచ్చింది. దేవతలు లేకుండా చేయాలని అతను చూస్తే, నిద్రాదేవి కౌగిలిలో ఇరుక్కుపోయే ఫలం లభించింది అతనికి.

అందువల్ల మీరు పారాయణం చేసే వేదమంత్రాలను సరిగ్గా పలకకపోతే, మీరు చేసే పారాయణంవల్ల ప్రతికూల ఫలితం వచ్చే ప్రమాదం ఉంది. అందువల్లనే మన సాంప్రదాయంలో వేదమంత్రాలను పదిమందిలో, గుంపులో గోవిందాగా, ఎన్నడూ నేర్పించలేదు. ఆ రోజుల్లో పుస్తకం చూసి నేర్చుకునే ప్రశ్నే లేదు. అది కర్ణపరంపరగా రావాల్సిందే!

మరయితే పారాయణం చేయటం ఎలా? వేదమంత్రాల జోలికి పోకుండా, వేరే మంత్రాలు నేర్చుకోవచ్చు. వేదమంత్రాలు ప్రత్యేకించి బ్రహ్మచారులు నేర్చుకుంటారు. వారు కొన్ని సంవత్సరాలు గురుకులవాసం చేసి ఒక క్రమపద్ధతిలో వేదాధ్యయనం చేస్తారు. అందువల్ల మామూలు మనుష్యులు వేదమంత్రాలను పఠించకుండా, ఏవైనా సహస్రనామాలను లేదా భగవద్గీతను పఠించవచ్చు. వేదమంత్రాలు పఠించాలంటే, ఒక గురువు వద్ద కొన్ని సంవత్సరాలు

అధ్యయనం చేసి, తప్పులుపోతే ఆయన చేత దిద్దించుకుని అప్పుడు పఠించాలి. నలుగురిలో నారాయణగా నేర్చుకుంటే, మీరేమైనా తప్పులు పలికినా అవి గుంపులో కలిసిపోతాయి. గురువు దిద్దటం కష్టమవుతుంది.

ఉదాహరణకు ప్రతి శాంతిమంత్రం తర్వాత ఓం శాంతిః శాంతిః శాంతిః పలుకుతాము. కాని అది పలికే విధానంలో కూడా భేదం ఉంది. ఒకచోట శాంతిలోని **తి** కిందికి పలికితే, మరొకచోట **తి** మామూలుగా పలకాలి. ఈ భేదాలను ముఖ్యంగా కామ్యకర్మలకు పాటించాలి. అంటే ఏదైనా కోరిక కోరి చేస్తే, స్వరాలు సరిగ్గా పలకాలి.

ఆ విధంగా స్వరాల్లో మూడు స్థాయీభేదాలు ఉన్నాయి. అవి స్వరితం, ఉదాత్తం, అనుదాత్తం – ఉచ్చస్థాయి, మధ్యస్థాయి, క్రిందస్థాయిలు వరుసగా. ఈ భేదాలను సరిగ్గా పాటించాలి. దీన్ని స్వరశుద్ధి అంటారు.

3. **మాత్రాః** – ఒక అచ్చుని పలికే కాలం. హల్లులకు ఒకటే నిడివి ఉంటుంది. అందువల్ల వీటిని అర్ధమాత్ర అంటారు. మాత్రలో కూడా మూడు కాలభేదాలు ఉన్నాయి.

| | | |
|---|---|---|
| **హ్రస్వాలు** | – పొట్టి అక్షరాలు | – అ, ఇ |
| **దీర్ఘాలు** | – పొడుగు అక్షరాలు | – ఆ, ఈ |
| **ప్లుతం** | – దీర్ఘాలకన్నా దీర్ఘమైనది | – హరిః **ఓ 3 మ్** |

హ్రస్వం ఒక చిటికకాలం ఉచ్ఛరించాలి; దీర్ఘం రెండు చిటికల కాలం ఉచ్ఛరించాలి. అర్ధమాత్రకు అర్ధచిటిక కాలం చాలు. ఉదా॥ మ్. ప్లుతానికి అక్షరం పక్కన 3 లేదా 4 సంఖ్య ఉంటుంది. ఎంత సంఖ్య ఉంటే అన్ని చిటికల కాలం ప్లుతం ఉచ్చరించాలి. ఈ ఉపనిషత్తులోనే ప్లుతాన్ని చూస్తాము.

**హా** 3 **వు హా** 3 **వు హా** 3 **వు** – భృగువల్లీ

ప్రతి అక్షరాన్ని పలికే కాలాన్ని సరిగ్గా పాటించాలి. మీకు ఇష్టమైనట్లు పలుకకూడదు. దీన్ని **మాత్రాశుద్ధి** అంటారు.

4. **బలమ్** – ఒక అక్షరాన్ని ఎంత బలం ఉపయోగించి పలకాలో తెలియజెప్పేది బలం. కొన్ని అక్షరాలను తేలిగ్గా పలకగలిగితే, కొన్నిటికి కొంచెం బలం ఉపయోగించాలి. ఉదాహరణకు **క** అక్షరాన్ని తేలిగ్గా పలికితే, **ఖ** అక్షరాన్ని కొంచెం బలంగా పలకాలి. అలా క,చ,ట,త,పలు తేలిగా పలికితే, ఖ,ఛ,ఠ,థ,ధ,ఫలు బలంగా పలకాలి. ఏది ఎలా పలకాలో అలాగే పలకాలి. వీటిని రెండు భాగాలుగా విభజిస్తారు. నోటితో పలికేవాటిని అభ్యంతర ప్రయత్నం అంటే, గొంతుతో పలికేవాటిని బాహ్యప్రయత్నం అంటారు. మళ్ళీ నోటితో పలికేవాటిలో 5 రకాలు, గొంతుతో పలికేవాటిలో 11 రకాలు ఉన్నాయి.

**అభ్యంతర ప్రయత్నః పంచధా**
**బాహ్య ప్రయత్నః ఏకాదశధా**

ఏ అక్షరం ఎలా పలకాలో దాన్ని లోతుగా విశ్లేషించారు శాస్త్రజ్ఞులు. ఆ మాటకొస్తే ఏ శాస్త్రం అయినా దాని లోతులు కొలిచినకొద్దీ, కొత్త అంశాలు వస్తూనే ఉంటాయి.

ఆ విధంగా ఏ అక్షరాన్ని ఎంత బలంతో పలకాలో తెలుసుకోవాలి.

5. **సామ** – ఏ వేగంతో వేదపఠనం చెయ్యాలో చెప్పేది సామ. మరీ నిదానంగానూ పఠించకూడదు; మరీ వేగంగానూ పఠించకూడదు. వేగంగా పఠిస్తే అక్షరాలను స్పష్టంగా, విడివిడిగా పలకలేరు. అందువల్ల సామ అంటే మధ్యరకంగా ఉండాలి అంటారు. అంటే మరీ నిదానంగా ఉండకూడదు, మరీ వేగంగానూ ఉండకూడదు. దానికి కూడా కొన్ని నియమాలు ఉన్నాయి. ప్రతి నియమమూ ఒక శ్లోకం రూపంలో వస్తుంది, గుర్తుండటానికి వీలుగా –

**అభ్యాసార్థే దృతాం వృత్తిమ్ ప్రయోగార్థే తు మధ్యమామ్।**
**శిష్యాణామ్ ఉపదేశార్థే కుర్యాత్ వృత్తిమ్ విలంబితామ్॥** – నారదీయ శిక్షా 6.21

మన సాంప్రదాయంలో శాస్త్రాన్ని కంఠతా పట్టేవారు బ్రహ్మచారులు. ఇప్పుడు కొంతమంది నాకు రుద్రం వచ్చు అంటారు కాని పారాయణ చేయమంటే పుస్తకం చూడకుండా చేయలేరు. పుస్తకం చూసిచేస్తే అది పారాయణంలోకి రాదు. పూర్వం శిష్యులు విని నేర్చుకునేవారు. వారు గుర్తుండిపోయేలా నేర్చుకోవాలంటే, గురువుద్వారానే నేర్చుకోవాలి.

గురువుద్వారా నేర్చుకున్నాక, ప్రతిరోజూ క్రమం తప్పకుండా పఠించకపోతే మర్చిపోతారు. మీరు చేయాల్సిన పంచమహాయజ్ఞాలలో బ్రహ్మయజ్ఞం ఒకటి. బ్రహ్మయజ్ఞం అంటే వేదపారాయణం చేయటం. అందువల్ల భిన్న సందర్భాల్లో భిన్నరీతుల్లో పఠిస్తారని పైన చెప్పిన శ్లోకంయొక్క అర్థం.

శిష్యుడు తన అభ్యాసంకోసం వేదమంత్రాలను పఠిస్తున్నప్పుడు త్వరగా చదవవచ్చు. కాని అదే మంత్రాలను ఒక యజ్ఞానికో, పూజకో, సంధ్యావందనానికో చేస్తుంటే మాత్రం మధ్యరకంగా ఉండాలి. అంటే మరీ నిదానంగా కాదు, మరీ వేగంగా కాదు. అందులోని ప్రతి అక్షరమూ స్పష్టంగా తెలిసేలా పలకాలి. అవే మంత్రాలను ఒక శిష్యునికి గురువు బోధిస్తున్నప్పుడు చాలా నిదానంగా బోధించాలి. గురువు చెప్పే ప్రతి అక్షరమూ శిష్యుడు వినగలగాలి.

అందువల్ల సామ అంటే సామవేదం కాదు, వేదమంత్రాలు చదివే వేగం.

6. **సంతానః** – పదాలు, అక్షరాలను కలిపే విధానం. మంత్రాలను పఠించేటప్పుడు మీకు ఇష్టం వచ్చినచోట వాటిని విడదీయకూడదు. దానికి కూడా అనేక సూత్రాలు ఉంటాయి.

**అఖండమండలాకారం వ్యాప్తం యేన చరాచరమ్**

గురుస్తోత్రంలో వచ్చే ఈ పాదంలో అఖండమండలాకారం ఒక పదం; వ్యాప్తం ఒక పదం; చరాచరమ్ ఇంకొక పదం. వీటి మధ్య ఆపి పలకవచ్చు. కాని ఈ క్రింది పాదం చూడండి.

**అనేకజన్మసంప్రాప్తకర్మబంధవిదాహినే**

ఇదంతా కలిపి ఒకటే పదం. దీన్ని విడదీయకూడదు. బోధించేటప్పుడు శిష్యులు నేర్చుకోవటానికి వీలుగా సంప్రాప్త దగ్గర విడదీసినా, అది నేర్చుకున్నాక కలిపి పఠించాలి. దీన్ని సంహిత లేదా సంధి అంటారు. ఇక్కడ సంతానం అంటున్నది ఉపనిషత్తు.

రెండు పదాల మధ్య సంధి చేసినప్పుడు కొన్ని మార్పులు జరుగుతాయి. ఈ మార్పులు ప్రత్యేకంగా సంస్కృతంలోనే చూస్తాము. ఉదాహరణకు ఇందులోనే మొదటి అనువాకంలో చూసిన శాంతిపాఠాన్ని తీసుకోండి.

**శం నో మిత్రః శం వరుణః**

ఇందులో మూడు పదాలు ఉన్నాయి. శం+నః+మిత్ర. వీటిని కలిపేటప్పుడు నః నో గా మారింది. దానికి అనేక సంధిసూత్రాలు ఉన్నాయి. అవికూడా అచ్చులకు సంధిసూత్రాలు, హల్లులకు సంధిసూత్రాలు, విసర్గకు సంధిసూత్రాలు ఉన్నాయి. కొన్ని సాధారణ సూత్రాలు ఉంటే, కొన్ని అసాధారణ సూత్రాలు ఉంటాయి. అంతేకాదు అసాధారణ సూత్రాలకు అసాధారణ సూత్రాలు కూడా ఉంటాయి. ఉదాహరణకు –

మిత్రః + శం = మిత్రశ్శం
నమః + బ్రహ్మణే = నమో బ్రహ్మణే
నమః + తే = నమస్తే

నిజానికి పదాలను కలిపే సంధిసూత్రాలు మనం నేర్చుకోవాలి కాని, ఆ సూత్రాలు తెలిసిన గురువు ఎలా పలికితే అలా పలుకుతాము. అప్పుడు పొరపాటు దొర్లదు. అందువల్ల గురువుద్వారా నేర్చుకోవటం చాలా అవసరం.

ఈ విధంగా వేదపారాయణం చేయాలంటే ఆరు నియమాలను పాటించాలి. అవి వర్ణః, స్వరః, మాత్రాః, బలమ్, సామ, సంతానః. అందువల్ల వేదాధ్యయనం అంటే ఆషామాషీ వ్యవహారం కాదు. పైగా అది మనం సరిగ్గా నేర్చుకోకపోతే ముందు తరాలకు కూడా ఈ పొరపాట్లనే భద్రంగా అందజేసే ప్రమాదం ఉంది. అందువల్ల వేదాలను నేర్చుకోవాలంటే,

పుస్తకాలను చూసి నేర్చుకోకూడదు. ఒక క్రమపద్ధతిలో గురువు వద్ద నేర్చుకోవాలి. ఏదో వేదాలను మరుగున పడకుండా చేస్తున్నాము అనుకుంటే పొరపాటే. వాటికి సేవ చేయబోయి, హాని చేయటం అవుతుంది.

అందువల్ల చిత్తశుద్ధి కావాలనుకుంటే, వేదమంత్రాల జోలికి వెళ్ళకుండా తక్కిన మంత్రాలు నేర్చుకుంటే మంచిది. అంతగా పిల్లలకు నేర్పించాలనుకుంటే వారికి భగవద్గీత నేర్పించవచ్చు, గురుస్తోత్రం నేర్పించవచ్చు. అందువల్ల తైత్తిరీయోపనిషత్తు ఓం ప్రథమంగానే ఒక హెచ్చరిక చేస్తున్నది. నేర్చుకుంటే సరిగ్గా నేర్చుకోండి, లేదా అసలు నేర్చుకోకండి అంటున్నది.

ఇలా నేర్చుకుంటే సరిగ్గా నేర్చుకోవాలి, లేదా అసలు నేర్చుకోకూడదు అని ఎందుకంటున్నదో దానికి శంకరాచార్యులవారు రెండు కారణాలను చెబుతారు.

1. **వేదాధ్యయనం** – వేదాధ్యయనం లేదా వేదపారాయణం చేస్తే పుణ్యం వస్తుంది. దాన్ని అదృష్టఫలం అంటారు. అది కంటికి కనబడని ఫలం. వేదమంత్రాల అర్థం తెలియకపోయినా, వాటిని సరిగ్గా పఠిస్తే పుణ్యం వస్తుంది. అంతేకాదు, వేదాధ్యయనం బ్రహ్మయజ్ఞంలోకి వస్తుంది కాబట్టి చిత్తశుద్ధి కూడా కలుగుతుంది. చిత్తశుద్ధి జ్ఞానయోగ్యతాప్రాప్తిని ఇస్తుంది.

2. **వేదమీమాంస** – ముందు వేదమంత్రాల పారాయణం చేశాక, వేదాల అర్థాన్ని తర్వాత నేర్చుకుంటారు. వేదాల అర్థాన్ని తెలుసుకోవటాన్ని వేదమీమాంస అంటారు. మీమాంస అంటే గౌరవపూరితమైన విచారణ. ఈ మీమాంస పదాన్ని ఒక్క వైదిక విచారణకు మాత్రమే వాడాలి. మరి ఇతర విషయాలకు వాడకూడదు. ఈ మీమాంసను రెండు తెగలుగా విభజించవచ్చు.

ఎ) **పూర్వమీమాంస** – వేదపూర్వభాగాన్ని విచారణ చేయటానికి వాడతారు. వేదపూర్వభాగాన్ని కర్మకాండ అంటారు కాబట్టి, దీన్ని కర్మకాండ విచారః అని కూడా అంటారు.

బి) **ఉత్తరమీమాంస** – వేద అంతభాగాన్ని విచారణ చేయటానికి వాడతారు. వేద అంతభాగాన్ని జ్ఞానకాండ అంటారు కాబట్టి, దీన్ని జ్ఞానకాండ విచారః అని కూడా అంటారు. మంత్రాలు తెలిస్తేనే ఆ మంత్రాలకు అర్థాలను తెలుసుకోవచ్చు.

ఆ విధంగా వేదవిచారణ చేయటంద్వారా కర్మజ్ఞానమూ, బ్రహ్మజ్ఞానమూ కూడా కలుగుతాయి. జ్ఞానం దృష్టఫలంలోకి వస్తుంది. ఎందుకంటే మనకు జ్ఞానం కలిగిందో లేదో స్పష్టంగా తెలుస్తుంది. పుణ్యం అదృష్టఫలం అయితే, జ్ఞానం దృష్టఫలం. ఆ విధంగా వేద అధ్యయనంవల్ల అదృష్టపుణ్యఫలం కలిగితే వేదమీమాంసవల్ల దృష్టజ్ఞానం కలుగుతుంది.

## అనువాకం – 3

**సహ నౌ యశః। సహ నౌ బ్రహ్మవర్చసమ్। అథాతస్సగ్ంహితాయా ఉపనిషదం వ్యాఖ్యాస్యామః। పంచస్వధికరణేషు। అధిలోకమధిజ్యౌతిషమధివిద్యమధిప్రజమధ్యాత్మమ్। తా మహాసగ్ంహితా ఇత్యాచక్షతే।**

**అథాధిలోకమ్। పృథివీ పూర్వరూపమ్। ద్యౌరుత్తరరూపమ్। ఆకాశస్సన్ధిః। వాయుస్సన్ధానమ్। ఇత్యధిలోకమ్।**

**అథాధిజ్యౌతిషమ్। అగ్నిః పూర్వరూపమ్। ఆదిత్య ఉత్తరరూపమ్। ఆపస్సన్ధిః। వైద్యుతస్సన్ధానమ్। ఇత్యధిజ్యౌతిషమ్।**

**అథాధివిద్యమ్। ఆచార్యః పూర్వరూపమ్।అంతేవాస్యుత్తర రూపమ్। విద్యా సన్ధిః। ప్రవచనగ్ం సన్ధానమ్। ఇత్యధివిద్యమ్।**

**అథాధిప్రజమ్। మాతా పూర్వరూపమ్। పితోత్తరరూపమ్। ప్రజాసన్ధిః। ప్రజననగ్ం సన్ధానమ్। ఇత్యధిప్రజమ్।**

**అథాధ్యాత్మమ్। అధరా హనుః పూర్వరూపమ్। ఉత్తరా హనురుత్తరరూపమ్। వాక్సన్ధిః। జిహ్వా సన్ధానమ్। ఇత్యధ్యాత్మమ్।**

**ఇతీమా మహాసగ్ంహితాః। య ఏవమేతా మహాసగ్ంహితా వ్యాఖ్యాతా వేద। సంధీయతే ప్రజయా పశుభిః। బ్రహ్మవర్చసేనాన్నాద్యేన సువర్గేణ లోకేన॥**

ఇంతకుముందు అనువాకంలో చెప్పిన సాధన వేదపారాయణ లేదా బ్రహ్మయజ్ఞం. ఎవరికైనా వేదం పూర్తిగా తెలియకపోతే, అతను కనీసం వేదాలసారమైన గాయత్రీ మంత్రాన్ని పఠించాలి. గాయత్రీమంత్రం కూడా తెలియకపోతే వేరే పారాయణం ఏదైనా చేయాలి. అంటే విష్ణుసహస్రనామమో, రామాయణమో పారాయణం చేయవచ్చు.

మూడవ అనువాకం చాలా పెద్దది. అందువల్ల మనం అర్థం చేసుకునేందుకు వీలుగా దాన్ని చిన్న భాగాలుగా విడగొడదాము.

శీక్షావల్లీలో పంచమహాయజ్ఞాలతో కూడిన కాయిక సాధనలు; జపం, పారాయణాలతో కూడిన వాచిక సాధనలు; ఐదు ఉపాసనలతో కూడిన మానసిక సాధనలు ఉన్నాయని చూశాము. ఈ ఉపాసనలు వేరు, నిదిధ్యాసనం వేరు. ఉపాసన జ్ఞానం పొందకముందు జ్ఞానయోగ్యతాప్రాప్తికోసం చేస్తే, నిదిధ్యాసనం జ్ఞానం పొందాక ఆ జ్ఞాననిష్ఠలో నిలబడటానికి చేస్తారు. ఇది ఉపాసనభాగం కాబట్టి ఇక్కడ నిదిధ్యాసనం రాదు.

ఇందులో మొదటి ఉపాసనను పరిచయం చేస్తున్నది ఉపనిషత్తు. దాన్ని సంహితోపాసన అంటారు. అది పూర్తిగా సాంకేతికపరంగా, సాంప్రదాయపద్ధతిగా ఉంటుంది. అసలు

ఈ ఉపాసనలు చేయగలమా అని కూడా అనిపిస్తుంది. ఎందుకంటే వీటికన్నా వేదాంతం నేర్చుకోవటం సులభం అనిపిస్తుంది కూడా. అసలు నేటి కాలమాన పరిస్థితుల్లో ఈ ఉపాసనలు తెరమరుగైపోయాయి. వీటిని కేవలం నేర్చుకోవాలనే ఉద్దేశ్యంకోసం నేర్చుకోవాలి తప్పితే, ఇప్పుడు చేయలేము. ఇప్పుడు వాటి స్థానంలో పురాణాల్లో చెప్పబడ్డ వేరే ఉపాసనలు చోటు చేసుకున్నాయి. అవి ఇష్టదైవంమీద ఉపాసనలు.

ఈ ఉపాసన చాలా పవిత్రమైనదిగా భావిస్తారు గురుశిష్యులిద్దరూ. అందువల్ల ఈ ఉపాసన శిష్యుడు చేసే ఇంకొక ప్రార్థనతో మొదలవుతుంది.

**సహ నౌ యశః। సహ నౌ బ్రహ్మవర్చసమ్।**

**సహ నౌ యశః** – శిష్యుడు, 'నేను, నా గురువు ఇద్దరం సమాజంలో మంచి కీర్తిప్రతిష్ఠలు పొందుగాక!' అని ప్రార్థిస్తున్నాడు. ఎంత అద్భుతమైన ప్రార్థన.

**సహ నౌ బ్రహ్మవర్చసమ్** – జ్ఞానంతో పాటు, 'మా ఇద్దరికీ బ్రహ్మతేజస్సు ఉండుగాక!' అని కూడా ప్రార్థన చేస్తున్నాడు శిష్యుడు. మతపరమైన, ఆధ్యాత్మికమైన జీవితం గడిపినవారి ముఖంలో వారివైపు నలుగురు ఆకర్షింపబడేలా ఒక విధమైన తేజస్సు ఉంటుంది. దాన్నే బ్రహ్మవర్చస్సు అంటారు.

వేదాంతం అభ్యసించే వ్యక్తికి ఇలా పేరుప్రఖ్యాతులు రావాలని కాని, నలుగురూ గుర్తించేలా బ్రహ్మవర్చస్సు ఉండాలనే కోరిక కాని ఉండకూడదు. మరి అయితే, ఈ శిష్యుడు వీటిని ఎందుకు కోరుతున్నాడు? ఈ బ్రహ్మవిద్య గురుశిష్యుల పరంపరగా అనాదిగా వస్తున్నది. అందువల్ల శిష్యుడు ఆ విద్యను అందుకోవటంతో అతని బాధ్యత తీరిపోదు. తను గురువుగా మారి, మళ్ళీ శిష్యులకు బోధించాలి. అంటే తన తర్వాత వచ్చే తరాన్ని తన నడవడికతోను, తన బోధతోను తీర్చిదిద్దాలి. ఇలా ముందు తరాలని తీర్చిదిద్దే గురుతరమైన బాధ్యతను శాస్త్రం బ్రాహ్మణశిష్యుల భుజస్కంధాలపై వేసింది.

బ్రాహ్మణశిష్యుడు ఆరు ధర్మాలు పాటించాలి. అవి పఠనం–పాఠనం; యజనం–యాజనం; పరిగ్రహం–దానం. అంటే ఒక బ్రాహ్మణశిష్యుడు వేదాన్ని తను అధ్యయనం చేయాలి, ఇంకొకరిచేత అధ్యయనం చేయించాలి; తను యజ్ఞం చేయాలి, ఇంకొకరిచేత యజ్ఞం చేయించాలి; తను దానం స్వీకరించాలి, ఇంకొకరికి దానం ఇవ్వాలి. కాని క్షత్రియుడు మూడు ధర్మాలనే నిర్వర్తించగలడు. అతను పఠనం మాత్రమే చేయగలడు, పాఠనం చేయలేడు; యజనం మాత్రమే చేయగలడు, యాజనం చేయలేడు; దానం మాత్రమే ఇవ్వగలడు, దానం స్వీకరించలేడు.

బ్రాహ్మణశిష్యుడు ఋషులు అందజేసిన శ్రుతులను నేర్చుకుంటాడు. తనకు ప్రత్యక్షంగా విద్యనేర్పిన గురువుకే కాక, ఇంత పవిత్రమైన శాస్త్రాన్ని కర్ణపరంపరగా అందజేసిన ఋషులకు

కూడా ఋణపడివుంటాడు. ఆ ఋణం ఎలా తీర్చుకోవాలి? తను మరో పదిమందికి విద్యను బోధించటంద్వారా తీర్చుకోవాలి. తనకి విద్య బోధించే ప్రజ్ఞాపాటవాలు లేకపోతే, వేదపాఠశాలలకు ఆర్థికంగా సహాయం అందించవచ్చు.

విద్య బోధించే ఉత్సాహం ఉన్న విద్యార్థికి శ్రద్ధ ఉన్న విద్యార్థులు కావాలి అనిపించటం సహజం. అలా తెలివైన విద్యార్థులు వందలకొద్దీ తన దగ్గరకు రావాలంటే, తన కీర్తిప్రతిష్ఠలు నలుదిశలా వ్యాపించాలి. ఎంత అద్భుతమైన భావన! ఈ వాక్యంయొక్క లోతులు కొలిచినకొద్దీ మన సాంప్రదాయం ఎంత మేలైనదో తెలుస్తుంది. ఇక్కడ విద్యార్థి తన ప్రార్థనలో తన గురువును కూడా కలుపుకుంటున్నాడు.

**3 ఉపాసన– అనువాకాలు 3–8**

**అథాతస్సగ్ంహితాయా ఉపనిషదం వ్యాఖ్యాస్యామః। పంచస్వధికరణేషు।**
**అధిలోకమధిజ్యౌతిషమధివిద్యమధిప్రజమధ్యాత్మమ్। తా మహాసగ్ంహితా ఇత్యాచక్షతే।**

**ఉపాసన 1. సంహితోపాసన – అనువాకం 3** – ఇప్పుడు మొదటి ఉపాసనను పరిచయం చేస్తున్నది ఉపనిషత్తు.

**అథ** – దాని తరువాత,

**సగ్ంహితాయా ఉపనిషదం వ్యాఖ్యాస్యామః** – సగ్ంహితా అంటే సంహితా. ఇది శీక్షాశాస్త్రంలో ఒక సూత్రం. 'ం' తర్వాత శ, ష, స, హ, ర అక్షరాలు వస్తే అది 'గ్ం' అవుతుంది. ఇక్కడ ఉపనిషదం అంటే ఉపాసన. వ్యాఖ్యాస్యామః అంటే మేము బోధించబోతున్నాము. మొత్తం వాక్యంయొక్క అర్థం చూస్తే, ఉపనిషత్తు చెబుతున్నది – 'మేము సంహితా ఉపాసనను బోధించబోతున్నాము.'

సంహితోపాసన అంటే ఏమిటి? ఏ ఉపాసన చేయాలన్నా కూడా రెండు అంశాలు ఉండాలి. అవి ఉపాసన విషయం, ఉపాసన–ఆలంబనం. ఉదాహరణకు మన దేశంమీద ఉపాసన చేయాలనుకుంటే, అది ఉపాసన విషయం అవుతుంది. దేశం మొత్తానికి ఉపాసన చేయలేము కాబట్టి, జాతీయజెండాని దేశానికి ప్రతీకగా తీసుకుంటాము. దాన్ని ఉపాసన–ఆలంబనం అంటారు. ఆలంబనం కంటికి కనిపించేది అయితే, విషయం కంటికి కనబడదు. ఉదాహరణకు శివుడు ఉపాసన విషయం, శివలింగం ఆలంబనం; వినాయకుడు ఉపాసన విషయం, పసుపుముద్ద ఆలంబనం; సరస్వతీదేవి ఉపాసన విషయం, పుస్తకం ఆలంబనం.

ఇప్పుడు మనం చూడబోయే ఉపాసనలో ఆలంబనం సంహిత. సంహిత అంటే సంధి. సంధి అంటే రెండు పదాలను కలపటం. ఏ భాషలోనైనా ఈ పదాలను కలపటానికి అనేక సంధిసూత్రాలు ఉంటాయి. సంస్కృతంలో అయితే కొన్ని సంధులకు అనేక సూత్రాలు

ఉంటాయి. మనం మొదటి అనువాకంలోనే ఒక సంధి ఎలా వచ్చిందో చూశాము. శం+నః కలిపితే శంనో అయిందని చూశాము. ఇక్కడ కూడా సగ్ంహితాయా ఉపనిషదం పదాన్ని విడదీస్తే – సగ్ంహితాయాః + ఉపనిషదమ్ అవుతుంది. ఈ రెండు పదాలనూ కలిపినప్పుడు విసర్గ పోతుంది.

ఈ ఉపాసనలో అక్షరాలను కలిపే విధానంలో నాలుగు అంశాలను తీసుకుంటాము. దీనికి ఒక ఉదాహరణ చూద్దాము. గుణసంధి అందరికీ తెలిసిందే. అందులో అ+ఇ=ఏ అని వస్తుంది.

దేవ + ఇంద్ర = దేవేంద్ర

వ (వ లోని అ) పూర్వరూపం; ఇ ఉత్తర రూపం; + సంధి; కొత్తగా వచ్చిన వే (వే లోని ఏ) సంధానం. పూర్వరూపం, ఉత్తరరూపం, సంధి, సంధానం ఈ నాలుగూ నాలుగు ఆలంబనలు. ఈ నాలుగు ఆలంబనలమీద ఐదు రకాల ఉపాస్య వస్తువులను ఊహించుకుని ఉపాసన చేయాలి.

ఈ విషయాన్ని అర్థం చేసుకోవటానికి ఒక లౌకిక ఉదాహరణ తీసుకుందాము. ఒక సంస్థ 20 మందిని గౌరవిద్దామనుకుంది. దానికోసం ఐదు రంగాలను ఎన్నుకుంది. ఒక్కొక్క రంగంలో నలుగురు హేమాహేమీలను ఎన్నుకుంది. కాని 20 మందినీ ఒక్కసారిగా గౌరవించకుండా స్టేజీమీద నాలుగు కుర్చీలు వేసింది. ముందు క్రీడారంగం అంది. ఆ క్రీడారంగంలో నిష్ణాతులు అయినవారిలో నలుగురిని స్టేజీమీదకు పిలిచింది. ఉదాహరణకు చదరంగ నిపుణులు విశ్వనాథన్ ఆనంద్‌ను; క్రికెట్‌లో పేరెన్నికగన్న సచిన్ టెండూల్కర్‌ను; టెన్నిస్ ఛాంపియన్ రోజర్ ఫెదరర్‌ను; బాస్కెట్‌బాల్ ప్రావీణ్యుడు మైకేల్ జోర్డెన్‌ను పిలిచి సన్మానించింది. ఇది క్రీడారంగ ఉపాసన అనుకుందాము. సంహితా ఉపాసనలో ఒక ఉపాసన అయింది.

తర్వాత ఆ నలుగురినీ పంపి, ఆ కుర్చీలను అలాగే ఉంచి, సంగీతరంగంలో ఆరితేరిన కళాకారులు నలుగురిని పిలిచింది. అలా మొత్తం ఐదు రంగాలను ఎన్నుకుంది. వీటిలో కుర్చీలు ఆలంబనలు; రంగాలు ఉపాసనలు. ప్రతి ఉపాసనకు కూడా ఆలంబనలు నాలుగూ మారవు (కుర్చీలు మారనట్టుగా); కాని ఉపాస్య వస్తువులు మారతాయి. ఒక్కొక్క ఉపాసనలో 4 ఉపాస్య వస్తువులు ఉంటే; 5 ఉపాసనల్లో 4×5=20 ఉపాస్య వస్తువులు వస్తాయి.

**పంచస్వధికరణేషు** – అలా ఐదురంగాలు ఎన్నుకున్నాము అంటున్నది ఉపనిషత్తు. ఐదు అధికరణలు ఉన్నాయి. ఆ ఐదు అధికరణలు లోకానికి, జ్యోతులకు, విద్యలకు, సంతతికి, శరీరానికి సంబంధించినవి. నాలుగు ఆలంబనలు పూర్వరూపం, ఉత్తరరూపం, సంధి, సంధానం.

వివరాలలోకి వెళ్ళేముందు ఈ ఉపాసనను వేదం ఎందుకు విధించిందో చూద్దాము. వేదం అక్షరాలతో కూడిన ఇంత కష్టమైన ఉపాసనలను ఎందుకు విధించింది, దాని బదులు ఏవైనా తేలికవి సూచించవచ్చు కదా అనే సందేహం కలుగవచ్చు ఎవరికైనా! శంకరాచార్యుల వారే స్వయంగా ఆ సందేహాన్ని ప్రవేశపెట్టి, దానికి తగ్గ జవాబుని కూడా ఇచ్చారు.

ఆ రోజుల్లో బ్రహ్మచారి 8–12 సంవత్సరాలు వేదాధ్యయనం చేసేవాడు. ఆ అధ్యయనం కూడా పుస్తకం చూసి కాకుండా, విని నేర్చుకోవాలి. అందువల్ల వారికి అలా నేర్చుకోవటానికి అనేక పద్ధతులు ఉండేవి.

**పదపద్ధతి** – నమః[1] శివాయ[2] చ[3] అనే వాక్యంలో ప్రతి పదాన్ని ఆపి చదవాలి. నమః + శివాయః + చ.

**క్రమపద్ధతి** – ఒక వాక్యంలో పదాలను 1–2, 2–3, 3–4 పద్ధతిలో పఠించటం.

నమః[1] శివాయ[2]; శివాయః[2] చ[3]. ఈ పద్ధతిలో కేవలం పదాలను అమర్చటమే కాదు, దానికి సంబంధించిన వ్యాకరణం కూడా అమలు చేయాలి. క్రమపద్ధతిలో ఆరితేరిన వారిని క్రమవిత్ అంటారు.

**జటాపద్ధతి** – ఒక వాక్యంలో పదాలను 1–2, 2–1, 1–2; 2–3, 3–2, 2–3

పద్ధతిలో పఠించాలి. నమః[1] శివాయ[2], శివాయ[2] నమో[1], నమః[1] శివాయ[2]; శివాయ[2] చ[3],

చ[3] శివాయ[2], శివాయ[2] చ[3]. జటపద్ధతిలో ఆరితేరినవారిని జటావల్లభుడు అంటారు.

**ఘనపద్ధతి** – ఒక వాక్యంలో పదాలను 1–2, 2–1, 1–2–3, 3–2–1, 1–2–3; 2–3, 3–2, 2–3–4; 4–3–2, 2–3–4 పద్ధతిలో పఠిస్తారు.

ఉదా: అసలు వాక్యం – గణానాం[1] త్వా[2] గణపతిగ్ం[3] హవామహే[4]

గణానాం[1] త్వా[2], త్వా[2] గణానాం[1], గణానాం[1] త్వా[2] గణపతిం[3]; గణపతిం[3] త్వా[2] గణానాం[1]

గణానాం[1] త్వా[2] గణపతిమ్[3]; త్వాం[2] గణపతిం[3], గణపతిం[3] త్వా[2], త్వా[2] గణపతిగ్ం[3]

హవామహే[4]; హవామహే[4] గణపతిం[3] త్వా[2], త్వా[2] గణపతిగ్ం[3] హవామహే[4].

ఘనపద్ధతిలో ఆరితేరినవారిని ఘనాపాఠీ అంటారు.

ముందే చూసినట్టుగా ఆ పదాల వరుసక్రమం మారినప్పుడు సంధిసూత్రాలను కూడా పాటించాలి. ఆ విధంగా వేదాలను అధ్యయనం చేసే ప్రతి ఒక్క శిష్యునికీ వేదాలకు చెందిన ప్రతి ఒక్క అక్షరం (ప్రతి పదం మాత్రమే కాదు) కూడా అతనికి కంఠోపాఠమే! సలక్షణ ఘనాపాఠికి ఏ అక్షరానికి మూలం ఏదో, ఆ అక్షరానికి అధిష్ఠానదేవత ఏదో కూడా క్షుణ్ణంగా తెలుసు.

ఈ నేపథ్యంతో ఉపనిషత్తు చెప్పిన ఉపాసనల్లోకి వెళదాము.

**అథ** – వేదాలను అంత క్షుణ్ణంగా అధ్యయనం చేశాక, శిష్యుడు ఉపాసనకు వస్తాడు. అతని మెదడంతా వైదిక అక్షరాలతో నిండిపోయి ఉంది. ఇంకా చెప్పాలంటే అతనికి ఈ వైదిక అక్షరాలు తప్ప వేరే ప్రపంచం తెలియదు. అందువల్ల అతను ఈ సంహిత ఉపాసన తేలిగ్గా చేయగలడు అన్నారు శంకరాచార్యులవారు.

ఇప్పటితరంలో అబ్బాయిని చూడండి. ఈ అక్షరాలను ఉపాసనకు ఇస్తే అతనికి శ్రద్ధ ఉండదు. అదే అతను నిరంతరం మునిగితేలే క్రికెట్‌లోంచి ఉపాసన చేయమంటే సునాయాసంగా చేసేస్తాడు. మూడు వికెట్లను ఆలంబనంగా తీసుకుని, వాటిని త్రిమూర్తులనే ఉపాస్య వస్తువులకు ఆలంబనలు అంటే అతనికి బాగా అర్థమవుతుంది. అంటే దీని సారం ఎవరు ఏ రంగంలో నిత్యం మునిగి తేలుతుంటారో, వారికి ఆ రంగంలో ఉపాసన చేయటం వెన్నతో పెట్టిన విద్య అవుతుంది. వేదాధ్యయనం చేసే శిష్యునికి ఈ సంహితోపాసన కూడా అంతే.

**పంచస్వధికరణేషు** – ఐదు రంగాలనుంచి నాలుగు వస్తువులను తీసుకుంటుంది ఉపనిషత్తు. అధికరణం అంటే రంగాలు.

**అధిలోకమధిజ్యౌతిషమధివిద్యమధిప్రజమధ్యాత్మమ్** – ఆ ఐదురంగాలు అధిలోకమ్, అధిజ్యౌతిషమ్, అధివిద్యమ్, అధిప్రజమ్, అధ్యాత్మమ్.

అధిలోకమ్ – నాలుగు లోకాలు
అధిజ్యౌతిషమ్ – నాలుగు జ్యోతులు
అధివిద్యమ్ – నాలుగు విద్యలు
అధిప్రజమ్ – నలుగురు కుటుంబసభ్యులు
అధ్యాత్మమ్ – నాలుగు శరీర అంగాలు

ఈ ఐదు ఉపాసనలను కలిపి సంహితోపాసన అంటారు.

**తా మహాసగ్ంహితా** – ఈ ఆలంబనాలను శ్రేష్ఠమైన ఆలంబనాలు అంటారు. ఎందుకంటే వాటిమీద 20 శ్రేష్ఠమైన ఉపాస్యవస్తువులు ఉపాసన చేయబడుతున్నాయి. ఏ ఆలంబనకైనా,

దానంతట దానికి గొప్పతనం రాదు; అది స్వతహాగా నికృష్టవస్తువు; కాని దానిమీద ఉత్కృష్ట వస్తువును ఆరోపించటంవల్ల దానికా గొప్పతనం వస్తుంది. ఉదాహరణకు ఒక క్రికెట్‌బ్యాట్‌ను బ్యాట్‌గా చూస్తే దానికంటూ ఏమీ ప్రత్యేకత లేదు. అదే సచిన్ టెండూల్కర్ వాడిన క్రికెట్‌బ్యాట్ అని వేలంపాట వేస్తే దానికి కనకవర్షం కురుస్తుంది. అదే ఒక మామూలు వ్యక్తి కొన్ని రోజులు ఆడి, మళ్ళీ అమ్మితే అసలు ధరకన్నా చాలా తక్కువధర వస్తుంది.

అదే విధంగా పసుపుముద్దని గణపతి ఆకారంలో చేసి, ఆ ఆకారాన్ని గణపతికి ఆలంబనగా వాడతాము. అందులో గణపతిని ఆవాహన చేసి, ఆ గణపతికి షోడశోపచారాలు చేస్తాము; అర్చన చేస్తాము; నైవేద్యం కూడా పెడతాము. అదే మామూలు పసుపుకు అంత విలువ ఉండదు. పూజ అయ్యాక పూజారి ఆ ఆలంబనంనుంచి గణపతికి ఉద్వాసన చెబుతాడు కూడా. గణపతిని యథాస్థానం ప్రవేశయామి అన్నాక, ఆ పసుపుముద్ద మళ్ళీ మామూలు ముద్దగా మారిపోతుంది. అయినా మనకు దానిమీద ఉన్న పూజాభావం పోదు. ఆ గణపతిని తీసుకెళ్ళి ఉడుకుతున్న పులుసులో వేయము. అందువల్ల ఆలంబనం ఏదైనా, ఉపాస్యవస్తువులవల్ల ఆలంబనం శ్రేష్ఠం అవుతుంది. అందువల్ల అవి మహాసంహితలు అయ్యాయి.

**ఇతి ఆచక్షతే** – ఈ ఉపాసనల గురించి గొప్ప ఋషులు చెప్పారు.

**అథాధిలోకమ్। పృథివీ పూర్వరూపమ్। ద్యౌరుత్తరరూపమ్। ఆకాశస్సన్ధిః। వాయుస్సన్ధానమ్। ఇత్యధిలోకమ్।**

అథ – ఇప్పుడు (మొదలవుతుంది)

**ఎ) అధిలోకమ్ (సంహితోపాసన)** – ఇందులో మొదటి సంహితోపాసనను చూస్తాము. అది అధిలోక ఉపాసన. ఇప్పుడు లోకాలకు సంబంధించిన ఉపాసన మొదలవుతుంది. సంహితోపాసన పదాన్ని మనం కలుపుకోవాలి. నాలుగు ఆలంబనలమీద నాలుగు ఉపాస్య విషయాలు ఆవాహనం చేయబడతాయి. నాలుగు ఆలంబనలు పూర్వరూపం, ఉత్తరరూపం, సంధి, సమాధానం.

**పృథివీ పూర్వరూపమ్** – పృథివిని పూర్వరూపంమీద అంటే మొదటి అక్షరంమీద ఆవాహన చేయాలి.

**ద్యౌః ఉత్తరరూపమ్** – ద్యౌ అంటే ద్యులోకము అంటే స్వర్గలోకం. స్వర్గలోకాన్ని ఉత్తరరూపం అంటే రెండవ అక్షరంమీద ఆవాహన చేయాలి.

**ఆకాశః సంధిః** – ఆకాశం అంటే అంతరిక్షలోకం. పృథివిని భూలోకమనీ, అంతరిక్షాన్ని భువర్లోకమనీ, స్వర్గలోకాన్ని సువర్లోకమనీ కూడా అంటారు. ఈ అంతరిక్షాన్ని సంధిమీద అంటే + గుర్తుమీద ఆవాహన చేయాలి.

**వాయుః సంధానమ్** – వాయువును సంధానంమీద అంటే కొత్తగా వచ్చిన అక్షరంమీద ఆవాహన చేయాలి. ఈ లోక ఉపాసనవల్ల విశాల దృక్పథం ఏర్పడుతుంది. నేను, నావారు అంటూ పరిధులు గీసుకుని అందులోనే ఉండిపోతాము మనము. ఇటువంటి ఉపాసనలు చేయటంవల్ల విశ్వదర్శనం అవుతుంది. పద్నాలుగు లోకాలనూ చెప్పకుండా, ఉపనిషత్తు లోకత్రయాన్ని పేర్కొంటుంది ఒక్కోసారి. లోకత్రయం అంటే భూలోక, భువర్లోక, సువర్లోకాలు.

ఒకసారి ఈ విషయాలని మళ్ళీ ఉదాహరణతో పోల్చి చూద్దాము. దేవ+ఇంద్ర= దేవేంద్ర సూత్రంలో 'వ'ని పూర్వరూపం అనీ; 'ఇ'ని ఉత్తరరూపం అనీ; + గుర్తును సంధి అనీ, కొత్తగా వచ్చిన వే ('వే'లోని ఏ)ని సంధానం అనీ అన్నాము. ఇప్పుడు ఈ లోక ఉపాసనలో 'వ' దగ్గర భూలోకాన్ని, 'ఇ' దగ్గర సువర్లోకాన్ని, + గుర్తు దగ్గర భువర్లోకాన్ని (ఈ రెండు లోకాలనీ కలుపుతుంది కాబట్టి), 'వే' దగ్గర వాయువును (సువర్లోకంనుంచి వీస్తుంది కాబట్టి) ఊహించుకోవాలి.

**ఇతి అధిలోకం** – ఈ విధంగా అధిలోక ఉపాసన చెప్పబడింది.

ఆ విధంగా సమష్టితో మొదలుపెట్టి వ్యష్టి దాకా వస్తాము. విశ్వాన్ని బ్రహ్మాండం అంటే శరీరాన్ని పిండాండం అంటారు. అంటే బ్రహ్మాండంనుండి పిండాండం దాకా ఉన్న వాటన్నిటినీ ఈ ఐదు ఉపాసనల్లో ఊహించుకుని వాటిమీద ధ్యానం చేయాలి.

**అథాధిజ్యౌతిషమ్। అగ్నిః పూర్వరూపమ్। ఆదిత్య ఉత్తరరూపమ్। ఆపస్సన్ధిః। వైద్యుతస్సన్ధానమ్। ఇత్యధిజ్యౌతిషమ్।**

**అథ** – తరువాత (మొదటి ఉపాసన అయ్యాక),

**బి) అధిజ్యౌతిషమ్ (సంహితోపాసన)** – రెండవ ఉపాసన చేయాలి. దాన్ని అధిజ్యౌతిషమ్ అంటారు. జ్యౌతిషమ్ పదం జ్యోతినుండి వచ్చింది. జ్యోతి అంటే ప్రకాశాత్మక వస్తువు. జ్యోతి అంటే తనను తాను ప్రకాశించుకుంటూ, తక్కినవాటిని కూడా ప్రకాశింపజేసేది అని అర్థం. సూర్యుడు, చంద్రుడు, నక్షత్రాలు, అగ్ని, విద్యుత్ (మెరుపు)లను పంచజ్యోతులు అంటారు. ఇక్కడ వాటిలో మనం మూడు జ్యోతులను చూస్తాము. అవి సూర్యుడు, అగ్ని, మెరుపు. జ్యోతితో కూడిన వస్తువును జ్యోతిషం అంటారు. అందువల్లనే జాతకాలు చెప్పే శాస్త్రాన్ని జ్యోతిషం అంటారు. ఈ జ్యోతిషం గ్రహాలు, నక్షత్రాలు, సూర్యచంద్రుల గమనికబట్టి చెప్పబడుతుంది. ఇప్పుడు మనం అధిజ్యౌతిష సంహితోపాసనను చూడబోతున్నాము.

**అగ్నిః పూర్వరూపమ్** – అగ్ని భూలోకానికి చెందినది. అందువల్ల దాన్ని పూర్వరూపంమీద ఆవాహన చేయాలి.

**ఆదిత్య ఉత్తరరూపమ్** – ఆదిత్యుడు అంటే సూర్యుడు. ఆదిత్యుడు పైలోకాల్లో ఉంటాడు కాబట్టి ఆదిత్యుణ్ణి ఉత్తరరూపంమీద ఆవాహన చేయాలి.

**ఆపః సంధిః** – ఆపః అంటే నీరు. ఇక్కడ వాననీరు. మేఘజలం. ఇది అగ్నికి, ఆదిత్యునికి మధ్యలో కురుస్తుంది.

**వైద్యుతస్సంధానమ్** – వైద్యుత్ అంటే మెరుపు. మెరుపు ఆకాశాన్ని, భూమినీ కలుపుతుంది. ఎంత అద్భుతమైన ఊహాశక్తి! మెరుపు ఆకాశంలో పుట్టి, భూమికి వస్తుంది. అంటే ఇది ఆదిత్యుణ్ణి, అగ్నిని కలుపుతుంది. అందువల్ల ఈ ఉపాసనలో మెరుపును ఊహించుకోవాలి.

**ఇతి అధిజ్యౌతిషమ్** – ఈ విధంగా అధిజ్యౌతిష ఉపాసన చెప్పబడింది. ఈ ఉపాసనలో సహజమైన, శక్తివంతమైన ప్రకృతిశక్తులమీద ఉపాసన చేస్తాము. ముందు ఉపాసనలో మొత్తం లోకాలను ఊహించుకుంటే ఇప్పుడు ఆ లోకాల్లోని శక్తులను ఊహించు కుంటున్నాము. దీనివల్ల అంతా భగవంతుని సృష్టే అనీ, అందువల్ల దేన్నీ నిర్లక్ష్యం చేయకూడదనీ తెలుస్తుంది.

**అథాధివిద్యమ్। ఆచార్యః పూర్వరూపమ్। అంతేవాస్యుత్తర రూపమ్। విద్యా సన్ధిః। ప్రవచనగ్ం సన్ధానమ్। ఇత్యధివిద్యమ్।**

**అథ** – మొదటి రెండు ఉపాసనలు అయ్యాక,

**సి) అధివిద్యమ్ (సంహితోపాసన)** – ఇప్పుడు ఉపనిషత్తు విద్యారంగంమీద ఉపాసనను వివరిస్తున్నది. అధి అంటే సంబంధించిన. అధివిద్యమ్ అంటే విద్యకు సంబంధించిన ఉపాసన.

**అచార్య పూర్వరూపమ్** – ఆచార్యుణ్ణి పూర్వరూపంమీద ఆవాహన చేయాలి. ఆచార్యుని నిర్వచనం ఇది.

> **ఆచినోతి హి శాస్త్రాణి ఆచారే స్థాపయత్యపి।**
> **స్వయమ్ ఆచరతే యస్మాత్తస్మాదాచార్య ఉచ్యతే।।**

**ఆచినోతి హి శాస్త్రాణి** – శాస్త్రంలో ఉన్న బోధను నేర్చుకుని, శిష్యుని స్థాయినిబట్టి దాన్ని బోధిస్తాడు గురువు.

**ఆచారే స్థాపయతి** – విద్యార్థులు విద్య నేర్చుకుని, ఋజుమార్గంలో నడవటానికి తోడ్పడతాడు.

**స్వయమ్ ఆచరతే యస్మాత్** – వారికి మంచి విషయాలు బోధించటమే కాదు, తను కూడా తన ప్రవర్తనను ఆదర్శప్రాయంగా తీర్చిదిద్దుకుంటాడు.

**తస్మాత్ ఆచార్య ఉచ్యతే** – అటువంటి వ్యక్తిని ఆచార్యుడు అంటారు. ఆచార్యుడు అలా మూడు పనులు చేస్తాడు. ఆచినోతి, ఆచార్యతి, ఆచరతి. అందువల్ల ఆచార్యుడు అయ్యాడు. అటువంటి ఆచార్యుణ్ణి పూర్వరూపంమీద ఆవాహన చేయాలి.

**అంతేవాసీ ఉత్తరరూపమ్** – అంతేవాసీ అంటే గురుకులంలో ఉండి విద్యనభ్యసించే విద్యార్థి. అంతే అంటే సమీపంలో, వాసి అంటే నివసించేవాడు. అంటే విద్యార్థి గురువు సమీపంలో

ఉండి విద్యను అభ్యసించాలి. గురువు దగ్గరగా ఉండటంవల్ల ఆయన బోధలచేత మాత్రమే కాదు, ఆయన ప్రవర్తన వల్ల కూడా ప్రభావితమవుతాడు. అటువంటి విద్యార్థిని ఉత్తరరూపం మీద ఆవాహన చేయాలి.

**విద్యా సన్ధిః** – గురుశిష్యులను కలిపేది విద్య. అందువల్ల విద్య సంధి అయింది. విద్యను సంధిమీద ఆవాహన చేయాలి.

**ప్రవచనగ్ం సంధానమ్** – ప్రవచనం అంటే గురువు చేసే బోధ. గురుశిష్యులను విద్య కలిపితే, అప్పుడు ప్రవచనం జరుగుతుంది. శాస్త్రం విద్యను గురుముఖతఃగా నేర్చుకోవాలి అంటుంది. ముఖ్యంగా గురువు ఎదురుగా కూర్చొని వినాలి. తల్లి తన పిల్లలను కళ్ళతోనే గదమాయించగలదు. తల్లికి పిల్లవాడి చూపులోనే వాడు నిజం చెబుతున్నాడో లేదో తెలుస్తుంది. అలాగే గురువుకు శిష్యుని మొహం చూస్తేనే తన బోధ అతని మెదడులోకి ఎక్కుతోందో లేదో తెలుస్తుంది. శిష్యుడు కూడా గురువు చేసే హావభావాలను జాగ్రత్తగా పరిశీలిస్తూ విద్యను నేర్చుకోవాలి. కళ్ళు మూసుకుని వినకూడదు. పుస్తకంలోంచి నేర్చుకోకూడదు. గురువు ఎదురుగా కూర్చుని నేర్చుకోవాలి. అందువల్ల గురుకులవాసంలో పొందే విద్యను స్తుతిస్తూ దానిమీద ఉపాసన చేయమంటున్నది ఉపనిషత్తు. ప్రవచనం అంటే గురువు చేసే బోధ. బోధను సంధానంమీద ఆవాహన చేయాలి.

**ఇతి అధివిద్యమ్** – ఈ విధంగా అధివిద్య ఉపాసన చెప్పబడింది.

**అథాధిప్రజమ్। మాతా పూర్వరూపమ్। పితోత్తరరూపమ్। ప్రజా సన్ధిః। ప్రజననగ్ం సన్ధానమ్। ఇత్యధిప్రజమ్।**

నాలుగవ ఉపాసన ప్రజా గురించి చెప్పబోతున్నది. ప్రజా అంటే సంతతి. ఇది గృహస్థాశ్రమానికి సంకేతం. అధివిద్య ఉపాసన బ్రహ్మచర్య ఆశ్రమానికి చెందినదైతే అధిప్రజ ఉపాసన గృహస్థాశ్రమానికి చెందినది. దీన్నిబట్టి, ఒక వ్యక్తి ఆధ్యాత్మికంగా ఎదగటానికి ప్రతి ఆశ్రమజీవనం కూడా ముఖ్యమైనదేనని తెలుస్తున్నది.

**అథ** – అధివిద్య ఉపాసన తర్వాత,

**డి) అధిప్రజమ్ (సంహితోపాసన)** – అధిప్రజ ఉపాసనలోకి అడుగు పెడుతున్నాము.

**మాతా పూర్వరూపమ్** – తల్లిని పూర్వరూపంమీద ఆవాహన చేయాలి.

**పితోత్తరరూపమ్** – తండ్రిని ఉత్తరరూపంమీద ఆవాహన చేయాలి.

గృహస్థాశ్రమంయొక్క ఉద్దేశ్యమేమిటో సరిగ్గా అర్థం చేసుకోవాలి. సాంప్రదాయం లేదా శాస్త్రం బోధించింది వేరు, ఇప్పటి తరం పాటించేది వేరు. ఇప్పటితరం ఈ అర్థ, కామాల

వెంట పరుగులు తీస్తారే కాని, సంతతిని కోరుకోరు. పిల్లలు పుడితే వారి ఆనందానికి అడ్డు అనుకొని, ఆ కార్యక్రమాన్ని వాయిదా వేస్తారు. కాని శాస్త్రం గృహస్థాశ్రమాన్ని నిర్దేశించిందే వంశాభివృద్ధికోసం. పిల్లలు పుట్టటంకోసం అతను పెళ్ళి చేసుకుంటాడు. ధర్మానికి ప్రాముఖ్యతనిస్తాడు. అందువల్ల ఈ సంతతి అనే అంశంమీద ఉపాసన చేయమంటున్నది ఉపనిషత్తు.

బృహదారణ్యకోపనిషత్తు కర్మను పాంక్తం కర్మ అంటుంది. పాంక్తం అంటే ఐదు; కర్మ అంటే యజ్ఞయాగాదులు చేయటం. ఒక యజ్ఞం చేయాలంటే ఐదు అంశాలు ఉండాలి. యజమాని, పత్ని, పుత్రుడు, దైవవిత్తం, మానుషవిత్తం. యజమాని అంటే యజ్ఞం చేసే గృహస్థు; పత్ని అంటే అతని భార్య; పుత్రుడు అంటే వారి కొడుకు; దైవవిత్తం అంటే వైదికమంత్రాలు; మానుషవిత్తం అంటే ధనం. గృహస్థు మాత్రమే యజ్ఞాలను చేయగలడు. గృహస్థాశ్రమం వైదికకర్మలను చేయటానికి నిర్దేశింపబడింది. ఆ జీవనంలో పుట్టిన పిల్లలను ధర్మప్రజాః అంటారు. అంటే ధర్మంకోసం పిల్లలు అని అర్థం. కళ్యాణం చేసుకునేటప్పుడు చెప్పే సంకల్పం అర్థం ఇదే.

**ధర్మప్రజాభివృద్ధ్యర్థం కర్మ కరిష్యే**

గృహస్థు ధర్మం కేవలం కర్మలు చేయటమే కాదు, వంశాభివృద్ధిని చేయటానికి కూడా. తమ తరం పాటించే విలువలను ముందు తరాలకు అందించే గురుతమ బాధ్యత తల్లిదండ్రులదే. ఒక చిన్నపిల్లవాని వ్యక్తిత్వం అతని బాల్యంలోనే అంటే అతనికి ఐదు సంవత్సరాల వయస్సు వచ్చేసరికే రూపుదిద్దుకుంటుంది. అందువల్ల, మట్టిముద్దగా ఉన్న పిల్లలను ఆ వయస్సులోనే మంచి వ్యక్తులుగా తీర్చిదిద్దాలి తల్లిదండ్రులు.

మొక్కై వంగనిది మానై వంగునా అని సామెత. అప్పుడు నేర్చుకోకపోతే పెద్దయ్యాక అసలే నేర్చుకోలేరు. వారి లేతవయస్సులో తల్లిదండ్రుల ప్రభావం వారిమీద చాలా ఉంటుంది. వారిని చూసి అనుకరిస్తారు పిల్లలు. కాని ఇప్పటి వ్యవస్థ ప్రకారం చాలా లేతవయస్సులోనే పిల్లలను ప్లేస్కూలుకు పంపించివేయటమో, ఆయాలమీద వదిలివేయటమో జరుగుతోంది. దయానందస్వామీజీ పిల్లలను అంత లేతవయస్సులో స్కూలుకు పంపించి, రోజంతా స్కూలులో ఉంచివేయటం మంచిదికాదు అంటారు. అలా చేస్తే పిల్లలలో మానసిక దారుఢ్యం పెరగదు.

అందువల్ల గృహస్థాశ్రమం పిల్లలను ధార్మికంగా పెంచటానికి నిర్దేశించబడింది. ధర్మాన్ని ధర్మశాస్త్రాల్లో కాదు, ధర్మాన్ని ఆచరించిన పెద్దల చేతిలో పెరిగిన పిల్లల నడవడికలో చూడాలి. తల్లిదండ్రులు చేసిన బోధ కన్నా, వారు చూపిన ప్రవర్తనయొక్క ప్రభావం పిల్లలమీద బలంగా ఉంటుంది.

**ప్రజా సంధిః** – స్త్రీ పురుషులు వివాహం చేసుకునేది ధర్మపరంగా సంతతిని పెంపొందించటానికి అని చూశాము. అంటే సంతతి స్త్రీపురుషులను కలుపుతుంది. కాబట్టి సంతతిని సంధి మీద ఆవాహన చేయాలి.

**ప్రజననగ్ం సంధానమ్** – భార్యాభర్తల తొలిరాత్రికి కూడా వైదికపూజ ఉంటుంది. దాన్ని గర్భాధాన సంస్కారం అంటారు. వారు ధర్మపరంగా జీవనం గడిపే సంతతి కలగాలని ప్రార్థన చేస్తారు అప్పుడు. అప్పటి జీవనం అలా ధర్మానికి పెద్దపీట వేసింది. అర్థకామాలు దాని తర్వాత వస్తాయి. ధర్మబద్ధంగా జీవితం గడిపితేనే ఆనందం వస్తుంది కాని కోట్లకి పడగలెత్తితే కాదు అని చెబుతుంది శాస్త్రం. నిజం కూడా అంతేకదా! అధార్మికంగా సంపాదించినవారు క్షణక్షణం అపరాధభావనతో కృంగిపోతారు. అందువల్ల ఇక్కడ స్త్రీపురుషుల సంయోగాన్ని ఉపాసనగా చేయమనేది సుఖాలకోసం కాదు, ధర్మసంతతిని పొందటానికి.

**ఇతి అధిప్రజమ్** – ఈ విధంగా అధిప్రజ ఉపాసన చెప్పబడింది.

సమష్టితో మొదలుపెట్టి వ్యష్టికి వస్తామని చూశాము. ఇప్పుడు రాబోయే ఉపాసన వ్యష్టికి చెందినది.

**అథాధ్యాత్మమ్। అధరా హనుః పూర్వరూపమ్। ఉత్తరా హనురుత్తరరూపమ్। వాక్సన్ధిః। జిహ్వా సన్ధానమ్। ఇత్యధ్యాత్మమ్।**

**అథ** – అధిప్రజా సంహితోపాసన చేశాక,

**ఇ) అధ్యాత్మమ్ (సంహితోపాసన)** – వ్యష్టిలోని శరీర అంగాలమీద ఉపాసన చేయాలి. మనిషి శరీరంలో అన్ని అంగాలలోకి ఏది చాలా చురుకుగా ఉంటుంది? మనం చేసే అన్ని వ్యవహారాలను గమనిస్తే, వాటిని ఎక్కువగా వాక్కుతో చేస్తామని తెలుస్తుంది. ఒక ఒంటరి ప్రదేశానికి ఏకాంతాన్ని వెతుక్కుంటూ మీరు వెళ్ళినా, చేతిలో సెల్‌ఫోన్‌ను వదలరు. ఉత్తరం రాసినా అందులో ఉండేది వాక్కునుంచి వెలువడిన వాక్యాలే. ఇప్పటి వ్యాపార లావాదేవీలన్నీ కూడా ఈ కమ్యూనికేషన్ స్కిల్స్‌మీద ఆధారపడి జరుగుతున్నవే. వేదానికి ఎప్పుడోనే తెలుసు, మనిషికి వాక్కు ఎంత ముఖ్యమో. అందువల్ల ఐదవ ఉపాసనగా మనిషి నోటిలోని భాగాలను తీసుకుంది ఉపనిషత్తు.

**అధరా హనుః పూర్వరూపమ్** – కింద దవడను పూర్వరూపంమీద ఆవాహన చేయాలి. మీరు ఒక విషయం గమనించారో లేదో! మీరు మాట్లాడేటప్పుడు మీకింది దవడ మాత్రమే కదులుతుంది. పై దవడ కదలదు.

**ఉత్తరా హనుః ఉత్తరరూపమ్** – పై దవడను ఉత్తరరూపంమీద ఆవాహన చేయాలి.

**వాక్ సంధిః** – మాట్లాడేటప్పుడు (తినేటప్పుడు కూడా) ఈ రెండు దవడలు దగ్గరకు వస్తాయి. అందువల్ల వాక్కును సంధిమీద ఆవాహన చేయాలి.

**జిహ్వా సంధానమ్** – నాలుకను సంధానమ్‌మీద ఆవాహన చేయాలి. మన శరీరంలోని అంగాలలో అన్నిటికన్నా మృదువైనది నాలుకైతే, అన్నింటికన్నా గట్టివి దంతాలు. తమాషా చూశారా? అత్యంత మృదువైన నాలుక అత్యంత కఠినమైన రెండు పలువరుసల మధ్యలో నిరంతరం కదలాలి. ఆ పళ్ళు కసుక్కున తనను కొరక్కుండా నాలుక మెలగాలంటే, దానికి ఎంత నేర్పరితనం ఉండాలి! నాలుకను చూసి నేర్చుకోండి! మీ చుట్టూ ఉన్నవారు గట్టి దంతాల వంటివారైతే, మీరు నాలుకలాగా వారి మధ్య తెలివిగా మసలటం నేర్చుకోండి. తలలో నాలుకలా ఉన్నాడు అంటారు కొందరిని.

**ఇతి అధ్యాత్మమ్** – ఈ విధంగా అధ్యాత్మ ఉపాసన చెప్పబడింది.

దీనితో మహాసంహితోపాసన ముగిసింది. ఇందులో ఐదు ఉపాసనలు చెప్పబడినా కూడా అన్నింటినీ కలిపి ఒక్కటిగా తీసుకోవచ్చు. ఎందుకంటే ఈ ఐదు ఉపాసనలకూ తీసుకున్న నాలుగు ఆలంబనలూ ఒక్కటే కాబట్టి.

ఇప్పుడు ఉపనిషత్తు ఈ ఉపాసనల ఫలం చెప్పబోతున్నది.

**ఇతీమా మహాసగ్ంహితాః। య ఏవమేతా మహాసగ్ంహితా వ్యాఖ్యాతా వేద। సంధీయతే ప్రజయా పశుభిః। బ్రహ్మవర్చసేనాన్నాద్యేన సువర్గ్యేణ లోకేన॥**

**ఇతి ఇమాః మహాసంహితాః** – ఈ మహాసంహిత ఉపాసనలను ఉపనిషత్తు కీర్తిస్తున్నది. దానికి రెండు కారణాలు చెప్పవచ్చు. ఒక కారణం ఆలంబనగా తీసుకున్న అక్షరాలు సాక్షాత్తూ వేదమంత్రాలలోవి; రెండవ కారణం ఉపాసన వస్తువులు కూడా సామాన్యమైనవి కాదు. ఇంత శ్రేష్ఠమైన ఉపాసన చేస్తే, దాని ఫలం కూడా అద్వితీయంగానే ఉండాలి. ఇప్పుడు ఫలం గురించిన వర్ణన వస్తుంది.

ఉపాసన ఫలం మనం చెప్పుకునే సంకల్పంమీద ఆధారపడివుంటుంది. ఉపాసన చేస్తే ఎవరేది కోరితే అది వస్తుంది. మామూలు, లౌకిక జీవనంలో కూడా వాడే పరికరం ఒకటే అయినా, వాడే కారణం భిన్నంగా ఉంటుంది. ఒక నేరస్థుడు ఎవరినో చంపటానికి కత్తిని పట్టుకుంటే, అదే కత్తిని ఎవరి ప్రాణాన్నో రక్షించటానికి పట్టుకుంటాడు వైద్యుడు. ఒకవేళ అదృష్టం బాగుండక ఆ రోగి మరణించినా, అది వైద్యుడు కావాలని చేసినది కాదు. అందువల్ల అతనికి శిక్ష పడదు. కాని నేరస్థుడు కావాలని చంపుతాడు. అతనికి శిక్ష పడుతుంది. చర్య ఒకటే, కాని వారు చేసిన కారణం వేరు.

అదే విధంగా ఒక ఉపాసనను కాని, పూజను కాని ఏ కోరికతో చేస్తారన్నది ముఖ్యం. సకామకర్మగా చేస్తే వచ్చే ఫలం వేరు; నిష్కామకర్మగా చేస్తే వచ్చే ఫలం వేరు. సకామకర్మగా ఉపాసన చేస్తే అర్థకామాల కోసం చేస్తారు. అదే ఉపాసనను నిష్కామకర్మగా చేస్తే ధర్మ, మోక్షాల కోసం చేస్తారు. నిష్కామకర్మవల్ల చిత్తశుద్ధి, జ్ఞానయోగ్యతాప్రాప్తి కలుగుతుంది.

భగవద్గీతలో కృష్ణపరమాత్మ సకామకర్మను ఎలా చేయాలో చెప్పాడు. సకామ కర్మగా చేసేటప్పుడు సాధకుడు దాన్ని చాలా శ్రద్ధగా చేయాలి; దానికి నిర్దేశించిన నియమాలన్నింటినీ శ్రద్ధగా పాటించాలి; ఏ పూజను ఎప్పుడు, ఎలా చేయాలంటే అప్పుడు, అలా చేయాలి; ఏ నైవేద్యం పెట్టాలంటే అది పెట్టాలి. పైగా సకామకర్మను సరిగ్గా చేయకపోతే ఆశించిన ఫలం రాకపోగా, బెడిసికొట్టే ప్రమాదం కూడా ఉంది. ఇంతకుముందే వృత్రాసురుని కథ చూశాము. ఇంద్రుణ్ణి సంహరించే కొడుకు పుట్టాలని కోరుకుంటే ఇంద్రుని చేత సంహరించబడే కొడుకును ప్రసాదించు అని కోరినట్టయింది.

అదే నిష్కామకర్మగా ఆ కర్మను చేస్తే, దానికి నియమాలు కుదరకపోయినా చెడు ఫలితమయితే రాదు. అంతేకాక, ఎంతమేరకు కర్మ చేస్తే, అంతమేరకు ఫలం కలుగుతుంది. అదే సకామకర్మ అయితే, ఆ కర్మ పూర్తిగా చేయాలి. అప్పుడు దాని ఫలం వస్తుంది. నిష్కామకర్మలో అయితే మీరు ఆశించిన చిత్తశుద్ధి, చిత్త ఏకాగ్రత ఏర్పడతాయి. ఆశించని లౌకికఫలాలు కూడా వస్తాయి.

ఏదైనా కర్మ లేదా ఉపాసనయొక్క ఫలం చూసేటప్పుడు రెండురకాల ఫలాలనూ గమనించాలి. ముందు నిష్కామఫలం ఏమిటో చూద్దాము. నిష్కామకర్మవల్ల లౌకిక ఫలాలు రాకపోవచ్చు (అవాంతరఫలంగా వచ్చినా వాటిని పట్టించుకోరు). లౌకిక ఫలాలు అంటే ఐశ్వర్యం, హోదా, పరపతి, గౌరవం. ఇవి వచ్చినా రాకపోయినా నిష్కామకర్మవల్ల వచ్చే ఫలం ఆధ్యాత్మిక ఎదుగుదలకు తోడ్పడుతుంది.

1. **చిత్త వైశాల్యత** – ఈ సంహితోపాసనలోనే మొదటి ఉపాసనగా లోకత్రయ ఉపాసనను చూశాము. భూలోక, భువర్లోక, సువర్లోకాలమీద ఉపాసన అది. ఈ మూడు లోకాలు మొత్తం పద్నాలుగు లోకాలను సూచిస్తాయని కూడా చూశాము. వీటిమీద ఉపాసన చేసేటప్పుడు మనస్సు వీటిని ఊహించుకుంటుంది. మనస్సు ఏ వస్తువు గురించి ఆలోచిస్తే, మనస్సుకు ఆ ఆకారం వస్తుంది. మనస్సు ఒక చిన్న వస్తువును చూస్తే అది కూడా చిన్నదై పోతుంది. ఈ లోకాలను ఊహించుకుంటే, అంత విశాలమైన లోకాలను ఊహించుకోవటంవల్ల మనస్సు కూడా అంత విశాలంగానూ అవుతుంది. అంటే చిత్తవైశాల్యత ఏర్పడుతుంది.

పూర్వకాలంలో మన పూర్వీకుల ఇళ్ళు చూస్తే అవి చాలా పెద్దవిగా ఉండేవి. విశాలమైన గదులు, విశాలమైన పెరడు ఉండేది. వంటిల్లే కనీసం యాభైమంది ఒక్కసారి కూర్చుని తినేందుకు వీలుగా ఉండేది. గదుల పైకప్పు కూడా ఎంతో ఎత్తుకు ఉంటుంది. ఇంక ఆలయాల మాట అయితే చెప్పనే అవసరం లేదు. ఒక్కొక్క ఆలయం ఎంతమేరకో విస్తరించి ఉంటుంది. వాటిల్లో స్తంభాలు కూడా బాగా పెద్దవిగా ఉంటాయి. వాటితో ఇప్పటి ఇళ్ళని పోలిస్తే పిచ్చుకగూళ్ళలాగా ఉంటాయి ఇళ్ళు. బాగా పొడుగైన వ్యక్తి చేయిచాచి నిలబడితే,

పైకప్పు తగిలినా ఆశ్చర్యపోనవసరం లేదు. గుమ్మాలైతే మరీ చిన్నవి. ఇళ్ళనిబట్టి మనస్సులూ మారుతూ వస్తున్నాయి. అప్పుడు ఇళ్ళెంత విశాలంగా ఉన్నాయో, వారి మనస్సులూ అంత విశాలంగానూ ఉండేవి. మూడోవ్యక్తి లేకుండా ఆ ఇళ్ళు ఉండేవి కావు. ఇప్పుడు సంకుచితమైనపోయిన మనస్సుతో ఉన్నాము. ఒక అతిథి వస్తున్నాడంటేనే రాకోయీ అనుకోని అతిథీ అనే పరిస్థితి.

ఇదంతా ఎందుకు చెబుతున్నామంటే, మనస్సు దేన్ని ఉహించుకుంటే ఆ ఆకారంలో ఉంటుంది. ఈ ఉపాసనలో మనస్సు మూడు లోకాలను ఊహించుకుంటుంది కాబట్టి చిత్తవైశాల్యత ఏర్పడుతుంది.

2. **చిత్తశుద్ధి** – మొత్తం విశ్వంమీద ఉపాసన చేస్తారు కాబట్టి విశ్వంమీద పూజ్య భావన ఏర్పడుతుంది. అంటే చిత్తశుద్ధి కలుగుతుంది. పృథివిమీద ఉపాసన చేస్తారు కాబట్టి పృథివిని భూదేవిగా కొలుస్తారు. అందువల్ల భూదేవిమీద కాలు మోపుతున్నందుకు క్షమాపణ కోరుతారు.

**సముద్రవసనే దేవి పర్వతస్తన మండలే।**
**విష్ణుపత్ని నమస్తుభ్యం పాదస్పర్శమ్ క్షమస్వ మే॥**

ఓ మాతా, విష్ణుపత్నీ, నీకు నమస్కారములు. నీమీద పాదం మోపుతున్నందుకు నన్ను క్షమించు అని ఈ ప్రార్థన అర్థం.

ఈ ఉపాసనల్లో లోకాలమీదే కాదు, జ్యోతులమీద కూడా గౌరవం ఏర్పడుతుంది. ఈ గౌరవభావన విశ్వరూప దర్శనం చేయిస్తుంది. విద్యమీద ఉపాసన గురువుమీద, శాస్త్రంమీద గౌరవాన్ని పెంపొందిస్తుంది. అలాగే మీరు ఈ జన్మ పొందటానికి కారకులైన మీ తల్లిదండ్రుల మీద గౌరవాన్ని పెంపొందిస్తుంది. అలా అన్నిటిమీదా ఏర్పడిన గౌరవం అక్కడితో ఆగకుండా, మీమీద మీరు పెంపొందించుకునేందుకు కూడా తోడ్పడుతుంది.

ఈ శరీరం మీకు భగవంతుడిచ్చిన గొప్ప వరం. ఎందుకంటే ఈ శరీరంలో ఏ ఒక్క భాగాన్ని కూడా మీరు స్వయంగా సృష్టించలేరు. ఒక అంగం పాడయితే, అది దాని అసలు శక్తిని మళ్ళీ పుంజుకోలేదు. దేహో దేవాలయః ప్రోక్తః అని ఎందుకన్నారో ఈ ఉపాసన చూస్తే అర్థమవుతుంది. అందువల్ల శరీరంమీద, ముఖ్యంగా వాక్కుమీద పూజ్యభావం ఏర్పడుతుంది. శరీరం భగవంతుని కృప కాబట్టి దాన్ని శ్రద్ధగా కాపాడుకోవాలి కాని దానితో మమేకం చెందకూడదు అని అర్థమవుతుంది. మమేకం చెందితే అది నాది అనే భావన వచ్చేస్తుంది. శరీరం నాది కాదు. అది భగవంతుడు ఇచ్చిన గొప్ప వరం. ఎప్పుడైనా దాన్ని వెనక్కు తీసేసుకునే అధికారం భగవంతునికి ఉంది. అంతవరకూ దీన్ని జాగ్రత్తగా కాపాడుకుని, భద్రంగా భగవంతునికి అప్పజెప్పేయాలి.

ఈ విషయాన్నే కృష్ణపరమాత్మ భగవద్గీతలోని పదకొండవ అధ్యాయంలో వివరించాడు. భగవంతునియొక్క విశ్వరూపాన్ని చూడటానికి అర్జునునికి దివ్యచక్షువులను ప్రసాదించాడు. దివ్యచక్షువులంటే ఏమిటి? భగవంతునిమీద ఆరాధనాభావన. ఉదాహరణకు మీరు బజారులో ఒక అరటిపండును కొంటే, దాన్ని మామూలుగా తినేస్తారు. అదే అరటిపండును ఎవరైనా మీకు భగవంతుని ప్రసాదంగా ఇస్తే ఏం చేస్తారు? దాన్ని భక్తిగా కళ్ళకద్దుకుని, తర్వాత కొంచెం నోట్లో వేసుకుంటారు. వస్తువు ఒకటే. కాని దాన్ని మీరు చూసే విధానంలో మార్పు వచ్చింది. దాన్నే దివ్యచక్షువు అంటారు. కృష్ణపరమాత్మయొక్క విశ్వరూపాన్ని చూసి తరించటానికి అర్జునునికి తాత్కాలికంగా దివ్యచక్షువులను ఇచ్చాడు కృష్ణపరమాత్మ. ఇటువంటి ఉపాసనలను చేస్తే ఆ దివ్యచక్షువులను మీరు కూడా పొందవచ్చు.

3. **చిత్త ఏకాగ్రత** – చాలామందికి ఎక్కువసేపు ఏకాగ్రత చూపే శక్తి ఉండదు. ఈ ఉపాసన చేయటం వల్ల చిత్త ఏకాగ్రత పెరిగి, ఒక వస్తువుమీద ఎక్కువసేపు దృష్టి నిలిపి ఉంచగలరు.

4. **చిత్త నిశ్చలత్వమ్** – విశాల దృక్పథం అలవడటంవల్ల మనస్సు నిశ్చలంగా ఉంటుంది.

అందువల్ల నిష్కామ ఉపాసన చేస్తే కలిగే ఫలాలు – చిత్తవైశాల్యత, చిత్తశుద్ధి, చిత్త ఏకాగ్రత, చిత్త నిశ్చలత్వమ్. ఇవి జ్ఞానయోగ్యతాప్రాప్తిని కలుగజేసి, ఆత్మజ్ఞానం పొందటానికి మొదటిదశ అయిన శ్రవణం చేయటానికి అర్హతను ఇస్తాయి.

ఉపనిషత్తు సకామ ఉపాసనవల్ల కలిగే ఫలాన్ని వివరిస్తున్నది ఈ భాగంలో.

**య ఏవమేతా మహాసగ్ంహితా వ్యాఖ్యాతా వేద** – ఇక్కడ వేద అంటే ఉపాసన. ఒక సాధకుడు ఈ మహాసంహితోపాసనను పైన ఉపనిషత్తు చెప్పినట్టుగా చేస్తే,

ఏవం అంటే చెప్పినది చెప్పినట్టుగా. అంటే ఏ ఆలంబనమీద దేనిని ఆవాహన చేయాలో, ఆ ఆలంబనమీదే దానిని ఆవాహన చేయాలి. అంటే ఉదాహరణకు లోక ఉపాసనలో పృథివిని పూర్వరూపంమీదా, ద్యులోకాన్ని ఉత్తరరూపంమీదా ఆవాహన చేయాలి. వీటిని తారుమారు చేయకూడదు. అంటే పృథివిని ఉత్తరరూపంమీద, ద్యులోకాన్ని పూర్వరూపం మీద ఆవాహన చేయకూడదు.

మనం నాలుగు కుర్చీల్లో భిన్నరంగాల్లోని వ్యక్తులను పిలిచి సన్మానం చేయటమనే ప్రక్రియను ఉదాహరణగా తీసుకున్నాము. అక్కడ కూడా అంతే. ఎవరినే కుర్చీలో ఆసీనులను చేయాలో దానికో నియమం ఉంటుంది. ఆ నియమాన్ని ఉల్లంఘిస్తే, ఆ ప్రతిభావంతుడు కోపగించుకునే ప్రమాదం ఉంది.

**సంధీయతే** – ఈ వైదిక ఉపాసనను చేస్తే, అతను ఈ క్రింది ఫలాలను పొందుతాడు.

**ప్రజయా పశుభిః** – ప్రజయా అంటే సంతతి; పశుభిః అంటే ఐశ్వర్యం. సకామ కర్మలో ఇహలోకఫలాలూ, పరలోకఫలాలూ కూడా కలుగుతాయి. ఉపాసనయొక్క ప్రత్యేకత ఏమిటంటే, దేనికోసం ప్రార్థిస్తే, ఆ విధంగా ఫలం కలుగుతుంది.

**యథా యథా ఉపాసతే తథైవ భవతి**

ఒక సాధకుడు ఈశ్వరుణ్ణి సర్వజ్ఞునిగా కొలిస్తే, అతనికి జ్ఞానఫలం కలుగుతుంది.

**జ్ఞానవిశిష్ట ఈశ్వర ఉపాసనయా జ్ఞానఫలమ్**

అలా ఈశ్వరుని యొక్క శక్తిమీద ధ్యానం చేస్తే, అతను కూడా సర్వశక్తివంతుడు అవుతాడు. ఈశ్వరుని రూపురేఖలమీద ధ్యానం చేస్తే అందగాడు అవుతాడు. అలాగే ఈశ్వరునియొక్క నిత్యత్వంమీద ఉపాసన చేస్తే, అతను దీర్ఘాయుష్షు పొందుతాడు. అంటే అతను ఏ అంశం మీద ఉపాసన చేస్తే దానికి తగ్గ ఫలాన్ని పొందుతాడు.

**బ్రహ్మవర్చసేన** – బ్రహ్మవర్చస్సు పొందుతాడు. అంటే అతని మొహం మెరిసిపోతుంటుంది. అతనిలో ఒక విధమైన ఆకర్షణ ఉంటుంది.

**అన్నాద్యేన** – అన్నం (ఆహారం) సమృద్ధిగా దొరుకుతుంది. అది కూడా పౌష్టికాహారం దొరుకుతుంది. ఆద్యం అంటే అదానయోగ్యం – తినటానికి అనువుగా ఉన్నది.

ఇంతవరకూ వచ్చినవి ఇహలోకఫలాలు. మరి పరలోక ఫలమేమిటి? ఒక విషయం గుర్తుంచుకోవాలి. అతను నిష్కామకర్మ చేసినా, సకామకర్మ చేసినా మోక్షం మాత్రం పొందడు. ఎందుకంటే మోక్షం పొందటానికి ఆత్మజ్ఞానం పొందాలి.

**సువర్గేణ లోకేన** – మరణం తర్వాత స్వర్గలోకానికి వెళతాడు. భూలోకం తర్వాత ఊర్ధ్వలోకాలు ఆరు ఉన్నాయి. అవి భువర్లోక, సువర్లోక, మహర్లోక, జనలోక, తపోలోక, సత్యలోకాలు. అతను వీటిల్లో ఏ లోకానికి వెళతాడనేది అతను చేసే ఉపాసననుబట్టి, అతను చూపే శ్రద్ధనుబట్టి కూడా ఉంటుంది.

సంహితోపాసన లౌకికఫలాలకోసం కాని, ఆధ్యాత్మిక ఫలాలకోసం కాని చేయవచ్చు కాని ఇది చేసితీరాలనే నియమం లేదు. మన పురాణాలు అనేక దేవతలమీద అనేక ఉపాసనలను నిర్దేశించాయి. వాటిల్లో ఏదైనా మీకు నచ్చినది చేయవచ్చు.

**సంహితోపాసన**

| **ఉపాసన** | **పూర్వరూపం** | **ఉత్తర రూపం** | **సంధి** | **సంధానం** |
|---|---|---|---|---|
| అధిలోక | భూమి | స్వర్గం | అంతరిక్షం | వాయువు |
| అధిజ్యౌతిష | అగ్ని | సూర్యుడు | నీరు | విద్యుల్లత |
| అధివిద్య | ఆచార్యుడు | విద్యార్థి | విద్య | ప్రవచనం |

| | | | | |
|---|---|---|---|---|
| అధిప్రజ | తల్లి | తండ్రి | సంతతి | కలయిక |
| అధ్యాత్మ | క్రింది దవడ | పై దవడ | వాక్కు | నాలుక |

**అనువాకం - 4**

**యశ్ఛందసామృషభో విశ్వరూపః। ఛందోభ్యోఽధ్యమృతాత్సంబభూవ। స మేంద్రో మేధయా స్పృణోతు। అమృతస్య దేవధారణో భూయాసమ్। శరీరం మే విచర్షణమ్। జిహ్వా మే మధుమత్తమా। కర్ణాభ్యాం భూరి విశ్రువమ్। బ్రహ్మణః కోశోఽసి మేధయా పిహితః। శ్రుతం మే గోపాయ। ఆవహన్తీ వితన్వానా। కుర్వాణాచీరమాత్మనః। వాసాగ్ంసి మమ గావశ్చ। అన్నపానే చ సర్వదా। తతో మే శ్రియమావహ। లోమశాం పశుభిః సహ స్వాహా।**
**ఆమాయన్తు బ్రహ్మచారిణః స్వాహా। విమాయన్తు బ్రహ్మచారిణః స్వాహా। ప్రమాయన్తు బ్రహ్మచారిణః స్వాహా। దమాయన్తు బ్రహ్మచారిణః స్వాహా। శమాయన్తు బ్రహ్మచారిణః స్వాహా।**
**యశో జనేఽసాని స్వాహా। శ్రేయాన్ వస్యసోఽసాని స్వాహా। తం త్వా భగ ప్రవిశాని స్వాహా। స మా భగ ప్రవిశ స్వాహా।తస్మిన్ సహస్రశాఖే। నిభగాఽహం త్వయి మృజే స్వాహా। యథాఽఽపః ప్రవతా యంతి। యథా మాసా అహర్జరమ్। ఏవం మాం బ్రహ్మచారిణః। ధాతరాయంతు సర్వతః స్వాహా। ప్రతివేశోఽసి ప్ర మా భాహి ప్ర మా పద్యస్వ।**

ఈ అనువాకం రెండు ఆధ్యాత్మిక సాధనలను నిర్దేశిస్తున్నది. అవి చిత్తశుద్ధికి తోడ్పడతాయి.

**5. జపసాధన అనువాకాలు 4,10**

**జపసాధన - 1 - అనువాకం 4** - జ్ఞానయోగ్యతాప్రాప్తి - జపం అంటే ఆవృత్తి. ఏదైనా ఒక మంత్రాన్ని తీసుకుని దాన్ని పదేపదే పఠించటం. (జపసాధన 2 - జ్ఞానప్రాప్తి అనువాకం 10లో వస్తుంది.)

**హోమసాధన** - ఈ సాధనలో ఒక యజ్ఞం చేస్తారు. అందులో కొన్ని ఆహుతులను వేస్తారు.

ఉపాసన మానసిక కర్మ, జపం వాచికకర్మ, హోమం కాయికకర్మ. ఆ విధంగా మూడు కర్మలూ ఉన్నాయి సాధకులకు.

**జపసాధన** - 1) జ్ఞానయోగ్యతాప్రాప్తి- ఈ మంత్రంలో భగవంతుణ్ణి ప్రార్థిస్తున్నాడు సాధకుడు. భగవంతుడు సర్వవ్యాపకుడు కాబట్టి నిర్గుణబ్రహ్మ. కాని మనం పూజ చేయటానికి వీలుగా ఒక ప్రతీకమీద ధ్యానం చేస్తాము. ఉదాహరణకు శివలింగాన్ని, సాలగ్రామాన్ని, పసుపు వినాయకుడిని ప్రతీకలుగా భావించి వాటిమీద భగవంతుణ్ణి ఆవాహన చేస్తాము. ఇక్కడ ప్రతీకగా ఓంకారం తీసుకోబడింది. ఓంకారరూప ఈశ్వరధ్యానం చేస్తాడు సాధకుడు. ఈ ప్రార్థనవల్ల కలిగే ఫలం జ్ఞానయోగ్యతాప్రాప్తి. ఈ ప్రార్థన చేయటానికి సాధకునికి

శరీరం, వాక్కు, మనస్సు, బుద్ధి ఆరోగ్యకరంగా ఉండాలి.

**శరీరం** – శరీరం ఆరోగ్యకరంగా లేకపోతే విద్యను అభ్యసించటానికి ఒక గంట కూడా కుదురుగా కూర్చోలేడు.

**వాక్కు** – ఉపనిషత్తుల్లోని బోధ గురుశిష్యుల సంవాదరూపంలో ఉంటుంది. శిష్యుడు వేసిన ప్రశ్నలకు అనువుగా బోధ చేస్తాడు గురువు. శిష్యుడు ప్రశ్న అర్థమయ్యేలాగా, స్పష్టంగా వేయాలి; గురువు కూడా అంత స్పష్టంగానూ బోధ చేయాలి. అందువల్ల ఇద్దరికీ వాక్కుయొక్క శక్తి బాగుండాలి.

**మనస్సు** – భావోద్రేకాలతో నిండిన మనస్సు ప్రశాంతంగా ఉండదు. అలా ప్రశాంతంగా లేని మనస్సు బోధను సరిగ్గా స్వీకరించలేదు. అందువల్ల మనస్సు ప్రశాంతంగా ఉండాలి.

**బుద్ధి** – బుద్ధి చాలా పదునుగా ఉండాలి. క్షురకుని కత్తి అంచులాగా పదునుగా ఉండాలని వస్తుంది కఠోపనిషత్తులో,

**సూక్ష్మయా సూక్ష్మదర్శిభిః** – కఠ

అంతేకాదు బుద్ధి చాలా సూక్ష్మంగా ఉండాలి. వేదాంతంలో శ్రుతిసమ్మత తర్కం, మీమాంస చాలా ఉంటుంది. నేను చెప్పింది ఎదురు ప్రశ్నించకుండా నమ్మండి అనడు గురువు. వేదాంతం అంటే కేవలం శ్రద్ధతో కూడినదో, అనుభవంలోకి వచ్చే అసాధారణ అనుభవమో కాదు. ఆత్మజ్ఞానం బుద్ధిలో కలిగే జ్ఞానం. అందువల్ల ఎవరైనా శిష్యునికి ఏదైనా అర్థం కాకపోతే గురువును ప్రశ్నలు అడిగి, తన సందేహాలను తీర్చుకోవాలి. నిశ్చయజ్ఞానం కలగాలంటే, అది బుద్ధిలోనే కలగాలి. బ్రహ్మానందవల్లీలో ఈ జ్ఞానం బుద్ధిలో ఎలా కలుగుతుందో చూస్తారు. జ్ఞానం అంటేనే బుద్ధిలో కలిగేదే కాని ముక్కులో కలిగేది కాదు అంటారు దయానంద స్వామీజీ.

ఈ అనువాకంలో సాధకుడు భగవంతుణ్ణి ఓంకారంమీద ఆవాహన చేస్తున్నాడు. తద్వారా తనకు జ్ఞానయోగ్యతాప్రాప్తిని కలుగజేయమంటున్నాడు. ఉపనిషత్తు ముందు ఓంకారాన్ని స్తుతించి, దాని తర్వాత ఈశ్వరుణ్ణి దానిమీద ఆవాహన చేస్తోంది. పంచాయతన పూజలో ముందు భగవంతుడు కూర్చునే పీఠాన్ని కీర్తించాక, భగవంతుణ్ణి పూజిస్తాము. అలాగే ముందు ఓంకారాన్ని కీర్తించాక, పరమేశ్వరుణ్ణి దానిమీద ఆవాహన చేస్తాము. ఆ విధంగా ఓంకారరూప పరమేశ్వర ప్రార్థన ఇది. ఈ నేపథ్యంతో ఈ మంత్రభాగాన్ని చూద్దాము.

**యశ్ఛందసామృషభో విశ్వరూపః। ఛందోభ్యోఽధ్యమృతాత్సంబభూవ। స మేంద్రో మేధయా స్పృణోతు। అమృతస్య దేవధారణో భూయాసమ్। శరీరం మే విచర్షణమ్। జిహ్వా మే మధుమత్తమా। కర్ణాభ్యాం భూరి విశ్రువమ్। బ్రహ్మణః కోఽశోసి మేధయా పిహితః। శ్రుతం మే గోపాయ।**

**యః ఛందసాం ఋషభః** – యః అంటే ఓంకారం. ఋషభః అంటే ఎద్దు. ఇక్కడ ఋషభః అంటే శ్రేష్ఠమైనది. ఛందసాం అంటే వేదమంత్రాలలో. ఈ వాక్యం అర్థం ఓంకారం వేదమంత్రాలన్నింటిలోకి శ్రేష్ఠతమమైనది అని.

**మహర్షీణాం భృగురహం గిరామస్మ్యేకమక్షరమ్** – గీత 10.25

తన విభూతులను వర్ణిస్తూ శబ్దాలలో ఏకాక్షరమైన ఓంకారాన్ని నేను అన్నాడు కృష్ణపరమాత్మ.

వేదమంత్రాలను రెండు కారణాలవల్ల ఛందస్సు అంటారు. ఒక కారణం ఛందస్సు అంటే ఆనందాన్ని ఇచ్చేది అని అర్థం. వేదాలను అధ్యయనం చేస్తే ఆనందం కలుగుతుంది. ఇంకొక అర్థం రక్షించేది అని. వేదమంత్రాలు మనని సంసారంనుంచి రక్షిస్తాయి.

**మననాత్ త్రాయతే ఇతి మంత్రః**

ఒకసారి బ్రహ్మదేవునికి వేదాలసారం తెలుసుకోవాలని అనిపించింది. దానికోసం తపస్సు చేశాడు. వేదాల సారం ఎలా వచ్చిందనేది అనేక దశలుగా భిన్న ఉపనిషత్తుల్లో చూస్తాము. కాని అన్నింటిలో చివరగా వచ్చే సారం ఓంకారం. గాయత్రీ మంత్రంలోని మూడు పాదాలు, మూడు వేదాల సారం అని చూస్తాము.

**ఋగ్వేదసారం – తత్సవితుర్వరేణ్యమ్**
**యజుర్వేదసారం – భర్గో దేవస్య ధీమహి**
**సామవేదసారం – ధియో యో నః ప్రచోదయాత్**

కాని కలియుగంలో మానవాళికి గాయత్రీమంత్రం చదివే తీరిక కూడా ఉండదని ఒక్కొక్క పాదాన్ని ఒక్కొక్క వ్యాహృతిగా తగ్గించాడు. మొదటిదాన్ని భూః వ్యాహృతిగా, రెండవ పాదాన్ని భువః వ్యాహృతిగా, మూడవ పాదాన్ని సువః వ్యాహృతిగా కుదించాడు బ్రహ్మ.

లౌకిక విజయాలకోసం పరుగులు తీస్తూ, వీటికి కూడా సమయం ఉండని వారికోసం ఈ వ్యాహృతులను ఇంకా ఏకాక్షరాలుగా కుదించాడు బ్రహ్మ. భూ వ్యాహృతిని 'అ' అక్షరంగా, భువః వ్యాహృతిని 'ఉ' అక్షరంగా, సువః వ్యాహృతిని 'మ' అక్షరంగా కుదించాడు బ్రహ్మ. ఈ మూడు అక్షరాలను ఓంకారపదంలోని మాత్రలు అంటారు. అ+ఉ+మ=ఓం. (అ+ఉ=ఓ – గుణసంధి) ఈ అంశాలనే మళ్ళీ ఒకసారి టూకీగా చూద్దాము.

**ఋగ్వేదసారం – తత్సవితుర్వరేణ్యమ్ – భూః వ్యాహృతి – అ**
**యజుర్వేదసారం – భర్గో దేవస్య ధీమహి – భువః వ్యాహృతి – ఉ = ఓమ్**
**సామవేదసారం – ధియో యో నః ప్రచోదయాత్ – సువః వ్యాహృతి – మ**

ఆ విధంగా ఓంకారం మొత్తం వేదాలసారం అయింది. (మూడు వేదాలనే చెప్పినా నాలుగు వేదాలసారంగా తీసుకోవాలి.)

**ఛందోభ్యః అమృతాత్** – అమృతమైన, శాశ్వతమైన వేదాలనుంచి,

**అధి సంబభూవ** – ఓంకారం గొప్పగా ఆవిర్భవించింది.

ఆ విధంగా అత్యంత శ్రేష్ఠమైన ఓంకారమంత్రం బ్రహ్మదేవుడు వేదాలను చిలకటంవల్ల ఆవిర్భవించింది. వేదాలను కుదించితే ఓంకారం వచ్చింది; ఓంకారాన్ని విస్తారంగా చూసుకుంటూ వెళితే, వేదాలు వస్తాయి. దీన్ని విశ్వరూపం అంటారు.

**సః ఇంద్రః** – ఆ ఓంకారాన్ని సాక్షాత్తూ ఆ పరమేశ్వరునిగా చూడాలి. ఇక్కడ ఇంద్రుడంటే దేవతల రాజైన ఇంద్రుడు కాదు. ఇక్కడ పరమేశ్వరుడు – ఓంకారరూప పరమేశ్వరః.

**స్పృణోతు మా** – ఆ పరమేశ్వరుడు నాకు బలాన్ని, శక్తిని ప్రసాదించుగాక. నేను జ్ఞానయోగ్యతాప్రాప్తి పొందటానికి నాకు ఈ క్రింది అర్హతలను ఇచ్చుగాక!

**మేధయా** – మేధాశక్తిని ప్రసాదించుగాక. మేధాశక్తి=గ్రహణశక్తి+ధారణశక్తి. గ్రహణ శక్తి అంటే నేర్చుకునే విద్యను గ్రహించేశక్తి; ధారణశక్తి అంటే నేర్చుకున్నదాన్ని అర్థం చేసుకుని, బుద్ధిలో నిలబెట్టుకునేశక్తి. మంచి శిష్యునికి ఈ రెండు శక్తులూ ఉండాలి. అప్పుడు ఈ శ్రేష్ఠమైన జ్ఞానాన్ని జీర్ణించుకోగలుగుతాడు సాధకుడు.

**దేవః** – ఓంకారరూపంలో ఉన్న ఓ పరమేశ్వరుడా!

**ధారణో భూయాసమ్** – నేను అమృతాన్ని ధరించేవాడను అగుదును గాక!

**అమృతస్య** – మామూలుగా అమృతం అంటే శాశ్వతం అంటే మోక్షం. కాని ఇక్కడ అమృతం అంటే అమృతత్వానికి కారణమైన బ్రహ్మజ్ఞానం. ఇక్కడ ఆత్మజ్ఞానం అమృతసాధనం. అమృతజ్ఞానాన్ని నేను ధరించటం వల్ల నేను మోక్షం పొందుదునుగాక. అంటే దీని అర్థం ఓ ఈశ్వరా! నన్ను జ్ఞానిని చేయి.

ఆత్మజ్ఞానం పొందాలంటే శ్రవణం చేయాలి. శ్రవణం నిర్వచనం – ఒక క్రమ పద్ధతిలో, క్రమం తప్పకుండా, కొన్ని సంవత్సరాలపాటు ఒక సమర్థవంతమైన గురువు వద్ద శాస్త్రాన్ని అధ్యయనం చేయాలి. అప్పుడే అజ్ఞాననివృత్తి కలిగి, జ్ఞానం పొందుతాము. ఈ నిర్వచనాన్ని ఆత్మజ్ఞానానికి మాత్రమే కాదు, లౌకికవిద్యలైన ఫిజిక్స్, కెమిస్ట్రీలకు కూడా వర్తింపజేయవచ్చు. అలా కొన్ని సంవత్సరాలు ఒక గురువు వద్ద విద్యని అభ్యసించాలంటే దానికి శరీరం, ఇంద్రియాలు, మనస్సు, బుద్ధి కూడా సహకరించాలి. వాటి ఆరోగ్యంకోసం ప్రార్థన చేస్తున్నాడు ఇప్పుడు.

**శరీరం మే విచర్షణమ్** – నా శరీరం ఆరోగ్యంగా ఉండుగాక!

**జిహ్వా మే మధుమత్తమా** – నా వాక్కు తీయగా ఉండేలా చేయి. నేను తేనెపలుకులను పలుకుదునుగాక! మధుమత్తమ అంటే అత్యంత తీయగా ఉండేలా చేయి. అంటే నేను మంగళకరమైన శబ్దాలే పలికేలా చేయి.

**అనుద్వేగకరం వాక్యం సత్యం ప్రియహితం చ యత్ ।**
**స్వాధ్యాయాభ్యసనం చైవ వాఙ్మయమ్ తప ఉచ్యతే ॥** – గీత 17.15

కృష్ణపరమాత్మ భగవద్గీతలో వాచిక తపస్సు పాటించాలంటే నాలుగు అంశాలను పాటించాలని చెబుతాడు. అవి –

1. **అనుద్వేగకరమ్** – మీరు మాట్లాడే మాటలు పరుషంగాను, ముక్కుసూటిగాను ఉండకూడదు. మాటలే కాదు, మీరు ఆ మాటలను పలికేతీరును, వేగాన్ని కూడా గమనించుకోవాలి. మీరు గుక్కతిప్పుకోకుండా గబగబా మాట్లాడితే ఎదుటివ్యక్తి మీ మాటలను అర్థం చేసుకోవటానికి చాలా శ్రద్ధపెట్టాల్సి ఉంటుంది. మీరు గొంతు చించుకుని మాట్లాడితే ఎదుటివ్యక్తికి అసౌకర్యంగా, బాధగా ఉంటుంది.

2. **ప్రియమ్** – మీ మాటలు ప్రియం చేకూర్చేవిగా ఉండాలి. అవి మర్యాదపూర్వకంగా, మెచ్చుకునేలా, వెన్నుతట్టి ప్రోత్సహించేలా ఉండాలి. ఒకవేళ విమర్శించాల్సి వచ్చినా అవి కూడా తియ్యగా, నొచ్చుకోకుండా, మర్యాదగా చెప్పాలి. ప్రతికూల మాటలకన్నా సానుకూల పదాలు ఎక్కువగా ఉండేటట్టు చూసుకోవాలి.

3. **సత్యమ్** – ఎదుటివారిని విమర్శించకూడదన్నామని అసత్యం చెప్పకూడదు. సత్యం పలకాలి.

4. **హితమ్** – మీరు మాట్లాడే మాటలు ఇటు మీకూ, అటు వినేవ్యక్తికీ కూడా మేలు చేసేవిగా ఉండాలి.

మీ మాటలు తియ్యగా ఉన్నాయో లేదో మీకు ఎలా తెలుస్తుందనే సందేహం రావచ్చు మీకు. దానికి ఒకటే గుర్తు. మీ మాటలు ఎదుటివారికి నచ్చకపోతే, వారే మీ దరిదాపుల్లో ఉండకుండా, మీనుంచి తప్పించుకుని పారిపోతారు.

**కర్ణాభ్యాం భూరి విశ్రువమ్** – నా చెవులు ఆరోగ్యకరంగా ఉండుగాక! వేదాంతం నేర్చుకోవాలంటే శ్రవణ, మనన, నిదిధ్యాసనలు చేయాలి. శ్రవణం అంటే గురువు దగ్గర కొన్ని సంవత్సరాలు విద్యను అభ్యసించాలని చూశాము. అందువల్ల చెవులను ప్రధానంగా శాస్త్రాధ్యయనానికే వాడేలా చూడు. అనవసరమైన విషయాలను వినకుండా చేయి. అలా వేదాంత శ్రవణం చేయటానికి కూడా పెట్టిపుట్టాలి. అందువల్ల తను పదేపదే శాస్త్రాన్ని వినేటట్టు చేయమని కోరుతున్నాడు శిష్యుడు. భూరి అంటే పదేపదే వినటం.

ఆ విధంగా తను జ్ఞానయోగ్యతాప్రాప్తి పొందటంకోసం తన జ్ఞానేంద్రియాలు, కర్మేంద్రియాలు ఆరోగ్యకరంగా ఉండాలని ప్రార్థన చేశాడు శిష్యుడు. అదయ్యాక మళ్ళీ ఒకసారి ఓంకారాన్ని స్తుతిస్తూ తన ప్రార్థనను ముగిస్తున్నాడు శిష్యుడు.

**బ్రహ్మణః కోశోఽసి మేధయా పిహితః** – ఒక కత్తిని ఒరలో పెట్టినట్టుగా, బ్రహ్మ అనే కత్తికి ఓంకారం ఒర అంటున్నాడు శిష్యుడు. సర్వవ్యాపకమైన బ్రహ్మను ఒక చిన్న ఒరలో పెట్టలేము. ఈ వాక్యం అర్థం ఏమిటంటే, ఓంకార విచారణ చేస్తే, బ్రహ్మజ్ఞానం పొందవచ్చు.

**ఓంకార విచారద్వారా బ్రహ్మ ప్రాప్తుం శక్యతే**

ఓంకార విచారణద్వారా బ్రహ్మను తెలుసుకోగలం కాబట్టి, ఓంకారాన్ని, బ్రహ్మను రక్షించే కోశంగా వర్ణిస్తున్నాడు.

మాండూక్యోపనిషత్తులో ఈ ఓంకార విచారణ బాగా వస్తుంది. ఓంకారంలోని నాలుగు మంత్రాలను, ఆత్మయొక్క నాలుగు పాదాలను తీసుకుని, ఓంకారంద్వారా తురీయబ్రహ్మను ఎలా అర్థం చేసుకోవచ్చో చాలా వివరంగా వస్తుంది.

ఓంకారం, బ్రహ్మకు పాత్ర అయితే, నేనెందుకు ఆ బ్రహ్మను తెలుసుకోలేకపోతున్నాను?

**ఓంకారస్థిత బ్రహ్మణః ఆవరణమ్ కిమ్**

ఈ ప్రశ్నను శిష్యుడు వేసి, అతనే జవాబు కూడా చెబుతున్నాడు.

మేధయా పిహితః – ఇక్కడ మేధ అంటే లౌకికజ్ఞానం లేదా లౌకికవిద్య అని అర్థం తీసుకోవాలి. లౌకికజ్ఞానాన్ని అనాత్మజ్ఞానం అంటారు. ఈ అనువాకంలోనే మేధా అంటే గ్రహణధారణశక్తి అన్నాము. అంటే చాలామందికి ఈ గ్రహణధారణశక్తి లౌకికవిషయాలమీదే ఉంది. అంటే వారు బాహ్యముఖంగా పరుగులు తీస్తున్నారు. ఆ విషయాల్లో ఎంతగా కూరుకుపోతున్నారంటే, ఒక్కక్షణం ఆ పరుగులను ఆపి, వేదాంతవిచారణ చేసే తీరికే ఉండదు. ఆ విధంగా బాహ్యదృష్టి వేదాంత శ్రవణాన్ని దూరం చేస్తోంది. జీవితంలో విజయం అనే నిచ్చెనలో పై మెట్లమీదకి ఎక్కినకొద్దీ వీటి మధ్య దూరం పెరుగుతూ వస్తోంది. అంతకంతకూ అగాధంలో కూరుకు పోతున్నారు.

పిహితః అంటే కప్పబడివుంది అని లక్షార్థం. నేను బాహ్యముఖంగా పరుగులు తీయటంవల్ల బ్రహ్మ కప్పబడిపోయాడు. ఓ ఓంకారమా, నేను పరుగులు ఆపి, అంతర్ముఖుడనయ్యేటట్టు నాకు తోడ్పడు.

ఇప్పుడు ఈ జపాన్ని ముగించబోతున్నాడు.

**శ్రుతం మే గోపాయ** – ఓ ఓంకారరూప పరమేశ్వరా! నేను వేదాంత శ్రవణంద్వారా విన్నదంతా నా మనస్సులో నిక్షిప్తమై ఉండేలా చేయి. శ్రుతం అంటే వేదాంత శ్రవణం; గోపాయ అంటే నా మనస్సులో నిక్షిప్తమై ఉండేలా చేయి. గురుకులంలో విద్యనభ్యసిస్తే, ఆ బోధ ఒక క్రమపద్ధతిలో, క్రమం తప్పకుండా జరుగుతుంది. కాని ఇప్పుడు లౌకిక విజయాలలో కూరుకుపోయి, మధ్యమధ్యలో వేదాంత శ్రవణం చేస్తే అది మర్చిపోయే ప్రమాదముంది. ముందు క్లాసులో విన్నది తర్వాత వచ్చే క్లాసులో మర్చిపోవచ్చు. అందువల్ల

నేను నేర్చుకున్న విద్యను మర్చిపోకుండా ఉండేలా చేయమని ప్రార్థన చేస్తున్నాడు శిష్యుడు.

ఇక్కడితో జపసాధన ముగిసింది. ఇది జపం కాబట్టి, దీన్ని పదేపదే చేయాలి.

ఇప్పుడు చేసేది హోమసాధన.

4. **హోమసాధన – అనువాకం 4 –** ఇందులో పదేపదే వచ్చిన ఈ స్వాహా పదం ఇది హోమసాధన అని సూచిస్తున్నది. హోమంలో అగ్నిలో ఆహుతులు వేస్తారు. ఈ హోమసాధన ద్వారా కూడా ఓంకారరూప పరమేశ్వరుణ్ణి ధ్యానిస్తున్నాడు శిష్యుడు. ఈ హోమం **ఆవహంతీ** పదంతో మొదలయింది కాబట్టి, ఇది ఆవహంతీ హోమంగా ప్రసిద్ధి చెందింది. ఈ రోజుల్లో కూడా ఈ హోమాన్ని చేస్తారు. ఈ ఆవహంతీ హోమం ఇక్కడ మొదలై ఈ అనువాకం చివరిదాకా సాగుతుంది. ఈ హోమం ద్వారా సాధకుడు నాలుగు అంశాలను కోరుతున్నాడు.

1. **ధనప్రాప్తి** – ఐశ్వర్యం. ధనం కోరుతున్నాడు.

2. **చిత్తశుద్ధి ప్రాప్తి** – చిత్తశుద్ధి కలగాలని కోరుకుంటున్నాడు. చిత్తశుద్ధి అంటే మనస్సు స్వచ్ఛంగా ఉండటం. చిత్తశుద్ధి అంతిమలక్ష్యం కాదు, అది జ్ఞానయోగ్యతాప్రాప్తిని ఇస్తుంది. మీరు తినే కంచాన్ని శుభ్రంగా కడిగి ఉంచుకుంటారు. ఎందుకు? తర్వాత దానిలో తినేందుకు వీలుగా.

3. **జ్ఞానప్రాప్తి** – చిత్తశుద్ధి పొందాక జ్ఞానం పొందాలి అని కోరుకుంటున్నాడు.

4. **శిష్యప్రాప్తి** – శిష్యులు అధికసంఖ్యలో రావాలని కోరుకుంటున్నాడు. తను జ్ఞానం పొందాక, తను పొందిన జ్ఞానాన్ని నలుగురితో పంచుకోవాలి. అన్ని దానాల్లోకి విద్యాదానం శ్రేష్ఠమైన దానం.

మంత్రంలో ఇదే వరుసక్రమంలో రాదు శిష్యుని ప్రార్థన. కాని ఈ వరుసక్రమంలో చెప్పటంలో ఒక ప్రత్యేకత ఉంది. ఎవరైనా ముందు కోరేది ధనాన్ని. ధనం చిత్తశుద్ధిని పెంపొందించేలా ఖర్చుపెట్టాలి; దాని తర్వాత వేదాంతం నేర్చుకుని, దాన్ని నలుగురికీ పంచాలి. ఇలా సాగాలి ఒక సాధకుని జీవనయానం. ఇప్పుడు ఈ నాలుగు అంశాలనూ వివరంగా చూద్దాము.

1. **ధనప్రాప్తి** – కర్మయోగాన్ని పాటించటానికి ధనం కావాలి. కర్మయోగం ఒక సాధకుడు చేసితీరాల్సిన మొట్టమొదటి సాధన.

| | | |
|---|---|---|
| కర్మయోగం | = సరియైన కర్మ | + సరియైన దృక్పథం |
| సరియైన కర్మ | = సాత్త్వికర్మ | + పంచమహాయజ్ఞాలు |
| సరియైన దృక్పథం | = ఈశ్వరార్పణబుద్ధి | + ఈశ్వరప్రసాదబుద్ధి |

అందువల్ల కర్మయోగంలో పంచమహాయజ్ఞాలు చేయాలి. అవి దైవయజ్ఞం, ఋషియజ్ఞం, పితృయజ్ఞం, మనుష్యయజ్ఞం, భూతయజ్ఞం. ఈ యజ్ఞాలన్నింటిలోనూ సాధకుడు తిరిగి తీసుకునేదానికన్నా ఇచ్చేది ఎక్కువ ఉంటుంది. సాధకుడు సమాజానికి సేవ చేయాలంటే దానికి సరిపడా ఐశ్వర్యం ఉండాలి. అందువల్ల శాస్త్రం ధనం ధర్మార్థం అంటుంది. ధనాన్ని కోరికలను తీర్చుకోవటానికి వాడకూడదు. ధనం సంపాదించటంవల్ల కొన్ని సుఖాలు కలుగుతాయి కాని అవే అంతిమలక్ష్యంగా భావించకూడదు.

2. **చిత్తశుద్ధిప్రాప్తి** – పంచమహాయజ్ఞాలు చేసి, గృహస్థాశ్రమాన్ని ధర్మబద్ధంగా నడిపితే, కర్మయోగంవల్ల చిత్తశుద్ధి పొందుతాడు. అంటే జ్ఞానయోగ్యతాప్రాప్తి పొందుతాడు. జ్ఞానయోగ్యత పొందాలంటే సాధన చతుష్టయ సంపన్నుడై ఉండాలి. సాధన చతుష్టయ సంపత్తి అంటే వివేకం, వైరాగ్యం, ముముక్షుత్వం, శమాదిషట్కసంపత్తి.

ఒక సాధకుడు గృహస్థుగా తన జీవితాన్ని గడపటంవల్ల అతను సంతతిని పొందుతాడు. కాని అదే అతని అంతిమలక్ష్యంగా ఉండకూడదు. సంతతిని పొందటాన్ని అవాంతరఫలం అంటారు. ఈ అవాంతరఫలంవల్ల తన వంశాభివృద్ధికి అతను తోడ్పడతాడు. అంటే కులపరంపరను పెంపొందిస్తాడు. కాని అతని ముఖ్యఫలం వేదాంతజ్ఞానం పొందాలి. వేదాంతజ్ఞానం పొందాలనే తపన అతనికి వచ్చిందంటేనే అతని మనస్సు శుద్ధి పొందిందని అర్థం.

3. **జ్ఞానప్రాప్తి** – చిత్తశుద్ధి పొందగానే సరిపోదు. అది జ్ఞానయోగ్యతాప్రాప్తిని కలుగ జేస్తుంది కాని జ్ఞానప్రాప్తిని కాదు. దానికి ఒక సమర్థవంతమైన గురువు దొరకాలి. అందువల్ల సాధకుడు తనకు జ్ఞానప్రాప్తి కలిగేలాగా దీవించమని కోరుతున్నాడు భగవంతుణ్ణి.

4. **శిష్యప్రాప్తి** – తను పొందిన జ్ఞానాన్ని నలుగురికీ పంచితేనే తన జన్మ ధన్యమైనట్టు అర్థం. తను నలుగురికి విద్యను పంచిపెట్టాలంటే, విద్యార్థులు తనను వెతుక్కుంటూ రావాలి. గృహస్థుగా అతను కులపరంపరను పెంపొందిస్తే, గురువుగా గురుశిష్య పరంపరను కూడా నిలబెడతాడు.

**తతో మే శ్రియమావహ** – దాని తర్వాత లక్ష్మీదేవి నా ఇంటికి రాగాక అని కోరుతున్నాడు శిష్యుడు. అంటే నాకు ఐశ్వర్యం కలుగుగాక అని అర్థం. తతః అంటే దాని తర్వాత. దాని తర్వాత అంటే దేని తర్వాత? వేదమంత్రాల్లో ఏ ఒక్కపదాన్ని కూడా తేలిగ్గా తీసుకోకూడదు. ప్రతి పదానికీ లోతైన అర్థం ఉంటుంది. శంకరాచార్యులవారు ఈ తతః పదానికి అర్థం మేధానిర్వర్తనాత్ పరమ్ అని ఇచ్చారు. అంటే మేధను తీసుకువచ్చిన తర్వాత అంటున్నారు. అంటే ధర్మశాస్త్రం నేర్చుకున్నాక, డబ్బు సంపాదించాలి.

ధనం అనేది రెండువైపులా పదును ఉన్న కత్తి. అందువల్ల ధనాన్ని సద్వినియోగం చేస్తే అది ఆధ్యాత్మిక ఉన్నతికి తోడ్పడుతుంది; అదే ధనాన్ని దుర్వినియోగం చేస్తే అది ఆధ్యాత్మిక పతనానికి దారితీస్తుంది. అందువల్లనే ధనాన్ని **మంచి సేవకుడు, చెడ్డ యజమాని** అంటారు. అటువంటి ధనాన్ని సేవకునిగా మన చెప్పుచేతల్లో పెట్టుకోవాలా, దాన్ని యజమానిని చేసి అది ఆడించినట్లుగా మనం ఆడాలా?

ధనాన్ని మన చెప్పుచేతల్లో పెట్టుకోవాలి అంటే ముందు మనం ధర్మశాస్త్రజ్ఞానం కలిగివుండాలి. అంటే నైతికవిలువ, పుణ్యం, పాపం, ధర్మబద్ధమైన జీవనం గురించి మనకు చాలా స్పష్టమైన జ్ఞానం ఉండాలి. ఈ జ్ఞానాన్ని ధర్మశాస్త్రంద్వారానే పొందగలము. ధర్మశాస్త్రంలో అనేక విధి-నిషేధాలు ఉంటాయి. ఏది చేయకూడదు, ఏది చేయాలి అనే సంకటస్థితి ఎదురైనప్పుడు ధర్మశాస్త్రం దానికి సరియైన పరిష్కార మార్గాన్ని సూచిస్తుంది. ఎంత ధనం సంపాదించాలి, ఎంత ధనం దానం చేయాలి అనే విషయాలన్నీ అందులో విపులంగా చర్చించబడివుంటాయి.

అందువల్ల ధర్మశాస్త్రాన్ని ఔపోసన పట్టందే ఎవరూ ధనాన్ని కోరకూడదు అంటున్నారు శంకరాచార్యులవారు. ధనాన్ని కోరేముందు మేధస్సును కోరాలి. అదీ మన సాంప్రదాయం. అందువల్లనే చూడండి, ఆ రోజుల్లో మన పెద్దవారు పిల్లలమైన మనకి పాకెట్‌మనీ అని ఏమీ ఇవ్వలేదు. ఇప్పటి పరిస్థితులు మారాయి, ఆలోచనలు మారాయి. పిల్లలకు ఎంత ఎక్కువ పాకెట్‌మనీ ఇస్తే వారికి పిల్లలమీద అంత ప్రేమ ఉన్నట్టు అనుకుంటారు వారు. కాని ధర్మాధర్మవిచక్షణ లేని లేతవయస్సులో వారికి సమృద్ధిగా ధనాన్ని వెదజల్లి, చేజేతులా వారిని నాశనం చేస్తున్నామని గ్రహించుకోరు. వారు మత్తుమందు, మత్తుపానీయాలకు లోబడినా ఆశ్చర్యపోనవసరం లేదు. హాస్టల్లో ఒంటరిగా ఉన్న విద్యార్థులకు ఆ ప్రమాదం ఉంది.

పూర్వం హాస్టలు బదులు గురుకులంలో ఉండేవారు శిష్యులు. అంటే గురువుతో ఆయన ఆశ్రమంలో ఉండేవారు. ఆ రోజుల్లో వారు బ్రహ్మచారిగా విద్యనభ్యసిస్తున్నప్పుడు వారి చేతిలో చిల్లుకానీ ఉండనిచ్చేవారు కాదు. వారి అవసరాలన్నీ గురువే చూసుకునేవాడు. అందువల్ల వారికి దేనికోసం ధనం అవసరం ఉండేదికాదు. అక్కడ ధర్మశాస్త్రం నేర్చుకుని, బయటకు వచ్చాకనే, ఏ రాజునో మెప్పించి, ధనాన్ని పొందుతారు. అందువల్ల తతః అంటే ధర్మజ్ఞాన అనంతరం లేదా మేధాప్రాప్తి అనంతరం. ఈ మేధాప్రాప్తి కేవలం లౌకికవిద్యతో రాదు; విద్యార్థి ధర్మం గురించి, విలువల గురించి కూడా నేర్చుకోవాలి.

లక్ష్మీదేవిని రమ్మని ప్రార్థన చేస్తున్నాడు శిష్యుడు. కాని లక్ష్మీదేవిని ఒంటరిగా రమ్మని కోరటం లేదు. ఆమెతో పాటు తీసుకురావాల్సిన ఐశ్వర్యాన్ని కూడా చెబుతున్నాడు. ఇక్కడ కూడా ఐశ్వర్యం రావాలి, అది పెరగాలి, తను పదికాలాలపాటు నిలుపుకోగలగాలి. అంటే మూడు దశలు ఉన్నాయి.

ధనం సంపాదించటం → విస్తరింపజేయటం → పదికాలాలపాటు నిలుపుకోవటం. ఈ నేపథ్యంతో ఈ మంత్రభాగాన్ని చూద్దాము.

**ఆవహన్తీ వితన్వానా। కుర్వాణాచీరమాత్మనః। వాసాగ్ంసి మమ గావశ్చ। అన్నపానే చ సర్వదా। తతో మే శ్రియమావహ। లోమశాం పశుభిః సహ స్వాహా।**

**ఆవహంతీ** – ధనం సంపాదించటం.

**వితన్వానా** – పొందిన ఐశ్వర్యాన్ని విస్తరింపజేయటం.

**కుర్వాణా సర్వదా** – పదికాలాల పాటు నిలుపుకోవటం.

ఇక్కడ సాధకుడు కోరుతున్న లౌకికవిజయాలు ఏమిటి?

**ఆత్మనః** – నాకు (నా కుటుంబానికి అని కలుపుకోవచ్చు).

**వాసాగ్ంసి** – అనేక వస్త్రాలను,

**గావః చ** – గోవులను. గోవులను అంటే ఐశ్వర్యంగా తీసుకోవాలి. అంటే బంగారం, ధనం, ఆస్తులు, వాహనాలు అన్నీ వస్తాయి అందులో.

**అన్నపానమ్** – ఆహారపానీయాలు కూడా.

వీటిని తీసుకుని లక్ష్మీదేవి ఎప్పుడు రావాలి?

**అచీరమ్** – వెంటనే రావాలి.

కాని ఇక్కడ ఒక విషయం గుర్తుంచుకోవాలి. ఇక్కడ సాధకుడు శాస్త్రాన్ని నమ్మి, వైదిక జీవనవిధానాన్ని గడిపేవ్యక్తి. ధర్మప్రధాన పురుషుడు. అందువల్ల అతను కోరే ఈ సంపద అంతా తన స్వార్థంకోసం కాదు, ధర్మాచరణకోసం; తర్వాత మోక్షం పొందటంకోసం. అందువల్ల అతనికి కామపురుషార్థం ముఖ్య లక్ష్యంగా ఉండదు.

ఆ సాధకుడు చలిప్రాంతంలో ఉన్నాడేమో, అందువల్ల ఉన్నిదుస్తులు కూడా కోరుతున్నాడు.

**లోమశాం పశుభిః సహ** – లోమశాం అంటే ఉన్ని. ఉన్ని అధికంగా ఉండే సంపదను కోరుతున్నాడు. అంటే గొర్రెలతో కూడిన సంపదను. ఒక్కముక్కలో చెప్పాలంటే నేను ఐశ్వర్యవంతుణ్ణి అవుగాక అని అర్థం.

దీన్నిబట్టి ఒక విషయం స్పష్టంగా తెలుస్తున్నది. శాస్త్రం ఎన్నడూ ధనసంపాదనను కించపరచలేదు. కాని చాలా మంది, వైదిక సాంప్రదాయంలో ఉన్నవారు కూడా ధనార్జనను విమర్శిస్తారు. అలా ధనార్జనను విమర్శిస్తే, అది సాక్షాత్తూ లక్ష్మీదేవినే విమర్శించినట్టు అర్థం. మన శాస్త్రం ధనం సంపాదించాలి కాని దాన్ని ధర్మబద్ధంగా ఖర్చు పెట్టాలి అంటుంది. ధనం ధర్మార్థం అంటుంది.

ధనం లేకుండా పెద్ద ఆశ్రమాలను నడపలేరు; ఆలయాలలో పూజాదికాలు నిర్వర్తించలేరు; వేదపాఠశాలల్లో విద్యను బోధించలేరు. నాలుగు ఆశ్రమధర్మాల్లో మూడింటిలో సంపాదన ఉండదు. బ్రహ్మచర్యంలో, వానప్రస్థంలో, సన్న్యాసంలో సంపాదన ఉండదు. వారు వారి జీవనంకోసం గృహస్థుమీదే ఆధారపడాలి. గృహస్థు బాగా ధనం సంపాదించాలి కాని దాన్ని ఈ ముగ్గురితోనూ పంచుకోవాలి. అందువల్ల శాస్త్రం ధనం సంపాదిస్తే తప్పు పట్టదు; కాని స్వార్థంగా ప్రవర్తించి, దానధర్మాలు చేయకపోతే మాత్రం విమర్శిస్తుంది. అలా చెప్పగలగటానికి మనకు ఆధారం ఈ మంత్రమే.

బాహ్యంగా సంపాదించి కర్మయోగం పాటిస్తే చిత్తశుద్ధికి దారితీయాలి; చిత్తశుద్ధివల్ల జ్ఞానం పొందుతాడు, జ్ఞానం పొందాక తను తిరిగి బోధించగలుగుతాడు.

**ఆమాయన్తు బ్రహ్మచారిణః స్వాహా। విమాయన్తు బ్రహ్మచారిణః స్వాహా। ప్రమాయన్తు బ్రహ్మచారిణః స్వాహా। దమాయన్తు బ్రహ్మచారిణః స్వాహా। శమాయన్తు బ్రహ్మచారిణః స్వాహా। యశోజనేఽసాని స్వాహా। శ్రేయాన్ వస్యసోఽసాని స్వాహా। తం త్వా భగ ప్రవిశాని స్వాహా। స మా భగ ప్రవిశ స్వాహా।**

ఈ మంత్రభాగంలో శిష్యుడు తనకు శిష్యప్రాప్తి కలగాలని ప్రార్థిస్తున్నాడు. అతను ఇంకా శిష్యుడే, గురువు అవలేదు; కాని భవిష్యత్తులో గురువు అవుతాడు కాబట్టి దేశం నలుమూలలనుంచీ శిష్యులు తనను వెతుక్కుంటూ రావాలని ప్రార్థిస్తున్నాడు. ముందే చూసినట్టుగా ఈ ప్రార్థన తన కీర్తికోసమో, శిష్యులనుంచి ధనం సంపాదించటంకోసమో చేయటం లేదు, కాని ఋషుల ఋణం తీర్చుకోవటంకోసం అతను బోధ చేయాలి.

**ఆమాయన్తు బ్రహ్మచారిణః** – మా ఆయంతు బ్రహ్మచారిణః అని చదవాలి. ఆ అనే ఉపసర్గను విడిగా ఉన్న క్రియాపదంతో కలిపి ఆయంతు అని అన్వయించాలి. అనేక బ్రహ్మచారులు నా దగ్గరికి వచ్చుగాక! బ్రహ్మచారి అంటే శిష్యుడు. బ్రహ్మ అంటే వేదం, చారి అంటే శిష్యుడుగా క్రమశిక్షణతో జీవితం నడిపేవాడు అని అర్థం. ఆచరతి ఇతి చారి. ఒక శిష్యుడు పాటించాల్సిన ప్రాథమిక క్రమశిక్షణ – హోమ్‌వర్క్ చేయటం. కాని శాస్త్రం అతనికి ఇంకా కొన్ని నియమాలను విధించింది. ఆతను సుఖాలకు లోనుకాకూడదు, బాహ్యవిషయాలలో అతిగా మునిగిపోకూడదు, శరీరసౌందర్యంమీద అతిగా శ్రద్ధ చూపకూడదు. అలా శరీరసౌందర్యంలో మునిగిపోతే, సూక్ష్మశరీరాన్ని మర్చిపోతాడు. బ్రహ్మచారి తన అంతరంగంలో వైదికవిద్యను నిలుపుకోవాలి.

**వ్రతం చరతి ఇతి బ్రహ్మచారీ**

వేదార్థాన్ని నేర్చుకున్న వ్యక్తి బ్రహ్మచారి. బ్రహ్మచారి అంటే పెళ్ళికాని వ్యక్తి అని కాదు అర్థం. బ్రహ్మార్థాన్ని అభ్యసించేవాడు అని అర్థం. కాకపోతే, విద్యనభ్యసించే బ్రహ్మచారి

వివాహం చేసుకోడు. అందువల్ల రానురాను దాని ప్రాథమిక అర్థం మరుగునపడిపోయి, లక్ష్యార్థం వాడుకలోకి వచ్చింది. బ్రహ్మచారి అంటే పెళ్ళికాని వ్యక్తి అని వచ్చింది.

**స్వాహా** – ఈ మంత్రం చదువుతూ బ్రహ్మచారి అగ్నిలో ఆహుతులు వేస్తున్నాడు.

అతను ఎటువంటి బ్రహ్మచారులను (శిష్యులను) కోరుతున్నాడు?

**విమాయంతు బ్రహ్మచారిణః స్వాహా** – 'వి' అంటే భిన్న విషయాలమీద ఆసక్తి కలవాడు.

**వివిధ కామనావంతః మాయంతు**

శిష్యులకు భిన్నశాస్త్రాలమీద ఆసక్తి ఉంటేనే గురువుకు వాటిని బోధించే వీలు ఉంటుంది. శాస్త్రం అంటే ప్రధానంగా ఉపనిషత్తులు, భగవద్గీత వచ్చినా, శాస్త్రంలో ఇంకా తర్కశాస్త్రం, మీమాంసాశాస్త్రం, వ్యాకరణశాస్త్రం అలా ఎన్నో ఉన్నాయి. అవి నేర్వాలంటే శిష్యులకు వాటిమీద శ్రద్ధ ఉండాలి. మా అంటే నాకు. మా అంటే వద్దు అనికూడా అర్థం వస్తుంది. అది సరిగ్గా అర్థం చేసుకోకపోతే నాకు బ్రహ్మచారులు వద్దు అని శిష్యుడు కోరినట్టు అర్థం వస్తుంది. వివిధ విషయాలమీద శ్రద్ధ ఉన్నవారు వచ్చుగాక!

**ప్రమాయంతు బ్రహ్మచారిణః** – ప్ర అంటే ప్రజ్ఞావంతః – ప్రజ్ఞావంతులైన విద్యార్థులు వచ్చుగాక. విద్యార్థుల ప్రజ్ఞను మూడు విధాలుగా విభజించవచ్చు.

1. **ఉత్తమ అధికారి** – అతను చెప్పింది చెప్పినట్టు గ్రహిస్తాడు. అటువంటి శిష్యులకు బోధించాలంటే గురువుకు కూడా ఉత్సాహంగా ఉంటుంది. ఈ ఉత్తమ అధికారి కర్పూరం త్వరగా అంటుకున్నట్టు, విషయాన్ని త్వరగా నేర్చుకుంటాడు. ఇతనిది కర్పూరబుద్ధి.

2. **మధ్యమ అధికారి** – ఇతనికి అర్థం కావటానికి కొంత సమయం పడుతుంది కాని ఒకసారి నేర్చుకున్నాక, ఆ జ్ఞానంలో నిలబడతాడు. బొగ్గు వెంటనే వెలగదు. దాన్ని అంటించాక కొంచెం విసనకర్రతో విసరాలి. అందువల్ల ఇతనిది బొగ్గుబుద్ధి.

3. **అధమ అధికారి** – ఇతను విషయాన్ని అర్థమూ చేసుకోలేడు, దాన్ని నిలుపుకోనూ లేడు. అర్థమయితే కదా ఆ జ్ఞానాన్ని నిలబెట్టుకునేది. అతనికి అర్థం కాకపోయినా ఫర్వాలేదు. అతని మందబుద్ధితో గురువుకు వచ్చినది కూడా గురువు మర్చిపోయేలా చేయగలడు. అరటిబోదెను అగ్నిలో పెడితే, అది వెలగదు సరికదా, ఆ మంటను కూడా ఆర్పేస్తుంది. ఇతనిది అరటిబోదె బుద్ధి.

**దమాయంతు బ్రహ్మచారిణః** – ద అంటే దాంతః. అంటే ఇంద్రియనిగ్రహం ఉన్న వ్యక్తి. శమాదిషట్కసంపత్తిలో దమము వస్తుంది. దమము అంటే ఇంద్రియనిగ్రహం. ఇంద్రియనిగ్రహం ఉన్న వ్యక్తే, గురువు చెప్పే బోధ మీద ఏకాగ్రత చూపగలుగుతాడు.

ఒక క్లాసులో ఒక గురువు బోధ చేస్తుండగా, ఒక శిష్యుడు అది వినకుండా ఒక కలుగులోకి ఎలుక దూరే ప్రయత్నాన్ని తదేకదృష్టితో చూస్తున్నాడు. గురువు తన బోధంతా అయ్యాక, 'దూరిందా?' అన్నాడు. ఆయన ఉద్దేశ్యం 'నీ మెదడులోకి దూరిందా?' అని. కాని శిష్యుడు ఏమాత్రం ఆలోచించకుండా 'తోక మాత్రం మిగిలింది,' అన్నాడు. ఇంద్రియాలను అదుపులో పెట్టుకోలేని శిష్యుని పరిస్థితి ఇలాగే ఉంటుంది.

**శమాయంతు బ్రహ్మచారిణః** – శమాదిషట్కసంపత్తిలో శమము అంటే మనోనిగ్రహం అని వస్తుంది. మనోనిగ్రహం లేకపోతే చిత్తఏకాగ్రత అలవడదు. మనోనిగ్రహం ఉన్న బ్రహ్మచారి తను దేనికోసం గురువు దగ్గరకు వచ్చాడో దాన్ని మర్చిపోడు.

ఇక్కడితో శిష్యప్రాప్తి ప్రార్థన ముగుస్తుంది. ఇప్పుడు సాధకుడు తను ఏ అంశంతో మొదలుపెట్టాడో, మళ్ళీ ఆ అంశానికి తిరిగివస్తున్నాడు.

**యశో జనే అసాని స్వాహా** – నేను బాగా కీర్తిప్రతిష్ఠలు పొందుగాక. యశః అంటే కీర్తి. అతని కీర్తి దిగదిగంతాలకు వ్యాపిస్తేనే, అతనికి అన్ని మూలలనుంచీ విద్యార్థులు వస్తారు. అసాని అంటే ఆచార్యుడు. జనే అంటే మనుష్యులు. మొత్తం వాక్యం అర్థం – నేను మనుష్యులలో కీర్తిమంతుడను అవుదును గాక!

**శ్రేయాన్ అసాని స్వాహా వస్యసః** – నేను ఈ సమాజంలో గొప్ప ఐశ్వర్యవంతుడను అవుదును గాక. పూర్వం గురుకులవాసంలో శిష్యులు అంతేవాసులుగా ఉండేవారు. వారి ఖర్చులన్నీ గురువే భరించేవాడు. విద్యను ఉచితంగా బోధించేవాడు. శిష్యులు గురుదక్షిణను ఇవ్వాలికాని, గురువు ఎన్నడూ ఆశించకూడదు. అంతమంది విద్యార్థులకు తన ఖర్చుతో తన ఆశ్రమంలో ఉంచి వసతి సౌకర్యాలు, అన్నపానీయాలు సమకూర్చాలంటే ఎంత ఖర్చవుతుందో చూడండి! అందువల్ల వసీయాన్ అంటే సంపన్నుడవాలి.

ముందే చూసినట్టుగా సాధకుడు ఐశ్వర్యం కోరేది తన సుఖాలకోసం కాదు. ఇటువంటి గురుకుల వ్యవస్థయొక్క ఆవశ్యకతను సమాజం గుర్తించాలి. పూర్వం ఆ గురుతమ బాధ్యతను సమాజం వహించేది. గురువు ఆశ్రమనిర్వహణకు కావాల్సిన ధనంకోసం దిగులుపడుతూ కూర్చోనవసరం లేకుండా, ఆ అవసరాలు తీరేవి. అలాగే విద్యార్థులు కూడా నిశ్చింతగా విద్యనభ్యసించేవారు. సరస్వతీ కటాక్షం కోరేవారు లక్ష్మీదేవి గురించి బెంగపడకుండా ఉండేటట్టుగా ఉండాలి. అందువల్లనే నోబెల్ బహుమతి గ్రహీతలు ఎక్కువగా అమెరికాలో ఉన్నారు. ఎందుకంటే అలాంటి మేధావులను దేశం గుర్తించి, వారి రంగంలో వారు నిరాటంకంగా పరిశోధన నడపటానికి అవసరమైన తక్కిన వనరులనన్నిటినీ వారికి సమకూర్చిపెట్టేది. అందువల్ల ఇక్కడ సాధకుడు, తను సరస్వతికృపను నిరాటంకంగా పొందటానికి లక్ష్మీదేవి తన కరుణాకటాక్షాలను తనమీద కురిపించుగాక అంటున్నాడు.

ఇతను ధనం కోరేది తనకోసం కాదు అంటూ చెబుతూ వస్తున్నాము. ఇప్పుడు ఆ సాధకుడే చెబుతున్నాడు, తను ఎందుకు ఆ ధనం కోరుతున్నాడో!

**భగ** – ఓ భగవంతుడా!

**తం త్వా ప్రవిశాని స్వాహా** – నీలో నేను ప్రవేశించుగాక! అంటే జీవాత్మ–పరమాత్మ ఐక్యం కోరుతున్నాడు. ఈ ఐక్యం జ్ఞానంవల్లనే సాధ్యం. ఇదే మన సాంప్రదాయం యొక్క ప్రత్యేకత. మన దేశం జ్ఞానానికి పెద్దపీట వేస్తుంది. భారతదేశంలో భారతమ్ అంటే జ్ఞానంలో రమించేది అని అర్థం. భా అంటే కాంతి అంటే జ్ఞానం; రతమ్ అంటే రమించటం. మన కార్యకలాపాన్నీ ఈ జ్ఞానం పొందటానికే నిర్దేశింపబడ్డాయి. ధనసంపాదన కూడా జ్ఞానసముపార్జనకే వినియోగించబడుతుంది. పెళ్ళి చేసుకునేది కూడా కేవలం పిల్లలను కనటానికి కాదు; జ్ఞానసముపార్జనకు.

సంధ్యావందనం మంత్రంలో ఈ విషయాన్ని గుర్తు తెచ్చుకుంటాము. **మహేరణాయ చక్షషే** – ఓ భగవాన్, నాకా అంతిమజ్ఞానం ప్రసాదించు. దానికి కావాల్సిన అర్హతలేమిటో నాకు తెలియదు, కాని నువ్వే ఆ అర్హతలను కూడా ప్రసాదించు.

**ఉశతీరివ మాతరః తస్మా అరంగమామ వః।**

**యస్య క్షయాయ జిన్వథ ఆపో జనయథా చ నః॥**

తల్లి ఎలాగైతే తన పసికందుకు ఏ సమయంలో ఎటువంటి ఆహారం ఇవ్వాలో తెలుసుకుని అలా ఇస్తుందో, నాకు ఎప్పుడు ఏ అర్హతను ఇవ్వాలో అప్పుడు నువ్వే దాన్ని ప్రసాదించు. నాకు వివేకం, వైరాగ్యం, శమాదిషట్కసంపత్తి, ముముక్షుత్వాలను ప్రసాదించి, జ్ఞానయోగ్యతాప్రాప్తిని కలుగజేయి. తర్వాత నేను ఆత్మజ్ఞానం పొందేలాగా చేయి అంటున్నాడు. అందువల్ల భగవంతునిలో ఐక్యం అవాలి అంటే జ్ఞానప్రాప్తి కలగాలి అని అర్థం.

నేను నీలో ఐక్యమవటమే కాదు, నువ్వు నాలో ఐక్యం అవాలి కూడా అంటున్నాడు.

**భగ** – ఓ భగవాన్,

**మా ప్రవిశ** – నువ్వు నాలో ప్రవేశించు. అప్పుడు ఇద్దరం ఒకటి అవుతాము. నది సముద్రంలో కలవటానికి ఉరకలు పెడుతూ వస్తుంటే, సముద్రం కూడా ఉత్సాహంగా ఎదురువెళ్ళి తనలో కలుపుకుంటుంది. అందువల్ల నది, సముద్రంలో కలిసినచోట నీరు త్రాగిచూస్తే ఉప్పగా ఉంటుంది. అంటే నది సముద్రంలో కలవటమే కాదు, సముద్రం కూడా నదిలో కలుస్తుంది. అలా నేను నీలో ప్రవేశించినప్పుడు, నువ్వు నాలో ప్రవేశించు అంటున్నాడు శిష్యుడు.

**తస్మిన్ సహస్రశాఖే। నిభగాఽహం త్వయి మృజే స్వాహా। యథాఽఽపః ప్రవతా యంతి। యథా మాసా అహర్జరమ్। ఏవం మాం బ్రహ్మచారిణః। ధాతరాయంతు సర్వతః స్వాహా। ప్రతివేశోఽసి ప్ర మా భాహి ప్ర మా పద్యస్వ।**

ఇప్పుడు శిష్యుడు చిత్తశుద్ధికోసం ప్రార్థన చేస్తున్నాడు. ఎందుకంటే చిత్తశుద్ధి లేనిదే జ్ఞానం పొందలేనని అతనికి తెలుసు. చిత్తశుద్ధి పొందటమంటే మనస్సులో ఉన్న మలినాలను కడిగివేయటం. శారీరక మలినాలనైతే నదిలో మునగటంద్వారా (పూర్వం నదీస్నానాలు చేసేవారు) పారద్రోలవచ్చు. మనస్సులో ఉన్న మలినాలను ఈశ్వరభక్తిలో మునగటం ద్వారా పారద్రోలవచ్చు. వైష్ణవభక్తులను ఆళ్వార్లు అంటారు. ఆళ్వార్ అంటే మునగటం. వారు దైవభక్తిలో మునిగివుంటారు ఎప్పుడూ.

ఇక్కడ శిష్యుడు ఒక అద్భుతమైన పోలిక చెబుతున్నాడు. ఒక నదికి ఎన్నో ఉపనదులు ఉంటాయి. నదిలో మునగాలి అంటే ఆ ఉపనదుల్లో ఎందులో మునిగినా పుణ్యం వస్తుంది. అదే విధంగా భగవంతుడు ఒకడే! అతనిని ఏ పేరుతో కొలిచినా పుణ్యం ఒకటే! విష్ణువు, శివుడు, లక్ష్మి, సరస్వతీ, దేవీ – ఏ పేరుతో పిలిచినా భగవంతుడు పలుకుతాడు. అందువల్ల శిష్యుడు,

**సహస్రశాఖే తస్మిన్** – నీకు అనేక శాఖలు ఉన్నాయి అంటే అనేక రూపాలు ఉన్నాయి. అనేక పేర్లతో కొలవవచ్చని చూశాము. అంతేకాదు, ఒక్క దేవుణ్ణే తీసుకున్నా, ఆ దేవునికి మళ్ళీ అనేక రూపాలు ఉన్నాయి – బాలకృష్ణుడు, రాధాకృష్ణుడు, గోపికా కృష్ణుడు, యశోదాకృష్ణుడు.

**నిభగాహం త్వయి మృజే** – ఓ భగవంతుడా! నేను నీలో మునుగుతున్నాను. నా పాపాలు తొలిగేలా చేసుకుందునుగాక! అంటే నేను నీకు ప్రార్థన చేయటంద్వారా నా పాపాలను కడిగివేసుకొందును గాక.

జంధ్యాల పౌర్ణమి రోజు ఈ ప్రార్థన చేస్తారు.

**మానసం వాచికం పాపం కర్మణా సముపార్జితం।**
**శ్రీరామస్మరణేనైవ వ్యాపోహతి న సంశయః॥**

నేను మానస, వాచిక, కాయిక కర్మల ద్వారా ప్రోగేసిన పాపాలను శ్రీరామచంద్రుణ్ణి తలంచినంత మాత్రాన కడిగివేసుకుంటాను.

ఈ విధంగా శిష్యుడు ఇప్పటిదాకా నాలుగు వరాలు కోరాడు. అవి – ధనప్రాప్తి, చిత్తశుద్ధిప్రాప్తి, జ్ఞానప్రాప్తి, శిష్యప్రాప్తి. ఇప్పుడు ప్రార్థన ముగించేముందు శిష్యప్రాప్తి అనే వరాన్ని మళ్ళీ ఒకసారి కోరుతున్నాడు. అంటే ఈ శిష్యుడు తను విద్య నేర్చుకోవటమే కాదు, మళ్ళీ తక్కినవారికి నేర్పాలనే ఉత్సుకత బాగా చూపిస్తున్నాడు.

**బ్రాహ్మణోఽస్య ముఖమాసీత్** – పురుషసూక్తమ్

బ్రాహ్మణుడు వైదిక సాంప్రదాయానికి ముఖం అంటుంది పురుషసూక్తం. అంటే అతను తన వాక్కు ద్వారా ఆ సాంప్రదాయాన్ని చాటిచెబుతాడు. అంటే అతను కర్మ బ్రాహ్మణునిగా పేరు పొందాలని ఆశిస్తున్నాడు.

విద్యార్థులు ఎలా రావాలిట? దానికి కూడా ఉదాహరణలను కూడా ఇస్తున్నాడు.

**యథా ఆపః ప్రవతా యంతి** – ప్రవతా అంటే పల్లం. నీరు పల్లం వైపుకు ప్రవహించినట్టుగా,

**యథా మాసాః అహర్జరమ్** – నెలలు కొత్త సంవత్సరంలో కలిసిపోవటానికి పరుగులు తీసినట్టుగా. మాసాః అంటే నెలలు. అహర్జరః అంటే సంవత్సరం. కన్నుమూసి తెరిచేలోపు నెలలు కరిగిపోతున్నాయి అంటాము.

**ఏవమ్** – అదే విధంగా,

**బ్రహ్మచారిణః మామ్ ఆయంతు** – శిష్యులు నా దగ్గరకు వచ్చుగాక.

**సర్వతః** – అన్ని దిక్కులనుంచి.

ఆ విద్యార్థి ఏ ఆశ్రమానికి చెందినవాడైనా, ఏ వర్ణానికి చెందినవాడైనా ఫర్వాలేదు అనుకున్నాడు శిష్యుడు. అందువల్ల ఎవరు కావాలో ఆ విషయం ప్రత్యేకించి చెప్పటం లేదు. నేర్చుకోవాలనే తపన ఉంటే చాలు, ఎవరైనా ఫర్వాలేదు.

**ధాతః** – ఓ భగవంతుడా! ఈశ్వరుణ్ణి ఇక్కడ ధాతః అంటున్నాడు. ఎందుకంటే భగవంతుడు కర్మఫలదాత. ఏ జీవికి ఎప్పుడు, ఎక్కడ, ఎటువంటి కర్మఫలాన్ని ప్రసాదించాలో అలా ఆ జీవికి అప్పుడు, అక్కడ, అతనికి తగ్గ కర్మఫలాన్ని ప్రసాదిస్తాడు. ఇక్కడ ఈశ్వరుడు అంటే ఓంకారరూప పరమేశ్వరుడు అని మర్చిపోకూడదు.

ఈ సాధకుడు చాలా సుదీర్ఘ ప్రయాణమే చేయాల్సివుంది. అతను డబ్బు సంపాదించాలి; కర్మయోగం పాటించి చిత్తశుద్ధి పొందాలి; చిత్తశుద్ధి పొంది జ్ఞానయోగ్యత పొందాక, తనకు శాస్త్రాన్ని బోధించే శ్రోత్రియ బ్రహ్మనిష్ఠుడైన గురువు దొరకాలి; ఆ గురువు దగ్గర తను శ్రవణ, మనన, నిదిధ్యాసనలు చేయాలి. ఇంత సుదీర్ఘమైన ప్రయాణంలో ఎన్నో ఒడిదుడుకులు, ఆటంకాలు ఎదురయ్యే ప్రమాదం ఉంది. అందువల్ల తన అంతిమలక్ష్యం చేరుకోగలనో లేదో అనే భయం తొంగి చూస్తోంది. అందువల్ల భగవంతుణ్ణి ఒక వసతిగృహంతో పోలుస్తున్నాడు. దీర్ఘ ప్రయాణం చేసేవారు దోవలో వసతిగృహాల్లో సేదదీరినట్టుగా, అతను భగవంతుడనే వసతిగృహంలో సేదదీరుతానంటున్నాడు. ఈ జీవనయానంలో మనస్సు అదుపు తప్పినా, బుద్ధి బలహీనమైనా, నిలదొక్కుకునే శక్తిని పొందుతాడు భగవంతుణ్ణుంచి. అప్పుడు

మనస్సుపరంగా, బుద్ధిపరంగా మళ్ళీ శక్తిని పుంజుకుని, రెట్టించిన ఉత్సాహంతో ముందుకు సాగగలుగుతాడు.

**ప్రతివేశః అసి** – నువ్వు వసతిగృహంలాగా ఉన్నావు. దీన్ని మనకు సూచనగా తీసుకోవచ్చు. మనం కూడా ఈ జ్ఞానమార్గానికి వచ్చి, జ్ఞానం పొందటానికి చేసే ప్రయత్నంలో ఉత్సాహం సన్నగిల్లినా, బుద్ధి మందగించినా, మనం భక్తిలో మునిగితే, అది మనను ముందుకు తోస్తుంది. ఏ విషయంలోనైనా విజయం సాధించాలంటే పురుషప్రయత్నం ఉండాలి నిజమే, కాని అదొక్కటే చాలదు, దైవకృప కూడా దానికి తోడవ్వాలి.

పురుషప్రయత్నం ఎంత ఉత్సాహంతో చేసినా, దోవలో ఎదురయ్యే ఆటంకాలవల్లనో, మనలో పేరుకుపోయిన రాగద్వేషాలవల్లనో, మన ప్రమేయం లేకుండానే ప్రతికూల ఆలోచనలు దూసుకువచ్చేస్తాయి. చిన్న అవకాశం దొరికితే చాలు కోపం, ఈర్ష్య, ఆందోళన మేమున్నామంటూ వచ్చేస్తాయి. ఎప్పుడైతే అవి ముందుకు వస్తాయో అప్పుడే అవి మన విచక్షణాశక్తిని, మన బుద్ధిబలాన్ని కప్పివేస్తాయి. మనను నిరాశానిస్పృహలలో ముంచెత్తివేస్తాయి.

**మచ్చిత్తః సర్వదుర్గాణి మత్ప్రసాదాత్ తరిష్యసి ।**
**అథ చేత్ త్వమహంకారాత్ న శ్రోష్యసి వినంక్ష్యసి ॥** – గీత 18.58

నీ మనస్సును నామీదనే నిలిపితే, నువ్వు నా కృపవల్ల అన్ని ఆటంకాలను దాటగలుగుతావు; కాని నీ అహంకారంవల్ల నామాట వినకపోతే, అవస్థ పడతావు అంటున్నాడు కృష్ణపరమాత్మ.

అందువల్ల ఏమాత్రం ఉత్సాహం సన్నగిల్లినా, భగవంతుణ్ణి శరణుజొచ్చండి. అప్పుడు ఈ జన్మలోనే మోక్షం వస్తుందనే ధైర్యం వస్తుంది. ఈ ధైర్యం మీ అహంకారంవల్ల రాదు, మీ అనన్యభక్తివల్ల వస్తుంది. ఈ అనన్యభక్తి ఎలా ఏర్పడుతుంది? కృష్ణపరమాత్మే అది కూడా చెబుతాడు.

**అనన్యాశ్చింతయంతో మాం యే జనాః పర్యుపాసతే ।**
**తేషాం నిత్యాభియుక్తానాం యోగక్షేమం వహామ్యహమ్ ॥** – గీత 9.22

అందువల్ల, నిజమైన భక్తుడు ఎన్నడూ ప్రతికూలంగా మాట్లాడడు. అందువల్ల ఏ స్థాయిలోనైనా సాధకుడు ధైర్యం సన్నగిల్లుతున్నట్టుంటే తన మనస్సుకు తనే సూచనలను ఇచ్చుకోవాలి 'నాకు మోక్షం వస్తుంది. నాకు అండగా భగవంతుడు ఉన్నాడు.' అంత అనన్యభక్తితో ఆ మాట అనగలిగితే, భగవంతుడు నిజంగానే ముందుకు తీసుకువెళతాడు. ఆ శక్తి ఉంది భగవంతునికి.

**మా ప్రభాహి** – నిన్ను నువ్వు ప్రకాశింపజేసుకో. ఓ దేవా! నావంతు ప్రయత్నం నేను చేస్తాను. నీవంతు సాయం నువ్వు చేయి. నేను అలసిపోయాను. నువ్వే నాకు చేయూతనివ్వాలి అని అర్థం.

**మా ప్రపదస్వ** – నావైపు నువ్వు అడుగులు వేయి. నేను ఇంతవరకూ ప్రయాణం చేసివచ్చాను. ఇప్పుడు నువ్వు రావాలి. దీన్ని అక్షరాలా తీసుకోకూడదు. భగవంతుడు సర్వవ్యాపకుడు. అందువల్ల ఆయన ప్రయాణం చేసే ప్రశ్నే లేదు. దీని అర్థం నిన్ను నేను అర్థం చేసుకునేలా చేయి అని. భగవంతునితో ఐక్యం అంటే భగవంతునికి, తనకు మధ్య దూరం ఉందనే అపోహను తొలగించటం. ఈ ఐక్యం భౌతికంగా కలిగేది కాదు, బుద్ధిలో జరిగే మార్పు. అహం బ్రహ్మ అస్మి అనే స్పష్టమైన జ్ఞానం కలిగితే, ఈ అపోహ తొలగుతుంది. నా వైపుకు రా అంటే నేను బ్రహ్మను అనే సత్యాన్ని నేర్చుకునేందుకు తోడ్పడు అని అర్థం.

దీనితో హోమసాధన అయిపోయింది. నాలుగవ అనువాకం కూడా అయిపోయింది.

## అనువాకం – 5

**భూర్భువస్సువరితి వా ఏతా స్తిస్రో వ్యాహృతయః। తాసాము హ స్మైతాం చతుర్థీమ్। మాహాచమస్యః ప్రవేదయతే। మహ ఇతి। తద్బ్రహ్మ। స ఆత్మా। అంగాన్యన్యా దేవతాః।**

**భూరితి వా అయం లోకః। భువ ఇత్యంతరిక్షమ్। సువరిత్యసౌ లోకః। మహ ఇత్యాదిత్యః। ఆదిత్యేన వావ సర్వే లోకా మహీయన్తే।**

**భూరితి వా అగ్నిః। భువ ఇతి వాయుః। సువరిత్యాదిత్యః। మహ ఇతి చంద్రమాః। చంద్రమసా వావ సర్వాణి జ్యోతీగ్ంషి మహీయన్తే।**

**భూరితి వా ఋచః। భువ ఇతి సామాని। సువరితి యజూగ్ంషి। మహ ఇతి బ్రహ్మ। బ్రహ్మణా వావ సర్వే వేదా మహీయన్తే।**

**భూరితి వై ప్రాణః। భువ ఇత్యపానః। సువరితి వ్యానః। మహ ఇత్యన్నమ్। అన్నేన వావ సర్వే ప్రాణా మహీయన్తే।**

**తా వా ఏతాశ్చతస్రశ్చతుర్ధా। చతస్రశ్చతస్రో వ్యాహృతయః। తా యో వేద। స వేద బ్రహ్మ। సర్వేఽ స్మై దేవా బలిమావహన్తి॥**

**ఉపాసన 2 – వ్యాహృతి ఉపాసన – అనువాకం 5 –** ఈ అనువాకంలో రెండవ ఉపాసన ప్రవేశ పెట్టబడింది. దీన్ని వ్యాహృతి ఉపాసన అంటారు. చాలామటుకు ఇది సంహితోపాసనలాగే ఉంటుంది. సంహితోపాసనలో ఆలంబనల కింద అక్షరాలను, వాటి సంధిని తీసుకున్నాము. వాటిని పూర్వరూపం, ఉత్తరరూపం, సంధి, సంధానం అన్నాము. ఈ నాలుగు ఆలంబనలమీద ఐదు భిన్న అంశాలను ఆవాహన చేశాము.

ఇప్పుడు వ్యాహృతి ఉపాసనలో ఆలంబనల క్రింద వ్యాహృతి మంత్రాలను తీసుకుంటాము. నాలుగు వ్యాహృతి మంత్రాలు ఉన్నాయి. అవి – భూః, భువః, సువః, మహః. వీటిమీద నాలుగు అంశాలను ఆవాహన చేస్తాము. వాటిని వ్యాహృతి మంత్రాలు అని పిలవటానికి రెండు కారణాలు చెప్పవచ్చు.

సాక్షాత్తూ బ్రహ్మదేవుడే ఈ వ్యాహృతులను పలికాడు. ఇంతకుముందు చూసినట్టుగా బ్రహ్మదేవుడు మూడు వేదాలను గాయత్రీమంత్రంలోని మూడు పాదాలుగానూ, ఆ తర్వాత మూడు వ్యాహృతులుగానూ, ఆ తర్వాత మూడు మాత్రలుగానూ కుదించాడనీ, ఆ మూడు మాత్రలు కలిస్తే ఓంకారం అవుతుందనీ చూశాము. ఇప్పుడు మనం వ్యాహృతుల దగ్గరే ఆగిపోతాము.

| | | |
|---|---|---|
| ఋగ్వేదసారం | – తత్సవితుర్వరేణ్యం | – భూః వ్యాహృతి |
| యజుర్వేదసారం | – భర్గోదేవస్య ధీమహీ | – భువః వ్యాహృతి |
| సామవేదసారం | – ధియోయోనః ప్రచోదయాత్ | – సువః వ్యాహృతి |

అలా తపస్సు చేసినపుడు బ్రహ్మదేవుడు మొట్టమొదట వీటిని ఉచ్చరించాడు కాబట్టి వీటిని వ్యాహృతులు అంటారు. వ్యాహర్ అంటే ఉచ్చారణమ్.

**బ్రహ్మణా వ్యాహృత ఇతి వ్యాహృతిః** – మొదటి అర్థాన్నే ఇంకొంచెం సాగదీస్తే రెండవ అర్థం వస్తుంది. ముందు బ్రహ్మదేవుడు ఉచ్చరించాడు కాబట్టి పవిత్రమంత్రాలు అయితే, ఇవి పవిత్రమైన వేదాలసారం కాబట్టి ఇవికూడా పవిత్రమయ్యాయి. ఈ మంత్రాలు పాపాలను నాశనం చేయగలవు. వ్యాహర్‌కి ఇంకొక అర్థం నాశనం చేయటం – వ్యాహరతి పాపాని ఇతి వ్యాహృతి.

తర్వాత నాలుగవ వ్యాహృతిని అంటే మహః అనే వ్యాహృతిని మహాచమస్యుడు తెలుసుకున్నాడు. అది కూడా వీటిలో కలపబడింది. ఇప్పుడు ఈ నాలుగు వ్యాహృతుల మీద నాలుగు వస్తువులను ఆవాహన చేస్తాము కాబట్టి దీన్ని **వ్యాహృతోపాసన** అంటారు.

**భూర్భువస్సువరితి వా ఏతా స్తిస్రో వ్యాహృతయః। తాసాము హ స్మైతాం చతుర్థీమ్। మాహాచమస్యః ప్రవేదయతే। మహ ఇతి। తద్‌బ్రహ్మ। స ఆత్మా। అంగాన్యన్యా దేవతాః॥**

**భూర్భువస్సువరితి వా ఏతాస్తిస్రో వ్యాహృతయః** – భూః, భువః, సువః అనే ఈ మూడు ప్రసిద్ధమైన వ్యాహృతులు. **వా** అనే పదం అవి వైదిక సాంప్రదాయంలో ప్రసిద్ధమైనవని సూచిస్తున్నది. కర్మకాండలో దేన్నైనా ప్రక్షాళన చేయాలంటే, దానిమీద నీళ్ళు జల్లుతూ ఈ భూర్భువస్సువః వ్యాహృతులను పఠిస్తారు. ఆహారం తీసుకునే ముందు కూడా ఉచ్చరిస్తారు. గాయత్రీమంత్రంతో పాటు దాని ముందు పఠిస్తారు. ఆ విధంగా ఈ వ్యాహృతులను కర్మ, ఉపాసన, జ్ఞానకాండలన్నింటిలోనూ పలుకుతారు. అందువల్ల వా అంటే ప్రసిద్ధి చెందినవని అర్థం. అసలు పదం వై, కాని సంధి జరిగి వా అవుతుంది.

**తాసాము హ స్మైతాం చతుర్థీమ్** – ఈ మూడింటితోపాటు, ఈ క్రింద చెప్పబోయే నాలుగవ వ్యాహృతి కూడా పలుకబడింది. ఉ,హ,స్మ అక్షరాల అర్థం కూడా ప్రసిద్ధి చెందింది అనే

వస్తుంది. సంధ్యావందనంలో సప్తవ్యాహృతులు ఉన్నాయి. ప్రాణాయామ మంత్రంలో భూః, భువః, సువః, మహః, జనః, తపః, సత్యమ్ ఉన్నాయి. ఈ నాలుగవ వ్యాహృతిని దర్శించినది,

**మాహాచమస్యః** – మాహాచమస్యుడు అనే ఋషి కనుగొన్నాడు. మహాచమసుని పుత్రుడవటంవల్ల అతనిని మాహాచమస్యుడు అంటారు. యజ్ఞాల్లో వాడే పెద్ద గరిటెను చమస్ అంటారు. మహాచమస్ అంటే పెద్ద చమస్‌లను వాడిన వ్యక్తి అని అర్థం. అంటే ఆ ఋషి పెద్ద యజ్ఞాలను చేశాడని అర్థం. మహాచమస్సు ఋషి పరంపరకు చెందిన మాహాచమస్సుడు ఈ వ్యాహృతిని దర్శించాడని చెప్పటంద్వారా ఈ వ్యాహృతికి పవిత్రతను ఆపాదించినట్టవుతుంది.

**ప్రవేదయతే** – అంత గొప్ప ఋషి తెలుసుకున్నాడు (ఈ వ్యాహృతిని).

ఆ విధంగా మనకు నాలుగు వ్యాహృతులు ఉన్నాయి. అవి – భూః, భువః, సువః, మహః. వీటిమీద నాలుగేసి అంశాలను ఆవాహన చేయాలి. ఇప్పుడు ఈ నాలుగు వ్యాహృతులలో ఒకటి ముఖ్యమైనది, తక్కిన మూడు దానిలోని భాగం కింద వస్తాయి. సంస్కృతంలో ముఖ్యమైన వస్తువును అంగీ అనీ, దానిలోని భాగాన్ని అంగం అనీ అంటారు. ఆ విధంగా ఇప్పుడు ఒక అంగీ, మూడు అంగాలు ఉన్నాయి. వీటిలో అంగీ ముఖ్యమైనదే కాక, దాని శక్తి తక్కిన అంగాలకు కూడా వ్యాపిస్తుంది. ఎలాగైతే ప్రధానమంత్రి శక్తి, ఆయన కింద ఉన్న క్యాబినెట్ మినిస్టర్లకు కూడా వ్యాపిస్తుందో, అలా అంగీ శక్తి అంగాలకు వ్యాపిస్తుంది. ఏదైనా కార్యక్రమంలో నలుగురు పెద్దలను పిలిచి, వారిలో ఒకరు తక్కిన ముగ్గురికీ కూడా అధినేత అయితే, ఆ భేదాన్ని వారికి వేసే కుర్చీలలో చూపించాలి. నలుగురిలోనూ అధినేతకు అందరికన్నా పెద్దకుర్చీ, అది కూడా ప్రత్యేకంగా ఉన్నది వేస్తారు. అలాంటి పెద్దపీటను ఇప్పుడు ఈ వ్యాహృతులలో ఒకదానికి వేయాలి.

ఉపనిషత్తు ఆ పెద్దపీటను మహః వ్యాహృతికి వేసింది. మహః అనే పేరులోనే అది మహాగొప్పది అనే అర్థం వస్తుంది. మహః వ్యాహృతి మహ్‌ధాతువునుంచి వచ్చింది. మహ్ అంటే పూజింపదగినది.

**మహ ఇతి** – మహః, నాలుగవ వ్యాహృతి, ముఖ్యమైనది.

**తద్బ్రహ్మ** – ఇది అన్నింటికన్నా శ్రేష్ఠమైన వ్యాహృతి. ఎందుకంటే ఇది అన్నింటికన్నా శ్రేష్ఠమైన ధ్యానవస్తువుకు ప్రతీక అవుతుంది.

**స ఆత్మా** – అది సర్వవ్యాపకం. ఇక్కడ ఆత్మ అంటే సచ్చిదానంద ఆత్మ అని కాదు అర్థం. ఇక్కడ తక్కిన వ్యాహృతులకు కూడా వ్యాపించినది అని అర్థం.

**అంగాన్యన్యా దేవతాః** – తక్కిన ధ్యానవస్తువులు ఈ ముఖ్యవస్తువుకు అంగాలు మాత్రమే. ఎందుకంటే భూః, భువః, సువః వ్యాహృతులు మహః వ్యాహృతికి అంగాలు కాబట్టి. వాటికి శక్తి ముఖ్య అంగినుంచే వస్తుంది.

ఇప్పుడు ఉపాసన చేయటానికి అవసరమైన ఆలంబనలను సిద్ధం చేసుకున్నాము. ఇంక ఉపాసనల్లోకి అడుగుపెడదాము.

**భూరితి వా అయం లోకః। భువ ఇత్యంతరిక్షమ్। సువరిత్యసౌ లోకః। మహ ఇత్యాదిత్యః ఆదిత్యేన వావ సర్వే లోకా మహీయన్తే।**

ఎ) **అధిలోక వ్యాహృతి ఉపాసన** – నాలుగు లోకాలను ఉపాస్య విషయాలుగా తీసుకుంటాము ఇక్కడ. లోకాలను తీసుకుంటాము కాబట్టి ఈ ఉపాసనను అధిలోక వ్యాహృతి ఉపాసన అంటారు. సంహితోపాసనలో కూడా ఐదు ఉపాసనలను చూశాము. అధిలోక, అధిజ్యౌతిష, అధిదైవ, అధిప్రజ, అధ్యాత్మ ఉపాసనలుగా చూశాము అక్కడ.

**భూరితి వా అయం లోకః** – అయం లోకః అంటే ఈ లోకం, మనం నివసిస్తున్న భూలోకం. భూలోకాన్ని మొదటి వ్యాహృతి అయిన భూః మీద ఆవాహన చేయాలి.

**భువ ఇత్యంతరిక్షమ్** – భువర్లోకాన్ని భువః వ్యాహృతిమీద ఆవాహన చేయాలి.

**సువరిత్యసౌ లోకః** – అసౌ లోకః అంటే దూరంగా ఉన్న లోకం అని అర్థం. ఆ లోకాన్ని సువర్లోకం లేదా స్వర్గలోకం అంటారు. సువర్లోకాన్ని సువః వ్యాహృతిమీద ఆవాహన చేయాలి.

**మహ ఇత్యాదిత్యః** – సూర్యభగవానుణ్ణి మహః వ్యాహృతిమీద ఆవాహన చేయాలి. సూర్యుడు శ్రేష్ఠం ఎందుకంటే,

**ఆదిత్యేన వావ సర్వే లోకా మహీయంతే** – ఆదిత్యుని తేజస్సువల్లనే నిశ్చయంగా లోకాలన్నీ ప్రకాశింపజేయబడుతున్నాయి. ఖగోళశాస్త్రం ప్రకారం కూడా గ్రహాలన్నీ సూర్యునివల్లనే వెలుగుతున్నాయి. భూమికి ప్రాణశక్తి ప్రదాత ఆదిత్యుడు.

**గామావిశ్య చ భూతాని ధారయామ్యహమోజసా** – గీత 15.13

నేను సూర్యునిగా, పృథివిని పోషిస్తున్నాను అంటున్నాడు కృష్ణపరమాత్మ.

టూకీగా చెప్పాలంటే భూలోక, భువర్లోక, సువర్లోకాలను, ఆదిత్యుణ్ణి వరుసగా భూః, భువః, సువః, మహః వ్యాహృతులమీద ఆవాహన చేయాలి. సూర్యుడు అంగి, లోకాలు అంగాలు. దీన్ని అధిలోక వ్యాహృతి ఉపాసన అంటారు.

**భూరితి వా అగ్నిః। భువ ఇతి వాయుః। సువరిత్యాదిత్యః। మహ ఇతి చంద్రమాః। చంద్రమసా వావ సర్వాణి జ్యోతీగ్ంషి మహీయన్తే।**

బి) **అధిదైవ వ్యాహృతి ఉపాసన** – నలుగురు దేవతలను ఉపాస్య విషయాలుగా తీసుకుంటాము ఇక్కడ; లోకాలను తీసుకుంటాము కాబట్టి ఈ ఉపాసనను అధిదైవ వ్యాహృతి ఉపాసన అంటారు.

**భూరితి వా అగ్నిః** – అగ్నిదేవతను భూః వ్యాహృతిమీద ఆవాహన చేయాలి.
**భువ ఇతి వాయుః** – వాయుదేవతను భువః వ్యాహృతిమీద ఆవాహన చేయాలి.
**సువరిత్యాదిత్యః** – ఆదిత్యదేవతను సువః వ్యాహృతిమీద ఆవాహన చేయాలి.
**మహ ఇతి చంద్రమాః** – చంద్రదేవతను మహః వ్యాహృతిమీద ఆవాహన చేయాలి. చంద్రుడు శ్రేష్ఠం. ఎందుకంటే,

**చంద్రమసా వావ సర్వాణి జ్యోతీగ్ంషి మహీయంతే** – చంద్రదేవతవల్లనే తక్కిన ఈ దేవతలందరూ ప్రకాశిస్తున్నారు. అందువల్ల చంద్రదేవత అంగీ, తక్కిన దేవతలు అంగాలు.

ఇక్కడొక సందేహం రావచ్చు మీకు. సూర్యదేవుణ్ణి, చంద్రదేవత ఎలా ప్రకాశింప చేయగలదు? నిజానికి చంద్రదేవత పున్నమిరాత్రి పండువెన్నెలను కురిపిస్తున్నాడంటే, అది ఆయన స్వయంజ్యోతి కాదు; సూర్యునినుంచి అరువు తెచ్చుకున్న కాంతి అని మనకు విజ్ఞానశాస్త్రపరంగా తెలుసు. మనం కూడా ప్రతిబింబచైతన్యం గురించి మాట్లాడేటప్పుడు ఈ విషయాన్ని ఉటంకిస్తాము. మరలాంటప్పుడు ఇదెలా సాధ్యం?

దానికి జవాబు, ఇక్కడ మనం దేవతలను ఆవాహన చేస్తున్నాము, స్థూలవస్తువులను కాదు. ఒక్కొక్క దేవత మనలో ఉన్న ఒక్కొక్క అంగానికి అధిష్ఠానదేవత అని తత్త్వబోధలో నేర్చుకున్నాము. దాని ప్రకారం చంద్రదేవత అంతఃకరణానికి (మనస్సుకు) అధిష్ఠానదేవత అయితే తక్కిన దేవతలు ఇంద్రియాలకు అధిష్ఠానదేవతలు. అగ్నిదేవత వాగింద్రియానికి, వాయుదేవత స్పర్శ ఇంద్రియానికి, ఆదిత్యుడు చక్షురింద్రియానికి అధిష్ఠాన దేవతలు.

**చంద్రమా మనసో జాతః చక్షోః సూర్యో అజాయత**
**ముఖాదింద్రశ్చాగ్నిశ్చ ప్రాణాద్ వాయురజాయత** – పురుషసూక్తమ్

చంద్రుడు మనస్సుకు అధిష్ఠానదేవత కాబట్టి, ఇంద్రియాలయొక్క అధిష్ఠాన దేవతలకన్నా చంద్రదేవతే శ్రేష్ఠం. ఇంద్రియాలు, మనస్సు వాటివెంట లేకపోతే, పని చేయలేవు. మీరు స్వామీజీ ప్రసంగానికి వెళ్ళి కూర్చున్నా, మీ చెవుల వెనుక మీ మనస్సు ఉండకపోతే ఆ ప్రసంగాన్ని మీరు వినలేరు. ఆ విధంగా దేవతల పరంగా చూస్తే చంద్రదేవత అంగీ, తక్కిన దేవతలు అంగాలు. అందువల్ల వేదాంతబోధలో ఏ పొరపాటూ లేదు!

**భూరితి వా ఋచః। భువ ఇతి సామాని। సువరితి యజూగ్ంషి। మహ ఇతి బ్రహ్మ। బ్రహ్మణా వావ సర్వే వేదా మహీయన్తే।**

సి) **అధివేద వ్యాహృతి ఉపాసన** – నాలుగు వేదాలను ఉపాస్య విషయాలలో తీసుకుంటాము ఇక్కడ. వేదాలను తీసుకుంటాము కాబట్టి ఈ ఉపాసనను అధివేద వ్యాహృతి ఉపాసన అంటారు.

**భూరితి వా ఋచః** – ఋగ్ మంత్రాలను భూః వ్యాహృతిమీద ఆవాహన చేయాలి.

**భువ ఇతి సామాని** – సామవేద మంత్రాలను భువః వ్యాహృతిమీద ఆవాహన చేయాలి.

**సువరితి యజూగ్ంషి** – యజుర్వేద మంత్రాలను సువః వ్యాహృతిమీద ఆవాహన చేయాలి.

**మహ ఇతి బ్రహ్మ** – ఇక్కడ బ్రహ్మ అంటే చతుర్ముఖ బ్రహ్మ కాదు. ఇక్కడ బ్రహ్మ అంటే ఓంకారం. ఓంకారం శ్రేష్ఠం ఎందుకంటే,

**బ్రహ్మణా వావ సర్వే వేదా మహీయంతే** – ఓంకారం అన్ని వేదాలసారం; వేదాలన్నీ ఓంకారం వల్లనే ప్రకాశిస్తున్నాయి.

**భూరితి వై ప్రాణః। భువ ఇత్యపానః। సువరితి వ్యానః। మహ ఇత్యన్నమ్। అన్నేన వావ సర్వే ప్రాణా మహీయన్తే।**

డి) **అధిప్రాణ వ్యాహృతి ఉపాసన** – నాలుగు ప్రాణశక్తులను ఉపాస్య విషయాలుగా తీసుకుంటాము ఇక్కడ. ప్రాణాలను తీసుకుంటాము కాబట్టి ఈ ఉపాసనను అధిప్రాణ వ్యాహృతి ఉపాసన అంటారు.

**భూరితి వై ప్రాణః** – పంచప్రాణాల్లోని ప్రాణశక్తిని భూః వ్యాహృతిమీద ఆవాహన చేయాలి. ప్రాక్‌గమనవాన్ వాయుః. ప్రాణశక్తి నిశ్వాసక్రియను చేస్తుంది.

**భువ ఇత్యపానః** – అపానశక్తిని భువః వ్యాహృతిమీద ఆవాహన చేయాలి. అధోగమన వాన్ వాయుః. అపానశక్తి ఉచ్ఛ్వాసక్రియను చేస్తుంది. అపానశక్తి రెండు క్రియలను చేస్తుంది. ఒకటి, బయటినుంచి గాలిని లోపలికి ఊపిరితిత్తులకు పంపుతుంది. రెండవది, విసర్జన క్రియకు తోడ్పడుతుంది. శరీరంలోని వ్యర్థపదార్థాలను కిందినుంచి బయటకు తోస్తుంది.

**సువరితి వ్యానః** – వ్యానశక్తి జీర్ణించబడిన ఆహారాన్ని శరీరాన్నంతటికి సరఫరా చేస్తుంది. విష్వక్ గమనవాన్ వాయుః. విష్వక్ అంటే శరీరంలోని అన్ని భాగాలకు, పోషక పదార్థాలను అందజేస్తుంది.

**మహ ఇత్యన్నమ్** – అన్నాన్ని మహః వ్యాహృతిమీద ఆవాహన చేయాలి. అన్నం శ్రేష్ఠం ఎందుకంటే,

**అన్నేన వావ సర్వే ప్రాణా మహీయంతే** – అన్నంవల్లనే అన్ని ప్రాణాలూ శక్తిని పొందుతున్నాయి. అన్నంవల్లనే ప్రాణాలు పనిచేస్తాయి. ఉపవాసం చేసినరోజు ప్రాణశక్తి బలంగా ఉండదు. చాలా రోజులు ఆహారం లేకపోతే, ప్రాణశక్తులు ఈ శరీరాన్ని విడిచి వెళ్ళిపోతాయి కూడా.

అందువల్ల అన్నం అంగీ, తక్కిన ప్రాణాలు అంగాలు. ఇది అధిప్రాణ వ్యాహృతి ఉపాసన. ఈ విధంగా నాలుగు వ్యాహృతులమీద పదహారు ఉపాస్య విషయాలను ఆవాహన చేయాలి. సంహితోపాసనలో ఇరవై ఉపాస్య విషయాలను ఆవాహన చేశాము.

**తా వా ఏతాశ్చతస్రశ్చతుర్ధా। చతస్రశ్చతస్రో వ్యాహృతయః। తా యో వేద। స వేద బ్రహ్మ। సర్వేఽ స్మై దేవా బలిమావహన్తి॥**

ఉపనిషత్తు ఈ అనువాకాన్ని ఈ వ్యాహృతి ఉపాసన చేస్తే వచ్చే ఫలశ్రుతితో ముగిస్తున్నది.

**తా వా ఏతాశ్చతస్రః** – ఈ విధంగా ఈ నాలుగు వ్యాహృతులు,

**చతుర్ధా** – నాలుగు విధాలుగా ఉపాసన చేయాలి.

**చతస్రశ్చతస్రో వ్యాహృతయః** – నాలుగు వ్యాహృతులమీద నాలుగేసి ఉపాస్య విషయాలను ఆవాహన చేయాలి. అంటే ఒక్కొక్క వ్యాహృతిమీద నాలుగు ఉపాస్య విషయాలను ఒకదాని తర్వాత ఒకదానిని ఆవాహన చేస్తాము. ఆ విధంగా పదహారు ఉపాస్య విషయాలు ఉన్నాయి ఇక్కడ. ప్రత్యేకించి మళ్ళీ పదహారు విషయాలను ఆవాహన చేయాలని చెప్పటం ఎందుకు? దానికి శంకరాచార్యులవారు సమాధానం చెబుతున్నారు. ఏ ఉపాస్య విషయాన్ని ఏ వ్యాహృతిమీద ఆవాహన చేయాలో, ఆ ఉపాస్య విషయాన్ని ఆ వ్యాహృతిమీదే ఆవాహన చేయాలని నొక్కి చెప్పటానికి మళ్ళీ చెప్పింది ఉపనిషత్తు.

**తా యో వేద** – ఇక్కడ వేద అంటే జ్ఞానం పొందటం కాదు, ఉపాసన చేయటం. ఎవరైతే ఈ విధంగా, ఈ వ్యాహృతి ఉపాసన చేస్తారో,

**స వేద బ్రహ్మ** – అతను బ్రహ్మను తెలుసుకుంటాడు. ఇక్కడ బ్రహ్మ అంటే హిరణ్యగర్భ. ఇంతకముందే బ్రహ్మ అంటే ఓంకారం అన్నాము, కాని ఇప్పుడు బ్రహ్మ అంటే హిరణ్యగర్భ. అందువల్ల దీన్ని హిరణ్యగర్భ ఉపాసన అని కూడా అనవచ్చు. అందువల్ల ఈ ఉపాసనను విజయవంతంగా చేసిన సాధకుడు హిరణ్యగర్భను పొందుతాడు. అంటే హిరణ్యగర్భప్రాప్తి కలుగుతుంది.

హిరణ్యగర్భ అంటే సమష్టి సూక్ష్మప్రపంచ అధిష్ఠానదేవత. వ్యష్టి సూక్ష్మ శరీరంలో మనస్సు, ప్రాణాలు, ఇంద్రియాలు ఉంటాయి. సమష్టిసూక్ష్మ ప్రపంచంలో సమష్టి మనస్సు, సమష్టి ప్రాణాలు, సమష్టి ఇంద్రియాలు ఉంటాయి. వాటన్నిటికీ హిరణ్యగర్భ అధిష్ఠాన దేవత కాబట్టి ఆయన సర్వజ్ఞుడు. అందువల్ల ఈ ఉపాసన చేస్తే కలిగే ఫలం ఏమిటి? సర్వజ్ఞ హిరణ్యగర్భ పదం ప్రాప్నోతి.

ఇక్కడ శంకరాచార్యులవారు ఒక ప్రశ్నను వేస్తున్నారు. సాధకుడు చేసేది వ్యాహృతి ఉపాసన అయితే అతను హిరణ్యగర్భ ప్రాప్తిని ఎలా పొందుతాడు? సాధారణంగా ఉపాసన

దేనిమీద చేస్తే, ఆ ఫలాన్ని పొందుతాడు. ఉదాహరణకు లక్ష్మీ ఉపాసన చేస్తే ఐశ్వర్యం పొందుతాము; సరస్వతీ ఉపాసన చేస్తే జ్ఞానం పొందుతాము. కాని ఇక్కడ వ్యాహృతి ఉపాసన చేస్తే హిరణ్యగర్భ ప్రాప్తిని పొందుతాడు అంటున్నది ఉపనిషత్తు. ఉపనిషత్తును తప్పు పట్టకూడదు. అలా ఎందుకు చెప్పిందో అర్థం చేసుకోవటానికి ప్రయత్నించాలి. తర్వాత వచ్చే అనువాకంలో ఉపనిషత్తు హిరణ్యగర్భ ఉపాసన గురించి చెప్పబోతున్నది. అందువల్ల శంకరాచార్యులవారు ఈ వ్యాహృతి ఉపాసనను విడిగా చేయకూడదనీ, దీన్ని హిరణ్యగర్భ ఉపాసనతో కలిపి చేయాలనీ అంటారు. ఈ రెండూ కలిపి చేస్తే వచ్చే ఫలం హిరణ్యగర్భ ఫలం.

ఈ ఫలం పొందేది మరణానంతరం. అంటే ఈ ఫలం పొందటానికి కావాల్సిన ప్రాథమిక అర్హత మరణం! హిరణ్యగర్భ పదం పొందటం వల్ల అతను కూడా సర్వజ్ఞుడు అవుతాడు. హిరణ్యగర్భ సమస్త అధిష్ఠానదేవతలకు అధిష్ఠానదేవత. అందువల్ల,

**సర్వేఽస్మై దేవా బలిమావహంతి** – దేవతలందరూ కూడా హిరణ్యగర్భను ప్రార్థిస్తారు.

తత్త్వబోధలో సూర్యభగవానుడు సమష్టి చక్షురింద్రియాలకు అధిష్ఠానదేవత అనీ; దిగ్దేవతలు సమష్టి శ్రోత్రింద్రియాలకు అధిష్ఠానదేవత అనీ చూస్తాము. హిరణ్యగర్భ ఇలా అధిష్ఠానదేవతలందరికీ కూడా అధిష్ఠానదేవత. అందువల్ల అధిష్ఠానదేవతలు హిరణ్యగర్భను కొలుస్తారు. బలిః అంటే ఆహుతులను సమర్పిస్తారు.

ఈ ఉపాసన చేసిన వ్యక్తి హిరణ్యగర్భ పదం పొందుతాడు. ఇది సకామ ఉపాసన ఫలం. ఇది లౌకికఫలం. లౌకికఫలం అవసరం లేదనుకుంటే, నిష్కామంగా ఉపాసన చేయవచ్చు. దాని ఫలం చిత్తశుద్ధి, చిత్త ఏకాగ్రత, చిత్తవైశాల్యత, చిత్తనిశ్చలత్వం కలుగుతాయి. అవి జ్ఞానం పొందటానికి, తద్వారా మోక్షం పొందటానికి కావాల్సిన జ్ఞానయోగ్యతను ప్రసాదిస్తాయి. ఇక్కడితో వ్యాహృతి ఉపాసన అయిపోయింది. దీన్నే టూకీగా మళ్ళీ ఈ క్రింది పట్టికలో చూద్దాము.

**వ్యాహృతి ఉపాసన**

| **వ్యాహృతులు** | **భూః** | **భువః** | **సువః** | **మహః** |
|---|---|---|---|---|
| అధిలోక ఉపాసన | భూమి | అంతరిక్షం | స్వర్గం | సూర్యుడు |
| అధిదేవ ఉపాసన | అగ్ని | వాయువు | ఆదిత్యుడు | చంద్రుడు |
| అధివేద ఉపాసన | ఋగ్వేదం | సామవేదం | యజుర్వేదం | ఓంకారం |
| అధిప్రాణ ఉపాసన | ప్రాణం | అపానం | వ్యానం | అన్నం |

## అనువాకం – 6

**స య ఏషో౽_న్తర్హృదయ ఆకాశః। తస్మిన్నయం పురుషో మనోమయః। అమృతో హిరణ్మయః। అన్తరేణ తాలుకే। య ఏష స్తన ఇవావలమ్బతే। సేంద్రయోనిః। యత్రాసౌ కేశాన్తో వివర్తతే। వ్యపోహ్య శీర్షకపాలే।**

**భూరిత్యగ్నౌ ప్రతితిష్ఠతి। భువ ఇతి వాయౌ। సువరిత్యాదిత్యే। మహ ఇతి బ్రహ్మణి। ఆప్నోతి స్వారాజ్యమ్। ఆప్నోతి మనసస్పతిమ్। వాక్పతిశ్చక్షుష్పతిః। శ్రోత్రపతిర్విజ్ఞానపతిః। ఏతత్తతో భవతి। ఆకాశ శరీరం బ్రహ్మ। సత్యాత్మ ప్రాణారామం మన ఆనందమ్। శాంతి సమృద్ధమమృతమ్। ఇతి ప్రాచీనయోగ్యోపాస్స్వ॥**

**ఉపాసన 3 – హిరణ్యగర్భ ఉపాసన – అనువాకం 6** –ఈ అనువాకంలో మూడవ ఉపాసన ప్రవేశపెట్టబడింది. దీన్ని హిరణ్యగర్భ ఉపాసన అంటారు. హిరణ్యం పదాన్ని అక్షరాలా తీసుకుంటే, బంగారం అని అర్థం వస్తుంది; కాని ఇక్కడ జ్ఞానంగా తీసుకోవాలి. బంగారం, జ్ఞానం రెండూ కూడా ప్రకాశిస్తాయి. అందువల్ల వాటిని పర్యాయపదాలుగా వాడుతున్నారు ఇక్కడ.

**ప్రకాశాత్మకత్వాత్ హిరణ్యం జ్ఞానమిత్యుచ్యతే**

హిరణ్యం అంటే బంగారంలా మెరిసే జ్ఞానం. ఆ జ్ఞానం అజ్ఞానాన్ని తొలగిస్తుంది. జ్ఞానాన్ని ప్రకాశంతో పోలిస్తే, అజ్ఞానాన్ని చీకటితో పోలుస్తారు. గర్భః అంటే ఇక్కడ లోపల అని అర్థం. గర్భం అంటే అక్షరాలా చూస్తే కడుపు. కాని ఇక్కడ లోపల. అందువల్ల హిరణ్యగర్భ అంటే పూర్తి అర్థం –

**హిరణ్యం గర్భే యస్య సః హిరణ్యగర్భః**

హిరణ్యగర్భమీద ఉపాసన చేయాలి.

హిరణ్యగర్భ సమష్టి మనస్సుకు (లేదా సమష్టిబుద్ధికి), అధిష్ఠానదేవత కాబట్టి, సమష్టి మనస్సును మన బుద్ధి చూడలేదు. అల్పజ్ఞులమైన మనం సర్వజ్ఞుడైన భగవంతుణ్ణి అంత తేలిగ్గా అర్థం చేసుకోలేము. పైగా హిరణ్యగర్భ సమష్టి సూక్ష్మశరీరం కాబట్టి, ఇంద్రియ అగోచరం. కంటికి కనబడని హిరణ్యగర్భమీద ఉపాసన చేయటం ఎలా? దానికి ఒకటే మార్గం ఉంది. ఆ ఉపాసనకు ఒక ఆలంబనను తీసుకోవాలి. సమష్టి మనస్సుకు సరిపోయే గొప్ప ఆలంబన వ్యష్టి మనస్సే.

మామూలుగా భగవంతుడు ఎవరని ఎవరినైనా అడిగితే, భగవంతుడు ఎక్కడో దూరాన కైలాసంలోనో, వైకుంఠంలోనో ఉన్నాడు అంటారు. అంటే ఇక్కడ లేడన్నట్లేగా? ఇటువంటి అభిప్రాయంతో ఉన్నవారు వేదాంతానికి వస్తే, వేదాంతబోధను తేలిగ్గా జీర్ణించుకోలేరు.

ఎందుకు? వేదాంతబోధ సారాంశం అహం బ్రహ్మ అస్మి; నేను ఆ భగవంతుణ్ణి. కర్మకాండలో వచ్చే యజ్ఞయాగాదులన్నీ ద్వైతబుద్ధిని సమర్థిస్తాయి. భగవంతుడు వేరు, నువ్వు వేరు అని నేర్పిస్తాయి. అందువల్ల ఈ స్థాయిలో మీరు ఉంటే, భగవంతుని ముందు నేను అల్పజ్ఞుడిని అనుకుంటారు.

నేను దాసుణ్ణి, భగవంతుడు స్వామి; నేను అనాథను, భగవంతుడు అనాథనాథుడు; నేను అల్పజ్ఞుడిని, భగవంతుడు సర్వజ్ఞుడు; ఇలా చెప్పుకుంటూ పోతే, భగవంతునికీ, మీకూ మధ్య ఉన్న దూరాన్ని పెంచుకుంటూ పోతారు. ఇటువంటి దృక్పథంలో లోతుగా కూరుకుపోయి, ఒక్కసారిగా వేదాంతానికి వస్తే ఆశ్చర్యం వేస్తుంది, అసాధ్యం అనిపిస్తుంది. వేదాంతం నిత్యోఽహమ్, సిద్ధోఽహమ్, అనంతోఽహమ్, శాంతోఽహమ్, సర్వఆధారోఽహమ్, అసంగోఽహమ్ అంటుంది. నా గురించి ఇంత అద్భుతంగా వర్ణిస్తుంటే, నేనెందుకు నన్ను నేను కించపరుచు కుంటున్నాను అని సందేహం వస్తుంది మీకు.

మీకు ఇన్నాళ్ళూ ఉన్న దృక్పథాన్ని మార్చుకునే సమయం వచ్చింది. అది ఎలా చేయాలి? ఒక పద్ధతి, భగవంతుడు ఎక్కడో బాహ్యంగా ఉన్నాడనే అపోహ మాని, భగవంతుణ్ణి మీలో ఆవాహన చేయాలి. నాలో ఉన్న ద్వైతబుద్ధి క్రమేపీ అంతరించు గాక! భగవంతునికి నేను భిన్నంగా ఉన్నాననే భేదబుద్ధి తొలగుగాక అని ప్రార్థించాలి. అలా భగవంతుణ్ణి విడిగా చూడకుండా, మీలోనే ఉన్నట్టుగా భావించుకుని చేసే ఉపాసనను అహంగ్రహ ఉపాసన అంటారు.

**అసావాదిత్యో బ్రహ్మ బ్రహ్మైవాహమస్మి**

అహంగ్రహ ఉపాసనకూ, జ్ఞానానికీ మధ్య చిన్న భేదం ఉంది. అహంగ్రహ ఉపాసనలో జీవ–ఈశ్వర ఐక్యాన్ని ఊహించుకుంటే, జ్ఞానంలో జీవ–ఈశ్వర ఐక్యాన్ని సత్యంగా జ్ఞానం పొందుతారు. మొదటిది అహంగ్రహ ఉపాసన, రెండవది ఐక్యజ్ఞానం. ఇప్పుడు మనం చూస్తున్నది ఉపాసన. హిరణ్యగర్భ ఉపాసనకు మనస్సును ఆలంబనంగా తీసుకోవాలి.

వ్యష్టి మనస్సు వ్యష్టిలో ఎక్కడ ఉంటుంది?

శాస్త్రం మనస్సు వేరు, మెదడు వేరు అంటుంది. మనస్సు సూక్ష్మమైన ప్రమాణం అయితే, మెదడు కంటికి కనబడే స్థూలఅంగం. ఒకవ్యక్తి మరణించినప్పుడు మెదడు కూడా స్థూలశరీరంతోపాటు కాలి బూడిద అయిపోతుంది. కాని, శరీరం మరణించినా, మనస్సుకు మరణం లేదు అంటుంది శాస్త్రం. అంతేకాదు, మనస్సు మన కర్మలను తీసుకుని, ఇంకో శరీరం పొందటానికి ప్రయాణం చేస్తుంది అంటుంది. సైన్సు దీన్ని అంగీకరించదు.

శాస్త్రం ప్రతి ఒక ప్రమాణానికి ఒక స్థూలఅంగం ఉంటుంది అంటుంది. ఈ స్థూల అంగాన్ని గోళకం అంటారు. ఉదాహరణకు మన ముఖంలో బాహ్యంగా కనబడే కన్నును

గోళకం అంటారు. చూపు అనే ప్రమాణం సూక్ష్మశరీరంలో ఉండే చక్షురింద్రియం. ఒక గుడ్డివాని విషయం తీసుకుంటే, అతనికి గోళకం ఉంటుంది కాని చక్షురింద్రియం ఉండదు.

మనస్సుకు గోళకం హృదయం. జాగ్రదావస్థలో మనస్సు శరీరమంతటా తిరుగుతూ పనిచేస్తుంది. కాని సుషుప్తి అవస్థలో మనస్సు శరీరంనుండి విడివడి, దాని నివాసస్థలమైన హృదయంలోకి వెళ్ళిపోతుంది. మనస్సు నిద్రపోతుంది అంటారు సుషుప్తిలో. ఈ నేపథ్యంతో ఈ మంత్రభాగాన్ని చూద్దాము.

**స య ఏషో౽న్తర్హృదయ ఆకాశః। తస్మిన్నయం పురుషో మనోమయః। అమృతో హిరణ్మయః। అన్తరేణ తాలుకే। య ఏష స్తన ఇవావలమ్బతే। సేంద్రయోనిః। యత్రాసౌ కేశాన్తో వివర్తతే। వ్యపోహ్య శీర్షకపాలే।**

**అంతర్ హృదయే** – హృదయం లోపల,

**స ఏష ఆకాశః** – హృదయం లోపల ఆకాశం ఉంది.

**అఙ్గుష్ఠమాత్రః పురుషో౽న్తరాత్మా**
**సదా జనానాం హృదయే సన్నివిష్టః।**
**తం స్వాచ్ఛరీరాత్ప్రవృహేన్ముఞ్జాదివేషీకాం ధైర్యేణ**
**తం విద్యాచ్ఛుక్రమమృతం తం విద్యాచ్ఛుక్రమమృతమితి।।** – కఠ 2.3.17

హృదయంలో ఉండే ఆకాశం బొటనవేలు అంత పరిమాణంలో ఉంటుంది అంటుంది కఠోపనిషత్తు. పిడికిలి మూస్తే ఎంత ఉంటుందో హృదయం అంత ఉంటుంది. పిడికిలి లోపల బొటనవేలు పట్టినట్టుగా, హృదయంలోని ఆకాశం బొటనవేలు అంత ఉంటుంది.

**తస్మిన్నయం పురుషః** – హిరణ్యగర్భ పురుషుణ్ణి అంటే సమష్టిమనస్సును ఈ హృదయాకాశంలో ఉన్న మనస్సులోకి ఆవాహన చేయాలి. అప్పుడు హిరణ్యగర్భయొక్క గుణాలమీద ఉపాసన చేయాలి. ఇక్కడ వివిధగుణ విశిష్ట హిరణ్యగర్భ వర్ణనను చూస్తాము.

**మనోమయః** – మనోమయః అంటే వ్యష్టి మనస్సు. వ్యష్టి అంతటా సమష్టి వ్యాపించి ఉంటుంది. ఉదాహరణకు తెలంగాణా అంతటా భారతదేశం వ్యాపించి ఉంటుంది. అందువల్ల సమష్టి మనస్సును వ్యష్టి మనస్సుమీద ఆవాహన చేయాలి.

**అమృతః** – శాశ్వతం. కాని ఈ శాశ్వతత్వాన్ని ఆపేక్ష శాశ్వతత్వంగా తీసుకోవాలి.

బ్రహ్మయొక్క జీవితకాలాన్ని మన జీవితకాలంతో పోల్చి చూస్తే ఎంతో ఎక్కువ. ఎందుకంటే బ్రహ్మ యొక్క ఒక్కరోజు రెండువేల చతుర్యుగాలకన్నా ఎంతో ఎక్కువ. ఒక చతుర్యుగం = 43,20,000 మానవ సంవత్సరాలు. అటువంటిది బ్రహ్మ 120 సంవత్సరాలు జీవిస్తాడంటే, మనం లెఖ్ఖ వేయటం కూడా కష్టమే. ఆ విధంగా శాశ్వతం.

**హిరణ్మయః** – సర్వజ్ఞుడు.

ఇంతవరకూ హిరణ్యగర్భ ఉపాసన ఎలా చేయాలో వస్తుంది. ఇక్కడ్నుంచి ఈ ఉపాసన యొక్క ఫలశ్రుతి వస్తుంది. కఠోపనిషత్తులోనూ, ముండకోపనిషత్తులోనూ హిరణ్యగర్భ ఉపాసకుడు మరణానంతరం శుక్లగతి ద్వారా ప్రయాణం చేసి బ్రహ్మలోకానికి వెళతాడని వస్తుంది.

ఒక వ్యక్తిలో ఐదు అంశాలు ఉంటాయి. అవి స్థూలశరీరం, సూక్ష్మశరీరం, కారణ శరీరం, ప్రతిబింబ చైతన్యం, బింబ చైతన్యం. అతను మరణించినప్పుడు అతని స్థూలశరీరం రాలిపోతుంది కాబట్టి దానికి ప్రయాణం లేదు; బింబ చైతన్యం సర్వవ్యాపకం, దానికి ప్రయాణం లేదు; ఇక మిగిలిన మూడింటినీ జీవాత్మ అంటారు. సూక్ష్మశరీరం, కారణ శరీరం, ప్రతిబింబ చైతన్యాలను కలిపి జీవాత్మ అంటారు. ఈ జీవాత్మ ప్రయాణం చేస్తుంది. ఉపాసకుడు శుక్లగతి ద్వారా ప్రయాణం చేసి బ్రహ్మలోకం చేరుకుంటాడు.

అతనికి శుక్లగతి హృదయంలో మొదలవుతుంది అని చెబుతున్నది ఉపనిషత్తు. మరణం సంభవించే ముందు, ఉపాసకుని సూక్ష్మశరీరం అతని హృదయంలో చేరుతుంది. కఠోపనిషత్తులో, ప్రతి మనిషిలో 101 ప్రధాన నాడులు హృదయంనుంచి వస్తాయని చూస్తాము. వాటిలో ముఖ్యమైన నాడిని సుషుమ్నానాడి అంటారు. అది శరీరం మధ్యనుంచి, దవడల మధ్య ఆవు పొదుగులోని స్తనంలా వ్రేలాడుతున్న కొండనాలుక ద్వారా తలపైభాగం వరకూ వెళుతుంది. తల పైభాగంలో బయటకు విచ్చుకుంటుంది. దీన్ని బ్రహ్మరంధ్రం అంటారు.

ఒక ఉపాసకుని జీవాత్మ అతని బ్రహ్మరంధ్రంద్వారా బయటకు వచ్చి, సూర్యలోకంద్వారా బ్రహ్మలోకానికి వెళుతుంది. శుక్లగతి ద్వారా బ్రహ్మలోకానికి వెళుతుంది కాబట్టి ఈ మార్గానికి ఉపనిషత్తు ఒక ప్రత్యేకపదాన్ని వేసింది. దాన్ని **ఇంద్రయోని** అంది. ఈ సందర్భంలో ఇంద్రుడు అంటే బ్రహ్మదేవుడు లేదా హిరణ్యగర్భ; యోని అంటే మార్గం.

**స ఇంద్రయోనిః** – హృదయంనుంచి మొదలయ్యే శుక్లగతిని ఇంద్రయోని అంటారు.

**అంతరేణ తాలుకే** – గొంతు మధ్యలోంచి ప్రయాణం చేసి,

**య ఏష స్తన ఇవావలంబతే** – ఆవు పొదుగులోని స్తనంలా వ్రేలాడుతున్న కొండనాలుక మధ్యనుంచి,

**యత్రాసౌ కేశాంతో వివర్తతే** – కేశాల మొదలు ఉన్న తల పైభాగం వరకూ వెళ్ళి,

**శీర్షకపాలే వ్యపోహ్య** – శీర్షకపాలే అంటే బ్రహ్మరంధ్రం; వ్యపోహ్య అంటే దాన్ని చీల్చుకుని. అంటే ఉపాసకుని జీవాత్మ కపాలమోక్షం జరిగి, బ్రహ్మరంధ్రంద్వారా బయటకు వస్తుంది. ఈ బ్రహ్మరంధ్రం దగ్గర చాలా సున్నితంగా ఉంటుంది. ఒకప్పుడు, ఒక్కోచోట, సన్న్యాసి మరణించినప్పుడు అతనికి శుక్లగతి ప్రాప్తించటంకోసం అతని తలమీద కొబ్బరికాయతో

కొట్టేవారుట. అతను జ్ఞానీసన్యాసి అయితే అవసరం లేదు. ఎందుకంటే అతనికి ప్రయాణం లేదు. కానీ జ్ఞానీసన్యాసి కాకపోతే, సన్యాసి బ్రహ్మలోకానికి వెళతాడని శాస్త్రం చెబుతుంది.

మన సాంప్రదాయంలో వర్ణాశ్రమ ధర్మాల్లో సన్యాసాశ్రమధర్మం విధించబడింది ఈ బ్రహ్మలోక ప్రాప్తికోసం. సన్యాసం స్వీకరించటానికి భయపడేవారు, బ్రహ్మలోకానికి దగ్గర దారిని వెతుక్కుంటారు. అంటే వారు మరణించేముందు సన్యాసాన్ని స్వీకరిస్తారు. దాన్ని ఆపత్‌సన్యాసం అంటారు. కాని దాన్ని ఆపత్తు సన్యాసం అంటారు పూజ్యస్వామీజీ. ఒకవేళ అతను తిప్పుకుని, జీవిస్తే మాత్రం అది సన్యాసాశ్రమానికి ఆపత్తును కలుగుజేస్తుంది. నిజానికి జీవుడు వెళ్ళిపోయాక, తలమీద కొట్టి కూడా లాభంలేదు. ఆ మాటకొస్తే, ఈ ఉపాసన చేస్తే, గృహస్థు కూడా బ్రహ్మలోకానికి వెళతాడు.

ఈ విధంగా ఈ ఉపాసన సకామంగా చేసిన వ్యక్తి పొందే ఫలం బ్రహ్మలోక ప్రాప్తి లేదా హిరణ్యగర్భ ప్రాప్తి. ఇది మరణించాక పొందే ఫలం. ఏ ఉపాసననైనా ఒక ఆలంబన మీద చేస్తాము. ఆలంబన అంటే ఒక నికృష్ట వస్తువుమీద ఉత్క ృష్ట వస్తువును ఆవాహన చేయటం. ఆ ఆలంబన నాలో ఏదైనా భాగమైతే దాన్ని అహంగ్రహ ఉపాసన అంటారు. ఇక్కడ హిరణ్యగర్భను నా మనస్సుమీద ఆవాహన చేస్తాను కాబట్టి, దీన్ని అహంగ్రహ ఉపాసన అంటారు. హిరణ్యగర్భ సర్వజ్ఞుడు, సర్వశక్తిమంతుడు. ఈ నేపథ్యంతో ఈ మంత్రభాగాన్ని చూద్దాము.

**భూరిత్యగ్నౌ ప్రతితిష్ఠతి। భువ ఇతి వాయౌ। సువరిత్యాదిత్యే। మహ ఇతి బ్రహ్మణి। ఆప్నోతి స్వారాజ్యమ్। ఆప్నోతి మనసస్పతిమ్। వాక్పతిశ్చక్షుష్పతిః। శ్రోత్రపతిర్విజ్ఞానపతిః। ఏతత్ తతో భవతి। ఆకాశ శరీరం బ్రహ్మ। సత్యాత్మ ప్రాణారామమ్ మన ఆనందమ్। శాంతి సమృద్ధమమృతమ్। ఇతి ప్రాచీన యోగ్యోపాస్స్వ॥**

ఈ భాగంలో ఈ హిరణ్యగర్భ ఉపాసకుడు మరణించాక, ఆ జీవి ప్రయాణాన్ని వివరిస్తున్నది ఉపనిషత్తు. ఇక్కడ ఒక విషయం మర్చిపోకూడదు. ఈ ఉపాసనను వ్యాహృతి ఉపాసనతో కలిపి చేయాలి.

**వ్యాహృతి ఉపాసనలో అధిదైవ వ్యాహృతి ఉపాసనను చూశాము.**

**భూరితి వా అగ్నిః భువ ఇతి వాయుః సువరిత్యాదిత్యః మహ ఇతి చంద్రమాః – 5**

ఈ సాధకుడు భూః వ్యాహృతిమీద అగ్నిదేవతను; భువః వ్యాహృతిమీద వాయుదేవతను; సువః వ్యాహృతిమీద ఆదిత్యదేవను; మహః వ్యాహృతిమీద చంద్రదేవతను ఆవాహన చేసి ఉపాసన చేశాడు. అగ్ని, వాయువు, ఆదిత్యుడు అంగ దేవతలు; చంద్రుడు అంగీదేవత అని చూశాము. ఇప్పుడు చంద్రునికి కూడా అధిష్ఠానదేవత హిరణ్యగర్భ కాబట్టి, హిరణ్యగర్భను అంగీదేవతగా తీసుకోవాలి.

**భూరిత్యగ్నౌ ప్రతితిష్ఠతి** – ఉపాసకుడు భూః వ్యాహృతిమీద ఆవాహన చేసిన అగ్ని దేవతను చేరుకుంటాడు లేదా లయమవుతాడు. ప్రతితిష్ఠతి అంటే ఏకీభవతి.

**భువ ఇతి వాయౌ (ప్రతితిష్ఠతి)** – భువః వ్యాహృతిమీద ఆవాహన చేసిన వాయు దేవతతో లయమవుతాడు.

**సువరిత్యాదిత్యే (ప్రతితిష్ఠతి)** – సువః వ్యాహృతిమీద ఆవాహన చేసిన ఆదిత్య దేవతతో లయమవుతాడు.

ఈ విధంగా ఈ ముగ్గురు అంగదేవతలతో లయమయ్యాక, చివరగా అంగీదేవత అయిన హిరణ్యగర్భతో లయమవుతాడు.

**మహ ఇతి బ్రహ్మణి (ప్రతితిష్ఠతి)** – మహ వ్యాహృతిమీద ఆవాహన చేసిన బ్రహ్మతో లయమవుతాడు. ఇక్కడ బ్రహ్మ అంటే చతుర్ముఖబ్రహ్మ లేదా సగుణబ్రహ్మ లేదా హిరణ్యగర్భ.

ఎప్పుడైతే హిరణ్యగర్భతో ఐక్యం అవుతాడో, అప్పుడే అతనికి హిరణ్యగర్భలా ఆధిపత్యం వస్తుంది. బ్రహ్మదేవుడు బ్రహ్మలోక అధిపతి.

**ఆప్నోతి స్వారాజ్యమ్** – అతను లోకాధిపతి అవుతాడు. పద్నాలుగు లోకాల్లో అన్నింటి కన్నా ఊర్ధ్వలోకం బ్రహ్మలోకం. ఈ సాధకుడు అక్కడికి చేరుకోవటంవల్ల పద్నాలుగు లోకాల మీద ఆధిపత్యాన్ని వహిస్తాడు. బ్రహ్మలోకం అన్నింటికన్నా పైలోకం కాబట్టి ఆ లోకాధిపతి అయిన బ్రహ్మదేవుడు ఇంద్రుడు, వరుణుడు వంటి దేవతలకు కూడా అధిపతి. ఆ విధంగా ఈ ఉపాసకుడు అన్ని అంగాలకీ అధిపతి.

**ఆప్నోతి మనసస్పతిమ్** – వ్యష్టి మనస్సులన్నింటికీ కూడా అధిపతి. ఎందుకు? అతను సమష్టి మనస్సు అవుతాడు కాబట్టి. ప్రధానమంత్రి చూడటానికి వ్యష్టి అయినా ఎలా అంతటికీ రాజో అలా. ఈ సాధకుడు అన్నిటికీ అధిపతి అవుతాడు. సర్వేశామ్ మానసమ్ పతిః.

**(ఆప్నోతి) వాక్ పతిః** – వాక్కుకి పతి అవుతాడు అంటే కర్మేంద్రియాలన్నింటికి అధిపతి అవుతాడు. వాక్కుని కర్మేంద్రియాలకు చిహ్నంగా తీసుకోవాలి. వరుణదేవుడు వాక్కుకు అధిపతి.

**చక్షుష్పతిః శ్రోత్రపతిః** – కన్ను, చెవులకు అధిపతి అంటే అన్ని జ్ఞానేంద్రియాలకు అధిపతి. సూర్యదేవుడు కంటికి అధిష్ఠానదేవత; కాని సూర్యదేవుడు హిరణ్యగర్భలో ఒకభాగం మాత్రమే.

**విజ్ఞానపతిః** – ఇతను అన్ని జ్ఞానాలకు అధిపతి. ఏ పని చేపట్టాలన్నా, ఏ జ్ఞానం పొందాలన్నా కూడా మన ప్రయత్నం మాత్రం చాలదు; దానికి దైవకృప కూడా తోడవ్వాలి. హిరణ్యగర్భ దీవెనలు లేకపోతే, మన ప్రయత్నం ఫలించదు.

**ఏతత్ తతో భవతి** – హిరణ్యగర్భుయొక్క అదనపు గుణాలను వివరిస్తున్నది ఉపనిషత్తు. అవి–

**ఆకాశశరీరం బ్రహ్మ** – బ్రహ్మ అంటే సగుణ హిరణ్యగర్భ. అతనికి ఆకాశమే శరీరం.

**సత్యాత్మా** – ఆ బ్రహ్మకు మూర్తామూర్త ప్రపంచం శరీరంగా ఉంది. సత్యాత్మాని విడదీస్తే సత్+త్య+ఆత్మ అని వస్తుంది. సత్–త్యమ్ అంటే మూర్తప్రపంచం అయిన పృథివి, జలం, అగ్ని వస్తాయి. ఆత్మ అంటే అమూర్తప్రపంచం అయిన వాయువు, ఆకాశం వస్తాయి. ఎలాగైతే వ్యష్టి శరీరంలో స్థూల, సూక్ష్మశరీరాలు ఉంటాయో, అలా సమష్టి శరీరంలో స్థూల, సూక్ష్మ ప్రపంచాలు ఉంటాయి.

**మూర్తామూర్త ప్రపంచ శరీరః హిరణ్యగర్భః**

ఈ వివరణ బృహదారణ్యకంలోని మూర్తామూర్త బ్రాహ్మణంలో వస్తుంది. అక్కడ ఈ విషయాన్ని ఇంకా విపులంగా చూస్తాము.

**ప్రాణారామమ్** – సగుణబ్రహ్మ సమస్త ప్రాణులలోనూ రమిస్తున్నాడు. హిరణ్యగర్భ అంటే సమష్టి సూక్ష్మప్రపంచ అధిష్ఠానదేవత అని చూశాము. అందువల్ల అన్నింటిలోని ప్రాణశక్తి హిరణ్యగర్భ. ఆరామం అంటే విశ్రాంతి చెందే గృహం. అంటే జీవుల ప్రాణాలన్నిటిలోనూ రమిస్తాడు హిరణ్యగర్భ.

**మన ఆనందమ్** – ప్రతి ఒక్క మనస్సు ద్వారా హిరణ్యగర్భ ఆనందాన్ని అనుభవిస్తున్నాడు.

**మనః ఏవ ఆనందస్థానం యస్య**

మరి సమష్టి దుఃఖం మాటేమిటి? ఈ ఉపాసనద్వారా పొందిన అసాధారణ పుణ్యంవల్ల, సమష్టి ఆనందాన్నే పొందుతాడు కాని సమష్టి దుఃఖాన్ని పొందదు. ఈ విషయాన్ని బృహదారణ్యకంలో కూడా చూస్తాము.

**శాంతిసమృద్ధమమృతమ్** – హిరణ్యగర్భ శాంతికి, సమృద్ధికి, అమృతానికి నెలవు.

**ఇతి ఉపాస్స్వ** – ఈ విధంగా ఉపాసన చేయి. ఒకవేళ నీకు బ్రహ్మపదం కావాలనుకుంటే;

**ప్రాచీన యోగ్య** – ఆచార్యుడు శిష్యుణ్ణి ఉద్దేశించి చెబుతున్నాడు. దీన్ని ప్రాచీన విద్యాయోగ్యః అని చెప్పవచ్చు. అంటే ఈ ప్రాచీనవిద్యను అందుకునే అర్హత ఉంది అతనికి. ఎందుకంటే దానికి అవసరమైన శ్రద్ధ మెండుగా ఉంది. అందువల్ల నువ్వు ఈ ఉపాసన చేయుగాక!

దీనితో హిరణ్యగర్భ ఉపాసన అయిపోయింది.

**అనువాకం – 7**

**పృథివ్యంతరిక్షం ద్యౌర్దిశోఽ వాన్తరదిశః। అగ్నిర్వాయురాదిత్యశ్చన్ద్రమా నక్షత్రాణి। ఆప ఓషధయో వనస్పతయ ఆకాశ ఆత్మా। ఇత్యధిభూతమ్। అథాధ్యాత్మమ్। ప్రాణో వ్యానోఽ పాన ఉదానస్సమానః। చక్షుశ్శ్రోత్రం మనో వాక్ త్వక్। చర్మమాగ్ంసగ్గ్ స్నావాస్థి మజ్జా। ఏతదధివిధాయ ఋషిరవోచత్। పాఙ్క్తం వా ఇదగ్ం సర్వమ్। పాఙ్క్తేనైవ పాఙ్క్తగ్గ్ం స్పృణోతీతి॥**

**ఉపాసన 4 – పాంక్తబ్రహ్మ ఉపాసన – అనువాకం 7 –** మనం ఇంతవరకూ మూడు ఉపాసనలను చూశాము. అవి సంహిత ఉపాసన, వ్యాహృతి ఉపాసన, హిరణ్యగర్భ ఉపాసన. కాకపోతే వ్యాహృతి ఉపాసన, హిరణ్యగర్భ ఉపాసన కలిపి చేయాలనే విషయాన్ని మర్చిపోకూడదు.

ఈ అనువాకంలో నాలుగవ ఉపాసన ప్రవేశపెట్టబడింది. దీన్ని పాంక్తబ్రహ్మ ఉపాసన అంటారు. ఈ ఉపాసనలో సమష్టి ప్రపంచాన్ని, వ్యష్టి శరీరాన్ని కూడా వ్యష్టి మీద ఆవాహన చేస్తాము. నెమ్మదిగా ఉపనిషత్తు మనను మహావాక్యం అయిన అహం బ్రహ్మ అస్మి ని స్వీకరించటానికి సిద్ధం చేస్తోంది. ఈ ఉపాసనలన్నీ జీవ–ఈశ్వర ఐక్యాన్ని అర్థం చేసుకునేందుకు తోడ్పడే అభ్యాసాలు. ఇంతకుముందు కూడా చూశాము, ఉపాసనకూ–జ్ఞానానికీ మధ్య ఉన్న సూక్ష్మభేదాన్ని. ఉపాసనలో జీవ–ఈశ్వర ఐక్యాన్ని ఊహించుకుని ఉపాసన చేస్తే, జ్ఞానంలో జీవ–ఈశ్వర ఐక్యాన్ని అర్థం చేసుకుని అందులో రమిస్తాము.

ఇప్పుడు ఈ ఉపాసనలో సమష్టిని, వ్యష్టిలో ఊహించుకుంటున్నాము. నిజానికి సమష్టికి, వ్యష్టికి చాలా పోలికలు ఉన్నాయి. ఒక ఆటమ్‌లో ఎలక్ట్రాన్లు, న్యూక్లియస్ చుట్టూ తిరుగుతాయి. అదే సమష్టికి వచ్చేసరికి గ్రహాలు భూమిచుట్టూ తిరుగుతాయి. ఈ ఉపాసనలద్వారా సమష్టికి, వ్యష్టికి ఉన్న పోలికలను బాగా అర్థం చేసుకుంటాము.

పాంక్తం అంటే ఐదు వస్తువుల సముదాయం. ఇప్పుడు జగత్తును మూడు తెగల కింద విభజిస్తాము. దాన్ని పాంక్తత్రయం అనవచ్చు. ఈ విధంగా జగత్తు మొత్తం $3 \times 5 = 15$ అంశాలుగా విభజించబడింది. అదే సూత్రాన్ని వ్యష్టికి కూడా అన్వయించాలి. వ్యష్టిని మూడు పాంక్తాలుగా విభజించవచ్చు. మళ్ళీ పాంక్తత్రయం వస్తుంది. ఆ విధంగా ఇప్పుడు సమష్టి పాంక్తత్రయం, వ్యష్టి పాంక్తత్రయం ఉన్నాయి. సమష్టి పాంక్తత్రయాన్ని, వ్యష్టి పాంక్తత్రయంమీద ఆవాహన చేయాలి. ఇప్పుడు రెండు రకాల పాంక్తత్రయాల వివరాలు చూద్దాము. ఉపనిషత్తు ముందుగా సమష్టి పాంక్తం గురించి చెప్పబోతున్నది.

ఎ) **లోకపాంక్తమ్** – ఇది లోకాలకు చెందింది.

**పృథివ్యంతరిక్షం ద్యౌర్దిశోఽవాంతరదిశః** – పృథివి అంటే భూలోకం; అంతరిక్షం అంటే భువర్లోకం (భూలోక, సువర్లోకాల మధ్య ఉన్న లోకం).

**ద్యౌః** – సువర్లోకం

**దిశః** – నాలుగు ముఖ్యమైన దిశలు. అవి తూర్పు, పడమర, దక్షిణ, ఉత్తర దిక్కులు.

**అవాంతరదిశః** – అవాంతర దిక్కులు. అవి ఆగ్నేయం, నైరుతం, వాయవ్యం, ఈశాన్యం.

బి) **దేవతాపాంక్తమ్** – ఇది దేవతలకు చెందింది.

**అగ్నిర్వాయురాదిత్యశ్చంద్రమా నక్షత్రాణి** – అగ్ని, వాయువు, ఆదిత్యుడు, చంద్రుడు, నక్షత్రాలు. వీటన్నిటినీ కలిపి దేవతాపాంక్తం అంటారు.

సి) **భూతపాంక్తమ్** – ఇది పంచభూతాలకు చెందింది.

**ఆప ఓషధయో వనస్పతయ ఆకాశ ఆత్మా** – ఆపః అంటే జలం; ఓషధయః అంటే చిన్నచెట్లు; వనస్పతయః అంటే పెద్ద వృక్షాలు; ఆకాశః అంటే ఆకాశం; ఆత్మా అంటే ఈ పట్టికలో లేని, సృష్టి మొత్తంలో ఉన్న తక్కినవన్నీ వస్తాయి. శంకరాచార్యులవారు ఇక్కడ ఆత్మ అంటే విరాట్ అంటున్నారు.

**ఇత్యధిభూతమ్** – ఇది అధిభూతం. ఈ పాంక్తత్రయం సమష్టికి చెందినది.

**లోక + దేవతా + భూతా = సమష్టి పాంక్తత్రయమ్**

**అథ అధ్యాత్మమ్** – ఇప్పుడు వ్యష్టికి చెందిన పాంక్తత్రయం చూద్దాము.

డి) **వాయుపాంక్తమ్** – ఇది పంచప్రాణాలకు చెందినది.

**ప్రాణో వ్యానోఽపాన ఉదానస్సమానః** – ప్రాణ, వ్యాన, అపాన, ఉదాన, సమాన ప్రాణాలు. ప్రాణం – శ్వాసక్రియను; వ్యానం – రక్తప్రసరణ క్రియను; అపానం – విసర్జన క్రియను; ఉదానం – తిరోగమక్రియను; సమానం – జీర్ణక్రియను వ్యష్టిలో చేస్తాయి.

ఇ) **ఇంద్రియ పాంక్తమ్** – ఇది పంచ ఇంద్రియాలకు చెందినది.

**చక్షుశ్శ్రోత్రం మనో వాక్ త్వక్** – కన్ను, చెవి, మనస్సు, వాక్కు, చర్మం.

ఎఫ్) **ధాతు పాంక్తమ్** – ఇవి శరీరంలోని లోపల భాగాలకు చెందింది.

**చర్మమాగ్ంస స్నావాస్థి మజ్జా** – చర్మం, మాంసం, కండరాలు, ఎముకలు, మూలుగు (బోన్‌మారో).

ఈ అంశాలు ధాతుః అంటాయి ఆయుర్వేదమూ, శాస్త్రమూ కూడా.

**ధత్తే ఇతి ధాతుః**

ఆయుర్వేదంలో ధాతువుల మధ్య సమతుల్యత ఉంటే ఆరోగ్యం బాగున్నట్టు అంటారు.

**ధాతు సామ్యమ్ ఆరోగ్యమ్**

ఒకవేళ వీటి మధ్య సమత్వం లేకపోతే అది అనారోగ్యం.

**ధాతు వైషమ్యమ్ రోగః**

**ఏతదధివిధాయ ఋషిరవోచత్** – ఋషి ఈ ఆరు పాంక్త ఉపాసనలను విధించారు.

**పాంక్తం వా ఇదగ్ం సర్వమ్** – ఈ సర్వమూ ఐదింటి సముదాయం మాత్రమే. వ్యష్టి, సమష్టి అంతా ఐదింటి సముదాయమే.

**పాంక్తేనైవ పాంక్తగ్గ్ స్పృణోతీతి** – ఈ విధంగా ఉపాసకుడు ఆధ్యాత్మిక పాంక్తంతో పాటు బాహ్య పాంక్తాన్ని బలం చేస్తున్నాడు. అంటే రెండూ ఒకటే అని తెలుసుకుంటున్నాడు. అలా అంతటినీ ఏకంగా చూడటంవల్ల సాధకునికి బలం చేకూరుతుంది. మీ పరిధిని పెంచుకుంటూపోతే, మీకు ధైర్యం పెరుగుతూ వస్తుంది. నేను అనుకునేకన్నా నా కుటుంబం అనుకుంటే ఆ బలం ఎక్కువ. అలాగే నేను తెలంగాణాకు చెందినవాడిని, నేను భారతీయుడిని, నేను ఆసియా ఖండానికి చెందినవాడిని, నేను మనిషిని అనుకుంటూ వచ్చే ఈ మాటలను చూస్తే మీ ధైర్యం ఎంత పెరుగుతూ వస్తోందో చూడండి.

అలాగే నాలో దేవుడు ఉన్నాడని అర్థం చేసుకుంటే, ఎంత నిశ్చింతగా, ఎంత ధైర్యంగా ఉంటుందో చూడండి. ఒక మహాత్ముడిని కలుసుకుంటేనే మీ శక్తి రెట్టింపు అయినట్టు అనిపిస్తుంది. అలాంటప్పుడు సాక్షాత్తూ ఆ భగవంతుని నుంచే మీరు శక్తి పొందితే, ఆ శక్తి ఎంత ఉంటుందో, వేరే చెప్పాలా? భగవంతునిమీద మీకున్న భక్తి ఎంత ఎక్కువ ఉంటే మీ శక్తి అంత ఎక్కువ అవుతూ వస్తుంది. అప్పుడు మీకు యు.పి.యస్. తోడు ఉన్నట్టే అవుతుంది. అంటే అన్‌ఇంటరప్టెడ్ పవర్ సప్లై వస్తుంది.

ఈ పాంక్తబ్రహ్మ ఉపాసనను సకామ ఉపాసనగా చేయవచ్చు లేదా నిష్కామ ఉపాసనగా చేయవచ్చు. సకామ ఉపాసనగా చేస్తే బ్రహ్మలోకప్రాప్తి కలుగుతుంది. నిష్కామ ఉపాసనగా చేస్తే చిత్తశుద్ధి, చిత్త ఏకాగ్రత, చిత్తవైశాల్యత, చిత్తనిశ్చలత్వం కలుగుతాయి.

ఈ ఆరు ఉపాసనలను టూకీగా ఈ క్రింది పట్టికలో చూద్దాము.

**పాంక్తబ్రహ్మ ఉపాసన**

| వరుసక్రమం | ఉపాసన పేరు | ఐదు అంశాలు |
|---|---|---|
| ఎ) | లోకపాంక్తమ్ | భూలోక, భువర్లోక, సువర్లోకాలు, దిక్కులు, అవాంతర దిక్కులు |
| బి) | దేవతాపాంక్తమ్ | అగ్ని, వాయువు, ఆదిత్యుడు, చంద్రుడు, నక్షత్రాలు |

సి) భూతపాంక్తమ్ జలం, ఓషధులు, వనస్పతులు, ఆకాశం, ఆత్మ.
ఇవి సమష్టి పాంక్తబ్రహ్మ ఉపాసనలు.

డి) వాయుపాంక్తమ్ ప్రాణ, వ్యాన, అపాన, ఉదాన, సమాన ప్రాణాలు

ఇ) ఇంద్రియపాంక్తమ్ కన్ను, చెవి, మనస్సు, వాక్కు, చర్మం

ఎఫ్) ధాతుపాంక్తమ్ చర్మం, మాంసం, కండరాలు, ఎముకలు, మూలుగు.
ఇవి వ్యష్టి పాంక్తబ్రహ్మ ఉపాసనలు.

**అనువాకం – 8**

**ఓమితి బ్రహ్మ। ఓమితీదగ్ం సర్వమ్। ఓమిత్యేతదనుకృతిర్హ స్మ వా అప్యోశ్రావయేత్యాశ్రావయన్తి। ఓమితి సామాని గాయన్తి। ఓగ్ం శోమితి శస్త్రాణి శగ్ంసన్తి। ఓమిత్యధ్వర్యుః ప్రతిగరం ప్రతిగృణాతి। ఓమితి బ్రహ్మా ప్రసౌతి। ఓమిత్యగ్నిహోత్రమనుజానాతి। ఓమితి బ్రాహ్మణః ప్రవక్ష్యన్నాహ బ్రహ్మోపాప్నవానీతి। బ్రహ్మైవోపాప్నోతి॥**

**ఉపాసన 5 – ఓంకార ఉపాసన – అనువాకం 8 –** ఈ అనువాకంలో ఐదవ ఉపాసన ప్రవేశ పెట్టబడింది. ఇందులో ఓంకారాన్ని ప్రతీక ఆలంబనగా తీసుకుని, దానిమీద ఈశ్వరుణ్ణి ఆవాహన చేస్తారు. ఓంకారం విరాట్, హిరణ్యగర్భ, ఈశ్వరులలో ఎవరినైనా సూచిస్తుంది.

విరాట్ – సమష్టి స్థూలప్రపంచ అధిష్ఠానదేవత

హిరణ్యగర్భ – సమష్టి సూక్ష్మప్రపంచ అధిష్ఠానదేవత

ఈశ్వర – సమష్టి కారణప్రపంచ అధిష్ఠానదేవత

**ఓమితి బ్రహ్మ (ఉపాసీత) –** ఉపాసీత క్రియాపదం మనం కలుపుకోవాలి. ఓంకారాన్ని ప్రతీకగా తీసుకుని, బ్రహ్మమీద ఉపాసన చేయండి. ఇతి అంటే ఓం అనే పదంమీద చేయండి అని చెప్పినట్టు తీసుకోవాలి. ఇక్కడ బ్రహ్మ అంటే సగుణబ్రహ్మ. నిర్గుణబ్రహ్మమీద ఉపాసన చేయలేము.

**యద్వాచానభ్యుదితం యేన వాగభ్యుద్యతే**
**తదేవ బ్రహ్మ త్వం విద్ధి నేదం యదిదముపాసతే** – కేన 5

ఉపాస్య విషయం ఎప్పుడూ సగుణబ్రహ్మ; ఎన్నడూ నిర్గుణబ్రహ్మ కాలేదు. నేదం యదిదముపాసతే తదేవ బ్రహ్మ త్వం విద్ధి అంటే నువ్వు ఉపాసన చేసే దేవుడు బ్రహ్మ కాదు, దేవునికి ఉపాసన చేసే నువ్వే బ్రహ్మవని తెలుసుకో అని అర్థం.

సాధన చేసే నువ్వే బ్రహ్మవు, సాధన చేయబడే వస్తువు కాదు. విరాట్, హిరణ్యగర్భ, ఈశ్వరులు బింబచైతన్యంయొక్క సమష్టి ప్రతిబింబాలు. వాటిని ప్రతిబింబించే మాధ్యమాలు వరుసగా స్థూలప్రపంచం, సూక్ష్మప్రపంచం, కారణప్రపంచం.

మనకు శాస్త్రాల్లో ఇంతమంది దేవుళ్ళుండగా, ఉపనిషత్తు ఓంకారాన్ని ఎందుకు ప్రతీకగా తీసుకుంది? రాముడు, కృష్ణుడు, శివుడు, వినాయకుడు ఎవరినైనా తీసుకోవచ్చు కదా! నిజానికి దీనికి జవాబు నాలుగవ అనువాకంలోనే చూసేశాము. బ్రహ్మదేవుడు వేదాలసారాన్ని చిలికినప్పుడు ఓంకారాన్ని మొట్టమొదటగా పలికాడనీ, అందువల్ల ఇది చాలా పవిత్రమైన మంత్రమనీ అక్కడ నేర్చుకున్నాము. ఇక్కడ ఓంకార మహిమను కీర్తిస్తున్నది ఉపనిషత్తు.

**ఓమితీదగ్ం సర్వమ్** – ఓం పదం అనేది ఈ సర్వం. ఏ పదమైనా కూడా, ఏ భాషలోనైనా, ఏదో ఒక వస్తువును మాత్రమే సూచించగలదు. ఉదాహరణకు **కుర్చీ** అనే పదం వాడితే అది కుర్చీనే సూచిస్తుంది కానీ బల్లను కాదు. అలాగే రామునికి వచ్చే ధ్యానశ్లోకాలు రాముణ్ణే వర్ణిస్తాయి కాని కృష్ణపరమాత్మకు వర్తించవు. రాముని సుగుణాలు వేరు, కృష్ణుని సుగుణాలు వేరు. రాముడు ధర్మానికి ప్రతీక, నిటారుగా నడుస్తాడు; కృష్ణపరమాత్మ చిలిపితనానికి, ఆనందానికి ప్రతీక. కృష్ణుని ప్రతిమలను చూస్తే, ఎక్కడా నిటారుగా నిల్చున్నట్టుగా చూడము. ఒక కాలు అటువైపు వేసి నాట్యభంగిమలో నిల్చుంటాడు. అందువల్ల కృష్ణపరమాత్మను స్తుతించే శ్లోకాల్లో **త్రిభంగి** అనే పదం వస్తుంది. ఆ విధంగా ఏకరూప ఈశ్వరుణ్ణి వర్ణించే పదాలు విశ్వరూప ఈశ్వరునికి ఉపయోగించలేము.

అదే 'ఓం' అనే పదాన్ని తీసుకుంటే అది మొత్తం సృష్టిని సూచిస్తుంది. ముందు ఓంకారం గురించి సూక్ష్మంగా చూద్దాము. ఓంకారంలో మూడు అక్షరాలున్నాయి. అది అ+ఉ+మ. ఆ మూడూ సమష్టిలోని మూడు ప్రపంచాలను సూచిస్తాయి.

అ – సమష్టి స్థూలప్రపంచం
ఉ – సమష్టి సూక్ష్మప్రపంచం
మ – సమష్టి కారణప్రపంచం

ఇప్పుడు ఈ అక్షరాలను చూద్దాము. ఏదైనా పలకాలంటే నోరు తెరవాలి. నోరు తెరవగానే తేలికగా వచ్చే శబ్దం 'అ'. అందువల్లనే భారతీయభాషల్లో ఏ ప్రాంతీయ భాషను తీసుకున్నా కూడా వర్ణమాలలోని మొట్టమొదటి అక్షరం 'అ'.

**అక్షరాణామకారోఽస్మి** – గీత 10.33

అందువల్లనే కృష్ణపరమాత్మ నేను అక్షరాలలో 'అ'కారాన్ని అన్నాడు. కాని తమాషా ఏమిటంటే ఇంగ్లీషులో 'అ' శబ్దం లేదు. 'ఎ' అక్షరం ఉంది కాని దానికి 'అ' శబ్దం తప్ప అన్ని శబ్దాలూ వస్తాయి. 'అ' శబ్దం ఒక్కోచోట వస్తుంది కాని అక్కడ **సగం** 'అ' నే పలుకుతాము.

మాట్లాడాల్సినవి మాట్లాడేశాక, నోరు మూసుకుంటాము. అప్పుడు 'మ' శబ్దం వస్తుంది. అలా మొదటి అక్షరాన్ని 'అ' సూచిస్తే, చివరి అక్షరాన్ని 'మ' సూచిస్తుంది. మధ్యలో వచ్చే

అక్షరాలన్నింటినీ 'ఉ' సూచిస్తుంది. ఆ విధంగా మొత్తం ఓం పదాన్ని తీసుకుంటే అది అక్షరమాలలోని అన్ని అక్షరాలకూ ప్రతీక. అక్షరమాల ఒక భాషలో పలకగలిగే అన్ని పదాలకూ ప్రతీక. నిజానికి పదాలు అంటే ఏమిటి? ఒక పద్ధతిలో, అర్థం వచ్చేటట్టుగా కొన్ని అక్షరాలను కలిపితే వచ్చేది పదం. పదాలు అంటే ఏమిటి? మొత్తం జగత్తులో ఉన్న వస్తువులనన్నింటినీ వివరించే నామాలు. వస్తువులను పదార్థాలు అంటాము.

ఓమ్ → అక్షరాలు → పదాలు → పదార్థాలు

ఆ విధంగా ఓమ్ ఇదం సర్వం అంటే ఓం అన్ని అక్షరాలకూ, అన్ని పదాలకూ, అన్ని పదార్థాలకూ ప్రతీక. ముందు చూసినట్టుగా తక్కిన పదాలు అలా అనేక వస్తువులను సూచించలేవు. కుర్చీ అంటే కుర్చీనే, బల్ల కాదు. ఓం అంటే స్థూల, సూక్ష్మ, కారణ ప్రపంచంలో ఉన్న పదార్థాలన్నీ వస్తాయి. ఆ పదార్థాలన్నింటికీ కారణం ఆ పరమాత్మ. అందువల్ల ఓం అంటే బ్రహ్మ.

ఓంని ప్రణవం అంటారు. ప్రణవం పేరు సంపూర్ణమైన భగవంతునికి ఆదర్శమైన పేరు. అందువల్ల ఈశ్వర ఉపాసనకు ఓంకారం అద్భుతమైన ప్రతీక. వేదాలలోని ఉపాసనకాండలో ఓంకారం విరాట్, హిరణ్యగర్భ, ఈశ్వరులకు అద్భుతమైన ప్రతీక.

వేదాలలోని ఉపాసనకాండలోనే కాదు, కర్మకాండలో కూడా ఓంకారానికి ప్రధాన పాత్రే ఉంది. ఇది ఉపాసన, కర్మల గురించి చెబుతుంది కాబట్టి ఇక్కడ వేద అంత భాగమైన జ్ఞానకాండ గురించి రావటం లేదు కాని జ్ఞానకాండలో కూడా ఓంకారం ప్రధానపాత్ర పోషిస్తుంది. ఈ మంత్రంలో కర్మకాండలో ఓంకారాన్ని ఎలా వాడతారో వివరిస్తున్నది ఉపనిషత్తు.

ఒక యజ్ఞం చేసేటప్పుడు దానికి యజమాని, యజమాని పత్ని, నాలుగు వేదాలకు చెందిన ఋత్విక్కులు ఉంటారు. ఋగ్వేద మంత్రాలు దేవతలను కీర్తిస్తే, యజుర్వేద మంత్రాలను ఆహుతులు వేసేటప్పుడు పఠిస్తారు. సామవేద మంత్రాలను దానం చేసేటప్పుడు పఠిస్తారు. ఈ యజ్ఞం సమయంలో అంతా ఓం పదంతో సూచనలు ఇవ్వబడతాయి. అదెలాగో చూద్దాము.

**ఓమిత్యేతదనుకృతిః** – అనుకృతి అంటే అంగీకారం. ఎవరైనా అడిగినదానికి కాని, చెప్పినదానికి కాని అంగీకారసూచనగా ఓం వాడతారు. ఉదాహరణకు స్వామీజీ 'వచ్చేవారం కూడా బోధకు రండి,' అని మీతో అంటే మీరు అంగీకారసూచనగా 'ఓం' అని చెప్పవచ్చు. (ఆ ఓం ఇప్పుడు ఓకేగా మారింది). అదేవిధంగా యజ్ఞాల్లో ఒకరికి ఒకరు అంగీకారంగా ఓం చెప్పుకుంటారు.

**హ స్మ వా అపి** – హ, స్మ, వై అనే అవ్యయాలు ప్రసిద్ధమైన విషయాన్ని సూచిస్తాయి. ఆ రోజుల్లో అనేక యజ్ఞాలు చేసేవారు కాబట్టి, వీటిలాగే ఓంకారం కూడా ఆ రోజుల్లో ప్రసిద్ధమైన పదమే.

**ఓఽశ్రావయ ఇతి ఆశ్రావయంతి** – పెద్ద యజ్ఞాల్లో అనేక ఋత్విక్కులు పాల్గొంటారు. కొంతమంది దేవతలకు ఆహుతులను వేస్తే, కొంతమంది అనేక దేవతలను ఆవాహన చేస్తారు. ఆహుతులు వేయటానికి సిద్ధంగా ఉన్న ఋత్విక్కులు, ఆవాహన చేసే ఋత్విక్కులను ఆవాహన మంత్రాలు పఠించమని ఆజ్ఞ ఇవ్వాలి. ఓఽశ్రావయ అంటే ఆవాహన చేసే ఋత్విక్కులను గట్టిగా స్వర్గలోకానికి వినిపించేలా పఠించండని అర్థం.

**ఓమితి సామాని గాయంతి** – ఓం అంటూ సామవేద ఋత్విక్కులు సామవేదాన్ని గానం చేస్తున్నారు.

**ఓగ్ం శోమితి శస్త్రాణి శగ్ంసంతి** – శస్త్రాణి అంటే ఇక్కడ శస్త్రాలు కాదు, ఋగ్వేద మంత్రాలు. స్వరం లేకుండా పఠించే మంత్రాలను శస్త్రాణి అంటారు. ఓం శోం అని హోతృగణాలు ఆ మంత్రాలను పఠిస్తారు.

**ఓమిత్యధ్వర్యుః ప్రతిగరం ప్రతిగృణాతి** – అదే విధంగా అధ్వర్యుడు ప్రోత్సాహకరమైన పలుకులు పలుకుతున్నారు. ప్రతిగరం అంటే ప్రోత్సాహకరమైన పలుకులు.

**ఓమితి బ్రహ్మా ప్రసౌతి** – బ్రహ్మ అంటే అథర్వణవేద పండితుడు. ఆ పండితుడు అజమాయిషీ చేస్తాడు. ఈ బ్రహ్మ నాలుగు వేదాలలోనూ ఆరితేరినవాడై ఉండాలి. ఇప్పుడు అలాంటి బ్రహ్మలు కరువైపోతున్నారు. అందువల్ల ఇప్పుడు యజ్ఞాల్లో ఋత్విక్కులు బ్రహ్మను ఒక ఆసనంమీద దర్భలు, అక్షతలు వేసి ఆవాహన చేస్తున్నారు. ఆ ఆసనంనుంచి అనుమతిని కోరతారు. ప్రసౌతి అంటే అనుమతి. బ్రహ్మ ఓం అంటూ ఇతర ఋత్విక్కులకు అనుమతిని ఇస్తున్నాడు.

**ఓమిత్యగ్నిహోత్రమనుజానాతి** – ఓంకారాన్ని పెద్ద యజ్ఞాలలోనే కాదు, అగ్నిహోత్రం చేసేటప్పుడు కూడా వాడతారు. అగ్నిహోత్రం అంటే చాలా ప్రాథమిక శ్రౌతకర్మ. స్మార్తకర్మల్లో మొట్టమొదటిది ఔపాసనం. కళ్యాణం జరిగేటప్పుడు ఈ కర్మను నేర్పిస్తారు ముందు. దాని తర్వాత అతను శ్రౌతకర్మలను చేయాలి. పెళ్ళి అయిన ఆరునెలల లోపు అతనికి అగ్నిహోత్రం చేయటానికి, అగ్ని ఆధానకర్మ చేయిస్తారు అతనిచేత. అప్పుడు అతను గృహస్థుగా కర్మలు చేయటానికి అర్హత పొందుతాడు. అటువంటి అర్హత పొందిన గృహస్థును **ఆచితాగ్నిః** అంటారు. అతను ఇక జీవితాంతం, రోజుకు రెండుసార్లు అగ్నిహోత్రాన్ని చేయాలి. రెండు సందర్భాలలోనే ఈ కర్మను నిలిపివేయగలడు. అవి మరణం, సన్యాసం. ఈ కర్మలో పాలను ఆహుతికి వాడతారు. పాలను ఆహుతిగా వేసేముందు అనుమతి కోరాలి. దానికి 'ఓం' పదంతో అనుమతిని ఇస్తారు.

అంతేకాదు, పూజలన్నీ ఓంకారంతో మొదలవుతాయి. చివరికి ఇంటిని ప్రక్షాళన చేయాలన్నాకూడా ఓంకారం జపిస్తూ పవిత్రమైన గంగాజలాన్ని ఇల్లంతా జల్లుతారు. పూజల్లో భగవంతుణ్ణి ప్రక్షాళన చేయటానికి కూడా ఓంకారం జపిస్తారు.

ఈ ఓంకారం ఎంత ప్రత్యేకమైనదంటే అన్ని ఆశ్రమధర్మాల్లోనూ దీన్ని ఉపయోగిస్తారు.

**ఓమితి బ్రాహ్మణః ప్రవక్ష్యన్ ఆహ** – ఇక్కడ బ్రాహ్మణః అంటే వేదవిద్యార్థి. అతని ప్రాథమిక శిక్షణ వేదపారాయణం నేర్చుకోవటం. ప్రవక్ష్యన్ అంటే **ప్రవచనం కరిష్యన్ అధ్యేష్యమాణః** అంటే అతను వేదాధ్యయనం చేసేముందు ఓం గురుభ్యో నమః అని పలుకుతాడు.

**బ్రహ్మోపాప్నవానీతి** – నేను ముందు వేదపారాయణం నేర్చుకొందును గాక! (వేద పారాయణం చేశాక వేదమంత్రాల అర్థం నేర్చుకొందును గాక!) వేదపారాయణం చేస్తే అధ్యయనం అంటారు; అర్థం నేర్చుకుంటే మీమాంసా అంటారు. బ్రహ్మచర్య ఆశ్రమంలో, తన వృత్తితో పాటు ఇవి నేర్చుకోవాలి. ధర్మశాస్త్రం అందరూ నేర్చుకోవాలి.

**బ్రహ్మైవోపాప్నోతి** – నేను బ్రహ్మను పొందెదను గాక! అలా అన్ని ఆశ్రమధర్మాల్లోనూ ఓంకారం పవిత్రమైన మంత్రం కాబట్టి,

**ఓమితి (ఉపాసీత)** – ఓంకారాన్ని ఈశ్వర ఉపాసనకు ప్రతీకగా తీసుకోవచ్చు.

**కొన్ని ముఖ్యాంశాలు**

1. పెద్ద యజ్ఞాల్లో నాలుగు వేదాలకు సంబంధించిన ఋత్విక్కులూ ఉంటారు. ఒక్కొక్క వేదానికీ నలుగురు ఋత్విక్కులు ఉంటారు. వారి పేర్లు భిన్నంగా ఉంటాయి.

**హోతా** – ఋగ్వేద పండితుడు. అతని కింద ముగ్గురు ఋగ్వేద పండితులు ఉంటారు. ఈ బ్రాహ్మణులను హోతృగణః అంటారు.

**అధ్వర్యుః** – యజుర్వేద పండితుడు. అతని బృందాన్ని అధ్వర్యుగణః అంటారు.

**ఉద్గాతా** – సామవేద పండితుడు. అతను దేవతలను కీర్తిస్తూ సామగానం చేస్తాడు. అతని బృందాన్ని ఉద్గాతృగణః అంటారు.

**బ్రహ్మ** – అథర్వణ వేదపండితుడు. అతను ప్రత్యక్షంగా యజ్ఞం చేయడు. ఎందుకంటే అథర్వణ వేదంలో ప్రత్యక్షంగా యజ్ఞయాగాదుల గురించి ఉండదు. అందువల్ల అతను ప్రత్యక్షంగా చేయడు గాని, మొత్తం యజ్ఞాన్ని అజమాయిషీ చేస్తాడు. అతని బృందాన్ని బ్రహ్మగణః అంటారు.

ఈ విధంగా ఒక్కొక్క వేదానికి నలుగురేసి ఋత్విక్కులు, నాలుగు వేదాలనుంచి ఉంటారు కాబట్టి వెరసి పదహారుమంది అవుతారు. వీరుకాక ఈ యజ్ఞాన్ని చేసే యజమాని, అతని

భార్య ఉంటారు. అంటే మొత్తం పద్దెనిమిదిమంది చేస్తారు ఒక పెద్ద యజ్ఞాన్ని. ఈ విషయం ముండకోపనిషత్తులో వస్తుంది.

**ప్లవా హ్యేతే అదృఢా యజ్ఞరూపాః**
**అష్టాదశోక్తమవరం యేషు కర్మ।**
**ఏతచ్ఛ్రేయో యేऽభినన్దన్తి మూఢాః**
**జరామృత్యుం తే పునరేవాపి యన్తి॥** – ముండక 1.2.7

అథర్వణ వేదానికి చెందిన ఋత్విక్కుని బ్రహ్మ అని అంటారని చూశాము. ఈయన మీద గురుతరమైన బాధ్యత ఉంది. తక్కిన గణాలు యజ్ఞాన్ని సరిగ్గా నిర్వర్తిస్తున్నారో లేదో చూడాలి; ఒకవేళ పొరపాట్లు ఏమైనా దొర్లినా, వెంటనే ప్రాయశ్చిత్తం చేయకపోతే యజ్ఞం చేసిన ఫలం దక్కదు. అంతా బూడిదలో పోసిన పన్నీరు అవుతుంది. బోలెడు ధనం, కాలం, శక్తి వృథాగా పోతాయి. యజ్ఞంలో దొర్లే పొరపాట్లకు చేయాల్సివచ్చే ప్రాయశ్చిత్తకర్మలు ఆయా పొరపాటునిబట్టి మారతాయి. చిన్నచిన్న పొరపాట్లని చిన్న మంత్రాలతో సరిదిద్దవచ్చు. అంటే ప్రాణాయామం చేయటమో, గాయత్రీమంత్రం జపించటమో చేస్తే చాలు; కాని అదే పెద్ద తప్పు అయితే, మొత్తం యజ్ఞాన్ని మళ్ళీ మొదటినుంచి చేయాల్సివుంటుంది. మరికొన్ని పొరపాట్లు ఎంత తీవ్రంగా ఉంటాయంటే, యజమాని తన ఆస్తిని మొత్తం దానం చేయాల్సివుంటుంది.

ఈ పొరపాట్లు దొర్లకుండా ఉండాలంటే బ్రహ్మ (అథర్వణవేద ఋత్విక్కు)కు నాలుగు వేదాల గురించి లోతైన జ్ఞానం ఉండాలి. అందరు ఋత్విక్కులు చేసే పనులను అప్రమత్తతతో గమనిస్తూ ఉండాలి. ఏమైనా పొరపాట్లు చేస్తున్నారా అని గమనించి వెంటనే వారికి ప్రాయశ్చిత్తకర్మలను చెప్పాలి. హోతా, అధ్వర్యు, ఉద్గాతాలకు వారివారి వేదాలు క్షుణ్ణంగా తెలిస్తే చాలు; తక్కిన వేదాలు తెలియకపోయినా ఫర్వాలేదు. కాని బ్రహ్మ విషయంలో అలాకాదు. అతనికి నాలుగు వేదాలూ క్షుణ్ణంగా తెలిసివుండాలి. అతన్ని **చతుర్వేది** అంటారు. ఇక్కడ మనం గమనించాల్సిన విషయం నాలుగు వేదాలకు చెందినవారూ ఓంకారమంత్రాన్ని వాడతారు.

2. మాండూక్య ఉపనిషత్తు ఓంకార విశ్లేషణద్వారా బ్రహ్మను ఎలా తెలుసుకోవచ్చో వివరిస్తుంది. అది జ్ఞానకాండలోకి వస్తుంది. ఇక్కడ ఓంకార విచారణ కాదు, ఓంకార ఉపాసన చూస్తున్నాము. అందువల్ల దీనిద్వారా చేసేది సగుణబ్రహ్మ ఉపాసన. అంటే ఓంకార ఉపాసన ద్వారా సగుణబ్రహ్మ ఉపాసన చేసి బ్రహ్మలోకానికి వెళ్ళవచ్చు; లేదా ఓంకార విచారణద్వారా నిర్గుణబ్రహ్మజ్ఞానం పొంది జీవన్ముక్తి, తర్వాత విదేహముక్తి పొందవచ్చు. ఎలా చూసినా ఓంకారం విశేషమైనదే.

3. ఓంకారాన్ని మూడు అక్షరాలుగా విడదీస్తామని చూశాము. అవి అ+ఉ+మ. కాని పలికేటప్పుడు ఔమ అని పలకకూడదు, ఓం అనే పలకాలి. సంస్కృతంలోని గుణసంధి వస్తుంది ఇక్కడ. గుణసంధి సూత్రం ప్రకారం అ+ఉ=ఓ. మహ+ఉన్నతి=మహోన్నతి.

4. ఓంకారం నిడివి కూడా ప్రత్యేక సందర్భాల్లో ప్రత్యేకంగా ఉంటుంది. వైదిక మంత్రాలు మొదలుపెట్టేముందు మూడు మాత్రల నిడివి ఉంటే, వైదిక మంత్రాలను ముగించేముందు నాలుగు మాత్రల నిడివి ఉండాలి.

5. ఓంకారం శ్రేష్ఠమన్నామని గృహస్థులు కేవలం ఓంకారాన్ని జపించకూడదు. ఓంకారంతో కలిపి గాయత్రీమంత్రాన్ని జపించవచ్చు. లేదా ఏదైనా భగవన్నామంతో కలిపి జపించవచ్చు. ఉదా. ఓం నమశ్శివాయ. కాని సన్న్యాసి గాయత్రీమంత్రాన్ని జపించకూడదు. అతను దీక్ష తీసుకునేటప్పుడు గాయత్రీ మంత్రంలోని ఒక్కొక్క పాదాన్ని, ఓంకారంలోని ఒక్కొక్క అక్షరంలో లయం చేస్తాడు.

**తత్సవితుర్వరేణ్యమ్ అకారే ప్రవేశయామి**

**భర్గో దేవస్య ధీమహి ఉకారే ప్రవేశయామి**

**ధియో యో నః ప్రచోదయాత్ మకారే ప్రవేశయామి**

సన్న్యాసి భగవన్నామజపం కూడా చేయకూడదు. అందువల్ల సన్న్యాసి కేవలం 'ఓం' అని జపించాలి. ఆ ఓం అతను ఎంత నిడివిమేరకు చేయగలిగితే అంత నిడివిమేరకు చేయాలి. దీర్ఘప్రణవ ఉచ్చారణమ్.

గృహస్థు కేవలం ఓంకార జపం ఎందుకు చేయకూడదు? దయానందస్వామీజీ దానికి జవాబు చెబుతారు. కేవలం ఓంకారాన్ని జపిస్తే, అతనికి తీవ్రవైరాగ్యం ఏర్పడవచ్చు. సన్న్యాసికి అది పెరగాలి; గృహస్థుకు పెరగకూడదు. గృహస్థుకు ఇంకా నెరవేర్చాల్సిన బాధ్యతలు ఉంటాయి. కొంత వైరాగ్యం ఉండాలి కాని, సంసార బాధ్యతలకు ఆటంకం కలిగించేటంత వైరాగ్యం ఏర్పడకూడదు. గృహస్థుకు వేదాంతానికి వచ్చి, దాన్ని నేర్చుకునేటందుకు అవసరమైనంత వైరాగ్యం ఉండాలి కాని, గృహస్థ ధర్మాన్నించి పారిపోయేటంత ఉండకూడదు.

## అనువాకం – 9

**ఋతం చ స్వాధ్యాయప్రవచనే చ। సత్యం చ స్వాధ్యాయప్రవచనే చ। తపశ్చ స్వాధ్యాయప్రవచనే చ। దమశ్చ స్వాధ్యాయప్రవచనే చ। శమశ్చ స్వాధ్యాయప్రవచనే చ। అగ్నయశ్చ స్వాధ్యాయప్రవచనే చ। అగ్నిహోత్రం చ స్వాధ్యాయప్రవచనే చ। అతిథయశ్చ స్వాధ్యాయప్రవచనే చ। మానుషం చ స్వాధ్యాయప్రవచనే చ। ప్రజా చ స్వాధ్యాయప్రవచనే చ। ప్రజనశ్చ స్వాధ్యాయప్రవచనే చ। ప్రజాతిశ్చ స్వాధ్యాయప్రవచనే చ। సత్యమితి సత్యవచారాథీతరః। తప ఇతి తపోనిత్యః పౌరుశిష్టిః। స్వాధాయప్రవచనే ఏవేతి నాకో మౌద్గల్యః। తద్ధి తపస్తద్ధి తపః॥**

**2. కర్మయోగసాధన – అనువాకం 9**

ముందు అనువాకంలో ఐదు ఉపాసనల గురించిన వివరణ అయిపోయింది. ఉపాసనను నిష్కామంగా చేస్తే చిత్తశుద్ధి, చిత్త ఏకాగ్రత, చిత్తవైశాల్యత, చిత్తనిశ్చలత్వం కలుగుతాయి. అవి వేదాంత శ్రవణ, మననాలు చేయటానికి యోగ్యతను ఇస్తాయి. ఉపాసనవల్ల ఆత్మజ్ఞానం రాదు; ఉపాసన ఆత్మజ్ఞాన యోగ్యతాప్రాప్తిని ఇస్తుంది. ఉపాసనవల్ల మోక్షం కూడా రాదు, ఎందుకంటే జ్ఞానంవల్లనే మోక్షం వస్తుంది. ఉపాసనవల్ల జ్ఞానం రాదు కాబట్టి, మోక్షం కూడా రాదు.

ఈ శీక్షావల్లీలో వైదిక ఉపాసనలు చూశాము. ఛాందోగ్యోపనిషత్తులో ఐదు అధ్యాయాల్లో అనేక ఉపాసనలు వస్తాయి. అందులో కూడా కొన్ని ఇటువంటి వైదిక ఉపాసనలు ఉంటాయి. బృహదారణ్యకంలో కూడా అనేక వైదిక ఉపాసనలు వస్తాయి. ఈ వైదిక ఉపాసనలను పురాణాలు, ఇతిహాసాల్లో చూడము. అందువల్ల వైదిక ఉపాసనలే చేసితీరాలనే నియమమేమీ లేదు. ఇప్పుడు వైదిక మంత్రాలు తెలియనివారికి సంహిత ఉపాసన, వ్యాహృతి ఉపాసన చేయటం కష్టం. చేసినా అర్థం లేదు. మరి ఎందుకు చెప్పారు అంటే వాటి గురించిన జ్ఞానం పొందటానికి చెప్పారు.

అందువల్ల జ్ఞానకాండకు రావటానికి కావాల్సిన జ్ఞానయోగ్యతను పొందటానికి ఇష్టదేవతా ఉపాసనలు చేయవచ్చు. రాముడు, కృష్ణుడు, వినాయకుడు, ఏ దేవుణ్ణి తీసుకున్నా వారిమీద, మీకు వచ్చిన భాషల్లో ఎంతో అందమైన ధ్యానశ్లోకాలు ఉంటాయి. ఆ ధ్యానశ్లోకాలను ఉపాసనకు తీసుకోవచ్చు.

ఇప్పుడు ఉపనిషత్తు, ఉపాసన్నుంచి కర్మయోగానికి వస్తోంది. కర్మయోగంలో కాయికకర్మలు ఎక్కువగా ఉంటాయి. ఉపాసన లేకుండా కేవలకర్మ (కర్మ మాత్రం) చేయవచ్చు కాని, కర్మ లేకుండా కేవల ఉపాసన చేయకూడదు గృహస్థు. గృహస్థు జీవనవిధానం కర్మప్రధానంగా ఉంటుంది. అతని జీవనవిధానంలో క్రమేపీ ఉపాసనను జొప్పిస్తుంది శాస్త్రం.

సంధ్యావందనం చేసేటప్పుడు ముందు కర్మ మాత్రమే ఉంటుంది. అర్ఘ్యం సమర్పయామి అంటాడు. తర్వాత గాయత్రీమంత్రజపం చేయించటం ద్వారా ఉపాసనను చొప్పిస్తుంది అందులో. గృహస్థుగా ఉన్నప్పుడు శరీరం దృఢంగా ఉంటుంది కాబట్టి, అనేక కాయికకర్మలను నిర్దేశిస్తుంది శాస్త్రం. క్రమేపీ శక్తి విహీనం అవుతున్నకొద్దీ కర్మలను తగ్గించి, ఉపాసనా ప్రధానంగా చేస్తుంది అతని జీవితాన్ని. అంటే వానప్రస్థాశ్రమానికి వచ్చేసరికి అతని జీవితం ఉపాసనా ప్రధానంగా ఉంటుంది.

ఇక్కడ ఉపనిషత్తు కర్మయోగం గురించి వివరిస్తున్నది. ఆధ్యాత్మిక ఎదుగుదలకు తోడ్పడుతుంది కర్మయోగం. మనం చేసే కర్మలను మూడు తెగలుగా విభజించవచ్చు.

**పర ఉపకార కర్మాణి –** వీటిని సాత్త్వికకర్మలు అని కూడా అంటారు. ఈ కర్మలు సమాజంలో ఎక్కువమందికి ఉపయోగపడతాయి. అంతేకాక ఆధ్యాత్మిక ఎదుగుదలను కూడా పెంపొందిస్తాయి. చిన్మయానందస్వామి పరిభాషలో చెప్పాలంటే అతనికి దైవీప్రవృత్తి ఉంటుంది.

**పర ఉదాసీన కర్మాణి –** వీటిని రాజసిక కర్మలు అనికూడా అంటారు. నా నీటు, నా గోటు అంటారు. నేను, నావారు బాగుంటే చాలు. ఎదుటివారు బాగోగులు నాకనవసరం అనుకుంటాడు. ఇతరుల పట్ల ఉదాసీనంగా ఉంటాడు కాబట్టి పర ఉదాసీన కర్మలు అంటారు. కాని ఇతను కొంతలో కొంత నయం. ఎందుకంటే ఎదుటివారికి మేలు చేయకపోయినా, కీడు కూడా చేయడు. ఇటువంటి కర్మలవల్ల అటు ఆధ్యాత్మిక ఎదుగుదలా ఉండదు; ఆధ్యాత్మిక పతనమూ ఉండదు. ఎక్కడేసిన గొంగళి అక్కడే ఉంది అంటారు. చిన్మయానందస్వామి పరిభాషలో చెప్పాలంటే అతనికి మానుషప్రవృత్తి ఉంటుంది.

**పర అపకార కర్మాణి –** వీటిని తామసిక కర్మలు అనికూడా అంటారు. అతను పైకి రావటం కోసం ఎదుటివారిని కాలరాయటానికి కూడా వెనుకాడడు. ఇటువంటి కర్మల వల్ల ఆధ్యాత్మిక ఎదుగుదల లేకపోగా, క్రిందికి పడిపోతాడు. లౌకికంగా నిచ్చెన పైమెట్లు త్వరగా ఎక్కుతాడేమో కాని, ఆధ్యాత్మికంగా కిందికి పడిపోతాడు. చిన్మయానందస్వామి పరిభాషలో చెప్పాలంటే అతనికి పశుప్రవృత్తి ఉంటుంది.

కర్మయోగి లక్ష్యం ఆధ్యాత్మిక ఎదుగుదలకు తోడ్పడేలా ఉండాలి. అందువల్ల అతను పర అపకార కర్మలను పూర్తిగా మానాలి; పర ఉదాసీన కర్మలను వీలున్నంత వరకూ తగ్గించుకోవాలి; పర ఉపకార కర్మలను పెంచుకుంటూ రావాలి. కాకపోతే, కొన్ని పర అపకార కర్మలను లేదా తామస కర్మలను పూర్తిగా మానలేమని శాస్త్రం గుర్తించింది. అందువల్ల తప్పించుకోలేని ఈ కర్మలకు ప్రాయశ్చిత్తకర్మలను మన దైనందిన పూజల్లో చొప్పించింది.

కర్మయోగంలో మూడు అంశాలు ఉన్నాయి. అవి పంచమహాయజ్ఞాలు, సద్గుణ ప్రాప్తి, సద్భావన. ఇక్కడ పంచమహాయజ్ఞాల గురించి వస్తుంది. కర్మయోగంలో ఇవి ఒక భాగం.

ఎ) **పంచమహాయజ్ఞాలు –**

**దేవయజ్ఞం –** భగవంతునికి చేసే నిత్యపూజలు.

**పితృయజ్ఞం –** పితృదేవతలకు వారు జీవించివుండగా వారికి సేవ చేయటం. మరణించిన పితృదేవతలకు శ్రాద్ధకర్మలు తప్పకుండా చేయాలి; తర్పణాలు వదలాలి.

**ఋషియజ్ఞం –** ఋషులు తాము విని మనకు అందించిన శాస్త్రాన్ని మనం అధ్యయనం చేసి, ముందుతరాలకు కూడా అందేలా చేయాలి. అలా చేయటంవల్ల మన సనాతన

సాంప్రదాయాన్ని నిలబెట్టి, తద్వారా ఋషి ఋణం తీర్చుకున్నవారం అవుతాము. దీన్ని బ్రహ్మయజ్ఞం అనికూడా అంటారు.

**మనుష్యయజ్ఞం** – తోటి మనుష్యులకు సేవ చేయటం; మొత్తం మానవాళికే మేలు చేకూర్చే పనులు చేయటం.

**భూతయజ్ఞం** – మూగజీవులైన పశుపక్ష్యాదులను రక్షించటం; చెట్లు చేమలను కాపాడటం. దీనికి చిహ్నంగా మన సాంప్రదాయంలో ఆవును పూజించటం, తులసిచెట్టును పూజించటం వచ్చింది.

ఇక్కడ, ఈ అనువాకంలో ఉపనిషత్తు ఋషియజ్ఞం గురించి ప్రత్యేకించి చెబుతున్నది. ఎందుకంటే చాలామంది పూజలు చేస్తారు, యజ్ఞయాగాదులు చేస్తారు కాని ఒక క్రమపద్ధతిలో శాస్త్రఅధ్యయనం చేయాలనే నియమాన్ని ఉల్లంఘిస్తారు. అదేదో కేవలం జ్ఞానం పొందటానికి పనికివస్తుంది కాని దానివల్ల ప్రయోజనం లేదు అనుకుంటారు. అది శాస్త్రంయొక్క గొప్పతనం తెలియక వచ్చిన అపోహ. జ్ఞానం శక్తి. మనుష్యులు శక్తివంతులుగా ఉన్నారంటే ఈ జ్ఞానం వల్లనే. లౌకిక జ్ఞానమే ఇంత శక్తివంతమైనదైతే, ఆధ్యాత్మికజ్ఞానం ఇంకెంత శక్తివంతమైనదై ఉండాలి! ఆధ్యాత్మిక జ్ఞానం ఆంతర్గత శక్తిని అపారంగా ఇస్తుంది. అన్నివైపులనుంచి మనను కొరడాదెబ్బలు కొట్టే ప్రారబ్ధకర్మను ఎదుర్కొనే గుండెధైర్యాన్ని కావలసినంతగా ఇస్తుంది శాస్త్రం.

బి) **సద్గుణప్రాప్తి** – పంచమహాయజ్ఞాలే కాక, దైవీసంపత్తిని కూడా పెంపొందించు కోవాలని గట్టిగా చెబుతున్నది ఉపనిషత్తు. దైవీసంపత్తి అంటే మంచి విలువలను పెంపొందించు కోవటం. మనం విలువలను పాటిస్తేనే మనలో ఉన్న దైవీసంపత్తి గురించి మనకు తెలుస్తుంది. భగవంతుణ్ణి మన హృదయంలో దర్శించాలంటే, మన హృదయం నిర్మలంగా, పవిత్రంగా ఉండాలి. ఒక ఆలయంలో విగ్రహప్రతిష్ఠ చేసేముందు ఆలయాన్ని శుద్ధి చేసే పూజలెన్నో చేస్తారు. అంత మంగళకరమైన భగవానుని మూర్తిని ఆవాహన చేసేటప్పుడు, ఆ ఆలయం కూడా అంత పవిత్రంగానూ ఉండాలి. అదే సూత్రం మన దేహాలయానికి కూడా వర్తిస్తుంది. మన దేహం ఆలయం, మన హృదయం భగవంతుడు నెలకొనివుండే గర్భగుడి. అందువల్ల హృదయాన్ని పవిత్రంగా ఉంచుకోవాలి. అలా పవిత్రంగా ఉంచుకోవాలంటే, మనం మంచి విలువలను పాటించాలి. లేకపోతే వేదాంతజ్ఞానం తక్కిన జ్ఞానాల్లాగా మిగిలి పోతుంది తప్ప, దాని విలువ తెలియదు. అందువల్ల కృష్ణపరమాత్మ ప్రత్యేకించి దైవీసంపత్తి గురించి ఒక అధ్యాయంలో చెప్పుకొచ్చాడు. ఈ నేపథ్యంతో ఈ మంత్రభాగాన్ని చూద్దాము.

**స్వాధ్యాయ ప్రవచనే చ** – ఈ పదాలు ఈ అనువాకంలోని ప్రతివాక్యం చివరా వస్తాయి. స్వాధ్యాయం అంటే శాస్త్రాన్ని అధ్యయనం చేయటం. బ్రహ్మచర్య ఆశ్రమంలో బ్రహ్మచారి

తన వృత్తికి తగ్గ శాస్త్రంతోపాటు, ధర్మశాస్త్రాన్ని కూడా అధ్యయనం చేస్తాడు. అంటే, ఉదాహరణకు క్షత్రియుడు రాజ్యపాలనా దక్షత, యుద్ధ నైపుణ్యం నేర్చుకుంటాడు; వైశ్యుడు వ్యాపారంలోని మెళకువలను అభ్యసిస్తాడు. అలా వారి వృత్తిధర్మాలకు అనుగుణంగా ఆయా విద్యలను అభ్యసిస్తారు.

కాని ఎవరే విద్యను అభ్యసించినా కూడా ధర్మశాస్త్రాన్ని మాత్రం అందరూ తప్పనిసరిగా అభ్యసించాలి. బ్రహ్మచర్య ఆశ్రమంలో ధర్మశాస్త్రాన్ని అభ్యసిస్తే, గృహస్థాశ్రమంలోనూ, వానప్రస్థాశ్రమంలోనూ దానిని అమలులో పెడతారు. నేర్చుకున్న ధర్మాన్ని ఆచరణలో పెట్టాలి. దాని తర్వాత సన్న్యాసాశ్రమంలో బ్రహ్మజ్ఞానం పొందుతాడు. అంటే వేదాంతం అభ్యసిస్తాడు. అందువల్ల వేదాల పరిభాషలో చెప్పాలంటే స్వాధ్యాయం అంటే ముందు ధర్మశాస్త్రాన్ని అభ్యసించి, తర్వాత బ్రహ్మశాస్త్రాన్ని అభ్యసించాలి.

ప్రవచనం అంటే విద్యను బోధించటం. వేదాలను స్వంతంగా అభ్యసిస్తే, అవి సరిగ్గా అర్థం కావు. సరిగ్గా అర్థం కాకపోయినా ఫర్వాలేదు, ఒక్కోసారి తప్పుగా అర్థం చేసుకునే ప్రమాదముంది. అది తప్పించుకోవాలంటే, సరియైన గురువు దగ్గరకు వెళ్ళి శాస్త్రాన్ని అధ్యయనం చేయాలి.

**తద్విద్ధి ప్రణిపాతేన పరిప్రశ్నేన సేవయా ।** – గీత 4.34

శిష్యుడు వచ్చి అడిగితే గురువు విద్యను బోధించకుండా ఉండడు. అదే విధంగా, అలాంటి గురువుగా ఉండాలి. మీరు గురువు వద్ద విద్యనభ్యసించి, మీరు మళ్ళీ గురువుగా మారి, శిష్యులకు బోధ చేయాలి. ఈ విద్య అంతరించిపోకుండా, అలా గురుపరంపరగా కొనసాగటానికి మీవంతు కృషి మీరు చేయాలి. శాస్త్రాన్ని నిలబెట్టే గురుతరమైన బాధ్యత మీమీద ఉంది. అనాదిగా వస్తున్న గురుపరంపరను మీ శక్తి మేరకు మీరు కొనసాగించాలి. ముందుగా చిన్నవయస్సులోనే పిల్లలకు బోధించాలి.

వేదాలు అందరూ బోధించలేరు అంటున్నాయి వేదాలు. కర్మబ్రాహ్మణులను మాత్రమే శాస్త్రాన్ని బోధించమంటుంది. వారు పూర్తిగా వారి సమయాన్ని విద్యను బోధించటానికే కేటాయించాలి. అంతేకాదు, దానికి ధనాన్ని ఇవ్వమని కూడా శిష్యులను కోరకూడదు. శిష్యులు ఆనందంగా ఎంత గురుదక్షిణ ఇస్తే, దానితోనే సంతోషంగా తన జీవనాన్ని కొనసాగించాలి గురువు. తనకు వచ్చిన గురుదక్షిణమీద ఆధారపడాలి కాబట్టి, ఈ గురువు చాలా నిరాడంబర జీవనాన్ని కొనసాగించాలి. ఆర్భాటంగా పెద్ద గురుకులాన్ని స్థాపిస్తే, మళ్ళీ దాని నిర్వహణా కార్యక్రమాలకే ఎక్కడలేని ధనమూ, సమయమూ వెచ్చించాల్సి ఉంటుంది. అలా కాకుండా వీలున్నంత నిరాడంబరంగా జీవిస్తే, తన జీవితాన్ని శాస్త్రాన్ని లోతుగా కొలవటానికి, మరిన్ని భాష్యాలు అధ్యయనం చేయటానికి సమయాన్ని

వినియోగించుకోవచ్చు. అందువల్ల కర్మబ్రాహ్మణుని జీవితం విద్య నేర్చుకుని, బోధిస్తూ, నిరాడంబరంగా సాగాలి. స్వాధ్యాయప్రవచనేన **ఋషియజ్ఞాన్ని** సూచిస్తాయి.

**ఋతమ్** – ఋతం అంటే **యథాశాస్త్రం జ్ఞానమ్**. అంటే శాస్త్రంనుంచి పొందిన జ్ఞానం. మన జ్ఞానం ప్రత్యక్ష ప్రమాణానికీ, అనుమాన ప్రమాణానికే పరిమితి చెంది ఉండకూడదు. మన జ్ఞానం వేదాలను అధ్యయనం చేస్తేనే పూర్తి అవుతుంది. వేదాలు అపౌరుషేయం. ఇప్పటి లౌకిక జీవన విధానంలో ఎనభైఏళ్ళు వచ్చినా సుఖాల వెంట, ధనం వెంట పరుగులు తీయటం ఆపటం లేదు. అంటే ఎంతసేపూ అర్థ, కామాల వెంటే పరుగులు తీస్తున్నారు. వేదాలకు వస్తేనే మనిషి సాధించాల్సినవి నాలుగు పురుషార్థాలనీ, అవి అర్థకామాలే కాదు; ధర్మం, మోక్షం కూడా ఉన్నాయనీ తెలుస్తుంది. అందువల్ల శాస్త్రాన్ని అధ్యయనం చేసితీరాలి.

**సత్యమ్** – సత్యం అంటే శాస్త్రంనుంచి పొందిన జ్ఞానాన్ని ఆచరణలో పెట్టటం. ఋతం పదానికీ, సత్యం పదానికీ మధ్య చిన్న భేదం ఉంది. ఋతం అంటే శాస్త్రంలో చెప్పినదాన్ని నేర్చుకోవటం; సత్యం అంటే ఆ నేర్చుకున్నదాన్ని ఆచరణలో పెట్టటం. యథా జ్ఞానమ్ అనుష్ఠానం. నేర్చుకున్నది ఒకటీ, ఆచరణలో పెట్టేది ఇంకొకటిగా ఉండకూడదు. శాస్త్రం విధించిన కర్మలను యథావిధిగా చేయాలి. ఆచరణలో పెట్టని పుస్తకజ్ఞానం ఎంత ఉన్నా లాభంలేదు.

**తపః** – తపః అంటే తపస్సు, నిగ్రహం. ప్రయత్నపూర్వకంగా మన కరణాలను అదుపులో పెట్టుకోవటం. జ్ఞానేంద్రియాలు, కర్మేంద్రియాలు, మనస్సు, బుద్ధి మనకు ఈ ప్రపంచంలో వ్యవహారం నడపటానికి తోడ్పడతాయి. వ్యవహారం నడిపే మనం కర్తలం, ఈ పరికరాలు కరణాలు. ఈ కరణాలు కర్త అయిన మన అదుపులో ఉండాలి కాని, వాటి అధీనంలో మనం ఉండకూడదు.

అవి మన అధీనంలో ఉన్నాయో లేవో ఎలా తెలుస్తుంది? మనమే వాటికి యజమాని అనుకుంటాము కాని వాటి అధీనంలోకి మనం జారిపోయామని తెలుసుకునేసరికి పరిస్థితి చేజారిపోతుంది. దాని అధీనంలోంచి బయటపడలేమని చాలా ఆలస్యంగా తెలుసుకుంటాము. మత్తుపదార్థాలకు బానిస అయిన వ్యక్తి, దానికి పూర్తిగా బానిస అయ్యాక కానీ ఆ విషయాన్ని తెలుసుకోలేడు.

అందువల్ల మధ్యమధ్యలో మనం అలవాటుగా చేసే పనులను ఒకరోజు మాని చూడాలి. ఉదాహరణకు మనం కాఫీగత ప్రాణులమయితే, ఒకరోజు కాఫీ మాని చూడాలి. మనస్సు పదేపదే దానివైపు లాగుతుంటే, మనం దానికి బానిస అయినట్టు అర్థం. అందువల్ల మధ్యమధ్యలో పురుషప్రయత్నంతో ఏదైనా మానాలి. గురువు చెప్పాడనో, శాస్త్రం చెప్పిందనో మానితే అది అణగద్రొక్కటం అవుతుంది. మనంతట మనం మానితే అది నిగ్రహం

అవుతుంది. అణగద్రొక్కటం నియంత్రణ కాదు. అణగ ద్రొక్కితే అది బాధకు దారితీస్తుంది. ఆ బాధను తీర్చుకోవటానికి అడ్డదార్లు తొక్కటానికి ప్రయత్నిస్తాము.

తపస్సుకు సాధారణంగా చెప్పే వ్రతాలు ఉపవాసం, మౌనవ్రతం. నాలుక చాలా శక్తివంతమైన పరికరం. అందువల్ల బొత్తిగా మాటవినదు. పైగా నాలుక రెండు పనులు చేస్తుంది. అది జ్ఞానేంద్రియంలోకీ వస్తుంది, కర్మేంద్రియంలోకీ వస్తుంది. జ్ఞానేంద్రియంగా రుచి చూసే నోరుగా పనిచేస్తే, కర్మేంద్రియంగా మాట్లాడే నోరుగా పనిచేస్తుంది. అందువల్ల శాస్త్రం నోటిని అదుపులో పెడితే తక్కిన ఇంద్రియాలను తేలిగ్గా అదుపులో పెట్టవచ్చు అంటుంది. నోరు అణిగితే మనిషి కూడా అణుగుతాడు అంటారు. ఒక్క నాలుకను అదుపులో పెడితే ఎనిమిది ఇంద్రియాలు అదుపులోకి వాటంతట అవే వస్తాయి. ఉపవాసాలు ఎన్నో రకాలు ఉన్నాయి. అందులో ఇక్కడ రెండు చూద్దాము.

**కృచ్ఛ్రమ్** – ఈ విధమైన ఉపవాసాన్ని ప్రాయశ్చిత్తకర్మగా పాటిస్తారు. అంటే ఏదైనా నియమాన్ని ఉల్లంఘిస్తే, దానికి పరిహారంగా ఉపవాసం ఉండటం.

**చాంద్రాయణమ్** – ఈ విధమైన ఉపవాసంలో పౌర్ణమిరోజు పూర్తిగా కడుపు నిండా తిని, రోజుకు కొంచెం కొంచెంగా తగ్గించుకుంటూ వచ్చి, అమావాస్యరోజు అసలేం తినకూడదు. మళ్ళీ మర్నాటినుంచి కొంచెం కొంచెంగా పెంచుకుంటూ వచ్చి, పౌర్ణమి రోజు పూర్తిగా తినాలి. ఉదాహరణకు మీరు పౌర్ణమిరోజున 15 దోశెలు తినగలరనుకుందాము (లెక్క తేలికగా ఉండటంకోసం చెప్పబడింది). మర్నాడు 14, ఆ మర్నాడు 13, అలా తగ్గించుకుంటూ వచ్చి, అమావాస్య ముందురోజు ఒకటే తిని, అమావాస్యరోజు అసలేం తినకూడదు. మళ్ళీ అమావాస్యనుంచి పెంచుకుంటూ వస్తారు. అంటే మర్నాడు ఒకటి, ఆ మర్నాడు రెండు, అలా తింటూ వచ్చి మళ్ళీ పౌర్ణమిరోజున మళ్ళీ 15 దోశెలు తినాలి. ఒక విధంగా చెప్పాలంటే, చంద్రుడు తగ్గుతూ వస్తే మీ ఆహారం తగ్గిస్తూ వస్తారు; మళ్ళీ చంద్రునితో పాటు మీ ఆహారాన్ని కూడా పెంచుకుంటూ వస్తారు.

**దానం** – ఒకవేళ ఉపవాసం ఉండటానికి మీ శరీర ఆరోగ్యం సహకరించకపోతే, బలవంతంగా ఉపవాసం ఉండనవసరం లేదు. శాస్త్రం దీనికి కూడా ప్రత్యామ్నాయం సూచించింది. ఎవరికైనా కొంత సొమ్మును దానం చేయవచ్చు.

**దమః** – దమః అంటే ఇంద్రియనిగ్రహం. నిగ్రహం వేరు, అణగద్రొక్కటం వేరు. మనం నిత్యానిత్య వస్తువివేకం చేస్తే, దానంతట అదే వైరాగ్యం వస్తుంది. అప్పుడు ఇంద్రియాలను తేలికగా అదుపులో పెట్టగలుగుతాము. దానిబదులు ఎవరో చెప్పారని చేస్తే, అది అణగద్రొక్కటం అవుతుంది. ఉదాహరణకు ఏ వస్తువులను చూడాలో, వేటిని చూడకూడదో మనకు తెలియాలి. మనలో కామక్రోధాల వంటి వికారాలను కలగజేసే విషయవస్తువుల

జోలికి పోకుండా, మనలో దైవీసంపత్తిని పెంపొందించుకునేందుకు తోడ్పడే వస్తువులవైపు ఇష్టంగా దృష్టిని మరల్చాలి. కాని సాధారణంగా మనం దీనికి భిన్నంగా ప్రవర్తిస్తాము. మనకు మంచివి కానివైపు తేలిగ్గా ఆకర్షింప బడతాము; మనకు శ్రేయస్కరమైనవాటికి దూరంగా ఉంటాము. ఎందుకంటే కిందికి జారటం తేలిక; కొండపైకి ఎక్కడం చాలా కష్టం.

**శమః** – శమః అంటే మనోనిగ్రహం.

నీ ఆలోచనలను గమనించు; అవి నీ మాటలుగా మారతాయి

నీ మాటలను గమనించు; అవి నీ చర్యలుగా మారతాయి

నీ చర్యలను గమనించు; అవి నీ అలవాట్లుగా మారతాయి

నీ అలవాట్లను గమనించు; అవి నీ భవిష్యత్తును నిర్ణయిస్తాయి

మనం భగవంతుడు మన భవిష్యత్తును నిర్ణయిస్తాడనుకుంటాము కాని మన ఆలోచనలే మన భవిష్యత్తును నిర్ణయిస్తాయని గమనించము. ఆ మాటకొస్తే అసలు ఆలోచనలనే పట్టించుకోము. అవి ఎవరికీ కనబడవు కాబట్టి ఎటువంటి ఆలోచనలు వచ్చినా వాటిని పట్టించుకోము. ఇంటి విషయాలే తీసుకోండి; చాలామంది డ్రాయింగ్ రూమ్ చాలా శ్రద్ధగా సర్దుతారు కాని లోపలి గదుల్లో సామాన్లు అడ్డదిడ్డంగా పడవేస్తారు. ఎవరూ చూడరు కదా అని నిర్లక్ష్యం చేస్తారు. అటువంటి నిర్లక్ష్యమే మనం ఆలోచనలమీద కూడా చూపుతున్నాము. కాని ఆలోచనలే మాటలుగా వెలువడి, అవే కార్యరూపం దాల్చి, అవే మన అలవాటుగా మారి, అవే మన దిశానిర్దేశం చేస్తాయని గమనించము. అందువల్ల మనస్సులో కలిగే ఆలోచనలను అదుపులో పెట్టుకోవాలి.

అరుణప్రశ్నలో ఈ పదాలు వస్తాయి:

**తస్మాత్ మనసా యథా పురుష అభిగచ్ఛతి** – అతని ప్రమేయం లేకుండానే ఎప్పుడైతే మనస్సులో ఆ ఆలోచన తీవ్రంగా ఉంటుందో,

**తత్ వాచా వదతి** – తను పలకవద్దు అనుకున్నా కూడా, బయటకు మాటల రూపంలో దూసుకువచ్చేస్తాయి. అంటే అతనికి కూడా తెలియకుండా ఏవైనా మాట్లాడాడు అంటే, ఆ ఆలోచన అతనిలో ఎంత తీవ్రంగా ఉందో అర్థమవుతుంది. ఆ హానికరమైన మాటలు బయటకు దూసుకువచ్చాయంటేనే, అవి లోపల చేయాల్సిన హానిని చేసే వచ్చాయని అర్థం.

**తత్ కర్మణా కరోతి** – చివరికి ఆ మాటలనే అతను ఆచరణలో పెడతాడు.

అందువల్ల ఆలోచనలను శ్రద్ధగా గమనిస్తూ ఉండాలి. మన మానసిక జీవనం కూడా ఆదర్శవంతంగా ఉండాలి.

**అగ్నయశ్చ** – ఇక్కడ అగ్ని అంటే వైదికయజ్ఞాలు లేదా దేవయజ్ఞం అనవచ్చు. యజ్ఞాలను అగ్ని అని అనటానికి సాంకేతిక కారణాలు ఉన్నాయి. యజ్ఞాలలో అగ్నిని వెలిగించే తతంగాన్ని అగ్ని ఆధానం అంటారు. ఒక పద్ధతిలో గృహస్థు వెలిగించిన అగ్నిని గార్హపత్య అగ్ని అంటారు. ఈ అగ్ని నిత్యాగ్నిగా మండుతూనే ఉండాలి. ఈ గార్హపత్యాగ్ని తోనే ఆ గృహస్థుకు అంత్యేష్ఠి కర్మలు చేయాలి.

యజ్ఞాలు చేసేటప్పుడు గృహస్థు ఈ గార్హపత్య అగ్నినుంచి ఆయా యజ్ఞాలనుబట్టి, రెండురకాల అగ్నులను వెలిగిస్తాడు. వాటిని ఆహవనీయ అగ్ని అనీ, దక్షిణాగ్ని అనీ అంటారు. ఆయా యజ్ఞాలు ముగిశాక, వాటిలోని అగ్నిని మళ్ళీ ఈ గార్హపత్య అగ్నితో కలుపుతాడు. ఆ విధంగా ఒక వైదిక సాంప్రదాయంలో మూడు అగ్నులు ప్రధానపాత్ర వహిస్తాయి. ఈ మూడు అగ్నులు అన్ని రకాల యజ్ఞాలకు సంకేతాలు. అలా ఒక గృహస్థుకు 26 అగ్నియజ్ఞాలు నిర్దేశించబడ్డాయి. సప్త పాకయజ్ఞాః, సప్త హవిర్యజ్ఞాః, సప్త సోమయజ్ఞాః, పంచమహాయజ్ఞాః.

**అగ్నిహోత్రం చ** – అగ్నిహోత్రం అంటే ప్రాథమిక వైదికయజ్ఞం. అగ్నిహోత్రం చేయుగాక. అగ్నయే, అగ్నిహోత్రమ్ పదాలు **దేవయజ్ఞాన్ని** సూచిస్తాయి.

**అతిథయః చ** – అతిథులను గౌరవంగా చూసి, వారి అన్నపానాదులను గమనించు కోవాలి. దీన్ని అశన్నదానయజ్ఞః అంటారు. అతిథియజ్ఞం మనుష్యయజ్ఞాన్ని సూచిస్తుంది.

**మానుషమ్ చ** – సమాజంలో మన విధులను సక్రమంగా నిర్వహించాలి. మనం సమాజంలో ఒక భాగం కాబట్టి, ఈ సమాజానికి ఋణపడివున్నాము. సమాజంలోని తోటివారి అండదండలు లేకపోతే, మనం జీవించలేము. ఇన్నాళ్ళూ మనం సమాజంనుంచి తీసుకున్నాము; ఇప్పుడు మనమే సమాజానికి తిరిగి ఇవ్వాలి.

సన్న్యాసికి మాత్రమే ఈ బాధ్యత ఉండదు. ఎప్పుడైతే అతను సన్న్యాసం స్వీకరిస్తాడో అప్పుడే అతను సమాజంనుంచి ఏమీ ఆశించలేడు; ఆఖరికి భిక్ష కూడా.

**యదృచ్ఛా లాభః సంతుష్టః**

అతిథయః, మానుషమ్, పదాలు **మనుష్యయజ్ఞాన్ని** సూచిస్తాయి.

**ప్రజా చ ప్రజనశ్చ ప్రజాతిశ్చ** – ఈ మూడూ కలిపి పితృయజ్ఞంలోకి వస్తాయి. ఇవి వంశాభివృద్ధికోసం లేదా కులాభివృద్ధికోసం చేసే సేవలు. మన వంశాన్ని నిలబెట్టే బాధ్యత మన భుజస్కందాలమీద ఉంది. దానిలో భాగంగా పెళ్ళి చేసుకోవటం, పిల్లలను కనటం వస్తుంది. అందువల్ల సంతతిని పెంపొందించటం కూడా పితృయజ్ఞంలో భాగంగా వస్తుంది. ఆ మూడు ఏమిటో చూద్దాము.

**ప్రజా** – పిల్లలను కనటం గృహస్థ ధర్మంగా ఎందుకు పేర్కొంది? సృష్టిలో ఏ జీవిని తీసుకున్నా, ఆ జీవికి పిల్లలు పుట్టటం సహజంగా జరుగుతుంది. అలాంటప్పుడు ఎందుకు దాన్ని ఉపనిషత్తు ప్రత్యేకించి చెప్పింది? వేదాలు పెళ్ళయిన జంట, తాము ఆధ్యాత్మికంగా ఎదగటానికి సంతతిని పెంపొందించాలి అంటున్నాయి. మన శాస్త్రాల గొప్పదనమే అది. సర్వసాధారణమైన, ప్రకృతిసిద్ధమైన ఒక చిన్న చర్యను కూడా పవిత్రమైన సాధనగా తీర్చిదిద్దుతుంది. ఊపిరి పీల్చుకోవటం సర్వసాధారణమైన చర్య. కాని ఇంత ప్రాథమిక చర్యను కూడా ఒక సాధనగా మలచింది. దాన్ని ప్రాణాయామ సాధన అంది. అంటే ప్రకృతి సహజంగా, మనకు తెలియకుండా చేసే చర్యను కూడా ఒక ప్రయత్నపూర్వకమైన చర్యగా, అది కూడా పవిత్రమైన చర్యగా చేసింది. ఆ ప్రాణాయామం చేయటానికి ఒక అనువైన ప్రదేశం, అనువైన కాలం, అనువైన శాస్త్రాన్ని నిర్దేశించింది.

మనం ప్రకృతి సిద్ధంగా చేసే ఇంకొక కర్మ తినటం. ఈ సహజసిద్ధమైన కర్మను ప్రాణాగ్నిహోత్ర సాధనగా మలచింది. మనలో వైశ్వానర అగ్ని (ప్రాణాగ్ని) ఉందనీ, అందువల్ల మనం లోపలికి పంపించే ఆహారం ఈ ప్రాణాగ్నికి వేసే ఆహుతి అనీ చెప్పింది. ఇలా యజ్ఞంగా ఎందుకు మలచింది? అప్పుడు ఏది పడితే అది, ఎప్పుడు పడితే అప్పుడు, ఎక్కడ పడితే అక్కడ తినరు. దయానందస్వామీజీ ఆరుబయట ప్రసంగాలను ఇచ్చేందుకు ఇష్టపడేవారు కాదు. అక్కడ తినుబండారాలు అమ్మేవారి రొద ఎక్కువగా ఉండి, బోధను ప్రశాంతంగా విననీయకుండా చేస్తుంది. ఎప్పుడైతే మనం తినే ఆహారాన్ని యజ్ఞంలో వేసే ఆహుతులుగా భావిస్తామో, అప్పుడే దానికొక పవిత్రత చేకూరుతుంది. సరియైన సమయంలో, సరియైన ఆహారాన్ని, సరియైన మోతాదులో తీసుకోవటానికి ప్రయత్నిస్తాము.

అదే విధంగా కళ్యాణాన్ని కూడా ఒక పవిత్రమైన కర్మగా చేసింది శాస్త్రం. భార్యను **సహధర్మచారిణి** అంటారు. పెళ్ళిని ధర్మ అభివృద్ధికోసం చేసుకోవాలి అంటారు. అంటే వివాహంలో అర్థ, కామాలకన్నా ధర్మానికి పెద్దపీట వేసింది. అక్కడితో ధర్మంయొక్క ప్రాముఖ్యత ముగియలేదు. భార్యాభర్తల తొలి సంయోగాన్ని కూడా గర్భాధాన సంస్కారం అంది. అది పిల్లలు పుట్టటం కోసం, తద్వారా వంశాభివృద్ధికోసం చేసే ధార్మిక కర్మ. అలాగే పుత్రుడు పుట్టాక జాతకర్మ సంస్కారం అనీ, నామకరణ సంస్కారం అనీ, అన్నప్రాసన సంస్కారం అనీ కొన్ని సంస్కారాలు చేస్తారు. ఆ విధంగా జీవితంలో మనం చేసే ప్రతి పనినీ ఒక సంస్కారంగా, ప్రయత్నపూర్వకంగా చేసే పవిత్రమైన సాధనగా తీర్చిదిద్దింది.

**ప్రజనః** – పుత్రుడిని కనటానికి కూడా వివాహ సంస్కారం, గర్భాధాన సంస్కారాలు చేయాలి.

**ప్రజాతిః** – మనం వివాహాన్ని ఒక ధర్మంగానూ, భార్యను సహధర్మచారిణిగానూ, పిల్లలను వంశాభివృద్ధికోసం కనటంగానూ భావిస్తే చాలదు. ఈ ధర్మప్రవృత్తిని పిల్లలకు కూడా, అంటే వచ్చే తరానికి కూడా అందజేయాలి. వాళ్ళకు కూడా పెళ్ళి అనేది ఆధ్యాత్మిక ఎదుగుదలకోసం తోడ్పడే ఒక సంస్కారమనీ, లౌకిక విజయాలు సహకార సాధనలనీ వారికి అర్థమయ్యేలా చెప్పగలగాలి.

అంతేకాదు, మన పిల్లలు వారి జీవితభాగస్వామిని ఎన్నుకోవటంలో కూడా ధర్మానికి ప్రాముఖ్యతను ఇవ్వాలి కాని, అర్థ, కామాలకు ఇవ్వకూడదని వారికి నేర్పించాలి. భార్య అంటే సహధర్మచారిణీ అనీ, ఆమెతో కలిసి మతపరమైన కర్మలను చేసి, ఆధ్యాత్మికంగా ఎదగాలి కాని ఏవో చిన్న కారణంవల్ల చేసుకునే వ్యక్తి కాదని వివరించాలి. ఒక చిన్న కారణం వారిని కలిపితే, ఇంకొక చిన్న కారణం వారిని విడదీసే ప్రమాదం ఉంది. దానికి భిన్నంగా, ధర్మానికి ప్రాముఖ్యతనిచ్చి వివాహం చేసుకుంటే, ఆ వివాహం పదికాలాలపాటు పచ్చగా నిలుస్తుంది. ప్రజాతిః అంటే అసలు అర్థం మనవళ్ళు అని వస్తుంది. అంటే పెళ్ళి చేసుకుని పిల్లలను, మనవళ్ళను కూడా కనాలని అర్థం. కాని శంకరాచార్యులవారు ఈ ప్రజాతిఃకి లక్ష్యార్థం చెబుతున్నారు. మన పిల్లలు సరియైన దృక్పథంతో పెళ్ళి చేసుకునేలా చేయ్యాలని చెబుతున్నారు. వారు బాధ్యతాయుతమైన గృహస్థ ధర్మాన్ని నెరవేర్చాలి; అది కుదరదంటే సన్న్యాసాశ్రమాన్ని స్వీకరించాలి.

ప్రజా, ప్రజనః, ప్రజాతిః పదాలు **పితృయజ్ఞాన్ని** సూచిస్తాయి.

పంచమహాయజ్ఞాల్లో ఒకటైన **భూతయజ్ఞాన్ని** ఇక్కడ పేర్కొనలేదు. భూతయజ్ఞం అంటే తోటి ప్రాణులైన పశుపక్ష్యాదులను కూడా పూజించాలి. అలాగే వృక్షాలను రక్షించాలి. ఇప్పటి భాషలో చెప్పాలంటే పర్యావరణ రక్షణ చేయాలి. వృక్షో రక్షతి రక్షితః అంటారు. ఇక్కడ దీన్ని చెప్పకపోయినా, ఉపలక్షణంగా భూతయజ్ఞాన్ని కూడా కలుపుకోవచ్చు. ఒక్కముక్కలో చెప్పాలంటే, మనం పంచమహాయజ్ఞాలు చేయాలి, విలువలను పాటించాలి.

ఈ అనువాకంలో ఉపనిషత్తు ఒక పరిశోధన జరిపి, తద్వారా ఒక సాధనను కీర్తిస్తున్నది. ఇంతవరకూ చూసిన యజ్ఞాలలో బ్రహ్మయజ్ఞం అత్యంత శ్రేష్ఠమైనదని చెబుతున్నది. దాన్ని స్వాధ్యాయ ప్రవచనే చ పదంలో చూశాము. అంటే శాస్త్రాన్ని అధ్యయనం చేయటం, అధ్యాపనం చేయటం అని చూశాము.

శారీరక ఆరోగ్యానికి అన్ని విటమిన్లూ ఎలా అవసరమో, అలా ఆధ్యాత్మిక ఆరోగ్యానికి అన్ని విలువలూ అవసరమే. కాకపోతే ఎవరి శరీరంలో ఏ విటమిన్ లోపం ఉందో తెలుసుకుని దాన్ని పెంచే మార్గాన్ని సూచిస్తాడు వైద్యుడు. అదే విధంగా, ఆధ్యాత్మిక ఆరోగ్యానికి ఎవరికి, ఏ సాధన అవసరమో, అది ఎక్కువ చేయాల్సి ఉంటుంది.

శాస్త్రం కూడా ఒక్కో సందర్భంలో ఒక్కో విలువకు పెద్దపీట వేస్తుంది. ఒక విలువను మెచ్చుకోవటానికి, తక్కినవాటిని కించపరిచినట్టుగా కనిపిస్తుంది కాని, నిజానికి శాస్త్రం ఉద్దేశం అదికాదు. దాన్ని న హి నిందా న్యాయం అంటారు. అంటే అక్కడ తీసుకోవాల్సిన అర్థం తక్కినవాటిని నిందించటం లేదు, ఒకదాన్ని గొప్పగా మెచ్చుకుంటోంది అని. ఉదాహరణకు ముండకోపనిషత్తులో సత్యాన్ని మెచ్చుకుంటుంది శాస్త్రం.

**సత్యమేవ జయతే నానృతమ్** – ముండకమ్ 3.1.6

సత్యమే గెలుస్తుంది, వేరే ఏదీ గెలవదు అంది. ఎక్కడిదాకానో ఎందుకు, ఈ తైత్తిరీయ ఉపనిషత్తులోనే మూడవ అధ్యాయంలో తపస్సును మెచ్చుకుంది. తపస్సే బ్రహ్మ అంది.

**తపో బ్రహ్మేతి** – భృగువల్లీ

ఈ అనువాకంలో శాస్త్ర అధ్యయనాన్ని మెచ్చుకుంటున్నది.

**స్వాధ్యాయ ప్రవచనే చ**

ఈ అనువాకంలో ఈ స్వాధ్యాయ ప్రవచనే చ ప్రతి ఒక్కదానితోనూ కలిపి చెప్పటంలోని అర్థం, ఇది చాలా ముఖ్యమైనదని చెప్పకనే చెప్పటం. ముందే చూసినట్టుగా ఎక్కడ ఏ విలువను కీర్తిస్తే, దాని విలువకు విలువనివ్వాలి కాని, తక్కిన విలువల విలువను చిన్నచూపు చూడకూడదు.

ఇక్కడ ఉపనిషత్తు ఈ సాధనల గురించి ముగ్గురు ఋషుల అభిప్రాయాలను పేర్కొని, మళ్ళీ వారి అభిప్రాయాలమీద చివరగా తన నిర్ణయాన్ని ప్రకటిస్తున్నది.

**సత్యమితి సత్యవచారాథీతరః** – రథీతర గోత్రీకుడైన రాథీతర ఋషి సత్యాన్నే ప్రధానంగా అనుష్ఠించాలి అన్నాడు. ఆ ఋషి సత్యాన్నే పలుకుతాడు కాబట్టి అతనికి సత్యవచః అనే బిరుదు వచ్చింది. ధర్మశాస్త్రంలో సత్యం అంటే సత్యాన్ని (నిజాన్ని) పలకటం. శీక్షావల్లి ధర్మశాస్త్రం గురించి చెబుతున్నది కాబట్టి, ఇక్కడ సత్యం అంటే సత్యాన్ని పలకటమని తీసుకోవాలి. ఇదే సత్యం పదాన్ని మళ్ళీ బ్రహ్మానందవల్లీలో చూస్తాము. అది జ్ఞానకాండకు చెందినది.

**సత్యం జ్ఞానమనంతం బ్రహ్మ – బ్రహ్మానందవల్లీ**

అక్కడ సత్యం అర్థం వేరు. అక్కడ సత్యం అంటే శుద్ధ ఉనికి లేదా శుద్ధసత్తా.

**తప ఇతి తపోనిత్యః పౌరుశిష్టిః** – పురుశిష్ట పుత్రుడైన పౌరుశిష్టి అనే ఋషి, తపస్సునే ప్రధానంగా చేయాలని బోధించాడు. ఆయన తపస్సును అనుష్ఠానం చేశాడు కాబట్టి ఆ ఋషిని తపోనిత్యః అనికూడా అంటారు.

**స్వాధ్యాయ ప్రవచనే ఏవేతి నాకో మౌద్గల్యః** – ముద్గలుని పుత్రుడైన మౌద్గల్యఋషి స్వాధ్యాయ ప్రవచనం ఉత్తమసాధన అన్నాడు. మౌద్గల్యఋషికి నాకః అనే పేరు కూడా ఉంది. స్వాధ్యాయ ప్రవచనం అంటే శాస్త్రాన్ని అధ్యయనం చేయటం, అధ్యాపనం చేయటం అని చూశాము.

ఈ విధంగా ముగ్గురు ఋషులు మూడు భిన్నాభిప్రాయాలను వెలిబుచ్చారు. రాథీతర ఋషి సత్యాన్ని పలకాలంటే, పౌరుశిష్టి ఋషి తపస్సు చేయాలంటే, మౌద్గల్య ఋషి స్వాధ్యాయ ప్రవచనం చేయాలన్నారు. ఉపనిషత్తు ఈ ముగ్గురిలో ఒకరిది శ్రేష్ఠం అంటుంది.

**తద్ధి తపః** – తత్ హి తపః – తత్ అంటే మూడవది. అంటే స్వాధ్యాయ ప్రవచనం. మూడవదైన ఈ స్వాధ్యాయ ప్రవచనమే ఉత్తమమైన సాధన లేదా శ్రేష్ఠమైన తపస్సు అంటున్నది ఉపనిషత్తు.

**తద్ధి తపః** – రెండోసారి చెప్పటంవల్ల దీన్ని నొక్కివక్కాణిస్తున్నట్లు అర్థం.

సి) **సద్భావన** – వేదాలు విధించే ముఖ్యమైన విధి **శాస్త్ర అధ్యయనం**. ఎవరైనా శాస్త్రాన్ని అధ్యయనం చేస్తే, తను పాటించాల్సిన తక్కిన విధులను శాస్త్రంనుంచే పొందవచ్చని వేదమాత ఉద్దేశం. ఎంత తెలివైన విధివాక్యమో చూడండి! (అందుకేనేమో పరమార్థానంద స్వామీజీ తన శిష్యులకు ఇచ్చే విలువైన సందేశం 'ఫాలో ది శాస్త్ర') ఈ శాస్త్ర అధ్యయనాన్ని ఒక్క బ్రహ్మచర్యంలోనే కాదు, నాలుగు ఆశ్రమాలలోనూ చేయాలి అంటుంది వేదమాత.

పతంజలి అష్టాంగ యోగసూత్రాలను గమనించండి. పతంజలి ఋషి, ధ్యానానికే ప్రాముఖ్యనిచ్చినా ఆయన చెప్పిన ఎనిమిది దశల్లో, ధ్యానం ఏడవదశగా వస్తుంది, మొదటే వచ్చేయదు. మొదటి రెండు దశలు యమ నియమాలు. నియమంలో పాటించాల్సిన ఐదు నియమాల్లో స్వాధ్యాయం ఒకటి. అంటే స్వాధ్యాయం తర్వాతనే ధ్యానం వచ్చింది. శాస్త్ర అధ్యయనం ప్రాథమిక అంశం. దాన్ని ఆధారంగా చేసుకుని వేరే ఏ సాధన చేయాలన్నా కూడా, దానికి తగ్గ జ్ఞానాన్ని ముందు పొందాలి. ఒక విషయం గురించి తెలియందే దానిమీద సాధన ఎలా చేస్తారు? ఒక సాధన విలువ తెలియాలన్నా, దాని ఫలం తెలియాలన్నా ముందు దాన్ని శాస్త్రంలో అధ్యయనం చేయాలి.

**ముఖ్యాంశాలు**

1. ఈ అనువాకంలో బ్రహ్మయజ్ఞాన్ని స్తుతించింది ఉపనిషత్తు అని చూశాము. దానికి స్వాధ్యాయః, ప్రవచనమ్ పదాలను వాడిందని కూడా చూశాము. ప్రవచనం అంటే బ్రహ్మయజ్ఞాన్ని ఒక యజ్ఞంలా చేయటం అనికూడా అర్థం వస్తుంది. ఈ యజ్ఞంలో శాస్త్రానికీ, ఋషులకూ, వారి ధర్మపత్నులకు కృతజ్ఞతలు తెలుపుతారు. ఆ ఋషి పరంపరలో మొట్టమొదటి ఋషి వ్యాసాచార్యులవారు. ఆయనను కృష్ణద్వైపాయనుడు అనికూడా అంటారు.

నిజానికి ఈ యజ్ఞాన్ని రోజూ చేయాలి కాని ఇది ఏడాదికి ఒకసారి మాత్రమే చేస్తున్నారు. అంటే గురుపౌర్ణమిరోజు మాత్రమే చేస్తారు.

2. గృహస్థ స్వాధ్యాయం ప్రతిరోజూ చేయాలి. ఆ స్వాధ్యాయంలో ఐదు ప్రార్థనలు వస్తాయి. అవి –

ఉపనిషత్తు – తైత్తిరీయోపనిషత్తును అధ్యయనం చేయాలి.
(కనీసం రోజుకొక వల్లీని పారాయణం చేయాలి)

భగవద్గీత – భగవద్గీతను పారాయణం చేయాలి
(కనీసం రోజుకొక అధ్యాయాన్ని పఠించాలి)

– విష్ణుసహస్రనామం
– శ్రీరుద్రం
– పురుషసూక్తం

### అనువాకం – 10

**అహం వృక్షస్య రేరివా। కీర్తిః పృష్ఠం గిరేరివ। ఊర్ధ్వపవిత్రో వాజినీవ స్వమృతమస్మి। ద్రవిణగ్ం సవర్చసమ్। సుమేధా అమృతోఽ_క్షితః। ఇతి త్రిశంకోర్వేదానువచనమ్॥**

**జపసాధన – బి) జ్ఞానప్రాప్తి – అనువాకం 10 –** (జపసాధన ఎ– జ్ఞానయోగ్యతా ప్రాప్తిని అనువాకం 4 లో చూశాము.) ఇది చాలా చిన్న అనువాకం. ఇంతవరకూ చూసిన తొమ్మిది అనువాకాలలో ఉపనిషత్తు కర్మ, ఉపాసనలను బోధించింది. కాయిక కర్మలు కర్మలోనికి, మానసిక కర్మలు ఉపాసనలోనికి వస్తాయి. సాధకుడు వీటిని సకామంగా గానీ, నిష్కామంగా గానీ చేయవచ్చు. అతను సంకల్పం చెప్పినదాన్నిబట్టి అతనికి లౌకిక ఫలం కానీ, ఆధ్యాత్మిక ఫలం కానీ వస్తుంది.

**సకామకర్మ ఫలం** – ఇహలోక, పరలోకఫలాలు వస్తాయి. సంతతి, పశువులు, బ్రహ్మవర్చస్సు, గొప్పకీర్తి వస్తాయి.

**నిష్కామకర్మ ఫలం** – సాధన చతుష్టయ సంపత్తిని పొందుతాడు. దానివల్ల జ్ఞానయోగ్యతా ప్రాప్తి కలుగుతుంది. అంటే జ్ఞానం పొందటానికి అధికారి (అర్హుడు) అవుతాడు. దానివల్ల గురువుద్వారా ఆత్మజ్ఞానాన్ని శ్రవణం చేయవచ్చు. అంటే అధికారప్రాప్తి, గురుప్రాప్తి, శ్రవణప్రాప్తి.

ఒకవేళ సాధకునికి కర్మ, ఉపాసనమీద ఆసక్తి లేకుండా జ్ఞానంమీద, మోక్షంమీద తీవ్ర ఇచ్ఛ ఉంటే, అటువంటి సాధకునికి, అతని ఆధ్యాత్మిక ప్రయాణాన్ని సుగమం చేయటానికి, ఇక్కడ ఉపనిషత్తు ఒక ప్రత్యేకమైన మంత్రాన్ని ఇస్తున్నది. ఇటువంటి ముముక్షుత్వాన్ని

కఠోపనిషత్తులో నచికేతునిలో చూస్తాము. అతను యమధర్మరాజు ఎన్ని ప్రలోభాలు పెట్టినా వాటికి లొంగకుండా, ఆత్మజ్ఞానమే కావాలని పట్టుపట్టి, సాక్షాత్తూ యమధర్మరాజునే గురువుగా చేసుకుని, ఆత్మజ్ఞానాన్ని పొందాడు.

అటువంటి తీవ్రముముక్షుత్వం ఉన్న సాధకునికి ఇక్కడ ఉపనిషత్తు జ్ఞానప్రాప్తికి తోడ్పడే మంత్రాన్ని ఇస్తున్నది. నాలుగవ అనువాకంలో జ్ఞానయోగ్యతాప్రాప్తికి మంత్రాన్ని ఇస్తే, ఇక్కడ జ్ఞానప్రాప్తికి మంత్రాన్ని ఇస్తున్నది. అది కూడా త్రిశంకుడనే ఋషి చేసిన ప్రార్థన ద్వారా చెబుతున్నది. త్రిశంకు అంటే త్రిశంకు స్వర్గంలో ఉండిపోయిన రాజు కాదు ఇక్కడ. ఈ ఋషి జ్ఞానాన్ని పొందాక, అంటే వేద అనువచనం చేశాక, బ్రహ్మగుణాలు నా గుణాలు అంటున్నాడు.

జ్ఞానం పొందాక నేర్చుకునేది ఏమిటి?

**అహం బ్రహ్మ అస్మి** – నేను బ్రహ్మను. అందువల్ల బ్రహ్మగుణాలు నా గుణాలు. బ్రహ్మ సత్యం జ్ఞానం అనంతం అనే బదులు నేను సత్యం జ్ఞానం అనంతం బ్రహ్మను అంటాడు జ్ఞాని. బ్రహ్మ జగత్కారణం అనే బదులు నేనే జగత్తుయొక్క సృష్టి కారణం అంటాడు జ్ఞాని.

**మయ్యేవ సకలం జాతం । మయి సర్వం ప్రతిష్ఠితమ్ ।**
**మయి సర్వం లయం యాతి । తద్బ్రహ్మాద్వయమస్మ్యహమ్ ॥** – కైవల్యమ్ 19

నానుంచే అన్నీ పుట్టాయి, నాలోనే స్థితి పొందుతున్నాయి, నాలోకే అన్నీ లయమవుతున్నాయి. నేను ఆ అద్వయబ్రహ్మను.

పదవ అధ్యాయంలో కృష్ణపరమాత్మ జగత్తులోని విభూతులన్నీ ఈశ్వరునికి చెందుతాయి అంటాడు. ఇక్కడ ఈ త్రిశంకు ఋషి ఆ విభూతులన్నీ నాకే చెందుతాయి అంటాడు. జ్ఞానయోగం కావాలనుకుంటే, ఈ త్రిశంకు చెప్పిన ఈ మంత్రాన్ని ప్రతిరోజూ పఠించాలి. నేను బ్రహ్మను అని చెప్పే మహావాక్యంలో, ఆ నేను ఎవరో తెలియకపోతే, ఆ వాక్యం అర్థం కాదు. నేను అంటే మోకాళ్ళనొప్పి ఉన్న శరీరాన్ని కాను; నేను అంటే రాగద్వేషాలున్న మనస్సును కాను; నేను అంటే సాక్షిచైతన్యాన్ని. కాని ఇదంతా తెలియకపోయినా, ఇది రోజూ పఠిస్తే జ్ఞానయోగానికి సంసిద్ధులను చేస్తుంది.

ముందే చూసినట్టుగా నేను బ్రహ్మను అంటే ఉన్నదొకటే అద్వైతం. నేను వేరూ, బ్రహ్మ వేరూ కాదని అర్థం. అది నేర్చుకున్న వ్యక్తిని అద్వైత వేదాంతి అంటారు. భక్తి మార్గంలో ఉన్న సాధకుడు భగవంతుడు వేరు, నేను వేరు అనుకుంటాడు. తను దాసుడనీ, అల్పుడనీ భావిస్తాడు. వీరిద్దరూ ఒకసారి ఒకచోట బసచేశారు. అద్వైత వేదాంతి ఒక గోడమీద సోఽహం అని రాశాడు. సోఽహం అంటే సః అహం అంటే నేను బ్రహ్మ. అది చూసిన ద్వైతవాది అమ్మో!

అపచారం అని, దానిముందు 'దా' కలిపాడు. అప్పుడది దాసోఽహం అయింది. నేను భగవంతుని సేవకుడిని అని అర్థం వస్తుంది. అది చూసిన అద్వైతవేదాంతి దానిముందు 'స' కలిపాడు. అప్పుడది సదాసోఽహం అయింది. దానికి మళ్ళీ ద్వైతవాది 'దా' కలిపాడు. అప్పుడు దాసదాసోఽహం అయింది. అలా ఇద్దరూ ఒకరి తర్వాత ఒకరు 'స', 'దా' అక్షరాలను కలుపుకుంటూ పోయారు.

భగవద్గీత సారాంశంగా మనం ప్రపంచంమీద ఆధారపడే స్థాయినుంచి భగవంతునిమీద ఆధారపడే స్థాయికి వచ్చి, మళ్ళీ భగవంతునిమీద ఆధారపడే స్థాయినుంచి, మనమీదే ఆధారపడే స్థాయికి ఎదగాలని చూస్తాము. మనమీదే ఆధార పడటం అంటే నేను బ్రహ్మను అని అర్థం చేసుకుని, ఆ నిష్ఠలో నిలబడగలగటం. ఇంకో విధంగా చెప్పాలంటే జీవదాసుని స్థితినుంచి ఈశ్వరదాసుని స్థితికి చేరుకుని, చివరికి ఈశ్వర అహం అస్మి అనే స్థితికి చేరుకోవాలి. ఆ స్థితికి చేరుకోవటానికి ఇది సాధన మంత్రంగా ఉపయోగపడుతుంది. శ్రవణ, మననాల ద్వారా ఈశ్వర అహమ్ అస్మి అంటే ఏమిటో అర్థమవుతుంది. ఎప్పుడైతే ఈ జ్ఞానం పొందుతామో, అప్పుడే ఈ మంత్రం పొగరుగానో, తప్పుగానో, పొరపాటుగానో చేసిన ప్రార్థన కాదనీ, మహా వాక్యమంత్రసారం అనీ, ఉపనిషత్తు నేర్పే అంతిమసత్యమనీ అర్థమవుతుంది. అది గనుక తప్పుగానో, పొగరుగానో చెప్పే వాక్యం అయితే ఉపనిషత్తు దాన్ని బోధించి ఉండేదే కాదు.

**అహం రేరివా** – నేను ప్రేరకుడను. నేను శక్తిప్రదాతను.

**వృక్షస్య** – ఇక్కడ వృక్షం అంటే సంసారవృక్షం. సంసారాన్ని వృక్షంతో పోలుస్తుంది కఠోపనిషత్తు.

**ఊర్ధ్వమూలోఽవాక్శాఖః ఏషోఽశ్వత్థస్సనాతనః** – కఠ 2.3.1

దీన్ని ఆధారంగా చేసుకుని కృష్ణపరమాత్మ కూడా చెప్పాడు.

**ఊర్ధ్వమూలమధశ్శాఖమ్ అశ్వత్థం ప్రాహురవ్యయమ్** – గీత 15.1

నేను సంసారవృక్షానికి మూలాన్ని. నేను లేకుండా జగత్తుకు విడిగా ఉనికి లేదు. జాగ్రత్ పురుషుడు లేకుండా మిథ్యా స్వప్నానికి విడిగా ఉనికి లేదు. అలాగే నేను, సత్యం బ్రహ్మను, లేకుండా మిథ్యాజగత్తుకు విడిగా ఉనికి లేదు.

స్వప్నానికి విడిగా ఉనికి లేదని ఏమిటి నిదర్శనం? నేను నిద్రనుంచి లేస్తే, స్వప్న ప్రపంచం లేదు. అదే విధంగా చైతన్యం లేకుండా జగత్తుకు విడిగా ఉనికి లేదు. కార్యకరణ సంఘాతమైన ఈ మనశ్శరీరాలు చైతన్యమైన నానుంచి అరువు తెచ్చుకున్న చిదాభాసతో వ్యవహారం నడుపుతున్నాయి. నేను చైతన్య ప్రదాతను, నేను విశ్వాధారాన్ని.

**కీర్తిః** – కీర్తి అంటే పేరు ప్రతిష్ఠలు. విభూతియోగంలో కృష్ణపరమాత్మ ఎక్కడ ఏ విభూతి ఉన్నా, ఎక్కడ ఏ తేజస్సు ఉన్నా, అదంతా నా విభూతి మాత్రమే, నా తేజస్సు మాత్రమే అంటున్నాడు.

**యద్యద్విభూతిమత్ సత్త్వం శ్రీమదూర్జితమేవ వా** – గీత 10.41

అంటే భగవంతుని విభూతి అనేకమందిద్వారా ప్రకటితమవుతుంది. పైన ట్యాంకులో ఉన్న నీరు గొట్టాలద్వారా కిందికి వస్తుంది. ఆ గొట్టాలు నావల్లనే నీరు వస్తోంది అని గొప్ప చెప్పుకోగలవా? అదే విధంగా ఎవరిలో ఏ గొప్పతనం ఉన్నా అది భగవంతునికే చెందుతుంది. త్రిశంకు ఆ భగవంతుడు నేనే అని జ్ఞానయోగం ద్వారా అర్థం చేసుకున్నాడు కాబట్టి, జగత్తులో ఉన్న కీర్తి అంతా నాకే చెందుతుంది అంటున్నాడు.

**గిరేః పృష్ఠమ్ ఇవ** – నా ఖ్యాతి పర్వతశిఖరమంత ఎత్తైనది.

**ఊర్ధ్వపవిత్రః (అహమస్మి)** – పవిత్రమైనవారిలో పవిత్రమైనవాడిని నేను. మామూలుగా అయితే కొంత పాపాన్ని ప్రాయశ్చిత్తకర్మలద్వారా తగ్గించుకోవచ్చు కాని పూర్తిగా శుద్ధమవరు. కాని, జ్ఞానం పొందితే మాత్రం అత్యంత శుద్ధం అవుతారు.

**స్వమృతమస్మి** – నేను అమృతాన్ని. అంటే నేను శాశ్వతం.

**వాజినీవ** – వాజిని ఇవ – సూర్యునివంటివాడిని. వాజి అంటే సూర్యుడు. వాజం అంటే అన్నం. నమకంలో భగవంతుణ్ణి కీర్తించాక, చమకంలో చాలా కోరుతాడు భక్తుడు. అందులో కోరే మొట్టమొదటిది అన్నం.

సూర్యుడు అన్నప్రదాత కాబట్టి, సూర్యభగవానుణ్ణి వాజి అంటారు. సూర్యుడు నిత్య ప్రకాశకుడు. నేను కూడా సూర్యునిలాగా నిత్యప్రకాశకుణ్ణి అంటున్నాడు త్రిశంకు ఋషి.

**ద్రవిణగ్ం** – ద్రవిణం అంటే ఐశ్వర్యం. ఇంతవరకూ చెప్పినవన్నీ నేను సంపదవల్ల పొందాను అంటున్నాడు త్రిశంకు ఋషి. ఏమిటా సంపద?

**సవర్చసమ్** – కాంతివంతమైన ఆత్మజ్ఞానం. జ్ఞానాన్ని కాంతితో ఎందుకు పోలుస్తారంటే, అది అజ్ఞానమనే చీకటిని పారద్రోలుతుంది కాబట్టి. ఎవరైనా చదువులో చురుకుగా ఉంటే అతన్ని బ్రైట్ అనో, బ్రిలియంట్ అనో అంటారు. అవి రెండూ కాంతిని సూచిస్తాయి. విద్యాధనం దొంగల పాలవదు, ఎవరూ నాశనం చేయలేరు, ఎంత ఇచ్చినా తరగదు. నిజానికి ఎవరికన్నా విద్యాదానం చేస్తే, మనకున్న జ్ఞానం ఇంకా పెరుగుతుంది కూడా.

**విద్యాదానం సర్వదానాత్ ప్రధానమ్**

**సుమేధా** – నేను సర్వజ్ఞుడైన బ్రహ్మను. సర్వజ్ఞం బ్రహ్మ అహమస్మి. నేను అన్ని మనస్సులకూ చైతన్యప్రదాతను. నేను అన్ని మనస్సుల ద్వారా అన్నీ తెలుసుకుంటాను. మనస్సులు అనేకం, కాని చైతన్యం ఏకం. ఆ ఏకమైన చైతన్యాన్ని నేను. జ్ఞానమంతా నాకు చెందుతుంది.

**అమృతోఽక్షితః** – అమృతం అంటే శాశ్వతం; అక్షితః అంటే నాశనం లేనిది. నాశనం లేదు అనటానికి క్షయరహితుడిని లేదా అపక్షయ రహితుడిని అనికూడా చెప్పవచ్చు. నేను శాశ్వతుడిని, క్షయరహితుడిని ఒక అర్థం.

అమృతోఽక్షితఃకి ఇంకొక అర్థం కూడా చెప్పవచ్చు. అమృతేన ఉక్షితః అస్మి అని కూడా తీసుకోవచ్చు. అంటే నేను అమృతంతో ముంచెత్తబడ్డాను అని అర్థం వస్తుంది. ఉక్షితః అంటే మునిగాను అని వస్తుంది. అందువల్ల శాశ్వతమైన జ్ఞానంలో నేను మునిగాను అనికూడా చెప్పవచ్చు.

ఈ మంత్రం సారాంశం నేను బ్రహ్మను. అహం బ్రహ్మ అస్మి.

**ఇతి త్రిశంకోర్వేదానువచనమ్** – దీన్ని త్రిశంకు ఋషి తను జ్ఞానం పొందాక చెప్పాడు.

ఈ మంత్రాన్ని జ్ఞానం పొందకముందే మనం పఠిస్తే, అప్పుడు దాని అర్థం సరిగ్గా తెలియకపోయినా, జ్ఞానం పొందాక దాని విలువ తెలుస్తుంది. బ్రహ్మతో ఐక్యాన్ని త్రిశంకు ఋషి చెప్పినంత తేలికగా ముందుముందు మనం కూడా చెప్పగలుగుతాము.

## అనువాకం – 11

**వేదమనూచ్యాచార్యోఽన్తేవాసిన మనుశాస్తి। సత్యం వద। ధర్మం చర। స్వాధ్యాయాన్మా ప్రమదః। ఆచార్యాయ ప్రియం ధనమాహృత్య ప్రజాతంతుం మా వ్యవచ్ఛేత్సీః। సత్యాన్న ప్రమదితవ్యమ్। ధర్మాన్న ప్రమదితవ్యమ్। కుశలాన్న ప్రమదితవ్యమ్। భూత్యై న ప్రమదితవ్యమ్। స్వాధ్యాయప్రవచనాభ్యాం న ప్రమదితవ్యమ్। దేవపితృకార్యాభ్యాం న ప్రమదితవ్యమ్।**

**మాతృదేవో భవ। పితృదేవో భవ। ఆచార్యదేవో భవ। అతిథిదేవో భవ।**

**యాన్యనవద్యాని కర్మాణి। తాని సేవితవ్యాని। నో ఇతరాణి। యాన్యస్మాకగ్ం సుచరితాని। తాని త్వయోపాస్యాని। నో ఇతరాణి।**

**యే కే చాస్మచ్ఛ్రేయాగ్ంసో బ్రాహ్మణాః। తేషాం త్వయాఽఽసనేన ప్రశ్వసితవ్యమ్। శ్రద్ధయా దేయమ్। అశ్రద్ధయాఽదేయమ్। శ్రియా దేయమ్। హ్రియా దేయమ్। భియా దేయమ్। సంవిదా దేయమ్।**

**అథ యది తే కర్మవిచికిత్సా వా వృత్తవిచికిత్సా వా స్యాత్। యే తత్ర బ్రాహ్మణాస్సమ్మర్శినః యుక్తా ఆయుక్తాః। అలూక్షా ధర్మకామాస్స్యుః। యథా తే తత్ర వర్తేరన్। తథా తత్ర వర్తేథాః। అథాభ్యాఖ్యాతేషు। యే తత్ర బ్రహ్మణాస్సమ్మర్శినః యుక్తా ఆయుక్తాః। అలూక్షా ధర్మకామాస్స్యుః। యథా తే తేషు వర్తేరన్। తథా తేషు వర్తేథాః।**

**ఏష ఆదేశః। ఏష ఉపదేశః। ఏషా వేదోపనిషత్। ఏతదనుశాసనమ్। ఏవముపాసితవ్యమ్। ఏవము చైతదుపాస్యమ్॥**

**ధర్మశాస్త్ర సంగ్రహం** – ఇంతవరకూ అయిన పది అనువాకాల్లో బ్రహ్మవిద్యకు అవసరమైన సాధనలన్నీ చూశాము. మొదటి అనువాకం, చివరి అనువాకం శాంతి పాఠాలు. ఆ రెండింటినీ పక్కన పెడితే, ఇంతవరకూ మనం చూసినవి – ఒక హోమసాధన, రెండు

జపసాధనలు, ఐదు ఉపాసనలు, కర్మయోగసాధన. వీటిల్లో పంచమహాయజ్ఞాలను చూశాము, దైవీసంపత్తిని చూశాము. అంటే ఋతం, సత్యం, తపస్సు, శమం, దమం విలువలను చూశాము. జ్ఞానయోగ్యతా ప్రాప్తికి ఒక జపాన్ని, జ్ఞానప్రాప్తికి ఇంకొక జపాన్ని చూశాము. ఇప్పుడు ఉపనిషత్తు ఈ శీక్షావల్లీని ఈ అనువాకంతో ముగిస్తున్నది. ఇంతవరకూ చెప్పుకొచ్చిన అంశాలను ఒకసారి పునశ్చరణ చేస్తూ ముగిస్తున్నది. అందువల్ల ఈ అనువాకాన్ని ఉపసంహార అనువాకం అని అనవచ్చు.

ఈ అనువాకంలో ఉపనిషత్తు ధర్మశాస్త్రంయొక్క సారాన్ని బోధిస్తున్నది. ధర్మశాస్త్రం వేదపూర్వభాగంలో వస్తుంది. వేదపూర్వభాగం మతపరమైన జీవనం నడపటానికి తోడ్పడుతుంది. మతపరమైన జీవనం జ్ఞానయోగ్యతను పొందటానికి తోడ్పడుతుంది. ఆ విధంగా, ఒక సాధకుడు ముందు మతపరమైన జీవనంతో మొదలుపెట్టి, తర్వాత దానికి అతీతంగా ఎదగాలి. సన్న్యాసాశ్రమం అలా ఎదగటానికి తోడ్పడుతుంది. సన్న్యాసాశ్రమంలో మతానికి సంబంధించిన వన్నింటినీ త్యజిస్తాడు – యజ్ఞోపవీతం, శిఖ, కుటుంబజీవనం.

ధర్మశాస్త్రాన్ని జైమినీ మహర్షి కూలంకషంగా చర్చిస్తారు. మనకు వ్యాసాచార్యుల విరచితమైన బ్రహ్మసూత్రాలు ఉన్నట్టే, వేదపూర్వభాగానికి జైమినీ మహర్షి విరచితమైన ధర్మసూత్రాలు గ్రంథం ఉంది. బ్రహ్మసూత్రాల్లో 555 సూత్రాలు ఉంటే, ధర్మసూత్రాల్లో అనేక ధర్మసూత్రాలు ఉన్నాయి. అందువల్ల ఇది బ్రహ్మసూత్రాలకన్నా చాలా పెద్దది. బ్రహ్మసూత్రాల్లో నాలుగు అధ్యాయాలు ఉంటే, ధర్మసూత్రాల్లో పన్నెండు అధ్యాయాలు ఉన్నాయి. బ్రహ్మసూత్రాలు **అథాతో బ్రహ్మజిజ్ఞాసా** తో మొదలయితే, ధర్మసూత్రాలు **అథాతో ధర్మజిజ్ఞాసా** తో మొదలవుతుంది.

ఈ ధర్మసూత్రాలను పూర్వమీమాంసా సూత్రాణి, ధర్మజిజ్ఞాసా సూత్రాణి అనికూడా అంటారు. ఇది చాలా విస్తారంగా అనేక ముఖ్యమైన యజ్ఞయాగాదులను వివరిస్తుంది. అంతేకాదు జీవితం, మన శరీరం, కుటుంబసభ్యులు, సృష్టి – వీటన్నిటిపట్ల మన దృక్పథం ఎలా ఉండాలో నిర్దేశిస్తుంది. అంతేకాదు వానను, సూర్యుణ్ణి, చంద్రుణ్ణి, భూమిని, ఆఖరికి క్రిమికీటకాదులను కూడా ఎలా చూడాలో చెబుతుంది. బృహదారణ్యకోపనిషత్తులో కూడా ఆరోగ్యం, ఐశ్వర్యం, బలం గురించి మన దృక్పథం ఎలా ఉండాలో వస్తుంది. ధర్మశాస్త్రంలో విలువలకు ఎలా విలువనివ్వాలో కూడా వస్తుంది.

ఆ విధంగా ధర్మశాస్త్రంలో మూడు అంశాల చర్చ ఉంటుంది – యజ్ఞాలు, దృక్పథం, విలువలు. వీటన్నిటినీ తన గ్రంథమైన ధర్మసూత్రాల్లో వివరంగా చర్చించారు జైమినీ మహర్షి. ధర్మశాస్త్రాన్ని ఔపోసన పట్టాకనే, బ్రహ్మసూత్రాలను అర్థం చేసుకోగలరు ఎవరైనా.

ధర్మపురుషార్థం తోడు లేకుండా, మోక్షపురుషార్థాన్ని పొందటం అసాధ్యం. ఎలాగైతే బి.ఏ. చదవందే, ఎం.ఏ. చదవలేమో అలాగే ధర్మం లేకుండా మోక్షం పొందలేము.

ఈ పదకొండవ అధ్యాయంలో ఉపనిషత్తు ధర్మశాస్త్రంయొక్క సారాన్ని బోధిస్తున్నది. అందువల్ల ఈ అనువాకాన్ని ధర్మశాస్త్ర సంగ్రహం అనీ లేదా పూర్వమీమాంస సంగ్రహం అనీ అనవచ్చు.

ఈ ధర్మశాస్త్రాన్ని ఎప్పుడు అధ్యయనం చేయాలి? జీవిత చరమాంకంలో ధర్మ శాస్త్రాన్ని నేర్చుకుని ప్రయోజనం లేదు. ధర్మశాస్త్రం జ్ఞానయోగ్యతను పొందటానికి అవసరమైన సాధనలను నిర్దేశిస్తుంది కాబట్టి, దాన్ని వేదాంతానికి రాకముందే అధ్యయనం చేయాలి. పాఠశాలల్లో, కళాశాలల్లో వేదాంతాన్ని బోధించకూడదు. అహం బ్రహ్మ అస్మి అనే జ్ఞానాన్ని లేతవయస్సులో బోధిస్తే, దాన్ని సరిగ్గా అర్థం చేసుకోకపోగా, ఆ జ్ఞానం వికటించే ప్రమాదం ఉంది. అందువల్ల లేతవయస్సులో వారికి ధర్మశాస్త్రాన్ని బోధించాలి. భగవంతుడు స్వామి అనీ, తను దాసుడు అనీ బోధించాలి.

పూర్వపు ఆశ్రమధర్మాలను తీసుకుంటే, బ్రహ్మచర్య ఆశ్రమంలో ధర్మశాస్త్రాన్ని అధ్యయనం చేయాలని చెబుతున్నది ఉపనిషత్తు. అది గృహస్థాశ్రమంలో సాధ్యం కాదు. ఎందుకంటే గృహస్థు నెరవేర్చాల్సిన కర్మలెన్నో ఉంటాయి. అతను పనుల్లో ఎంత లోతుగా కూరుకుపోతాడంటే, అతనికి శాస్త్రాన్ని అధ్యయనం చేసే తీరికే ఉండదు. అంతేకాదు, తను చేసే కర్మల్లో గృహస్థు ధర్మశాస్త్రాన్ని ఆచరణలో పెట్టాలి. అంత లోతుగా కర్మల్లో కూరుకుపోయినప్పుడు వాటి మెళకువలు అప్పుడు తెలుసుకుంటూ కూర్చునే తీరిక ఉండదు. అనేక కర్మలు చేస్తాడు కాబట్టి అతని మనస్సు ప్రశాంతంగా ఉండదు. నిరంతరం ఆందోళన చెందుతూ, ఒత్తిడికి లోనవుతూ ఉంటుంది. ఒక్క జ్ఞానే ఆందోళన, ఒత్తిడి లేకుండా బాధ్యతను చేపట్టగలడు. మళ్ళీ సన్న్యాసి కూడా ప్రశాంతంగా ఉంటాడు, అతనికేమీ బాధ్యతలు, బంధాలు, కర్మలు ఉండవు కాబట్టి. అందువల్ల సన్న్యాసి జ్ఞానకాండకు వస్తాడు. కాని ధర్మశాస్త్రాన్ని బ్రహ్మచారి అభ్యసించాలి.

వేదశాస్త్రం ప్రకారం, బ్రహ్మచర్య ఆశ్రమంలో చేసే అధ్యయనాన్ని రెండు దశలుగా విభజించవచ్చు.

1. **వేదాధ్యయనం** – మొదటిదశలో శిష్యుడు వేదాలను వల్లెవేయటం నేర్చుకుంటాడు. అక్షరాలను తప్పు లేకుండా, సరిగ్గా పలకాలి ఈ దశలో. ఇక్కడ అర్థాన్ని పట్టించుకోడు; శబ్దానికే ప్రాముఖ్యతను ఇస్తాడు. అందువల్ల దీనిని **అర్థరహిత శబ్దగ్రహణం** అనవచ్చు. చిన్నవయస్సులో మనస్సు పరిపక్వత చెందదు. అందువల్ల లోతుగా విశ్లేషించలేదు; కాని ఏదైనా కంఠతా పట్టటం తేలిగ్గా అబ్బుతుంది. స్పాంజిలాగా ఆ వయస్సులో మనస్సు సులభంగా పట్టేస్తుంది. అందువల్లనే పిల్లల ముందు ఆచితూచి మాట్లాడాలి. లేకపోతే

పిల్లలు ఆ విషయాలను సూక్ష్మంగా పట్టేసి, అనువుగాని సమయంలో వాటిని పలికి, మనను ఇబ్బందికరమైన పరిస్థితుల్లో పడవేస్తారు. వేదాధ్యయనంలో శిష్యుడు వేదమంత్రాలను వల్లెవేస్తాడు. వేదమంత్రాలు అంటే వేదపూర్వభాగంలోని మంత్రాలతో పాటు వేద అంతభాగం మంత్రాలను కూడా అధ్యయనం చేస్తాడు.

2. **వేద మీమాంసా** – వేదాల అర్థాన్ని నేర్చుకుంటాడు. అధ్యయనం చేసేటప్పుడు వేదపూర్వభాగం, వేదఅంతభాగం కూడా అధ్యయనం చేస్తాడని చూస్తాము కాని, అర్థం నేర్చుకునేటప్పుడు వేదపూర్వభాగం యొక్క అర్థమే నేర్చుకుంటాడు. అందువల్ల వేదమీమాంసా అంటే వేదపూర్వమీమాంసా అని అర్థం.

ధర్మశాస్త్రంలో మూడు అంశాలను నేర్చుకుంటాడని చూశాము. అవి మతపరమైన జీవనం, దృక్పథం, విలువలు అని చూశాము. ఇవన్నీ కేవలం తన జ్ఞానం పెంపొందించు కోవటానికి నేర్చుకునేవి కావు. వీటిని తరువాత జీవితంలో ఆచరణలో పెట్టితీరాలి. బ్రహ్మచారిగా అతనికి ప్రపంచంతో ఎక్కువగా లావాదేవీలు ఉండవు. అతనికి తెలిసినది అతి చిన్న ప్రపంచం – తల్లిదండ్రులు, గురువు, తోటి విద్యార్థులు అంతే. అందువల్ల ఆ ఆశ్రమజీవనంలో తను నేర్చుకున్న విషయాలను ఆచరణలో పెట్టటానికి ఎక్కువ ఆస్కారం ఉండదు. అందువల్ల ఆ జీవనం అధ్యయన ప్రధానంగా ఉంటుంది. అక్కడంతా నేర్చుకోవటమే ఎక్కువ ఉంటుంది. నేర్చుకున్నదాన్ని గృహస్థాశ్రమంలోనే ఆచరణలో పెట్టగలడు. అందువల్ల గృహస్థాశ్రమం అనుష్ఠాన ప్రధానంగా ఉంటుంది.

బ్రహ్మచర్య ఆశ్రమంలో నేర్చుకున్న జ్ఞానాన్ని గృహస్థాశ్రమంలో ఆచరణలో పెడతాడు. ఒక గృహస్థు సాధన చతుష్టయ సంపత్తిని పెంపొందించుకుంటాడు. వేదశాస్త్రం ప్రకారం గృహస్థాశ్రమం యొక్క ముఖ్య ఉద్దేశం సాధన చతుష్టయ సంపత్తిని పెంపొందించు కోవటం. ఎప్పుడైతే ఆశించింది నెరవేరుస్తాడో, అప్పుడే గృహస్థాశ్రమం యొక్క ఆవశ్యకత తీరిపోతుంది అతనికి. చెరుకుగడనుంచి రసం తీసుకున్నాక, ఆ పిప్పితో మనకింక పనిలేదు. ఇదే సూత్రం ఆశ్రమానికి కూడా వర్తిస్తుంది. అందుకనే మనిషి జీవితంలోని దశలను ఆశ్రమాలు అన్నారు. అది ఒక దశ మాత్రమే, అంతిమగమ్యం కాదు. కుటుంబజీవనం, మన జీవనయానంలో ఒక మధ్యభాగం మాత్రమే కాని, అది మన అంతిమలక్ష్యం కాదు.

**ఋణానుబంధరూపేణ పశుపత్ని సుతాలయాః।**
**ఋణక్షయే క్షయం యాంతి తత్ర కా పరిదేవనా॥**

పశువులతో, పత్నితో, సుతులతో బంధాలు వారితో మనకు ఉన్న ఋణం వల్ల ఏర్పడతాయి. ఎప్పుడైతే ఆ ఋణం తీరిపోతుందో, అప్పుడే ఆ బంధం కూడా తెగి పోతుంది. వారైనా

మనకు దూరమవుతారు; మనమైనా వారికి దూరమవుతాము. సాధన చతుష్టయ సంపత్తిని పొందగానే, గృహస్థాశ్రమాన్ని వీడాలి. ఆ రోజుల్లో అయితే వానప్రస్థానికి వెళ్ళేవారు. ఇప్పుడు బాధ్యతలను తరువాతి తరానికి అప్పజెప్పి, మానసిక సన్న్యాసాన్ని స్వీకరించవచ్చు. ఎప్పుడైతే బాధ్యతలు తీరతాయో, అప్పుడే ప్రశాంతమైన మనస్సుతో మళ్ళీ విద్యార్థిగా మారవచ్చు. కాకపోతే ఇప్పుడు నేర్చుకునేది వేద–అంత–మీమాంసాన్ని. ఇంకో విధంగా చెప్పాలంటే బ్రహ్మచారిగా ధర్మశాస్త్రాలను నేర్చుకుంటే, సన్న్యాసాశ్రమంలో బ్రహ్మసూత్రాలను నేర్చుకుంటాడు. శాస్త్రం నిర్దేశించిన ఈ మార్గాన్ని ఈ అనువాకంలో చూస్తాము. ఈ నేపథ్యంతో ఈ పదకొండవ అనువాకాన్ని చూద్దాము.

**వేదమనూచ్యాచార్యోఽన్తేవాసిన మనుశాస్తి।**

**వేదమ్ అనూచ్య** – గురువు వేదాన్ని బోధించాడు శిష్యునికి. కాకపోతే ఇక్కడ వేదాధ్యయనం అంటే అర్థం నేర్చుకోడు, వేదమంత్రాలను వల్లెవేస్తాడు అనే విషయాన్ని మర్చిపోకూడదు.

**ఆచార్యః** – విద్యార్థులకు విద్యను బోధించే గురువు. ఈ గురువు వారికి ప్రాథమిక విద్య మాత్రమే బోధించడు. వారివారి వృత్తికి తగ్గ విద్యను కూడా బోధిస్తాడు. ఉదాహరణకు క్షత్రియునికి విలువిద్యను, వైశ్యునికి అర్థశాస్త్రాన్ని బోధిస్తాడు. ఆచార్యుడు అంటే ఆచినోతి, ఆచారే స్థాపయత్యపి, స్వయమ్ ఆచరతే యస్తు అని వస్తుంది.

**ఆచినోతి చ శాస్త్రార్థాన్** – శాస్త్రాన్ని బోధిస్తాడు.

**ఆచారే స్థాపయత్యపి** – నేర్చుకున్నదాన్ని ఆచరణలో పెట్టేలాగా చేస్తాడు.

**స్వయమ్ ఆచరతే** – తను చేసిన బోధను తనే స్వయంగా ఆచరణలో పెడతాడు.

శిష్యుడు గురువు మాటల రూపంలో చేసిన బోధకన్నా కూడా, గురువు యొక్క నడవడికవల్ల ఎక్కువగా ప్రభావితం అవుతాడు. గురువు యజ్ఞాలు, దృక్పథం, విలువలతో కూడిన ధర్మశాస్త్రాన్ని బోధిస్తాడు. దీన్ని **అనుశాసనం** అంటారు. ఆ అనుశాసనాన్ని ఎవరికి బోధిస్తాడు?

**అంతేవాసినమ్** – ఆశ్రమంలో ఉండి విద్యనభ్యసిస్తాడు. గురుకులంలో శిష్యుడు గురువు సమీపంలో ఉండి, విద్యను నేర్చుకుంటాడు. మట్టిముద్దలా ఉండే లేతప్రాయంలో పిల్లవానికి తల్లి, తండ్రి, ఆచార్యుడు ఆదర్శమూర్తులుగా ఉంటారు. వారు సరిగ్గా లేకపోతే వేరే వ్యక్తుల చెడు ప్రభావం పడి సమాజం చెడిపోయే అవకాశం ఉంది.

అంతే అంటే సమీపే అని అర్థం. అంటే గురువు సమీపంలో నివసించే వ్యక్తిని అంతేవాసి అంటారు. గురువును శిష్యులు వేయికళ్ళతో గమనిస్తూ ఉంటారు. అందువల్ల గురువుమీద గురుతరమైన బాధ్యత ఉంది. తను ఆదర్శవంతమైన జీవనాన్ని గడపాలి. ఇక్కడ ఆచార్యుడు అన్నాడు కాబట్టి ఆ గురువు అటువంటి ఆదర్శనీయమైన జీవితాన్ని గడుపుతున్నాడు అని వస్తుంది.

**అనుశాస్తి** – అనుశాస్తి అంటే గురువు, శిష్యునికి వేద అధ్యయనం బోధించాక, ధర్మశాస్త్రాన్ని బోధించాలి. కొంతమంది ఈ అనువాకాన్ని స్నాతకోత్సవంగా భావిస్తారు. అంటే శిష్యుడు బ్రహ్మచర్య ఆశ్రమం వదిలివెళ్ళే ముందు వారిని సంబోధించి చెప్పే సందేశంగా భావిస్తారు. కాని శంకరాచార్యులవారు ఈ బోధ బ్రహ్మచర్య ఆశ్రమం చివర్లో చేయలేదనీ, వేదాధ్యయనానికీ, ధర్మశాస్త్ర అధ్యయనానికీ మధ్యలో చేశాడనీ చెబుతారు. ఇక్కడితో శిష్యుడు వేదమంత్రాలను నేర్చుకోవటం అయిందనీ, ఇప్పుడు ధర్మసూత్రాలను నేర్చుకోబోతున్నాడనీ, ధర్మసూత్రాలను సూక్ష్మంగా ఇక్కడ గురువు నేర్పిస్తున్నాడనీ అంటారు శంకరాచార్యులవారు. అను అంటే గ్రంథాన్ని వల్లించిన తర్వాత, శాస్తి – దాని అర్థాన్ని గ్రహింపజేస్తున్నాడు అని అర్థం. తను నేర్చుకున్న మంత్రాల అర్థాన్ని తెలుసుకోకపోతే, వాటిని గృహస్థాశ్రమంలో ఎలా ఆచరించగలడు?

గురువు చేసిన హితబోధ చూద్దాము.

**సత్యం వద। ధర్మం చర। స్వాధ్యాయాన్మా ప్రమదః। ఆచార్యాయ ప్రియం ధనమాహృత్య ప్రజాతంతుం మా వ్యవచ్ఛేత్సీః। సత్యాన్న ప్రమదితవ్యమ్। ధర్మాన్న ప్రమదితవ్యమ్। కుశలాన్న ప్రమదితవ్యమ్। భూత్యై న ప్రమదితవ్యమ్। స్వాధ్యాయప్రవచనాభ్యాం న ప్రమదితవ్యమ్। దేవపితృకార్యాభ్యాం న ప్రమదితవ్యమ్।**

**సత్యం వద** – సత్యాన్ని పలుకు. ఆలోచనకూ, మాటలకూ మధ్య పొంతన కుదరాలి. సత్యం అంటే శరీరంలో సమతుల్యత పాటించటం. ఆలోచనకూ, వాక్కుకూ మధ్య సమన్వయం ఉందంటే అన్ని అంగాల మధ్య సమతుల్యత ఉందని అర్థం. అంటే మనలో పంచజ్ఞానేంద్రియాలు, పంచకర్మేంద్రియాలు, పంచప్రాణాలు, మనస్సు, బుద్ధి (అంతఃకరణం) ఉన్నాయి. అష్టాంగయోగంలో వచ్చే ప్రత్యాహారం, ఆసనం, ప్రాణాయామం, ధ్యానం అదే వరుసలో ముందు చెప్పిన అంగాలను అదుపులో పెట్టటానికి తోడ్పడతాయి.

సత్యాన్ని పలకకపోతే, అంగాల మధ్య సమతుల్యత దెబ్బతింటుంది. దానివల్ల ఆందోళన, ఒత్తిడి ఏర్పడతాయి. దానివల్ల శారీరరకంగానూ, ఆధ్యాత్మికంగానూ బలహీనుడవుతాడు.

**సత్యమేవ జయతే నానృతమ్** – ముండకమ్ 3.1.6

సత్యంవల్లనే మోక్షం పొందగలరు అని వస్తుంది అందులో.

**ధర్మం చర** – జైమినీ మహర్షి పూర్వమీమాంసా సూత్రాల్లో ధర్మంయొక్క నిర్వచనం వస్తుంది. ధర్మం అంటే శాస్త్రం విధించిన శ్రౌతకర్మలు, స్మార్తకర్మలను ఆచరించటం. చర అంటే ఆచరించు అని అర్థం. ధర్మం పలికేది కాదు, ఆచరణలో పెట్టేది. కేవలం పలకటమే చేస్తే ధర్మం వద అంటారు. ఆచరణలో పెట్టని ధర్మం, ధర్మం వధ అవుతుంది. ఇక్కడ చెప్పిన

విలువలను ఇంతకుముందు కూడా ఈ శీక్షావల్లీలోనే చూశాము. ఇక్కడ ఆచార్యుడు వాటిని మళ్ళీ ఒకసారి గుర్తు చేస్తున్నాడు అంతే.

**స్వాధ్యాయాన్మా ప్రమదః** – స్వాధ్యాయాన్ని ఎన్నడూ ఉపేక్షించకు. గృహస్థాశ్రమంలో ఉండి, ఊపిరాడని పనులతో సతమతమవుతున్నా కూడా ప్రతిరోజూ కొంత సమయాన్ని వేదాధ్యయానికి కేటాయించాలి. ఇంతకుముందు అధ్యాయంలో దీని గురించి విపులంగా చూశాము. పైగా అన్నింటిలోకి స్వాధ్యాయ ప్రవచనం శ్రేష్ఠం అని ఉపనిషత్తు కూడా నొక్కి వక్కాణించింది. శ్రవణం ఒక్కటీ చేస్తే చాలదు; మననం కూడా చేయాలి.

ధర్మశాస్త్రాన్ని ఆచరణలో పెట్టాలంటే, దానికి తగ్గ ఏర్పాట్లు ఉండాలి. పంచమహాయజ్ఞాలు చేయాలంటే ఇల్లు, బ్రాహ్మణులు, భార్య, ధనం, ఆహారం ఉండాలి. ఇదంతా గృహస్థాశ్రమంలోనే కుదురుతుంది. బ్రహ్మచర్య ఆశ్రమం, సన్న్యాసాశ్రమం జ్ఞాన సముపార్జనకే అనువుగా ఉంటాయి. అక్కడ పంచమహాయజ్ఞాలు చేయటానికి అవసరమైన వనరులు ఉండవు. సమాజసేవ చేయాలంటే, సన్న్యాసి మళ్ళీ గృహస్థులాగా మారాలి. అంటే ఒక ఆశ్రమాన్ని ఏర్పాటుచేసి, దానికొక ట్రస్టుని పెట్టి, ధనం ప్రోగేయాలి. అందువల్ల గురువు, శిష్యునికి ధర్మశాస్త్రం నేర్చుకున్నాక, పెళ్ళి చేసుకుని గృహస్థుగా జీవితాన్ని గడపమంటున్నాడు. అంతేకాదు, పెళ్ళి చేసుకునే ముందే గురుదక్షిణను కూడా ఇవ్వమంటున్నాడు. ఎందుకంటే ఒకసారి సంసారంలో పడితే, ఈ గురుదక్షిణ ఇవ్వటం అతనికి బరువనిపించవచ్చు.

**ఆచార్యాయ ప్రియం ధనమాహృత్య** – పూర్వపు గురుకుల పద్ధతిలో గురుకులంలో విద్యనభ్యసించి బయటకు వచ్చాక, శిష్యుడు తన పాండిత్యాన్ని రాజు ముందో, ఎవరైనా ఐశ్వర్యవంతుని ముందో ప్రదర్శించి వారు ఇచ్చిన ధనకనకాది కానుకలనుంచి గురువుకు సమర్పించాలి.

ఆచార్యాయ ప్రియం – అది కూడా ఆచార్యునికి ఇష్టమైనంత ధనాన్ని గురుదక్షిణగా సమర్పించాలి. అంటే ఇక్కడ గురువు శిష్యునినుంచి అతిగా ఆశిస్తున్నాడని పొరపాటు పడకూడదు.

గురుకులవాసంలో అంతేవాసిగా ఉన్న శిష్యునికి వసతి సౌకర్యం, అన్నపానాదులు, విద్యాబోధ అన్నీ ఉచితంగా దొరుకుతాయి. వీరికి ఇలా ఉచితంగా గురువు ఏర్పాటు చేయాలంటే ఆయనకి ధనం ఎక్కడినుంచి వస్తుంది? అందువల్ల విద్య నేర్చుకుని బయటకు వెళ్ళిన విద్యార్థులు తగినంత గురుదక్షిణను ఇస్తే, ఆ ధనంతో తర్వాత వచ్చే విద్యార్థులకు గురువు నిరాటంకంగా విద్యాబోధను చేయవచ్చు.

గురుదక్షిణ ఇచ్చాక, పెళ్ళి చేసుకోమంటున్నాడు ఆచార్యుడు. అది కూడా ఎందుకో వివరిస్తున్నాడు.

**ప్రజా తంతుం మా వ్యవచ్ఛేత్సీః** – నీ వంశాన్ని విచ్ఛిన్నం చేయకు.

**కులక్షయే ప్రణశ్యంతి కులధర్మాః సనాతనాః** – గీత 1.40

నీ కులక్షయం అవకుండా, నువ్వు ధర్మాన్ని అనుసరించి, పెళ్ళి చేసుకుని, వంశాభివృద్ధిని చేయి అంటున్నాడు గురువు. పిల్లలమీద తల్లిదండ్రుల ప్రభావం లేత వయస్సులో చాలా ఉంటుంది. వారు పిల్లలకు వేదాలు నేర్పించాలన్నా, తర్కం నేర్పించాలన్నా ఆ వయస్సులో ఒక్కటే మార్గం. పెద్దలు వారు నేర్పించాలనుకున్నది వారు ఆచరించి చూపాలి. వేదాలు సత్యప్రమాణాలని తార్కికంగా నిరూపించలేము. పైగా తార్కికంగా చెపితే, అర్థం చేసుకునే వయస్సూ కాదు వారిది.

అందువల్ల వారు తార్కికంగా ఆలోచించటం మొదలుపెట్టేలోపు, తల్లిదండ్రులు వారికి ధర్మపరమైన, మతపరమైన జీవనాన్ని అలవాటు చేయాలి. వేదాలను, మహాత్ములను, సన్న్యాసులను, ఆలయాలను గౌరవించే గొప్ప సాంప్రదాయం మనది అని వారికి అర్థమయ్యేలా ప్రవర్తించాలి. ఇవన్నీ ఐదేళ్ళలోపు అలవాటు చేయాలి. ఐదేళ్ళలోపు వయస్సులో వారేం నేర్చుకున్నా పెద్దలను చూసి, వారిని అనుకరించటం ద్వారా నేర్చుకుంటారు. 5–7 సంవత్సరాల లేతవయస్సులో వారి మనస్సు మట్టిముద్దలా ఉంటుంది. వారిని ఎలా కావాలంటే అలా మలుచుకోవచ్చు మనం. వారికి తార్కికంగా వివరించి చెప్పలేని విషయాలను ఆచరణలో పెట్టి చూపించాలి. ఏ కుటుంబంలో అయితే బంధాలు పటిష్ఠంగా ఉంటాయో, ఆ కుటుంబంలోనే మతపరమైన జీవనం ఉంటుంది. అంటే మతపరమైన జీవనం సాగాలంటే, కుటుంబంలో బంధాలు గట్టిగా ఉండాలి. కుటుంబం చీలిపోతే మతపరమైన జీవనం కూడా చెదిరిపోతుంది. అందువల్ల గురువు, నువ్వు పెళ్ళి చేసుకుని వంశపరంపరను నిలబెట్టు అంటున్నాడు. తంతుం అంటే వంశపరంపర.

శిష్యుడు పెళ్ళి చేసుకుని, గృహస్థుగా మారాక, తను ఇంతవరకూ నేర్చుకున్న విలువలను మర్చిపోకూడదు. అందువల్ల గురువు వాటిని మళ్ళీ గుర్తు చేస్తున్నాడు.

**సత్యాన్న ప్రమదితవ్యమ్** – సత్యంనుంచి తప్పిపోకు. సత్యం అంటే మామూలుగా నిజం చెప్పటం. ఇక్కడ ఇంతవరకూ నేర్చుకున్న అన్ని విలువలు, జీవితంపట్ల ఉండాల్సిన దృక్పథం వస్తాయి. ఇంతకుముందు కూడా చూశాము, ధర్మశాస్త్రంలో అధ్యయనం, దృక్పథం, విలువలు అనే మూడు అంశాలను నేర్చుకుంటారని. ఇవి ధర్మశాస్త్రంయొక్క సత్యం. వేదాంతశాస్త్రంయొక్క సత్యం బ్రహ్మ.

**ధర్మాన్న ప్రమదితవ్యమ్** – ధర్మంనుంచి తప్పిపోకు. అంటే ధర్మాన్ని విస్మరించవద్దు. ధర్మాన్ని ఆచరించాలి అంటే మతపరమైన జీవనవిధానాన్ని ఆచరించాలి. మతపరమైన జీవనవిధానం

ఆచరించాలంటే సూర్యోదయం ముందే నిద్రలేవాలి. మన శాస్త్రం, భగవంతుడు సూర్యుని రూపంలో పొద్దున్నే దర్శనం ఇస్తున్నాడనీ, అందువల్ల సూర్యభగవానుని కొలవటానికి ఆయన రాకముందే లేచి, సూర్యభగవానుణ్ణి ప్రార్థించాలనీ బోధిస్తుంది.

ఆహారం తీసుకునే ముందు ప్రార్థన చేయటం, మనం చేయాల్సిన ఇంకొక ధర్మాచరణ. నుదుటిమీద విభూతి పెట్టుకునే కారణం, భగవంతుడు మనలో కొలువై ఉన్నాడని సూచించటానికి. అలాగే ఎవరైనా ఎదురైతే వారికి రెండు చేతులూ జోడించి నమస్కారం పెట్టటంలోని అర్థం, ఇద్దరూ ఒకటేనని సూచించటానికి. ఇద్దరూ ఈశ్వరస్వరూపులే.

**కుశలాన్న ప్రమదితవ్యమ్** – శరీర రక్షణను ఉపేక్షించకు. సమాజాన్ని ఉద్ధరించటానికి కంకణం కట్టుకుని, ఆ సేవలోపడి, మిమ్మల్ని మీరు నిర్లక్ష్యం చేసుకోకూడదు, చేసుకోనవసరం లేదు అంటుంది శాస్త్రం. మిమ్మల్ని కడుపు మాడ్చుకుని, ఇంకొకరికి పెట్టమని చెప్పదు వేదం. సమాజాన్ని ఉద్ధరించే బాధ్యత ఎంత ఉందో, మిమ్మల్ని మీరు ఉద్ధరించుకునే గురుతరమైన బాధ్యత కూడా మీకు ఉంది. అందువల్ల శరీరానికి అవసరమైన అన్నపానాదులను, విశ్రాంతిని ఇచ్చితీరాలి.

సమాజసేవలో పడిపోయి, మీ శరీరాన్ని నిర్లక్ష్యం చేయటమో, హింస పెట్టటమో చేయకూడదు. భగవంతుడు ఈ మనుష్యజన్మను ఇచ్చిందే మోక్షం పొందటానికి. సమాజసేవలోనే కూరుకుపోవటానికి కాదు. సమాజసేవ చేస్తే చిత్తశుద్ధి కలుగుతుంది; చిత్తశుద్ధి కలిగాక సమాజంనుంచి విడివడాలి. జీవితాంతం సేవ చేసుకుంటూ కూర్చుంటే, ఆత్మజ్ఞానాన్ని ఎప్పుడు పొందుతారు? మీకు సమాజంమీద ఎంత బాధ్యత ఉందో, మీమీద కూడా మీకు అంత బాధ్యత ఉందనే విషయాన్ని విస్మరించకూడదు.

ముందు జ్ఞానం పొంది, మోక్షం పొందాక, మీమీద మీ బాధ్యత తొలగిపోతుంది. అప్పుడు మీ జీవితాన్ని లోకానికే అంకితం చేయవచ్చు. జ్ఞాని చేసే కర్మలు లోకసంగ్రహం కోసం చేస్తాడు, తనకు పూర్ణత్వం కావాలని చేయడు. ఎందుకంటే తనే పూర్ణుడు అని అర్థం చేసుకుంటాడు కాబట్టి. అందువల్ల ఆత్మజ్ఞానం పొందేవరకు మీ గురించి మీకున్న బాధ్యతను మీరు విస్మరించకూడదు అంటుంది శాస్త్రం. అది స్వార్థం కాదా అంటే ఇతరులకు హానిచేసి తను పైకి రావాలనుకోవటం స్వార్థం అవుతుంది కాని, మీపట్ల, మీ కుటుంబంపట్ల మీకున్న ధర్మాన్ని నెరవేర్చటం స్వార్థంలోకి రాదంటుంది శాస్త్రం.

**భూత్యై న ప్రమదితవ్యమ్** – సంపదలను త్రోసిపుచ్చకుము. భూతిః అంటే ఐశ్వర్యం. ధనసముపార్జనను ఎన్నడూ చిన్నచూపు చూడకూడదు. ధనాన్ని లక్ష్మీదేవిగా కొలిచే సాంప్రదాయం మనది. లక్ష్మీకటాక్షం ఉంటే, సరస్వతీ కటాక్షం కలుగుతుంది. ధనం సమృద్ధిగా సంపాదించాలి, ఉదారంగా దానధర్మాలు చేయాలి. శాస్త్రం ధనసముపార్జనను

ఎన్నడూ కించపరచలేదు; కాని సంపాదించిన సొమ్మును స్వార్థానికి దాచుకుంటే మాత్రం దాన్ని లోభంగా విమర్శించింది. ఎక్కువగా సంపాదించండి తప్పులేదు; కాని అంత ఎక్కువగానూ దానధర్మాలను చేయండి అంటుంది శాస్త్రం.

శాస్త్రం విధించిన ఆశ్రమధర్మాలను ఒకసారి పరిశీలిస్తే, అవి బ్రహ్మచర్య ఆశ్రమం, గృహస్థాశ్రమం, వానప్రస్థాశ్రమం, సన్న్యాసాశ్రమం. ఈ నాలుగు ఆశ్రమ జీవనాలలోనూ ఒక్క గృహస్థాశ్రమంలోనే ధనాన్ని సంపాదించగలరు. తక్కిన మూడు ఆశ్రమాల్లోనూ వారి మనుగడ కోసం గృహస్థుమీద ఆధారపడాలి. అంటే గృహస్థు వారికి భిక్ష వేయాలి. మూడు ఆశ్రమాలకు చెందినవారిని పోషించాలంటే గృహస్థు ఎంత సంపాదించాలి? అందువల్ల వేదం పుష్కలంగా సంపాదించు – పుష్కలంగా దానధర్మాలు చేయి అంటున్నది. ఎంత అద్భుతమైన సాంప్రదాయమో చూడండి మనది.

ఆవహంతీ హోమం గురించి చెప్పినప్పుడు, అక్కడ ఐశ్వర్యం గురించి నాలుగు అంశాలు చర్చించబడ్డాయి.

**ధనం ధర్మార్థమ్ । ధర్మః చిత్తశుద్ధ్యర్థమ్ । చిత్తశుద్ధిః జ్ఞానార్థమ్ । జ్ఞానం మోక్షార్థమ్**

**ధనం ధర్మార్థమ్** – ధనాన్ని సంపాదించేది ధర్మబద్ధమైన జీవనాన్ని గడపటానికి కాని, భోగలాలసకు కాదు. ధర్మబద్ధమైన జీవనం అంటే పంచమహాయజ్ఞాలు చేయటానికి.

**ధర్మః చిత్తశుద్ధ్యర్థమ్** – సంపాదించిన ధనాన్ని ధర్మాన్ని పాటించటానికి వినియోగిస్తే చిత్తశుద్ధి కలుగుతుంది. దానం గురించి ముందుముందు వివరంగా చూస్తాము.

**చిత్తశుద్ధిః జ్ఞానార్థమ్** – చిత్తశుద్ధి పొందితేనే జ్ఞానయోగ్యతా ప్రాప్తి కలిగి, తద్వారా జ్ఞానం పొందుతారు.

**జ్ఞానం మోక్షార్థమ్** – జ్ఞానం పొందితే మోక్షం పొందుతారు. మోక్షం పొందేది ఆత్మానందం పొందటానికి.

**స్వాధ్యాయప్రవచనాభ్యాం న ప్రమదితవ్యమ్** – శాస్త్ర అధ్యయనాన్ని అధ్యాపనాన్ని ఎన్నడూ విస్మరించకుము. శాస్త్ర అధ్యయనం చాలా ముఖ్యం. లేకపోతే సంపాదిస్తూనే ఉంటారు కాని, దానధర్మాలు చేయరు. ఏదైనా నిలువ ఉన్నది హానికరం. శరీరంలో నిలువ ఉన్న ఆహారం కొవ్వును పెంచుతుంది. లోభి ఇంట్లో నిలువ ఉన్న ధనం దొంగతనాలను పెంచుతుంది. శాస్త్రం అధ్యయనం చేస్తే, దానధర్మాల విలువ తెలుస్తుంది. పంచమహాయజ్ఞాల విలువ తెలుస్తుంది. అప్పుడు ధారాళంగా ఇతరులకోసం ఖర్చుపెట్టటం తెలుస్తుంది.

**దేవపితృకార్యాభ్యాం న ప్రమదితవ్యమ్** – భగవదారాధనను, పితృకార్యాలను ఎన్నడూ విస్మరించకు.

దేవకార్యం – భగవంతుణ్ణి పూజించటం చాలా అవసరం. భాగవతంలో దీని విషయమై ఒక మంచి ఉదాహరణను చూస్తాము. ఒక చెట్టులోని ప్రతికొమ్మకూ, రెమ్మరెమ్మకూ నీరు అందాలంటే చెట్టంతా తడపము. చెట్టు మొదట్లో నీరు పోస్తాము. ఆ చెట్టుయొక్క వ్రేళ్ళు ఆ నీటిని అందుకుని, చెట్టులోని ప్రతి ఒక్క భాగానికీ కనపడకుండా అందజేస్తాయి. అదే సూత్రం ఈ సంసారవృక్షానికి కూడా వర్తిస్తుంది. ఈ సంసారవృక్షానికి వ్రేళ్ళు సాక్షాత్తూ ఆ భగవంతుడే.

**శ్రీ భగవాన్ ఉవాచ**
**ఊర్ధ్వమూలమధశ్శాఖమ్ అశ్వత్థం ప్రాహురవ్యయమ్ ।**
**ఛందాంసి యస్య పర్ణాని యస్తం వేద స వేదవిత్ ॥** – గీత 15.1

అందువల్ల వేదాలు మొత్తం మానవాళికి సేవచేసే మార్గాన్ని దైవపూజద్వారా నిర్దేశిస్తున్నది.

**సర్వే భవంతు సుఖినః । సర్వే సంతు నిరామయాః ॥**
**సర్వే భద్రాణి పశ్యంతు । మా కశ్చిత్ దుఃఖ భాగ్భవేత్ ॥**

ఒక చెంచాడు నీరు భగవంతునికి పోస్తూ ఈ ప్రార్థన చేస్తే, సంసారవృక్షానికి వ్రేళ్ళు అయిన ఈశ్వరుడు ఆ వృక్షాన్ని పరిరక్షిస్తాడు. ఈ ప్రార్థన ఎంత లోతైన ప్రార్థనో చూడండి! మనకు చేయటానికి నిముషం కూడా పట్టదు, కాని ఈ ప్రార్థన అనే నీరు, సంసారవృక్షంలోని ఆకు, ఆకుకూ (ప్రతిజీవికీ) వెళుతుంది. ఎంత అద్భుతమైన ప్రార్థన! ఈ ప్రపంచంలో పొద్దున్న లేచినప్పటినుంచీ ఎన్నో ప్రకృతి వైపరీత్యాల గురించి, ఎన్నో రకాల బీభత్సాల గురించీ వింటుంటాము. వాటివల్ల ఎవరో ఒకరు, ఎక్కడో అక్కడ కష్టాల పాలవుతూనే ఉంటారు. మనం వారందరినీ ప్రత్యక్షంగా వెళ్ళి కాపాడలేము. కాని మనం చేసే దైవయజ్ఞం తప్పకుండా మేలు చేకూరుస్తుంది. అందువల్ల దైవయజ్ఞాన్ని ఎన్నడూ మానకూడదు.

దైవయజ్ఞం చేయటంవల్ల రెండు ప్రయోజనాలు కలుగుతాయి. మీరు చేసే ప్రార్థనలు జీవకోటికి తోడ్పడతాయి. అది ఒక ప్రయోజనం; రెండవది మీకు చిత్తశుద్ధి కలుగుతుంది. ఇప్పటి కాలమాన పరిస్థితుల్లో ఏదైనా చేయమంటే నాకేంటి లాభం అంటారు చాలామంది. దైవయజ్ఞంవల్ల జీవకోటికే కాదు, మీకు కూడా లాభమే. మీకు చిత్తశుద్ధి కలుగుతుంది. చిత్తశుద్ధి కలిగితే జ్ఞానయోగ్యతాప్రాప్తి కలుగుతుంది. జ్ఞానయోగ్యతాప్రాప్తి కలిగితే రెండవ వల్లీ అయిన బ్రహ్మానందవల్లీ బాగా అర్థమవుతుంది. బ్రహ్మానందవల్లీ బాగా అర్థమయితే, జ్ఞానప్రాప్తి కలుగుతుంది. జ్ఞానప్రాప్తి కలిగితే, మోక్షం కలుగుతుంది. మోక్షం కలిగితే

ఆత్మానందం కలుగుతుంది. ఇదంతా మీరు చేసే రెండు నిముషాల పూజవల్ల అంటే ఎంత బాగుంది! అందువల్ల కేవలం మానవజాతికోసం కాక, మొత్తం జీవకోటికోసం చేసే ఈ పూజను విస్మరించకూడదు అని అర్థం.

పితృయజ్ఞం – మరణించిన పితృదేవతలకు శ్రాద్ధకర్మలు చేయాలి, తర్పణాలు వదలాలి. ఆ బాధ్యతను విస్మరించకూడదు. కాని కొంతమందికి వారు మళ్ళీ తిరిగి పుడితే, అది వారికి ఎలా వెళుతుంది, వారు ఒకవేళ జ్ఞానులై, విదేహముక్తి పొందితే వారికెలా వెళుతుంది, ఇదంతా అనవసరం అనే అపోహ ఉంది. కాని అది పొరపాటు. వారు మళ్ళీ పుట్టినా, వారికి చేరాల్సిన రీతిలో వారికి చేరుతుంది. ఒకవేళ వారు విదేహముక్తి పొంది, తిరిగి పుట్టకపోయినా, ఇలా పితృతర్పణాలు వదలక, పిల్లలు లేక అవస్థలు పడుతున్న తక్కిన పితృదేవతలకు వెళతాయి. శ్రాద్ధకర్మ పేరే శాస్త్రంమీద శ్రద్ధ పెట్టుకుని చేయాలనే ఉద్దేశంతో వచ్చింది.

పైగా ఇక్కడ ఇంకొక విషయం గమనించాలి. మీరు వదిలే తర్పణాలు, చేసే శ్రాద్ధకర్మలు నిజంగా పితృదేవతలకు వెళతాయో, లేదోననే విషయం పక్కన పెడితే, పితృయజ్ఞం చేయటంవల్ల మీకు చిత్తశుద్ధి కలుగుతుంది. చిత్తశుద్ధి కలగటంవల్ల కలిగే దశలన్నిటినీ చూశాము. అందువల్ల పితృయజ్ఞాన్ని నిర్లక్ష్యం చేస్తే, మీ ఆధ్యాత్మిక ఎదుగుదల కుంటుపడుతుంది. మీకోసమైనా పితృయజ్ఞం చేయాలి.

ఈ విధంగా విలువల గురించీ, పంచమహాయజ్ఞాల గురించీ బోధించాడు గురువు ఇంతవరకూ. ఇప్పుడు మీ దృక్పథం ఎలా ఉండాలో బోధిస్తున్నాడు. తోటివారిమీద మీ భావన ఎలా ఉండాలి? ముందుగా తల్లిదండ్రులతో మొదలుపెడుతున్నాడు. ఒక పసికందు, లేతవయస్సులో తల్లిదండ్రులను మాత్రమే చూస్తాడని చూశాము. వారిమీద అతని భావన ఎలా ఉండాలి? వారిని పూజ్యభావంతో చూడకపోతే, ముందుముందు తక్కినవారిని ఎలా పూజ్యభావంతో చూడగలడు?

**మాతృదేవో భవ। పితృదేవో భవ। ఆచార్యదేవో భవ। అతిథిదేవో భవ।**

**మాతృదేవో భవ** – తల్లిని దైవంగా ఆరాధించు. తల్లిలో భగవంతుణ్ణి చూడు. చైతన్యపరంగా చూస్తే అందరిలాగా తల్లి కూడా దైవస్వరూపమే. తల్లి దైవం కాదు, ఆమెకుండే లోటుపాట్లు, ఆమెకుండే బలహీనతలు ఆమెకి ఉంటాయి; కాని ఆమెకున్న తల్లి హృదయం వాటిని కప్పివేస్తుంది. ఆమె తన శిశువు గర్భంలో ఉన్నప్పటినుంచే ఆ శిశువును అపారంగా ప్రేమిస్తుంది. అందువల్ల ఆ తల్లిలో ఈశ్వరుణ్ణి చూడాలి. ఎలాగైతే ఒక ఆలయంలో ఉన్న విగ్రహంలో భగవంతుణ్ణి చూస్తామో, అలా ఇల్లనే ఆలయంలో శిశువు చూసే మొట్టమొదటి దైవం తల్లి. అందువల్ల కనిపెంచిన తల్లిని దైవంగా పూజించాలి.

**పితృదేవో భవ** – తండ్రిని కూడా దైవంలా కొలువు. తండ్రికి కూడా మనిషిగా కొన్ని బలహీనతలు, రాగద్వేషాలు, లోటుపాట్లు ఉంటాయి. జ్ఞాని అయిన తండ్రి చాలా అరుదుగా ఉంటాడు. తండ్రిని ఎన్నడూ విమర్శించటం కాని, తప్పులెన్నటం కాని, తండ్రిమీద ఫిర్యాదు చేయటం కాని, నన్ను సరిగా పెంచలేదని కాని తప్పులెన్నకూడదు. వ్యక్తిగా అతనికుండే లోపాలు అతనికుందుగాక, కాని తండ్రి ప్రేమలో లోపం ఉండదు. తండ్రిని మించిన తనయునిగా తీర్చిదిద్దటానికి తన శాయశక్తులా ప్రయత్నిస్తాడు. ఆ ఒక్క తపన చాలు, ఆయనను దైవంగా కొలవటానికి.

**ఆచార్యదేవో భవ** – ఆచార్యుణ్ణి భగవంతునిగా ఆరాధించు. పూర్వం లేతప్రాయంలో తల్లిదండ్రుల సంరక్షణలో పెరుగుతారు పిల్లలు. తర్వాత కొన్ని సంవత్సరాలు అంతేవాసిగా గురుకులంలో ఉండి, గురువు దగ్గర విద్యనభ్యసిసారు. అందువల్ల గురువు ప్రభావం కూడా ఆ లేతవయస్సులో చాలానే ఉంటుంది శిష్యునిమీద. ఆచార్యుడు కూడా తండ్రి అంతటివ్యక్తి. ఒక వ్యక్తి మానసిక అభివృద్ధి ముగ్గురు వ్యక్తుల ప్రభావాన్నిబట్టి ఉంటుంది. ప్రేమమూర్తి అయిన తల్లి, సమర్థుడైన తండ్రి, ఆదర్శవంతమైన ఆచార్యుల ప్రాపకంలో పెరిగిన బాలుడు, మంచి పరిపక్వత కలిగిన వ్యక్తిగా ఎదుగుతాడు. ఈ మూడు బంధాల్లో ఏ ఒక్కటి సరిగ్గా లేకపోయినా, అతను మానసికంగా దెబ్బతింటాడు. పూర్వం ఎవరితోనైనా పరిచయం చేసుకునేటప్పుడు గోత్రనామాలు చెప్పుకునేవారు. అలాగే వివాహబంధం ఏర్పరచే ముందు కులగోత్రాలను చూసేవారు. ఇవన్నీ కుటుంబవ్యవస్థ ఎంత పదిలంగా ఉందో తెలుసుకునేందుకు చేసేవారు.

**త్రినాచికేతస్త్రిభిరేత్య సన్ధిం త్రికర్మకృత్తరతి జన్మమృత్యూ ।**
**బ్రహ్మజజ్ఞం దేవమీడ్యం విదిత్వా నిచాయ్యేమాం శాన్తిమత్యన్తమేతి ॥**

తల్లి, తండ్రి, ఆచార్యులతో సత్సంబంధాలు ఉన్న వ్యక్తే పరిపక్వత చెందిన వ్యక్తి అవుతాడు. అందువల్ల గురువును దైవంగా కొలవాలి.

**గురుర్బ్రహ్మ గురుర్విష్ణుః గురుర్దేవో మహేశ్వరః।**
**గురుస్సాక్షాత్ పరబ్రహ్మ తస్మై శ్రీగురువే నమః ॥**

గురువు బ్రహ్మ, విష్ణు, మహేశ్వరుడు. గురువే సాక్షాత్తూ పరబ్రహ్మ. అటువంటి గురువుకు నమస్కారాలు.

**అతిథిదేవో భవ** – అతిథిని ఈశ్వరునిగా ఆరాధించు. అతిథి అంటే అనుకోకుండా ఇంటికి వచ్చిన ఆగంతుకుడు. ఈ నియమాన్ని ఇప్పటి కాలమాన పరిస్థితుల్లో కొంచెం సడలించవచ్చు. ఇది వైదిక సాంప్రదాయాన్ని పాటించిన కాలంలో సరిపోయింది. కాని అప్పటి సాంప్రదాయం ఎంత విలువైనదో తెలుస్తుంది ఈ నియమంవల్ల. వైదిక సాంప్రదాయాన్ని పాటించే రోజుల్లో

చాలామంది తీర్థయాత్రలకు కాలినడకన రోజుల తరబడి, నెలల తరబడి వెళ్ళేవారు. కాశీ, బదరీ వంటి పుణ్యక్షేత్రాలకి వెళ్ళేవారు. వెళ్ళినవాడు తిరిగివస్తాడో, రాడో తెలియని రోజులవి. కాశీకి వెళ్ళినవాడు కాటికి వెళ్ళినవాడితో సమానం అనేవారు అప్పట్లో. అలా దూరప్రయాణాలు చేసేటప్పుడు రాత్రిళ్ళు ఎక్కడైనా తలదాచుకోవాల్సి వచ్చేది.

ఆ రోజుల్లో హోటళ్ళు ఉండేవి కావు. అన్నం అమ్మటం అనేది తప్పుగా ఉండేది. అందువల్ల ఈ యాత్రికులు దోవలో ఏ పల్లెటూరిలోనో, ఏ ఇంట్లోనో ఒకరాత్రికి బస చేయాల్సి ఉండేది. అలా వారు బస చేయటానికి వీలుగా ఉండేవి అప్పటి ఇళ్ళు కూడా. ఇంటి ముందు వసారాలో పడుకునేందుకు వీలుగా పెద్ద రాతి అరుగులు ఉండేవి. వసారాలు ఉండేవి కాబట్టి, అటు రోడ్డుమీద ఉన్నట్టూ కాదు; ఇటు ఇంటివారికి అసౌకర్యం కలిగించేదిగానూ ఉండేది కాదు. ఆ వచ్చిన యాత్రికుడు ఇంటివారు పెట్టినదేదో తిని, ఆ ఆరుబయట పడుకునేవాడు.

అతిథి అంటే అతనికి ఉండాల్సిన మొట్టమొదటి లక్షణం అతను బొత్తిగా తెలియనివాడై ఉండాలి; రెండవ లక్షణం ముందు చెప్పకుండా అనుకోకుండా వచ్చేవాడై ఉండాలి. తాము ప్రణాళిక వేయకుండా, అనుకోకుండా జరిగినదానిని భగవంతుని సంకల్పంగా పరిగణించేవారు. ఆ యాత్రికుడు కావాలని ఆ ఇంటిని వెతుక్కోలేదు. ఆ యజమాని కావాలని కోరి ఆ యాత్రికుణ్ణి తన ఇంటికి పిలవలేదు. వారిద్దరూ ఒకరాత్రి యాదృచ్ఛికంగా కలిశారు అంటే అది దైవనిర్ణయంగా ఇద్దరూ భావించేవారు. అందువల్ల యజమాని ఆ యాత్రికుని బాగోగులు చూసుకోవాలి.

అంతేకాదు, అతిథి తీర్థయాత్రలు చేస్తూ, దారిమధ్యలో ఆగాడు కాబట్టి, తన ఇంట్లో ఒకరాత్రికన్నా ఎక్కువ బసచేయడు. అలా ఒక్కరోజు అతిథిగా వచ్చినవ్యక్తిని సాక్షాత్తూ ఆ భగవంతుడే వచ్చినట్టుగా భావించి, అతన్ని ఆరాధించాలి. ఇది మనుష్య యజ్ఞం కిందికి వస్తుంది.

ఇప్పటి కాలమాన పరిస్థితుల్లో ఇది అవసరమూ లేదు, మంచిదీ కాదు. తెలియని వ్యక్తి ఎటువంటివాడో నమ్మలేని రోజులివి. పైపెచ్చు, తెలియని ఇంట్లో వెళ్ళి ఉండాల్సిన అవసరం యాత్రికునికీ లేదు. ఇప్పుడు అనేక సదుపాయాలు వచ్చాయి. అందువల్ల అతిథికి ఉండాల్సిన మొట్టమొదటి లక్షణం అతను బొత్తిగా తెలియనివాడై ఉండాలి అనేది ఇప్పుడు అవసరం లేదు. రెండవ లక్షణం ముందు చెప్పకుండా అనుకోకుండా వచ్చేవాడై ఉండాలనేది కూడా ఇప్పుడు అవసరం లేదు. ఎందుకంటే ఇప్పుడు వస్తున్నానని ముందుగా చెప్పటానికి అనేక మార్గాలున్నాయి. మూడవ లక్షణం ఒక్కరాత్రే ఉంటాడు. అది కూడా ఇప్పుడు పాటించటం లేదు. కొంతమంది రోజుల తరబడి ఉండిపోతారు, యజమానిని అనేక విధాలుగా బాధిస్తారు

వారు. అందువల్ల అతిథి దేవోభవ అనే ఈ నియమాన్ని తీసుకుని చెప్పాపెట్టకుండా ఎవరి ఇంటికీ అతిథిగా వెళ్ళకండి. అతిథి దేవోభవ అనే ఈ నియమాన్ని వైదిక సాంప్రదాయంగా తీసుకోవాలి.

**ముఖ్యాంశాలు**

1. **స్వాధ్యాయ జ్ఞానయజ్ఞాశ్చ** – భగవద్గీతలో స్వాధ్యాయాన్ని యజ్ఞంగా వర్ణించాడు కృష్ణపరమాత్మ. శాస్త్ర అధ్యయనం ఒక పుణ్యకర్మ. వేదాలను పఠించినవారికే కాదు, విన్నవారికి కూడా చిత్తశుద్ధి కలుగుతుంది. అనేకమంది కలిసి వేదపారాయణం చేస్తే దాన్ని **వేదఘోష** అంటారు. ఈ వేదఘోష వినిపించే ఆలయాలు ఎంతో పవిత్రంగా ఉంటాయి. ఆలయాలే కాదు, ఈ వేదఘోష వినిపించేచోట ఆ పరిసరాలు పవిత్రంగా ఉంటాయి; చివరికి అక్కడ పెరిగే చెట్లు, చేమలు కూడా ఏపుగా ఎదుగుతాయి.

2. **సత్యం వద** – చాలా మతాలలో భగవంతుడు వేరు, జగత్తు వేరు. భగవంతుడు మాత్రమే పవిత్రుడు. కాని మన వైదిక సాంప్రదాయంలో భగవంతుడు సర్వవ్యాపకుడు. కనిపించని భగవంతుడు కనిపించే జగత్తులో ప్రకటితమవుతున్నాడని నేర్పిస్తుంది మన మతం. అంటే భగవంతుణ్ణి అనేకరూప ఈశ్వరునిగా కొలుస్తాము. భగవంతుడు లేని చోటంటూ లేదు. అందువల్ల భగవంతుడు అనేకరూప ఈశ్వరునిగా అంతటా ఉన్నాడనే భావనను పెంపొందిస్తుంది మన శాస్త్రం. అంతేకాదు, అనేక విలువలను నేర్పిస్తుంది. సత్యం వద అంటే కేవలం నిజం చెప్పటం కాదు, భగవత్ భావనను అలవరచుకో, దైవీసంపత్తిని పెంపొందించుకో అని చెప్పటం.

3. మతపరమైన జీవితంతో పాటు విలువలను పెంపొందించుకోవాలి. విలువలను మాత్రం పాటించేవారు మతంలో చెప్పిన యజ్ఞయాగాదులను విమర్శిస్తే, యజ్ఞయాగాదులు చేసేవారు విలువలకు విలువను ఇవ్వరు. ఉపనిషత్తులు రెండూ పాటించాలి అంటాయి.

4. జీవితంలో ప్రేరణ పొందటానికి శాస్త్రాన్ని అధ్యయనం చేస్తూనే ఉండాలి. అలాగే సత్సంగాలకు వెళ్ళాలి; మహాత్ములను ప్రత్యక్షంగా కలిసి, వారి మాటలను వినటమో, వారి గ్రంథాలను చదవటమో చేయాలి.

5. దక్షిణ ఇవ్వకుండా ఏదైనా పని చేయించుకుంటే అది తామసిక కర్మ కింద వస్తుంది.

**విధిహీనమసృష్టాన్నం మంత్రహీనమదక్షిణమ్ ।**
**శ్రద్ధావిరహితం యజ్ఞం తామసం పరిచక్షతే ॥** – గీత 17.13

ఒక సి.డీ.ని కొనుక్కోకుండా దాన్ని కాపీ చేసుకుంటే అది తామసిక కర్మలోకి వస్తుంది. దక్షిణ ఇవ్వకపోతే ఆ కర్మ అసంపూర్ణకర్మగా మిగిలిపోతుంది. ఎందుకంటే యజ్ఞంలో ఒక

భాగం దక్షిణ ఇవ్వటం. దేన్నీ ఉచితంగా స్వీకరించకూడదు. ఏదైనా ఉచితంగా పొందితే, అంతకు తగ్గ ధనాన్ని ఏదైనా సంస్థకు దానం చేయాలి. ఋణం ఉండకూడదు అని ఘోషిస్తాయి మన శాస్త్రాలు. ఆచార్యునికి ఇష్టమైనది ఇచ్చి ఆయన ఋణం తీర్చుకోవాలి. సాధారణంగా గురువు మీరేదిచ్చినా సంతోషంగా స్వీకరిస్తాడు. మీరు మీ శక్తిమేరకు ఇవ్వాలి.

6. శాస్త్రప్రకారం ఒకవ్యక్తి శాస్త్రం నిర్దేశించిన నాలుగు ఆశ్రమాల్లో దేనికోదానికి చెందినవాడై ఉండాలి. అనాశ్రమీ న తిష్ఠేత్. అతను ఏ ఆశ్రమానికీ చెందకపోతే అతనికి ఏ హోదా ఉండదు. ఏ హోదా లేకపోతే, అతని సేవ గుర్తింపబడదు.

గురుకులంలో విద్యనభ్యసించటం పూర్తయ్యాక, ఆ బ్రహ్మచారికి మూడు మార్గాలు ఉన్నాయి. అతనికి ఇష్టమయితే తనకు విద్యనేర్పించిన ఆచార్యుని వద్దే ఆయనకు సేవలు చేసుకుంటూ, ఆ గురుకులంలోనే శాశ్వతంగా ఉండిపోవచ్చు. అలా చేయాలనుకుంటే అతను బ్రహ్మచర్య వ్రతం చేపట్టాలి. దాన్ని నైష్ఠిక బ్రహ్మచర్య వ్రతం అంటారు. భీష్మాచార్యులు, ఆంజనేయస్వామి దానికి ఉదాహరణలు. అది కాదంటే సన్యాసం స్వీకరించి మళ్ళీ గురుకులానికి వెళ్ళి, వేదాంత విచారణ చేయాలి. ఇది రెండవమార్గం. ఇది అందరూ చేయరు, చేయనవసరం లేదు. మామూలుగా అందరూ చేసేది పెళ్ళి చేసుకుని గృహస్థాశ్రమాన్ని స్వీకరించటం. ఉపనిషత్తు కూడా దీన్ని సాధారణమైన మార్గంగా నిర్దేశించింది. ఎందుకంటే గృహస్థాశ్రమంలోనే తను మతపరమైన కర్మలను చేపట్టటానికి అనువైన వనరులు ఉంటాయి కాబట్టి.

**యాన్యనవద్యాని కర్మాణి। తాని సేవితవ్యాని। నో ఇతరాణి। యాన్యస్మాకగ్ం సుచరితాని। తాని త్వయోపాస్యాని। నో ఇతరాణి। యే కే చాస్మచ్ఛ్రేయాగ్ంసో బ్రాహ్మణాః। తేషాం త్వయాఽఽ సనేన ప్రశ్వసితవ్యమ్।**

ఇక్కడ గురువు చాలా ముఖ్యమైన సందేశాన్ని ఇస్తున్నాడు. ధర్మజ్ఞానం పొందటానికి మూడు ప్రమాణాలు ఉన్నాయి.

1. **శ్రుతి గ్రంథాలు (వేదాలు)** – ఇవి ప్రాథమిక గ్రంథాలు. ముఖ్యంగా వేదపూర్వభాగం ధర్మమూలం. మూలం అంటే ప్రమాణం.

2. **స్మృతి గ్రంథాలు** – శ్రుతులను ఆధారంగా చేసుకుని అనేక ఋషులు, ఆచార్యులు అనేక స్మృతి గ్రంథాలను రచించారు. ఇవి ఋషులు స్వంతంగా రచించినవి కావు. ఈ ఋషులు వేదాలలో చెప్పబడిన అనేక అంశాలను తీసుకుని వాటిని ఒకచోట క్రోడీకరించటమో లేదా కొన్ని అంశాలను విపులంగా చెప్పటమో లేదా కష్టమైన సిద్ధాంతాలను తీసుకుని కథల రూపంలో విశ్లేషించటమో చేశారు. కష్టమైన సిద్ధాంతాలను కథల రూపంలో చెబితే పామరులు

వాటిని తేలికగా అర్థం చేసుకునేవారు. పాలలో వెన్న కనబడకుండా ఉంటుంది; ఆ పాలను కవ్వంతో బాగా చిలికితే, వెన్న పైకి తేలుతుంది. ఆ విధంగా వేదంలో అంతర్లీనంగా ఉన్న బోధను వారి గ్రంథాలలో చిలికి, పైకి తెచ్చారు ఋషులు. అదే విధంగా, ఆచార్యులు వారి బోధల్లో వేదాలను చిలికి, సారాన్ని అందజేశారు.

3. **శిష్టాచారః** – శ్రుతి, స్మృతులను బాగా జీర్ణించుకున్న ఆచార్యుల జీవన విధానం ఒక ప్రమాణం. వారిలో ఇంక రాగద్వేషాలకు చోటులేదు. వారి జీవనవిధానాన్ని ధర్మశాస్త్రానికి అనుగుణంగా మలుచుకుంటారు. వారి జీవనవిధానం తెరచిన గ్రంథంలా ఉంటుంది. శాస్త్రంలో రాతపూర్వకంగా ఉన్నవాటికి వీరు నడిచే మూర్తులుగా ఉంటారు. అంతేకాదు, మహాత్ముల జీవితచరిత్రలనుంచి కూడా పరోక్షంగా నేర్చుకోవచ్చు.

ఏదైనా స్మృతివాక్యం గాని, శిష్టాచార్యుని ప్రవర్తన గాని, శ్రుతిలో చెప్పబడినదానికి భిన్నంగా ఉంటే, శ్రుతికే విలువను ఇవ్వాలి. శ్రుతి సాక్షాత్తూ పరమాత్మనుంచే వచ్చింది. స్మృతి గాని, ఆచార్యుని జీవనవిధానం గాని శ్రుతిని ఆధారం చేసుకుని వచ్చినవి.

ఉదాహరణకు దూర్వాసఋషి కోపానికి పెట్టింది పేరు. కాని శ్రుతి క్షమాగుణాన్ని పాటించాలని బోధిస్తున్నది. ఈ రెండింటిలో మనం ఏది పాటించాలి? నిశ్చయంగా శ్రుతి బోధించిందే పాటించాలి. అది వేదవాక్కు. శ్రుతిలో బోధించిన ధర్మశాస్త్రానికి భిన్నంగా లేనంతవరకూ మహాత్ముల చర్యలను అనుకరించవచ్చు, తప్పులేదు.

శ్రుతి మనకొక ముఖ్యమైన పాఠాన్ని బోధిస్తున్నది. అది – మానవమాత్రుడెవరూ కూడా నూటికి నూరుశాతం పరిపూర్ణులుగా ఉండరు. ఈ సూత్రం ఋషులకు, అవతార పురుషులకు కూడా వర్తిస్తుంది. ఈశ్వరుడు మాత్రమే పరిపూర్ణుడు. విద్య నేర్చుకునే దశలో గురువును భగవంతునిగా కొలవాలి. ఇప్పుడే చూశాము. ఆచార్యదేవో భవ అనాలి. కాని శాస్త్రాలు నేర్చుకున్నాక, ఆచార్యునిమీదనుంచి శాస్త్రం వైపుకు దృష్టి మరల్చాలి. అంటే ఆచార్యుని నుంచి పొందే స్ఫూర్తిని శాస్త్రంనుంచి పొందాలి.

ఇక్కడ గురువు ఒక ముఖ్యమైన సూత్రాన్ని నేర్పిస్తున్నాడు. గురువు చేసే పని ఏదైనా శాస్త్రంలో బోధించినదానికి భిన్నంగా ఉంటే, అతను గురువైనా సరే, గురువును అనుసరించకుండా, శాస్త్రంలో చెప్పినదానినే పాటించాలి. అలాగని, వెంటనే గురువును విమర్శించకూడదని కూడా నేర్చుకోవాలి. శాస్త్రం బోధించినదానికి భిన్నంగా గురువెందుకలా ప్రవర్తించారో మీకు అసలు కారణం తెలియదు.

మీకు ఈ ప్రశ్నలు తరచు వేధిస్తుంటాయి. దుర్వాసఋషి ఎందుకు ఎప్పుడూ రుసరుసలాడుతూ ఉంటాడు? విశ్వామిత్రుడు గొప్ప ఋషి అయికూడా, ఎందుకు ఆత్మనిగ్రహం

కోల్పోయాడు? ధర్మరాజు ధర్మానికి ప్రతీక అయివుండి కూడా భార్యను, తమ్ముళ్ళను ఎందుకు జూదంలో పణంగా పెట్టాడు? పరశురాముడు విష్ణుమూర్తి అవతారం అయివుండి కూడా, తల్లి తలను ఎందుకు నరికాడు? ఎందుకు ద్రోణాచార్యుడు అంత గొప్ప ఆచార్యుడు అయివుండి కూడా ఏకలవ్యుని బొటనవ్రేలిని గురుదక్షిణగా కోరాడు? ఎందుకు శ్రీరాముడు సాక్షాత్తూ విష్ణుమూర్తి అవతారం అయివుండి కూడా నిండు చూలాలు అయిన తన భార్యను అడవులకు సాగనంపాడు?

ఇలా మీకు జవాబు తెలియని ఎన్నో సందర్భాలు వస్తూవుంటాయి పురాణాల్లో, ఇతిహాసాల్లో. వీటిని వదిలేసి, శాస్త్రానికి అనుగుణంగా ఉన్న అంశాలనే మీరు తీసుకోవాలి. పైన చెప్పిన మహాత్ముల చర్యలను తీసుకుని, వారు చేసినట్టుగా నేను చేస్తాను అనకూడదు. వారలా ఎందుకు చేశారో తెలుసుకోవటానికి మీకు ధర్మసూక్ష్మాలు తెలియాలి. ఒక్కోసారి సమాజశ్రేయస్సుకోసం కొన్ని నియమాలు ఉల్లంఘించటం జరగవచ్చు. ఆ వివరాలన్నీ ధర్మశాస్త్రంలో వస్తాయి.

ఉదాహరణకు కురుక్షేత్రయుద్ధంలో కృష్ణపరమాత్మ కొన్ని నియమాలను ఉల్లంఘించాడు. ఇంచుమించు ప్రతి యోధుడూ కూడా కృష్ణపరమాత్మ చేసిన మాయ వల్ల మరణించాడు. అలా ఎందుకు చేశాడు అంటే ముందే చూసినట్లుగా దానికి ధర్మశాస్త్రంలోని సూక్ష్మాలు తెలియాలి. మహాత్ములు అలా నియమం తప్పి ప్రవర్తించారంటే దానికి లోతైన కారణం ఉండేవుంటుంది. అదేమిటో తెలియకుండా, వారిని విమర్శించటానికి మనమెవరం?

మహాత్ములంతటివారే విలువలను పాటించకపోతే మామూలు మనిషినైన నేనెందుకు పాటించాలి అనుకోవచ్చు మనం. ప్రశ్నలోనే ఉంది జవాబు. మనం మామూలు మనుష్యులం. మామూలు మనుష్యులమైన మనకు విలువలను కాలదన్నే హక్కు ఎంతమాత్రం లేదు. మనం కూడా ఆ మహాత్ముల దశకు వెళితే అప్పుడు ఉల్లంఘించగలమా అనకూడదు. నిజానికి ఆ మహాత్ముల దశకు వెళితే, మనం ఆలోచించకుండా, అవసరం లేకుండా నియమాలను ఉల్లంఘించలేము. మనం మహాత్ముల స్థాయికి ఎదగాలంటే రాగద్వేషాలకు అతీతంగా ఎదగాలి. లేకపోతే విలువలను మన రాగద్వేషాలపరంగా చూస్తాము. మన స్వార్థమనే రంగు దానికి పులుముతాము. శాస్త్రం మనకు మొదట్లో విధి-నిషేధాలను విధించింది. వాటిని మనం మహాత్ములమయ్యేదాకా తూ.చా. తప్పకుండా పాటించాలి. ఆ స్థితికి చేరుకుంటే, శాస్త్రమే ఇష్టం వచ్చినట్టు ప్రవర్తించవచ్చు అంటుంది. అంటే నిజంగా యథేచ్ఛగా ప్రవర్తించమని కాదు అక్కడ అర్థం. ఆ స్థాయికి వచ్చిన వ్యక్తికి ఇంక ప్రత్యేకించి విధి-నిషేధాలు అవసరం లేదు. అతను అవకాశం వచ్చినా దాన్ని దుర్వినియోగపరుచుకోడు.

మన దేశపు కోటీశ్వరుల్లో ఒకరైన బిర్లా, ఒకసారి గాంధీజీకి బ్లాంకు చెక్‌బుక్ ఇచ్చి, మీకు కావాల్సినంత సొమ్ము తీసుకోండి అన్నారుట. కాని ఒక సంవత్సరం తర్వాత చూస్తే, గాంధీ మహాత్ముడు కేవలం ఒక్కరూపాయి తీసుకున్నాడుట. ఇటువంటి స్వేచ్ఛను బిర్లా గాంధీకే ఎందుకు ఇచ్చారు? వేరే ఎవరికీ ఎందుకివ్వలేదు? గాంధీజీ మహాత్ముడు కాబట్టి, ఆయనకు ఇచ్చిన స్వేచ్ఛను దుర్వినియోగం చేయరనే ధైర్యం ఉంది కాబట్టే ఇచ్చారు. ఆ విధంగా, ఎవరైతే తమకిచ్చిన స్వేచ్ఛను దుర్వినియోగం చేయరో, వారికే స్వేచ్ఛను ఇవ్వటం జరుగుతుంది.

అందువల్ల వీటని దృష్టిలో పెట్టుకుని ఇక్కడ ముఖ్యమైన సలహాను ఇస్తున్నాడు.

**యాన్యనవద్యాని కర్మాణి** – దోషము లేని కర్మలేవైతే ఉన్నాయో వాటిని అనుష్ఠించాలి.

**తాని సేవితవ్యాని** – శాస్త్రం బోధించిన అటువంటి వాటినే పాటించాలి.

**నో ఇతరాణి** – శాస్త్రం ఒప్పుకోని ఇతరమైన అధార్మిక కర్మలు చేయకూడదు. శ్రీరాముడు చేసినట్టు చేయండి, కృష్ణపరమాత్మ చెప్పినట్టు చేయండి. రామాయణం అంటే రాముని అయనం అంటారు. అంటే రాముని జీవనవిధానాన్ని ఆధారంగా చేసుకుని వచ్చింది అది. శ్రీరాముడు ఒక ఆదర్శపురుషునిగా జీవితం గడిపాడు. కాని కృష్ణపరమాత్మ విషయం తీసుకుంటే, ఎన్నో చిలిపిపనులు చేశాడు. ఉదాహరణకు వెన్న దొంగలించాడు. కృష్ణుడు వెన్న దొంగలించాడు కాబట్టి నేనూ ఏదైనా దొంగలిస్తాను అంటే దానికి గొప్ప పండితులు ఇచ్చే జవాబు ఇలా ఉంటుంది. 'కృష్ణపరమాత్మ చిటికెనవ్రేలిమీద గోవర్ధనగిరిని ఎత్తాడు, మీరూ అలా చేసి అప్పుడు మాట్లాడండి!'

**యాన్యస్మాకగ్ం సుచరితాని** – మా (ఆచార్యుల) మంచి నడవడికను అనుసరించాలి.

మహాభారతంలో చాలామంది కొన్ని విలువలకు రూపుదిద్దినట్టు ఉంటారు. కాని వారిలో ఏదో బలహీనత ఉంటుంది. మన సహజప్రవృత్తి ఏమిటి? వారిలోని బలహీనతను ఎత్తి చూపించి, వారిలోని మూర్తీభవించిన మంచి అంశాన్ని చూడము. పురాణాలు నేర్పిస్తే, పిల్లలు ముందు ఇలాంటి వ్యతిరేక అంశాలమీదే ఎక్కువ దృష్టి పెడతారు. వారి దృష్టిని అటునుంచి వారియొక్క మంచి లక్షణం వైపు మరల్చాలి. మీమాంసాశాస్త్రం ఆ పని చేస్తుంది. ఒక కథలోని వ్యతిరేక అంశాన్ని వదలిపోసి, అందులోని పాఠాన్ని నేర్చుకోవటానికి తోడ్పడుతుంది.

ఇంతకుముందు చూసిన ఉదాహరణలను మళ్ళీ చూస్తే, పరశురాముడు తల్లి తల నరికాడు అనే సంఘటనలో, మన దృష్టిని దానిమీదకన్నా తండ్రిమాట నెరవేర్చాడు అనే అంశంమీదకు మరల్చాలి. ద్రోణాచార్యుని కథలో ద్రోణాచార్యుడు శిష్యునికి చేసిన అన్యాయానికన్నా, గురుదక్షిణ ఇవ్వటంకోసం శిష్యుడైన ఏకలవ్యుడు కొంచెం కూడా ఎలా ఆలోచించలేదో, గురుభక్తికి ప్రతీకగా ఎలా నిలిచాడో చూడాలి.

**ఆచార్యాయ ప్రియం ధనమహృత్య**

ఇంతకుముందే చూశాం, ఆచార్యుడు కోరినంత ధనం ఇవ్వాలని. అలాగే నిండు చూలాలైన సీతను రాముడు నిర్దాక్షిణ్యంగా అడవికి పంపించాడని నిందిస్తారు కాని, రాముణ్ణి భర్తగా చూడాలంటే అరణ్యకాండకు వెళ్ళాలి. అక్కడ చెట్టుకూ, పుట్టకూ చెప్పుకుని రోదించాడు. ఇక్కడ రాజుగా చూడాలి. రాజుగా తన కర్తవ్యాన్ని నెరవేర్చాడు.

**ప్రజారంజకః రాజా**

ప్రజారంజకంగా పరిపాలించే వ్యక్తి రాజు.

పంచపాండవులు ద్రౌపదిని పంచుకున్నారని విమర్శిస్తారు కాని, అక్కడ చూడాల్సిన అంశం తల్లికి ఇచ్చిన గౌరవం. **మాతృవాక్య పరిపాలనం** చేశారు. ఆ విధంగా చెప్పుకుంటూపోతే ఎన్నో ఉన్నాయి. ప్రతి కథలోనూ మంచీ ఉంటుంది, చెడూ ఉంటుంది. చెడు అంశాన్ని వదిలేసి, మంచిమీదే దృష్టి పెట్టండి.

**తాని త్వయోపాస్యాని** – మా (ఆచార్యుల) మంచి నడవడికనే పాటించాలి. ప్రహ్లాదుడు తన తండ్రిమాటను జవదాటాడు అంటే దానికి కారణం తండ్రి శాసనం శాస్త్రానికి వ్యతిరేకంగా ఉంది. అందువల్ల పితృదేవో భవ సూత్రాన్ని పాటించక, తండ్రి మరణానికి కారణమయ్యాడు ప్రహ్లాదుడు. అయినా అతన్ని లోకమంతా గొప్పభక్తునిగా కొనియాడుతుంది. ఎందుకు? పితృవాక్యం, శాస్త్రవాక్యానికి భిన్నంగా ఉంటే, శాస్త్రవాక్యాన్నే పాటించాలని అది చెబుతున్నది.

**శ్రుతిస్మృత్యోర్విరోధే తు శ్రుతిరేవ గరీయసీ**

శ్రుతి, స్మృతిల్లో భేదం వస్తే, శ్రుతి వాక్యమే శ్రేష్ఠమైనదిగా తీసుకోవాలి.

తక్కిన మతాలలాగ, మన వైదిక సాంప్రదాయం ఒక భగవంతునివల్ల ఏర్పడినది కాదు. వేదాలే శ్రేష్ఠమైనవి, ఏ మనిషీ కూడా వేదాలకన్నా గొప్పకాదు. అందువల్ల శాస్త్రాలను నేర్చుకునేదాకా గురువును అనుసరించు, కాని శాస్త్రాలను నేర్చుకున్నాక, శాస్త్రాన్నే అనుసరించు.

**నో ఇతరాణి** – వేరే దేన్నీ పాటించకు.

శ్రుతి, స్మృతుల్లో శ్రుతి ఎలా శ్రేష్ఠమో, అలాగే శిష్టాచార్యునికీ, శ్రుతికీ భేదం వచ్చినా కూడా శ్రుతినే పాటించాలి. పతంజలి యోగసూత్రాలను కూడా బహిరంగ సాధనల మేరకు తీసుకుంటాము, కాని పూర్తిగా తీసుకోము. వేదాంతం బోధించే నిదిధ్యాసనానికి అది భిన్నంగా ఉంటుంది. అలాగే తర్కశాస్త్రాన్ని స్వీకరిస్తాము కాని, న్యాయవైశేషిక సిద్ధాంతాలను ఖండిస్తాము. ఎందుకంటే వారు తర్కమా, శాస్త్రమా అనే సందర్భం వస్తే తర్కానికే పెద్దపీట వేస్తారు. మనం శాస్త్రసమ్మతమైన తర్కాన్ని స్వీకరిస్తాము. వేదాన్ని స్వీకరించరనే

బౌద్ధమతాన్ని నాస్తికదర్శనం అంటాము. నాలుగు బౌద్ధమతాలూ నాస్తిక దర్శనంలోకి వస్తాయి. నాస్తికులు అంటే దైవాన్ని నమ్మరని కాదు అర్థం; వేదాన్ని నమ్మరని అర్థం.

అంతదాకా ఎందుకు, సురేశ్వరాచార్యులవారు సాక్షాత్తూ తన గురువైన శంకరాచార్యుల వారినే కొన్ని సందర్భాలలో ప్రశ్నించారు. శంకరాచార్యులవారు శ్రుతి, యుక్తి ప్రమాణాలు చూపించి, వివరించారు. కాని స్వయంగా తనే తన శిష్యునితో ఈ మాట చెప్పారు, 'నేను శాస్త్రాన్ని ఏ విషయంలోనైనా అనుసరించకపోతే, నన్ను వదిలేసి, శాస్త్రాన్ని అనుసరించు,' అన్నారు. ఎంత అద్భుతమైన వాక్యం!

**యే కే బ్రాహ్మణాః చ** – మాకంటే గొప్పవారైన వేదవేత్తలు ఎవరైనా ఉంటే, ఆ అవకాశాన్ని దుర్వినియోగం చేసుకోకుండా, వారినుంచి మంచి విషయాలు నేర్చుకో. వారు చెప్పింది శ్రద్ధగా విను.

**బ్రహ్మ యః జానాతి సః బ్రాహ్మణః**

ఎవరికైతే బ్రహ్మజ్ఞానం ఉందో, వారిని బ్రాహ్మణుడు అంటారు.

**అస్మత్ శ్రేయాంసః** – ఈ బ్రాహ్మణులు మనకన్నా జ్ఞానంలోను, వయస్సులోను, అనుభవంలోను శ్రేష్ఠులు. మన సాంప్రదాయంలో వృద్ధులను గౌరవిస్తాము. ఎందుకంటే వారు అనుభవంతో తల పండిపోయి ఉంటారు. ఏ పుస్తకమూ ఇవ్వలేని జ్ఞానాన్ని అనుభవం ఇస్తుంది. చదువుకున్న యువకునికన్నా, చదువుకోని అనుభవజ్ఞుడైన వృద్ధునికి ఇంకా ఎక్కువ జ్ఞానం ఉండవచ్చు. అటువంటిది, శాస్త్రం అభ్యసించి, శాస్త్రం బోధించిన విధంగా జీవనం గడిపేవారికి ఇంకెంత జ్ఞానం ఉంటుంది? అటువంటివారిని జ్ఞానవృద్ధులు అంటారు. వారిని సాదరంగా ఆహ్వానించు.

**తేషాం త్వయాఽఽసనేన ప్రశ్వసితవ్యమ్** – ఈ వాక్యాన్ని రెండు రకాలుగా వివరించవచ్చు.

1. వారికి సముచితమైన ఆసనం సమర్పించి, వారిని సేదదీరనీయండి.

2. వారిని కూర్చోపెట్టి, మీ గురించి గలగలా చెప్పుకుంటూ పోకూడదు. అలా మీరే మాట్లాడుతూపోతే, వారినుంచి ఎన్నో మంచి విషయాలను నేర్చుకునే మంచి అవకాశాన్ని పోగొట్టుకుంటారు మీరు. మామూలుగా, మహాత్ములు ఎక్కువగా మాట్లాడరు. వీలున్నంత వరకూ మౌనం పాటిస్తారు. దాన్ని అవకాశంగా తీసుకుని మీరు ఎక్కువగా మాట్లాడేయకూడదు. మీకు కలిగే సందేహాలను అడిగి, వాటిని తీర్చే అవకాశం వారికి ఇవ్వండి. న ప్రశ్వసిత్వమ్ అంటే ఒక్కమాట కూడా మాట్లాడవద్దు అని అర్థం తీసుకోవచ్చు.

దీన్నిబట్టి మనకు తెలుస్తున్న విషయం ఏమిటంటే, మన సాంప్రదాయం శాస్త్రానికే పెద్దపీట వేస్తుంది, కాని గురువుకు కాదు. ఆ గురువు శంకరాచార్యులవారైనా, గౌడపాదాచార్యులవారైనా, వ్యాసాచార్యులవారైనా కూడా. ఆ గురువు కూడా శాస్త్రం తర్వాతే

వస్తారు (అందువల్లనే పరమార్థానంద స్వామీజీ సందేశం – ఫాలో ది శాస్త్ర, శాస్త్రాన్ని అనుసరించండి). ఇంతా విని గురువును ఆధారంగా చేసుకుని తన సాంప్రదాయాన్ని పెంపొందించుకుంటే, గురువు శిష్యునికి సరిగ్గా బోధించనట్టు అర్థం.

ఇక్కడ వైదిక గురువు నేను నీకు శాస్త్రాన్ని బోధించాను, ఎలా అర్థం చేసుకోవాలో నేర్పించాను. ఇకనుంచీ నా మాటకు విలువనిచ్చేకన్నా, శాస్త్రాన్ని ప్రత్యక్షంగా అనుసరించు. నా ప్రవర్తన శాస్త్రానికి భిన్నంగా ఉంటే, శాస్త్రాన్నే పాటించు అని చెబుతున్నాడు.

**శ్రద్ధయా దేయమ్। అశ్రద్ధయాఽదేయమ్। శ్రియా దేయమ్। హ్రియా దేయమ్। భియా దేయమ్। సంవిదా దేయమ్।**

మన శాస్త్రాలు అనేక సాధనల గురించి బోధిస్తాయి కాని, చివరికి వాటిని మూడు ప్రాథమిక సాధనల కింద విభజించాయి. అవి యజ్ఞం, దానం, తపస్సు అంది బృహదారణ్యకోపనిషత్తు. అదేమాట కృష్ణపరమాత్మ కూడా చెప్పాడు.

**యజ్ఞదానతపఃకర్మ న త్యాజ్యమితి చాపరే** – గీత 18.3

**యజ్ఞమ్** – భక్తిపూర్వకమైన జీవనవిధానం. ఏ పని చేసినా ఈశ్వరార్పణబుద్ధితో చేయాలి.

**దానమ్** – మనకున్న ప్రతిదాన్నీ నలుగురితో పంచుకోవాలి. 'మనీ మస్ట్ బి ఇన్ సర్క్యులేషన్,' అంటారు. అంటే ధనం ఒక్కచోటే నిలవ ఉండిపోకూడదు. డబ్బు తీసుకుని, ఇవ్వాలి. గురువు దగ్గర తీసుకున్న జ్ఞానాన్ని శిష్యుడు తర్వాత వచ్చేతరానికి అందజేయాలి. నీటి వృత్తం చూడండి. నీరు సముద్రంనుంచి పైకి వెళ్ళి మేఘాలుగా మారి, మేఘంనుంచి వర్షంగా మారి, వర్షపునీరు కొండచరియలనుంచి నదులుగా ప్రవహించి, మళ్ళీ నదులు వెళ్ళి సముద్రంలో కలిసిపోతాయి. ఈ వృత్తం అన్ని అంశాలకూ వర్తిస్తుంది. ఈ వృత్తం ఆరోగ్యం విషయంలో అర్థం చేసుకోకపోతే, ఎక్కడో ఆగిపోతుంది; అది అనారోగ్యానికి దారితీస్తుంది. తీసుకున్న ఆహారం జీర్ణమయి, వృథా అయినది బయటకు రావాలి. అలా రాకుండా లోపలే ఉండిపోతే, అంటే మలమూత్రాల సమస్య వస్తే; అది అనారోగ్యానికి దారితీస్తుంది.

ఈ వృత్తం ధనానికి కూడా వర్తిస్తుంది. దానం చేస్తే, పైకి మీ దగ్గర ఉన్న ధనం తరిగిపోయినట్టు అనిపిస్తుంది కాని, శాస్త్రాలు మీరేమీ నష్టపోరు అంటుంది. ఇస్తూ ఉంటే, వస్తూ ఉంటుంది అంటారు. మీరు ప్రపంచానికి ఏవి ఇస్తే, అది మీకు తిరిగి వస్తుంది. మీరు ప్రేమ పంచితే, మీకు ప్రేమ తిరిగి వస్తుంది; మీరు దయను పంచితే, మీకు దయ తిరిగివస్తుంది; మీరు ద్వేషాన్ని పంచితే, మీకు ద్వేషం తిరిగివస్తుంది. మీరు ఎదుటివారిని ఎలా చూస్తే వారు మిమ్మల్ని అలా చూస్తారు. ఇది ప్రకృతి సూత్రం. అందువల్ల ఎప్పుడూ మంచి పంచిపెట్టండి.

**తపస్సు** – ఏదీ మితిమీరి చేయకూడదు. **అతి సర్వత్ర వర్జయేత్**. మధ్యే మార్గం పాటించాలి. అతిగా తినకూడదు, అతిగా నిద్రపోకూడదు. మీరు మీ అంగాలకు యజమానిగా ఉండాలి, మీ అంగాలు మీకు యజమాని కాకూడదు. అందువల్ల తపస్సు అంటే మధ్యేమార్గం పాటించటం.

**శ్రద్ధయా దేయమ్** – ఏది దానం చేసినా శ్రద్ధగా చేయాలి. అంటే ఈ దానం చేయటంవల్ల మీకు మంచి జరుగుతుంది, మీకు అదృష్టఫలం కలుగుతుందనే నమ్మకం ఉండాలి. అదృష్టఫలం అంటే పుణ్యం వస్తుంది, ఆధ్యాత్మిక పురోగతి కలుగుతుంది, చిత్తశుద్ధి ఏర్పడుతుంది. లౌకికంగా ధనం తరుగుతున్నట్టు కనిపించినా, ఆధ్యాత్మిక సంపద పెరుగుతుంది.

**అశ్రద్ధయా అదేయమ్** – శ్రద్ధ లేకుండా దానం చేయకూడదు. శ్రద్ధ లేకుండా దానం చేస్తే, ధనం కరిగిపోతున్నట్టు అనిపించి, బాధ వేస్తుంది. పుణ్యం వస్తుందనే విషయం మరుగున పడిపోతుంది.

దీనికి ఇంకొక అర్థం కూడా చెప్పవచ్చు. దీన్ని **అశ్రద్ధయా దేయమ్** అనికూడా చెప్పవచ్చు. అలా చెబితే, శ్రద్ధలేకపోయినా దానం చేయమని అర్థం వస్తుంది. అంటే ఇక్కడ శ్రద్ధకన్నా, దానాన్ని పాటించమంటున్నది శాస్త్రం. అంటే ఇవ్వటం ముఖ్యం, శ్రద్ధ ఉన్నా లేకపోయినా ఇవ్వాలి. అసలు ఇవ్వకపోయేకన్నా, అది నయం కదా. అదికాక, ఇస్తూ ఉంటే, మొదట్లో శ్రద్ధ లేకపోయినా, రానురాను దానంతట అదే శ్రద్ధ ఏర్పడుతుంది. అందువల్ల రెండు అర్థాలూ తీసుకోవచ్చు.

**శ్రియా దేయమ్** – సమృద్ధిగా ఇవ్వాలి. కనీసం మీకు ఉన్నదానికి తగినంత ఇవ్వాలి. వేదాలు ఇంత ధనం ఇచ్చితీరాలని నిర్దేశించదు. ఎందుకంటే అందరికీ సమానంగా సంపద ఉండదు కదా. కాకపోతే శాస్త్రాలు భూదానం, గోదానం, వస్త్రదానం కూడా చేయమంటాయి. ఒకవేళ అంత దానాలు చేయలేకపోతే పత్రం, పుష్పం, ఫలం, తోయం ఇవ్వవచ్చు అన్నాయి. అదిగో శాస్త్రాలు ఆకు, పువ్వు, పండు, నీటిలో ఏదైనా ఇవ్వచ్చు అన్నాయి కదా అని వాటితో సరిపెట్టకూడదు. ఇవ్వగలిగినచోట, ఇవ్వగలిగినంత ఇవ్వాలి. మీ సామర్థ్యాన్నిబట్టి ఇవ్వాలి,

**హ్రియా దేయమ్** – హ్రియా అంటే వినయంగా లేదా అణకువతో ఇవ్వాలి. ఇచ్చేవాడి చేయి పైన, తీసుకునేవాడి చేయి కిందా ఉంటుంది అంటారు కాబట్టి, నా చేయి పైన ఉందని మురిసిపోకూడదు; తీసుకునేవాడిని కించపరచకూడదు. గర్వంతో కూడిన దానాన్ని రాజసికదానం లేదా తామసికదానం అంటాడు కృష్ణపరమాత్మ. మీకు దానం చేసే అవకాశం కలిగినందుకు అది మీ అదృష్టంగా భావించి, దానం చేయండి.

**భియా దేయమ్** – భయంతో దానం చేయండి. దీనికి కూడా రెండు రకాలుగా చెప్పవచ్చు. లౌకిక అర్థం తీసుకోవచ్చు లేదా శాస్త్రపరమైన అర్థం తీసుకోవచ్చు. లౌకిక అర్థం తీసుకుంటే,

భియా దేయం అంటే దానం స్వీకరిస్తున్న వ్యక్తి మీద అక్కరకొద్దీ దానం చేయాలి. అంటే తను ఇచ్చేది ఎదుటివ్యక్తికి ఉపయోగపడాలనే మంచి మనస్సుతో ఇవ్వాలి.

శాస్త్రాలు చెప్పే అర్థం వేరే ఉంది. శాస్త్రాల ప్రకారం దానం చేసితీరాలి. ప్రభుత్వానికి పన్నులు ఎలా కట్టితీరాలో, అలా భగవంతుడనే ప్రభుత్వానికి దానమనే పన్ను కట్టి తీరాలి. అది కూడా ఎదుటివ్యక్తి నుంచి ఎదురు ఏమీ ఆశించకుండా ఇవ్వాలి. దానం చేసేది ధనమే అయితీరాలనే నియమమేమీ లేదు. మీ దగ్గర ఉన్నదేదైనా ఇవ్వవచ్చు. మీ జ్ఞానాన్ని పంచవచ్చు; మీ అమూల్యమైన సమయంలో కొంత ఇతరులకు కేటాయించవచ్చు; నాలుగు తియ్యని పలుకులు పలికి ఎదుటివారిని సేదదీర్చవచ్చు; చిరునవ్వుతో వారి బాధను వినవచ్చు.

వృక్షాలు తమ తీసుకున్నవాటికన్నా ఎక్కువ ఇస్తాయి. అందువల్ల వృక్షసంపదను పెంపొందించాలనే నినాదాలు ఎక్కువ అవుతున్నాయి. మనిషి తీసుకునేది ఎక్కువా, తిరిగి ఇచ్చేది తక్కువా ఉంటుంది. అందువల్ల అధికశాతం జననష్టం అయినా, అంతగా బాధపడరు. పోనీలే భూభారం తగ్గింది అంటారు. అలా మనం భూమికి భారంగా ఉండకూడదు అనుకుంటే, మనం ఇస్తూ ఉండాలి. దానం చేసే కర్మ కామ్యకర్మల లోకి రాదు, నిత్యకర్మలోకి వస్తుంది. కామ్యకర్మ అంటే ఏదైనా కోరికతో చేసే కర్మ; నిత్యకర్మ అంటే రోజూ చేసితీరాల్సిన కర్మ. దీన్ని ఇష్టం ఉన్నా లేకపోయినా చేసితీరాలి.

పన్నులు కట్టకపోతే ఫైను పడుతుంది, శిక్ష పడుతుంది. వైదికభాషలో చెప్పాలంటే, పన్ను కట్టకపోతే ప్రత్యవాయపాపం అంటుకుంటుంది.

**భియా దేయమ్ = ప్రత్యవాయ పాపభయేన దేయమ్**

ప్రత్యవాయపాపం అంటుకుంటుందనే భయంతో ఇస్తారు కొంతమంది. దానం చేయటంవల్ల, మీరేమీ కొత్తగా మంచి చేయటం లేదు; మీరు కేవలం మీకు నిర్దేశించిన నియత కర్మను చేస్తున్నారు, అంతే. మీరేదో దానం చేస్తున్నారని మురిసిపోతున్నారేమో కాని, దానం చేస్తేనే నువ్వు మనిషివి అంటున్నాయి శాస్త్రాలు.

**సంవిదా దేయమ్** – దేశకాల పాత్రతలనెరిగి దానం చేయాలి. అపాత్రదానం చేయకూడదు అని సామెత. సరియైన వ్యక్తికి, సరియైన కాలంలో, సరియైన ప్రదేశంలో దానం చేయాలి. పోయిపోయి చక్కని రగ్గుని తీసుకువెళ్ళి నడివేసవిలో చెన్నై నగరంలో ఉన్న వ్యక్తికి ఇవ్వలేరు కదా! ఏ కేదార్‌నాథ్‌లోనో ఉన్న వ్యక్తికి రగ్గు ఇస్తే, అతనికి అది ఉపయోగకరంగా ఉంటుంది.

అంతేకాదు మిమ్మల్ని దానం కోరిన వ్యక్తికి అర్హత లేదు అనుకుంటే మీరు అతనికి ఇవ్వనని చెప్పటానికి సందేహించనవసరం లేదు. ముఖ్యంగా ట్రాఫిక్ సిగ్నల్సు దగ్గర అడిగే బిచ్చగాళ్ళకు ఇవ్వలేదని బాధపడనవసరం లేదు. అది సరియైన ప్రదేశం కాదు. అతనికి

అర్హత లేకపోతే ఇవ్వనవసరం లేదన్నామని, ఎవరికీ అర్హత లేదు పొమ్మనకూడదు. ఎన్నో సంస్థలు ఎంతో స్వచ్ఛందసేవలు చేస్తున్నాయి. వాటిలో దేనికన్నా ఇవ్వవచ్చు. ఇది దానసాధన గురించిన విశ్లేషణ.

**అథ యది తే కర్మవిచికిత్సా వా వృత్తవిచికిత్సా వా స్యాత్। యే తత్ర బ్రాహ్మణాస్సమ్మర్శినః యుక్తా ఆయుక్తాః। అలూక్షా ధర్మకామాస్స్యుః। యథా తే తత్ర వర్తేరన్। తథా తత్ర వర్తేథాః। అథాభ్యాఖ్యాతేషు। యే తత్ర బ్రహ్మణాస్సమ్మర్శినః। యుక్తా ఆయుక్తాః। అలూక్షా ధర్మకామాస్స్యుః। యథా తే తేషు వర్తేరన్। తథా తేషు వర్తేథాః। ఏష ఆదేశః। ఏష ఉపదేశః। ఏషా వేదోపనిషత్। ఏతదనుశాసనమ్। ఏవముపాసితవ్యమ్। ఏవము చైతదుపాస్యమ్॥**

ఇంతకుముందే వేదాలు ధర్మశాస్త్రాన్ని బోధిస్తాయనీ, ధర్మ, అధర్మాల వివక్షణ నేర్పిస్తాయనీ, ముఖ్యంగా జీవనవిధానాన్ని బోధిస్తాయనీ చూశాము. కాని వేదాలు జీవితంలో ఎదురవ్వగలిగే అన్ని సన్నివేశాలను చర్చించకపోయి ఉండవచ్చు. ఎందుకంటే అప్పటి కాలమాన పరిస్థితులు భిన్నంగా ఉండివుండవచ్చు. అందువల్ల వేదాలు కొన్ని సాధారణ సూత్రాలను ఏర్పరచి ఉండవచ్చు. కాని విశేష సందర్భాలు ఎదురైనప్పుడు, ఆ విశేష సందర్భానికి తగినట్టుగా ఈ సాధారణ సూత్రాల్లోంచి అర్థాన్ని తీసుకుని నిర్ణయించుకోవాలి. అందువల్ల వేదాలను అర్థం చేసుకునే నైపుణ్యం చాలా అవసరం. వేదాలు నిర్దేశించినవాటిని ఉన్నదున్నట్టుగా పాటించలేము. సమాజం మారుతున్నకొద్దీ, జీవనవిధానం మారుతూవస్తుంది; కొన్ని సూత్రాలకు మార్పులు, చేర్పులు చేయాల్సి ఉంటుంది. అదే సూత్రాన్ని పట్టుకుని వ్రేలాడలేము. మన శాస్త్రాలు పరిస్థితికి తగ్గట్టుగా నియమనిబంధనలను మార్చే అవకాశాన్ని ఏర్పరచాయి.

దీన్ని మన రాజ్యాంగంతో పోల్చవచ్చు. రాజ్యాంగాన్ని తయారుచేసినప్పుడు అప్పటి శాస్త్రవేత్తలు, దేశం ఎదుర్కొనే అన్ని సమస్యలనూ ఊహించలేదు. ఉదాహరణకు గవర్నరుకు ముఖ్యమంత్రిని నియమించే అధికారం ఉంది అంటుంది మన రాజ్యాంగం. కాని దానిలోని సూక్ష్మ అంశాలను లోతుగా విశ్లేషించదు. అక్కడ ఏదైనా విభేధాలు ఏర్పడితే రాజ్యాంగం ఉద్దేశ్యం ఏమిటో అర్థం చేసుకోవాలి. దీన్ని వివక్ష లేదా తాత్పర్యం అంటారు. అలాంటి విపత్కర సన్నివేశాల్లో దాన్ని చర్చించి, దాని సారాంశాన్ని రాబట్టాలి.

కాని రాజ్యాంగాన్ని చర్చించాల్సింది ఎవరు? విచక్షణాశక్తిని చూపించాల్సింది ఎవరు? రాజకీయ నాయకులను చూపమంటే, వారు నిష్పక్షపాతంగా చూపకపోవచ్చు. అందువల్ల ఒకవేళ రాజ్యాంగాన్ని వివరించాల్సివచ్చిన సందర్భం అంటూ వస్తే, రాజ్యాంగం లోతుపాతులు తెలిసిన మేధావుల కమిటీని నియమించాలి. వారు అటు రాజ్యాంగంలో దిట్టలుగా ఉండాలి; ఇటు సమాజశ్రేయస్సు కోరేవారిగా ఉండాలి. లేకపోతే ప్రజాస్వామ్యం దెబ్బతింటుంది. ఆ విధంగా రాజ్యాంగాన్ని అవసరమైతే మార్చాలి కాని దానిలో నిష్ణాతులే మార్చాలి.

ఇదే సూత్రం వేదాలకు కూడా వర్తిస్తుంది. సమాజం మారుతున్నకొద్దీ ధర్మసూత్రాలు కూడా కాలానుగుణంగా మారుతూ వస్తాయి. కొన్ని సందర్భాల్లో ధర్మసంకటం ఏర్పడుతుంది. వేదాల్లో చూస్తే, మీకు ఎదురైన విశేషపరిస్థితిని వేదాలు వర్ణించి ఉండవు, ఒకవేళ ఉన్నా కూడా, వేదాలు చెప్పింది చెప్పినట్టుగా ఆచరించటం కుదరకపోవచ్చు. అందువల్ల దాని ఆత్మను అర్థం చేసుకోవాలి. ఆత్మ కంటికి కనబడేది కాదు. కనబడని ఆత్మని అర్థం చేసుకుని, విశ్లేషించి, వివరించటానికి చాలా సూక్ష్మబుద్ధి కావాలి. ఇలా వేదాలలోని సూక్ష్మతత్త్వాన్ని విశ్లేషించగలిగేది ఎవరు? వారికి కొన్ని అర్హతలు ఉండాలి అంటున్నాము కదా! ఆ అర్హతలు ఏమిటి? ఆ అర్హతలేమిటో, ఆ సూక్ష్మబుద్ధి ఎవరికి ఉంటుందో శాస్త్రాలే వివరిస్తున్నాయి. శాస్త్రాలకు ఎంత ముందుచూపు ఉందో చూడండి!

**అథ యది తే కర్మవిచికిత్సా వా** – ఒకవేళ నీకు ఏ కర్మ గురించి అయినా సందేహం ఉంటే, (విచికిత్స అంటే సందేహం)

**వృత్తవిచికిత్సా వా స్యాత్** – వృత్త అంటే నడవడిక. ఒకవేళ నడవడిక మీద ఏదైనా సందేహం కలిగితే. హిందువులు ప్రపంచం నలుమూలలా వ్యాపించివున్నారు. భారతదేశంలో, ఇంకా కొంతమేరకు వైదిక సాంప్రదాయం ఉంది కాని, విదేశాలలో ఉన్న హిందువులకు కొన్ని సందేహాలు రావచ్చు. అందువల్ల వారివారి రాగద్వేషాల ప్రకారం, వేదాలను అర్థం చేసుకునే ప్రమాదం ఉంది. అందువల్ల, వేదాలు ఏం చేయాలో చెబుతున్నాయి.

**యే తత్ర బ్రాహ్మణాః** – అటువంటి ధర్మసంకటం ఏర్పడినప్పుడు, (గుణ) బ్రాహ్మణుని దగ్గరకు వెళ్ళు అంటాయి శాస్త్రాలు. ఆ బ్రాహ్మణునికి సత్త్వగుణం ఉండి, నిస్స్వార్థంగా ప్రవర్తిస్తాడు. అటువంటి బ్రాహ్మణుడు ఎలా ఉంటాడో, ఇక్కడ ఉపనిషత్తే వర్ణిస్తోంది.

**సమ్మర్శినః** – వారు వేదవేత్తలు అయివుంటారు. వారికి శాస్త్రాలలోని ధర్మసూక్ష్మాలు విశ్లేషించే సూక్ష్మబుద్ధి ఉంటుంది. వారు మీమాంస శాస్త్రంలో నిష్ణాతులు. వారు వారి మేధస్సుతో ఏం చెబితే, దాన్ని మనం ప్రమాణంగా స్వీకరించాలి. వారిమీద నమ్మకం లేకపోతే, వారు చెప్పినదానిమీద విశ్లేషించేందుకు వేరేవారిని, వారిమీద ఇంకొకరిని నియమిస్తూ రావాలి. అందువల్ల వీరినే ప్రమాణంగా తీసుకోవాలి. సుప్రీమ్‌కోర్టు ఏ తీర్పు ఇస్తే, అదే ఇంక అంతిమతీర్పు. దాన్ని ప్రశ్నించినా, దానికి విరుద్ధంగా ప్రవర్తించినా, అది కంటెంప్ట్ ఆఫ్ కోర్ట్ కింద వస్తుంది. అంటే కోర్టును ధిక్కరించినట్టవుతుంది.

అలాగే వేదం చెప్పినదాన్ని స్వీకరించని వ్యక్తిని నాస్తికుడు అంటారు. అతను వైదిక కోర్టును ధిక్కరించిన వ్యక్తి అవుతాడు.

**యుక్తాః** – ధార్మికమైన, వైదిక జీవనవిధానాన్ని ఆచరించిన వ్యక్తి. వారు ధర్మంలో మునిగితేలుతుంటారు. సుప్రీమ్‌కోర్ట్ జడ్జి అవాలంటే, అతను ఎన్ని దశలను దాటుకుని ఆ హోదాకి వస్తాడో ఆలోచించండి! అటువంటి జడ్జీ ఇచ్చిన తీర్పుకు ఇంక తిరుగులేదు.

**ఆయుక్తాః** – పక్షపాతవైఖరి చూపనివారు. వారు స్వతంత్రులు. వారు ఎటువంటి ప్రలోభాలకు కాని, ఒత్తిడులకు కాని లొంగరు.

**అలూక్షాః** – క్రూరబుద్ధి లేనివారు. వారికి సమాజశ్రేయస్సే ముఖ్యం. సర్వభూతహితే రతత్వమ్. అలూక్షాః అంటే అరూక్షాః రూక్షాః అంటే క్రూరబుద్ధి. అరూక్షాః అంటే క్రూరబుద్ధి లేనివారు.

**ధర్మకామాః** – వారు ధర్మార్థకామ పురుషాలలో అర్థకామాల వెంట పరుగులు తీయకుండా ధర్మాన్ని కోరుతారు. అంటే వారు అర్థకాములు గాని, కామకాములు గాని కారు. వారికి ఆస్తి, అంతస్థు, హోదాలు అవసరం లేదు. అటువంటి వారే నిష్పక్షపాతంగా వ్యవహరించగలరు. తీర్పును కూడా ధైర్యంగా ఇవ్వగలరు. ధర్మాన్ని వరించాలి కాబట్టి, వేద అధ్యయనం, వేద అధ్యాపనం చేసేవారు, బీదరికాన్ని రెండు చేతులా ఆహ్వానించటానికి సిద్ధపడివుండాలి అంటుంది శాస్త్రం. సాంప్రదాయబద్ధమైన బ్రాహ్మణునికి త్యజించటానికి పిలక, యజ్ఞోపవీతం తప్ప ఇంకేమీ ఆస్తులు ఉండవు అంటారు దయానందస్వామీజీ. అందువల్ల వారికి ఏదైనా పోతుందనే భయం లేదు, ఎవరేమంటారో అనే భయం లేదు.

ఈ అర్హతలు విద్యార్థి పొందేదాకా, అతను ఏదైనా క్లిష్టపరిస్థితి వస్తే ఇటువంటి జ్ఞానిని సంప్రదించాలి.

**యథా తే తేషు వర్తేరన్ తథా తేషు వర్తేథాః** – వారు ఇలాంటి సందిగ్ధమైన పరిస్థితుల్లో ఎలా ప్రవర్తిస్తారో, అలా నువ్వు ప్రవర్తించు అంటున్నారు శంకరాచార్యులవారు. వారు వైదిక నియమాలను ఉల్లంఘించాల్సిన పరిస్థితి వస్తే, వారు విచక్షణాశక్తిని ఎలా ఉపయోగించారో గమనించవచ్చు. శంకరాచార్యులవారు ఇటువంటి పరిస్థితిలో ఎలా ప్రవర్తించారో ఒక ఉదాహరణ చెబుతారు.

ఒకసారి ఒక శిష్యుడు శంకరాచార్యులవారికి మాదకద్రవ్యం ఇచ్చాడుట. శంకరాచార్యులవారు దాన్ని తీసుకున్నారు. శాస్త్రం ప్రకారం మద్యం సేవించరాదు. ఆ నియమం తెలిసిన విద్యార్థులు, శంకరాచార్యులవారి చర్యను గమనించి, ఒకరి మొహాలు ఒకరు చూసుకున్నారు; కాని గురువును ఏమీ ఆక్షేపించే ధైర్యం లేక, ఊరుకున్నారు. కాని సూక్ష్మబుద్ధి ఉన్న శంకరాచార్యులవారి దృష్టిని దాటిపోలేదు వారి సందిగ్ధం. ఆయన నాలుగు అడుగులు ముందుకు వేసి, ఒక కమ్మరి దుకాణం ముందు ఆగారు. అక్కడ ఆ కమ్మరి లోహాన్ని కరిగిస్తున్నాడు. శంకరాచార్యులవారు దాన్నించి వచ్చిన సీసాన్ని తీసుకుని త్రాగారు.

శంకరాచార్యులవారే మద్యం సేవించగా లేనిది, మేమెంత, మేమెందుకు సేవించ కూడదు అనేవారికి ఇదే జవాబు. మీరు శంకరాచార్యులవారిలాగా సీసాన్ని కూడా త్రాగగలిగితే, త్రాగవచ్చు. అంటే ఏదీ తనను ప్రభావితం చేయని స్థాయికి చేరుకుంటే, ఏమీ తప్పుకాదు అని పరోక్షంగా చూపించారు శంకరాచార్యులవారు.

దీనికి ఒక మీమాంస సూత్రమే ఉంది. దాని అర్థం, కొంతమంది ధర్మాన్ని ఉల్లంఘిస్తారు కాని, వారి కర్మలద్వారా వారు, తాను మహామనీషిగా నిరూపించుకుంటారు. మద్యం సేవించే ముందు సీసం త్రాగండి!

ఇంకొక ఉదాహరణ! కృష్ణపరమాత్మ వెన్న దొంగలించాడు; నేనూ దొంగతనం చేస్తాననేవారు ఈ విషయం గమనించటం లేదు. అదే కృష్ణపరమాత్మ చిటికెనవ్రేలితో గోవర్ధనగిరిని ఎత్తాడు. వారు కూడా అలా పర్వతాన్ని ఎత్తగలిగితే, దొంగతనం చేయవచ్చు. కాని అలా సవాలు విసిరేవారు మామూలు పెట్టినే ఎత్తలేరు! అందువల్ల అటువంటి మహామనీషి దశకు ఎదగనంతవరకూ, వైదిక విధినిషేధాలను ఉల్లంఘించరాదు.

మనం తరచు వినేమాట, అది కూడా తోటి హిందువులనుంచి, హిందూమతం అంతా గందరగోళంగా ఉంటుంది, మనను అయోమయంలో పడవేస్తుంది, తక్కిన మతాలు అలాకావు అనే అంశాన్ని. వారు అన్నదానిలో కొంత నిజం లేకపోలేదు. కాని మన మతాన్ని లోతుగా విశ్లేషిస్తే, ఆ అయోమయానికి అనేక కారణాలు ఉన్నాయి. కాని, ఏ కారణాలవల్లనైతే హిందూమతాన్ని చిన్నచూపు చూస్తున్నారో, ఆ కారణాల ద్వారానే హిందూమతంయొక్క గొప్పతనాన్ని చాటి చెప్పవచ్చు. అంటే ఏ కారణాలైతే దూషణం చేయిస్తాయో, అవే కారణాలు నిజంగా భూషణాలు. దానికి కావాల్సిందల్లా కొంచెం లోతైన విశ్లేషణ. ఏవైతే లోటుపాట్లు అంటున్నారో, అవే మన మతాన్ని ఉన్నత స్థాయికి తీసుకువెళతాయి. అటువంటి కొన్ని విశ్లేషణలను చూద్దాము ఇప్పుడు.

తక్కిన మతాలతో పోలిస్తే మన శాస్త్రాలు అనంతంగా ఉన్నాయి. వాటిని ఏడాది పొడుగునా, రోజంతా చదివినా కూడా శాస్త్ర అధ్యయనం ముగించలేము. మనం నేర్చుకున్నది పిడికెడంత, నేర్చుకోవాల్సింది ప్రపంచమంత అని అంటారు. భరద్వాజ ఋషి వేదాలను నూరు సంవత్సరాలు అధ్యయనం చేశాడని అంటారు. భరద్వాజుడు నూరు సంవత్సరాలు అధ్యయనం చేసినా, అది పూర్తవకపోవటంతో బ్రహ్మదేవునికి తపస్సు చేసి ఇంకొక వంద సంవత్సరాలు ఆయుష్షుని పొందాడుట. అయినా అతని అధ్యయనం పూర్తికాలేదు. ఇంకొక వందేళ్ళు పొందినా పూర్తికాలేదు.

అలా మూడువందల సంవత్సరాలు అధ్యయనం చేశాక, గర్వంగా బ్రహ్మదేవునితో అన్నాడుట, నేను ఎంత నేర్చుకున్నానో చూడు అని. దానికి బ్రహ్మదేవుడు అక్కడ ఉన్న

మూడు పర్వతాలను చూపించి, ఒక్కొక్క పర్వతంనుంచి ఒక్కొక్క పిడికెడు మట్టిని తెమ్మన్నాడుట. అంటే అతను నేర్చుకున్నది పిడికెడంత అయితే, నేర్చుకోవాల్సింది పర్వతాల అంత ఎక్కువ ఉందని అర్థం.

వేదాలలో 1080 శాఖలు ఉంటే, వాటిలో పన్నెండు లేక పదమూడు శాఖలు మాత్రమే మిగిలాయి. ఆ ఆరు శాఖలను అధ్యయనం చేయటానికే మన జీవితకాలం సరిపోదు. శ్రుతి మాత్రమే కాకుండా, స్మృతి, పురాణాలు, ఇతిహాసాలు, వాటికి భాష్యాలు, ఆ భాష్యాలకు ఉపభాష్యాలు అంటూ ఇలా అనేకం ఉన్నాయి. అంతదాకా ఎందుకు? ఒక్క మహాభారతం తీసుకుంటేనే దానిలో లక్ష శ్లోకాలు ఉన్నాయి. ఇలా శాస్త్రం అనంతంగా ఉండటాన్ని సానుకూలంగా తీసుకోవచ్చు, ప్రతికూలంగా తీసుకోవచ్చు.

ప్రతికూల సమస్య ఏమిటో చూద్దాము. ఒక మొత్తంలోని ఒక భాగాన్ని అధ్యయనం చేయాలంటే కుదరదు. మొత్తం గురించి తెలియకుండా, భాగం గురించి తెలుసుకోలేము. శరీరంలో భిన్న అంగాలను నయం చేయటానికి ఆయా అంగాల్లో నిష్ణాతులైనవారు ఉన్నారు, కాని వారు ఆ అంగాన్ని లోతుగా అధ్యయనం చేసేముందు, దాన్ని శరీరంలో ఒక భాగంగా అధ్యయనం చేస్తారు. కాని సమస్య ఏమిటంటే, చిన్నచిన్న భాగాలుగా నేర్చుకోనిదే, మొత్తం గురించి నేర్చుకోలేరు.

భగవద్గీతలోని ఒక శ్లోకాన్ని అధ్యయనం చేయాలంటే మొత్తం గీత గురించి తెలియాలి; కాని మొత్తం గీత గురించి తెలుసుకోవాలంటే, గీతను ఒక్కొక్క శ్లోకంగా నేర్చుకుంటూ రావాలి. అంటే మొత్తం తెలియాలంటే భాగం తెలియాలి; భాగం తెలియాలంటే మొత్తం గురించి తెలియాలి! అంటే ఒకదానిమీద ఒకటి ఆధారపడి ఉన్నాయి.

**ఒకటే సూత్రం అందరికీ వర్తించదు.** వేదాలు మొత్తం మానవాళికి నిర్దేశించబడ్డాయి. అందువల్ల మనుష్యులలో ఉన్న స్థాయీభేదాలను బట్టి ఉంటుంది శాస్త్రబోధ. వర్ణాశ్రమ భేదాలు ఉంటాయి; అర్థం చేసుకునే స్థాయిలో భేదాలు ఉంటాయి; చూపించే భక్తిలో భేదాలు ఉంటాయి. అందరికీ ఒకటే బోధించలేము. ఒకరికి ఆహారం అయినది ఇంకొకరికి విషతుల్యం అవుతుంది. అందువల్ల మీరే స్థాయిలో ఉన్నారో తెలుసుకోకుండా మీరు నేర్చుకుంటే, బోధ చాలా అయోమయంగా ఉంటుంది.

ఒకరికి సానుకూల సలహా ఇంకొకరికి ప్రతికూల సలహా అవుతుంది. ఉదాహరణకు ఒక వైద్యుడు ఒక రోగిని బాగా తినమంటాడు; ఇంకొక రోగిని ఆహారాన్ని తగ్గించమంటాడు. ఈ సూచనని రోగులు తారుమారు చేసుకుని తీసుకుంటే, అది వారి ఆరోగ్యానికే ప్రమాదం. ఎవరి వైద్యం వారిదే! ఎందుకంటే ఎవరి అనారోగ్యం వారిదే. అదే విధంగా ఎవరి స్థాయి వారిదే! అందువల్ల ఎవరి బోధ కూడా వారిదే!

ఈ విధంగా అధికారీభేదం ఉంటే, బోధలో భేదం ఉంటుంది. అధికారి అంటే అర్హత ఉన్నవ్యక్తి. ఒకచోట పూజను కీర్తిస్తే, ఇంకొకచోట విమర్శిస్తుంది.

**ప్లవా హ్యేతే అదృఢా యజ్ఞరూపాః**
**అష్టాదశోక్తమవరం యేషు కర్మ।**
**ఏతచ్ఛ్రేయో యేఽభినన్దన్తి మూఢాః**
**జరామృత్యుం తే పునరేవాపి యన్తి॥** – ముండకమ్ 1.2.7

కర్మ చేసేవారిని మూఢులు అంటుంది ముండకం. వారు దృఢంగా లేని చిన్న పడవల్లో సంసారసాగరాన్ని దాటటానికి ప్రయత్నిస్తున్నారని విమర్శిస్తుంది. వారు కర్మల్లో కూరుకుపోతే, జనన–మరణ చక్రాల్లో పడిపోతారని విమర్శిస్తుంది.

**దేవపితృకార్యాభ్యామ్ న ప్రమదితవ్యమ్** – తైత్తిరీయమ్

దేవతలకు చేసే పూజలను, పితృదేవతలకు వదిలే తర్పణాలను, పెట్టే శ్రాద్ధకర్మలను మానవద్దు అంటుంది.

మాండూక్యోపనిషత్తులో ఉపాసకులను కృపణులని నిందిస్తారు. ఇది చాలా భయం వేసే సన్నివేశం. అందువల్లనే మాండూక్యోపనిషత్తును మొదట నేర్చుకోకూడదు. మూడు, నాలుగు ఉపనిషత్తులను నేర్చుకున్నాక, దీనికి రావాలి. ఆ విధంగా పైపైన చూస్తే, హిందూమతంలో ఇలా భిన్నాభిప్రాయాలు ఉన్నట్టుగా అనిపిస్తుంది. అందువల్ల దానిమీద వ్యతిరేకభావాలు వస్తాయి కాని, నిజానికి అవే ఒక సానుకూల అంశంగా చెప్పవచ్చు. హిందూమతం ఇటు మతం గురించి ఏమీ తెలియనివారినుంచి, ఆధ్యాత్మికంగా బాగా ఎదిగినవారిదాకా అందరికీ వారివారి స్థాయినిబట్టి బోధ చేస్తుంది.

భగవంతుణ్ణి మూడు స్థాయిల్లో వర్ణిస్తుంది. అవి ఏకరూపఈశ్వరుడు, అనేకరూప ఈశ్వరుడు, అరూపఈశ్వరుడు. భక్తిమార్గంలో ఓం ప్రథమంగా అడుగుపెట్టే వ్యక్తి ఏకరూపఈశ్వరుణ్ణి కొలుస్తాడు. ఏదో ఒక దైవాన్ని ఇష్టదైవంగా కొలుస్తాడు. తర్వాత భక్తి పెరిగినకొద్దీ, అంతటా దైవాన్ని చూస్తాడు. అది అనేకరూప ఈశ్వరుడు. తర్వాత జ్ఞానం పొందాక ఈశ్వరునికి నామరూపాలు లేవని, నిర్గుణబ్రహ్మ అనీ తెలుసుకుంటాడు.

**ధర్మసంకటం ఏర్పడుతుంది** – ధర్మశాస్త్రం ఏది ధర్మమో, ఏది అధర్మమో బోధిస్తుంది కాని అది పరిపూర్ణంగా ఉండదు; సాపేక్షికంగా చెబుతుంది. ధర్మసూక్ష్మాల లోతులు కొలిచినకొద్దీ, ధర్మసంకటంలో పడవేసే సన్నివేశాలు ఎదురవుతూ ఉంటాయి. మనం జీవితంలో అనేక పాత్రలను పోషిస్తాము. ఒక పాత్ర యొక్క బాధ్యత, ఇంకొక పాత్ర పోషించటానికి ఒక్కోసారి అడ్డు రావచ్చు. ఇటువంటి వ్యక్తిగత సమస్యలన్నింటినీ శాస్త్రాలు బోధించవు. కాని వీలున్నంతవరకూ వాటిని అనేక కథల్లో ఘర్షణల ద్వారా ఈ ధర్మసూక్ష్మాలను చొప్పిస్తాయి.

అలా శాస్త్రాలు ఎన్ని పరిస్థితులను ఊహించి చెప్పినా కూడా, చివరికి మనం ఎదుర్కొనే ధర్మసంకటం మనకు సంబంధించినది, దానికి ఇదీ సూత్రం అని ప్రత్యేకించి చెప్పలేము. కొన్ని ఉదాహరణలు చూద్దాము.

★ శ్రీరాముడు ధర్మసంకటంలో పడ్డాడు. ఒక చాకలివాడు తనను విమర్శించాడు. అతను సగటు ప్రజలకు ప్రతీక. ఒకపక్క భార్య సీతాదేవి నిండుచూలాలు. పతిగా ఆమెను సంరక్షించుకోవాలి; ప్రజాపతిగా జనరంజకంగా రాజ్యపాలన చేయాలి. అలాంటప్పుడు భార్యను అడవులకు పంపాలా; ఒక పౌరుడు అన్నమాటను గాలికి వదిలేయాలా? దేనికి విలువను ఇవ్వాలి?

★ పిల్లవాని కాలేజీ చదువుకోసం జీవితకాలం డబ్బు ప్రోగేసి దాచాడు తండ్రి. కాని అనుకోకుండా తన తండ్రికి మహమ్మారి రోగం ముంచుకువచ్చింది. ఆయనకి వైద్యం చేయించాలంటే ఇన్నాళ్ళూ కష్టపడి కూడబెట్టినదంతా తుడుచుకుపోతుంది. అతని తండ్రి నాకీ వయస్సులో వైద్యం వద్దు అంటే అది వేరే సంగతి. అతని తండ్రి వైద్యం చేయించాలని ఆశిస్తే, ఇతను ఏం చేయాలి? తండ్రా, పుత్రుడా? ఎవరికి ప్రాముఖ్యతను ఇవ్వాలి?

★ రావణాసురుని తమ్ముడు విభీషణుడు. రావణాసురుడు అధర్మానికి పాల్పడ్డాడని అతనిని వదిలివేసి, శత్రువైన రామునివైపు చేరాడు. ఇంటిగుట్టు లంకకు చేటు అన్నారు. కాని కుంభకర్ణుడు మాత్రం అన్నని వదలలేదు. అన్న ఎటువంటి వాడైనా, అతనికి అండగా నిలబడాలనుకున్నాడు. వీరిలో ఎవరు సరిగ్గా ప్రవర్తించారు? రక్తసంబంధమా, ధర్మపరిపాలనా? దేనికి విలువను ఇవ్వాలి?

★ కృష్ణపరమాత్మ అహింస గొప్ప విలువ అని భగవద్గీతలో మూడుచోట్ల చెప్పాడు. **అహింసా పరమో ధర్మః**. అన్నిసార్లు చెప్పాక, కాబట్టి యుద్ధం చేయి అర్జునా అన్నాడు. **తస్మాత్ యుద్ధస్వ భారత**. అహింస పాటించాలా, ధర్మయుద్ధం చేయాలా? దేనికి విలువను ఇవ్వాలి.

★ ఆధ్యాత్మిక విజయం పొందాలంటే సత్యమొక్కటే మార్గం; వేరే ఏదీ లేదు అంటుంది ముండకోపనిషత్తు. **సత్యమేవ జయతే నానృతమ్** – ముండకం 3.1.6. కాని మహాభారతయుద్ధంలో కొన్ని యుద్ధసూత్రాలకు భిన్నంగా జరిగాయి. సత్యం పాటించాలా, యుద్ధనీతి పాటించాలా? దేనికి విలువను ఇవ్వాలి?

**శాస్త్రాలని విశ్లేషణ చేయాలి** – భగవంతుడు ఈ విశ్వాన్ని సృష్టించినప్పుడే వేదాలను కూడా సృష్టించాడు అంటారు. అంటే కొన్నివేల సంవత్సరాల ముందు వచ్చాయి. అప్పుడే చాలా సమస్యలను ఊహించారు కాని, అన్నిటినీ ఊహించలేరు. పూజ్య స్వామీజీ దానికి కారు డ్రైవింగ్ ఉదాహరణ చెబుతారు. కారు నడిపే విద్యను నేర్పించే వ్యక్తి వీలున్నన్ని ట్రాఫిక్ నిబంధనలను ఊహించి, వాటిని ఎలా ఎదుర్కోవాలో బోధిస్తాడు. కాని ఆయన

ఎదురుచూడని పరిస్థితి ఏదైనా ఎదురైతే, అది నాకు బోధించలేదు అని ఆయనను నిందించకూడదు. అలాగే జీవితం మనం ఎదురుచూడని ఎన్నో క్లిష్టపరిస్థితులని ఇస్తూ ఉంటుంది. వాటిలో చాలావాటికి వేదాలు జవాబులు ఇస్తాయి కాని, అన్నింటినీ ఊహించలేవు. ఉదాహరణకు శాస్త్రాలు మరుగుదొడ్డిని (అశౌచాలయం) వంటగదినుంచి 80 అడుగులు దూరంగా ఉండాలి అంటాయి. కాని ఇప్పటి ఇల్లు అగ్గిపెట్టెల్లాగా చిన్నయిళ్ళు అయిపోయాయి. మనుస్మృతి వచ్చినప్పుడు ఈ పరిస్థితిని ఊహించివుండరు. స్నానాలగదిని శౌచాలయం అనీ, మరుగుదొడ్డిని అశౌచాలయం అనీ అంటారు. అవి విడివిడిగా ఉండాలి. ఇప్పుడు రెండూ కలిపి ఒకేచోట ఉంటున్నాయి. శాస్త్రాలలో ఇలాంటి పరిస్థితి గురించిన వివరణ లేదు. వాటిని ఇప్పటి కాలమాన పరిస్థితుల దృష్ట్యా విశ్లేషించాలి.

అలాగని మనకు తోచిన విధంగా లేదా మన బుద్ధికి తగ్గట్టుగా విశ్లేషించకూడదు. వాటిని ఒక క్రమపద్ధతిలో విశ్లేషించాలి. ఆ శాస్త్రాన్ని మీమాంసాశాస్త్రం అనీ, సంప్రదాయం అనీ అంటారు. ఆ మీమాంసాశాస్త్రంలో ఉన్నదాన్ని విశ్లేషించాలి. కాని మనం వాటి జోలికి పోము. రామాయణ, మహాభారతాలు, పాశ్చాత్యదేశస్థులు రాసిన అనువాదాలు చదువుతాము. వారికి మన సాంప్రదాయం గురించి లోతైన అవగాహన ఉండదు. పూర్వకాలంలో వ్రాతప్రతులు లేవు. గురువు కర్ణపరంపరగా నేర్చుకున్నది, శిష్యులకు అందజేస్తారు. గురువు శాస్త్రాలను బాగా ఆకళింపు చేసుకుని బోధిస్తాడు.

గురువు సహాయం లేకుండా మనమే చదివితే, అది కూడా ఇటువంటి అనువాదాలను చదివితే, పైన వివరించిన ధర్మసంకట పరిస్థితులు ఎదురైనప్పుడు మనం వాటిని జీర్ణించుకోలేము. ఒక్కోసారి శాస్త్రాలమీద శ్రద్ధను కోల్పోయే ప్రమాదం కూడా ఏర్పడుతుంది. పైగా శాస్త్రాలు ఒక విషయాన్ని కీర్తించటం కోసం, ఉన్నదాన్ని భూతద్దంలోంచి చూపిస్తుంది. దీన్ని కారికేచర్ అంటారు. కార్టూన్లలో కూడా ఈ పద్ధతి చూస్తుంటాము. ఒక వ్యక్తికి కొంచెం పెద్దముక్కు ఉంటే, కార్టూన్లలో ఇంకా పెద్దదిగా వేస్తారు ఆ ముక్కును. అలాంటి కొన్ని ఉదాహరణలను చూద్దాము.

★ రామనామం జపిస్తేనే చాలు మోక్షం కలుగుతుందని వస్తుంది కొన్నిచోట్ల. దాన్ని అక్షరాలా తీసుకుని, శాస్త్రాన్ని నిందిస్తారు కొందరు.

★ ఇంకొక కథలో అజామీళుడు అనే రాజు అనేక చెడ్డపనులు చేసి, దుర్మార్గుడుగా పేరు పొందినా, చివరి నిముషంలో నారాయణ అనే పదం పలికేసరికి, మోక్షం వచ్చిందని వస్తుంది.

క్రూరాత్ముడజామీలుడు నారాయణ అనుచు

నాత్మబంధుని పిలువ ఏరీతి ఏలుకొంటివి

ఏరీ నీసాటి వేల్పులెందును కృష్ణా!

దీన్ని కూడా సరిగ్గా అర్థం చేసుకోవాలి.

★ కలియుగంలో యజ్ఞయాగాదులు చేయనవసరం లేదు, కేవలం నామజపం చేస్తేనే మోక్షం వస్తుందనీ, వేరే ఏ ఇతర సాధనలూ అవసరం లేదనీ అంటారు. ఇలా ఒక సాధనను కీర్తించటం కోసం, వేరే సాధనలను చిన్నచూపు చూడటాన్ని అర్థవాదం అంటారు. వీటిని అక్షరాలా తీసుకోకూడదు. కాని బాధాకరమైన విషయమేమిటంటే, ఈ అర్థవాద వాక్యాలను మన ఆధ్యాత్మిక గురువులు ప్రజలలో నాటుకుపోయేలా చేశారు.

ఈ ధర్మసంకటంనుంచి తప్పించుకోవాలంటే, దానికి ఒక్కటే మార్గం ఉంది. శాస్త్రాలను సమర్థవంతమైన గురువు వద్ద నేర్చుకోవాలి. ఆ గురువు శాస్త్రాలను తన రాగద్వేషాలకు అనుగుణంగా కాకుండా, శాస్త్రాలలో ఉన్నదున్నట్టుగా బోధిస్తాడు. ధర్మశాస్త్రాన్ని నేర్చుకోవటమే కాకుండా, తన జీవితాన్ని ధర్మశాస్త్రానికి అనుగుణంగా, ధర్మబద్ధంగా మలుచుకుంటాడు. అటువంటి గురువు బోధ వింటే, హిందుమతం వ్యతిరేక భావాలను వెలిబుచ్చటం లేదనీ, చాలా లోతైన, సంపూర్ణమైన బోధ ఉందనీ అర్థమవుతుంది. అటువంటి గురువు ఎవరో ఎలా తెలుస్తుంది? ఈ ఉపనిషత్తు ఈ అనువాకంలో అటువంటి గురువు లక్షణాలను వివరిస్తున్నది.

**యే తత్ర బ్రహ్మణాస్సంమర్శినః । యుక్తా ఆయుక్తాః । అలూక్షా**

**ధర్మకామాస్స్యుః । యథా తే తేషు వర్తేరన్ ॥ తథా తేషు వర్తేథాః ।**

అటువంటి గురువు దగ్గర కొన్ని సంవత్సరాలు నేర్చుకున్నాక మన మనస్సు కూడా పరిపక్వత చెందుతుంది. అప్పుడు మనం మన విచక్షణా శక్తినే ఉపయోగించవచ్చు. అలా ధర్మశాస్త్రాన్ని 12 సంవత్సరాలు సమర్థవంతమైన గురువు వద్ద నేర్చుకుంటే అప్పుడు శాస్త్రం మనలో జీర్ణించుకుపోతుంది. అప్పుడు శాస్త్రంలోకి వెళ్ళకుండానే, ధర్మసూత్రాలు చెప్పవచ్చు. ఒక సంగీత విద్వాంసుడు మొదట్లో తంబూరశ్రుతిని పెట్టుకుంటాడు, తను పాడేటప్పుడు. కొన్ని సంవత్సరాలు అలా పాడాక, తంబూరశ్రుతి పక్కన లేకుండానే, అదే శ్రుతిలో పాడగలడు. ఎందుకంటే అతని అణువణువు సంగీతం జీర్ణించుకుపోయి ఉంటుంది. అలా గురువుతో మొదలుపెట్టి, స్వయంగా అర్థం చేసుకునే స్థాయికి ఎదగాలి.

**అథాభ్యాఖ్యాతేషు** – ఒక్కోసారి ఇంకో రకమైన ధర్మసంకటంలో పడిపోతారు. ఉదాహరణకు మీ ఆప్తమిత్రుడు చెడుమార్గాలలో పడిపోతున్నాడని విన్నారనుకోండి. ఆ విషయం మీరు స్వయంగా చూడలేదు కాని ఎవరి ద్వారానో విన్నారు. అటువంటి వ్యక్తితో మీ స్నేహాన్ని కొనసాగించాలా, వద్దా?

దుస్సంగత్వాన్ని ఎప్పుడూ త్యజించు అంటాయి శాస్త్రాలు. అధర్మంతో సంగత్వం పెంచుకోవటం కూడా ఒక విధమైన అధర్మమే. కాని అతను ఎంతో ఆత్మీయుడు. అంత తేలికగా అతనితో స్నేహాన్ని వదులుకోలేరు; పైగా ఆ వార్త ఎంతవరకూ నిజమో కూడా మీకు తెలియదు. అటువంటి పరిస్థితిలో ఏం చేయాలి? **అభ్యాఖ్యాతాః** అంటే నిందింపబడ్డాడు కాని మీరు ప్రత్యక్షంగా చూడలేదు. ఏం చేయాలంటే అంతకుముందు చెప్పిన మాటనే మళ్ళీ చెబుతున్నాడు గురువు ఇక్కడ.

**యే తత్ర బ్రాహ్మణాస్సంమర్శినః। యుక్తా ఆయుక్తాః। అలూక్షా ధర్మకామాస్స్యుః। యథా తేషు వర్తేరన్। తథా తేషు వర్తేథాః।**

అప్పుడు కూడా, ధార్మిక బ్రాహ్మణులు ఉంటారు, వారు సాంప్రదాయబద్ధంగా, శాస్త్రపరంగా, నిస్స్వార్థంగా జీవితాన్ని గడుపుతారు. అటువంటి వారిని, ఇటువంటి క్లిష్టపరిస్థితిలో ఎలా ప్రవర్తించాలో అడిగి తెలుసుకుని, అలా మీరు కూడా ప్రవర్తించాలి. అలా వేదాల్లో ప్రత్యక్షంగా సలహా లేనిచోట వేదాల్లో పండిపోయినవారి సలహాలు తీసుకోవాలి. ఇదీ ధర్మశాస్త్ర సూక్ష్మం. ఇదీ ధర్మశాస్త్ర సారాంశం.

**ఏష ఆదేశః** – ఇది వేదాల యొక్క ఆదేశం. ఇది శ్రౌతవిధిః. ఈ విధిని పాటించకపోతే మనమే నష్టపోతాము. ఆరోగ్యసూత్రాలను పాటించకపోతే, ఆరోగ్యం ఎలా దెబ్బ తింటుందో, అలాగే ధర్మసూత్రాలను పాటించకపోతే, మన జీవితం దెబ్బతింటుంది.

**ఏష ఉపదేశః** – ఇది స్మృతిగ్రంథాలలో ఉన్న ఉపదేశం. స్మృతిగ్రంథాలు శ్రుతినుంచి వచ్చాయి. వాటిలో చెప్పిన విధులను స్మార్తవిధులు అంటారు.

**ఏషా వేదోపనిషత్** – ఇది ఉపనిషత్తుల సారం. ఇది ఈ పదకొండవ అనువాకంయొక్క సారం. ఈ అనువాకాన్ని అర్థం చేసుకుని పాటిస్తే, మొత్తం ధర్మశాస్త్రాన్ని అర్థం చేసుకున్నట్టుగా భావించవచ్చు.

**ఏతదనుశాసనమ్** – ఈ బోధ మహాత్ముల బోధ. శిష్టాచార్యులు అంటారు వీరిని. ఈ బోధ సాక్షాత్తూ పరమాత్మునినుంచే వచ్చింది. వేదాలు అపౌరుషేయాలు. ఋషులు వాటిని అందుకున్నారు. అందువల్ల వేదాల్లో బోధించినవాటిని ఉల్లంఘిస్తే, సంసారం ఒక శిక్షగా మారుతుంది. ఈ జీవితమే కారాగృహంగా మారుతుంది. సంసార కారాగృహంగా అవుతుంది.

**ఏవముపాసితవ్యమ్** – ఇక్కడ బోధించిన విధంగా నడుచుకోవాలి. ఇది చేస్తే చెయ్యవచ్చు అనుకోకూడదు. ఇవి విధివాక్యాలు.

**ఏవము చైతదుపాస్యమ్** – ఈ పదకొండవ అనువాకంలో వివరించినట్టుగా, జీవితాన్ని గడపాలి. ఈ వాక్యాన్ని విడదీస్తే ఏవమ్ ఉ చ ఏతద్ ఉపాస్యమ్ అని వస్తుంది. ఇందులో 'ఉ', 'చ' పదాలు ఇలా జీవితాన్ని గడపాలని నొక్కి వక్కాణిస్తున్నాయి.

ఇక్కడితో ధర్మశాస్త్రంమీద చేసిన బోధ ముగిసింది. ధర్మశాస్త్రం నేర్చుకోనిదే బ్రహ్మశాస్త్రానికి రాలేరు. బ్రహ్మశాస్త్రం వచ్చే అధ్యాయంలో వస్తుంది.

ధర్మశాస్త్రం విజయవంతంగా ముగించుకున్నందుకు చిహ్నంగా, శాంతిపాఠాన్ని మళ్ళీ పఠిస్తాము. విద్య నేర్చుకునేముందు ఆటంకాలు లేకుండా ఉండేలా చేయమని కోరితే, విద్యను విజయవంతంగా ముగించినందుకు, ఆటంకాలు లేకుండా నేర్చుకో గలిగినందుకు మళ్ళీ పఠిస్తాము. ఈసారి పఠించేది కృతజ్ఞతలను వెలిబుచ్చటానికి.

**అనువాకం – 12**

**ఓం శం నో మిత్రశ్శం వరుణః। శం నో భవత్వర్యమా। శం న ఇంద్రో బృహస్పతిః। శం నో విష్ణురురుక్రమః। నమో బ్రహ్మణే। నమస్తే వాయో। త్వమేవ ప్రత్యక్షం బ్రహ్మాసి। త్వామేవ ప్రత్యక్షం బ్రహ్మావాదిషమ్। ఋతమవాదిషమ్। సత్యమవాదిషమ్। తన్మామావీత్। తద్వక్తారమావీత్। ఆవీన్మామ్। ఆవీద్వక్తారమ్। ఓం శాంతిః శాంతిః శాంతిః॥**

**1 –శాంతిపాఠం 2 – అనువాకం 12** (శాంతిపాఠం 1, అనువాకం 1లో చూశాము.)

ఇది ఇంచుమించుగా మొదటి అనువాకంలో వచ్చిన శాంతిపాఠమే. అక్కడక్కడా చిన్నమార్పులు ఉన్నాయంతే. మొదటి శాంతిపాఠంలో శిష్యుడు హిరణ్యగర్భను స్తుతించి, ఆయన కృపను కోరాడు.

ఇక్కడ ఓ దేవా, నేను నిన్ను స్తుతించి, శీక్షావల్లీ మొదలుపెట్టేముందు, నీ కృపను కోరాను (భూతకాలం). అప్పుడు నీ కృపను కోరినట్టు నువ్వు నన్ను దీవించావు. నన్నే కాదు, నా గురువును కూడా దీవించావు. మా ఇద్దరినీ, నువ్వు దీవించబట్టే ఎటువంటి ఆటంకాలు లేకుండా, గురువు తన బోధను విజయవంతంగా చేశాడు; నేను విజయవంతంగా నేర్చుకున్నాను. నువ్వు నామీద చూపించిన అనుగ్రహానికి నా కృతజ్ఞతలను వెలిబుచ్చుకుంటున్నాను.

ఇక్కడ కూడా ఓం శాంతిః శాంతిః శాంతిః మూడుసార్లు ఉచ్చరించబడ్డాయి. ధర్మశాస్త్రం విజయవంతంగా ముగిసినా, ఇంకా సాధన పూర్తికాలేదు. శ్రవణం ముగిసింది కాని అది అంతిమసాధన కాదు. ఇంకా మననం, నిదిధ్యాసనం చేయాలి. ధర్మజ్ఞాననిష్ఠలో నిలబడాలి. దాని తర్వాత బ్రహ్మజ్ఞానం పొంది, ఆ బ్రహ్మజ్ఞాననిష్ఠలో నిలబడాలి. దానికి ఆటంకాలు ఎదురవకుండా ఉండాలి. అందువల్ల మళ్ళీ ఓం శాంతి మూడుసార్లు పఠిస్తున్నాడు శిష్యుడు. ఓ దేవా! మళ్ళీ నన్ను దీవించు!

ఇక్కడితో శీక్షావల్లీ అయిపోయింది.

# తైత్తిరీయోపనిషత్ - శీక్షావల్లీ సారాంశం

తైత్తిరీయోపనిషత్‌లో మూడు వల్లీలు ఉన్నాయి. వాటిలో మొదటి వల్లీ, మూడవ వల్లీ జ్ఞానయోగ్యతాప్రాప్తికి తోడ్పడతాయి. జ్ఞానయోగ్యత పొందితే బ్రహ్మజ్ఞానం పొందటానికి మనస్సు సంసిద్ధంగా ఉంటుంది. రెండవ అధ్యాయం బ్రహ్మజ్ఞానప్రాప్తికి తోడ్పడుతుంది. జ్ఞానయోగ్యత లేకుండా ఎవరూ జ్ఞానం పొందలేరు. మూడవ వల్లీలో కొంత వేదాంతబోధ కూడా వస్తుంది. తైత్తిరీయం గద్యరూపంలో ఉంది కాబట్టి మంత్రాలు పేరాల రూపంలో వస్తాయి. వాటిని అనువాకాలు అంటారు.

మొదటి వల్లీని ప్రధానంగా ఐదు భాగాలుగా విభజించవచ్చు. అవి –

1. శాంతిపాఠం – అనువాకాలు 1, 12
2. కర్మయోగ సాధన – అనువాకం 9
3. ఉపాసన – అనువాకాలు 3–8
4. హోమసాధన – అనువాకం 4
5. జపసాధన – అనువాకాలు 4, 10

1. **శాంతిపాఠం – అనువాకాలు 1, 12**

ఎ) **అనువాకం 1** – మొదటి అనువాకం శాంతిపాఠంతో మొదలవుతుంది. ఈ శాంతిపాఠంలో సాధకుడు ఆటంకాలు కలగకుండా చేయమని ప్రార్థిస్తున్నాడు. అంతేకాదు, తనలో ఉన్న పంచజ్ఞానేంద్రియాలు, పంచకర్మేంద్రియాలు, పంచప్రాణాలు, నాలుగు అంతఃకరణాలు ఆరోగ్యంగా ఉండేలాగా చేయమని వాటి యొక్క అధిష్ఠాన దేవతలకు కూడా ప్రార్థన చేస్తున్నాడు. అవి ఆరోగ్యకరంగా ఉంటేనే అతను జ్ఞానాన్ని పొందగలడు.

ఆటంకాలు మన ప్రారబ్ధకర్మ వల్ల ఏర్పడవచ్చు. పూర్వజన్మ ప్రారబ్ధదోషంవల్ల ఏర్పడవచ్చు. తెలిసిన ఆటంకాలను ఎదుర్కొనగలమేమో కాని, తెలియని, కంటికి కనబడని ఆటంకాలను ఎలా ఎదుర్కొనగలము? దానికి ఒకటే మార్గం ఉంది. మనం కూడా మనలో కంటికి కనబడని ఒక శక్తిని నిలబెట్టుకోవాలి. ఆ శక్తి ఈ ఆటంకాలను పారద్రోలగలదు. ప్రార్థన ఆ శక్తిని ఇవ్వగలదు. అందువల్ల మన అంగాలను శక్తివంతంగా చేసుకోవటానికీ, ఆటంకాలు రాకుండా చేసుకోవటానికీ ఈ శాంతిపాఠాన్ని పఠిస్తారు.

బి) **అనువాకం 12** – పన్నెండవ అనువాకంలో మళ్ళీ ఇదే శాంతిపాఠం కొంచెం చిన్న మార్పులతో చూశాము. అక్కడ ఈ ధర్మశాస్త్రాన్ని విజయవంతంగా ముగించుకున్నందుకు, ఆటంకాలు ఏవీ కలగనందుకు కృతజ్ఞతలు తెలుపుకున్నాడు శిష్యుడు.

2. **కర్మయోగ సాధన – అనువాకం 9**

తేలికగా చెప్పాలంటే కర్మయోగాన్ని ధార్మిక జీవనవిధానం లేదా మతపరమైన జీవనవిధానం అని చెప్పవచ్చు. కర్మయోగంలో మూడు అంశాలు ఉన్నాయి. మూడూ ముఖ్యమైన అంశాలే.

ఎ) **పంచమహాయజ్ఞాలు** – కర్మయోగి పంచమహాయజ్ఞాలను చేయాలి. అవి –

**దేవయజ్ఞమ్** – భగవంతునికి చేసే నిత్యపూజలు.

**పితృయజ్ఞమ్** – పితృదేవతలకు వారు జీవించివుండగా వారికి సేవ చేయటం. మరణించిన పితృదేవతలకు శ్రాద్ధకర్మలు తప్పకుండా చేయాలి; తర్పణాలు వదలాలి.

**ఋషియజ్ఞమ్** – ఋషులు తాము విని మనకు అందించిన శాస్త్రాన్ని మనం అధ్యయనం చేసి, ముందుతరాలకు కూడా అందేలా చేయాలి. అలా చేయటంవల్ల మన సనాతన సాంప్రదాయాన్ని నిలబెట్టి, తద్వారా ఋషి ఋణం తీర్చుకున్నవారం అవుతాము. దీన్ని బ్రహ్మయజ్ఞం అనికూడా అంటారు.

**మనుష్యయజ్ఞమ్** – తోటి మనుష్యులకు సేవ చేయటం; మొత్తం మానవాళికే మేలు చేకూర్చే పనులు చేయటం.

**భూతయజ్ఞమ్** – మూగజీవులైన పశుపక్ష్యాదులను రక్షించటం; చెట్లు చేమలను కాపాడటం. దీనికి చిహ్నంగా మన సాంప్రదాయంలో ఆవును పూజించటం, తులసిచెట్టును పూజించటం వచ్చింది.

వ్యక్తినిబట్టి ఏ యజ్ఞం ఎక్కువ చేయాలనేది మారుతుంది. వారి వ్యక్తిత్వాన్నిబట్టి వారికున్న వనరులనుబట్టి కొందరు దైవయజ్ఞానికి ప్రాముఖ్యతను ఇస్తే, మరికొందరు మనుష్యయజ్ఞాన్ని ఎక్కువగా చేయవచ్చు. ఏదేమైనా అందరూ ఐదు యజ్ఞాలూ చేసితీరాలి. ఈ యజ్ఞాలను సాత్త్వికకర్మలు అనీ, ఉత్తమకర్మలు అనీ, నిష్కామకర్మలు అనీ, నిత్యనైమిత్తిక కర్మలు అనీ అంటారు.

బి) **సద్గుణప్రాప్తి** – కర్మయోగంలో రెండవభాగం విలువలను పెంపొందించు కోవటం. దైవీసంపత్తి పేరిట కృష్ణపరమాత్మ భగవద్గీతలో 16వ అధ్యాయంలో వాటిని పేర్కొన్నాడు.

వాటిని సద్గుణాలు అంటారు. ఇక్కడ శీక్షావల్లీ వాటిలో కొన్నింటిని పేర్కొన్నది. అవి–

**సత్యమ్** – సత్యాన్ని పలకటం

**తపః** – ఒక సంకల్పంతో కష్టాన్ని భరించటం (కష్ట సహిష్ణుత్వం తపః)

**శమః** – మనోనిగ్రహం

**దమః** – ఇంద్రియనిగ్రహం

**దక్షిణా** – ఎవరినుంచి కూడా ఏ సహాయమూ ఆయాచితంగా స్వీకరించ కూడదు. ఒకవేళ ఉచితంగా లభించినా, అంత సొమ్మును వేరే ఉన్నతమైన పనికి ఖర్చుపెట్టాలి తప్పితే దాన్ని ఉంచుకోకూడదు. ఎవరైనా గురువు వద్ద ఏదైనా నేర్చుకుంటే, ఆ గురువుకు అవసరం ఉన్నా లేకపోయినా కూడా గురదక్షిణ ఇవ్వాలి.

**ఆచార్యాయ ప్రియం ధనమాహృత్య**

ఇలా దక్షిణ ఇవ్వటంవల్ల ఎవరికీ అన్యాయం చేయరు. మీరు ఏదైనా పొందితే, మీరు కూడా తిరిగి ఇవ్వాలనే మంచిబుద్ధి అలవడుతుంది.

**దానం** – దానగుణం పెంపొందించుకోవాలి. మన అంతిమ ప్రయాణం చేసేలోగా, మనం ఇచ్చినది ఎక్కువగానూ, తీసుకున్నది తక్కువగానూ ఉండాలి.

**కుశలం** – సమాజసేవ చేయమన్నారు కదా అని అతిగా చేయకూడదు. అంటే మీ ఆరోగ్యాన్నీ, మీ కుటుంబాన్నీ నిర్లక్ష్యం చేసేటంతగా చేయకూడదు. బయట ప్రపంచంలో జేజేలు కొట్టించుకునే ఆర్భాటంలో పడిపోతే, ఇంట్లో పిల్లలు బాధపడతారు. వారు కాసింత ప్రేమ కోసం అల్లాడిపోతారు. అది దోషం కిందికే వస్తుంది. గృహస్థుగా మీ ధర్మం మీ కుటుంబాన్ని సంరక్షిచటం, వారికి మీ అమూల్యమైన సమయాన్ని కేటాయించటం కూడా. కుటుంబాన్ని కష్టాల్లో పడవేసి, బయట దానాలు చేయకూడదు. దానగుణం ఇంటినుంచి మొదలవ్వాలి.

సి) **సద్భావన** – సృష్టిలో ప్రతిదాని గురించీ మంచి భావన కలిగివుండటం. ఈ అంశం ఇక్కడ, ఈ ఉపనిషత్తులో రాలేదు కాని, కర్మయోగంలో భాగంగా మనం చూస్తున్నాము.

ఈ జగత్తులో ప్రతిదీ భగవంతుని రూపంగా భావించి, ప్రతిదాన్నీ సద్భావంతో చూడాలి. ముందుగా పంచభూతాలను దైవంగా కొలవాలి. తర్వాత మొత్తం జీవరాశిని, తల్లిని, తండ్రిని, గురువుని పూజించాలి. ఈ అంశం వచ్చింది.

**మాతృదేవో భవ। పితృదేవో భవ। ఆచార్యదేవో భవ**

నవరాత్రి ఉత్సవాలలో ముగ్గురమ్మలను పూజిస్తాము – దుర్గాదేవి ఆర్యోగానికీ, లక్ష్మీదేవి ఐశ్వర్యానికీ, సరస్వతీదేవి జ్ఞానానికీ అధిష్ఠానదేవతలు. ఈ మూడూ ఉండాలి ప్రతి ఒక్కరికీ. ఒకటి లేకుండా ఇంకొకటి లేదు. అందువల్ల ఆరోగ్యాన్ని, ఐశ్వర్యాన్ని, పుస్తకాలను ఆరాధనాపూర్వకంగా చూడాలి.

అలాగే శాస్త్రాలమీద గౌరవం ఉండాలి. శాస్త్రాలవల్లనే మనం అంతులేని జ్ఞానాన్ని పొందుతున్నాము. శాస్త్రాలను అభ్యసించి, వాటిని ఆచరిస్తే వృద్ధి పొందుతాము; లేకపోతే మనమే బాధపడతాము. శాస్త్రాలను పాటించనంత మాత్రాన అవేమీ నష్టపోవు. ఇలా శాస్త్రంమీద శ్రద్ధ పెంచుకోవటాన్ని ప్రామాణ్యభావన అంటారు. మనకు అలా శాస్త్రంలో మూడు ప్రమాణాలు ఉన్నాయి. అవి –

**శ్రుతి** – వేదాలు. వేదాలు అపౌరుషేయాలు, సాక్షాత్తూ ఆ పరమాత్మనుంచే మనకు వచ్చాయి.

**స్మృతి** – వేదాలనుంచి వచ్చిన గ్రంథాలు. వేదాలలో ఉన్న బోధను మహాత్ములు, ఋషులు తిరిగి రచించారు.

**శిష్ట ఆచార్యుడు** – వేదాలకనుగుణంగా జీవితాన్ని నడిపే ఆచార్యుడు.

ఈ మూడు ప్రమాణాలలో శ్రుతి శ్రేష్ఠమైనది. స్మృతిలో చెప్పినది కాని, శిష్ట ఆచార్యుడు పాటించేది కాని శ్రుతి ప్రమాణానికి భిన్నంగా ఉంటే శ్రుతి చెప్పిందే శిరోధార్యంగా తీసుకోవాలి. అలాగే స్మృతిగ్రంథంలో చెప్పినదానికి శిష్ట ఆచార్యుని ప్రవర్తన భిన్నంగా ఉంటే స్మృతి వాక్యానికే విలువను ఇవ్వాలి.

ఈ విధంగా మహాయజ్ఞాలు చేసి, సద్గుణాలు పెంచుకుని, సద్భావన చూపిస్తే కర్మయోగం పాటించినట్లు అవుతుంది. ఇటువంటి కర్మయోగం చిత్తశుద్ధిని కలుగజేస్తుంది. అంటే మనస్సు లౌకికసుఖాలకన్నా ఆధ్యాత్మిక విజయాలవైపు మొగ్గు చూపుతుంది.

3. **ఉపాసన – అనువాకాలు 3–8**

శీక్షావల్లీలో ఐదు వైదిక ఉపాసనలు చెప్పబడ్డాయి. ఈ ఉపాసనలు పూర్వకాలపు వైదిక విద్యార్థులు నేర్చుకునేందుకు అనువుగా ఉన్నాయి. ఇప్పుడు పరిస్థితి మారింది. ఇప్పుడా ఉపాసనలను మనం చేయలేము. అందువల్ల వాటిని పరిజ్ఞానంకోసం నేర్చుకున్నాము కానీ ఆచరించటానికి కాదు. వాటిని పురాణాలలో వచ్చిన ఏకరూప ఈశ్వరధ్యానంగా మార్చుకోవచ్చు. ఇప్పుడా ఉపాసనలను చూద్దాము.

ఎ) **సంహితోపాసన – అనువాకం 3** – ఈ ఉపాసనలో అక్షరాలను కలిపే విధానంలో నాలుగు అంశాలను తీసుకుంటాము. అవి పూర్వరూపం, ఉత్తరరూపం, సంధి, సంధానం. ఈ నాలుగు ఆలంబనలమీద ఐదు రకాల ఉపాస్య వస్తువులను ఊహించుకుని ఉపాసన చేయాలి. ఆ ఐదు ఉపాసనలు – అధిలోక, అధిజ్యౌతిష, అధివిద్య, అధిప్రజ, అధ్యాత్మ ఉపాసనలు.

బి) **వ్యాహృతి ఉపాసన – అనువాకం 5** – ఈ ఉపాసనలో నాలుగు వ్యాహృతులను తీసుకుంటాము. అవి భూః, భువః, సువః, మహః. ఈ నాలుగు ఆలంబనలమీద నాలుగు రకాల ఉపాస్య వస్తువులను ఊహించుకుని ఉపాసన చేయాలి. ఆ నాలుగు ఉపాసనలు – అధిలోక, అధిదైవ, అధివేద, అధిప్రాణ వ్యాహృతి ఉపాసనలు.

సి) **హిరణ్యగర్భ ఉపాసన – అనువాకం 6** – దీన్ని అహంగ్రహ ఉపాసన అంటారు. ఇందులో జీవ–ఈశ్వర ఐక్యాన్ని ఊహించుకుంటారు. హిరణ్యగర్భ సమష్టి మనస్సు. మన మనస్సును ఆలంబనగా చేసుకుని, సమష్టి మనస్సును దానిమీద ఆవాహన చేయాలి. శంకరాచార్యులవారు వ్యాహృతి ఉపాసనను విడిగా చేయకూడదనీ, దాన్ని హిరణ్యగర్భ ఉపాసనలో కలిపి చేయాలనీ అంటారు. అందువల్ల వీటిని అంగ–అంగీ ఉపాసనలు అంటారు. అలా రెండూ కలిపి చేస్తే కలిగే ఫలం – హిరణ్యగర్భ ఫలం.

డి) **పాంక్త బ్రహ్మ ఉపాసన – అనువాకం 7** – ఈ ఉపాసనలో సమష్టి ప్రపంచాన్ని, వ్యష్టి శరీరాన్ని కూడా వ్యష్టిమీద ఆవాహన చేస్తాము. పాంక్తం అంటే ఐదు వస్తువుల సముదాయం. జగత్తును మూడు తెగల కింద విభజిస్తాము. దాన్ని పాంక్తత్రయం అంటాము. అవి లోకపాంక్తం, దేవతాపాంక్తం, భూతపాంక్తం. అలాగే వ్యష్టిని కూడా మూడు తెగలుగా విభజిస్తాము. దాన్ని కూడా పాంక్తత్రయం అంటాము. అవి వాయుపాంక్తం, ఇంద్రియపాంక్తం, ధాతుపాంక్తం. సమష్టి పాంక్తత్రయాన్ని, వ్యష్టిపాంక్తత్రయంమీద ఆవాహన చేసి, ఉపాసన చేయాలి.

ఇ) **ఓంకార ఉపాసన – అనువాకం 8** – ఈ ఉపాసనలో ఓంకారాన్ని ప్రతీక ఆలంబనగా తీసుకుని, దానిమీద ఈశ్వరుణ్ణి ఆవాహన చేస్తాము. ఓంకారం విరాట్, హిరణ్యగర్భ, ఈశ్వరులలో ఎవరినైనా సూచిస్తుంది.

ఉపాస్య విషయం ఎప్పుడూ సగుణబ్రహ్మ అవుతుంది; నిర్గుణబ్రహ్మ కాదు. ఉపాసనను ఒక ఆలంబనంమీద చేస్తాము. అది ప్రతీక ఆలంబనం కావచ్చు, ప్రతిమా ఆలంబనం కావచ్చు.

**ఏకస్మిన్ ఆలంబనే సగుణధ్యానమ్ ఉపాసనమ్ ఇతి ఉచ్యతే**

ఉపాసన ఫలం మనం చెప్పుకునే సంకల్పాన్నిబట్టి వస్తుంది. అంటే సకామ ఉపాసనగా చేయవచ్చు లేదా నిష్కామ ఉపాసనగా చేయవచ్చు. పూజలను, ఉపాసనలను లౌకిక విజయాలకోసం చేయవచ్చు; ఆధ్యాత్మిక ఎదుగుదలకోసం చేయవచ్చు. మతం వేరు, ఆధ్యాత్మికత వేరు. భక్తి ఉన్న ప్రతివ్యక్తికీ ఆధ్యాత్మికత ఉండాలనే నియమం లేదు కాని ఆధ్యాత్మికతకు వచ్చిన ప్రతివ్యక్తికీ భక్తి ఉండి తీరుతుంది. రావణుడు, కంసుడు వారి భక్తిని వారి శక్తికి వాడుకున్నారు. మతాన్ని సిద్ధులు పొందటానికి వాడకూడదు. అవి లౌకిక విజయాల కింద వస్తాయి. లౌకిక విజయాలు కోరే వ్యక్తి భక్తి ఉన్నా లేకపోయినా కూడా, సంసారి కిందకే

వస్తాడు. ఉపాసనను ఆధ్యాత్మిక ఎదుగుదలకోసం చేయాలి; చిత్త ఏకాగ్రత పొందాలి. చిత్త ఏకాగ్రత పొందితే ఆధ్యాత్మిక లక్ష్యంమీద ఏకాగ్రత చూపటం సాధ్యమవుతుంది.

భగవంతుడు ప్రత్యక్షమై, ఏంకావాలో కోరుకోమంటే, రెండో ఆలోచన లేకుండా, తడుముకోకుండా, 'నాకు మోక్షం కావాలి,' అని కోరగలగాలి. అలా కోరగలిగితే, మీకు మీ జీవితలక్ష్యం గురించి పూర్తి అవగాహన ఉన్నట్టే అర్థం. ఈ ఉపాసనలు చిత్త ఏకాగ్రతనే కాక, చిత్తవిశాల్యతను కూడా కలుగజేస్తాయి. ఎందుకంటే సమష్టి గురించి ఆలోచిస్తారు కాబట్టి.

4. **హోమసాధన – అనువాకం 4**

శీక్షావల్లీలో ఒక ప్రత్యేకమైన హోమం చెప్పబడింది. ఈ హోమం చాలా ప్రసిద్ధి చెందినది. ఇప్పుడు కూడా చేస్తూవుంటారు. ఈ మంత్రం ఆవహంతీ పదంతో మొదలవుతుంది కాబట్టి దీన్ని ఆవహంతీ హోమం అంటారు. ఈ హోమం ద్వారా సాధకుడు నాలుగు ఫలాలను కోరుతున్నాడు.

ఎ) **ధనప్రాప్తి** – ఐశ్వర్యం, ధనం కోరుతున్నాడు.

బి) **చిత్తశుద్ధిప్రాప్తి** – చిత్తశుద్ధి కలగాలని కోరుకుంటున్నాడు. అది కూడా ఐశ్వర్యం ద్వారా. సాధారణంగా డబ్బు సంపాదిస్తే మనస్సు కలుషితం అవుతుంది అనే అపోహ ఉంది కొందరిలో. కాని ధనం దానంతట అది స్వచ్ఛమూ కాదు; మలినమూ కాదు. ధనాన్ని మనం వాడే తీరునుబట్టి అది శుద్ధమో, అశుద్ధమో అవుతుంది. ధనాన్ని జూదం ఆడటానికో, మద్యం సేవించటానికో వాడితే అది అశుద్ధమైన పని కాబట్టి, ధనం కూడా అశుద్ధం అవుతుంది కాని, అదే ధనంతో పంచమహాయజ్ఞాలు చేస్తే, మంచికి ఉపయోగపడే ఆ ధనం కూడా స్వచ్ఛతను ఆపాదించుకుంటుంది.

ఏ పని చేయాలన్నా ధనం కావాలి. **కాటికి చేరేవరకే కాసులు** అంటారు కాని, కాటికి చేరాక కూడా కాసులు కావాలి. అక్కడ కూడా డబ్బు ఖర్చుపెట్టాలి. అందువల్ల ధనం అశుద్ధం అని ఎన్నడూ అనవద్దు. అలా అంటే లక్ష్మీదేవిని కించపరచినట్టు అవుతుంది. ధనాన్ని సద్వినియోగం చేస్తే లక్ష్మీదేవి కూడా కరుణించి చిత్తశుద్ధిని కలుగజేస్తుంది. చిత్తశుద్ధి అంటే మనస్సు స్వచ్ఛంగా ఉండటం. చిత్తశుద్ధి అంతిమలక్ష్యం కాదు, అది జ్ఞానయోగ్యతాప్రాప్తిని ఇస్తుంది.

సి) **జ్ఞానప్రాప్తి** – చిత్తశుద్ధి పొందాక జ్ఞానం పొందాలి అని కోరుకుంటున్నాడు. ఈ జ్ఞానం జీవాత్మ–పరమాత్మ ఐక్యజ్ఞానం.

**ప్రతివేశోఽసి ప్ర మా భాహి ప్ర మా పద్యస్వ**

డి) **శిష్యప్రాప్తి –** శిష్యులు అధికసంఖ్యలో రావాలని కోరుకుంటున్నాడు. తను జ్ఞానం పొందాక, తను పొందిన జ్ఞానాన్ని నలుగురితో పంచుకోవాలి. అలా శిష్యులకు బోధించటం ద్వారా ఈ గురుశిష్య పరంపరను కొనసాగించగలడు. ఈ గురుశిష్య పరంపర సదాశివునితో మొదలై, అతని గురువు వరకూ కొనసాగింది. అక్కడితో ఆగిపోకుండా, అతను కూడా గురువుగా మారాలి.

**ఆమాయంతు బ్రహ్మచారిణః స్వాహా**

బ్రాహ్మణుడు అధ్యయనం, అధ్యాపనం చేయాలి. అందువల్ల అతను ఈ ప్రార్థన చేస్తున్నాడు.

5. **జపసాధన – అనువాకాలు 4, 10**

జపం అంటే ఆవృత్తి. ఏదైనా ఒక మంత్రాన్ని తీసుకుని దాన్ని పదేపదే పఠించటం. ఒక మంత్రాన్ని ఒకసారి పఠిస్తే అది పారాయణం; పదేపదే పఠిస్తే అది జపం. ఈ మంత్రాన్ని పైకి పఠిస్తే అది జపం, మనస్సులో చేస్తే అది ధ్యానం. శీక్షావల్లీలో రెండు జపసాధనలు చెప్పబడ్డాయి.

ఎ) **జ్ఞానయోగ్యతాప్రాప్తి – అనువాకం 4 –** ఈ జపం శరీరం, వాక్కు, మనస్సు, బుద్ధి ఆరోగ్యకరంగా ఉండటంకోసం చేస్తున్నాడు సాధకుడు.

**శరీరం మే విచర్షణమ్ । జిహ్వా మే మధుమత్తమా ।**

**కర్ణాభ్యాం భూరి విశ్రువమ్ । బ్రహ్మణః కోశో౽సి మేధయా పిహితః।**

బుద్ధి పదునుగా ఉండాలి; కాని మనస్సు కూడా ప్రశాంతంగా ఉండాలి. భావోద్రేకాలతో నిండిన మనస్సు ప్రశాంతంగా ఉండదు. అలా ప్రశాంతంగా లేని మనస్సు బోధను సరిగ్గా స్వీకరించలేదు. ఈరోజుల్లో ఐక్యూ (ఇంటెలిజెంట్ కోషెంట్) ఉంటే చాలదు, ఈక్యూ (ఇమోషనల్ కోషెంట్) కూడా ఉండాలి. లేకపోతే చిరుగాలికి అతని మనస్సు రెపరెపలాడిపోతుంది.

ఈ జపం ద్వారా నాకు మనస్సు, బుద్ధి కూడా ఆరోగ్యకరంగా ఉండేటట్టు చేయి అంటున్నాడు సాధకుడు.

బి) **జ్ఞానప్రాప్తి – అనువాకం 10 –** తీవ్రముముక్షుత్వం ఉన్న సాధకునికి ఉపనిషత్తు జ్ఞానప్రాప్తికి తోడ్పడే మంత్రాన్ని ఇస్తున్నది. అది కూడా త్రిశంకుడనే ఋషి చేసిన ప్రార్థన ద్వారా చెబుతున్నది.

**అహం వృక్షస్య రేరివా । కీర్తిః పృష్ఠం గిరేరివ ।**

కేవలం ఈ జపం చేస్తే జ్ఞానం పొందదు. కాని జ్ఞానప్రాప్తికి కావాల్సిన అంశాలను తేలికగా పొందుతాడు. అంటే శాస్త్రశ్రవణం చేయటానికి అనువైన సమయం, పరిస్థితులు ఏర్పరచి, గురుప్రాప్తి కూడా కలిగేలా చేస్తుంది.

కర్మయోగం, ఉపాసన, హోమం, జపం – ఈ నాలుగు చేస్తే సాధకుడు జ్ఞానయోగ్యతా ప్రాప్తిని పొందుతాడు. అందువల్ల రెండవ అధ్యాయంలో బోధించిన జ్ఞానయోగాన్ని పొందుతాడు. అందువల్ల పన్నెండవ అనువాకంలో ఆటంకాలు లేకుండా ఇవి చేయగలిగినందుకు కృతజ్ఞతలు మళ్ళీ శాంతిపాఠం చెప్పటం ద్వారా చెప్పుకుంటాడు (దాన్ని ముందే చూశాము).

# తైత్తిరీయోపనిషత్ - బ్రహ్మానందవల్లీ

**ఉపోద్ఘాతం**

తైత్తిరీయోపనిషత్‌లోని మొదటి వల్లీ అయిన శీక్షావల్లీలో సాధన చతుష్టయ సంపత్తిని పొందటానికి అవసరమైన సాధనలు మాత్రమే వచ్చాయి. అందులో జ్ఞానయోగం లేదు. మళ్ళీ మూడవ అధ్యాయంలో మరికొన్ని సాధనలు వస్తాయి. మూడవ అధ్యాయాన్ని భృగువల్లీ అంటారు. అందులో కొన్ని సాధనలతోపాటు కొంత జ్ఞానయోగం కూడా ఉంటుంది. కాని రెండవ అధ్యాయం అయిన బ్రహ్మానందవల్లీలో ఆత్మబోధ మాత్రమే ఉంటుంది. అందువల్ల తైత్తిరీయోపనిషత్‌లోని ఈ వల్లీ చాలా ముఖ్యమైనది. దీనికి శంకరాచార్యులవారు చాలా విస్తారంగా భాష్యం రాశారు. ఆ భాష్యం చాలా అద్భుతంగా ఉంటుంది.

రెండవ అధ్యాయానికి మూడు పేర్లు ఉన్నాయి. అవి బ్రహ్మవల్లీ, ఆనందవల్లీ, బ్రహ్మానందవల్లీ.

**బ్రహ్మవల్లీ** – ఈ ఉపనిషత్తులో ప్రతి వల్లీకి అది ఆరంభమయ్యే మొదటిపదంతో ఆ పేరు పెట్టటం జరిగింది.

| | | |
|---|---|---|
| వల్లీ 1 – శీక్షాం వాఖ్యాస్యామః | – | శీక్షావల్లీ |
| వల్లీ 2 – బ్రహ్మవిదాప్నోతి పరమ్ | – | బ్రహ్మవల్లీ |
| వల్లీ 3 – భృగుర్వై వారుణిః | – | భృగువల్లీ |

ఈ సూత్రం ప్రకారం ఈ అధ్యాయాన్ని బ్రహ్మవల్లీ అంటారు.

**ఆనందవల్లీ** – ఈ వల్లీలో ఆనందంమీద అద్భుతమైన విశ్లేషణను చూస్తాము. ఆ విశ్లేషణను ఆనందమీమాంస అంటారు. ఇందులో ఆనందం అంటే ఏమిటి, ఆనందాన్ని ఎలా పొందాలనే అంశాలమీద చర్చ వస్తుంది కాబట్టి దీనిని ఆనందవల్లీ అని అంటారు.

**బ్రహ్మానందవల్లీ** – ఈ అధ్యాయం బ్రహ్మపదంతో మొదలవుతుంది కాబట్టి, ఆనందం గురించిన విపులమైన విశ్లేషణ వస్తుంది కాబట్టి, ఈ రెండూ కలిపి ఈ అధ్యాయాన్ని బ్రహ్మానందవల్లీ అని అంటారు.

మామూలుగా ఉపనిషత్తుకు ఒకటే శాంతిపాఠం ఉంటుంది. ఏ ఉపనిషత్తును నేర్చుకునేముందు దానికి సంబంధించిన శాంతిపాఠాన్ని పఠించి ముందుకు సాగుతారు. కాని ఈ ఉపనిషత్తులో ఒక్కొక్క వల్లీకి ఒక్కొక్క శాంతిపాఠం ఉంది.

| | |
|---|---|
| శీక్షావల్లీ శాంతిపాఠం | – **శం నో మిత్రః శం వరుణః...** |
| బ్రహ్మానందవల్లీ, భృగువల్లీల శాంతిపాఠం | – సహ నావవతు... |

## శాంతిపాఠం

**ఓం సహ నావవతు। సహ నౌ భునక్తు। సహ వీర్యం కరవావహై తేజస్వినావధీతమస్తు మా విద్విషావహై। ఓం శాన్తి శ్శాన్తి శ్శాన్తిః।**

భృగువల్లీలో కూడా ఇదే శాంతిపాఠాన్ని మళ్ళీ చూస్తాము.

ఇదొక అద్భుతమైన శాంతిపాఠం. ఇది తక్కిన శాంతిపాఠాలకు భిన్నంగా ఉంటుంది. తక్కిన శాంతిపాఠాలు సాధారణ ప్రార్థనలాగా కూడా చేయవచ్చు; కాని ఈ శాంతిపాఠం ప్రత్యేకించి విద్యార్థి చేసే ప్రార్థన; అందులోనూ వేదాంతవిద్యార్థి చేసే ప్రార్థన.

ఈ శాంతిపాఠంలో శిష్యుడు భగవంతున్నుంచి ఐదు అంశాలను కోరుతున్నాడు. ఆ ఐదు అంశాలూ ప్రతి ఒక్క వేదాంతశిష్యునికి కూడా ఎంతో అవసరం. ఈ ఐదు అంశాలను ఒక వరుసక్రమంలో ఏర్చికూర్చటం కోసం మంత్రంలోని వరుసను మార్చటమైనది.

ఎ) **ప్రయత్నం**

**సహ వీర్యం కరవావహై ।** – పూర్తి బాధ్యత దేవునిమీదే పెట్టలేము. మన ప్రయత్నం మనం చేస్తే దేవుడు సహాయపడతాడు. మోక్షాన్ని భగవంతుడు నిర్ణయించడు. మనం ప్రయత్నిస్తే భగవంతుడు తోడ్పడతాడు. మనం ప్రయత్నం చేయాలి కాబట్టి మోక్షాన్ని నాలుగు పురుషార్థాల్లో ఒకటిగా చేర్చారు.

ముందుగా భగవంతుణ్ణి జ్ఞానం ప్రసాదించమని కోరుతాము. జ్ఞానం పొందాలనే లక్ష్యం ఏర్పరచుకున్నాక, ఆ లక్ష్యాన్ని పొందటానికి ప్రయత్నం చేయాలి. మనం ఎప్పుడు ప్రయత్నం చేస్తాము? పూర్తి బాధ్యత భగవంతునిమీదే వేయలేము, దానికి మన ఫ్రీవిల్ కూడా ఉండాలని మనకు అర్థమయితేనే చేస్తాము. లేకపోతే అంతా భగవంతునిమీదే తోసేసే పొరపాటు చేస్తాము. 'భగవంతునికి తెలియదా నాకేం కావాలో? ఆయనే నా బాధ్యతను చూసుకుంటాడు. నాకెప్పుడు మోక్షం ఇవ్వాలనుకుంటే, అప్పుడే ఆయన ఇస్తాడు,' అనుకుంటాము.

కాని ఉపనిషత్తు ఏమంటున్నదంటే 'భగవంతునికి తెలుసో లేదో పక్కనపెట్టి, ముందు నీ లక్ష్యమేమిటో నువ్వు తెలుసుకో,' అంటుంది. ఎందుకంటే మన లక్ష్యం గురించి మనకు సరియైన అవగాహన లేకపోతే, ఒకవేళ భగవంతుడు మనకు మోక్షం ఇచ్చినా, దాన్ని మనం స్వీకరించే పరిస్థితిలో ఉండము. ఇంకోవిధంగా చెప్పాలంటే, మనకు ఏంకావాలో మనకు తెలియకపోతే, భగవంతుడు కూడా మన కోరిక తీర్చలేడు. అందువల్ల భగవంతుడు నిర్ణయించేలోపు మనం నిర్ణయించుకోవాలి.

అప్పుడు మనం ఆత్మస్థైర్యం పెంచుకుని, మనమీద మనం శ్రద్ధ ఏర్పరచుకుని, మన శాయశక్తులా మనం ప్రయత్నించేలా చేయమని భగవంతుణ్ణి వేడుకోవాలి.

**ఉద్ధరేదాత్మనాత్మానం నాత్మానమవసాదయేత్।**
**ఆత్మైవ హ్యాత్మనో బంధుః ఆత్మైవ రిపురాత్మనః ॥** – గీత 6.5

నిన్ను నువ్వు ఉద్ధరించుకోవాలి. నీకు నువ్వే శత్రువువు; నీకు నువ్వే మిత్రుడివి. భగవత్కృప కన్నా ఈ ఆత్మకృప చాలా ముఖ్యం.

ఒక్కముక్కలో చెప్పాలంటే, ఈ ప్రార్థనలో 'నా ప్రయత్నం అవసరమనీ, నేను ప్రయత్నం చేయటానికి అవసరమైన ఆత్మస్థైర్యాన్ని నాకు ప్రసాదించమనీ కోరుతున్నాము,' మనము.

బి) **మేధాశక్తి**

**తేజస్వి నావధీతమస్తు** – వేదాంతశాస్త్రాన్ని నేర్చుకోవాలనుకుంటే, శిష్యుడు కొన్ని సంవత్సరాలపాటు నేర్చుకోవాలి. ఎందుకంటే వేదాంతబోధ ఒక క్రమపద్ధతిలో ఉండి, దశలవారీగా పైకి తీసుకువెళుతుంది. ఈ పద్ధతిని ఒక ఇల్లు కట్టే విధానంతో పోల్చవచ్చు. ఇటుక, ఇటుకా ఒక పద్ధతిలో పేర్చుకుంటూ వచ్చి, వాటి మధ్యలో సిమెంటు పూయాలి. అదే విధంగా ఆ బోధను ఇటుక, ఇటుకా పేర్చుకుంటూ వచ్చినట్టుగా పేర్చుకుంటూ వస్తాడు గురువు. ఆ బోధ ఒకటి, రెండు క్లాసుల్లో అయిపోదు. ఎన్నాళ్ళు నేర్చుకోవాలనేది అనేక అంశాలమీద ఆధారపడివుంటుంది.

వేదాంతబోధలో మహావాక్యాలను బోధిస్తారు. తత్త్వమసి చాలా ముఖ్యమైన మహావాక్యం. దాని అర్థం నువ్వే ఆ బ్రహ్మవు అయివున్నావు. ఈ వాక్యం అర్థం అవ్వాలంటే జీవి, జగత్తు, ఈశ్వరుల గురించి అర్థం కావాలి. పంచకోశ వివేకం, అవస్థాత్రయ వివేకంవంటి కాన్సెప్టుల ద్వారా జీవి గురించి బోధిస్తాడు గురువు. అలాగే సృష్టి ప్రకరణం, పంచీకరణంవంటి కాన్సెప్టుల ద్వారా జగత్తు గురించి నేర్చుకుంటాడు. జగత్తుయొక్క సృష్టికర్తగా ఈశ్వరుని గురించి బోధిస్తాడు. మెట్టుమెట్టుగా సాగుతుంది బోధ. జీవుని గురించి బోధించాక, ఈశ్వరుని గురించి చెప్పి, తద్వారా జగత్తు గురించి చెప్పి, ఆ ఈశ్వరుడూ నువ్వూ ఒకటే అంటుంది శాస్త్రం. ముందు క్లాసులో చెప్పిన అంశాన్ని ఆధారం చేసుకుని తర్వాత అంశం వస్తుంది. అంటే ముందు క్లాసులో చెప్పినది గుర్తుంటేనే శిష్యుడు కూడా గురువుతోపాటు ముందుకు సాగగలడు.

ఈ బోధను క్లాసు అంటున్నాము, ప్రసంగం అనటం లేదు. ప్రసంగం అంటే ఒకదానితో ఇంకొకదానికి సంబంధం ఉండదు. ఒక ప్రసంగం జపంమీద, ఇంకొక ప్రసంగం ప్రాణాయామంమీద, ఇంకొక ప్రసంగం ధ్యానంమీద ఉండవచ్చు. మీకు ఇష్టం లేకపోతే ఒకటి విని, ఇంకొకదాన్ని వినటం మానేయవచ్చు. ఒకదానికి ఇంకొకదానితో సంబంధం ఉండదు.

కాని క్లాస్‌రూమ్ టీచింగ్ అలా ఉండదు. ముందు క్లాసులో అయిన బోధనుంచి ఇవాళ్టి క్లాసు ముందుకు సాగుతుంది. అంతేకాదు, పది ఉపనిషత్తులన్నా కనీసం నేర్చుకోవాలంటాము; అవి కూడా ఒక క్రమపద్ధతిలో నేర్చుకోవాలి. తైత్తిరీయోపనిషత్ నేర్చుకునేందుకు ముందు ముండకోపనిషత్, కేనోపనిషత్, కఠోపనిషత్, కైవల్యోపనిషత్ నేర్చుకుని ఉండివుండాలి.

ఇవన్నీ గుర్తుంచుకోవాలంటే శిష్యునికి మేధాశక్తి ఉండాలి. మేధాశక్తి అంటే గ్రహణ-ధారణ శక్తి రెండూ ఉండాలి. విన్నది అర్థం చేసుకోగలగాలి; అర్థం చేసుకున్నది బుద్ధిలో నిలబెట్టుకోగలగాలి.

**యశ్ఛందసామృషభో విశ్వరూపః ఛందోభ్యో౽ ధ్యమృతా**
**త్సంబభూవ । సమేన్ద్రో మేధయా స్పృణోతు** - 4

శీక్షావల్లీలో మేధాశక్తికోసం శిష్యుడు ప్రార్థన చేయటం చూశాము. అలా ఇప్పటి శాంతిపాఠంలో కూడా మేధాశక్తిని కోరుతున్నాడు శిష్యుడు.

సి) **సత్సంబంధం**

**మా విద్విషావహై** - గురుశిష్యుల మధ్య సత్సంబంధం నెలకొనాలంటే వారి మధ్య అభిమానం, శ్రద్ధాభక్తులు ఉండాలి. గురువు శిష్యునిమీద అభిమానం కొద్దీ తన బోధను చేయాలి; శిష్యుడు శ్రద్ధాభక్తులతో వాటిని అందుకోవాలి. వేదాంతబోధ ఇన్నాళ్ళూ నేర్చుకున్న లౌకికవిద్యకు భిన్నంగా ఉంటుంది; పైగా మనకు తెలిసిన విషయాలకు పూర్తి వ్యతిరేకంగా ఉంటుంది. కనిపించే జగత్తు మిథ్య అంటుంది; కనిపించని భగవంతుడు సత్యం అంటుంది. అన్నిటినీ మించి ఆ బ్రహ్మవు నువ్వే అంటుంది. అందువల్ల గురువు చెప్పిన ఈ విషయాలను శిష్యుడు మొదట్లో స్వీకరించ లేకపోయినా, గురువును కించపరచకూడదు. గురువుమీద శ్రద్ధ పెట్టుకోవాలి. గురువు బాగా బోధ చేయలేదు అనకూడదు; తనే సరిగ్గా అర్థం చేసుకోలేదని అర్థం చేసుకోవాలి. తనకొచ్చిన సందేహాలను పక్కనపెట్టి వింటూ పోవాలంటే శ్రద్ధాభక్తులు లేకపోతే నేర్చుకోలేడు. నమ్మలేకపోయినా వింటూ పోవటాన్నే శ్రద్ధ అంటారు. ఆ శ్రద్ధ గురువుమీద భక్తి ఉంటేనే వస్తుంది. అప్పుడే ఇద్దరిలో సత్సంబంధం నెలకొంటుంది.

డి) **జ్ఞానం**

**సహ నావవతు** - పైన చెప్పిన మూడూ - ప్రయత్నం, మేధాశక్తి, సత్సంబంధం - ఉంటే జ్ఞానం కలుగుతుంది. ఓ దేవా! నా ప్రయత్నం, నా మేధాశక్తి, మా గురు-శిష్య సంబంధాలు కూడా జ్ఞానంలో ముగించుగాక! (జ్ఞానప్రదానేన సహ ఈశ్వరః మామ్ అవతు).

ఫుట్‌బాల్ ఆటలో బంతిని అందించే సామర్థ్యం ఉండటం మంచిదే, కాని ఆ బంతిని గోల్ కొట్టాలి. అదే విధంగా శ్రద్ధ, మేధాశక్తి, సత్సంబంధం అవసరమే కాని వాటితో

ఆగిపోకూడదు. అవి జ్ఞానంలో కలవాలి. అప్పుడే జ్ఞానం కలుగుతుంది. ఓ దేవా, నాకు జ్ఞానాన్ని ప్రసాదించు.

ఇ) **జ్ఞానఫలం**

**సహ నౌ భునక్తు** – ఈ జ్ఞానం పొందేది కేవలం నేర్చుకోవటానికి కాదు; అది జీవితాన్ని మార్చాలి. ఈ జ్ఞానం పొందితే సమబుద్ధి కలుగుతుంది. అప్పుడు ప్రారబ్ధకర్మ వేసే కొరడాదెబ్బలు తట్టుకుని నిలబడగలుగుతారు. అప్పుడు కష్టసుఖాలకు చలించరు. ఆ విధంగా జ్ఞానఫలం సమత్వం.

జ్ఞానం పొందాక కూడా, జ్ఞానఫలాన్ని అనుభవించనీయకుండా అడ్డుపడేవి ఎన్నో ఉంటాయి. అవి రాగద్వేషాల రూపంలో ఉంటాయి. కామ, క్రోధ, లోభ, మోహ, మద, మాత్సర్యాలు. వీటిని అరిషడ్వర్గాలు అంటారు. వీటినే భగవద్గీతలో కృష్ణపరమాత్మ ఆసురీ సంపత్తి అన్నాడు. వీటిని సాంకేతిక పరిభాషలో చెప్పాలంటే కషాయం అంటారు. కషాయం అంటే సూక్ష్మమైన లేదా సుప్తచేతన మనస్సులో ఉండే రాగద్వేషాలు. ఈ ఆటంకాలు ఉన్నంతవరకూ, ఈ జ్ఞానం బుద్ధిస్థాయిలోనే ఉండిపోతుంది కాని మనస్సులోకి ఇంకదు. ఈ జ్ఞానాన్ని మనస్సులోకి దింపుకోగలగటాన్ని జ్ఞానఫలం లేదా జ్ఞాననిష్ఠ అంటారు.

ఉదాహరణకు క్రింద సంపునుంచి మీరు పైన వాటర్‌ట్యాంక్‌లోకి నీటిని ఎక్కించారు. అయినా మీయింట్లో కుళాయి తిప్పితే నీరు కిందికి రావటం లేదు. ఎందుకు? నీటిగొట్టంలో ఎక్కడో ఏదో అడ్డుకుంటోంది. ఆ అడ్డు తొలగిస్తే నీరు ధారగా వస్తుంది. ఇదే సూత్రం మనస్సుకు కూడా వర్తిస్తుంది. బుద్ధిలోకి ఎక్కిన జ్ఞానం కిందికి, మనస్సులోకి ప్రవహించటానికి రాగద్వేషాలు అడ్డుకుంటున్నాయి. వాటిని విపరీతభావనలు అంటారు. ఈ విపరీతభావనలను తొలగిస్తే గాని, జ్ఞానం గంగాప్రవాహంలా ప్రవహించదు. అందువల్ల ఓ దేవా, నేను జ్ఞానం పొందగానే చాలదు, నేను జ్ఞానఫలం కూడా అనుభవించేలా చేయి అని ప్రార్థిస్తున్నాడు శిష్యుడు.

**ఓం శాంతిః శాంతిః శాంతిః** – మూడు రకాలైన విఘ్నాలనుంచి విముక్తి కోరుతున్నాడు శిష్యుడు.

**అధ్యాత్మిక** – నానుంచి ఆటంకాలు కలుగకుండా చేయి. మనం మూడు అడుగులు ముందుకు వేద్దామని చూస్తే, మన మనస్సు ఆరు అడుగులు వెనక్కి లాగుతుంది. ఈ ఆటంకాలను పోగొట్టుకోవటం పూర్తిగా మన చేతిలోనే ఉంది.

**అధిభౌతిక** – పరిసరాలనుంచి, పక్కవారినుంచి, తోటి జీవరాశులనుంచి కలిగే ఆటంకాలు. వీటిమీద మనకు కొంతమేరకే అధికారం ఉంది. మనం ఉపనిషత్తు బోధకు వెళుతుంటే,

ఆ సమయంలో నాకు ఫోను చేయకు, ఇంటికి రాకు అని దగ్గర వారికి చెప్పుకునే చనువు ఉంది. కొన్నింటిని మనమేం చేయలేము.

**అధిదైవిక** – తుఫాను, వాతావరణంలో ఉన్నట్టుండి వచ్చే మార్పులు. ఇవన్నీ ప్రకృతి వైపరీత్యాల ఆటంకాలు. వీటిమీద మనకు బొత్తిగా అధికారం లేదు. వాటినుంచి నన్ను కాపాడమని సర్వజ్ఞుడైన భగవంతుణ్ణి ప్రార్థిస్తున్నాము.

ఇలా శాంతిపాఠం పఠించటం వలన తాత్కాలికంగా ఆటంకాలను అడ్డు తొలగించుకో గలుగుతాము. అప్పుడు వేదాంతం నేర్చుకోగలుగుతాము. ఈ ప్రార్థనతో రెండవ వల్లీ అయిన బ్రహ్మానందవల్లీలోకి అడుగుపెడుతున్నాము.

ఉపనిషత్తులు రెండు రకాలుగా ఉంటాయి. వాటిని మంత్ర ఉపనిషత్తులనీ, బ్రాహ్మణ ఉపనిషత్తులనీ అంటారు. మంత్ర ఉపనిషత్తులు పద్యరూపంలో ఉంటే, బ్రాహ్మణ ఉపనిషత్తులు గద్యరూపంలో ఉంటాయి. ముండకోపనిషత్, ఈశావాస్యోపనిషత్తులను మంత్ర ఉపనిషత్తులనీ; ప్రశ్నోపనిషత్‌ను, బృహదారణ్యకోపనిషత్‌ను, తైత్తిరీయోపనిషత్‌లను బ్రాహ్మణ ఉపనిషత్తులనీ అంటారు. ఈ బ్రహ్మానందవల్లీలో మొత్తం తొమ్మిది అనువాకాలు ఉన్నాయి. మొత్తం బ్రహ్మానందవల్లీని అంశపరంగా ఐదు భాగాలుగా విభజించవచ్చు.

1. సూత్రభాగము – వేదాంతబోధ సూత్రరూపంలో అనువాకం 1
2. వృత్తిభాగము – సూత్రానికి లఘు వ్యాఖ్యానం అనువాకం 1
3. వ్యాఖ్యానభాగము – ఇంకా లోతైన విచారణ అనువాకాలు 1–5,8
4. ఉపసంహారం – అనువాకం 9
5. అనుప్రశ్నా – అనువాకాలు 6, 7

## అనువాకం – 1

**ఓం బ్రహ్మవిదాప్నోతి పరమ్। తదేషాఽ భ్యుక్తా। సత్యం జ్ఞానమ్ అనంతం బ్రహ్మ। యో వేద నిహితం గుహాయాం పరమే వ్యోమన్। సోఽ శ్నుతే సర్వాన్ కామాన్సహ। బ్రహ్మణా విపశ్చితేతి। తస్మాద్వా ఏతస్మాదాత్మన ఆకాశస్సంభూతః। ఆకాశాద్వాయుః। వాయోరగ్నిః। అగ్నేరాపః। అద్భ్యః పృథివీ। పృథివ్యా ఓషధయః। ఓషధీభ్యోఽ న్నమ్। అన్నాత్పురుషః।**
**స వా ఏష పురుషోఽ న్నరసమయః। తస్యేదమేవ శిరః। అయం దక్షిణః పక్షః। అయముత్తరః పక్షః। అయమాత్మా। ఇదం పుచ్ఛం ప్రతిష్ఠా। తదప్యేష శ్లోకో భవతి।**

1. **సూత్రభాగము** – మొదటి అనువాకంలోని మొట్టమొదటి వాక్యం, మొత్తం బోధయొక్క సారాంశాన్ని చెప్పింది. దాన్ని సూత్రవాక్యం అంటారు. అంటే సూత్రభూతవాక్యం అనవచ్చు. మొత్తం బోధను ఒక్కవాక్యంలో చెప్పటాన్ని సూత్రం అంటారు.

ఉదాహరణకు మన లౌకికవిద్యలో కూడా కొన్ని అంశాలను గుర్తుంచుకోవటానికి ఇలా చిన్న వాక్యాలలో చెబుతారు. తెలుగు ఛందస్సు నేర్చుకునేటప్పుడు **యమాతారాజభానస (లగం)** తప్పకుండా నేర్చుకుంటారు. ఇక్కడ వచ్చిన సూత్రవాక్యం–

**బ్రహ్మవిదాప్నోతి పరమ్**

2. **వృత్తిభాగము** – ఈ భాగంలో సూత్రవాక్యాన్ని చిన్నగా విశ్లేషిస్తుంది.

**తదేషాఽ భ్యుక్తా। సత్యం జ్ఞానమ్ అనంతం బ్రహ్మ। యో వేద నిహితం గుహాయాం పరమే వ్యోమన్। సోఽ శ్నుతే సర్వాన్ కామాన్సహ। బ్రహ్మణా విపశ్చితేతి।**

3. **వ్యాఖ్యానభాగము**– ఇంక ఈ వల్లీలోని అధికభాగం ఈ వృత్తివాక్యాన్ని విడమర్చి చెబుతుంది.

**తస్మాద్వా ఏతస్మాదాత్మన ఆకాశస్సంభూతః। ఆకాశాద్వాయుః। ... ఏతమానంద మయమాత్మానముపసంక్రామతి । తదప్యేష శ్లోకో భవతి।**

1. **సూత్రభాగము**–

**బ్రహ్మవిదాప్నోతి పరమ్ ॥**

**బ్రహ్మవిత్** – బ్రహ్మజ్ఞాని. బ్రహ్మను తెలుసుకున్న వ్యక్తి. విత్ అంటే జ్ఞాని; బ్రహ్మను తెలుసుకున్న జ్ఞాని.

**ఆప్నోతి** – పొందుతాడు. ఏం పొందుతాడు?

**పరమ్** – అన్నింటికన్నా శ్రేష్ఠమైన పరమపురుషార్థాన్ని పొందుతాడు. దీన్ని మోక్షం అంటారు.

ఈ వాక్యం అర్థం మొత్తం చూస్తే, బ్రహ్మను తెలుసుకున్న జ్ఞాని, పరమ పురుషార్థాన్ని పొందుతాడు అంటే మోక్షాన్ని పొందుతాడు.

మోక్షాన్ని పూర్ణత్వం అంటారు. అతను పూర్ణత్వాన్ని పొందటంవల్ల ఇంక జీవితంలో ఏ కొరతా ఉండదు. అతనికి ఏ కోరిక కూడా ఉండదు. అందువల్ల పరం అంటే పూర్ణత్వం లేదా మోక్షం అని చెప్పవచ్చు. ఆ విధంగా బ్రహ్మవిదాప్నోతి పరమ్ అంటే బ్రహ్మజ్ఞాని మోక్షాన్ని పొందుతాడు.

ఈ వాక్యంనుంచి ఒక ఉపసిద్ధాంతాన్ని అర్థం చేసుకోవాలి మనం. బ్రహ్మజ్ఞాని మోక్షం పొందుతాడంటే బ్రహ్మజ్ఞాని **మాత్రమే** మోక్షం పొందుతాడని అర్థం చేసుకోవాలి. తక్కినవారంతా, వారెంత గొప్పవారైనా సరే, సంసారుల కిందికే వస్తారు. భక్తులు కూడా ఎన్ని యజ్ఞయాగాదులు చేసినా, బ్రహ్మజ్ఞానాన్ని పొందకపోతే, వారు భక్త సంసారులుగానే ఉంటారు కాని మోక్షం పొందలేరు. అలాగే ఉపాసకుడు కూడా. ఒక ఉపాసకుడు, ఇష్టదేవతమీద ఉపాసన చేసి, సిద్ధులు పొందవచ్చు గానీ, అతను కూడా ఉపాసక సంసారిగానే ఉండిపోతాడు, ఒకవేళ బ్రహ్మజ్ఞానం పొందకపోతే. మోక్షం అంటే ఇక్కడే, ఇప్పుడే బంధవిముక్తి కలగటం. దాన్ని జీవన్ముక్తి అంటారు. ఉపాసకుడు ఇక్కడ పొందకపోయినా, బ్రహ్మలోకానికి వెళితే, అక్కడ బ్రహ్మ దగ్గర జ్ఞానం పొందితే, అక్కడ క్రమముక్తి పొందుతాడు. కాని భూలోకంలో మాత్రం బ్రహ్మజ్ఞానం పొందితేనే మోక్షం పొందుతారని ఈ వాక్యం నిరూపిస్తున్నది.

యజ్ఞాలు, సమాజసేవ, పారాయణం, జపం, ప్రాణాయామం – ఇవన్నీ అద్భుతమైనవి, ఆచరించాల్సినవే, కాదనటం లేదు; కాని వీటివల్ల మోక్షం రాదు. ఇవి చిత్తశుద్ధిని కలుగజేస్తాయి అంటే జ్ఞానయోగ్యతాప్రాప్తిని కలుగజేస్తాయి కాని జ్ఞానాన్ని మాత్రం ప్రసాదించవు.

**జ్ఞానాత్ ఏవ కైవల్యమ్** – కైవల్యమ్

జ్ఞానంవల్లనే మోక్షం పొందుతారని కైవల్యోపనిషత్తు కూడా నొక్కివక్కాణిస్తున్నది.

ఈ సూత్రవాక్యం మనలో మూడు సందేహాలు చోటు చేసుకునేందుకు తోడ్పడుతుంది. ఆ సందేహాలను వృత్తి తీరుస్తుంది. ముందు ఆ సందేహాలేమిటో చూద్దాము.

ఎ) **కిం తత్ బ్రహ్మ** – ఆ బ్రహ్మ ఎవరు? బ్రహ్మజ్ఞానం పొందితే మోక్షం వస్తుందంటే, అసలు ఆ బ్రహ్మ ఎవరు?

బి) **కథం తస్య వేదనమ్** – ఆ బ్రహ్మను ఎలా తెలుసుకోవాలి?

సి) **కా పరప్రాప్తిః** – మోక్షప్రాప్తి అంటే ఏమిటి?

మోక్షం అంటే ఏమిటో తెలియకపోతే, మోక్షంమీద మనకు శ్రద్ధ ఏర్పడదు. మోక్షం యొక్క గొప్పతనం తెలియకనే కదా, మానవాళి అంతా వేరే బాహ్యవస్తువుల వెంట పరుగులు తీస్తున్నారు. మోక్షాన్ని కోరేవారిని వేళ్ళమీద లెఖ్ఖ పెట్టవచ్చు; వారు కూడా మోక్షాన్ని ముఖ్య లక్ష్యంగా పెట్టుకోరు, వారికున్న అనేకానేక లక్ష్యాల్లో ఎక్కడో అట్టడుగున ఉంటుంది.

కొంతమంది భక్తులు, వారి భక్తిలో ఎంతగా రమిస్తారంటే, తమకు మోక్షం కూడా వద్దంటారు. 'ఓ దేవా! నాకు మోక్షం వద్దు. నీ చరణ కమలాల సన్నిధిలో నేనున్నచాలు,' అంటారు.

ఇప్పుడు ఈ మూడు ప్రశ్నలకు జవాబును వృత్తిభాగములో చూస్తాము.

**వృత్తిభాగము**

**తదేషాఽభ్యుక్తా। సత్యం జ్ఞానమనంతం బ్రహ్మ। యో వేద నిహితం గుహాయాం పరమే వ్యోమన్। సోఽశ్నుతే సర్వాన్ కామాన్సహ। బ్రహ్మణా విపశ్చితేతి।**

ఎ) **కిం తత్ బ్రహ్మ – సత్యం జ్ఞానమనంతం బ్రహ్మ**

ఆ బ్రహ్మ ఎవరు అనే మొదటి ప్రశ్నకు ఉపనిషత్తు ఒక్క వాక్యంలో జవాబు చెప్పింది. సత్యం, జ్ఞానం, అనంతం బ్రహ్మ అంది. దీన్ని లక్షణవాక్యం అంటారు. లక్షణం అంటే నిర్వచనం. ఈ వాక్యం అక్షరలక్షలు విలువ చేసే వాక్యం. బ్రహ్మయొక్క లక్షణవాక్యంగా చాలా ప్రసిద్ధి పొందింది.

బి) **కథం తస్య వేదనమ్ – యో వేద నిహితం గుహాయాం పరమే వ్యోమన్**

ఆ బ్రహ్మను ఎలా తెలుసుకోవాలనే రెండవ ప్రశ్నకు ఉపనిషత్తు ఈ విధంగా జవాబు చెప్పింది. బ్రహ్మను హృదయాకాశంలో తెలుసుకోవాలి. బాహ్యంగా వెతుకులాటలాపి అంతర్ముఖులమవ్వాలి.

**పరాంచి ఖాని వ్యతృణత్స్వయంభూః తస్మాత్పరాఙ్ పశ్యతి నాన్తరాత్మన్**
**కశ్చిద్ధీరః ప్రత్యగాత్మానమైక్షదావృత్త చక్షురమృతత్వమిచ్ఛన్ ॥** – కఠ 2. 1. 1

ఇంద్రియాలను భగవంతుడు బహిర్ముఖం చేయటంవల్ల అందరూ బాహ్య ప్రపంచాన్ని చూస్తున్నారు. ఎవరూ ఆత్మవైపు తిరగటం లేదు. అమృతత్వాన్ని కోరే ఎవరో వివేకవంతుడు మాత్రమే ఆత్మను చూస్తాడు.

సి) **కా పరప్రాప్తిః – సోఽశ్నుతే సర్వాన్ కామాన్సహ । బ్రహ్మణా విపశ్చితేతి ॥**

మోక్షప్రాప్తి అంటే ఏమిటి అనే మూడవ ప్రశ్నకు ఉపనిషత్తు ఈ విధంగా జవాబు చెప్పింది. మోక్షం అంటే అన్ని కోరికలూ ఒక్కసారే తీరుతాయి. బ్రహ్మజ్ఞాని వీటిని పొందుతాడు అంది.

**తదేషాభ్యుక్తా** – ఈ జవాబులను ఉపనిషత్తు ఒక ఋగ్వేదమంత్రాన్ని ఉటంకించటం ద్వారా ఇచ్చింది.

**ఇతి** – ఇక్కడితో ఋగ్మంత్రం అయిపోయిందని అర్థం.

## లక్షణవాక్య విశ్లేషణ – సత్యం జ్ఞానమనంతం బ్రహ్మ

శంకరాచార్యులవారు ఈ వాక్యానికి చేసిన భాష్యం చాలా విస్తారంగా, అద్భుతంగా ఉంటుంది. ఈ భాష్యానికి ఉపభాష్యాలు ఆనందగిరి, వనమాల, అచ్యుత, తీర్థంకర, సురేశ్వరాచార్యులు రచించారు. ఇక్కడ శంకరాచార్యులవారి భాష్యంలోని సారాంశాన్ని చూద్దాము.

### సత్యం జ్ఞానమనంతం బ్రహ్మ

**బ్రహ్మ** – ముందుగా బ్రహ్మ పదం అర్థం చూద్దాము. బ్రహ్మ అంటే చాలా పెద్దది. ఇది బృహ్ ధాతువునుంచి వచ్చింది.

**బృహత్తమత్వాద్ బ్రహ్మ** – పెద్దది అనే పదం విశేషణం. దానికి ఒక సాపేక్షిక అర్థం ఉంటుంది. మామూలుగా విశేషణం అంటే నామవాచకం గురించి తెలిపేది.

ఉదా: మంచి బాలుడు, ఎఱ్ఱగులాబి

కాని ఇక్కడ లోతుగా విశ్లేషిస్తే విశేషణం నామవాచకం గురించి ఎలా చెబుతుందో, అలా నామవాచకం కూడా విశేషణం యొక్క పరిధిని నిర్ణయిస్తుంది.

ఉదా: పెద్ద దోమ, పెద్ద కొండ

ఈ రెండు పదాలలోనూ ఉన్న విశేషణం ఒకటే. కాని పెద్దదోమ అంటే దాని పరిధి చాలా చిన్నది; పెద్ద కొండ అంటే దాని పరిధి చాలా పెద్దది. ఈ విధంగా రెండూ ఒకదాని గురించి ఇంకొకటి చెబుతాయి. ఇక్కడ బ్రహ్మ పెద్దది అన్నాము. బ్రహ్మను విశేషణంగా తీసుకుందామంటే దాని పక్కన ఇంకొక నామవాచకం లేదు. నామవాచకం ఉంటే, దాన్నిబట్టి బ్రహ్మ ఎంత పెద్దదో తెలుస్తుంది. కాని బ్రహ్మ ఒకటే పదం. అంటే బ్రహ్మ నామవాచకం. కాబట్టి బ్రహ్మను విశేషణంతో కొలవలేనంత పెద్దది అని అర్థం చేసుకోవాలి.

**సహస్రశీర్షా పురుషః సహస్రాక్షః సహస్రపాత్ ।**
**స భూమిం విశ్వతో వృత్వా అత్యతిష్ఠద్దశాంగులమ్ ॥**

భూమిని మొత్తం చుట్టినా, దానికన్నా పది అంగుళాలు ఎక్కువ ఉంది.

**అనంతమ్** – సత్యం, జ్ఞానం, అనంతం పదాలు బ్రహ్మకు నిర్వచనాలు. ముందు అనంతం పదం అర్థం చూద్దాము. అనంతం అంటే అన్–అంతమ్. అంతము లేనిది; పరిమితులు లేనిది. దేనికైనా పరిమితులు మూడు విధాలుగా ఉండవచ్చు. అవి దేశ పరిచ్ఛేదం, కాల పరిచ్ఛేదం, వస్తు పరిచ్ఛేదం.

### బ్రహ్మ దేశకాలవస్తు పరిచ్ఛేద రహితమ్

**దేశపరిచ్ఛేదం** – ఒక వస్తువు ఒకచోట ఉంది అంటే, అది ఇంకొకచోట లేదని అర్థం. నేను ఈ గదిలో ఉన్నాను అంటే, రోడ్డుమీద లేను అని అర్థం. ఒకచోట ఉన్నానని చెపితేనే, ఇంకోచోట లేనని చెప్పకనే చెప్పినట్టు అర్థం. కాని బ్రహ్మ సర్వవ్యాపకం. సర్వవ్యాపకమైన బ్రహ్మకు సరిహద్దులు లేవు.

**నిత్యస్సర్వగతః స్థాణుః అచలోఽయం సనాతనః** – గీత 2.24

ఒకచోటుకు మాత్రమే పరిమితమవలేదు. సర్వవ్యాపకం కాబట్టి బ్రహ్మ దేశపరిచ్ఛేద రహితం.

**కాలపరిచ్ఛేదం** – ఒక వస్తువు యొక్క జీవితం కొంతకాలం మాత్రమే ఉంటుంది. ప్రతి వ్యక్తీ ఒకరోజు పుడతాడు. అంటే పుట్టినరోజు ఉంటుంది. ఎప్పుడో ఒకప్పుడు మరణిస్తాడు. అప్పుడు వారు మరణించిన రోజు వేస్తారు. చిన్మయానంద స్వామీజీ ఈ విషయాన్ని అద్భుతంగా వర్ణిస్తారు.

ఫ్రమ్ ఊంబ్ టు టూంబ్ – గర్భంనుంచి కాటికి.

కాని బ్రహ్మకు చావు పుట్టుకలు లేవు.

**న జాయతే మ్రియతే వా కదాచిత్ నాయం భూత్వా భవితా వా న భూయః** – గీత 2.20

బ్రహ్మ శాశ్వతం కాబట్టి బ్రహ్మ కాలపరిచ్ఛేదరహితం.

**వస్తుపరిచ్ఛేదం** – బ్రహ్మను ఇంకొక వస్తువుతో పోల్చి బ్రహ్మకు పరిమితిని విధించలేము. ఇది చాలా సూక్ష్మమైన అంశము. క్లిప్ ఒక వస్తువు (ఆబ్జెక్ట్), గడియారం ఒక వస్తువు. క్లిప్ గడియారం కాదు; గడియారం క్లిప్ కాదు. అంటే క్లిప్‌కు క్లిప్ లక్షణాలే ఉన్నాయి, గడియారానికి గడియారం లక్షణాలు మాత్రమే ఉన్నాయి. ఒక వస్తువును క్లిప్ అన్నామంటేనే, దాన్ని తక్కిన వస్తువులు కాదని వాటినుంచి విడదీసి చెప్పకనే చెప్పినట్టయింది. అంటే ఒక వస్తువు క్లిప్ అయితే అది గడియారం కాదు, చెట్టు కాదు, మనిషి కాదు, కుర్చీ కాదు. అలా ఎన్నైనా చెప్పవచ్చు. క్లిప్–లక్షణం, గడియారం–లక్షణం అనే మాటల్లో లక్షణం వాటి పరిధిని తగ్గించివేస్తున్నది. దీన్ని వస్తుపరిచ్ఛేదం అంటారు. ఈ వస్తుపరిచ్ఛేదం ఇంకొక వస్తువు ఉంటేనే కుదురుతుంది. అంటే క్లిప్ కాని ఇంకొక వస్తువు ఉంటే క్లిప్ లక్షణాలు ఇవి, గడియారం లక్షణాలు ఇవి అని విడదీసి చెప్పవచ్చు. బ్రహ్మ విషయంలో

**ఏకమేవాద్వితీయమ్** – ఛాందోగ్యమ్

బ్రహ్మ కాకుండా, రెండవ వస్తువు లేదు. బ్రహ్మను అద్వయం బ్రహ్మ అంటారు. అద్వయం కాబట్టి బ్రహ్మ వస్తుపరిచ్ఛేదరహితం. ఇప్పుడు మూడూ కలిపి అనంతం అర్థం చూద్దాము.

అనంతమ్ = దేశకాలవస్తుపరిచ్ఛేద రహితమ్ బ్రహ్మ

**సత్యమ్** – సత్యమ్ పదంయొక్క అర్థాన్ని చూసేముందు అసలు 'పదం' అనే పదంయొక్క అర్థం చూద్దాము. ప్రతి పదం కూడా ఒక పదార్థాన్ని సూచిస్తుంది. పదార్థం అంటే వస్తువు లేదా ఆబ్జెక్టు. 'కుర్చీ' అనే పదం వాడగానే మీకొక కుర్చీ గుర్చుకు వస్తుంది; అలాగే 'చెట్టు' అనగానే మీకొక చెట్టు గుర్తుకు వస్తుంది. ఆ విధంగా పదానికి–పదార్థానికి మధ్య అవినాభావ సంబంధం ఉంది. వేదాలు అనేక పదాలను వాడతాయి కాబట్టి, ఆ పదాలయొక్క అర్థాన్ని విశ్లేషించటం చాలా అవసరం.

ప్రతి పదానికీ కూడా ఒక ముఖ్యార్థం, అనేక లక్ష్యార్థాలు ఉంటాయి. ముఖ్యార్థం అంటే దాని ప్రాథమిక అర్థం; అందరికీ విరివిగా తెలిసిన అర్థం. అలాగే ప్రతి పదానికీ కూడా అనేక లక్ష్యార్థాలు ఉండవచ్చు. సందర్భాన్నిబట్టి ఆ రెండవ అర్థాన్ని అర్థం చేసుకుంటాము. ఈ లక్ష్యార్థాల్లో మళ్ళీ కొన్ని రకాలున్నాయి. అవి –

**జహల్లక్షణం** – ఒక పదానికి సాధారణంగా వాడే అర్థం సందర్భోచితంగా లేనప్పుడు, మామూలు అర్థం వదిలివేసి, ఏ లక్ష్యంతో ఆ పదం వాడబడిందో తెలుసుకుని ఆ అర్థం గ్రహిస్తారు. దీనిని **జహల్లక్షణం** అంటారు.

ఉదాహరణ: భారత్, అమెరికాలు వాణిజ్య ఒప్పందం కుదుర్చుకున్నాయి అని వాక్యం ఉంటే ఆసేతుహిమాచలం వరకు ఉన్న భారత్ భూభాగం, అనేక రాష్ట్రాల సంయుక్త అమెరికా భూభాగం ఒప్పందం కుదుర్చుకున్నాయి అని కాదు. అయితే ఇది ప్రధాన అర్థం. దీనిని త్రోసిపుచ్చి ఆ దేశాల నేతల మధ్య ఒప్పందం అయ్యిందని అర్థం చేసుకోవాలి.

**అజహల్లక్షణం** – సాధారణ అర్థం పూర్తి అవగాహన నివ్వనప్పుడు దానికి సంబంధించిన మరొక అర్థం కూడా కలుపుకుని, పదం అర్థం స్వీకరించడం. ఉదాహరణతో బాగా అర్థమౌతుంది.

ఉదాహరణ: ఒక కారు రేసు జరుగుతోంది. అప్పుడే వచ్చిన ఆసామి ఏది నెగ్గుతోంది అన్నాడు. దానికి సమాధానంగా మీరు ఎర్రది నెగ్గుతోంది అన్నారు. ఎర్ర రంగు రేసులో పాల్గోలేదు కదా! దీనికి ఎర్ర = ఎర్ర + కారు అంటే ఎర్రకారు నెగ్గుతోంది అని తీసుకుంటాము. కారు అనే పదాన్ని అక్కడ ఉన్న పదానికి అదనంగా కలిపితేనే అర్థం సరిపోతుంది. దీన్ని **అజహల్లక్షణం** అంటారు.

**జహదజహల్లక్షణం** – ఒక పదం వాడినప్పుడు అందులో ఒక భాగాన్ని వదలి మరొక భాగాన్ని మాత్రం స్వీకరించటాన్ని **జహదజహల్లక్షణం** అంటారు.

ఉదాహరణ: మామిడి పండు కొన్నాను. మామిడి పండు తిన్నాను. ఈ రెండు వాక్యాలు పరిశీలిద్దాము. మామిడిపండు కొన్నాను. అంటే మామిడిపండు మొత్తము (మామిడి పండు= తోలు + గుజ్జు + టెంక) కొన్నాను అని అర్థం. దీనిని ముఖ్య అర్థం అంటారు. మామిడి పండు తిన్నాను. అంటే తోలు, టెంక వదలి కేవలం గుజ్జు మాత్రమే తిన్నాను అని అర్థం. ఇది జహదజహల్లక్షణంకి ఉదాహరణ.

అలాగే గంగానది అంటే గోముఖ్‌నుంచి కొల్‌కత్తా గంగాసాగర్‌వరకు గంగానదే. ఇది గంగానది ముఖ్య అర్థము. కాని గంగానదీ స్నానం చేసాను అంటే గోముఖ్ మొదలుకొని కొల్‌కత్తా గంగాసాగర్ వరకు స్నానం చేశానని కాదు. ఏదో ఒక రేవులో, అదీ ఒకచోట మాత్రమే స్నానం చేశానని. అంటే ముఖ్య అర్థం తీసుకోకుండా జహదజహల్లక్షణం ద్వారా అర్థము చేసుకున్నాం. దీన్నే భాగత్యాగలక్షణం అని కూడా అంటారు.

ఇప్పుడొక అభ్యాసం చేద్దాం **తత్ త్వమ్ అసి** అనే మహావాక్యాన్ని పరిశీలిద్దాం. తత్ = పరమాత్ముడు; త్వం = నువ్వు (జీవుడు) ఈ రెంటికీ చాలా వ్యత్యాసాలున్నాయి. ఈ రెండింటికీ దోమకు, ఏనుగుకు ఉన్నంత భేదం ఉంది.

పరమాత్ముడు సర్వజ్ఞుడు, సర్వవ్యాపి, సర్వశక్తిమంతుడు.

జీవుడు సర్వజ్ఞుడు కాదు, సర్వవ్యాపి కాదు, సర్వశక్తిమంతుడు కాదు.

కాబట్టి ఇక్కడ ముఖ్య వృత్తి కుదరదు. ఇక లక్షణ వృత్తులలో ఏది సరిపోతుందో చూడాలి.

| **పరమాత్ముడు** | | **జీవుడు** |
|---|---|---|
| స్థూలప్రపంచం | (విరాట్) | స్థూలశరీరం (విశ్వ) |
| సూక్ష్మప్రపంచం | (హిరణ్య గర్భ) | సూక్ష్మశరీరం (తైజస) |
| కారణప్రపంచం | (ఈశ్వర) | కారణశరీరం (ప్రాజ్ఞ) |
| ప్రతిబింబచైతన్యం | (సమష్టి అహంకారం) | ప్రతిబింబచైతన్యం (వ్యష్టి అహంకారం) |
| బింబచైతన్యం | | బింబచైతన్యం |

జహల్లక్షణంలో ముఖ్య అర్థాలు కాకుండా లక్ష్యార్థం తీసుకోవాలి. అలా పరమాత్మ 5 అంశాలు, జీవుని 5 అంశాలు తీసేస్తే చైతన్యం కూడా ఉండదు. కాబట్టి ఇక్కడ జహల్లక్షణం తీసుకోకూడదు.

అజహల్లక్షణంలో జీవునిలోనూ, పరమాత్మునిలోనూ అన్ని అంశాలూ తీసుకుని ఇంకా అదనంగా మరో అర్థం కూడా జోడించాలి. జీవునిలోనూ, పరమాత్మునిలోనూ మొదటి నాలుగు అంశాలు పరస్పర విరుద్ధమైనవి. కాబట్టి అజహల్లక్షణం కూడా కుదరదు.

ఇక **జహదజహల్లక్షణం** తీసుకుంటే విరుద్ధంగా ఉన్న మొదటి నాలుగు అంశాలు వదలి వేస్తే, పరమాత్మలోని బింబచైతన్యం, జీవుని బింబచైతన్యం ఒకటే అని తేలింది. అదే **తత్ త్వమ్ అసి** మహావాక్యం. దీనిని **బాధాయాం సామానాధికరణ్యం** అంటారు. విరుద్ధమైన, మిథ్యాభూతమైన నామరూపాలు త్రోసి పుచ్చితే, ఉన్నదంతా చైతన్యమే. **తత్ త్వమ్ అసి.**

**ఇది మనకు తెలియకుండానే మన దైనందిన జీవితంలో ఉపయోగిస్తాము. ఈ జహదజహల్లక్షణం ఉపయోగించి సత్యం, జ్ఞానం అంటే ఏమిటో తెలుసుకుందాము. అలా ఇక్కడున్నదంతా బ్రహ్మ ఎలా అయిందో కూడా చూద్దాము.**

**సత్యమ్** – సత్యం వాచ్యార్థం ఉనికి ఉన్న ఏ వస్తువైనా – ఉదా: గడియారం, పుస్తకం, కుర్చీ, మొత్తం జాగ్రద్ ప్రపంచం. సత్యంయొక్క ఈ అర్థాన్ని బ్రహ్మకు అన్వయిస్తే, ఉనికి ఉన్న ప్రతి వస్తువూ బ్రహ్మ అవ్వాలి. కాని ఉనికి ఉన్న వస్తువు కాలతః దేశతః వస్తుతః పరిమితమైనది. ఇప్పుడే బ్రహ్మ అంటే అనంతం బ్రహ్మ అనీ, అనంతం బ్రహ్మకు దేశ, కాల, వస్తు పరిమితి లేదనీ నిరూపించాము. అందువల్ల ఇక్కడ భాగత్యాగలక్షణం ఉపయోగించి, అవసరమైన అర్థమే తీసుకోవాలి.

ఇప్పుడు వస్తువుని తీసుకుంటే ఏ వస్తువుకైనా మూడు భాగాలుంటాయి – నామం, రూపం, ఉనికి (సత్తా).

ఉనికి ఉన్న పుస్తకం – పుస్తకం నామం, పుస్తకం రూపం, ఉనికి.
ఉనికి ఉన్న బల్ల – బల్ల నామం, బల్ల రూపం, ఉనికి.

పుస్తకం నామం వేరూ, బల్ల నామం వేరు. పుస్తకం రూపం వేరూ, బల్ల రూపం వేరు. రెండింటిలోనూ సమానంగా ఉన్నది ఏది? ఉనికి లేదా సత్తా. పుస్తకం ఉనికి. కలం ఉనికి, నక్షత్రాల ఉనికి. అలా అన్నింటిలోనూ ఉనికి సమానంగా ఉంది.

టూకీగా చెప్పాలంటే – సత్యంయొక్క వాచ్యార్థం ఉనికి ఉన్న వస్తువు.
– సత్యంయొక్క లక్ష్యార్థం వస్తువుయొక్క ఉనికి.

అందువల్ల సత్యం అంటే నామ, రూప రహిత సత్ (సత్తా).

నామరూపాలను భాగత్యాగం చేశాము. సత్ (సత్తా)ని చేయకూడదు. ఇది సత్యంయొక్క లక్ష్యార్థం.

సత్తా లేదా సత్ అనంతం. చైతన్యానికి చూసిన ఐదు లక్షణాలను ఉనికికి కూడా చూస్తాము. కాకపోతే ఇక్కడ సత్ పరంగా చూస్తాము.

1. సత్, ఒక వస్తువులో ఒక భాగం కానీ, లక్షణం కానీ, దాన్నుంచి ఉత్పత్తి కానీ చెందినది కానీ కాదు.

2. సత్, స్వతంత్రం. అది వస్తువు అంతటా వ్యాపించి, దాన్ని ప్రకాశింపజేస్తుంది.
3. సత్, వస్తువుయొక్క సరిహద్దులకే పరిమితమవలేదు.
4. సత్, వస్తువు నాశనమయితే నాశనమవదు. వస్తువు పతనానంతరం కూడా సత్ ఉంటుంది.
5. సత్, వస్తువు లేకపోయినా ఉంటుంది కాని తెలియదు. దాన్ని ప్రతిబింబింపజేసే మాధ్యమం లేదు కాబట్టి అది తెలియదు. అంతమాత్రాన సత్ లేనట్టు కాదు.

ఈ విషయాన్ని చెయ్యి–కాంతి ఉదాహరణతో చూడవచ్చు. చెయ్యి తీసేసినా కాంతి ఉంటుంది కాని, కాంతిని ప్రకటింపజేసే మాధ్యమం లేదు కాబట్టి అది తెలియదు. అంతమాత్రాన కాంతి లేనట్టు కాదు.

అందువల్ల సత్యం అంటే శుద్ధసత్, స్వతంత్రసత్, దేశకాలవస్తుపరిచ్ఛేదరహిత సత్. ఒక్కముక్కలో చెప్పాలంటే **సత్యం = అనంత సత్తా.**

బ్రహ్మ విషయంలో చూసినట్టే ఇక్కడ సత్యం విషయంలో కూడా వస్తుంది. అక్కడ ఎలాగైతే బ్రహ్మ విశేషణం కాదు, నామవాచకం అన్నామో, అలాగే ఇక్కడకూడా సత్యం విశేషణం కాదు నామవాచకం.

**అనంతం సత్యం బ్రహ్మ = దేశకాలవస్తుపరిచ్ఛేదరహిత సత్తా**

ఇదే సారాన్ని దక్షిణామూర్తి స్తోత్రంలో చూస్తాము

**యస్యైవ స్ఫురణం సదాత్మకమసత్కల్పార్థకం భాసతే।**

ఈ విధంగా బ్రహ్మ అనుభవం ఎప్పుడూ పొందుతూనే ఉంటాము. ఉనికి ఉన్న ప్రతి వస్తువులోనూ ఉనికిగా బ్రహ్మ ఉన్నాడు. ఉనికికి ఉదాహరణగా మొత్తం జగత్తును చెప్పవచ్చని చూశాము. అంటే జగత్తంతటా ఉనికి (సత్) రూపంలో బ్రహ్మ ఉన్నాడు. ఇలా ఉనికిని నామవాచకంగా అర్థం చేసుకోవటానికి వేదాంతాన్ని కొన్ని సంవత్సరాల పాటు విని జీర్ణించుకోవాలి.

**జ్ఞానమ్** – జ్ఞానం అంటే ఎఱుక. మనం అనేక వస్తువుల గురించిన ఎఱుకను పొందుతాము. కుండ ఎఱుక, బల్ల ఎఱుక, మనిషి ఎఱుక. ఈ ఎఱుక దేని గురించి? ఏదైనా వస్తువు గురించి. ఎఱుక ఎలా ఏర్పడుతుంది? ఆలోచన ద్వారా. దీన్ని వృత్తిజ్ఞానం అంటారు. ఒక కుండను చూస్తే, నాకు కుండ వృత్తి ఏర్పడుతుంది; తద్వారా కుండ జ్ఞానం కలుగుతుంది. అంటే నేను ఒక కుండను చూసినప్పుడు, దాని ఎఱుక నా కళ్ళద్వారా నా మనస్సులోకి వెళుతుంది.

కాని ఈ ఎఱుకకు దేశకాలవస్తు పరిమితులు ఉన్నాయి. కుండ ఎఱుక ఉంటే, మనిషి ఎఱుక లేదు; అంటే వస్తుపరిమితి ఉంది. ఒక ఎఱుక వస్తే, ఇంకొక ఎఱుక పోతున్నది; అంటే కాలపరిమితి ఉంది. ఒక వ్యక్తి నేర్చుకుంటే, ఆ ఎఱుక అతనికి మాత్రమే ఉంటుంది; ఇంకొకరికి ఉండదు; అంటే దేశపరిమితి ఉంది. ఒకరు నేర్చుకుంటే అందరికీ వస్తుంది అంటే ఒక కుటుంబంలో అందరూ కష్టపడి నేర్చుకోనవసరం లేదు.

ఇంతకుముందే బ్రహ్మ గురించి ఏమన్నాము? అనంతం సత్యం బ్రహ్మ అన్నాము. అంటే దేశకాలవస్తుపరిచ్ఛేదరహిత సత్తా అన్నాము. అందువల్ల ఇక్కడ ముఖ్యార్థము కుదరదు. భాగత్యాగలక్షణం తీసుకోవాలి. కాని భాగత్యాగలక్షణం తీసుకునేముందు జ్ఞానానికి ఉన్న అంశాలేమిటో చూద్దాము.

జ్ఞానానికి కూడా మూడు అంశాలు ఉన్నాయి. అవి నామం, రూపం, ఎఱుక (చిత్).

ఎఱుక ఉన్న పుస్తకం – పుస్తకం నామం, రూపం, ఎఱుక

ఎఱుక ఉన్న బల్ల – బల్ల నామం, రూపం, ఎఱుక

పుస్తకం నామం వేరు, బల్ల నామం వేరు. పుస్తకం రూపం వేరు, బల్ల రూపం వేరు. రెండింటిలోనూ సమానంగా ఉన్నది ఏమిటి? ఎఱుక లేదా చైతన్యం. దాన్నే చిత్ అనికూడా అంటారు. పుస్తకం ఎఱుక, బల్ల ఎఱుక, నక్షత్రాల ఎఱుక; అలా అన్నింటిలోనూ ఎఱుక సమానంగా ఉంది. అంటే వాటి గురించి నాకు ఎఱుక ఉంది అంటే నాకు చైతన్యం ఉందని అర్థం. వస్తువు వృత్తి వస్తుంది; చిత్ ఉంటుంది; వస్తువు వృత్తి పోతుంది; చిత్ ఉంటుంది; అనేక వృత్తులు వస్తూ, పోతూ ఉంటాయి కాని ప్రతి ఆలోచన వెనుక చిత్ మాత్రం అనంతంగా ఉంటూనే ఉంటుంది.

టూకీగా చెప్పాలంటే – జ్ఞానంయొక్క వాచ్యార్థం ఎఱుక ఉన్న వస్తువు
జ్ఞానంయొక్క లక్ష్యార్థం వస్తువుయొక్క ఎఱుక

అందువల్ల జ్ఞానం అంటే నామరూప రహిత చిత్ (చైతన్యం).

నామరూపాలను భాగత్యాగం చేశాము. చిత్‌ను ఉంచాము. చిత్ లేదా చైతన్యం అనంతం. సత్‌కు చూసిన ఐదు లక్షణాలను ఇప్పుడు మళ్ళీ చిత్‌కు (చైతన్యానికి) చూస్తాము. కాకపోతే ఇప్పుడు చైతన్యపరంగా చూస్తాము.

1. చైతన్యం, ఒక వస్తువులో ఒక భాగం కానీ, లక్షణం కానీ, దాన్నుంచి ఉత్పత్తి కానీ చెందినది కానీ కాదు.
2. చైతన్యం స్వతంత్రం. అది వస్తువు అంతటా వ్యాపించి, దాన్ని ప్రకాశింపజేస్తుంది.
3. చైతన్యం, వస్తువుయొక్క సరిహద్దులకే పరిమితమవలేదు.
4. చైతన్యం, వస్తువు నాశనమయితే నాశనమవదు. వస్తువు పతనానంతరం కూడా చైతన్యం ఉంటుంది.

5. చైతన్యం, వస్తువు లేకపోయినా ఉంటుంది కాని తెలియదు. దాన్ని ప్రతిబింబింపజేసే మాధ్యమం లేదు కాబట్టి అది తెలియదు. అంతమాత్రాన చైతన్యం లేనట్టు కాదు.

అందువల్ల జ్ఞానం అంటే శుద్ధ చిత్, స్వతంత్ర చిత్, దేశకాలవస్తుపరిచ్ఛేదరహిత చిత్.

**జ్ఞానమ్ = అనంత చిత్**

బ్రహ్మ విషయంలో చూసినట్టే, ఇక్కడ జ్ఞానం విషయంలో కూడా వస్తుంది. అక్కడ ఎలాగైతే బ్రహ్మ విశేషణం కాదు, నామవాచకం అన్నామో అలాగే ఇక్కడ కూడా జ్ఞానం విశేషణం కాదు నామవాచకం.

**అనంతం సత్యం జ్ఞానం బ్రహ్మ = దేశకాలవస్తుపరిచ్ఛేద రహిత శుద్ధసత్ శుద్ధచిత్**

టూకీగా చెప్పాలంటే –

అనంతం – దేశకాలవస్తుపరిచ్ఛేద రహితం

సత్యం – నామరూపరహిత సత్, శుద్ధసత్

జ్ఞానం – నామరూపరహిత చిత్, శుద్ధచిత్

బ్రహ్మ – దేశకాలవస్తుపరిచ్ఛేదరహిత, శుద్ధసత్, శుద్ధచిత్

**సత్యం జ్ఞానమ్ అనంతం బ్రహ్మ – సత్ చిత్ ఆనందం బ్రహ్మ.**

ఇక్కడితో సత్యం జ్ఞానమనంతం బ్రహ్మ విశ్లేషణ అయిపోయింది.

బి) **కథం తస్య వేదనమ్ – యో వేద నిహితం గుహాయాం పరమే వ్యోమన్**

బ్రహ్మ అనంతం, సర్వవ్యాపకం. అంతటా శుద్ధసత్‌గా ఉన్న బ్రహ్మను, మనస్సులో శుద్ధచిత్‌గా తెలుసుకోవాలి. ఎవరి మనస్సులో? నా మనస్సులో ఉన్నదే నాకు తెలుస్తుంది; ఇంకొకరి మనస్సులోది కాదు. అందువల్ల,

**గుహాయాం నిహితం బ్రహ్మ వేద** – గుహ అంటే మనస్సు; నిహితం అంటే అందులో ఉన్నాడు. బ్రహ్మ మన మనస్సులో ఉన్నట్టుగా తెలుసుకోవాలి. ఈ మనస్సు ఎక్కడ ఉంది? శాస్త్రం ప్రకారం సూక్ష్మశరీరలో ఉన్న మన మనస్సు స్థూలశరీరంలో ఉన్న హృదయంలో ఉంది. **హృదయే మనః వర్తతే.**

**పరమే వ్యోమన్** – వ్యోమన్ అంటే ఆకాశం; పరమే అంటే పవిత్రమైన హృదయం. మనస్సు హృదయాకాశంలో ఉంది. బ్రహ్మ మనస్సులో ఉన్నాడు. హృదయంలో బ్రహ్మ కొలువైవున్నాడు కాబట్టి హృదయం పవిత్రమైన గర్భగుడి అయింది. ఒక ఆలయానికి పవిత్రత అందులో నెలకొనివున్న భగవంతునివల్ల చేకూరుతుంది. అలాగే హృదయాకాశంలో ఉన్న మనస్సులో బ్రహ్మ ఉండటంవల్ల హృదయానికి ఆ పవిత్రత చేకూరుతుంది.

మనస్సులో ఉన్న ఆ బ్రహ్మను తెలుసుకోవటం ఎలా? చాలామంది ఈ బ్రహ్మానుభవం పొందటం కోసం ధ్యానంలో చాలాసేపు కూర్చుంటారు. మనస్సు శూన్యంగా చేస్తారు అంటే ఆలోచనలు లేకుండా చేస్తారు. అలా శూన్యంగా ఉన్న మనస్సులో బ్రహ్మదర్శనం అవాలని ఎదురుచూస్తారు కాని ఉపనిషత్తు బ్రహ్మదర్శనం ఎన్నడూ అవదు అంటుంది. ఎందుకు? బ్రహ్మ బాహ్యవస్తువు అయితేకదా! బ్రహ్మ ఆబ్జెక్టు కాదు సబ్జెక్టు.

**ఎవర్ ది ఎక్స్‌పీరియన్సర్, నెవర్ ది ఎక్స్‌పీరియన్స్‌డ్**
**అనుభవిస్తున్న నేనే ఎప్పటికీ అది, అనుభవించబడే వస్తువు ఎన్నటికీ కాదు**

అందువల్ల ఆబ్జెక్టుగా కనిపిస్తున్న ప్రతిదాన్ని ఇదికాదు, ఇదికాదు అంటూ త్రోసిపుచ్చుతూ రండి. పైగా ఆబ్జెక్టుకు దేశకాలవస్తు పరిమితులు ఉన్నాయి, బ్రహ్మకు లేవని ఇప్పుడే చూశాము. ఈ సూత్రం ప్రకారం బాహ్యవస్తువులు బ్రహ్మ కాదు, మీ శరీరం బ్రహ్మ కాదు, మీ ఇంద్రియాలు బ్రహ్మ కాదు, మీ మనస్సు బ్రహ్మ కాదు. మనస్సులో ఆలోచనలు వస్తున్నాయనీ, పోతున్నాయనీ తెలుస్తోందంటే అది ఆబ్జెక్టు. దాన్ని ఆబ్జెక్టుగా చూసేది ఇంకొకటి ఉంది. కాని మనం చేసే పొరపాటు ఏమిటి? మనస్సును కూడా ఇదికాదు అన్నాక, ఆబ్జెక్టుగా బ్రహ్మ మిగలాలి అనుకుంటాము. కాని అన్నింటినీ త్రోసిపుచ్చాక, మిగిలేది అనుభవిస్తున్న నేనే; అనుభవించబడుతున్న వస్తువులు కాదు. నిజానికి మనస్సు శూన్యం అయిందనటానికి లేదు; ఎందుకంటే ఆ శూన్యాన్ని చూస్తున్నది – నేనే, అంటే చైతన్యాన్ని.

ఆ విధంగా ఈ సత్యం జ్ఞానమ్ అనంతం బ్రహ్మ, చైతన్యమైన నేను.

సి) **కా పరప్రాప్తిః – సోఽశ్నుతే సర్వాన్ కామాన్సహ । బ్రహ్మణా విపశ్చితేతి ॥**

**సః** – సః అంటే బ్రహ్మజ్ఞాని. బ్రహ్మజ్ఞాని అంటే బ్రహ్మను తెలుసుకున్న వ్యక్తి. తనే బ్రహ్మగా తెలుసుకున్న వ్యక్తి.

**అహం బ్రహ్మ అస్మి ఇతి జానాతి**

**సర్వాన్ కామాన్ సహ అశ్నుతే** – కామః అంటే ఇక్కడ విషయానందం లేదా అనాత్మ సుఖం. బ్రహ్మజ్ఞాని అన్ని సుఖాలనూ ఒక్కసారిగా పొందుతాడు.

ఒక విషయవస్తువును చూసినప్పుడు, దాని సుఖాన్ని మనం అనుభవిస్తాము. ఒక రుచికరమైన ఆహారాన్ని తిన్నా, మంచి సంగీతాన్ని విన్నా, అద్భుతమైన వస్తువును చూసినా, మనకు ఆనందం కలుగుతుంది. దీన్ని విషయానందం అంటారు. దీన్నే ఇక్కడ కామః అంది ఉపనిషత్తు.

సర్వాన్ కామాన్ – బ్రహ్మజ్ఞాని అన్ని ఆనందాలనూ పొందుతాడు అంటున్నది. ఇది నమ్మలేని వాక్యంగా అనిపిస్తుంది ముందు. శబ్ద, స్పర్శ, రూప, రస, గంధాల ఆనందాలను

ఒక్కసారిగా అనుభవించలేము. అన్నీ ఒక్కసారి అందుబాటులో ఉండవు. ఒకవేళ ఉన్నా, భిన్న ఆనందాలను ఒక్కసారి అనుభవించలేము. ఇన్ని ఆనందాలను అనుభవించటానికి నిజానికి ఒక జీవితకాలం సరిపోదు.

సహ – ఇంకొక పిడుగులాంటి వార్త వేస్తున్నది ఉపనిషత్తు. సహ అంటే ఒక్కసారే; ఒకదాని తర్వాత ఒకటి కాదు. బ్రహ్మజ్ఞాని అన్ని ఆనందాలనీ ఒక్కసారే పొందుతాడు అంటున్నది; అది కూడా క్రమంగా కాదు అంటున్నది. అదెలా సాధ్యం?

**బ్రహ్మణా** – అదెలా సాధ్యమో ఉపనిషత్తే చెబుతున్నది. అన్ని ఆనందాలనూ ఒక్కసారిగా బ్రహ్మానందంగా పొందుతాడు బ్రహ్మజ్ఞాని.

**బ్రహ్మానందరూపేణ సర్వాన్ విషయానందాన్ ప్రాప్నోతి**

బ్రహ్మానందం అంటే పూర్ణానందం. ఆ విధంగా పరిమితి ఉన్న లౌకిక సుఖాలన్నీ అనంతమైన ఆనందంలో పొందుతాడు. బ్రహ్మజ్ఞానంద్వారా అతను బ్రహ్మానందాన్ని పొందుతాడు అంటే ఆత్మానందాన్ని పొందుతాడు. ఆత్మానందంలోనే అన్ని విషయానందాలు వస్తాయి. విషయానందం అంటే ఏమిటి? అది ప్రతిబింబానందం. బింబానందమే ప్రతిబింబానందంగా ఏర్పడుతుంది. బ్రహ్మజ్ఞాని అసలైన బింబానందాన్నే పొందాక, ఈ అశాశ్వతమైన ప్రతిబింబానందాన్ని ఇంకెందుకు కోరుకుంటాడు? అందువల్ల అన్ని కోరికలూ ఒక్కసారి తీరుతాయి అంటే అర్థం, అతనికి ఈ విషయానందాలమీద ఉన్న మోజు ఒక్కసారిగా పోతుంది. ఈ విషయాన్నే కృష్ణపరమాత్మ అద్భుతంగా చెప్పాడు గీతలో.

**యావానర్థ ఉదపానే సర్వతః సంప్లుతోదకే ।**
**తావాన్ సర్వేషు వేదేషు బ్రాహ్మణస్య విజానతః ॥** – గీత 2.46

మంచినీటితో నిండివున్న పెద్ద నది దొరికినతను చిన్నచిన్న కొలనులకు నీటికోసం ఎందుకు వెళతాడు?

బ్రహ్మానందం పొందినంత మాత్రాన విషయానందాన్ని పొందుతాడని ఖచ్చితంగా ఎలా చెప్పగలరు? ఈ సర్వాన్ కామాన్ పదాన్నే తీసుకుని కృష్ణపరమాత్మే ఈ పదానికి అర్థాన్ని ఇచ్చాడు.

**శ్రీభగవాన్ ఉవాచ**
**ప్రజహాతి యదా కామాన్ సర్వాన్ పార్థ మనోగతాన్ ।**
**ఆత్మన్యేవాత్మనా తుష్టః స్థితప్రజ్ఞస్తదోచ్యతే ॥** – గీత 2.55

ఆత్మజ్ఞానం పొందిన వ్యక్తి ఆత్మలోనే రమిస్తాడు; కోరికలన్నిటినీ త్యజిస్తాడు.

ఆ విధంగా ఈ తృప్తి తక్కిన తృప్తులన్నింటినీ కలిగిస్తుంది.

**సంపూర్ణః భవతి, తృప్తః భవతి, సంతుష్టః భవతి.**

ఈ పూర్ణత్వమే పరమం ప్రాప్తి.

**బ్రాహ్మణా విపశ్చిత** – విపశ్చిత అంటే సర్వప్రకాశకమైన చైతన్యం. ఈ చైతన్యం మొత్తం జగత్తును ప్రకాశవంతం చేస్తుంది. ఈ సర్వప్రకాశకమైన చైతన్యం జ్ఞానం ద్వారా బ్రహ్మానందం పొంది, సర్వకామ నివృత్తి కలుగుతుంది. ఇదే భావనను మళ్ళీ వివరంగా వ్యాఖ్యానంగా చూస్తాము.

**ఇతి** – ఇక్కడితో ఋగ్వేదమంత్రం అయిపోయింది. కాని మళ్ళీ ఈ మూడు ప్రశ్నలకు జవాబులను వ్యాఖ్యానంలో చూస్తాము.

**విశ్లేషణలు**

1. **తదేషా భ్యుక్తా** – ఇది సూత్రవాక్యమూ కాదు, వృత్తి వాక్యమూ కాదు. ఇది వృత్తికి ఉపోద్ఘాతం. సూత్రవాక్యానికి వృత్తివాక్యంగా ఋగ్మంత్రాన్ని చెప్పబోతున్నాను అని ఉపనిషత్తు చెబుతున్నది.

2. **సాక్షిః** – ఆలోచనలు ఉన్న, ఆలోచనలు లేని మనస్సును సాక్షిగా చూసేదాన్ని సాక్షి చైతన్యం అంటారు. వృత్తిభావ అభావసాక్షి. ఈ సాక్షిని మన మనస్సులో ఉన్న బ్రహ్మగా తెలుసుకోవాలి. ఈ సాక్షి ఆబ్జెక్టు కాదు, సబ్జెక్టు అయిన నేనే.

**సాక్షి చైతన్య రూప అహమేవ బ్రహ్మ అస్మి**

3. **బ్రహ్మానందం** – పీకలదాకా తిన్న వ్యక్తిని ఇంకేదైనా తినమంటే ఇంకేం వద్దు అంటాడు. అంటే అతను ఎంత తిన్నాడో తెలియకపోయినా, ఆహారాన్ని చూస్తే అతనికి కలిగిన వైరాగ్యం చెప్పకనే చెబుతున్నది. అదే విధంగా బ్రహ్మానందం పొందిన వ్యక్తికి విషయానందం చాలా చిన్నదిగా కనిపిస్తుంది.

### 3. వ్యాఖ్యానభాగము – అనువాకాలు 1–5,8

ఇప్పుడు వ్యాఖ్యానం చూడబోతున్నాము. ముందు చూసిన మూడు ప్రశ్నలకు మళ్ళీ చాలా వివరంగా జవాబులు వస్తాయి.

ఎ) **కిం తత్ బ్రహ్మ? ఆ బ్రహ్మ ఎవరు?**

**వృత్తిభాగము పరంగా జవాబు – సత్యం జ్ఞానమనంతం బ్రహ్మ – దేశకాలవస్తుపరిచ్ఛేదరహిత శుద్ధసత్ శుద్ధచిత్ – సత్ చిత్ ఆనందం బ్రహ్మ.**

**వ్యాఖ్యానభాగపరంగా జవాబు – సృష్టిప్రకరణం– అనువాకం 1**

ఈ నిర్వచనాన్ని సృష్టిప్రకరణంద్వారా మరింత వివరంగా చెప్పుకొస్తుంది ఉపనిషత్తు. కాని సృష్టిప్రకరణంలోకి వెళ్ళేముందు కొన్ని సాంకేతిక పదాల నిర్వచనాలను, వాటి వివరణను చూద్దాము.

బ్రహ్మ లక్షణాన్ని నిర్వచించేటప్పుడు రెండు రకాలుగా చెప్పవచ్చు. అవి స్వరూప లక్షణం, తటస్థ లక్షణం.

**స్వరూప లక్షణం** – ఒక వస్తువును దాని స్వాభావిక గుణాన్నిబట్టి వర్ణిస్తే దాన్ని స్వరూప లక్షణం అంటారు. ఇది ప్రత్యక్ష లక్షణం.

**లౌకిక ఉదాహరణ – ప్రకృష్ట ప్రకాశః చంద్రః**

రాత్రి ఆకాశంలో దేదీప్యమానంగా వెలిగిపోతున్న వస్తువు చందమామ. నక్షత్రాలు కూడా మెరుస్తున్నా, చంద్రుడు ఇంకా ప్రకాశవంతంగా ఉంటాడు. ఇక్కడ విజ్ఞాన శాస్త్రాన్ని తీసుకురాకూడదు. చంద్రుని కాంతి స్వంతకాంతి కాదని అది చెబుతుంది. మనకు చంద్రుడనగానే గుర్తుకువచ్చేది పున్నమిరాత్రినాటి నిండువెన్నెల.

**శాస్త్రీయ ఉదాహరణ – సత్యం జ్ఞానమనంతం బ్రహ్మ**

**తటస్థ లక్షణం** – ఒక వస్తువును దాని ఆగంతుక గుణంద్వారా వర్ణిస్తే దాన్ని తటస్థ లక్షణం అంటారు. ఇది పరోక్ష లక్షణం. తటస్థంలో రెండు పదాలు ఉన్నాయి. తట+స్థః – అంటే నది ఒడ్డున ఉండే వస్తువు. అది నదిలో భాగం కాదు.

దేవదత్తుని ఇల్లు ఎక్కడ అంటే కాకి వాలిన ఇల్లు అని చెబితే అది తటస్థ లక్షణం.

**లౌకిక ఉదాహరణ – కాకవత్ గృహం దేవదత్త గృహమ్**

**శాస్త్రీయ ఉదాహరణ – జగత్కారణం బ్రహ్మ**

కారణం వస్తే మళ్ళీ అందులో రెండు పదాలు వస్తాయి. నిమిత్త కారణం, ఉపాదాన కారణం.

**నిమిత్త కారణం** – ఏదైనా వస్తువును తయారుచేసే వ్యక్తి నిమిత్త కారణం. కుండకు నిమిత్త కారణం కుమ్మరి. దీన్ని ఇంగ్లీషులో ఇంటిలిజెంట్ కాజ్ అంటారు.

**ఉపాదాన కారణం** – ఏదైనా వస్తువును తయారుచేయటానికి వాడే ముడిపదార్థం ఉపాదాన కారణం. ఒక కుండకు ఉపాదాన కారణం మట్టి. దీన్ని ఇంగ్లీషులో మెటీరియల్ కాజ్ అంటారు. దయానంద స్వామీజీ మేకర్ అండ్ మెటీరియల్ అంటారు రెండింటినీ కలిపి.

ఇంతకుముందు భాగంలో బ్రహ్మను సత్యం జ్ఞానమ్ అనంతం బ్రహ్మ అని పరిచయం చేసింది ఉపనిషత్తు. అది స్వరూపలక్షణం అని చూశాము. ఈ భాగంలో బ్రహ్మను మళ్ళీ

ఇంకో నిర్వచనంద్వారా పరిచయం చేస్తున్నది. ఇప్పుడు జగత్కారణం బ్రహ్మగా వర్ణిస్తున్నది. ఈ నిర్వచనాన్ని తటస్థ లక్షణం అంటారని చూశాము.

బ్రహ్మ జగత్కారణం అంటే సృష్టిలో ఉన్న ప్రతి ఒక్కటీ, ఏ విధమైన మినహాయింపు లేకుండా, బ్రహ్మ నుంచే ఉత్పత్తి అయింది. ఇక్కడ బ్రహ్మను ఆత్మగా పరిచయం చేస్తున్నది ఉపనిషత్తు. బ్రహ్మాత్మా జగత్‌కారణం అంటున్నది.

ఇంతకుముందు చూసినట్టుగా ఒక వస్తువు సృష్టించబడాలంటే దానికొక నిమిత్త కారణం, ఒక ఉపాదాన కారణం ఉండాలి. కుండకు నిమిత్త కారణం కుమ్మరి, ఉపాదాన కారణం మట్టి. కాని ఇక్కడ బ్రహ్మను జగత్కారణంగా తీసుకుంటే, సృష్టికి ముందు రెండు లేవు – సత్యం జ్ఞానం అనంతం బ్రహ్మ మాత్రమే ఉన్నాడు.

**సదేవ సోమ్య ఇదమగ్ర ఆసీదేకమేవాద్వితీయమ్ – ఛాందోగ్యమ్**

ఓ సౌమ్యా, ఈ సృష్టికి ముందు సత్ మాత్రమే ఉంది. అప్పుడు బ్రహ్మ నిమిత్త కారణమా, ఉపాదాన కారణమా? దీనికి జవాబు ముండకోపనిషత్తులో దొరుకుతుంది.

**యథోర్ణనాభిః సృజతే గృహ్ణతే చ**
**యథా పృథివ్యామ్ ఓషధయః సంభవన్తి**
**యథా సతః పురుషాత్ కేశలోమాని**
**తథాఽక్షరాత్ సంభవతీహ విశ్వమ్** – ముండకమ్ 1.1.7

ఎలా సాలెపురుగు తనలోంచి దారాలను బయటకు తీసి, మళ్ళీ తనలోకే తీసుకుంటుందో, ఎలా భూమిలోంచి చెట్టుచేమలు ఉద్భవిస్తాయో, ఎలా జీవమున్న మనిషినుంచి జీవం లేని వెంట్రుకలు పెరుగుతాయో, అలా నాశనం లేని బ్రహ్మనుంచి ఈ జగత్తు ఉద్భవించింది.

ఎలాగైతే సాలెపురుగే నిమిత్త కారణమూ, ఉపాదాన కారణమూ కూడా అవుతుందో, అలాగే బ్రహ్మ అటు నిమిత్త కారణమూ, ఇటు ఉపాదాన కారణమూ అవుతాడు. అందువల్ల బ్రహ్మను అభిన్న నిమిత్త ఉపాదాన కారణం అంటారు. పూజ్యస్వామీజీ మేకర్ అండ్ మెటీరియల్ ఆర్ రోల్డ్ ఇంటు వన్ అంటారు.

కాకపోతే, ఉపనిషత్తు ప్రత్యేకించి చెప్పకపోయినా, మనం బ్రహ్మను ఇక్కడ ఉపాదాన కారణంగా చూస్తున్నాము. ఇక్కడ మనకు నిమిత్త కారణంతో పనిలేదు. బ్రహ్మ అనే ఉపాదాన కారణంనుంచి జగత్తుయొక్క సృష్టి వచ్చింది; జగత్తు బ్రహ్మలోనే స్థితి పొందుతుంది; మళ్ళీ బ్రహ్మలోనే లయమవుతుంది. కుండ–మట్టి ఉదాహరణలో మట్టి ఉపాదాన కారణం. మట్టే కుండయొక్క సృష్టి–స్థితి–లయ కారణం.

బ్రహ్మ తన మాయాశక్తివల్ల ఈ జగత్తును సృష్టించాడు. మాయాశక్తి బ్రహ్మకు భిన్నంగా లేదు. మనకు ఉన్న శక్తి మనకు భిన్నంగా ఉండదు. ఉదాహరణకు ఒక నాట్యాచార్యుడు వస్తుంటే, అదుగో నాట్యాచార్యుడు, ఆయన శక్తి వస్తున్నారు అంటామా? అలాగే బ్రహ్మ తన మాయాశక్తిలో ఉన్న విక్షేపశక్తివల్ల ఈ జగత్తును సృష్టించాడు. అందువల్ల బ్రహ్మ జగత్కారణం అంటే బ్రహ్మయొక్క మాయాశక్తి జగత్కారణం. ఇది బ్రహ్మయొక్క ఉపాదానకారణం అంశం.

బ్రహ్మ మొట్టమొదట పంచభూతాలను సృష్టించాడు. దాని తర్వాత పాంచభౌతిక వస్తువులను సృష్టించాడు. పంచభూతాలు కూడా ఒక వరుసక్రమంలో వస్తాయి. అత్యంత సూక్ష్మమైన ఆకాశంతో మొదలై అత్యంత స్థూలమైన పృథివి దాకా వస్తాయి. వాటి సూక్ష్మత్వం వాటిని పంచ జ్ఞానేంద్రియాలతో చూడగలగటంనుంచి వస్తుంది. జ్ఞానేంద్రియాలకు అందటం తగ్గేకొద్దీ, వాటి సూక్ష్మత్వం పెరుగుతూ వస్తుంది. సృష్టి సూక్ష్మాతి సూక్ష్మమైన వస్తువుతో మొదలయింది. అంటే ముందు ఆకాశం పుట్టింది. దాని తర్వాత ఒకదాని తర్వాత ఒకటిగా వాయువు, అగ్ని, జలం, పృథివి వచ్చాయి.

| **పంచభూతాలు** | **పంచేంద్రియాలు** | **లక్షణాల సంఖ్య** |
|---|---|---|
| ఆకాశం | శబ్దం | 1 |
| వాయువు | శబ్దం, స్పర్శ | 2 |
| అగ్ని | శబ్దం, స్పర్శ, రూపం | 3 |
| నీరు | శబ్దం, స్పర్శ, రూపం, రసం | 4 |
| భూమి | శబ్దం, స్పర్శ, రూపం, రసం, గంధం | 5 |

అన్నింటిలోకీ ఆకాశం అత్యంత సూక్ష్మమైనది. భూమి అత్యంత స్థూలమైనది. భూమి పూర్తిస్థాయి వ్యక్తరూపంలో ఉంది. పంచేంద్రియాలద్వారా భూమిని గ్రహించవచ్చు. ఈ నేపథ్యంతో ఈ మంత్రభాగాన్ని చూద్దాము.

**తస్మాద్వా ఏతస్మాదాత్మన ఆకాశస్సంభూతః। ఆకాశాద్వాయుః। వాయోరగ్నిః। అగ్నేరాపః। అద్భ్యః పృథివీ। పృథివ్యా ఓషధయః। ఓషధీభ్యోఽన్నమ్। అన్నాత్పురుషః। స వా ఏష పురుషోఽన్నరసమయః।**

**సృష్టిప్రకరణం– అనువాకం 1**

ఇప్పుడు వచ్చిన ఈ మంత్రం కూడా అక్షరలక్షలు విలువ చేసే మంత్రం. సృష్టి ప్రకరణం గురించి చెప్పాల్సివచ్చినప్పుడల్లా ఈ మంత్రాన్ని ఉటంకిస్తుంటారు. సృష్టి జరిగిన వరుసక్రమం ఇందులో బాగా వస్తుంది. ఇప్పుడు ఈ నేపథ్యంతో ఈ మంత్రాన్ని చూద్దాము.

**తస్మాత్** – ఆ బ్రహ్మనుంచి. ఏ బ్రహ్మనైతే సత్యం జ్ఞానమనంతం బ్రహ్మ అన్నామో, ఆ బ్రహ్మనుంచి.

**ఏతస్మాద్ ఆత్మనః** – ఆ బ్రహ్మ సాక్షిచైతన్యానికి (ఆత్మకు) భిన్నంకాదు.

**ఆకాశః సంభూతః** – ఆకాశం పుట్టింది. దానికి ఒక్క గుణమే (శబ్దగుణం) ఉంది. దీన్నించి ఒక విషయం స్పష్టమవుతున్నది. ఆకాశం సూక్ష్మాతి సూక్ష్మం అయితే, బ్రహ్మ ఆకాశానికన్నా సూక్ష్మం. ఆకాశానికి ఒక గుణమే ఉంటే, బ్రహ్మ నిర్గుణం బ్రహ్మ.

**అశబ్దమస్పర్శమరూపమవ్యయం**
**తథాऽ రసం నిత్యమగన్ధ వచ్చయత్** – కఠ 1.3.15

బ్రహ్మ శబ్ద, స్పర్శ, రూప, రస, గంధాలకు అందదు; బ్రహ్మకు నాశనం లేదు, నిత్యం. ఆ విధంగా బ్రహ్మ నిర్గుణబ్రహ్మ. సూక్ష్మాతి సూక్ష్మమైన ఆకాశాన్ని అర్థం చేసుకోగలిగితే, దానికన్నా సూక్ష్మమైన బ్రహ్మను తేలికగా అర్థం చేసుకోవచ్చు. అందువల్ల వేదాంతం ఆకాశధ్యానం చేయమంటుంది. ఆకాశానికీ, బ్రహ్మకూ మధ్య కొన్ని పోలికలు ఉన్నాయి. ఆకాశం అంటే శూన్యం కాదు. ఆకాశం ఉంది. ఆకాశానికి ఉనికి లేకపోతే, అది బ్రహ్మ నుంచి పుట్టలేదు కదా! ఉనికి లేని వస్తువు పుట్టనవసరం లేదు. అందువల్ల ఆకాశం అంటే ప్రదేశం.

ఆకాశం కూడా బ్రహ్మనుంచి పుట్టింది అంటే, ఆకాశం పుట్టకముందు బ్రహ్మ ఎక్కడ ఉన్నట్టు? ఇది ఊహకు అందని ప్రశ్న. ఒక వస్తువు ఒకచోట ఉంది అంటే, ఆ వస్తువుకు ముందు ఆ ప్రదేశం ఉండాలి. ఇంకో విధంగా చెప్పాలంటే ప్రదేశం ఉంటేనే ఉనికి సాధ్యం అవుతుంది. ఆకాశాన్నే చూడలేకపోతే, ఆకాశంకన్నా సూక్ష్మమైన బ్రహ్మను ఎలా చూడగలము? అందువల్ల ఆత్మను చూడలేము.

**ఆకాశాద్వాయుః** – ఆకాశంనుంచి వాయువు పుట్టింది. వాయువుకు రెండు గుణాలు ఉన్నాయి. అవి శబ్దం, స్పర్శ. అందువల్ల అది ఆకాశంకన్నా కొంచెం స్థూలమైనది. వాయువు స్పర్శకు తెలుస్తుంది. గాలివీస్తే శరీరానికి చల్లని స్పర్శ తెలుస్తుంది.

**వాయోరగ్నిః** – వాయుతత్త్వంనుంచి అగ్ని పుట్టింది. అగ్నికి మూడు గుణాలు ఉన్నాయి. అవి శబ్దం, స్పర్శ, రూపం.

**అగ్నేరాపః** – అగ్నినుంచి జలతత్త్వం పుట్టింది జలానికి ఇంకొక గుణం పెరుగుతుంది. పై మూడూ కాక, రుచి కలుస్తుంది. నీటికి రుచిలేని రుచి ఉంది. నీరుని రుచి చూస్తే, దానికి రుచి లేదని తెలుస్తుంది.

**అద్భ్యః పృథివీ** – నీటినుంచి భూమి పుట్టింది. పృథివి అంటే నిజానికి భూమి. కాని ఇక్కడ ఘనపదార్థం అంతటినీ తీసుకోవచ్చు.

ఇక్కడిదాకా పంచభూతసృష్టి గురించి వచ్చింది. తత్త్వబోధలో సృష్టి గురించి నేర్చుకున్నప్పుడు ముందు సూక్ష్మపంచభూతాలు సృష్టించబడ్డాయనీ, దాని తర్వాత పంచీకరణం జరిగి స్థూలపంచభూతాలు వచ్చాయనీ వస్తుంది. సూక్ష్మపంచభూతాలనుంచి సూక్ష్మపాంచభౌతికాలు వస్తే, స్థూలపంచభూతాలనుంచి స్థూలపాంచభౌతికాలు వచ్చాయి. అందువల్ల ఇంతవరకూ వచ్చిన మంత్రాన్ని రెండుసార్లు చదువుకోవాలి – ఒకసారి సూక్ష్మసృష్టికోసం, ఇంకొకసారి స్థూలసృష్టి కోసం.

సూక్ష్మభూతాలు పంచీకరణం జరిగి స్థూలభూతాలు అవుతాయని చూశాము. పంచీకరణం అంటే ఏమిటి? ఉదాహరణకు భూమిని తీసుకుంటే భూమిలో సగం మేరకు భూమి ఉంటుంది; మిగతా సగంలో తక్కిన నాలుగు భూతాల మిశ్రమం ఉంటుంది. అంటే తక్కిన నాలుగు భూతాల్లోంచి ఎనిమిదోవంతు కలుస్తాయి. అవన్నీ కలిసి ఒక సగం అవుతాయి. ఐదూ కలిసినా, స్థూలపృథివి అని ఎందుకంటామంటే పృథివి అంశం సగం ఉంటుంది కాబట్టి.

**పృథివ్యా ఓషదయః** – ఇక్కడ్నుంచి పాంచభౌతిక వస్తువుల సృష్టి వస్తుంది. భూమినుంచి (స్థూలభూమినుంచి అని తీసుకోవాలి) వృక్షసముదాయం పుట్టింది.

**ఓషధీభ్యోఽన్నమ్** – వృక్షసముదాయంనుంచి అన్నం పుట్టింది. దీన్నుంచి ఒక విషయం స్పష్టంగా తెలుస్తున్నది. ఉపనిషత్తుల ప్రకారం, ఆహారం అంటే శాకాహారమే. అందువల్ల మనిషి శాకాహారమే తీసుకుంటే మంచిది.

**అన్నాత్పురుషః** – అన్నంనుంచి పురుషుడు పుట్టాడు. పురుషుడు అంటే అనేక అర్థాలు వస్తాయి. పురుషుడు అంటే ఆత్మ అని కూడా వస్తుంది. అందువల్ల ఉపనిషత్తే పురుషుడు అంటే స్థూలశరీరం అని, తర్వాత వచ్చే వాక్యంలో స్పష్టం చేస్తున్నది.

**స వా ఏష పురుషోఽన్నరసమయః** – ఇక్కడ పురుషుడు అంటే అన్నరసంనుంచి పుట్టిన స్థూలశరీరం. అన్నం శరీరాన్ని ఎలా పుట్టిస్తుంది? అన్నం పురుష శరీరంలోకి వెళ్ళి, అక్కడ పురుషబీజం అయిన శుక్రంగా రూపుదిద్దుకుంటుంది. అదే అన్నం స్త్రీ శరీరంలోకి శోణితంగా రూపుదిద్దుకుంటుంది. స్త్రీపురుషుల సంయోగం అప్పుడు శుక్రరూప అన్నరసం, శోణితరూప అన్నరసం సంయోగం చెంది, కొత్త శరీరం ఏర్పడటానికి తోడ్పడతాయి. శిశువు శరీరం ఈ రెండు అన్నరసాల ఉత్పత్తి. మయః అంటే కలిగియుండటం. అందువల్ల మనిషి శరీరాన్ని అన్నరసమయః అంటే అన్నరసంనుంచి ఉత్పత్తి చెందిన శరీరం అంది ఉపనిషత్తు.

ఈ విధంగా సృష్టిప్రకరణం చూశాము. పంచభూతాల సృష్టి, పాంచభౌతిక శరీరాల సృష్టి చూశాము. ఇవి మాత్రమే సృష్టించబడలేదు; ఇంకా ఎన్నో సృష్టించబడ్డాయి కాని, ఇక్కడ అవసరమైనంత మేరకే చెప్పబడింది.

**ఉపసిద్ధాంతం**

ఈ సృష్టిప్రకరణం గురించి చెప్పినప్పుడు ఇందులో కొన్ని అంశాలు అంతర్లీనంగా చెప్పబడ్డాయి కాని స్పష్టంగా చెప్పబడలేదు. వాటిని మనం గ్రహించుకోవాలి. అవేమిటో చూద్దాము.

1. **బ్రహ్మ సత్యమ్** – కారణం కార్యమంతటా ఉంటుందని చెప్పవచ్చు. బంగారం, ఆభరణం అంతటా ఉంది; చెక్క, కుర్చీ అంతటా ఉంది; మట్టి, కుండ అంతటా ఉంది. అందువల్ల కార్యాన్ని చూస్తే, కారణాన్ని చూడకుండా ఉండలేము. ఉదాహరణకు ఒక ఆభరణాన్ని చూస్తున్నామంటేనే, బంగారాన్ని చూడకనే చూసినట్టు అర్థం. ఆమాటకొస్తే కారణం కార్యమంతటా ఉంటుందనే ప్రాథమిక విషయం మనకు బాగానే తెలుసు అంటారు దయానంద స్వామీజీ. ఎందుకంటే, నా ఆరోగ్యం బ్రహ్మాండంగా ఉంది, ఇంతవరకూ ముక్కు చీది ఎరుగను అని చెప్పి, వెంటనే టచ్‌ఉడ్ అని చెప్పి, తను కూర్చున్న చెక్కకుర్చీని వెంటనే పట్టుకుంటాము. అంటే ఏమిటి అర్థం? కుర్చీ అంతటా చెక్క ఉందని తెలిసినట్టేగా?

అందువల్ల బ్రహ్మ కారణం కాబట్టి, మొత్తం జగత్తు కార్యం కాబట్టి, కార్యప్రపంచాన్ని మనం ఆస్వాదిస్తున్నామంటే, దానిలో అంతర్లీనంగా ఉన్న కారణబ్రహ్మను కూడా ఆస్వాదించాలి.

ఇప్పుడు జగత్తులో, జగత్తంతటా అంతర్లీనంగా ఉన్నదేమిటో విశ్లేషిద్దాము. పంచదశిలో విద్యారణ్యులవారు ఈ అంశంతో మొదలుపెడతారు. అన్నింటిలోనూ అంతర్లీనంగా ఒకటే వస్తువు ఉంది. ఫ్యాన్ ఈజ్, బుక్ ఈజ్, టేబుల్ ఈజ్, ట్రీ ఈజ్ అనే ఈ వాక్యాలన్నింటిలోనూ సమానంగా ఉన్నది 'ఈజ్' అనే పదం. ఫ్యాన్ ఉంది, పుస్తకం ఉంది, బల్ల ఉంది, చెట్టు ఉంది అనే ఈ వాక్యాలన్నింటిలోనూ సమానంగా ఉన్నది 'ఉంది' అనే పదం. 'ఉంది' అంటే **ఉనికి** లేదా **ఎక్సిస్టెన్స్**.

దీన్నించి ఒక ముఖ్యమైన సూత్రం నేర్చుకుంటాము. కారణం కార్యంలో ఉనికి రూపంలో ఉంది. ఉనికి సత్ లేదా సత్తా అంటారు.

**కారణం కార్యే సత్తారూపేణ ప్రతీయతే**

కారణం అంతటా కార్యం ఉనికి రూపంలో ఉందని ఎలా చెప్పగలము? ఆభరణం అంతటా బంగారం ఉందన్నాము కదా. ఆభరణంనుంచి బంగారం తీసిచూడండి. ఆభరణానికి ఉనికే లేదు. అలాగే కుర్చీనుంచి చెక్క తీసిచూడండి; కుర్చీకి ఉనికే లేదు. కుండనుంచి మట్టిని తీసిచూడండి; కుండకి విడిగా ఉనికే లేదు. అందువల్ల కారణమే కార్యానికి ఉనికినిస్తుంది. ఆ విధంగా అంతటా బ్రహ్మను చూడాలి.

**యస్యైవ స్ఫురణం సదాత్మకమసత్కల్పార్థకం భాసతే**

ఈ బ్రహ్మవల్లనే ఈ వస్తువులకు ఉనికి ఉంది.

అందువల్ల బ్రహ్మయొక్క అద్భుతమైన నిర్వచనం ఇలా చెప్పవచ్చు. కార్యమంతటా ఉనికి రూపంలో ఉన్నది. అందువల్ల కారణం బ్రహ్మ సత్యం. సత్యం అంటే శుద్ధ సత్, శుద్ధ ఉనికి.

**కారణత్వాత్ బ్రహ్మ సత్యమ్**

2. **బ్రహ్మజ్ఞానమ్** – ఒక వస్తువుయొక్క ఎఱుక గురించి తెలియకపోతే దాని ఉనికి గురించి మాట్లాడలేము. కుండ ఉనికి గురించి మాట్లాడుతున్నామంటేనే, కుండ గురించిన ఎఱుక (జ్ఞానం) ఉందని చెప్పకనే చెప్పినట్టవుతుంది. ఉనికి ఉన్నట్టు మనకు తెలియని విషయం గురించి మనం ఎన్నడూ మాట్లాడలేము. అందువల్ల ఉనికి ఉందని చెబితే, దాని జ్ఞానం లేదా ఎఱుక గురించి చెప్పినట్టే అర్థం. జ్ఞానం అంటే చైతన్యం.

కుండ ఉనికి గురించి చెపితే, కుండ జ్ఞానం ఉన్నట్టు అర్థం
మనిషి ఉనికి గురించి చెపితే, మనిషి జ్ఞానం ఉన్నట్టు అర్థం
శుద్ధ సత్యం గురించి చెపితే, శుద్ధ జ్ఞానం ఉన్నట్టు అర్థం

బ్రహ్మ సత్యం అయితే, బ్రహ్మ జ్ఞానం అవాలి. బ్రహ్మ కారణంగా సత్యం అని చూశాము; సత్యం గురించి చెప్పామంటే జ్ఞానం గురించి చెప్పినట్టే అర్థమని చూశాము కాబట్టి బ్రహ్మ సత్యం, బ్రహ్మ జ్ఞానం.

3. **బ్రహ్మ అనంతమ్** – ఆభరణం, బంగారానికి భిన్నంగా లేదని చూశాము. ఒకవేళ భిన్నంగా ఉంటే, ఆభరణాన్ని బంగారంనుంచి విడదీయవచ్చు. బంగారం ఒక కొత్త రూపుదిద్దుకుంటే దానికి ఆభరణం అనే కొత్త పేరు వచ్చింది. అంటే కార్యానికి విడిగా, కారణం లేకుండా, ఉనికి లేదు. కార్యానికి ఉన్నది నామరూపాలు మాత్రమే. ఇంకో విధంగా చెప్పాలంటే కారణం మాత్రమే వస్తువు లేదా పదార్థం; కార్యం కాదు.

**వాచాఽఽరంభణం వికారో నామధేయమ్** – ఛాందోగ్యమ్ 6.1.4

ఒక వస్తువు కొత్తగా రూపుదిద్దుకుంటే ఆ వస్తువుకు వాక్కు ఒక కొత్తపేరును ఇస్తుంది. అందువల్ల జగత్తు అంటే కొత్తగా పుట్టిన వస్తువు కాదు; కొత్తగా వచ్చిన నామ, రూపాలు మాత్రమే. విజ్ఞానశాస్త్రం ప్రకారం కూడా పదార్థం కొత్తగా పుట్టదు, నాశనమవదు అని నేర్చుకుంటాము. అదే విధంగా జగత్తు కొత్తగా పుట్టదు, కొత్తగా నాశనమవదు. జగత్తు అవ్యక్తంలోంచి వ్యక్తంలోకి వచ్చినప్పుడు సృష్టి జరిగింది అంటాము; వ్యక్తంలోంచి అవ్యక్తంలోకి

వెళ్ళిపోయినప్పుడు ప్రళయం వచ్చింది అంటాము. అందువల్ల సృష్టి అంటే ఉన్న పదార్థానికి నామరూపాలు మాత్రమే.

**బ్రహ్మ + నామరూపాలు = జగత్**

**జగత్ – నామరూపాలు = బ్రహ్మ**

జగత్తు అంటే నామరూపాలే కాని, విడిగా ఇంకొక పదార్థం లేదు కాబట్టి, ఉన్నదొక్కటే బ్రహ్మ. బ్రహ్మ ఒక్కటే ఉంది కాబట్టి, బ్రహ్మకు పరిమితులు విధించే వస్తువు లేదు కాబట్టి బ్రహ్మ అనంతం.

**అద్వితీయస్య వస్తునః అభావాత్ బ్రహ్మణః అద్వితీయత్వాత్ బ్రహ్మ అనంతం భవతి।**

ఈ విధంగా సృష్టి ప్రక్రియద్వారా మళ్ళీ బ్రహ్మ సత్యం జ్ఞానమనంతం బ్రహ్మ అని నిరూపించటం జరిగింది.

బి) **కథం తస్య వేదనమ్** – ఆ బ్రహ్మను ఎలా తెలుసుకోవాలి?

వృత్తిభాగముపరంగా –యో వేద నిహితం గుహాయాం పరమే వ్యోమన్

వ్యాఖ్యానభాగముపరంగా – పంచకోశవివేకము అనువాకాలు 1–5

బ్రహ్మను హృదయాకాశంలో సాక్షిచైతన్యంగా తెలుసుకోవాలి అని వృత్తిభాగములో చూశాము. బ్రహ్మ సర్వవ్యాపకమైనా కూడా, బ్రహ్మను గుర్తించగలిగేది మన మనస్సులోనే. మనస్సులో వచ్చిపోయే ఆలోచన రూపంలో కాదు; వచ్చిపోయే ఆలోచనలను, రాకపోకలు లేకుండా, తను మారకుండా సాక్షిగా చూసే చైతన్యమే బ్రహ్మ. అంతేకాదు, ఒక ఆలోచన వచ్చి వెళ్ళి, ఇంకో ఆలోచన వచ్చేలోపు మధ్యలో శూన్యం ఉంటే దాన్ని కూడా సాక్షిగా చూస్తుంది. ఇంకో విధంగా చెప్పాలంటే, ఆలోచనలు ఉన్న, ఆలోచనలు లేని మనస్సును సాక్షిగా చూస్తుంది.

మనస్సులో ఉన్న ఈ సాక్షి చైతన్యాన్ని చూడటానికి ప్రయత్నించకూడదు. ఎందుకంటే వెతుకుతున్న నేనే వెతకబడుతున్న సాక్షి చైతన్యాన్ని. బ్రహ్మను తెలుసుకోవటానికి ఒకటే మార్గం ఉంది. నేనే ఆ సాక్షిచైతన్యాన్ని అని తెలుసుకోవటమే.

**సాక్షి చైతన్య రూప అహం బ్రహ్మ అస్మి**

ఇక్కడనుంచి రెండవ ప్రశ్నకు జవాబు వస్తుంది. రెండవ ప్రశ్న కథం తస్య వేదనమ్? **బ్రహ్మ వేదన ప్రకారః.**

బ్రహ్మను తెలుసుకునేందుకు ఒక పద్ధతిని ప్రవేశపెడుతున్నది ఉపనిషత్తు. దాన్ని పంచకోశ వివేకప్రక్రియ అంటారు. ప్రక్రియ అంటే పద్ధతి. తైత్తిరీయోపనిషత్తు ఈ పంచకోశ వివేకప్రక్రియవల్ల ప్రసిద్ధి చెందింది. ఈ ప్రక్రియను అనువాకాలు 1–5లో చూస్తాము.

**పంచకోశ వివేకప్రక్రియ** – బ్రహ్మ ఆబ్జెక్టు కాదు. అందువల్ల బ్రహ్మను ఎన్నడూ ఆబ్జెక్టుగా చూడలేము. బ్రహ్మను ఒక్క పద్ధతిలోనే తెలుసుకోగలము. అది – అహం బ్రహ్మ అస్మి అనే జ్ఞానం ద్వారా. కాకపోతే 'అహం' అంటే ఎవరో సరిగ్గా తెలుసుకోవాలి. కార్యకరణ సంఘాతమైన నేను కాదు, సాక్షి చైతన్యమైన నేను, ఆ బ్రహ్మను. అత్యంత స్థూలమైన శరీరంనుంచి సూక్ష్మాతి సూక్ష్మమైన సాక్షి చైతన్యానికి ప్రయాణం చేయాలి. ఆ సాక్షి చైతన్యమైన నేను ఆ బ్రహ్మను అని తెలుసుకోవాలి.

### సాక్షి చైతన్యరూప అహం బ్రహ్మ అస్మి

ఈ సాక్షి చైతన్యం సూక్ష్మాతి సూక్ష్మమైనది. ఇది శరీరంలో ఒక భాగంగాని, దాని లక్షణంగాని కాదు. దాన్నుంచి ఉత్పత్తిగాని చెందలేదు. అది శరీరం సరిహద్దులకే పరిమితమవలేదు. అందువల్ల అది ప్రత్యక్ష ప్రమాణాలకు అందదు. శబ్దస్పర్శరూప రసగంధాలకు అందదు.

మన ప్రయాణం అత్యంత స్థూలవిషయమైన శరీరంనుంచి సూక్ష్మాతి సూక్ష్మమైన ఆత్మకు సాగాలి. ఈ ప్రయాణం ఒక్క గెంతుతో అయిపోదు; ఇది నిదానంగా ఒక్కొక్క మెట్టు ఎక్కుతూ రావాలి. ఐదు మెట్లు ఉన్న స్టేజీమీదకి వెళ్ళాలంటే, కిందనుంచి ఒక్క గెంతు గెంతలేము. ఒక్కొక్క మెట్టు ఎక్కుతూ రావాలి. అలాగే అత్యంత ఉన్నతమైన లక్ష్యం చేరుకోవాలంటే, మధ్యలో కొన్ని చిన్న లక్ష్యాలను ఏర్పాటు చేసుకోవాలి. వాటిని ఒక్కొక్కటిగా తీర్చుకుంటూ రావాలి. ఇప్పుడు మన ప్రయాణం అంతర్గతంగా సాగాలి. ఈ పంచకోశ ప్రక్రియ మనస్సును అత్యంత సూక్ష్మంగా చేసుకుంటూ రావటానికి తోడ్పడుతుంది.

**అరుంధతీ దర్శనన్యాయం** – ఈ పంచకోశ ప్రక్రియ అరుంధతీ దర్శనన్యాయానికి దగ్గరగా ఉంది. వసిష్ఠఋషి, అరుంధతీదేవి ఆదర్శదంపతులు. వైదిక సాంప్రదాయంలో కళ్యాణం జరిగాక, కొత్తపెళ్ళికూతురుకు ఆమె భర్త అరుంధతీ నక్షత్రాన్ని చూపిస్తాడు. ఆ జంటలాగా, తాము కూడా ఆదర్శప్రాయంగా ఉండాలని చెప్పటం దాని ఉద్దేశం.

ఆ అరుంధతీ నక్షత్రాన్ని వెంటనే చూపించడు. ముందు అదుగో, ఆకాశంలో ఉన్న ఆ నక్షత్రాల సముదాయాన్ని చూడు అంటాడు. తర్వాత వాటిలో గాలిపటం ఆకారంలో ఉన్న ఏడు నక్షత్రాలను చూడు అంటాడు. ఆ గాలిపటం తోకలాగా ఉన్నచోట మూడు నక్షత్రాలు ఉంటాయి. వాటిలో మధ్య నక్షత్రాన్ని చూడమంటాడు. ఆ నక్షత్రం పక్కనే ఉండి, చిన్నగా మిలమిలా మెరుస్తున్న నక్షత్రాన్ని చూపించి, అదే అరుంధతీ నక్షత్రం అంటాడు. అంటే అత్యంత స్థూలమైన వాటినుంచి సూక్ష్మాతిసూక్ష్మమైన నక్షత్రానికి ప్రయాణం చేయిస్తాడు కొత్తపెళ్ళికొడుకు. పంచకోశ వివేకంలో కూడా అదే పద్ధతి.

ఇందాక స్టేజీ ఎక్కటానికి ఐదు మెట్లున్నాయని చూశాము కదా. మనం స్టేజీ ఎక్కాలంటే ఈ ఐదు మెట్లు ఎక్కాలి. మన అంతిమలక్ష్యం స్టేజీ. కాని మొదటిమెట్టు ఎక్కేటప్పుడు మన తక్షణ కర్తవ్యం మొదటిమెట్టు మీద పూర్తి ఏకాగ్రత చూపటం. మొదటిమెట్టు మీద దిగ్విజయంగా కాలుపెట్టాక, మన దృష్టిని మార్చాలి. అప్పుడే స్టేజీమీదకు కాదు; రెండవ మెట్టుమీదకు. ఇప్పుడింక మొదటిమెట్టు మన లక్ష్యం కాదు. లక్ష్యాన్ని సాధ్యం అనీ, మార్గాన్ని సాధనం అనీ అంటారు. ఇప్పుడు మొదటిమెట్టు సాధనంగా మారింది; రెండవమెట్టు సాధ్యంగా మారింది. అలా ఎక్కుతూ పోతే, ఐదవమెట్టు సాధనం అవుతుంది, స్టేజీ సాధ్యం అవుతుంది.

మనలో పంచకోశాలు ఉన్నాయి. అవి అన్నమయకోశం, ప్రాణమయకోశం, మనోమయకోశం, విజ్ఞానమయకోశం, ఆనందమయకోశం. వీటికి అతీతంగా ఉంది ఆత్మ; అది మన సాధ్యం. ఇందులో కూడా ఇదే పద్ధతి. మొట్టమొదటి అన్నమయకోశం మన మొదటి సాధ్యం అవుతుంది. ఆ కోశాన్ని చేరుకుని, అక్కడ నిలబడ్డాక అన్నమయకోశం ఇంక సాధ్యంగా ఉండదు. అది సాధనంగా మారుతుంది; దాని తర్వాత కోశమైన ప్రాణమయకోశం సాధ్యం అవుతుంది. అంటే అప్పుడు అన్నమయకోశం అనాత్మ అవుతుంది; ప్రాణమయకోశం ఆత్మ అవుతుంది. తర్వాత మనోమయకోశానికి చేరేసరికి, ప్రాణమయకోశం అనాత్మ అయిపోతుంది; మనోమయకోశం ఆత్మ అవుతుంది. అలా ఒక్కొక్క కోశాన్ని ఆత్మగా భావిస్తూ వచ్చి, దాన్ని అనాత్మగా త్రోసిపుచ్చుకుంటూ వసాము. ఈ పద్ధతిద్వారా మనస్సు అంతకంతకూ సూక్ష్మంగా అవుతూవచ్చి సూక్ష్మాతి సూక్ష్మమైన వస్తువును అర్థం చేసుకునే స్థాయికి వస్తుంది.

ఆనందమయకోశానికి చేరేటప్పటికి దాన్ని కారణంగా లేదా అవ్యక్తంగా తెలుసుకోవాలి. ఇంక అది స్థూలంగా తెలియదు. దానియొక్క అవ్యక్తత్వాన్ని అర్థం చేసుకోవాలి. ఎప్పుడైతే ఆనందమయకోశాన్ని అవ్యక్తంగా అర్థం చేసుకున్నామో, అప్పుడే మనం దానికన్నా సూక్ష్మమైన సాక్షిచైతన్యాన్ని అర్థం చేసుకోవటానికి సిద్ధంగా ఉన్నామని అర్థం. సాక్షిచైతన్యం మారుతున్న పదార్థం కాదనీ, మారే పదార్థాలకు భిన్నంగా ఉండి, వాటిని సాక్షిగా చూస్తోందనీ అర్థం చేసుకోవాలి.

**తస్యేదమేవ శిరః। అయం దక్షిణః పక్షః। అయముత్తరః పక్షః। అయమాత్మా। ఇదం పుచ్ఛం ప్రతిష్ఠా। తదప్యేష శ్లోకో భవతి।**

**పంచకోశవివేకము– అనువాకాలు 1–5**

**1. అన్నమయ ఆత్మ** – మనం మొదటిమెట్టుకు వెళుతున్నాము. అన్నమయ ఆత్మ అంటుంది. **తస్య** – తస్య అంటే అన్నమయ ఆత్మా. ఇక్కడ అన్నమయకోశం కాదు. ఇది మనకు బాగానే అర్థమవుతుంది. నేను శరీరాన్ని అనుకోవటంవల్లనే ఈ జాగ్రదావస్థలో ఈ శరీరంతో

వ్యవహారాలు నడుపగలుగుతున్నాం. స్థూలశరీరానికి అనేక అంగాలు ఉన్నాయి కాని, ఉపనిషత్తు ఒక ఐదు బాగా తెలిసే అంగాలను పేర్కొంటున్నది.

**ఇదమేవ శిరః** – భుజాలపై ఉన్నది ఇదుగో ఇది తల. ఒక గురువు తన శిష్యునికి తన తలను చూపించి చెబుతున్నట్టుగా ఊహించుకోవాలి.

**అయం దక్షిణః పక్షః** – (మళ్ళీ చూపిస్తూ) ఈ కుడిచేయి కుడిరెక్క.

**అయముత్తరః పక్షః** – ఈ ఎడమచేయి ఎడమరెక్క.

**అయమాత్మా** – ఈ దేహంయొక్క మధ్యభాగం అన్నమయ ఆత్మ.

**ఇదం పుచ్ఛం ప్రతిష్ఠా** – ఇదం అంటే ఇది. బొడ్డుకంటే కింద ఉన్న దేహభాగం, తోక. పుచ్ఛం అసలు అర్థం తోక. ఇక్కడ స్థిరంగా నిలబెట్టేది లేదా ఆధారం అని అర్థం చేసుకోవచ్చు.

ఈ విధంగా అన్నమయ ఆత్మలో ఐదు అంశాలు – శిరస్సు, కుడిరెక్క, ఎడమరెక్క, ఆత్మ, ప్రతిష్ఠ ఉన్నాయి.

**తదప్యేష శ్లోకో భవతి** – ఈ అన్నమయకోశం గురించి ఋగ్మంత్రం ఉంది. అది మనం అన్నమయకోశంమీద దృష్టి నిలిపి దానిమీద ఉపాసన చేయటానికి, దాన్ని అర్థం చేసుకోవటానికీ తోడ్పడుతుంది. శ్లోకం అంటే ఋగ్వేదమంత్రం.

## అనువాకం – 2

**అన్నాద్వై ప్రజాః ప్రజాయంతే। యాః కాశ్చ పృథివీగ్ంశ్రితాః। అథో అన్నేనైవ జీవంతి। అథైనదపియంత్యన్తతః। అన్నగ్ం హి భూతానాం జ్యేష్ఠమ్। తస్మాత్సర్వౌషధముచ్యతే। సర్వం వై తేఽన్నమాప్నువంతి। యేఽన్నం బ్రహ్మోపాసతే। అన్నగ్ం హి భూతానాం జ్యేష్ఠమ్। తస్మాత్సర్వౌషధముచ్యతే। అన్నాద్భూతాని జాయన్తే। జాతాన్యన్నేన వర్ధంతే। అద్యతేఽత్తి చ భూతాని। తస్మాదన్నం తదుచ్యత ఇతి।**

**తస్మాద్వా ఏతస్మాదన్నరసమయాత్। అన్యోఽన్తర ఆత్మా ప్రాణమయః। తేనైషపూర్ణః। స వా ఏష పురుషవిధ ఏవ। తస్య పురుష విధతామ్। అన్వయం పురుషవిధః । తస్య ప్రాణ ఏవ శిరః। వ్యానో దక్షిణః పక్షః।అపాన ఉత్తరః పక్షః। ఆకాశ ఆత్మా। పృథివీ పుచ్ఛం ప్రతిష్ఠా। తదప్యేష శ్లోకో భవతి।**

ఈ అనువాకంలో ఋగ్మంత్రం అన్నమయ ఆత్మ గురించి చెబుతున్నది. అన్నమయకోశం గురించి కాదని గమనించాలి. స్థూలశరీరాన్ని అన్నమయం అని ఎందుకంటారంటే అది అన్నంనుంచి ఉత్పత్తి చెందింది కాబట్టి అని ఉపనిషత్తు చెబుతున్నది. మయ అంటే ఉత్పత్తి. స్వర్ణమయ ఆభరణం అంటే స్వర్ణంనుంచి ఉత్పత్తి చెందిన ఆభరణం. స్వర్ణమయంలో మయం కార్యం, స్వర్ణం కారణం (ఉపాదాన కారణం).

ఉపాదాన కారణం + మయ = కార్యం

ఇక్కడ నిమిత్త కారణం (కంసాలి)ని లెక్కలోకి తీసుకోము. కంసాలిమయ ఆభరణం అనము. మయ అనే అవ్యయాన్ని ఉపాదాన కారణానికి కలుపుతాము కాని, నిమిత్త కారణానికి కలపము. ఆ విధంగా అన్నమయ ఆత్మ అంటే ఉపాదాన కారణమైన అన్నంనుంచి పుట్టిన శరీరం.

అన్నం అసలు అర్థం ఆహారం. కాని ఇక్కడ పదార్థం. పంచభూతాలతో కూడిన ప్రపంచాన్ని పదార్థం అంటారు. ఈ పంచభూతాలనుంచే పాంచభౌతిక శరీరం వచ్చింది. పాంచభౌతిక ప్రపంచాన్ని సముద్రంతో పోలిస్తే, దాన్నించి పుట్టిన పాంచభౌతిక శరీరాన్ని, సముద్రంనుంచి పుట్టిన అలతో పోల్చవచ్చు. ప్రపంచంలో ఉన్న రసాయనాలు, పంచభూతాలే శరీరంలో కూడా ఉన్నాయి. అందువల్ల అన్నం (ప్రపంచం)నుంచి ఈ శరీరంయొక్క సృష్టి జరిగింది; దానిలో స్థితి పొందుతుంది; దానిలోనే లయమవుతుంది. అందువల్ల స్థూలప్రపంచం అన్నం అయితే, స్థూలశరీరం అన్నమయం అయింది.

**అన్నాద్వై ప్రజాః ప్రజాయంతే। యాః కాశ్చ పృథివీగ్ం శ్రితాః। అథో అన్నేనైవ జీవంతి। అథైనదపియంత్యన్తతః। అన్నగ్ం హి భూతానాం జ్యేష్ఠమ్। తస్మాత్సర్వౌషధముచ్యతే। సర్వం వై తేఽన్నమాప్నువంతి। యేఽన్నం బ్రహ్మోపాసతే।**

**ప్రజాః** – అన్ని స్థూలశరీరాలు

**అన్నాద్వై ప్రజాయంతే** – అన్నంనుంచే పుట్టాయి. మనకు పోషక పదార్థాలు ప్రపంచంలోని ఆహారంనుంచి వస్తాయి. అంటే స్థూలప్రపంచం ఆహారాన్ని అందిస్తుంది. అన్నంనుంచి శరీరం పుట్టింది. ఎటువంటి శరీరం?

**యాః కాశ్చ పృథివీగ్ం శ్రితాః** – భూమ్మీద నివసించే అన్ని ప్రాణులు – కదలని చెట్టుచేమలు, కదిలే పశుపక్ష్యాదులు, మనుష్యులు – అన్నంనుంచి పుడుతున్నాయి. అందువల్ల అన్నమయానికి అన్నం సృష్టికారణం.

**అథో అన్నేనైవ జీవంతి** – ఈ శరీరాలు స్థూలప్రపంచంలోనే స్థితి పొందుతున్నాయి. అంటే అన్నం స్థితికారణం కూడా అవుతున్నది. అన్నేన ఏవ జీవంతి – అన్నంవల్లనే జీవిస్తున్నాయి.

**అథైనదపియంత్యంతతః** – అంతంలో కూడా ఈ అన్నంలోనే లయమవుతున్నాయి.

ఆ విధంగా ఉపాదానం అయిన అన్నం ఉపాదాన కారణం అయింది, అన్నమయ ఆత్మ కార్యం అయింది.

ఇక్కడ గమనించాల్సిన ప్రత్యేకమైన అంశం ఏమిటి? ఉపాదాన కారణం, కార్యం – రెండూ ఒకటే. ఉదాహరణకు ఉపాదాన కారణమైన బంగారం, ఆభరణాలైన కార్యం

రెండూ ఒకటే. కాకపోతే ఆభరణాలకు గొలుసు, గాజులు, ఉంగరం అంటూ మనం అనేక భిన్న నామరూపాలను వాడతాము. వ్యష్టి స్థూలశరీరాన్ని విశ్వ అనీ, సమష్టి స్థూలప్రపంచాన్ని విరాట్ అనీ అంటారు. ఈ విధంగా విశ్వ–విరాట్ జంట ఒకటే; వ్యష్టి–సమష్టి ఒకటే; అల–సముద్రం ఒకటే. దీని తర్వాత ఉపనిషత్తు అన్నంయొక్క గొప్పతనాన్ని కీర్తిస్తున్నది.

**అన్నగ్ం హి భూతానాం జ్యేష్ఠమ్** – అన్నం అంటే విరాట్ అని చూశాము. ఈ విరాట్ కారణం కాబట్టి, కారణం కార్యం పుట్టకముందే ఉంటుంది. అందువల్ల కారణం జ్యేష్ఠమ్ అవుతుంది. ఒక కుటుంబంలో జ్యేష్ఠపుత్రుడు అంటే తక్కిన పిల్లలకన్నా ముందు పుట్టినవాడని అర్థం. పైగా, కారణం కార్యమంతటా ఉంటుంది. బంగారం, ఆభరణమంతటా ఉంటుంది. విరాట్, విశ్వ అంతటా ఉంటాడు. అనంతమైన కారణం, పరిమితమైన కార్యమంతటా ఉంటుంది. అన్నం బ్రహ్మ అంటే సర్వవ్యాపకం. అందువల్ల అన్నంయొక్క శ్రేష్ఠత్వంమీద ధ్యానం చేయాలి. జ్యేష్ఠభ్రాతా పితృ సమః – పెద్దన్నయ్య తండ్రితో సమానం. అందువల్ల జ్యేష్ఠమైన అన్నాన్ని గౌరవించాలని చెబుతుంది మన శాస్త్రం.

**తస్మాత్సర్వౌషధముచ్యతే** – అన్నాన్ని సర్వ ఔషధం అంటారు. ఓషః అంటే అగ్ని; అంటే వస్తువులను దహించేది. అగ్నిలో రెండురకాలు ఉన్నాయి. అవి బాహ్యాగ్ని, ఆంతర అగ్ని. ఆంతర అగ్ని అంటే ఆకలి. ఆ అగ్నికి సంస్కృతంలో అనేకపేర్లు ఉన్నాయి. అవి – వైశ్వానరాగ్ని, జఠరాగ్ని, సమానఅగ్ని.

అందువల్ల మనం తీసుకునే ఆహారాన్ని ఈ వైశ్వానరాగ్నికి ఆహుతిగా వేస్తాము (ప్రాణాయస్వాహా). ఆకలి వేసినప్పుడు దాన్ని ఆహారంతో తీర్చకపోతే, ఈ అగ్ని కడుపులోని లోపల భాగాలను కాలుస్తుంది. అదే మనకు అల్సర్ రూపంలో ఏర్పడుతుంది. ఆకలికి ఇంకొకపేరు అశః. అశః అంటే అంతరాగ్ని; రసాయనాలతో కూడిన ఆంతర అగ్ని అది. అన్నం తినే సమయానికి ఈ రసాయనాలు కడుపులో ఊరుతాయి, అన్నాన్ని జీర్ణింపజేయటానికి. అన్నం పడకపోతే, ఆ ఊరిన రసాయనాలు కడుపులోని సున్నితమైన పొరలను కాలుస్తాయి. ఓషధం ఈ జఠరాగ్నిని తృప్తి పరుస్తుంది. అందువల్ల అన్నం సర్వ ఔషధం.

ఒక్కముక్కలో చెప్పాలంటే, ఈ అనువాకంలో మనను అన్నంమీద ఉపాసన చేయమంటున్నది ఉపనిషత్తు. అన్నాన్ని కారణంగా భావించి ఉపాసన చేయాలి. కారణ అన్నధ్యానం లేదా సమష్టి అన్నధ్యానం. అన్నంమీద ఉపాసన చేయాలంటే దాని గొప్పతనం గురించి తెలియాలి. అందువల్ల అన్నాన్ని కీర్తిస్తున్నది ఉపనిషత్తు. నాలుగు గుణాలను కీర్తిస్తున్నది.

చతుర్విధ విభూతియుక్త అన్నబ్రహ్మ ఉపాసనం కురు.

**కారణత్వమ్** – అన్ని జీవరాశుల సృష్టికి కారణం – సర్వ అన్నమయ కారణమ్

**బ్రహ్మత్వమ్** – ఉపాదాన కారణం కార్యమంతటా ఉంటుంది. అందువల్ల కారణం సర్వగతమ్. సంస్కృతంలో సర్వగతమ్ బ్రహ్మకు వర్తిస్తుంది. అందువల్ల అన్నానికి బ్రహ్మత్వమ్ పదం వర్తిస్తుంది.

**జేష్ఠత్వమ్** – అన్నం కారణం కాబట్టి, అది కార్యాలన్నింటికన్నా ముందు ఉండాలి. అందువల్ల అన్నం, అన్నమయ ఆత్మకన్నా ముందు పుట్టింది. మన సాంప్రదాయంలో పెద్దన్నయ్యను తండ్రితో సమానంగా భావిస్తారు.

**సర్వౌషధత్వమ్** – అన్నాన్ని లోపలికి వెయ్యకపోతే, లోపల ఉన్న వైశ్వానరాగ్ని కడుపును కాలుస్తుంది. అన్నం ఆకలిని తీర్చి నయం చేస్తుంది కాబట్టి ఔషధం అయింది.

ఈ సర్వవ్యాపకమైన అన్నాన్ని చూడటం ఎలా? ఈ సమష్టి అన్నాన్ని విరాట్ ఈశ్వరుడు లేదా వైశ్వానర ఈశ్వరుడు అనికూడా అంటారు. ఈ సమష్టి విరాట్‌ను చూడటం ఎలా? నా మనస్సు అంత సర్వవ్యాపకమైన దాన్ని చూడలేదు కాబట్టి ఉపనిషత్తు నీ స్థూలశరీరాన్ని (అన్నమయాన్ని) సమష్టి అన్నానికి ఆలంబనంగా చూడు అంటుంది. వ్యష్టి అన్నమయాన్ని విశ్వ అంటే, సమష్టి అన్నమయాన్ని విరాట్ అంటారు. అందువల్ల విరాట్‌ను విశ్వమీద ఆవాహన చేయాలి. ఈ ఉపాసనను విశ్వ–విరాట్ ఐక్య ఉపాసన అంటారు.

**యేஉన్నం బ్రహ్మోపాసతే** – యే ఉపాసతే అన్నం బ్రహ్మ – ఎవరైతే అన్నం బ్రహ్మమీద (అన్నమయాన్ని ఆలంబనగా పెట్టుకుని) చేస్తారో,

**సర్వం వై తేஉన్నమాప్నువంతి** – వారు నిశ్చయంగా సకలమైన అన్నాన్నీ పొందుతారు.

ఈ ఉపాసన చేసిన సంకల్పాన్ని బట్టి, రెండు రకాల ఫలాలను పొందుతారు.

**సకామ ఉపాసన** – లౌకికఫలాన్ని కోరి చేస్తే ఈ ఉపాసన లౌకికఫలాన్ని ఇస్తుంది. ఉపాసకుడు అన్నాన్ని సమృద్ధిగా పొందుతాడు. జీవితంలో ఎన్నడూ అన్నానికి అలమటించిపోవాల్సిన అవసరం ఉండదు.

**నిష్కామ ఉపాసన** – ఆధ్యాత్మిక ఎదుగుదలకోసం ఉపాసన చేస్తే, చిత్తఏకాగ్రత ఏర్పడుతుంది. సమష్టిని వ్యష్టిమీద ఉపాసన చేయటంవల్ల విశాల దృక్పథం ఏర్పడుతుంది. నేను, నా ఊరు, నా దేశం అనుకుంటూ వచ్చిన పరిచ్ఛిన్న భావన పోతుంది. సమష్టి ప్రపంచం ఒక జడపదార్థం కాదు, ప్రపంచమంతటా బ్రహ్మ ఉన్నాడు అని ఎప్పుడైతే చూస్తారో అప్పుడే చిత్తశుద్ధి, చిత్తఏకాగ్రత, చిత్తవిశాలత కలుగుతాయి. ఒక్కముక్కలో చెప్పాలంటే జ్ఞానయోగ్యతాప్రాప్తి ఇస్తుంది. బ్రహ్మజ్ఞానం పొందాలంటే జ్ఞానయోగ్యతాప్రాప్తి కావాలి.

**అన్నగ్ం హి భూతానాం జ్యేష్ఠమ్। తస్మాత్సర్వౌషధముచ్యతే। అన్నాద్భూతాని జాయన్తే జాతాన్యన్నేన వర్ధంతే। అద్యతేఽత్తి చ భూతాని। తస్మాదన్నం తదుచ్యత ఇతి।**

**అన్నగ్ం హి భూతానాం జ్యేష్ఠమ్** – అన్నము అన్ని జీవరాశులకన్నా ముందు పుట్టింది.

**తస్మాత్ విరాడజాయత । విరాజో అధిపూరుషః**

**సజాతో అత్యరిచ్యత । పశ్చాద్భూమిమథో పురః** – పురుషసూక్తమ్

పురః అంటే శరీరాలన్నీ; విరాట్ ముందు పుట్టాకనే, తక్కిన శరీరాలన్నీ (జీవరాశులన్నీ) పుట్టాయి.

**తస్మాత్సర్వౌషధముచ్యతే** – అందువల్ల దీనిని సర్వౌషధమంటారు.

**అన్నాద్భూతాని జాయంతే** – ఈ వాక్యాలన్నీ ఇంతకుముందే, ఈ అనువాకంలోనే చూశాము. కాని ఈ విషయాలను నొక్కివక్కాణించటంకోసం, మళ్ళీ చెబుతున్నది ఉపనిషత్తు. అన్ని ప్రాణులు అన్నంనుంచి పుట్టాయి. భూతాని అంటే స్థూలశరీరం; అంటే ప్రాణులు. అన్నం సృష్టికారణం.

**జాతాన్యన్నేన వర్ధన్తే** – పుట్టిన ప్రాణులు అన్నంవల్లనే వర్ధిల్లుతున్నాయి. అంటే అన్నంలోనే స్థితి పొందుతున్నాయి.

**అద్యతేఽత్తి చ భూతాని** – చివరగా అన్నం పదం ఎలా వచ్చిందో వివరిస్తున్నది ఉపనిషత్తు. అద్ ధాతువునుంచి వచ్చింది అన్నం. అద్ అంటే భక్షించేది, తినేది. ఆహారాన్ని అన్నం అని ఎందుకు అంటారు? ఎందుకంటే అన్నం తినబడేది, తినేది కూడా. అలా ఎలా కుదురుతుంది?

మొదట్లో మనం అన్నాన్ని తింటాము. మరణించాక స్థూలశరీరాన్ని కాల్చటమో లేదా భూమిలో పాతిపెట్టటమో చేస్తారు. అంటే ఈ స్థూలశరీరం మట్టిలో కలిసిపోతుంది. ఆ విధంగా అన్నం, శరీరాన్ని తింటుంది. మనం జీవించివుండగా, మట్టిని అన్నంగా చేసుకుని తింటే, మనం మరణించాక, మట్టి మనను అన్నంగా చేసుకుని తింటుంది.

అద్యతే ఇతి అన్నమ్ – మనుష్యులచేత తినబడేది అన్నం;

**అత్తి చ** – అది ప్రాణులను అన్నంగా తింటుంది. ఆ విధంగా అన్నం లయకారణం కూడా అయింది.

**తస్మాత్ తదన్నమ్ ఉచ్యతే** – అందువల్ల బాహ్యప్రపంచాన్ని అన్నం అంటారు.

**ఇతి** – ఇక్కడితో ఋగ్వేదమంత్రం అయిపోయింది.

ఆ విధంగా మొత్తం స్థూలప్రపంచం అన్నం అయితే, అన్నమయం దాన్నుంచి వచ్చిన కార్యం.

అంతేకాదు, కారణమైన సమష్టి ప్రపంచం (అన్నం); కార్యమైన వ్యష్టి శరీరం (అన్నమయ) రెండూ ఒకటే. ఎందుకంటే రెండింటిలోనూ సమానంగా ఉన్నది ఒకటే. రెండింటిలోనూ ఉన్న పంచభూతాలూ, పాంచభౌతిక శరీరాలూ వచ్చాయి.

ఇంతవరకూ స్థూలశరీరాన్ని అన్నమయంగా, స్థూలప్రపంచాన్ని అన్నంగా చూశాము. స్వరూపంగా చూస్తే రెండూ ఒకటే అనికూడా చూశాము. రెండూ పాంచభౌతికాలే. శరీరంలోనూ, ప్రపంచంలోనూ భూమి, జలం, అగ్ని, వాయువు, ఆకాశం ఉన్నాయి. కొన్నాళ్ళు ఈ ఉపాసన చేస్తే, నిజం చెప్పాలంటే, స్థూలశరీరానికి మరణం లేదని తెలుసుకుంటాము. ఈ స్థూలశరీరం పంచభూతాలనుంచి వచ్చింది, వాటిలోనే స్థితి పొందుతున్నది; వాటిలోనే చివరికి లయమయిపోతుంది.

సముద్రంలో పుట్టిన అల, అల నాశనమైతే మళ్ళీ సముద్రంలోనే లయమయిపోతుంది. అంటే అల పుట్టక ముందు, మరణించాక కూడా సముద్రమే. తాత్కాలికంగా సముద్రం నుంచి వియోగం పొందినట్టుగా అనిపిస్తుంది. ఎందుకంటే అది అలగా ఉన్నప్పుడు కూడా అది సముద్రానికి భిన్నంగా లేదు; రెండింటిలోనూ ఉన్నది నీరే. కాకపోతే ఇప్పుడు అలకు వేరే ప్రత్యేకమైన నామం, రూపం ఏర్పడ్డాయి. అందువల్ల మరణం అనే పదానికి అర్థం లేదు.

మరణిస్తామేమోననే భయం భ్రాంతినుంచి వచ్చింది. ఈ బాహ్య నామ, రూపాలతో ఎంతగా మమేకం చెందుతామంటే, సత్యానికి దూరంగా వచ్చేస్తాము. నిజానికి మనం పంచభూతాలనుంచి వచ్చాము, పంచభూతాలలో కరిగిపోతాము; మధ్యలో వచ్చిన నామరూపాలు తాత్కాలికం అనే విషయాన్ని పూర్తిగా మర్చిపోతాము. నామం, రూపం ఏదైనా కూడా అందులోని పదార్థం ఒకటే. ఆ పదార్థం శాశ్వతం, ఆకారం అశాశ్వతం. మార్పు సహజం; ఇది ప్రకృతి సూత్రం. ఒకే ఆకారంలో ఏదీ శాశ్వతంగా ఉండదు. కొన్ని పదుల సంవత్సరాల కిందట నా స్థూలశరీరం ఈ ఆకారంలో లేదు. ఈ నామరూపాలు తాత్కాలికంగా వచ్చినవి, స్వరూపదృష్ట్యా నేను పాంచభౌతికం అని తెలిస్తే, ఈ మరణభయం ఉండదు. నామరూపదృష్టి ఉంటేనే మరణభయం ఉంటుంది. స్వరూపాన్ని పట్టుకోగలిగితే ఈ దేహాభిమానం పోతుంది. దేహాభిమానం ఎంత ఎక్కువగా ఉంటే, అంత ఎక్కువగా అహంకారం ఉంటుంది; అహంకారం ఎంత ఎక్కువగా ఉంటే, అంత ఎక్కువగా మరణభయం ఉంటుంది. ఎప్పుడైతే స్వరూపదృష్టికి వస్తానో, అప్పుడే నా అహంకారం సన్నగిల్లుతుంది, దానితోపాటే నా మరణభయం కూడా పోతుంది. ఆ విధంగా అన్నమయ – అన్నఐక్య ఉపాసన చేస్తే దేహాభిమానాన్ని పోగొట్టుకోవటంలో తోడ్పడుతుంది. దేహ అభిమానం ఆత్మజ్ఞానానికి ఆటంకమవుతుంది.

**క్లేశో౽ ధికతరస్తేషామ్ అవ్యక్తాసక్తచేతసామ్ ।**
**అవ్యక్తా హి గతిర్దుఃఖం దేహవద్భిరవాప్యతే ॥** – గీత 12.5

దేహాభిమానం ఉన్నవారికి, అవ్యక్తబ్రహ్మజ్ఞానం పొందటం చాలా కష్టం.

దేహాభిమానం ఎక్కువగా ఉంటే, మరణ ఉపాసనం చేయాలి. అల సముద్రంలో లయమయిపోతే, తీరికూర్చుని దానికోసం పదమూడు రోజులు ఏడవము. అది చాలా సహజమైన పరిణామం. అటువంటి దానికోసం దుఃఖించము. మనం భ్రాంతికి లోనయినన్నాళ్ళూ ఈ దుఃఖం తప్పదు.

ఒకవేళ మన మరణం గురించి మనం ధైర్యంగా ఉన్నాకూడా, మన ఆత్మీయుల మరణానికి దుఃఖించకుండా ఉండలేము. మనవారైనా, పరాయివారైనా కూడా స్థూలశరీరం అన్నాక అది షడ్వికారాలకు లోనవకా తప్పదు, చివరికి మరణించకా తప్పదు. మరణం సహజం అని మనకూ తెలుసు; పరాయివారి మరణ విషయంలో మనం అతిగా స్పందించము; కాని మనవారి మరణాన్నే మనం జీర్ణించుకోలేము. అంటే మరణానికి మనల్ని కృంగదీసే శక్తి సహజంగా లేదు; మనమే దానికి అనవసరమైన ప్రాముఖ్యతను ఇస్తున్నాము. ఈ విషయాన్ని మనం బాగా జీర్ణించుకోగలిగితే, ఇప్పుడు మన కాలును మొదటిమెట్టు మీంచి తీసి, రెండవమెట్టు మీద పెట్టగలము. మొదటిమెట్టు **అన్నమయఆత్మ.**

ఈ మెట్టు మీద ఎన్నాళ్ళు ఉండాలి? అది అందరికీ ఒకేలా ఉండదు. అది మనకున్న దేహాభిమానాన్నిబట్టి ఉంటుంది. కొంతమందికి ఈ దేహాభిమానం వెంటనే పోవచ్చు; కొంతమందికి కొన్ని సంవత్సరాలు పట్టవచ్చు; మరికొంతమందికి కొన్ని జన్మలు కూడా ఎత్తాల్సిరావచ్చు. ఏదేమైనా దేహాభిమానాన్ని వదిలితీరాలి.

ఇక్కడితో అన్నమయమే ఆత్మ అయిపోయింది.

**తస్మాద్వా ఏతస్మాదన్నరసమయాత్। అన్యో౽న్తర ఆత్మా ప్రాణమయః। తేనైషపూర్ణః। స వా ఏష పురుషవిధ ఏవ। తస్య పురుష విధతామ్। అన్వయం పురుషవిధః। తస్య ప్రాణ ఏవ శిరః। వ్యానో దక్షిణః పక్షః।అపాన ఉత్తరః పక్షః। ఆకాశ ఆత్మా। పృథివీ పుచ్ఛం ప్రతిష్ఠా। తదప్యేష శ్లోకో భవతి।**

2. **ప్రాణమయ ఆత్మ** – ఇప్పుడు రెండవ మెట్టు ఎక్కాలి. ఇక్కడ అన్నమయం ఆత్మ కాదు, ఆత్మ అన్నమయానికి భిన్నంగా ఉంది అంటున్నది ఉపనిషత్తు. దానికి కారణాలు కూడా చెబుతున్నది.

**తస్మాద్వా ఏతస్మాదన్నరసమయాత్ అన్యః** – ఆత్మ అన్నమయానికి భిన్నంగా ఉంది.

**అంతర ఆత్మా ప్రాణమయః** – అన్నమయం లోపల ఉన్న ప్రాణమయం ఆత్మ. ప్రాణమయం, అన్నమయంకన్నా లోపల ఉంది. దానికన్నా సూక్ష్మంగా ఉంది. అన్నమయం స్థూలంగా

ఉండి, కంటికి కనబడుతుంది. కాని ప్రాణమయం సూక్ష్మంగా ఉంటుంది. అది చేసే పనులు కంటికి కనబడవు. శక్తిని ప్రదర్శించే వస్తువుకన్నా, ఆ వస్తువుయొక్క శక్తి ఎప్పుడూ సూక్ష్మతరంగా ఉంటుంది.

ఇప్పుడు రెండవ మెట్టు ఎక్కాము. రెండవ మెట్టుమీద కాళ్ళు పెడితే, మొదటి మెట్టు మీంచి కాళ్ళు తీసేయాలి. ఒక కాలు ఇంకా మొదటి మెట్టు మీద ఉంటే, రెండవ మెట్టుమీద పూర్తిగా నిలబడలేము. మెట్టుమీద కాళ్ళు పెట్టటం అంటున్నామంటే, ఇది నిజంగా బాహ్యంగా జరిగే ప్రయాణం కాదు. ఇది ఉదాహరణ మాత్రమే. నిజానికి ఈ ప్రయాణం అంతరంగా, బుద్ధిలో చేయాలి. అంటే విషయాన్ని లోతుగా అర్థం చేసుకోవాలి.

ఎలా అర్థం చేసుకోవాలో, కొంత విశ్లేషిద్దాము.

**అనాత్మ** – ఎప్పుడైతే ప్రాణమయాన్ని ఆత్మ అన్నామో, అన్నమయం ఆత్మ కాదని చెప్పకనే చెప్పినట్టవుతుంది. అన్నమయానికి ఆత్మ హోదా తీసేసి, ఇంకొక కొత్త పేరు ఇస్తాము. ఏమిటది? అనాత్మ. ఆత్మ కానిది అనాత్మ (న ఆత్మ). ఇకనుంచి అన్నమయాన్ని అన్నమయకోశం అంటాము. అనాత్మ, కోశం పర్యాయపదాలు. ఈ విధంగా అన్నమయం అనాత్మ అన్నాము.

**అన్నమయస్య అనాత్మ నిశ్చయః**

**కార్యం** – మొదటి అనువాకంలో సృష్టిప్రక్రియ గురించి నేర్చుకున్నప్పుడు, ఒక సూత్రాన్ని నేర్చుకున్నాము. ఏమిటది? ఈ జగత్తులో ప్రతిదీ ఆత్మనుంచి పుట్టింది.

**తస్మాద్వా ఏతస్మాదాత్మన ఆకాశస్సంభూతః**

అంటే ప్రతి ఒక్క అనాత్మ కూడా ఆత్మనుంచి పుట్టింది. అన్నమయం అనాత్మ అయితే, అది కూడా ఆత్మనుంచి పుట్టాలి. ఆ విధంగా అన్నమయం కార్యం. **కార్యత్వ నిశ్చయః.**

**నామరూపం** – ఏ కార్యమైనా కూడా కేవలం నామరూపాలు మాత్రమే గాని, అసలు పదార్థం కాదు. ఆభరణం నామరూపాలు మాత్రమే, బంగారమే అసలు పదార్థం. కంసాలి కొత్తగా కొంచెం కూడా బంగారాన్ని ఉత్పత్తి చేయలేదు. ముందే అవ్యక్త నామరూపాలుగా ఉన్న బంగారానికి ఆభరణం అనే వ్యక్తనామరూపాలను ఇస్తాడు అంతే.

**యత్ కార్యం తత్ నామ రూపాత్మకమ్ వాచాఽ ఽ రంభణం వికారో నామధేయమ్**

ఈ విధంగా అన్నమయం ఆత్మ కాదు కాబట్టి అనాత్మ; అనాత్మ కాబట్టి కార్యం; కార్యం కాబట్టి నామరూపాత్మకం. **నామరూపత్వ నిశ్చయః.**

**మిథ్య** – ఒక కార్యం నామరూపాలు మాత్రమే అంటే అర్థం, దానికి విడిగా ఉనికి లేదని. గాజు నామరూపాలు మాత్రమే. దాని బంగారం లేకుండా విడిగా ఉనికి లేదు. విడిగా ఉనికి లేకపోతే అది ఉన్నా లేనట్టే. అందువల్ల నామరూపాత్మకమైన అనాత్మ మిథ్య. **మిథ్యాత్వ నిశ్చయః.**

**ప్రవిలాపనమ్** – విడిగా ఉనికి లేనిది ఉన్నా లేనట్టే అని చూశాము. ఒక స్త్రీ బాగా మేకప్ వేసుకుంటేనే అందంగా ఉంటుంది అంటే, అది ఆమె సహజ సౌందర్యం కాదు. అరువు తెచ్చుకున్న అందం, స్వరూప అందం కాదు. అదే విధంగా అరువు తెచ్చుకున్న ఉనికి స్వరూపలక్షణం కాదని తెలుసుకుంటే, మిథ్యా వస్తువుమీద దృష్టి పోతుంది.

ఒక కుండలో ఉన్నది మట్టి మాత్రమే అని అర్థమవుతుందో, అప్పుడే ఇంకో కుండ యొక్క నామరూపాలమీద శ్రద్ధ పోతుంది. చెక్క ఏనుగును చూసి ముందు భయపడతాడు ఒక బాలుడు. అది నిజం ఏనుగు కాదు, చెక్కలో చెక్కబడిన ఏనుగు అని తెలుసుకునేసరికి, అతని భయం ఆ జ్ఞానంలో కరిగిపోతుంది. అంటే అక్కడ ఏనుగు కార్యం మాత్రమే, చెక్క అనే కారణంనుంచి వచ్చింది అని తెలుసుకుంటాడు. అప్పుడు కారణదృష్టి, కార్యాన్ని లయం చేస్తుంది. దీన్ని ప్రవిలాపన నిశ్చయః అంటారు. ఆ విధంగా అన్నమయాన్ని నేను అన్నమయం అనే పదార్థం లేదు అనే జ్ఞానంతో లయం చేస్తాను.

టూకీగా చెప్పాలంటే – **అన్నమయస్య అనాత్మ నిశ్చయః, కార్యత్వ నిశ్చయః, నామరూపత్వ నిశ్చయః, మిథ్యాత్వ నిశ్చయః, ప్రవిలాపన నిశ్చయః.**

అన్నమయాన్ని ప్రాణమయంలో ప్రవిలాపనం చేసేశాము.

ఇప్పుడు ప్రాణమయంమీద ఉపాసన చేయాలి. ఇదే పద్ధతి ఒక్కొక్క కోశానికీ చేసుకుంటూ రావాలి. అంటే కొన్నాళ్ళు ప్రాణమయం ఆత్మ అని ఉపాసన చేశాక, మళ్ళీ బుద్ధిని పదును పెట్టాలి. అంటే అన్నమయానికి వాడిన పద్ధతినే వాడి ప్రాణమయానికి కూడా ఐదు అంశాలూ పరీక్షించాలి. అవి అనాత్మ నిశ్చయం, కార్యనిశ్చయం, నామరూప నిశ్చయం, మిథ్యాత్వ నిశ్చయం, ప్రవిలాపనం చేయాలి. ఈ ప్రవిలాపనంలో ప్రాణమయాన్ని మనోమయంలో లయం చేయాలి. అప్పుడు మనోమయం ఆత్మ అవుతుంది. ఇలాగే మనోమయాన్ని విజ్ఞానమయంలోను, విజ్ఞానమయాన్ని ఆనందమయంలోను, ఆనందమయాన్ని ఆత్మలోను లయం చేసుకుంటూ రావాలి. ఇదీ మన ప్రయాణం. ఇది చాలా సూక్ష్మమైన ప్రయాణం. దీన్నే పంచకోశవివేకం అంటారు.

ఇప్పుడు మన ప్రయాణంలో మనం ఇంకా రెండవ మెట్టుమీదే ఉన్నాము. ప్రాణమయమే ఆత్మ అన్నాము. ఈ ప్రాణమయం గురించిన వివరాలు తెలుసుకోవాలి. ప్రాణమయం

ఎక్కడ ఉంటుంది? అది అన్నమయం కోశంలో ఉంటుంది. అందువల్ల అన్నమయం పాత్ర అయితే, ప్రాణమయం అందులో ఉన్న పదార్థం అవుతుంది.

ఇంకో విధంగా చెప్పాలంటే అన్నమయ శరీరం, ప్రాణమయం శరీరీ; అన్నమయం దేహం, ప్రాణమయం దేహిః.

**తేనైష పూర్ణః** – పూర్ణః ఏష తేన – ఈ (అన్నమయం) అనే పాత్ర ప్రాణమయ ఆత్మ అనే పదార్థంతో నిండివుంది. ఈ దశలో ప్రాణమయం ఆత్మ. తర్వాత దశకు చేరుకున్నాకే ప్రాణమయం కూడా అనాత్మ అయిపోతుంది. తర్వాత దశలో మనోమయం ఆత్మ అవుతుంది, ప్రాణమయం కోశం అవుతుంది. కాని ఇప్పుడు మనం ప్రాణమయాన్ని ఆత్మగా చూస్తున్నాము. ఆ విషయాన్ని మర్చిపోకూడదు.

అన్నమయం స్థూలశరీరం కాబట్టి దానికి ఒక రూపం ఉంది. దాన్నే పురుష ఆకారం అంటారు. కాని ప్రాణమయం శక్తి కాబట్టి దానికంటూ ఒక ఆకారం లేదు. ఒక ద్రవాన్ని ఏ పాత్రలో పోస్తే, అది ఆ పాత్ర ఆకారాన్ని ఎలా పొందుతుందో, అలా ప్రాణమయం, అన్నమయంలో ఉండటంవల్ల అది కూడా పురుష ఆకారంలోనే ఉంది.

**స వా ఏష పురుషవిధ ఏవ** – ప్రాణమయానికి కూడా పురుష ఆకారమే ఉంది అంటే మనుష్య ఆకారమే ఉంది. ఈ శరీరంలో ప్రాణం ఉన్నంతవరకూ దానికి ఈ ఆకారం ఉంటుంది. ఈ స్థూలశరీరం పడిపోయాక, ప్రాణం ఇందులోంచి వెళ్ళిపోయి ఇంకొక కొత్త శరీరంలో చేరుతుంది. అప్పుడు ఆ శరీరం ఏ ఆకారంలో ఉంటే, ఆ ఆకారాన్ని పొందుతుంది ప్రాణమయం. ఈ విధంగా, అన్నమయ ఆకారం ప్రాణమయ ఆకారాన్ని నిర్ణయిస్తుంది.

**తస్య పురుష విధతామ్ అన్వయం పురుషవిధః** – అన్నమయం పురుషాకారంలో ఉంది కాబట్టి, ప్రాణమయం కూడా పురుషాకారంలో ఉంది. అందువల్ల అన్నమయానికి చూసిన ఐదు భాగాలను ఇప్పుడు ప్రాణమయానికి కూడా చూస్తాము. శిరస్సు, దక్షిణ పక్షము, ఉత్తరపక్షము, ఆత్మా, ప్రతిష్ఠా. అవేమిటో చూద్దాము.

**తస్య ప్రాణ ఏవ శిరః** – ప్రాణమయ ఆత్మకు, ప్రాణమే తల.

పంచప్రాణాలు చేసే పనితీరు

| | | |
|---|---|---|
| ప్రాణం | – | శ్వాసక్రియ |
| అపానం | – | విసర్జనక్రియ |
| వ్యానం | – | రక్తప్రసరణక్రియ |
| సమానం | – | జీర్ణక్రియ |
| ఉదానం | – | తిరోగమనక్రియ |

ఈ పంచప్రాణాలు చేసే అన్ని క్రియల్లోకి ప్రాణం చేసే క్రియ అత్యంత ముఖ్యమైనది. అందువల్లే ప్రాణమే తల అంటున్నది ఉపనిషత్తు.

**వ్యానో దక్షిణః పక్షః** – వ్యానం రక్తప్రసరణ క్రియను చేస్తుంది. విష్వక్ గమనవాన్ వాయుః వ్యానః. రక్తప్రసరణ చేసే ఈ వ్యానం జీర్ణించబడిన అన్నాన్ని శరీరం అంతటా సరఫరా చేస్తుంది. వ్యాన్‌లాగా అంతటా తిరిగే ఈ వ్యానమే కుడి భాగము.

**అపాన ఉత్తరః పక్షః** – శరీరంలో ఆహారం జీర్ణించబడ్డాక, వాటిలోని పోషక పదార్థాలను శరీరం అంతటా వ్యానం తీసుకువెళ్ళాక, మిగిలిపోయిన వ్యర్థపదార్థాలను బయటకు తోసే పని అపానంది. అపానమే ఎడమ భాగము.

**ఆకాశ ఆత్మా** – ఇక్కడ ఆకాశం పదం సమానాన్ని సూచిస్తోంది. సమానం జీర్ణక్రియను చేస్తుందని చూశాము. అది శరీరంయొక్క మధ్యభాగంలో (ఉదరాకాశంలో) ఉంటుంది. ఆహారాన్ని జీర్ణింపజేసి, దాన్నించి పోషకపదార్థాలను ఉత్పత్తి చేస్తుంది. ఆ విధంగా సమానం ఆత్మ అయింది. ఇక్కడ ఉదానవాయువును గురించి చెప్పలేదు. ఎందుకంటే, దానికి పని ప్రతిరోజూ ఉండదు; ఎప్పుడైనా ఉంటుంది. ముఖ్యంగా వ్యక్తి మరణించినప్పుడు ఉంటుంది.

**పృథివీ పుచ్ఛం ప్రతిష్ఠా** – పృథివీ దేవత శరీరంయొక్క కిందభాగం. అది శరీరానికి ఆధారంగా ఉంటుంది. పృథివీ దేవత తన భూమ్యాకర్షణ శక్తివల్ల శరీరంలో ఉన్న ప్రాణాన్ని ఎగరనివ్వకుండా కిందికి లాగి ఉంచుతుంది. మన శరీరంలో ఏడు ద్వారాలున్నాయని కృష్ణపరమాత్మ చెప్పాడు. పదకొండు ద్వారాలున్నాయని కఠోపనిషత్తు చెప్పింది. అన్ని ద్వారాలున్న శరీరం గాలిలో ఎగిరే బెలూన్‌లాగా ఎగిరిపోకుండా, పృథివి కిందకు ఉంచుతుంది. ఈ ప్రాణశక్తి మనలో మన ప్రారబ్ధకర్మ ఉన్నంతవరకూ ఉంటుంది. ప్రారబ్ధకర్మ ముగిసిన మరుక్షణం ప్రాణం ఈ శరీరాన్ని వదిలి వెళ్ళిపోతుంది.

**తదప్యేష శ్లోకో భవతి** – ఈ ప్రాణమయ విషయం గురించి ఈ మంత్రం ఉంది. తైత్తిరీయోపనిషత్తు యజుర్వేదానికి చెందింది. అది ఋగ్వేదానికి చెందిన మంత్రాన్ని ఉటంకిస్తున్నది. ఈ ఋగ్మంత్రం ప్రాణమయాన్ని కీర్తించి, ప్రాణమయ–సమష్టి–ప్రాణ–ఐక్య ఉపాసనను పరిచయం చేస్తుంది.

### అనువాకం – 3

**ప్రాణం దేవా అనుప్రాణన్తి। మనుష్యా పశవశ్చ యే। ప్రాణో హి భూతానామాయుః। తస్మాత్సర్వాయుషముచ్యతే। సర్వమేవ త ఆయుర్యంతి। యే ప్రాణం బ్రహ్మోపాసతే। ప్రాణో హి భూతానామాయుః। తస్మాత్సర్వాయుషముచ్యత ఇతి। తస్యైష ఏవ శారీర ఆత్మా। యః పూర్వస్య।**

**తస్మాద్వా ఏతస్మాత్ప్రాణమయాత్। అన్యో౽న్తర ఆత్మా మనోమయః। తేనైష పూర్ణః। స వా ఏష పురుష విధ ఏవ। తస్య పురుష విధతామ్। అన్వయం పురుష విధః। తస్య యజురేవ శిరః। ఋగ్దక్షిణః పక్షః। సామోత్తరఃపక్షః। ఆదేశ ఆత్మా। అథర్వాంగిరసః పుచ్ఛం ప్రతిష్ఠా। తదప్యేష శ్లోకో భవతి।**

**వివరణ**

**ప్రాణం దేవా అనుప్రాణన్తి। మనుష్యా పశవశ్చ యే। ప్రాణో హి భూతానామాయుః। తస్మాత్సర్వాయుషముచ్యతే। సర్వమేవ త ఆయుర్యంతి। యే ప్రాణం బ్రహ్మోపాసతే। ప్రాణో హి భూతానా మాయుః। తస్మాత్సర్వాయుషముచ్యత ఇతి।**

ఋగ్మంత్రం ప్రాణం దేవా దగ్గరనుంచి మొదలై, తస్మాత్సర్వాయుషముచ్యత ఇతితో ముగుస్తుంది. వేదాలు అపౌరుషేయాలు. అవి సాక్షాత్తూ పరమాత్మనుంచి వచ్చాయి. వాటిని ఋషులు వారి సత్త్వగుణంవల్ల విని అందుకున్నారు. ఈ వేదాలు కర్ణపరంగా వచ్చాయి కాబట్టి వీటికి కామాలు, ఫుల్‌స్టాప్‌లు, ఇన్వర్టెడ్ కామాలు ఉండవు. ఇతి అనే పదం ఇక్కడితో మంత్రం అయిపోయిందని సూచిస్తుంది.

ఈ ఋగ్మంత్రం సమష్టిప్రాణంనుంచి ఉత్పత్తి చెందినదే వ్యష్టిప్రాణం అని అంటున్నది. సమష్టి ప్రాణాన్ని హిరణ్యగర్భ లేదా సూత్రాత్మా అంటారు. ఒకటే జీవతత్త్వం విశ్వమంతటా వ్యాపించి ఉంది. మరణం దేన్నీ కొత్తగా నాశనం చేయదు – కేవలం ప్రాణమయం, అన్నమయంనుంచి విడిపోతుంది అంతే. అప్పుడు వ్యష్టి అన్నమయం సమష్టి అన్నంలోనూ, వ్యష్టి ప్రాణమయం సమష్టి ప్రాణంలోనూ కలుస్తుంది. అన్నమయ–ప్రాణమయాల సంయోగాన్ని జన్మ అనీ, అన్నమయ–ప్రాణమయాల వియోగాన్ని మరణం అనీ అంటారు.

ఈ సమష్టి ప్రాణమే అన్ని ప్రాణుల ప్రాణమయంయొక్క సృష్టి, స్థితి, లయ కారణం. జంతువులన్నీ జీవించి ఉన్నాయంటే, దానికి కారణం ప్రాణమయమే. ఈ ప్రాణమయం సమష్టిప్రాణం అయిన హిరణ్యగర్భ నుంచి వచ్చింది. అందువల్ల మనమంతా హిరణ్యగర్భకు ఋణపడివున్నాము.

**నమో బ్రహ్మణే। నమస్తే వాయో। త్వమేవ ప్రత్యక్షం బ్రహ్మాసి** – శీక్షావల్లీ

శీక్షావల్లీ శాంతిపాఠంలో వాయువును హిరణ్యగర్భకు ప్రతీకగా స్తుతించటం చూశాము. వాయువువల్లనే వ్యష్టి ప్రాణం శరీరంలో ప్రాణమయంగా ఉంది. నిజానికి మనం ప్రతిక్షణం వాయువును లోపలికి పీలుస్తున్నాం, బయటకు వదులుతున్నాము. ఆఖరి వాయువును వదిలినప్పుడు ఈ ప్రాణమయం వాయువుతో కలిసిపోతుంది.

**ప్రాణం దేవా అనుప్రాణంతి। మనుష్యాః పశవశ్చ యే** – దేవతలు, మనుష్యులు, జంతువులు కూడా సమష్టి ప్రాణం అయిన హిరణ్యగర్భ లేదా సూత్రాత్మ వల్లనే ప్రాణశక్తిని పొందుతున్నారు.

ప్రాణం అంటే సమష్టి ప్రాణశక్తి. ఇప్పుడు వస్తున్న ప్రాణిక్ హీలింగ్, రేకీ ఈ సూత్రం మీదనే ఆధారపడి ఉన్నాయి. మనిషిలో ఏ అనారోగ్యం ఏర్పడినా, అది ఈ ప్రాణశక్తి అందకపోవటంవల్లనే అంటారు వీరు. అందువల్ల వీరు సమష్టి ప్రాణాన్ని వారి చేతులకు ఆవాహన చేసుకుని, ఆ చేతుల ద్వారా ఆ ప్రాణశక్తిని ఆ రోగులకు పంపిస్తారు. సూర్యదేవుడు సమష్టి ప్రాణానికి నెలవు అని శాస్త్రాలు ఘోషిస్తున్నాయి.

**ఆదిత్య ఉదయన్యత్ ప్రాచీం దిశం ప్రవిశతి తేన ప్రాచ్యాన్ప్రాణాన్రశ్మిషు సన్నిధత్తే। యద్దక్షిణాం యత్ప్రతీచీం యదుదీచీం యదధో యదూర్ధ్వం యదన్తరా దిశో యత్సర్వం ప్రకాశయతి తేన సర్వాన్ ప్రాణాన్ రశ్మిషు సన్నిధత్తే।** – ప్రశ్నోపనిషత్ 1.6

సూర్యుడు తూర్పున ఉదయించినప్పుడు, తన ప్రాణశక్తిని తన కిరణాలద్వారా ప్రసరింపజేసి, అన్నింటికీ ప్రాణశక్తి ఇస్తాడు. ఒక మహాత్మునికి నమస్కారం చేసినా కూడా ఎదుటివ్యక్తికి ప్రాణశక్తి వస్తుందని ఈ ప్రాణిక్ హీలింగ్ చేసేవారు అంటారు. ఎందుకంటే మహాత్ములు సమష్టిప్రాణంమీద ఉపాసన చేస్తారు కాబట్టి, వారిలో ప్రాణశక్తియొక్క భాండాగారమే ఉంటుంది. ఒక్కముక్కలో చెప్పాలంటే, ప్రాణులన్నిటికీ, వాటి ప్రాణశక్తి ప్రాణతత్త్వంనుంచే వస్తున్నాయి.

**ప్రాణో హి భూతానామాయుః** – హిరణ్యగర్భ ప్రతి ఒక్కజీవిని ప్రాణశక్తి ద్వారా దీర్ఘాయుష్కుడు అయ్యేలాగా దీవిస్తుంది. ఆయుష్య హోమం చేసేటప్పుడు కూడా సమష్టి ప్రాణాన్ని ఆవాహన చేస్తాము. సంధ్యావందన స్తోత్రంలో కొన్ని అద్భుతమైన మంత్రాలు ఉన్నాయి.

**పశ్యేమ శరదశ్శతం జీవేమ శరదశ్శతమ్। నందామ శరదశ్శతం మోదామ శరదశ్శతమ్। భవామ శరదశ్శతగ్ం శృణవామ శరదశ్శతం ప్రబ్రవామ శరదశ్శతమజీతాస్స్యామ శరదశ్శతం జ్యోక్చ సూర్యం దృశే।**

**య ఉదగాన్మహతోఽర్ణవాద్విభ్రాజమానస్సరిరస్య మధ్యాథ్స మా వృషభో లోహితాక్షస్సూర్యో విపశ్చిన్మనసా పునాతు ॥**

తూర్పున ఉదయించే సూర్యభగవానునికి నమస్కారం చేయటం ద్వారా మేము వంద సంవత్సరాలు జీవించుగాక; మా బంధుమిత్రులతో జీవితాన్ని ఆనందించు గాక; తియ్యగా మాట్లాడుదుము గాక; మాకు కలిగే ఆటంకాలన్నింటినుంచి తప్పించుకొందుము గాక; ఈ విధంగా మేము దీర్ఘాయుష్షను అనుభవింతుము గాక!

తూర్పుదిక్కున సముద్రంనుంచి ఉదయించి, అన్ని దిక్కులలోనూ తన కిరణాలను ప్రసరింపజేసి, అందరినీ పునీతులను చేసే సూర్యభగవానుడు నన్ను కూడా పునీతుణ్ణి చేయుగాక!

ఆ విధంగా సంధ్యావందనం చేసి, ప్రాణతత్త్వమైన సూర్యభగవానుని ప్రార్థన చేయటం ద్వారా మన జీవితాన్ని శక్తివంతం చేసుకుంటున్నాము.

**తస్మాత్సర్వాయుషముచ్యతే** – హిరణ్యగర్భకు సర్వాయుషమ్ అనే బిరుదు ఉంది. అందరికీ దీర్ఘాయుష్షును ప్రసాదిస్తాడు కాబట్టి సర్వాయుషమ్ అంటున్నది ఉపనిషత్తు. అందరికీ అన్నం ప్రసాదిస్తుంది కాబట్టి సమష్టి అన్నాన్ని సర్వౌషధం అంది రెండవ అనువాకంలో – తస్మాత్సర్వౌషధముచ్యతే।

ఇప్పుడు సముద్రంనుంచి అల భిన్నంగా లేనట్టుగా, సమష్టి ప్రాణంనుంచి వ్యష్టి ప్రాణం భిన్నంగా లేదని ఉపనిషత్తు వివరించబోతున్నది. అల సముద్రంలో లయమయినప్పుడు కూడా నీరు ఉంటుంది. కాకపోతే అలలాగా ఉండదు; సముద్రంగా ఉంటుంది. నాశనమయింది నీరు కాదు; కేవలం అల అనే నామ, రూపం మాత్రమే. ఇదే సూత్రం వ్యష్టిప్రాణానికి కూడా వర్తిస్తుంది. వ్యష్టి మరణించినప్పుడు కూడా, ప్రాణవాయువు ఉంటుంది. కాకపోతే వ్యష్టిప్రాణంగా ఉండదు, సమష్టి ప్రాణవాయువుగా ఉంటుంది. నాశనమయింది ప్రాణవాయువు కాదు; కేవలం వ్యష్టి అనే నామ, రూపం మాత్రమే. మరణం విషాదం కాదు; అందువల్లనే మరణకాలంలో ఒక వైదికమంత్రాన్ని పఠిస్తారు. దాని అర్థం ఇలా ఉంటుంది –

ఒక నది సముద్రంలో లయమయినట్టుగా –

వ్యష్టిప్రాణం సమష్టిప్రాణంలో లయమగుగాక
వ్యష్టి అపానం సమష్టి అపానంలో లయమగుగాక
వ్యష్టి వ్యానం సమష్టి వ్యానంలో లయమగుగాక
వ్యష్టి ఉదానం సమష్టి ఉదానంలో లయమగుగాక
వ్యష్టి సమానం సమష్టి సమానంలో లయమవుగాక

మరణమనేది సహజమైన ప్రక్రియ. గంగానది ప్రయాణం చేసివెళ్ళి సముద్రంలో కలుస్తుంది. మనం పనిగట్టుకుని వెళ్ళి మరీ గంగా–సాగర సంగమాన్ని చూసి, ఆనందించి వస్తాము. అక్కడ గంగ మరణించిందే అని దుఃఖించము. అలాగే, మరణం కూడా ఒక పవిత్రమైన ఘటన. మరణంవల్ల వ్యష్టి తన స్వగృహానికి తిరిగి వెళుతున్నాడు. ఈ ఐక్య ఉపాసన చేసినకొద్దీ వ్యష్టి ప్రాణమయంమీద ఉన్న అభిమానం తగ్గుతూ వస్తుంది. అందువల్ల ప్రాణమయ–ప్రాణ ఐక్య–ఉపాసనను అందరూ చేయాలి.

అన్ని ప్రాణులలోనూ ప్రాణం ఉంటుంది కాబట్టి, సమష్టి ప్రాణాన్ని ప్రాణం బ్రహ్మ అన్నారు. బ్రహ్మ అంటే సమష్టి. అందువల్ల వ్యష్టి ప్రాణమయంమీద ప్రాణబ్రహ్మ ఉపాసన చేయాలి. అలా ఉపాసన చేస్తే కలిగే ఫలమేమిటి?

**యే ప్రాణం బ్రహ్మోపాసతే** – ప్రాణబ్రహ్మ ఉపాసన ఎవరైతే చేస్తారో (నిత్యం చేసే సంధ్యావందనంలో సమష్టిప్రాణం ఉపాసన, ప్రత్యేకమైన ప్రాణాయామం కూడా వస్తుంది), **సర్వమేవ త ఆయుర్యంతి** – దీర్ఘాయుష్షు పొందుతారు. అంటే అపమృత్యువు పొందరు. అర్ధాయుష్షుతో మరణించరు. ఇది సకామ ఉపాసన చేస్తే కలిగే ఫలం.

అదే నిష్కామ ఉపాసన చేస్తే చిత్తశుద్ధి, చిత్త విశాలత పొందుతారు. సమష్టి మీద ఉపాసన చేస్తూ వస్తున్న కొద్దీ, మనస్సు విశాలంగా అవుతూ వస్తుంది. ప్రాణంమీద గౌరవం కలుగుతుంది; చూస్తూ చూస్తూ ఏ ప్రాణికీ హాని తలపెట్టటానికి మనస్సు అంగీకరించదు. దానివలన అహింస అనే విలువ మీకు సహజంగా మారుతుంది. మాంసాహారం తినటానికి ఇష్టపడరు; జంతువులను చంపటం ఇష్టపడరు. అందువల్ల శాకాహారం మీకు సహజంగా అవుతుంది.

ఇంకొక ఫలం కూడా ఉంది. సమష్టిప్రాణంమీద ఉపాసన చేస్తే, మీ ప్రాణమయంమీద మీకు ఉన్న అభిమానం కూడా తగ్గుతూ వస్తుంది. అభిమానత్యాగం చేస్తారు. ఇది చాలా ముఖ్యం. ప్రాణమయంమీద అభిమానం పోతేనే, తర్వాత మెట్టు అయిన మనోమయంమీదకు అడుగుపెట్ట గలుగుతారు. రెండో మెట్టుమీద అభిమానం ఉంటే, మూడవమెట్టు ఎలా ఎక్కుతారు?

**ప్రాణో హి భూతానామాయుః** – ఇప్పుడు ఉపనిషత్తు ప్రాణంమీద విశ్లేషణను మళ్ళీ అవే మాటలు చెప్పటం ద్వారా ముగిస్తున్నది. ప్రాణమే అన్ని ప్రాణులకు ఆయుష్షు.

**తస్మాత్సర్వాయుషముచ్యత ఇతి** – ప్రాణం అంటే జీవం; జీవం అంటే ప్రాణం. అందువల్ల ప్రాణానికి **సర్వాయుషం** అనే బిరుదునివ్వటం జరిగింది.

ఇతి – ఇక్కడితో ఋగ్మంత్రం అయిపోయింది.

ఇప్పుడు యజుర్వేదం అందుకుని, రెండవ దశను ముగిస్తుంది. ఇంతవరకూ జరిగిన విశ్లేషణను మళ్ళీ ఒకసారి టూకీగా చూద్దాము. అన్నమయం పాత్ర; ప్రాణమయం ఆత్మ. అందువల్ల అన్నమయాన్ని శరీరం అనీ, ప్రాణమయాన్ని శారీర ఆత్మ (శరీరంలో ఉన్న ఆత్మ) అనీ అంటారు.

**తస్యైష ఏవ శారీర ఆత్మా। యః పూర్వస్య।**

**తస్యైష ఏవ శారీర ఆత్మా** – శారీర ఆత్మ అయిన ప్రాణమయం శరీరంలో ఉంది. ఆ శరీరం, **యః పూర్వస్య** – ఇంతకుముందే వివరించిన అన్నమయం తప్ప ఏదీకాదు. పూర్వస్య అంటే అంతకుముందు చెప్పినట్టుగా.

ఇప్పుడు మనం ప్రాణమయ ఉపాసన చేశాము. అందువల్ల ప్రాణమయ అభిమానం పోయింది. దానితో మన మనస్సు పరిపక్వత చెందింది; మనోమయంలోకి అడుగు పెట్టటానికి సిద్ధంగా ఉన్నాము. అందువల్ల ఇక్కడితో ప్రాణమయమే ఆత్మ అయిపోయింది.

**తస్మాద్వా ఏతస్మాత్ప్రాణమయాత్। అన్యోఽన్తర ఆత్మా మనోమయః। తేనైష పూర్ణః। స వా ఏష పురుషవిధ ఏవ। తస్య పురుష విధతామ్। అన్వయం పురుషవిధః। తస్య యజురేవ శిరః। ఋగ్దక్షిణ పక్షః । సామోత్తరఃపక్షః। ఆదేశ ఆత్మా। అథర్వాంగిరసః పుచ్ఛం ప్రతిష్ఠా। తదప్యేష శ్లోకో భవతి।**

3. **మనోమయమే ఆత్మ** – ఇప్పుడు మూడవమెట్టు ఎక్కాలి. ఇక్కడ ప్రాణమయం కూడా ఆత్మ కాదు, ఆత్మ ప్రాణమయానికి భిన్నంగా ఉంది అంటున్నది ఉపనిషత్తు. దానికి కారణాలు కూడా చెబుతున్నది.

**తస్మాద్వా ఏతస్మాత్ప్రాణమయాత్ అన్యః**– ఆత్మ ప్రాణమయానికి భిన్నంగా ఉంది.

**అంతర ఆత్మా మనోమయః** – ఆత్మ ప్రాణమయానికి భిన్నంగా ఉంది. దాన్ని మనోమయం అంటారు. అది ప్రాణమయంలో (అంతర) ఉంది.

ఇకనుంచి మనం చూసేదంతా మనోమయం గురించి. ఇంక మనోమయం ఆత్మ అవుతుంది; ప్రాణమయం అనాత్మ లేదా కోశం అవుతుంది. ఎప్పుడైతే ప్రాణమయాన్ని అనాత్మ అన్నామో, అప్పుడే తక్కిన అంశాలన్నీ వరుసగా వస్తాయి – అనాత్మ నిశ్చయః, కార్యత్వ నిశ్చయః, నామరూపత్వ నిశ్చయః, మిథ్యాత్వ నిశ్చయః, ప్రవిలాపన నిశ్చయః.

**తస్మాద్వా ఏతస్మాదాత్మన ఆకాశః సంభూతః**

ఆకాశంతో మొదలై, అంతా ఆత్మనుంచి పుట్టింది. ఆత్మనుంచి పుట్టింది అనాత్మ అవుతుంది అంటే అనాత్మ **కార్యం** అవుతుంది. ఆ విధంగా ప్రాణమయం కార్యం అయింది. అనాత్మ నిశ్చయం కార్యత్వ నిశ్చయానికి దారితీస్తుంది. ప్రాణమయం కార్యం కాబట్టి అది కేవలం నామరూపాలు మాత్రమే. అందువల్ల అది **నామరూప నిశ్చయానికి** దారితీస్తుంది. ఎప్పుడైతే నామరూప నిశ్చయం జరుగుతుందో, ప్రాణమయానికి విడిగా ఉనికి లేదని అర్థమవుతుంది. అది **మిథ్యాత్వ నిశ్చయానికి** దారితీస్తుంది. ఎప్పుడైతే ప్రాణమయం మిథ్య అని అర్థం చేసుకుంటామో, అప్పుడే దానికి స్వతంత్రంగా ఉనికి లేదు. స్వతంత్రంగా ఉనికి లేని వస్తువు ఉన్నా ఒకటే, లేకపోయినా ఒకటే. ఈ జ్ఞానాన్ని **ప్రవిలాపనం** అంటారు. మిథ్యావస్తువును, సత్యవస్తువుతో లయం చేయటమే ప్రవిలాపనం అంటే.

ఈ దశలో మనోమయం ఆత్మ; అంటే సత్యవస్తువు. ప్రాణమయం మిథ్యావస్తువు. అందువల్ల మిథ్యావస్తువు అయిన ప్రాణమయం, సత్యవస్తువు అయిన మనోమయంలో

లయమయిపోతుంది. అన్నమయం ప్రాణమయంలోకి లయమవటం చూశాము; ఇప్పుడు ప్రాణమయాన్ని కూడా లయం చేస్తున్నాము. కాకపోతే మనోమయంలో చేస్తున్నాము.

ఇక్కడ శంకరాచార్యులవారు చెప్పిన ఒక ప్రత్యేక విషయాన్ని అర్థం చేసుకోవాలి. ఇంతవరకూ వ్యష్టి అన్నమయం, సమష్టి అన్నంలోనూ; వ్యష్టి ప్రాణమయం సమష్టి ప్రాణంలోనూ లయమవుతుందని చూశాము. ఇదికాక సమష్టిపరంగా చూస్తే సమష్టి అన్నం కూడా సమష్టి ప్రాణంలోనూ, సమష్టి ప్రాణం సమష్టి మనస్సులోనూ లయమవుతుందని కూడా తెలుసుకోవాలి. అంటే ఈ లయ జరిగేది వ్యష్టి, సమష్టిల మధ్య మాత్రమే కాదు; కిందస్థాయి సమష్టి, దానికన్నా ఎక్కువస్థాయి సమష్టిలో కరిగిపోతుంది.

ఇప్పుడు మనోమయం స్వరూపం గురించి చూద్దాము.

**తేనైష పూర్ణః** – ఈ మనోమయం, ప్రాణమయంలో ఉంది. ఇప్పుడు ప్రాణమయం కోశం అయిపోతుంది, ఇంక ఆత్మ కాదు. ఏషః అంటే ప్రాణమయం; తేన అంటే మనోమయేన; పూర్ణః భవతి.

మనోమయం అంటే మనస్సునుంచి ఉత్పత్తి చెందినది. అది సూక్ష్మం. అందువల్ల దానికంటూ ఒక ఆకారం ఉండదు. ఒక్క స్థూలశరీరానికి మాత్రమే ఆకారం ఉంటుంది. సూక్ష్మమైన ప్రాణమయానికే ఆకారం లేకపోతే, ప్రాణమయానికన్నా సూక్ష్మమైన మనోమయానికి ఆకారం ఎలా ఉంటుంది? ప్రాణమయం అన్నమయానికి ఉన్న ఆకారాన్ని తీసుకుంటుందని చూశాము; అందువల్ల ప్రాణమయంలో ఉన్న మనోమయం కూడా అన్నమయం ఆకారమే తీసుకుంటుంది. అన్నమయం ఆకారం అంటే స్థూలశరీరం.

**స వా ఏష పురుషవిధ ఏవ** – సవా ఏష అంటే ఈ మనోమయ ఆత్మ. పురుషవిధ ఏవ అంటే మనిషి ఆకారాన్ని తీసుకుంటుంది. నిజానికి మనోమయ ఆత్మ ఏ శరీరంలో ఉంటే ఆ శరీర ఆకారంలో ఉంటుంది. కాని ఇక్కడ పురుషః అంటే ఉపనిషత్తు మనిషి ఆకారాన్ని తీసుకుంది. ఎందుకంటే, ఉపనిషత్తును నేర్చుకుంటున్నది మనుష్యులు కాబట్టి. ఇది ఏ ఆకారం? ఇది స్వరూప లక్షణం కాదు; అరువు తెచ్చుకున్న అంటే ఆగంతుక లక్షణం. ప్రాణమయంనుంచి అరువు తెచ్చుకుంది.

**తస్య పురుషవిధతామ్ । అన్వయం పురుషవిధః** – మనుష్య ఆకారం, దానిలో ఉన్న మనోమయ వస్తువుకు ఆ ఆకారాన్ని ఇస్తున్నది.

అన్నమయం మనిషియొక్క స్వరూప ఆకారం. అంటే పుట్టుకతో ఆ ఆకారం వచ్చింది. కాని ప్రాణమయానికీ, మనోమయానికీ స్వతహాగా ఆకారాలు లేవు. అవి అన్నమయంలో ఉండటంవల్ల అన్నమయానికి ఉన్న ఆకారమే వాటికీ వచ్చింది. అన్నమయం గురించి

నేర్చుకున్నప్పుడు చూసిన ఆ ఐదు భాగాలనీ మళ్ళీ గుర్తుకు తెచ్చుకోవాలి. అవి శిరస్సు, దక్షిణపక్షం, ఉత్తరపక్షం, ఆత్మ, ప్రతిష్ఠా.

**తస్య యజురేవ శిరః** – తస్య అంటే మనోమయ ఆత్మా అని చూస్తూ వస్తున్నాము. యజుర్మంత్రాలు మనోమయ ఆత్మకు శిరస్సు అంటున్నాయి. మనకు నాలుగు వేదాలు ఉన్నాయి. అవి ఋగ్వేదం, యజుర్వేదం, సామవేదం, అథర్వణవేదం. ఈ నాలుగు వేదాలలో యజుర్వేదాన్ని ఎందుకు శిరస్సు అంది ఉపనిషత్తు? ఎందుకంటే యజ్ఞాల్లో ప్రముఖపాత్ర వహిస్తుంది యజుర్వేదం. ఏ యజ్ఞానికి ఏ ఆహుతులు వేయాలో యజుర్వేదమే వివరిస్తుంది.

**ఋగ్దక్షిణః పక్షః** – ఋగ్వేదం కూడా యజ్ఞాల్లో ముఖ్యమే. అందువల్ల అది కుడిపక్షం అయింది. నిజానికి దక్షిణః అంటే దక్షిణదిక్కు. దక్షిణదిక్కును కుడిపక్షం అని ఎందుకంటున్నారంటే, కర్మలను తూర్పువైపు తిరిగి చేస్తారు.

**సామోత్తరః పక్షః** – సామవేద మంత్రాలు ఎడమపక్షం.

**ఆదేశ ఆత్మా** – ఆదేశం అంటే వేదవాక్యాలు.

**విధి నిషేధరూప వాక్యాని ఆదేశాః**

ఈ విధినిషేధాలు ముఖ్యమైన వాక్యాలు. ఎందుకంటే కర్మకాండలో మన జీవితం ఈ విధినిషేధాలవల్ల నియంత్రించబడుతుంది. తక్కిన వేదవాక్యాలన్నీ ఈ నియమాలకు సహకారీ వాక్యాలుగా ఉంటాయి. ఇవి ఇంత ముఖ్యం కాబట్టి ఇవి ఆత్మను సూచిస్తాయి.

**అథర్వాంగిరసః పుచ్ఛం ప్రతిష్ఠా** – అథర్వణ వేదమంత్రాలను ఆధారం అంటున్నది ఉపనిషత్తు. ఆ మంత్రాలను అథర్వాంగిరసః అంటున్నది ఉపనిషత్తు. ఈ మంత్రాలను అథర్వణ ఋషి, అంగిరస ఋషి దర్శించారు. శంకరాచార్యులవారు ఈ మంత్రాలు ఆధారం అంటున్నారు. ఎందుకంటే అథర్వణ వేదం ఇహలోకసుఖం పొందటానికి అంటే, ఆరోగ్యం, ఐశ్వర్యం, శాంతి పొందటానికి హేతువులైన కర్మలను వివరిస్తుంది. అంటే ఈ కర్మలు శాంతిని, పుష్టిని కలుగజేస్తాయి.

జీవితంలో ధర్మార్థకామమోక్షాలలో ఏ లక్ష్యం పొందాలనుకున్నా కూడా, శారీరక ఆరోగ్యం, మానసిక ఆరోగ్యం లేకపోతే అది సాధ్యం కాదు.

**శరీరమాద్యం ఖలు ధర్మసాధనమ్ ।**

అందువల్లనే ముండకోపనిషత్తు పఠించే ముందు శాంతిపాఠంలో శరీర ఆరోగ్యం గురించి వస్తుంది.

**స్థిరైరంగైః తుష్టువాగ్ంసస్తనూభిః**
**వ్యశేమ దేవహితం యదాయుః**

శంకరాచార్యులవారు అదృష్టఫలమైన పుణ్యాన్ని కోరేముందు, దృష్టఫలమైన ఆరోగ్యాన్ని, ఐశ్వర్యాన్ని కోరాలంటున్నారు. ఎందుకంటే అవి ఉంటేనే ఎవరైనా, ఏదైనా సాధించగలరు.

అన్నమయకోశంలో శిరః దక్షిణపక్షః, ఉత్తరపక్షః, ఆత్మా, ప్రతిష్ఠా – స్థూలశరీరభాగంతో సూచించబడ్డాయి. ప్రాణమయంలో ఈ ఐదు అంశాలూ ప్రాణంయొక్క అంశాలతో సూచించబడ్డాయి. కాని మనోమయకోశం దగ్గరకి వచ్చేసరికి వేదాలు, వేదవాక్యాలు తీసుకోబడ్డాయి. ఇవి శరీరానికి బాహ్యంగా ఉన్నాయి కాని, ఇవి శబ్దరూపంలో భాగాలు.

బాహ్యంగా ఉన్న ఈ వేదాలు ఆంతరంగా ఉన్న మనోమయాన్ని ఎలా సూచించగలవనే ప్రశ్న వేసి, దానికి ఆయనే జవాబు చెబుతున్నారు శంకరాచార్యులవారు. వేదమంత్రాలు జ్ఞానాన్ని కలుగజేస్తాయి. ఆ జ్ఞానం వృత్తిరూపంలో కలుగుతుంది. అందువల్ల, ప్రతి ఒక్క వేదమంత్రం కూడా ఒక వృత్తిని (ఆలోచనను) సూచిస్తుంది. మనస్సులో వృత్తిరూపంలో ఉన్నదే బాహ్యంగా వేదమంత్రంగా వచ్చింది. ఆ విధంగా వృత్తి శబ్దంగా మారింది, మళ్ళీ శబ్దం వృత్తిగా మారుతుంది, శ్రవణం చేసే శిష్యునికి.

దీన్ని టీవీ స్టేషన్‌నుంచి వచ్చే శబ్దతరంగాలతో పోల్చవచ్చు. శబ్దం ఎలక్ట్రో మాగ్నెటిక్ వేవ్స్‌గా మారి వస్తే, దాన్ని అందుకుంటుంది మీ టీవీ. మీ టీవీ దాన్ని మళ్ళీ శబ్దంగా మారుస్తుంది. ఆ విధంగా వేదాలు మనోవృత్తి రూపంలో మనోమయానికి చెందుతాయి. అందువల్ల ఉపనిషత్తేమీ తనను తాను ఖండించుకోవటం లేదు.

**తదప్యేష శ్లోకో భవతి** – ఈ మనోమయ విషయం గురించి ఈ మంత్రం ఉంది.

### అనువాకం – 4

**యతో వాచో నివర్తంతే। అప్రాప్య మనసా సహ। ఆనందం బ్రహ్మణో విద్వాన్। న బిభేతి కదాచనేతి। తస్యైష ఏవ శారీర ఆత్మా। యః పూర్వస్య।**
**తస్మాద్వా ఏతస్మాన్మనోమయాత్। అన్యోఽన్తర ఆత్మా విజ్ఞానమయః । తేనైష పూర్ణః। స వా ఏష పురుషవిధ ఏవ। తస్య పురుష విధతామ్। అన్వయం పురుషవిధః। తస్య శ్రద్ధైవ శిరః।ఋతం దక్షిణః పక్షః। సత్యముత్తరః పక్షః। యోగ ఆత్మా। మహః పుచ్ఛం ప్రతిష్ఠా। తదప్యేష శ్లోకో భవతి।**

### వివరణ

**యతో వాచో నివర్తంతే। అప్రాప్య మనసా సహ। ఆనందం బ్రహ్మణో విద్వాన్। న బిభేతి కదాచనేతి। తస్యైష ఏవ శారీర ఆత్మా। యః పూర్వస్య।**

నాలుగవ అనువాకం ఋగ్మంత్రంతో మొదలవుతున్నది. ఈ మంత్రం మనోమయ ఆత్మను వివరిస్తున్నది. ఇది తక్కిన ముందు మంత్రాలకన్నా చిన్నది. ఇతి అంటే ఇక్కడితో ఋగ్మంత్రం అయిందని అర్థం.

అంతకుముందు అన్నమయం, ప్రాణమయాల గురించి చెప్పినప్పుడు వ్యష్టి–సమష్టి–ఐక్య ఉపాసనల గురించి చూశాము. ఇక్కడ కూడా అలాంటి ఐక్య ఉపాసనను చూస్తాము. సమష్టి మనస్సును హిరణ్యగర్భ అంటారు. శీక్షావల్లీలో హిరణ్యగర్భను మనోమయ, ప్రాణమయ అని చూశాము.

**స య ఏషోఽ౽ంతర్ హృదయ ఆకాశః। తస్మిన్నయం పురుషో మనోమయః** – శీక్షావల్లీ 6

సమష్టి హిరణ్యగర్భ స్తుతిని అలా ప్రతిదశలోనూ చూస్తూ వస్తున్నాము. అలా విన్నకొద్దీ హిరణ్యగర్భమీద ఉపాసన చేయాలనే శ్రద్ధ ఏర్పడుతుంది.

**యతో వాచో నివర్తంతే** – హిరణ్యగర్భ సమష్టి కాబట్టి, వ్యష్టి మనస్సు అర్థం చేసుకోలేదు. సర్వజ్ఞుడైన హిరణ్యగర్భను అల్పజ్ఞుడైన వ్యష్టి అర్థం చేసుకోలేడు. వాచః నివర్తంతే అంటే సమష్టిజ్ఞానం గురించి వివరించటానికి మాటలు సరిపోవు.

**అప్రాప్య మనసా సహ** – హిరణ్యగర్భను మనస్సు కూడా చేరుకోలేదు. మనస్సులో కూడా హిరణ్యగర్భను ఊహించుకోవటం అసాధ్యం. అదెలాగుంటుందంటే, చిన్న చెంచాతో సముద్రాన్ని కొలవటానికి ప్రయత్నించినట్టు ఉంటుంది. హిరణ్యగర్భను మాటలతో వర్ణించలేము, మనస్సుతో అర్థం చేసుకోలేము అంటే దాని అర్థం హిరణ్యగర్భ సర్వప్రమాణ అగోచరం.

**ఆనందం బ్రహ్మణః** – హిరణ్యగర్భ ఆనందం, లౌకిక ఆనందాలన్నింటిలోకి అత్యంత శ్రేష్ఠమైన ఆనందం. దాన్ని బ్రహ్మానందం అంటారు. భూలోకంతోపాటు పైలోకాలను చూస్తే, ఏడులోకాలు ఉన్నాయి. అవి భూలోక, భువర్లోక, సువర్లోక, మహర్లోక, జనలోక, తపోలోక, సత్యలోకాలు. సత్యలోకాన్నే బ్రహ్మలోకం అంటారు (హిరణ్యగర్భ = బ్రహ్మ). బ్రహ్మలోకంలో కలిగే ఆనందం ఈ తక్కిన లోకాల్లో కలిగే ఆనందంకన్నా ఎంతో ఎక్కువ. ఈ ఆనందంమీద ఉపాసన చేయాలి.

**విద్వాన్** – విద్వాన్ అంటే ఉపాసకుడు. ఇక్కడ జ్ఞాని అని కాదు అర్థం. మనోమయంమీద ఉపాసన చేసే విద్వాన్. సమష్టి హిరణ్యగర్భను వ్యష్టి మనోమయంమీద ఆవాహన చేస్తాడు. అలా ఐక్యఉపాసన చేయటంవల్ల అతను రెండు ఫలాలను పొందుతాడు.

సకామ ఉపాసన చేస్తే హిరణ్యగర్భతో ఐక్యం పొంది, హిరణ్యగర్భకున్న శక్తిని పొందుతాడు.

**ఆప్నోతి స్వారాజ్యమ్। ఆప్నోతి మనసస్పతిమ్। వాక్పతిశ్చక్షుష్పతిః। శ్రోత్రపతిర్విజ్ఞానపతిః। ఏతత్తతో భవతి। ఆకాశశరీరం బ్రహ్మ। సత్యాత్మ ప్రాణారామం మన ఆనందమ్। శాంతిసమృద్ధమమృతమ్॥**

స్వారాజ్యాన్ని పొందుతాడు. అన్ని మనస్సులకు, వాక్కులకు, చూపులకు, వినికిడులకు, విజ్ఞానములకు ప్రభువు అవుతాడు. అంతేకాదు, ఆకాశమే శరీరంగా ఉంటుంది. మూర్తామూర్త ప్రపంచం హిరణ్యగర్భలో ఉంటుంది. అతని మనస్సులో ఆనందం, శాంతి, అమృతాలు సమృద్ధిగా ఉంటాయి.

ఇవికాక,

**న బిభేతి కదాచనేతి** – ఆ సాధకునికి ఏ మాత్రమూ భయం అనేది ఉండదు. హిరణ్యగర్భ లోకంలో భద్రత ఉంటుంది. భగవద్గీతలో హిరణ్యగర్భ జీవితకాలాన్ని మనిషియొక్క 315.36 ట్రిలియన్ సంవత్సరాలుగా చూస్తాము. అందువల్ల అక్కడ వృద్ధాప్యం, మరణం బాధించవు. ఇది సకామ ఉపాసన ఫలం.

అదే నిష్కామ ఉపాసన చేస్తే చిత్తశుద్ధి, చిత్తవిశాలత, చిత్త ఏకాగ్రత పొందుతాడు. మనస్సు సూక్ష్మంగా అవుతూ వస్తుంది. నిచ్చెనలోని తర్వాత మెట్టు ఎక్కటానికి సంసిద్ధుడు అవుతాడు.

ఇక్కడితో ఋగ్మంత్రం అయిపోయి, మళ్ళీ యజుర్వేదం అందుకుంటుంది.

**తస్యైష ఏవ శారీర ఆత్మా యఃపూర్వస్య** – ఈ శారీర ఆత్మా అయిన మనోమయం, ప్రాణమయ శరీరంలో ఉంది. యఃపూర్వస్య అంటే ఇంతకుముందు వివరించిన అన్నమయం తప్ప ఏదీకాదు.

ఇప్పుడు విజ్ఞానమయంలోకి అడుగుపెడదాము.

**తస్మాద్వా ఏతస్మాన్మనోమయాత్। అన్యోఽన్తర ఆత్మా విజ్ఞానమయః। తేనైష పూర్ణః। స వా ఏష పురుషవిధ ఏవ। తస్య పురుష విధతామ్। అన్వయం పురుషవిధః। తస్య శ్రద్ధైవ శిరః। ఋతం దక్షిణః పక్షః। సత్యముత్తరః పక్షః। యోగ ఆత్మా। మహః పుచ్ఛం ప్రతిష్ఠా। తదప్యేష శ్లోకో భవతి।**

ఉపనిషత్తు క్రమంగా ఒక క్రమపద్ధతిలో మనను ఒక్కొక్క కోశానికి ఆంతరంగా ప్రయాణం చేయిస్తున్నది.

4. **విజ్ఞానమయమే ఆత్మ** – ఇప్పుడు నాలుగవ మెట్టు ఎక్కాలి. ఇక్కడ మనోమయం కూడా ఆత్మ కాదు, ఆత్మ మనోమయానికి భిన్నంగా ఉంది అంటున్నది ఉపనిషత్తు. దానికి కారణాలు కూడా చెబుతున్నది.

**తస్మాద్వా ఏతస్మాన్మనోమయాత్ అన్యః** – అది మనోమయానికి భిన్నంగా ఉంది. మనోమయాన్ని ఆత్మ అని తాత్కాలికంగా చెప్పింది, మనకు అర్థమవటంకోసం.

**అంతర ఆత్మా విజ్ఞానమయః** – ఆత్మ మనోమయానికి భిన్నంగా ఉంది. దాన్ని విజ్ఞానమయం అంటారు. అది మనోమయంలో (అంతర) ఉంది.

ఇకనుంచి మనం చూసేదంతా విజ్ఞానమయం గురించి. ఇక విజ్ఞానమయం ఆత్మ అవుతుంది; మనోమయం అనాత్మ లేదా కోశం అవుతుంది. ఎప్పుడైతే మనోమయాన్ని అనాత్మ అన్నామో, అప్పుడే తక్కిన అంశాలన్నీ వరుసగా వస్తాయి – అనాత్మ నిశ్చయః, కార్యత్వ నిశ్చయః, నామరూపత్వ నిశ్చయః, మిథ్యాత్వ నిశ్చయః, ప్రవిలాపన నిశ్చయః. ఈ జ్ఞానంతో మొత్తం ప్రపంచం లయమయిపోతుంది. ఎలాగైతే స్వాప్నికుడు స్వప్నంనుంచి లేస్తే మొత్తం స్వప్నప్రపంచం లయమయిపోతుందో, అలాగే జ్ఞానికి ఆత్మజ్ఞానం కలిగితే, ఈ జాగ్రత్ ప్రపంచం కూడా లయమయిపోతుంది.

**మయ్యేవ సకలం జాతం। మయి సర్వం ప్రతిష్ఠితమ్। మయిసర్వం లయం యాతి। తద్బ్రహ్మాద్వయమస్మ్యహమ్।** – కైవల్యమ్ 19

అన్నీ నానుంచే సృష్టించబడ్డాయి; నేనే స్థితికారకుణ్ణి; నాలోనే లయమవుతాయి. నేను ఆ అద్వయబ్రహ్మను.

వ్యష్టి మనోమయాన్ని వ్యష్టి విజ్ఞానమయంలో లయం చేసినప్పుడు సమష్టిలో కూడా అలాగే జరుగుతుందని మర్చిపోకూడదు. ఇలా లయం చేస్తూ రావటం ద్వారా, క్రమేపీ బ్రహ్మను చేరుకుంటాము. జగదధిష్ఠానం బ్రహ్మను అర్థం చేసుకుంటాము.

**స వా ఏష పురుషవిధ ఏవ** – సవా ఏష అంటే ఈ విజ్ఞానమయ ఆత్మ. పురుషవిధ ఏవ అంటే మనిషి ఆకారాన్ని తీసుకుంటుంది. ఇది ఏ ఆకారం? ఇది స్వరూప లక్షణం కాదు, అరువు తెచ్చుకున్న అంటే ఆగంతుక లక్షణం. మనోమయంనుంచి అరువు తెచ్చుకుంది.

ఎప్పుడైతే విజ్ఞానమయానికి మనుష్యఆకారం ఉందని చూస్తామో, అప్పుడు విజ్ఞానమయానికి ఐదు అంశాలను చూడాలి. కర్మ చేయాలంటే దానికి సంబంధించిన జ్ఞానం ఉండాలి. విజ్ఞానమయం ఆ జ్ఞానానికి ప్రతీక.

జానాతి → ఇచ్ఛతి → యతతి

తెలుసుకుంటుంది – కోరుతుంది – క్రియ చేస్తుంది.

మనోమయం సంశయాత్మ మనస్సును సూచిస్తే, విజ్ఞానమయం నిశ్చయాత్మక బుద్ధిని సూచిస్తుంది. సంశయంకన్నా, జ్ఞానం గొప్ప కాబట్టి, మనోమయంకన్నా విజ్ఞానమయం శ్రేష్ఠమైనది. ఈ నిర్వచనాలను తత్త్వబోధలో చూస్తాము.

**సంకల్ప వికల్పాత్మకః మనః। నిశ్చయాత్మికా బుద్ధిః।**

సంకల్ప వికల్పకం అంటే సంశయం. చేయాలా వద్దా అనే సందేహం. మనః అంటే ఇలా ఊగే మనస్సు; విజ్ఞానం నిశ్చయజ్ఞానాన్ని సూచిస్తుంది. అందువల్ల మనోమయం

కన్నా విజ్ఞానమయం ఇంకా సూక్ష్మమైనది, ఇంకా శక్తివంతమైనది; మనోమయం లోపల ఉంది.

**తస్య పురుషవిధతామ్। అన్వయం పురుషవిధః** – మనుష్య ఆకారం, దానిలో ఉన్న విజ్ఞాన మయానికి ఆ ఆకారాన్ని ఇస్తుంది.

అన్నమయం మనిషి యొక్క స్వరూప ఆకారం. అంటే పుట్టుకతో ఆ ఆకారం వచ్చింది. కాని ప్రాణమయానికీ, మనోమయానికీ, విజ్ఞానమయానికీ కూడా స్వతహాగా ఆకారాలు లేవు. అవి అన్నమయంలో ఉండటం వల్ల అన్నమయానికి ఉన్న ఆకారమే వాటికీ వచ్చింది. అన్నమయం గురించి నేర్చుకున్నప్పుడు చూసిన ఆ ఐదు భాగాలనీ మళ్ళీ గుర్తుకు తెచ్చుకోవాలి. అవి శిరస్సు, దక్షిణపక్షం, ఉత్తరపక్షం, ఆత్మా, ప్రతిష్ఠా.

**తస్య శ్రద్ధా ఏవ శిరః** – తస్య అంటే విజ్ఞానమయ ఆత్మ అని చూస్తూ వస్తున్నాము. దాని శ్రద్ధయే శిరస్సు.

విజ్ఞానమయాన్ని జ్ఞాతా లేదా ప్రమాతా అంటారు. జ్ఞాత జ్ఞానం పొందుతాడు. జ్ఞానం ఉన్న వ్యక్తే కర్త అవుతాడు. ఎందుకంటే ఒక పని ప్రయత్నపూర్వకంగా చేయాలంటే, దానికి సంబంధించిన జ్ఞానం ఉండితీరాలి. జానాతి → ఇచ్ఛతి → యతతి అని చూశాము. ఒకవ్యక్తి తనకు తెలిసిన అనేక విషయాలలోంచి, తనకు ఇష్టమైనదాన్ని (ఇచ్ఛ కలిగినదాన్ని) తన గమ్యంగా ఎన్నుకుంటాడు. అలా ఒక లక్ష్యం ఏర్పరచుకున్నాక, ఆ లక్ష్యం నెరవేరటానికి శ్రమపడతాడు. అందువల్ల తనకు తెలియని రంగాన్ని తన లక్ష్యంగా ఎన్నుకోలేడు. అంటే ముందు జ్ఞానం ఉండాలి, తర్వాతే క్రియ చేయాలి.

ప్రమాతా లేదా జ్ఞాతా క్రియ చేసేటప్పుడు దానిమీద శ్రద్ధతో చేస్తాడు. శ్రద్ధ అంటే నమ్మకం లేదా భక్తి. వేదాలు తనకు జ్ఞానాన్ని ఇచ్చే ప్రమాణం అనే శ్రద్ధ ఉండాలి. ఆధ్యాత్మికజ్ఞానం పొందాలంటే, దానికి సంబంధించిన ప్రమాణం వాడాలి. లౌకికవిద్య ఆధ్యాత్మిక జ్ఞానాన్నివ్వలేదు. ఆధ్యాత్మిక విద్యకు శాస్త్రం **ప్రమాణం**. ఆధ్యాత్మిక సాధకుడు శాస్త్రంలో చెప్పబడిన సాధనలను చేస్తాడు. శాస్త్రాన్ని నమ్మని వ్యక్తి అవి వృథా కాలయాపన అనుకుంటాడు.

ఒక సమర్థవంతమైన, మతపరమైన, ఆధ్యాత్మిక జీవనవిధానం కావాలంటే శాస్త్రజ్ఞానం ఉండితీరాలి. ఫిజిక్స్ సంధ్యావందనం నేర్పించదు. కెమిస్ట్రీ రామనామ జపాన్ని స్తుతించదు; ఎకనామిక్స్ మోక్ష పురుషార్థాన్ని బోధించదు. అందువల్ల మతపరమైన, ఆధ్యాత్మిక జీవన విధానాన్ని పాటించటానికి శాస్త్రమొక్కటే ప్రమాణం. శాస్త్రంనుంచి జ్ఞానం పొందాలంటే, ముందుగా శాస్త్రంమీద శ్రద్ధ ఉండాలి. అందువల్ల శ్రద్ధ చాలా ముఖ్యమైన అంశం.

స్వర్గం, నరకం ఉన్నాయని సైన్స్ నిరూపించలేదు; మనిషి మరణించాక అతని ఆత్మకు ప్రయాణం ఉందని సైన్స్ నిరూపించలేదు; ఇక్కడ శ్రాద్ధకర్మలు పెడితే వేరే లోకంలో ఉన్న మన పితృదేవతలకు అవి వెళతాయని సైన్స్ నిరూపించలేదు; నిర్గుణబ్రహ్మ అంతిమ సత్యం అనీ సైన్స్ నిరూపించలేదు. సైన్స్‌కు ప్రయోగశాలలో ప్రయోగంలో అందితేనే, దాన్ని నమ్ముతుంది. మీరు స్వర్గాన్ని, నరకాన్ని నమ్మితే, పుణ్యపాపాలను నమ్మితే, శాస్త్రంమీద నమ్మకం పెట్టుకోవాలి. శాస్త్రంవల్లనే వీటి గురించి నేర్చుకోగలరు.

ఆ మాటకొస్తే అసలు సైన్స్ మనస్సు, మెదడుకు భిన్నంగా ఉందనే ఒప్పుకోదు. మనస్సు మెదడులో ఉందంటుంది. అందువల్ల మెదడు మరణిస్తే, మనస్సు కూడా మరణిస్తుంది అంటుంది. కాని మనస్సు మెదడులో లేదనీ; మనస్సు హృదయంలో ఉందనీ, దానికి మరణానంతరం ప్రయాణం ఉందనీ శాస్త్రంలో మనం నేర్చుకుంటాము. మెదడు స్థూలశరీరానికి చెందినదైతే మనస్సు సూక్ష్మశరీరానికి చెందినది. స్థూలశరీరం మాత్రమే మరణిస్తుంది; సూక్ష్మమైన మనస్సు ప్రయాణం చేస్తుంది. మనస్సే మిగలదు అనేటప్పుడు ఇంక దాని ప్రయాణం గురించి కాని, కారణశరీరం గురించి కాని, పుణ్యపాపాల గురించి కాని, స్వర్గ–నరకాల గురించి మాట్లాడే అవకాశం ఎక్కడ ఉంది? అందువల్ల ఆధ్యాత్మిక జీవనం కావాలనుకుంటే శాస్త్రంనుంచి పొందిన జ్ఞానం దానికి తోడవాలి, ఆ జ్ఞానం పొందాలంటే, ముందస్తుగా శాస్త్రంమీద శ్రద్ధ ఉండాలి.

సైన్సు ఎంతగా ప్రత్యక్ష ప్రమాణంమీద ఆధారపడుతుందో, అంతగా మనం కూడా శాస్త్రంమీద ఆధారపడతాము. శాస్త్రాన్ని ఆప్తప్రమాణం అంటారు. కళ్ళారా చూసినదానికి ఎంత విలువనిస్తామో, శాస్త్రం చెప్పినదానికి కూడా అంత విలువనూ ఇవ్వాలి. ఆ శ్రద్ధ లేకపోతే ఆధ్యాత్మికత నిలువదు. అందువల్లనే ఇక్కడ ఉపనిషత్తు శ్రద్ధా ఏవ శిరః అంది. అంటే శాస్త్రంమీద శ్రద్ధ శిరస్సు వంటిది. ఆధ్యాత్మిక సాధనకు అది మకుటం వంటిది.

**గురువేదవాక్యేషు విశ్వాసః శ్రద్ధా**

అది గుడ్డినమ్మకం కాదా? కాదు. ఎందుకంటే జ్ఞానేంద్రియాలమీద ప్రత్యక్ష ప్రమాణంగా పూర్తి నమ్మకం పెట్టుకుంటే, శాస్త్రం చెప్పే విషయాలను ప్రమాణంగా ఎందుకు తీసుకోకూడదు? ఏ జ్ఞానమైనా కూడా, ఆ జ్ఞానం పొందటానికి వాడిన ప్రమాణంమీద మీకున్న శ్రద్ధనిబట్టి కలుగుతుంది. ఆ ప్రమాణాన్ని ఇంకో ప్రమాణంతో నిరూపించాలి అంటే, ఆ ప్రమాణాన్ని మరో ప్రమాణంతో నిరూపించాలి. అది అలా ఒక గొలుసుకట్టుగా సాగిపోతుంది. ఈ గొలుసును ఎక్కడో అక్కడ ఆపాలి. ఏదో ఒక ప్రమాణాన్ని నమ్మాలి.

ఎవరైనా నేను శాస్త్రప్రమాణాన్ని నమ్మను అంటే మనం అతన్ని బలవంతపెట్టము, కాని మీ కళ్ళనే ప్రమాణంమీద మీకు శ్రద్ధ లేకపోతే ఈ ప్రపంచంలో మీరే పనినీ చేయలేరు

అంటాము. రోడ్డుమీద మీరొక అడుగు ముందుకు వేయాలన్నాకూడా, మీ కళ్ళు సరిగ్గానే రోడ్డును చూపిస్తున్నాయనే నమ్మకంతో వేస్తారు. ఆ విధంగా శ్రద్ధ చాలా అవసరం. అందువల్ల శ్రద్ధైవ శిరః అంటే శాస్త్ర శ్రద్ధైవ శిరః అని అర్థం.

**ఋతం దక్షిణః పక్షః** – ఋతం కుడిపక్షం అయింది. ఋతం అంటే శాస్త్రాలను సరిగ్గా అర్థం చేసుకోవటం. నిజానికి ప్రత్యక్ష ప్రమాణాన్ని కూడా సరిగ్గా అర్థం చేసుకోవాలి. దాన్ని సరిగ్గా అర్థం చేసుకోకపోతే, మనను తప్పుదోవ పట్టించవచ్చు కూడా. ఉదాహరణకు మన కళ్ళు భూమి కదలకుండా, స్థిరంగా ఉంది అంటున్నాయి; కాని సత్యం ఏమిటి? భూమి గంటకు కొన్ని వేల మైళ్ళ చొప్పున సూర్యుని చుట్టూ తిరుగుతూ, గంటకు షుమారుగా వేయి మైళ్ళ చొప్పున తన చుట్టూ తాను తిరుగుతుంది. ఆకాశంలో ఉన్న నక్షత్రాలను భూమినుంచి చూస్తే, మిణుకుమిణుకుమంటూ మెరుస్తున్న చిన్న ఆకారాలుగా కనిపిస్తాయి; కాని నిజానికి అవి భూమికన్నా కొన్ని వేలరెట్లు పెద్దవి. అలా కంటికి కనబడిందే సత్యం కాదు. దాన్ని సరిగ్గా అర్థం చేసుకోవాలి.

అదే విధంగా శాస్త్రంలో చెప్పిన అంశాలను కూడా సరిగ్గా అర్థం చేసుకోవాలి. శాస్త్రాన్ని సరిగ్గా అర్థం చేసుకోకపోతే, తప్పు సిద్ధాంతాన్ని ఏర్పరచుకునే అవకాశం ఉంది. అందువల్ల అలాంటి పొరపాటు జరగకుండా చూసుకోవాలి. అందువల్లనే శాస్త్రాన్ని శ్రవణ, మనన, నిదిధ్యాసనలు చేయాలి అంటారు. శ్రవణంలో అజ్ఞాననివృత్తి కలుగుతుంది కాని, కొన్ని సందేహాలు మిగిలిపోతాయి. మననంలో ఈ సంశయనివృత్తి కలుగుతుంది. సంశయాలు తీర్చుకుని, సరిగ్గా అర్థం చేసుకోవటాన్ని **ఋతం** అంటారు.

**సత్యముత్తరః పక్షః** – సత్యం ఉత్తరపక్షం. కేవలం జ్ఞానం పొందితే చాలదు; దాన్ని ఆచరణలో పెట్టాలి. అనుష్ఠానం లేని విద్య లాభం లేదు. ధర్మం వద (పలుకు) అనలేదు; ధర్మం చర (ఆచరించు) అంది శాస్త్రం. ధర్మాన్ని యోగాసనంతో పోల్చవచ్చు. టీవీలో ఎవరో యోగాసనాలు వేస్తున్నది మీరు హాయిగా బీన్‌బ్యాగ్‌మీద కూర్చుని, జీడిపప్పు పలుకులను నములుతూ చూస్తుంటే ఏమైనా ఫలం కలుగుతుందా? ఆ యోగాసనాలను మీరు వేస్తేనే మీరు లాభం పొందుతారు. యోగాసనాల గురించి నేర్చుకోవాలి నిజమే, కాని కూర్చుని నేర్చుకుంటే అది అసంపూర్ణంగా మిగిలిపోతుంది; దాన్ని ఆచరణలో పెట్టాలి. వేదాంతబోధ కూడా అంతే.

ఋతం వదిష్యామి, సత్యం వదిష్యామి.

ఋతానికీ, సత్యానికీ చిన్న సూక్ష్మభేదం ఉంది.

ఋతమ్ = యథా శాస్త్రం జ్ఞానమ్; సత్యమ్ = యథా జ్ఞానం అనుష్ఠానమ్

ఋతం అంటే జ్ఞానం పొందటం; సత్యం అంటే ఆ పొందిన జ్ఞానాన్ని ఆచరణలో పెట్టటం. అందువల్ల శాస్త్రంలో నేర్చుకున్నదాన్ని ఆచరణలో పెట్టాలి. కుడిపక్షం ఋతం; ఎడమపక్షం సత్యం; శ్రద్ధ శిరస్సు. అయితే మధ్యభాగమైన ఆత్మ ఏది?

**యోగ ఆత్మా** – వీటన్నిటిలోకీ యోగం చాలా ముఖ్యమైన అంశము. యోగం అంటే అంతిమలక్ష్యాన్ని దృష్టిలో పెట్టుకుని గడిపే జీవనవిధానం. మధ్యలో మనకు అనేక అవాంతర లక్ష్యాలు ఉంటాయి. ఉదాహరణకు విద్య, ఉద్యోగం, పెళ్ళి, పిల్లలు, కుటుంబక్షేమం. వీటిలో దేన్ని సాధిస్తున్నా కూడా, అంతిమలక్ష్యాన్ని ఎన్నడూ మరచిపోకూడదు. జ్ఞానయోగ్యతా ప్రాప్తిని, జ్ఞానప్రాప్తిని మర్చిపోకూడదు.

**కస్య త్వం కుత ఆయాతః** – భజగోవిందమ్

ఎవరినుంచి వచ్చావు? ఎక్కడినుంచి వచ్చావు?

**వ్యవసాయాత్మికా బుద్ధిః ఏకేహ కురునందన ।**
**బహుశాఖా హ్యనంతాశ్చ బుద్ధయోఽవ్యవసాయినామ్ ॥** – గీత 2.41

చాలామంది నేటి పరుగుపందెంలో పడిపోయి, లక్ష్యాన్ని విడిచి పరుగులు తీస్తూంటారు. ఏ కొందరో మాత్రమే వారి లక్ష్యాన్ని ఎన్నడూ వీడరు. వారు జీవితంలో చేయాల్సిన సంస్కారాలన్నింటినీ చేస్తూ, ఎప్పటికప్పుడు వారి కర్తవ్యాన్ని నెరవేరుస్తూ ఉంటారు. వారికి ప్రతి సంఘటనా ఒక యజ్ఞమే. పుత్రుడు పుడితే బారసాల యజ్ఞం; తొలిముద్ద తినిపించాలంటే అన్నప్రాసన యజ్ఞం; పాఠశాలకు పంపాలంటే విద్యారంభం కోసం సరస్వతీ పూజ యజ్ఞం, ఇలా అడుగడుక్కీ యజ్ఞాలుగా మలుచుకుంటారు వారి వేడుకలను. ఈ యజ్ఞాల వెనుకనున్న అసలు అర్థం, వారి జీవితలక్ష్యాన్ని ఎన్నడూ మర్చిపోకూడదనే జాగ్రత్త. ఇలా ఎప్పుడూ అప్రమత్తతగా ఉండటాన్నే యోగః అంటారు. దీన్ని శంకరాచార్యులవారు చిత్త సమాధానం అంటారు. అంటే మన ముఖ్యమైన లక్ష్యాన్ని ఎన్నడూ మరవకపోవటం.

**మహః పుచ్ఛం ప్రతిష్ఠా** – మహః అంటే హిరణ్యగర్భ – సమష్టి విజ్ఞానమయం. హిరణ్యగర్భ ఆధారం. ప్రతి కర్మకు ఈశ్వరానుగ్రహం ఉండాలి. ఈశ్వరానుగ్రహం లేనిదే ఏ పనీ చేయలేము.

**అధిష్ఠానం తథా కర్తా కరణం చ పృథగ్విధమ్**
**వివిధాశ్చ పృథక్ చేష్టా దైవం చైవాత్ర పంచమమ్** – 14

ఒక కర్మ చేయటానికి ఐదు అంశాలు అవసరం. అవి – అధిష్ఠానం, కర్త, వివిధ కరణాలు, వివిధ కర్మలు, దైవం.

శరీరంలో ప్రతి ఒక్క అంగానికి ఒక అధిష్ఠానదేవత ఉంటుంది. ఈ అధిష్ఠానదేవతలన్నింటికీ అధిష్ఠానదేవత హిరణ్యగర్భ. అందువల్ల జ్ఞాతకు, కర్తకు కూడా ఆధారం హిరణ్యగర్భ.

ఇక్కడితో విజ్ఞానమయ ఆత్మకు సంబంధించిన ఐదు అంశాలు అయిపోయాయి.

**తదప్యేష శ్లోకో భవతి** – ఈ విజ్ఞానమయ విషయం గురించి, ఈ మంత్రం ఉంది. ఈ ఋగ్మంత్రం విజ్ఞానమయాన్ని కీర్తించి, విజ్ఞానమయ సమష్టి విజ్ఞాన ఐక్య ఉపాసనను పరిచయం చేస్తుంది.

## అనువాకం – 5

**విజ్ఞానం యజ్ఞం తనుతే। కర్మాణి తనుతేఽపి చ। విజ్ఞానం దేవాస్సర్వే। బ్రహ్మ జ్యేష్ఠముపాసతే। విజ్ఞానం బ్రహ్మ చేద్వేద। తస్మాచ్చేన్న ప్రమాద్యతి। శరీరే పాప్మనో హిత్వా। సర్వాన్ కామాన్ సమశ్నుత ఇతి। తస్యైష ఏవ శారీర ఆత్మా। యః పూర్వస్య। తస్మాద్వా ఏతస్మాద్విజ్ఞానమయాత్। అన్యోఽన్తర ఆత్మాఽఽనన్దమయః। తేనైష పూర్ణః। స వా ఏష పురుషవిధ ఏవ। తస్య పురుష విధతామ్। అన్వయం పురుష విధః। తస్య ప్రియమేవ శిరః। మోదో దక్షిణః పక్షః। ప్రమోద ఉత్తరః పక్షః। ఆనంద ఆత్మా। బ్రహ్మ పుచ్ఛం ప్రతిష్ఠా। తదప్యేష శ్లోకో భవతి।**

### వివరణ

**విజ్ఞానం యజ్ఞం తనుతే। కర్మాణి తనుతేఽపి చ। విజ్ఞానం దేవాస్సర్వే। బ్రహ్మ జ్యేష్ఠముపాసతే। విజ్ఞానం బ్రహ్మ చేద్వేద। తస్మాచ్చేన్న ప్రమాద్యతి। శరీరే పాప్మనో హిత్వా। సర్వాన్ కామాన్ సమశ్నుత ఇతి। తస్యైష ఏవ శారీర ఆత్మా। యః పూర్వస్య।**

ఋగ్మంత్రం విజ్ఞాన పదంతో మొదలయి, సర్వాన్ కామాన్ సమశ్నుత ఇతితో ముగుస్తుంది. ఇతి పదం ఇక్కడితో ఋగ్మంత్రం అయిపోయిందని సూచిస్తుంది.

ఈ విజ్ఞానమయ ఆత్మ కర్త అంటున్నది ఈ మంత్రం. తెలివైన వ్యక్తి ఒక విషయం గురించి తెలుసుకుని, దాని మంచీచెడులు బేరీజు వేసి, సరియైన లక్ష్యాన్ని ఎన్నుకుంటాడు. వార్తాపత్రికల ద్వారా అనేక విషయాల గురించిన జ్ఞానం కలుగుతుంది. వాటన్నింటి గురించీ తెలుసుకుని, వేదాంతబోధ కంటే, ఇంకొక విషయం వైపు మొగ్గు చూపినా చూపించవచ్చు కొందరు. బుద్ధిని వివేకచూడామణి అంటారు. బుద్ధి అనేక విషయాలను తెలుసుకుని, మంచీచెడులు బేరీజు వేసి, ఒక నిర్ణయం తీసుకుని, తదనుగుణంగా చేయమంటుంది. కఠోపనిషత్తులో అద్భుతమైన రథకల్పన వస్తుంది. అందులో బుద్ధిని రథసారధితో పోలుస్తుంది ఉపనిషత్తు. రథసారధి పగ్గాలను చేతులతో పట్టుకుని, తద్వారా గుర్రాలను అదుపులో పెడతాడు.

**బుద్ధిం తు సారథిం విద్ధి** – కఠ

అదే విధంగా బుద్ధి, మనస్సును అదుపులో పెట్టి, తద్వారా ఇంద్రియాలను కూడా నిర్దేశిస్తుంది. ఈ బుద్ధికుశలతే మనిషిని జంతువులకన్నా పైన నిలబెడుతుంది.

**విజ్ఞానం యజ్ఞం తనుతే** – ఇక్కడ విజ్ఞానం అంటే విజ్ఞానమయ ఆత్మా, ప్రమాతా, కర్తా. ఈ విజ్ఞానమయ ఆత్మే వైదికయజ్ఞాలన్నింటినీ చేస్తుంది. దానికి శాస్త్రంమీద శ్రద్ధ కూడా ఉండాలని చూశాము. శ్రద్ధ ఉంటేనే ధార్మికకర్మలు లేదా అదృష్ట ప్రధానకర్మలు చేస్తాడు.

ఉదాహరణకు ఒక కుటుంబం వైదికకర్మలను ఆచరిస్తుంటేనే, గోత్రనామాలకు విలువ ఉంటుంది. ఎప్పుడైతే వైదిక కర్మలను పట్టించుకోరో, అప్పుడే గోత్రనామాలను చూసి, వంశాన్ని చూసి చేసే సాంప్రదాయ వివాహాలు మటుమాయమవుతాయి. అర్థకామాలకే ప్రాముఖ్యతనిచ్చే సమాజంలో సాంప్రదాయం వెనక్కి వెళ్ళిపోయి, అబ్బాయి–అమ్మాయి ఒకరినొకరు ఇష్టపడటానికి ప్రాముఖ్యతనిస్తారు. కాని అది మూన్నాళ్ళ ముచ్చట అయ్యే ప్రమాదం ఉంది. ఎప్పుడైతే వారి ఇష్టాయిష్టాలు మారుతాయో, అప్పుడే వారి వివాహం ప్రమాదంలో పడే ప్రమాదం ఉంది. అలా అర్థకామాలకు ప్రాధాన్యతను ఇవ్వకుండా, ధర్మ మోక్షాలకు ప్రాధాన్యత ఇస్తే, వ్యక్తిగత ఇష్టాలు వెనక్కి వెళ్ళిపోయి, వైదిక సాంప్రదాయానికి విలువ వస్తుంది. విజ్ఞానమయ ఆత్మే ఈ వైదిక కర్మలను చేస్తుంది.

**కర్మాణి తనుతేఽపి చ** – శాస్త్రం విధించిన కర్మలను మాత్రమే కాక, విజ్ఞానమయ ఆత్మ లౌకికకర్మలను కూడా చేస్తుంది. శాస్త్రాన్ని నమ్మని నాస్తికుడు కూడా లౌకికకర్మలను చేసేది ఈ విజ్ఞానమయ ఆత్మ ద్వారానే. అందువల్ల విజ్ఞానమయంమీద ఉపాసన చేయాలి.

**సర్వే దేవా విజ్ఞానమ్ ఉపాసతే** – దేవతలు కూడా ఈ విజ్ఞానమయ ఆత్మమీద ఉపాసన చేస్తారు. ఎలా చేస్తారు?

**జ్యేష్ఠ బ్రహ్మ** – ఈ విజ్ఞానమయ ఆత్మను హిరణ్యగర్భగా, అందరికీ జ్యేష్ఠునిగా ఉపాసన చేస్తారు.

**బ్రహ్మా దేవానాం ప్రథమః సంబభూవ విశ్వస్య కర్తా భువనస్య గోప్తా** – ముండకమ్ 1.1.1

బ్రహ్మదేవుడు దేవతలందరిలోకీ ముందు పుట్టాడు. పురాణాలు హిరణ్యగర్భను బ్రహ్మ అంటాయి. వాటిలో బ్రహ్మ, విష్ణుమూర్తి నాభినుంచి కలువపూవుమీద ఉద్భవించాడు అని చూస్తాము. అప్పుడు బ్రహ్మకు సృష్టి కార్యక్రమాన్ని అప్పజెప్పాడు విష్ణుమూర్తి. ఈ బ్రహ్మను సమష్టి విజ్ఞానమయంగా దేవతలందరూ ఉపాసన చేస్తారు.

ఆ విధంగా వ్యష్టి–సమష్టి–విజ్ఞానమయ–ఐక్య ఉపాసన చేయవచ్చు. ఫలం రెండు రకాలుగా వస్తుంది. అవి సకామఫలం, నిష్కామఫలం. ఉపనిషత్తు సకామఫలం గురించి మాత్రమే చెబుతుంది. నిష్కామఫలం మనం కలుపుకోవచ్చు. అది చిత్తశుద్ధి, చిత్తవిశాలత, చిత్తఏకాగ్రత. ఈ ఐక్యఉపాసన చేసినప్పుడు వ్యష్టి బుద్ధితో లయమవకుండా, సాధకుడు సమష్టిబుద్ధిమీద ఉపాసన చేస్తాడు కాబట్టి చిత్తశుద్ధి ఏర్పడుతుంది. ఒక అల తనను పరిమితి

ఉన్న అలగా కాకుండా; సముద్రంలోనూ, తనలోనూ ఉన్నది ఒకటే నీరు అని తెలుసుకుంటే, అలకు తను చిన్న అలననే భావన, ఆ అల నామ, రూపాలతో బంధం పోతుంది. సమష్టి దృష్టిలో వ్యష్టి అహంకారం బలహీనమవటమే చిత్తశుద్ధి.

నేను, నా కుటుంబం అని పరిధులు విధించుకుంటే అహంకారం బలంగా ఉంటుంది; దాని బదులు నా ఊరు అనుకుంటే అహంకారం కొంచెం తగ్గుతుంది. ఆ దృష్టిని ఊరునుంచి దేశానికి, దేశంనుంచి ఖండానికీ, ఖండంనుంచి విశ్వానికీ పెంచుకుంటూ వస్తే అహంకారం తగ్గటమే కాక, చిత్తవిశాలత కూడా ఏర్పడుతుంది. ఈ సాధన కొన్నిరోజులు చేస్తే, ఆనందమయ ఆత్మలోకి అడుగుపెట్టటానికి సంసిద్ధుడు అవుతాడు సాధకుడు.

సకామ ఉపాసకుడు పొందే ఫలమేమిటి? అది ఉపనిషత్తు వివరిస్తుంది ఇలా –

**విజ్ఞానం బ్రహ్మ చేద్వేద** – వేద అర్థం ఇక్కడ తెలుసుకుంటే అని కాదు; వేద అంటే ఉపాసన చేస్తే అని అర్థం. బ్రహ్మ అంటే సమష్టి విజ్ఞానమయం అని చూశాము. అందువల్ల ఒక వ్యక్తి విజ్ఞానమయ–వ్యష్టి–సమష్టి–ఐక్యఉపాసన చేస్తే కలిగే ఫలం చెబుతున్నది. ఎప్పుడు చేయాలి? జీవితాంతం. ఈ విషయాన్ని కృష్ణపరమాత్మ వివరిస్తాడు ఎనిమిదవ అధ్యాయంలో.

**అంతకాలే చ మామేవ స్మరన్ ముక్త్వా కలేవరమ్ ।**
**యః ప్రయాతి స మద్భావం యాతి నాస్త్యత్ర సంశయః ॥** – గీత 8.5

ఎవరైతే అంత్యకాలంలో నన్నే స్మరిస్తూ మరణిస్తారో, వారు నన్నే పొందుతారు. అందులో ఏమాత్రం సందేహం లేదు అంటున్నాడు కృష్ణపరమాత్మ.

**యం యం వాపి స్మరన్ భావం త్యజత్యంతే కలేవరమ్ ।**
**తం తమేవైతి కౌంతేయ సదా తద్భావభావితః ॥** – గీత 8.6

మనిషి మరణకాలంలో దేన్ని స్మరిస్తూ మరణిస్తాడో, మరుజన్మలో దాన్నే పొందుతాడు. ఇక్కడ ఈ విషయాన్ని అన్వయించుకోవాలి.

**తస్మాత్ న ప్రమాద్యతి** – ఆ విజ్ఞానబ్రహ్మను విస్మరించకుండా ఉన్నట్లైతే. అంటే ఉపాసకుడు ఈ ఐక్యఉపాసనే చేయాలి కాని, మళ్ళీ వ్యష్టి గురించి ఆలోచించకూడదు. సమష్టిదృష్ట్యా వ్యష్టి చాలా చిన్నది. అంత్యకాలంలో కూడా హిరణ్యగర్భను మర్చిపోకూడదు.

మన సాంప్రదాయం వృద్ధాప్యంలో, ముఖ్యంగా మరణానికి చేరువవుతున్నప్పుడు భగవన్నామస్మరణ చేసేలాగా మనను తీర్చిదిద్దింది. ఆ సాంప్రదాయాన్ని ఇప్పటికీ పాటిస్తున్న వైదిక కుటుంబాలలో రోగి అవసానస్థితిలో ఉన్నప్పుడు, అతని చుట్టూచేరి, అనవసరమైన కబుర్లతో కాలం వృథాపరచకుండా, సామూహిక ప్రార్థన చేస్తారు. ఏ విష్ణుసహస్రనామమో పఠిస్తారు. అంటే రోగి స్వయంగా తను ప్రార్థన చేయలేకపోయినా, కనీసం దైవచింతనలో

ఉంటాడు. దీని అర్థం మనిషి ఎంతసేపూ తాత్కాలికమైన, లౌకికమైన, చిన్నచిన్న అనుబంధాల కోసం పాకులాడుతాడే కాని అవి శాశ్వతమైనవి కావు, వచ్చిపోయేవి అని అర్థం చేసుకోడు. శాశ్వతమైన, విలువైన అనుబంధం ఏదైనా ఉందంటే, అది భగవంతునితో మాత్రమే అని గుర్తుంచుకోండి. ఈశ్వరసంబంధం మాత్రమే నిత్యం, సత్యం. అందువల్ల మీలోని భక్తుణ్ణి వెలికితీయండి.

**శరీరే పాప్మనో హిత్వా** – మరణసమయంలో ఎవరైతే హిరణ్యగర్భ ధ్యానంలో ఉంటారో, అతనికే మరణంలో అతని స్థూలశరీరంతో పాటు పాపాలు కూడా దగ్ధమయిపోతాయి. ఈ వాక్యం సారాంశం ఈ ఉపాసకుని పాపాలు మటుమాయమైపోయి, అతని పుణ్యాలు మాత్రం మిగిలి, అవి అతని జీవాత్మను బ్రహ్మలోకానికి తీసుకువెళతాయి. అంటే అతని జీవాత్మకు హిరణ్యగర్భ ఐక్యప్రాప్తి కలుగుతుంది. అంటే ఈ ఉపాసకునికి కలిగే ఫలం బ్రహ్మలోకప్రాప్తి. విజ్ఞానమయస్థాయిలో ఎవరైనా పొందగలిగే అత్యున్నత ఫలం బ్రహ్మలోక ప్రాప్తి. ఈ స్థాయిలో ఆగిపోయిన వ్యక్తికి మోక్షం కలుగదు; ఎందుకంటే మోక్షం పొందాలంటే అతను పంచకోశ విలక్షణ ఆత్మజ్ఞానాన్ని పొందాలి.

**సర్వాన్ కామాన్ సమశ్నుత ఇతి** – అన్ని సుఖాలూ కలుగుతాయి. బ్రహ్మలోకంలో అన్ని సుఖాలు ఉంటాయి. ఇక్కడ కామం అంటే ఇంద్రియసుఖాలు. బ్రహ్మలోకంలో ఇంద్రియాలు, ఇంద్రియ వస్తువులు, ఇంద్రియ సుఖాలు, వాతావరణం అన్నీ శ్రేష్ఠంగా ఉంటాయి. ఒక్క ముక్కలో చెప్పాలంటే అక్కడ కష్టమంటే ఏమిటో తెలియదు. ఆనందమే ఆనందం ఉంటుంది.

**ఇతి** – విజ్ఞానమయ–వ్యష్టి–సమష్టి ఐక్యఉపాసన సకామంగా చేస్తే బ్రహ్మలోకప్రాప్తి ఫలం అని ముగిస్తున్నది ఋగ్మంత్రం. ఇక్కడ్నుంచి యజుర్వేద ఉపనిషత్తు అందుకుంటున్నది.

**తస్యైష ఏవ శారీర ఆత్మా** – ఈ శారీర ఆత్మా అయిన విజ్ఞానమయం మనోమయంలో ఉంది.

**యః పూర్వస్య** – అంతకు ముందులాగానే దానికి శరీరం మనోమయం.

ఈ ఉపాసన మనస్సు ఇంకా సూక్ష్మతమం అయ్యేటంతవరకూ చేయాలి. అంటే ఈ సాధకుడు అన్నమయ, ప్రాణమయ, మనోమయాలకన్నా విజ్ఞానానికి ఎక్కువ విలువను ఇవ్వాలి. వారి సిద్ధాంతాలను నిలబెట్టుకోవటం కోసం ప్రాణాలు కూడా అర్పించటానికి సిద్ధంగా ఉన్నవారిలో విజ్ఞానమయ ఆత్మ శక్తివంతంగా ఉంటుంది. వారు వారి సిద్ధాంతం కోసం వారి కుటుంబాన్ని, వారికున్న సర్వస్వాన్ని త్యజించటానికి సిద్ధంగా ఉంటారు. దానికి నిదర్శనం మన దేశస్వాతంత్ర్యం కోసం ప్రాణాలొడ్డి పోరాడిన మన నాయకులే!

ఇప్పుడింక మనం ఆనందమయానికి వెళ్ళటానికి సిద్ధంగా ఉన్నామని, ఉపనిషత్తు నమ్ముతున్నది. ఆనందమయం కారణశరీరంలో ఉంటుంది.

**తస్మాద్వా ఏతస్మాద్విజ్ఞానమయాత్। అన్యోఽన్తర ఆత్మాఽనన్దమయః। తేనైష పూర్ణః। స వా ఏష పురుషవిధ ఏవ। తస్య పురుషవిధతామ్। అన్వయం పురుషవిధః। తస్య ప్రియమేవ శిరః। మోదో దక్షిణః పక్షః। ప్రమోద ఉత్తరః పక్షః। ఆనంద ఆత్మా। బ్రహ్మ పుచ్ఛం ప్రతిష్ఠా। తదప్యేష శ్లోకో భవతి।**

5. **ఆనందమయమే ఆత్మ** – ఇప్పుడు ఐదవ మెట్టు ఎక్కాలి. ఇక్కడ విజ్ఞానమయం కూడా ఆత్మకాదు. ఆత్మ విజ్ఞానమయానికి భిన్నంగా ఉంది అంటున్నది ఉపనిషత్తు. దానికి కారణాలు కూడా చెబుతున్నది. ఇప్పుడు మన ప్రయాణం ఇంకా ఆంతరంగా, ఇంకా సూక్ష్మంగా ఉంటుంది.

**తస్మాద్వా ఏతస్మాద్విజ్ఞానమయాత్ అన్యః** – అది విజ్ఞానమయానికి భిన్నంగా ఉంది. అంటే విజ్ఞానమయం ఆత్మ కాదు. ఆనందమయమే ఆత్మ అంటున్నది (తాత్కాలికంగా). ఆ ఆనందమయ ఆత్మ ఎక్కడ ఉంది?

**అంతర ఆత్మా** – విజ్ఞానమయంలో ఉంది. దానికోసం బాహ్యంగా వెతకకూడదు. మన ప్రయాణం అంతకంతకూ ఆంతరంగా సాగాలి.

ఇకనుంచి మనం చూసేదంతా ఆనందమయం గురించి. ఇక ఆనందమయం ఆత్మ అవుతుంది; విజ్ఞానమయం అనాత్మ లేదా కోశం అవుతుంది. ఎప్పుడైతే విజ్ఞానమయాన్ని అనాత్మ అన్నామో, అప్పుడే తక్కిన అంశాలన్నీ వరుసగా వస్తాయి – అనాత్మ నిశ్చయః, కార్యత్వ నిశ్చయః, నామరూపత్వ నిశ్చయః, మిథ్యాత్వ నిశ్చయః, ప్రవిలాపన నిశ్చయః. ఒక్కముక్కలో చెప్పాలంటే విజ్ఞానమయం ఆనందమయంలో లయమయిపోతుంది. అప్పుడే సమష్టి విజ్ఞానమయం కూడా సమష్టి ఆనందమయంలో లయమవుతుంది. అంటే హిరణ్యగర్భ కూడా లయమయిపోతాడు.

ఆనందమయం విజ్ఞానమయంలో ఉంది కాబట్టి, అది విజ్ఞానమయానికి ఉన్న ఆకారాన్ని తీసుకుంటుంది. విజ్ఞానమయానికి కూడా మనుష్య ఆకారమే ఉందని చూశాము కాబట్టి, ఆనందమయానికి కూడా మనుష్య ఆకారమే ఉంటుంది.

**తేనైష పూర్ణః** – విజ్ఞానమయంలో ఆనందమయం నిండి ఉంది.

**స వా ఏష పురుషవిధ ఏవ** – ఆనందఆత్మకు కూడా పురుషాకారమే ఉంది.

**తస్య పురుషవిధతామ్ అన్వయం పురుషవిధః** – ఈ పురుష ఆకారం స్వరూప లక్షణం కాదు, ఇది విజ్ఞానమయంనుంచి అరువు తెచ్చుకుంది. నిజానికి విజ్ఞానమయం కూడా మనోమయం నుంచి, మనోమయం ప్రాణమయంనుంచి, ప్రాణమయం అన్నమయంనుంచి అరువు తెచ్చుకున్నాయని చూస్తూ వస్తున్నాము. అంటే స్వాభావిక ఆకారం ఒక అన్నమయానికే ఉంది. శరీరంలో భాగాలు చూద్దాము.

**తస్య ప్రియమేవ శిరః** – అన్నమయ ఆత్మకు, ప్రియం శిరస్సు. ప్రియం అంటే ఆనందం.

**మోదో దక్షిణః పక్షః** – మోదం కుడిపక్షం. మోదం అంటే ఆనందతరం. ప్రియం అంటే ఆనందం; మోదం అంటే ప్రియతరం.

**ప్రమోద ఉత్తరః పక్షః** – ప్రమోదం ఎడమపక్షము. ప్రమోదం అంటే ఆనందతమం. ప్రియం అంటే ఆనందం; మోదం అంటే ప్రియతరం; ప్రమోదం అంటే ప్రియతమం. హ్యాపీ, హ్యాపియర్, హ్యాపియస్ట్ అని ఇంగ్లీషులో డిగ్రీస్ ఆఫ్ కంపారిజన్‌లో చూస్తాము.

ఏ ఆనందం ఏ స్థాయిలోకి వస్తుందో ఎలా తెలుస్తుంది? దానికి శాస్త్రం చిన్న వివరణ ఇస్తుంది.

**ప్రియం** – మీకు ఇష్టమైన ఒక వస్తువును చూశారనుకోండి, దాన్ని చూసినంత మాత్రానే మీకు ఆనందం కలుగుతుంది. **ఇష్ట దర్శనజం సుఖమ్.** ఉదాహరణకు మీరు ఒక హోటల్‌కు వెళ్ళారు. మెనూకార్డులో మీకిష్టమైన గులాబ్‌జామ్ కనబడింది. వెంటనే మీకు ఆనందం వేస్తుంది. దాన్ని తెప్పించుకుని తినవచ్చు అనే ఆనందం.

**మోదం** – ఆనందంయొక్క తర్వాత స్థాయి. ఆ గులాబ్‌జామ్ మీ కళ్ళముందు, మీ టేబుల్ మీద ప్రత్యక్షమవటం. **ఇష్ట గ్రహణజం సుఖమ్.** అది వచ్చేదాకా చాలా ఆశగా ఎదురు చూస్తారు. ఆ హోటల్‌కున్న నక్షత్రాల సంఖ్య పెరిగినకొద్దీ మీరు ఎదురుచూసే సమయం పెరుగుతూ వస్తుంది. చివరికి వెయిటర్ తెచ్చి మీముందు పెట్టాడు. ఇప్పుడది అక్షరాలా మీది. దాన్ని పొందటాన్ని గ్రహణజం అంటారు. ముందు పరిస్థితికన్నా ఈ ఆనందం ఎక్కువే; ఎందుకంటే అది మీముందు ఉంది; కాని అది పూర్తిగా ఎక్కువకాదు, ఎందుకంటే దాన్ని తినేలోపు ఏమైనా అవవచ్చు. చేతిలో ఉన్న వస్తువు నోటిదాకా వెళుతుందని ఖచ్చితంగా చెప్పలేము.

**ప్రమోదం** – మీ ఎదురుగా ఉన్న గులాబ్‌జామ్‌ని మీ నోట్లో పెట్టుకుంటే, అది మీలో లయమవుతుంది. సబ్జెక్టు, ఆబ్జెక్టు ఒకటయ్యాయి. ద్వైతం అద్వైతం అయింది. ఇది అన్నింటికన్నా శ్రేష్ఠతమమైన ఆనందం. దీన్ని అనుభవం అంటారు. ఇది ఆనంద పరాకాష్ఠ. **ఇష్ట అనుభవజం సుఖమ్.**

ఈ తారతమ్యాలున్న, అనుభవంలోకి వస్తున్న ఆనందాన్ని ఆనందమయః అంటారు. తారతమ్యాలున్న ఆనందం అంటే ఆనందం స్థాయిలో భేదాలు చూపిస్తున్నది. అనుభవంలోకి వస్తున్నది అంటే ఈ ఆనందానికి రాక, పోకలు ఉన్నాయి. మయ అంటే దానితో కలిసిన అని అర్థం. రాకపోకలున్న, తారతమ్యాలున్న, అనుభవంలోకి వచ్చే నియమాలకు లోబడే

ఈ ఆనందమే ఆనందమయం. ఇంతవరకూ చూసిన అన్ని కోశాలకు ఐదు భాగాలు చూస్తే, ఇక్కడ మూడుభాగాలే చూస్తాము.

ఇప్పుడు ఉపనిషత్తు ఈ ఆనందమయం కూడా అంటే అనుభవంలోకి వచ్చే ఆనందం కూడా, అసలు ఆత్మ కాదు అంటుంది. మరయితే ఏది అసలు ఆత్మ?

**ఆనంద ఆత్మా** – ఆనందమే ఆత్మ. గమనిస్తే ఇక్కడ 'మయ' శబ్దం లేదు. సంస్కృత వ్యాకరణంలో మయట్ శబ్దం అంటే వికారాలు ఉన్నది, మార్పులు ఉన్నది అని అర్థం.

**మయట్ చ అత్ర వికారార్థే దృష్టో యథా అన్నమయః ఇత్యత్ర**

కార్యం అని సూచించటానికి అన్నమయం, విజ్ఞానమయం పదాలు వచ్చాయి. ఆనంద మయంలో ప్రియ, మోద, ప్రమోదాలనే తారతమ్యాలు ఉన్నాయని, ఆ ఆనందం అనుభవంలోకి వస్తుందనీ చూశాము. ఆనందమే ఆత్మ అంటే తారతమ్యాలు లేని, రాకపోకలు లేని, అనుభవంలోకి రాని ఆనందం. నేను ఈ ఆనందాన్ని.

ఆనంద ఆత్మ అంటే ఆనందమయం అనాత్మ లేదా కోశం అవుతుంది. ఎప్పుడైతే ఆనందమయాన్ని అనాత్మ అన్నామో, అప్పుడే తక్కిన అంశాలన్నీ వరుసగా వస్తాయి – అనాత్మ నిశ్చయః, కార్యత్వ నిశ్చయః, నామరూపత్వ నిశ్చయః, మిథ్యాత్వ నిశ్చయః, ప్రవిలాపన నిశ్చయః.

ఆనందమయ ఆనందానికి ప్రియ, మోద, ప్రమోదాలుంటే ఆత్మానందం అసలు అనుభవంలోకే రాదు. అది అనుభవంలోకి వచ్చే ఆబ్జెక్టు కాదు, సబ్జెక్టుని అయిన నేనే ఆనంద ఆత్మను అని బుద్ధిలో అర్థం చేసుకోవాలి.

**బ్రహ్మ పుచ్ఛం ప్రతిష్ఠా** – ఈ ఆత్మానందానికి ఆధారం బ్రహ్మ. ఈ వాక్యాన్ని మనం జాగ్రత్తగా అర్థం చేసుకోవాలి. ఆత్మానందానికి ఆధారం బ్రహ్మ అంటే, ఆధారం ఉన్నట్టుగా అని అర్థం చేసుకోవాలి. ఈ వాక్యం అసలు అర్థం ఆత్మానందమే బ్రహ్మానందం. ఇక్కడ ఆధారం అంటే, ఈ రెండూ ఒకటే అని అర్థం. ఉదాహరణకు ఘటాకాశం, మహదాకాశం తీసుకుంటే ఘటాకాశానికి, మహదాకాశం ఆధారం అంటాము. కాని నిజానికి మహదాకాశం ఆధారం అనలేము. ఎందుకంటే ఆకాశానికి భాగాలు లేవు. ఉన్నదంతా ఒకటే భాగం. మహదాకాశం ఘటాకాశానికి ఆధారంలా అనిపిస్తుంది అంతే. అదే విధంగా ఆత్మానందానికి, బ్రహ్మానందం ఆధారం అంటే, అవి రెండూ ఒకటే అని అర్థం. ఈ విషయం ఈ అధ్యాయం మొదట్లో ఉపనిషత్తే చెప్పింది.

**సత్యం జ్ఞానమనంతం బ్రహ్మ**
**తస్మాద్వా ఏతస్మాదాత్మన ఆకాశస్సంభూతః**

ముందేమో ఉపనిషత్తు బ్రహ్మను సత్యం, జ్ఞానం, అనంతం బ్రహ్మ అని నిర్వచించి, ఆ ఆత్మనుంచి సృష్టి జరిగింది అన్నది. అంటే బ్రహ్మ, ఆత్మ పదాలను ఒకదానికొకటి వాడుతున్నది. దీన్నిబట్టి ఆత్మ = బ్రహ్మ అని అర్థమవుతున్నది.

ఈ విధంగా మనం ఒక్కొక్క కోశాన్ని దాటుకుంటూ ఆనంద ఆత్మకు వచ్చాము. దీన్ని **పంచకోశ వివేకం** అంటారు. పంచకోశ వివేకం ద్వారా బుద్ధిని స్థూలబుద్ధినుంచి సూక్ష్మతమం చేసుకోవటం నేర్చుకుంటాము. బుద్ధి సూక్ష్మతమంగా ఉంటేనే సూక్ష్మతమమైన ఆత్మ గురించి అర్థం చేసుకోగలదు. మనం చేపట్టే పనిని బట్టి, దానికి తగ్గ పరికరాన్ని వాడతాము. ఒక చెట్టు కొట్టాలంటే గొడ్డలి వాడతాడు తోటమాలి. ఒక వ్యక్తికి గడ్డం గీయాలంటే దానికన్నా సూక్ష్మమైన రేజర్‌ను వాడతాడు మంగలి. కంటికి వైద్యం చేయాలంటే సూక్ష్మాతి సూక్ష్మమైన లేజర్ వాడతాడు కంటివైద్యుడు.

ఆత్మ సూక్ష్మాతి సూక్ష్మమైనది. ఆత్మ నిర్గుణం, అందువల్ల ప్రత్యక్ష ప్రమాణానికి అందదు. ఆబ్జెక్టుగా (ప్రమేయంగా) చూడలేము. ఇటువంటి సూక్ష్మాతి సూక్ష్మమైన ఆత్మ గురించి తెలుసుకోవాలంటే మనస్సు ఎంత సూక్ష్మాతి సూక్ష్మంగా ఉండాలి? అది అంత తేలికగా సూక్ష్మాతి సూక్ష్మం అవదు. దాన్ని క్రమేపీ సూక్ష్మంగా చేసుకుంటూ రావాలి. అందువల్ల ఉపనిషత్తు ముందు అత్యంత స్థూలమైన సూక్ష్మశరీరంతో మొదలుపెట్టింది. దాన్నే అన్నమయకోశం అంది. అక్కడ్నుంచి మన ప్రయాణాన్ని అంతకంతకూ లోపలికి, అంతకంతకూ సూక్ష్మమైన దానికి చేయించింది. అంటే అన్నమయకోశానికన్నా సూక్ష్మం ప్రాణమయకోశం; అది అన్నమయ కోశంలో ఉంది. అలా చెప్పుకుంటూ ఆనందమయ కోశానికి వచ్చింది. ఆనందమయకోశం తక్కిన కోశాల కన్నా సూక్ష్మమైనది, అన్నింటికన్నా లోపల ఉన్నది.

ఈ ప్రయాణం ఒక కంటివైద్యుడు మన చేత చేయించే ప్రయాణానికి తగ్గట్టుగా ఉంటుంది. మన కళ్ళు ఎంత చురుకుగా పనిచేస్తున్నాయో చూడటానికి డాక్టరు మన ఎదురుగా ఒక బోర్డును చూపించి, దానిమీద ఉన్న అక్షరాలను చదవమంటాడు. అవి అత్యంత స్థూల అక్షరాలతో మొదలయి, అంతకంతకూ ఆకారం తగ్గుతూ వచ్చి, చివరకు చాలా సూక్ష్మంగా ఉంటాయి.

ఆ విధంగా మనం కూడా బాహ్యంగా కనిపిస్తున్న అత్యంత స్థూలశరీరమైన అన్నమయ కోశంతో మొదలుపెట్టి, ఆనందమయ కోశానికి వచ్చి, ఆనందం ఆత్మ అన్నాము. దాని తర్వాత ఆనందమయకోశంలో కలిగే కోశానందానికీ, ఆత్మానందానికీ మధ్య భేదాలు చూశాము. వాటిని ఒక పట్టికలో మళ్ళీ చూద్దాము.

**ఆనందమయకోశ ఆనందానికీ, ఆత్మానందానికీ మధ్య భేదాలు**

| **కోశానందం** | **ఆత్మానందం** |
|---|---|
| 1. ప్రతిబింబానందం | బింబానందం |
| 2. అనుభవంలోకి వచ్చే ఆనందం | ఆనంద స్వరూపం |
| 3. ఆబ్జెక్టు | సబ్జెక్టు |
| 4. తారతమ్యాలు ఉన్నాయి | తారతమ్యాలు లేవు |
| 5. రాకపోకలు ఉన్నాయి | రాకపోకలు లేవు |

ఇటువంటి ఆత్మానందాన్ని అనుభవించటమెలా అనకూడదు. అది అనుభవంలోకి వచ్చే ఆనందం కాదు. ఎందుకు? ఎప్పటికీ అనుభవించే నువ్వే కాని, అనుభవించబడే వస్తువు కాదు ఎన్నటికీ.

ఏదైనా సరే, అది అనుభవంలోకి వచ్చింది అంటేనే అది కోశానందం అయిపోతుంది. ఆత్మానందాన్ని ఎలా అనుభవించగలను అని అడిగితే, నా కళ్ళను నేను ఎలా చూసుకోగలను అని అడిగినట్టు అవుతుంది. నా కళ్ళను అద్దంలో మాత్రమే చూసుకోగలను. అది కూడా ప్రతిబింబాన్ని చూడగలనే కాని, బింబాన్ని అంటే అసలు కళ్ళను చూడలేను.

**ప్రతిబింబనేత్రాలకూ, బింబనేత్రాలకూ మధ్య భేదాలు**

| **ప్రతిబింబనేత్రాలు** | **బింబనేత్రాలు** |
|---|---|
| 1. అద్దంలో కనిపిస్తాయి | స్వయంగా కనిపించవు |
| 2. అద్దం రాకపోకలను బట్టి ప్రతిబింబానికి కూడా రాకపోకలుంటాయి | అద్దం ఉన్నా లేకపోయినా బింబ మొహంలో ఉంటాయి |
| 3. తారతమ్యాలు ఉంటాయి అద్దాన్ని బట్టి ప్రతిబింబం ప్రకాశవంతంగా, మురికిగా, మసకగా ఉంటుంది | తారతమ్యాలు ఉండవు ప్రతిబింబం కాదు, ఆబ్జెక్టు కాదు కాబట్టి. |

ప్రతిబింబనేత్రాలే కనిపిస్తాయి, అసలు కళ్ళు కనబడవు అంటే, అసలు కళ్ళు ఉన్నట్టు నిదర్శనమేమిటి? అసలు ప్రతిబింబం ఏర్పడిందంటేనే అసలు కళ్ళు ఉన్నట్టు అర్థం. బింబం లేకుండా ప్రతిబింబం ఏర్పడే ప్రశ్నే లేదు. ఇదే సూత్రాన్ని బింబానందానికీ, కోశానందానికీ అన్వయిస్తే, అసలు కోశానందం కలుగుతోందంటేనే ఆత్మానందం ఉన్నట్టు అర్థం. కోశానందాన్ని అనుభవించినప్పుడల్లా, నా ఉన్నతస్థాయిని నేను అనుభవిస్తున్నట్టు అర్థం.

నేను ఎవరు? **అహం సత్యం జ్ఞానమనంత ఆనందః.** నేను శుద్ధసత్‌ను, నేను శుద్ధచిత్‌ను, నేను శుద్ధ ఆనందాన్ని. నా ఆనందం అనుభవంలోకి వచ్చేది కాదు, దానికి పరిమితులు లేవు. అది అనంతం.

**అహం సత్య-జ్ఞాన-అనంత-ఆనంద స్వరూపః అస్మి**

అంతకు ముందు అన్ని కోరికలూ ఒక్కసారిగా తీరుతాయి అని చూశాము.

**సోఽ శ్నుతే సర్వాన్ కామాన్ సహ । బ్రహ్మణా విపశ్చితేతి**

అంటే అర్థం అది – ఆ విధంగా పంచకోశ వివేకం ద్వారా, ఉపనిషత్తు బ్రహ్మ అంటే పంచకోశ విలక్షణమనీ, ఆనంద స్వరూపమనీ వెల్లడించింది.

**తదప్యేష శ్లోకో భవతి** – ఆనంద ఆత్మ గురించి చెప్పిన ఋగ్మంత్రాన్ని ఉటంకిస్తున్నది ఉపనిషత్తు

## అనువాకం – 6

**అసన్నేవ స భవతి। అసద్బ్రహ్మేతి వేద చేత్। అస్తి బ్రహ్మేతి చేద్వేద। సంతమేనం తతో విదురితి। తస్యైష ఏవ శారీర ఆత్మా। యః పూర్వస్య।**
**అథాతోఽ నుప్రశ్నాః । ఉతావిద్వానముం లోకం ప్రేత్య। కశ్చన గచ్ఛతీ3। ఆహో విద్వానముం లోకం ప్రేత్య। కశ్చిత్సమశ్నుతా3 ఉ।**
**సోఽ కామయత। బహుస్యాం ప్రజాయేయేతి। స తపోఽ తప్యత। స తపస్తప్త్వా। ఇదగ్ం సర్వమసృజత। యదిదం కిఞ్చ। తత్ సృష్ట్వా। తదేవానుప్రావిశత్। తదనుప్రవిశ్య। సచ్చ త్యచ్చాభవత్। నిరుక్తం చానిరుక్తం చ। నిలయనం చానిలయనం చ। విజ్ఞానం చావిజ్ఞానం చ। సత్యం చానృతం చ సత్యమభవత్।యదిదం కించ। తత్సత్యమిత్యాచక్షతే। తదప్యేష శ్లోకో భవతి।**

### వివరణ

**అసన్నేవ స భవతి। అసద్బ్రహ్మేతి వేద చేత్। అస్తి బ్రహ్మేతి చేద్వేద। సన్తమేనం తతో విదురితి। తస్యైష ఏవ శారీర ఆత్మా। యః పూర్వస్య।**

6. **ఆనందమే ఆత్మ** – ఈ ఋగ్మంత్రం ద్వారా ఆరవ అనువాకంలోకి అడుగు పెడుతున్నాము. ఈ ఋగ్మంత్రం విదురితి పదంతో ముగుస్తుంది. దీన్ని విదుః + ఇతిగా విడదీయాలి. ఈ మంత్రం ఏమంటున్నదో చూద్దాము.

వేదాంత విద్యార్థికి కలిగే గొప్ప సందేహాన్ని పేర్కొంటున్నది ఈ ఋగ్మంత్రం ద్వారా. అతనికి పంచకోశాలు, వాటికి సంబంధించిన ఆనందాలు బాగానే అర్థమవుతాయి. అన్నమయకోశం, ప్రాణమయకోశం, మనోమయకోశం, విజ్ఞానమయకోశం, ఆనందమయ కోశం కూడా బాగానే తెలుస్తాయి. కోశానందం బాగానే తెలుస్తుంది కానీ, ఆత్మానందమే అర్థం కాదు. రాకపోకలు లేని, తారతమ్యాలు లేని, అనంతమైన, శాశ్వతమైన ఆనందం అనుభవించాలనుకుంటాడు. నిజానికి మీకు అనుభవంలోకి వచ్చేది ఏదైనా అది ఒక పరిస్థితి, దానికి రాకపోకలు, కాలం, సమయం అన్నీ ఉంటాయి. ఆత్మానందం శాశ్వతమైతే,

దాన్ని ఒక దేశకాల పరిమితితో ఎలా అనుభవిస్తారు? ఈ రెండు వాక్యాలూ ఒకదానికొకటి భిన్నంగా లేవా? తర్కానికి భిన్నంగా లేవా?

నిర్వికల్ప సమాధిలో ఒక సాధకుడు అసాధారణమైన, ప్రత్యేకమైన ఆనందాన్ని అనుభవిస్తాడు. ఎప్పుడైతే అతను ఆ సమాధినుంచి బయటకు వస్తాడో, అప్పుడే ఆ ఆనందం అతన్ని వదిలి వెళ్ళిపోతుంది. నిజానికి, కొంతమందికి ఆ అసాధారణ ఆనందం పోయిందని, అసాధారణమైన బాధ కలుగుతుంది. అందువల్ల ఎంత గొప్ప ఆనందాన్ని పొందినా కూడా, అది అనంతం కాదు; అది పరిమితి ఉన్న కోశానందం మాత్రమే. ఆత్మానందాన్ని మీరు అనుభవించలేరు. ఎందుకంటే అది మీరే కాబట్టి. తత్ త్వమ్ అసి.

కాని, శిష్యునితో వచ్చిన చిక్కేమిటి? అతనికి అనుభవంలోకి రాని విషయాన్ని దేన్నీ అంగీకరించలేడు. అతనికున్న సైన్సు పరిజ్ఞానం అనుభవంలోకి రానిదాన్ని స్వీకరించకూడదు అంటుంది. అనంతమైన ఆత్మానందాన్ని లేదా బ్రహ్మానందాన్ని నువ్వు అనుభవించలేవు అని అతనితో అంటే, అసలు అటువంటిది ఒకటి ఉందా అంటాడు. అందువల్ల అతను బ్రహ్మానంద అనుభవంకోసం కళ్ళు కాయలు కాచేలా ఎదురుచూస్తాడు. పూజ్య స్వామీజీ మాటల్లో చెప్పాలంటే, 'నీటి అడుగున ఉన్న చేపలు పైకి తేలినట్టుగా, అతని మనస్సును ప్రశాంతంగా ఉంచినప్పుడు ఆ ఆనందం పైకి తేలాలి అనుకుంటాడు సాధకుడు.' అలా ఎన్ని సంవత్సరాలు చేసినా ఆ ఆనందం పైకి తేలకపోయేసరికి, వచ్చి స్వామీజీనే అడుగుతాడు, 'బ్రహ్మానందాన్ని అనుభవించటానికి ఏదైనా సాధన ఉంటే చెప్పండి.' కాని అనుభవంలోకి రానిదాన్ని అనుభవించటానికి ఏ సాధన చెబుతారు? అందువల్ల క్రమం తప్పకుండా వేదాంతబోధకు రమ్మంటారు. ఆ బోధ సరిగ్గా అర్థమయితే, ఈ ప్రశ్నలు ఇంక ఉదయించవు!

ఇటువంటి శిష్యులతో వచ్చిన ఇంకొక చిక్కేమిటంటే, వేదాంతబోధ పూర్తిగా బుద్ధికి సంబంధించినది, జ్ఞానాన్ని ఇస్తుంది తప్పితే, దానివల్ల ఏమీ ప్రయోజనం లేదు. ధ్యానం వల్ల మాత్రమే బ్రహ్మను అనుభవించవచ్చు అనుకుంటారు. అందువల్ల ఆ బ్రహ్మ 'ఎప్పుడు వస్తాడో! ఎప్పుడు వస్తాడో!' అని ఆశగా ఎదురు చూస్తుంటారు. అలా ఓపికున్నన్నాళ్ళూ సమాధిలో ప్రయత్నించి, ఓపిక సన్నగిల్లాక, అటువంటి బ్రహ్మానందం అసలు లేనేలేదు అనేస్తారు. అసత్‌వాది అవుతాడు. బ్రహ్మకు ఉనికి లేదు అంటాడు. అతను నాస్తికుడు అవుతాడు. అతను బ్రహ్మానందాన్ని ఒప్పుకోలేకపోతాడు. బ్రహ్మానందం ఎందుకు కలగదు?

**అది అనుభవించే నువ్వే ఎప్పటికీ, అనుభవించబడే వస్తువు కాదు ఎన్నటికీ**

ఆ విషయం గ్రహించక, నాస్తికునిగా మారతాడు. ఉపనిషత్తు అటువంటి ఒక నాస్తికుని గురించి చెబుతున్నది.

**అసద్బ్రహ్మేతి వేద చేత్** – బ్రహ్మ బాహ్యవస్తువుగా దొరకదు కాబట్టి, బ్రహ్మ లేదు, బ్రహ్మానందం లేదు అనిగాని ఎవరైనా శిష్యుడు అంటే మాత్రం,

**అసన్నేవ స భవతి** – అటువంటి వ్యక్తి తను కూడా లేనివాడే అవుతున్నాడు. ఎందుకు? అతను ఎవరో కాదు, సాక్షాత్తూ ఆ బ్రహ్మే! 'నేను లేను,' అని చెప్పే వాక్యం అత్యంత భిన్న అర్థాలు ఉన్నదిగానూ, తర్కవిరుద్ధంగానూ ఉంటుంది. ఎందుకంటే, 'నేను లేను,' అని చెప్పటానికైనా నేను జీవించి ఉండాలి. అందువల్ల బ్రహ్మ లేదని ఎన్నడూ చెప్పకండి. మరి అయితే ఏం చేయాలి?

**అస్తి బ్రహ్మేతి చేద్వేద** – బ్రహ్మానందం అనుభవంలోకి రాకపోయినా, బ్రహ్మానందం అనేది ఒకటి ఉందని ఒప్పుకోండి. కాని బుద్ధి, దాన్ని బుద్ధిగా స్వీకరించదు. అనుభవంలోకి రాని బ్రహ్మ ఉందని ఏమిటి నిదర్శనం అంటుంది. ప్రపంచంలో దేని ఉనికన్నా ఉంది కాని ప్రమేయంగా చూడబడని వస్తువు ఏదైనా ఉందంటే, అది నేనే అని అర్థం చేసుకోవాలి.

**సంతమేనం తతో విదురితి** – అతను బ్రహ్మానందాన్ని ఒప్పుకుంటే, పరోక్షంగా తన ఉనికిని ఒప్పుకున్నట్టే. ఎందుకంటే అతనే బ్రహ్మ. విదుః అంటే జ్ఞానులు, అటువంటి వ్యక్తిని సంతం అంటుంది. సంతం అంటే మతపరమైన జీవితం గడుపుతున్నాడని అర్థం.

ఈ వాక్యాన్ని ఇంకో విధంగా వివరించవచ్చు. ఎవరైనా అసలు బ్రహ్మే లేదు అంటే అతను అసత్ పురుషుడు అవుతాడు. అంటే అధార్మికుడు కూడా అవుతాడు. శంకరాచార్యులవారు దీన్ని వివరిస్తారు. బ్రహ్మ ఉనికినే ఒప్పుకోని వ్యక్తికి బ్రహ్మ ఎన్నడూ లక్ష్యమవదు. బ్రహ్మను అంగీకరించని శిష్యుడు, తన లక్ష్యంగా బ్రహ్మజ్ఞానాన్ని కూడా స్వీకరించడు. బ్రహ్మజ్ఞానం తన లక్ష్యం కాని వ్యక్తికి వేదాంతశాస్త్రం ప్రమాణం కాదు. బ్రహ్మజ్ఞానం పొందటానికి కావాల్సిన జ్ఞానయోగ్యతాప్రాప్తిని కలుగజేసే ధర్మశాస్త్రం కూడా అవసరం లేదు. చిత్తశుద్ధిని పొందాలనుకోడు. చిత్తశుద్ధి అవసరం లేని వ్యక్తికి కర్మయోగం, ఉపాసన కూడా వ్యర్థమే.

అర్థ, కామాల వెంట మాత్రమే పరుగులు తీసే సమాజానికి పరమాత్మ లక్ష్యం కాదు. అటువంటి సమాజంలో ఉన్న వ్యక్తి శాస్త్రాన్ని, మతాన్ని, యజ్ఞాలను, వర్ణాశ్రమ ధర్మాలను అన్నింటినీ త్రోసిపుచ్చుతాడు. పరమాత్మ లక్ష్యంగా ఉన్నప్పుడే, వైదిక జీవనవిధానానికి ప్రాముఖ్యతను ఇస్తాడు. మన సాంప్రదాయం అర్థ, కామ పురుషార్థాలను 40–45 సంవత్సరాల వయస్సు వరకే సాధించగలరు అని భావిస్తుంది. అందువల్లనే పూర్వం బాల్యవివాహాలు ఉండేవి. వారు చిన్నవయస్సులోనే వివాహం చేసుకుని, అర్థ, కామాలు సాధించి, కర్మయోగం పాటించి, పిల్లలను వృద్ధిలోకి తెచ్చాకా, అంటే వారి బాధ్యతలన్నీ తీరాక కూడా వారికి వారి

శేషజీవితంలో భగవంతునిమీద శ్రద్ధ పెట్టటానికి ఇంకా శక్తి మిగిలివుంటుంది. భగవంతుణ్ణే నమ్మని వ్యక్తి తొంభయ్యోపడిలో పడినా కూడా జీవితాన్ని ఎలా అనుభవించాలి అనే ఆలోచిస్తాడు. అటువంటి వ్యక్తిని అసురుడు అంటారు.

**అసూన్ ప్రాణాన్ రతి పాలయతి ఇతి అసురః**

తన జీవితాన్ని సుఖంగా గడపటం కోసం తన ఇంద్రియాలు బాగుండాలనుకుంటాడు. విజ్ఞానశాస్త్రం కూడా ఇంద్రియ విషయవస్తువులను అనుభవించటానికే ఉన్నాయనుకుంటుంది కాని వేదాంత శ్రవణానికి అనుకోదు. అసు అంటే ఇంద్రియాలు; రః అంటే రక్షించేవాడు. ఇక్కడ అసత్ అంది ఉపనిషత్తు. అసత్ అన్నా అసురుడు అన్నా దాని అర్థం ఒకటే. అతను ప్రాపంచిక సుఖాలకే విలువను ఇస్తాడు.

దానికి భిన్నంగా బ్రహ్మను నమ్మిన వ్యక్తికి బ్రహ్మే లక్ష్యంగా ఉంటుంది. బ్రహ్మను బాహ్య వస్తువుగా చూడలేడని తెలిసినా, బ్రహ్మనే లక్ష్యంగా చేసుకుంటాడు. ఎప్పుడైతే బ్రహ్మ లక్ష్యంగా ఉంటుందో, అప్పుడే చిత్తశుద్ధిని కలిగించే కర్మయోగం, ఉపాసనలకు విలువను ఇస్తాడు. అర్థ, కామాల వెంట పరుగులు తగ్గిస్తాడు. ఆధ్యాత్మికతకు విలువను ఎక్కువ ఇస్తాడు. అంతమాత్రాన అతను డబ్బునో, సుఖాలనో పూర్తిగా త్రోసిపుచ్చడు. అవి ఆధ్యాత్మికత ఉన్న వ్యక్తికి ప్రధానపాత్ర వహించవు. అటువంటి వ్యక్తిని సురః అంటారు. భగవద్గీతలో దైవాసుర సంపద్విభాగయోగములో ఈ విషయాలను వివరంగా చూస్తాము.

నిజానికి ఆధ్యాత్మిక చింతన ఎక్కువగా ఉన్న వ్యక్తికే కుటుంబం విలువ కూడా తెలుస్తుంది. ధనం వెంట, సుఖాల వెంట పరుగులు తీసే వ్యక్తి కుటుంబాన్ని అంతగా పట్టించుకోడు. అర్థకామాలకు మాత్రమే విలువనిచ్చే సమాజంలో కుటుంబవ్యవస్థ పటిష్ఠంగా ఉండదు. మనదేశంలో కుటుంబవ్యవస్థ ఇంత పటిష్ఠంగా ఉందంటే, దానికి కారణం మనదేశం ధర్మ, మోక్షాలకు ఇచ్చిన విలువను, అర్థ, కామాలకు ఇవ్వకపోవటమే.

టూకీగా చెప్పాలంటే బ్రహ్మ ఉనికిని నమ్మిన వ్యక్తిని సత్పురుషుడు (సంతమ్) అంటారు. మొదట్లో బ్రహ్మను నమ్మలేకపోయినా, శాస్త్రంమీద ఉన్న శ్రద్ధ కొద్దీ నమ్మితే, శాస్త్రం లోతులు కొలిచినకొద్దీ మీకే అర్థమవుతుంది. బ్రహ్మ ఆబ్జెక్టు కాదు, సబ్జెక్టు అయిన నేనే అని.

**అనుభవించే నువ్వే అది ఎప్పటికీ, అనుభవించబడే వస్తువు కాదు ఎన్నటికీ**

నేను అహం బ్రహ్మ అస్మి అని అంటే, ఆ నేను పంచకోశాలలో ఏదీ కాదు. నేను పంచకోశాలను సాక్షిగా చూస్తున్న బ్రహ్మను అని అర్థం చేసుకుంటారు.

**పంచకోశ సాక్షి రూపేణ బ్రహ్మ అహమస్మి**

పంచకోశ వివేకం సారాంశాన్ని ఈ క్రింది పట్టికలో చూద్దాము.

**పంచకోశ వివేకం – పట్టిక**

**కోశాలు – వాటి అంగాలు**

| కోశం | శిరః | దక్షిణపక్షః | ఉత్తరపక్షః | ఆత్మా | పుచ్ఛం |
|---|---|---|---|---|---|
| అన్నమయం | శిరస్సు | కుడిచేయి | ఎడమచేయి | శరీరం | కాళ్ళు |
| ప్రాణమయం | ప్రాణం | వ్యానం | అపానం | సమానం | పృథివీ దేవత |
| మనోమయం | యజుర్వేదం | ఋగ్వేదం | సామవేదం | ఆదేశం | అథర్వణవేదం |
| విజ్ఞానమయం | శ్రద్ధా | ఋతం | సత్యం | యోగః | మహః |
| ఆనందమయం | ప్రియం | మోదం | ప్రమోదం | ఆనందం | బ్రహ్మ |

బ్రహ్మజ్ఞానం పొందటానికి వాడే ప్రక్రియలలో ఒకటి పంచకోశవివేకం. బ్రహ్మను ఎలా తెలుసుకోవాలి అంటే దానికి సూక్ష్మభాగములో జవాబును ముందు చూశాము. అది–

**యో వేద నిహితం గుహాయాం పరమే వ్యోమన్**

బ్రహ్మ సర్వవ్యాపకమైన కూడా, ఆ సర్వవ్యాపకమైన బ్రహ్మను మన మనస్సులోనే తెలుసుకోగలము. మనస్సులో కూడా ఒక పద్ధతిలోనే తెలుసుకోగలము. అది ప్రతి ఆలోచన వెనకనున్న సాక్షి చైతన్యంగా తెలుసుకోగలము.

**సర్వవృత్తినాం సాక్షీచైతన్యరూపేణ బ్రహ్మ అస్తీతి అంతఃకరణేన జ్ఞాతవ్యమ్**

ఈ సాక్షి చైతన్యాన్ని బాహ్యవస్తువుగా, లేదా ప్రమేయంగా చూడలేము. ఆ సాక్షిచైతన్యం నేనే అని అర్థం చేసుకోవాలి. ఆలోచనలు ఉన్న, ఆలోచనలు లేని మనస్సును సాక్షిగా చూసే సాక్షిచైతన్యాన్ని నేను. ఇక్కడ ఉపనిషత్తు ఆత్మ పదాన్ని వాడుతున్నది. సాక్షి అన్నా, బింబచైతన్యం అన్నా, ఆత్మ అన్నా, బ్రహ్మ అన్నా – అన్నీ ఒకటే.

**బ్రహ్మ సాక్షీ రూపేణ జ్ఞాతవ్యమ్ । బ్రహ్మ ఆత్మరూపేణ జ్ఞాతవ్యమ్ ।**

ఈ జవాబును మొదట్లో టూకీగా చూశాము. ఇప్పుడు పంచకోశవివేకం ద్వారా చూశాము. ఎవరెస్టు శిఖరం ఎక్కాలంటే, ఏకబిగిన ఎక్కేయలేరు. కొంతదూరం ఎక్కి, కొంత ఎత్తుమీద శిబిరం వేసుకుని, అందులో కొంతసేపు ఉంటారు. అప్పుడు శరీరం ఆ ఎత్తుకు, ఆ వాతావరణానికి అలవాటు పడుతుంది. అదే సూత్రాన్ని ఉపనిషత్తు కూడా పాటించింది.

ముందు అత్యంత స్థూలమైన అన్నమయకోశంతో మొదలుపెట్టి, అంతకంతకూ ఆంతరంగా ప్రయాణం చేయించుకువచ్చింది. అత్యంత సూక్ష్మమైనదాన్ని సాక్షిగా చూసేది దానికన్నా సూక్ష్మంగా ఉండాలి. ఆనందఆత్మే ఈ పంచకోశాలను సాక్షిగా చూస్తున్నది అని గమనిస్తాము.

సత్యం జ్ఞానమనంతం బ్రహ్మ = ఆనంద ఆత్మా

దీనితో పంచకోశ వివేకం ముగిసింది. మొదటి అనువాకంలో చూసిన ప్రశ్నలను మళ్ళీ ఒకసారి గుర్తు తెచ్చుకుందాము.

ఎ) **కిం తత్ బ్రహ్మ** – ఆ బ్రహ్మ ఎవరు? – సృష్టిప్రకరణం ద్వారా

బి) **కథం తస్య వేదనమ్** – ఆ బ్రహ్మను ఎలా తెలుసుకోవాలి? – పంచకోశవివేకం ద్వారా

సి) **కా పరప్రాప్తిః** – మోక్షప్రాప్తి అంటే ఏమిటి?

ఇప్పుడు మూడవప్రశ్నకు జవాబు రావాలి. కాని గురువు ఈ ప్రశ్నకు జవాబు చెప్పేలోగా, విద్యార్థి మధ్యలో అందుకుని, ఇంతవరకూ జరిగిన బోధలోంచి ప్రశ్నలు వేస్తాడు. అలా బోధనుంచి వచ్చిన ప్రశ్నలను అనుప్రశ్నా అంటారు. మామూలుగా అడిగే సందేహాలను ప్రశ్నలు అంటారు.

**అథాతోఽనుప్రశ్నాః। ఉతావిద్వానముం లోకం ప్రేత్య। కశ్చన గచ్ఛతీ 3। ఆహో విద్వానముం లోకం ప్రేత్య। కశ్చిత్సమశ్నుతా 3 ఉ।**

5. **అనుప్రశ్నలు – అనువాకాలు 6, 7**

**అథాతోఽనుప్రశ్నా** – అథ అంటే అనంతరం. అథ పదం చెబుతున్న విషయంలో చిన్న డైవర్షన్ వచ్చిందని సూచిస్తున్నది. బోధ చేస్తున్న గురువు శిష్యుని మనసులో ఏవో సందేహాలు కలిగాయని అతని మొహాన్ని చూసి గ్రహించాడు. అందువల్ల ముందు వాటిని తీర్చాలని నిశ్చయించుకున్నాడు. ఎందుకంటే, ఆ సందేహం అప్పుడు తీరకపోతే, అతను మనస్సు చెదురుతుంది; తర్వాత వచ్చే బోధమీద ఏకాగ్రత కుదరదు. అందువల్ల గురువు వాటిని తీర్చటానికి సిద్ధపడ్డాడు.

**ఉతావిద్వానముంలోకం ప్రేత్య। కశ్చన గచ్ఛతీ 3** – అవిద్వాన్ అంటే అజ్ఞాని. ఇక్కడ అముం లోకం అంటే బ్రహ్మ; ప్రేత్య అంటే మరణ అనంతరం; ఉత అంటే అపి (ప్రశ్నార్థకం); చన అంటే అపి కూడా. గచ్ఛతీఽ అని సాగదీయటంలో సందేహం తెలుస్తుంది. ఇప్పుడు ఈ వాక్యం మొత్తం అర్థం చూస్తే మరణానంతరం ఒక అజ్ఞాని బ్రహ్మను పొందుతాడా, పొందడా?

**అహో విద్వానముం లోకం ప్రేత్య। కశ్చిత్సమశ్నుతా3ఉ** – విద్వాన్ అంటే జ్ఞాని, ఇక్కడ కూడా అముం లోకం అంటే బ్రహ్మ. సమశ్నుతా పదాన్ని విడదీస్తే సమశ్నుతే అని వస్తుంది. ఇందాక చూసినట్టుగానే 3 సందేహాన్ని సూచిస్తుంది. ఈ మొత్తం వాక్యం అర్థం మరణానంతరం జ్ఞాని బ్రహ్మను పొందుతాడా, పొందడా?

వీటికి జవాబులు చూసేలోపు ఒక అంశాన్ని గమనిద్దాము. 3 అంకెను ప్లుతం అంటారు. దాన్ని మామూలుగాకన్నా దీర్ఘంగా పలకాలి.

**పొట్టి అచ్చు – హ్రస్వం**
**పొడుగు అచ్చు – దీర్ఘం**
**దానికన్నా పొడుగు అచ్చు – ప్లుతం**

ఇక్కడ శిష్యుడు తెలివిగా గురువుకు ముందరి కాళ్ళకు బంధాలు వేస్తున్నాడు. అంతకు ముందు గురువేమన్నాడు?

**తస్మాద్వా ఏతస్మాదాత్మన ఆకాశస్సంభూతః ఆకాశాద్వాయుః వాయోరగ్నిః। అగ్నేరాపః। అద్భ్యః పృథివీ। పృథివ్యా ఓషధయః ఓషధీభ్యోఽన్నమ్। అన్నాత్పురుషః।**

పంచభూతాలు, వృక్షాలు, మనుష్యులు కూడా బ్రహ్మనుంచి ఉద్భవించాయి.

దీన్నుంచి శిష్యుడు మూడు విషయాలు నేర్చుకున్నాడు. అవి –

1. బ్రహ్మ కారణం, జగత్తు కార్యం.
2. లయ సంభవించినప్పుడు, కార్యం కారణంలో లయమవుతుంది.
3. మోక్షం నిర్వచనం బ్రహ్మలో లయమవటం.

జగత్తులోని అన్ని వస్తువులూ, అజ్ఞాని, జ్ఞాని ఇద్దరూ కూడా బ్రహ్మనుంచే వచ్చారు. రెండవ సూత్రం ప్రకారం బ్రహ్మనుంచి వచ్చిన కార్యాలన్నీ, అజ్ఞాని, జ్ఞానులతో సహా బ్రహ్మలో లయమవ్వాలి. ఈ ప్రపంచంలో సమస్తం బ్రహ్మనుంచి పుట్టి, బ్రహ్మవల్ల పోషించబడి, ప్రళయంలో బ్రహ్మలో లయమవుతాయి. మోక్షం నిర్వచనం బ్రహ్మలో లయమవటం.

ఇప్పుడు ఈ మూడు విషయాలను చూస్తే మరణానంతరం అజ్ఞాని బ్రహ్మలో లయమవుతాడా, అవడా? దీనికి ఏ సమాధానం చెప్పినా, గురువు ఇరకాటంలో పడతాడు. ఎందుకు? ఒకవేళ అతను బ్రహ్మలో లయమవడు అని గురువు చెబితే, గురువు రెండవ నియమాన్ని ఉల్లంఘించినట్టు అవుతుంది. రెండవ నియమం ప్రకారం సముద్రంనుంచి వచ్చిన నదులు సముద్రంలో లయమయినట్టుగా, బ్రహ్మనుంచి వచ్చిన అజ్ఞాని కూడా బ్రహ్మలో లయమవాలి. ఒకవేళ గురువు బ్రహ్మనుంచి అజ్ఞాని రాలేదు అంటే, జ్ఞాని కూడా రానట్టు అవుతుంది. బ్రహ్మే సమస్త జగత్తుకూ కారణం అంటే అజ్ఞానికీ, జ్ఞానికీ కూడా బ్రహ్మే కారణం అవాలి.

ఒకవేళ, అజ్ఞాని బ్రహ్మలో లయమవుతాడు అంటే, మూడవ నియమం ప్రకారం అతనికి మోక్షం వస్తుంది. అలా మోక్షం వచ్చేటట్టయితే అనిర్మోక్షప్రసంగం అవుతుంది. మోక్షం గురించి చెప్పే శాస్త్రం ఎందుకు, దాన్ని అధ్యయనం చేయించటానికి గురువెందుకు, శాస్త్రం యొక్క శ్రవణ, మనన, నిదిధ్యాసనలు చేయటం ఎందుకు?

ఈ సమస్యను శంకరాచార్యులవారు వ్యాకరణపరంగా తీరుస్తారు. అన్ని భాషల్లోనూ ఏకవచనం, బహువచనమే ఉంటాయి. కాని సంస్కృతభాషలో వీటితో పాటు ద్వివచనం కూడా ఉంటుంది. అంటే ఒక వస్తువు, రెండు వస్తువులు, మూడు లేదా వాటికన్నా ఎక్కువ వస్తువుల గురించి చెబుతాయి. ఆ నియమం ప్రకారం అనుప్రశ్న పదాన్ని చూస్తే ఇలా వస్తుంది.

| **ఏకవచనం** | **ద్వివచనం** | **బహువచనం** |
|---|---|---|
| అనుప్రశ్నః | అనుప్రశ్నే | అనుప్రశ్నాః |

ఇక్కడ వాడిన పదం – అనుప్రశ్నాః. అథః అతః అనుప్రశ్నాః అన్నాడు శిష్యుడు. అనుప్రశ్నాః అంటే కనీసం మూడు ప్రశ్నలు ఉండాలి కాని శిష్యుడు రెండే ప్రశ్నలు వేశాడు. అందువల్ల మూడవప్రశ్న ప్రత్యక్షంగా అడగకపోయినా, అది ముందు వాక్యంలో దాగివుంది.

**అసన్నేవ స భవతి। అసద్బ్రహ్మేతి వేదచేత్। అస్తి**
**బ్రహ్మేతి చేద్వేద। సంతమేనం తతో విదురితి॥**

ఇక్కడ ఉపనిషత్తు రెండురకాల మనుష్యులను పరిచయం చేసింది. బ్రహ్మ ఉందని నమ్మేవారిని (బ్రహ్మ అస్తి వా వాదినః), బ్రహ్మ లేదు అనేవారిని (బ్రహ్మనాస్తి వా వాదినః). ఈ సందేహం ఎందుకు వచ్చిందంటే బ్రహ్మను ఆబ్జెక్టుగా తెలుసుకోలేము కాబట్టి. బ్రహ్మ లేదు అనటానికి ఇంకొన్ని కారణాలు ఇస్తున్నాయి ఉపనిషత్తులు. బ్రహ్మకు రూపం లేదని, గుణాలు లేవని, మనస్సు, వాక్కుల ద్వారా తెలుసుకోలేమని అంటాయి.

**అద్రేశ్యమ్, అవ్యవహార్యమ్** – మాండూక్యమ్

వ్యవహారాలకు అందదు. అలా గుణాలు లేని, వ్యవహారాలకందని బ్రహ్మ ఎలా ఉంటుంది? బ్రహ్మ లేనే లేదు అనేస్తారు కొందరు.

**నిర్గుణం బ్రహ్మ నాస్తి**

విశిష్టాద్వైతులు, ద్వైతవాదులు కూడా నిర్గుణబ్రహ్మ లేదు అంటారు.

అందువల్ల అజ్ఞాని బ్రహ్మలో కలుస్తాడా, లేదా అనే ప్రశ్నగాని; జ్ఞాని బ్రహ్మలో కలుస్తాడా లేదా అనే ప్రశ్నగాని ఎప్పుడు వేయగలము? బ్రహ్మ ఉందని నమ్మితేనే కదా! అందువల్ల వాటి ముందు ఇంకో ప్రాథమిక ప్రశ్నను కలుపుకోవాలి. బ్రహ్మ ఉందా లేదా?

**బ్రహ్మ అస్తి వా నవా।**

బ్రహ్మ ప్రమేయంగా అందదు కాబట్టి, అసలు ఉనికే లేని బ్రహ్మ ఉందని మనకు తరతరాలుగా ఆచార్యులు నూరిపోస్తున్నారని అభాండాలు వేస్తారు కూడా కొందరు. ఇటువంటి

అపోహకు, ఇటువంటి పరోక్ష ప్రశ్నకు ఇప్పుడు జవాబు చూడబోతున్నాము. ఆరు, ఏడు అనువాకాల్లో (సోఽ కామయత ...మృత్యురావతి పంచమ ఇతి) ఉపనిషత్తు బ్రహ్మ అస్తి అని నిరూపించటానికి ఏడు కారణాలు చూపిస్తుంది.

ఈ భాగాన్ని చూసేముందు ఈ ప్రశ్నలను మళ్ళీ చూద్దాము.

**ఏ) బ్రహ్మ ఉందా లేదా? (పరోక్ష ప్రశ్న)**

**బి) మరణానంతరం అజ్ఞాని బ్రహ్మలో ఐక్యమవుతాడా, లేదా?**

**సి) మరణానంతరం జ్ఞాని బ్రహ్మలో ఐక్యమవుతాడా, లేదా?**

గురువు ముందు పరోక్ష ప్రశ్నకు జవాబు చెప్పబోతున్నాడు. అందువల్ల శిష్యుడు అడిగిన రెండు ప్రశ్నలకు జవాబుకోసం అంతదాకా వేచి ఉండాల్సిందే.

**ఏ) బ్రహ్మ ఉందా లేదా? – జవాబు**

ఈ మంత్రంలో బ్రహ్మ అస్తికి చెప్పబోయే ఏడు కారణాల్లో మూడు కారణాలను చూస్తాము.

1. **నిమిత్త కారణం – బ్రహ్మ అస్తి జగతః నిమిత్తకారణత్వాత్** – జగత్తుయొక్క నిమిత్త కారణంగా బ్రహ్మ ఉంది.

మనం ఈ జగత్తులో చూసే ఏ వస్తువునైనా తీసుకోండి – ఒక గడియారం, ఒక బల్ల, ఒక కుర్చీ, ఒక పుస్తకం – ఆ వస్తువువల్ల ఒక ప్రయోజనం ఉంది. దాన్ని ఆ ప్రయోజనానికి అనువుగా ఊహించి, ప్రణాళిక వేసి, దానికి తన మేధస్సును జోడించి దాన్ని ఉత్పత్తి చేశాడు అందులో ప్రావీణ్యత ఉన్న ఒక మనిషి. అంటే అతని మేధస్సు దాని సృష్టికి తోడయింది. దీన్ని ఇంగ్లీషులో **ఇంటలిజెంట్ కాజ్** అంటారు. సంస్కృతంలో **నిమిత్త కారణం** అంటారు. ఈ నిమిత్త కారణం మన కంటికి ఎదురుగా లేకపోయినా, ఆ వస్తువును చూసి మనం ఊహించుకోగలము.

ఇదే సూత్రాన్ని మొత్తం సృష్టికి అన్వయిస్తే, మన ఇంద్రియాలతో చూసే ప్రతి ఒక్క ఇంద్రియవస్తువుకు కూడా ఒక ప్రయోజనం ఉంటుంది. సైన్సు సృష్టిలో ఉన్న ప్రతి ఒక్క వస్తువుయొక్క ప్రయోజనాన్ని వెల్లడిచేస్తూ ఉంటుంది. అప్రయోజనం అనుకున్న ఎన్నో వస్తువులయొక్క ప్రయోజనాన్ని తర్వాత నిరూపించింది. ఆ విధంగా ఈ విశ్వంలో అనేక వస్తువులు ఉన్నాయి; అవి ఇష్టమొచ్చినట్టుగా, చెల్లాచెదురుగా లేవు. వాటన్నిటి మధ్య ఒక సమతుల్యత ఉంది. ఇంటిలిజెంట్లీ పుట్ టుగెదర్ (intelligently put together) అంటారు పూజ్యస్వామీజీ. ఇంత పెద్ద విశ్వంలో, ఇంత గొప్ప సమతుల్యత ఉండాలంటే, దాన్ని సృష్టించటానికి ఆ సృష్టికర్తకు ఇంకెంత సర్వజ్ఞత్వం ఉండాలి? అటువంటి విశ్వం దానంతట అది ఏర్పడింది అనేదానికి ఆస్కారం లేదు.

ఒక వస్తువును తయారుచేయాలంటే, ఆ రంగంలో ఆరితేరి ఉండాలి దాని సృష్టికర్త. ఒక బల్లను తయారుచేసే సృష్టికర్త తెలివితేటలు వేరు; ఒక కంప్యూటర్‌ను తయారుచేసే సృష్టికర్త తెలివితేటలు వేరు. కంప్యూటర్ చేయలేనిదంటూ లేదు. అది చదరంగంలో ప్రథమశ్రేణిలో ఉన్న వ్యక్తిని కూడా ఓడించగలదు. ఒకసారి స్వామీజీని ఎవరి గురించైనా నాలుగు మంచిమాటలు చెప్పండి, కంప్యూటర్ తదనుగుణంగా కొన్ని పద్యాలు రాస్తాయి అన్నారుట. అలాగే స్వామీజీ శంకరాచార్యులవారిమీద కొన్ని పదాలు చెప్పారుట. వెంటనే కొన్ని పద్యాలు వచ్చాయిట. అద్భుతంగా ఉన్నాయి ఆ పద్యాలు.

కాని అటువంటి కంప్యూటర్‌ను సృష్టించింది ఎవరు? మానవమేధస్సు. కంప్యూటర్‌ను ఎవరూ సృష్టించలేదు, దానంతట అదే అనుకోకుండా ఏర్పడింది అని చెప్పగలరా? కొన్ని భాగాలు అనుకోకుండా ఒకచోట చేరి, అనుకోకుండా అవి ఒకరూపు దిద్దుకోలేదు. అలా ఒక కంప్యూటరే దానంతట అది రూపు దిద్దుకోలేదు అంటే, దానికన్నా తెలివైన, దానికన్నా క్లిష్టమైన ఈ మానవమేధస్సు దానంతట అది ఏర్పడుతుందా? ఇంత జ్ఞానం ఉన్న మనిషిని, తక్కిన గొప్పవాటిని సృష్టించాలంటే, అటువంటి విశ్వాన్ని సృష్టించాలంటే, ఆ సృష్టికర్తకు ఇంకెంత జ్ఞానం ఉండాలో ఊహించుకోండి! **సర్వజ్ఞుడు** అవాలి ఆ సృష్టికర్త. **బ్రహ్మ అస్తి జగతః నిమిత్త కారణత్వాత్.**

జీవాత్మ రూపంగా బ్రహ్మ ఉంది.

ఈ విశ్వాన్ని సృష్టి చేయటానికి సృష్టికర్త సర్వజ్ఞుడు అయివుండాలని, ఆయనను నిమిత్త కారణం అంటారని చూశాక, సృష్టి జరిగిన క్రమాన్ని అర్థం చేసుకోవాలి. లౌకిక ఉదాహరణ చూస్తే, ఒక ఇల్లు కట్టాలంటేనే దానిలో మూడు దశలు ఉంటాయి. ముందు ఆ ఇల్లు ఎలా ఉండాలో దాన్ని తన మనస్సులో ఊహించుకుంటాడు మనిషి. తర్వాత కాగితంమీద తన ఊహకు తగ్గట్టుగా ఒక డిజైను వేస్తాడు. దాన్ని బ్లూప్రింట్ అంటారు. ఆ బ్లూప్రింట్ నచ్చాక, దానికి తగ్గట్టుగా ఇంటి నిర్మాణం చేస్తాడు. అంటే మూడుదశలు – మనసులో ఊహించుకోవాలి, ప్రణాళిక వేయాలి, ఆచరణలో పెట్టాలి.

అటువంటిది పద్నాలుగు లోకాలను సృష్టించాలంటే ఎంత ప్రణాళిక కావాలి? ఏ లోకాన్ని ఎక్కడ పెట్టాలి, వాటిల్లో ఏవి ఉండాలి, ఎవరు ఉండాలి? ఇవన్నీ ఆలోచించాలి. అందువల్ల భగవంతుడు ముందు తన మనస్సులో ఒక ప్రణాళిక వేసుకోవాలి. భగవంతుని మనస్సును మాయాతత్త్వం అని వివరిస్తుంది వేదాంతం. ఇక్కడ మనం మనిషి మనస్సు గురించి మాట్లాడటం లేదు. మనిషి మనస్సు తర్వాత వచ్చింది. మనిషి మనస్సును సృష్టించిన మాయాశక్తి గురించి మాట్లాడుతున్నాము. భగవంతుని మనస్సు, మనుష్యుల మనస్సును సృష్టించింది.

మనిషియొక్క మనస్సు అనే తెరమీద అతను ఒక ఊహాచిత్రాన్ని చిత్రిస్తాడని చూస్తాము. కాని అతను అలాంటి ఒక ఊహాచిత్రాన్ని చిత్రించాలంటే, ముందు అతనికి ఆ విషయం మీద కోరిక ఉండాలి. కోరిక లేకపోతే ఊహించి లాభంలేదు; కోరిక ఉండీ, ఊహించక పోయినా లాభంలేదు. ఇదే సూత్రాన్ని భగవంతునికి కూడా అన్వయిస్తాము. అలాగే భగవంతుడు కూడా కోరుకున్నాడు, ఊహించుకున్నాడు, ఈ అద్భుతమైన విశ్వాన్ని సృష్టించాడు.

**సోఽకామయత। బహుస్యాం ప్రజాయేయేతి। స తపోఽతప్యత। స తపస్తప్త్వా। ఇదగ్ంం సర్వమసృజత। యదిదం కిఞ్చ।**

**సః అకామయత** – సః అంటే బ్రహ్మాత్మా. ఇక్కడ మనం మాయాసహిత కలుపుకోవాలి. అంటే మాయాసహిత బ్రహ్మాత్మా. అంటే మాయాశక్తితో కూడిన బ్రహ్మ. సంస్కృతంలో పదాలకు కూడా లింగం ఉంటుంది. సః–పుంలింగం; బ్రహ్మ–నపుంసకలింగం; ఆత్మా–స్త్రీలింగం. ఇక్కడ ఉపనిషత్తు సః అంది కాబట్టి సృష్టించాడు అంటున్నాము. బ్రహ్మాత్మా పదం పుంలింగం.

అకామయత అంటే కోరుకున్నాడు. ఏం కోరాడుట? ఈ విశ్వాన్ని సృష్టించాలని కోరుకున్నాడు. ఈ కోరుకోవటం దశ 1. ఎలా కోరుకున్నాడు? మనిషిగా నాకొక మనస్సు ఉంది, ఆ మనస్సులో కోరుకుంటాను. భగవంతునికి మనస్సు ఎలా ఉంది? భగవంతుని మనస్సును మాయ అంటాము. ఈ మాయకు ఇచ్ఛాశక్తి ఉంటుంది.

**మాయ + బ్రహ్మ = ఈశ్వరుడు**

ఈ ఈశ్వరుడు గృహస్థు అవుతాడు.

**మాతా చ పార్వతీదేవీ పితా దేవో మహేశ్వరః ।**
**బాంధవాశ్శివభక్తాశ్చ స్వదేశో భువనత్రయమ్ ॥**

మాయాశక్తి సహాయంతో, బ్రహ్మ కోరుకున్నాడు. ఈ వాక్యం చూస్తే మనలో కొన్ని సందేహాలు ఏర్పడతాయి.

**భగవంతుడు ఎందుకు కోరుకోవాలి?** – ఈ సృష్టి జరగటంవల్లనే మనం సంసారంలో పడి కొట్టుమిట్టాడుతున్నాము. భగవంతుడు తీరికూర్చుని ఈ జగత్తును సృష్టించకపోయివుంటే, మనకు ఈ సంసారమే ఉండేది కాదుకదా?

**భగవంతునికి కోరిక ఎలా ఉంటుంది?** – ఇది ఇంకొక సందేహం. మనం వేదాంతంలో నేర్చుకునే అంశం ఏమిటి? కోరికవల్లనే మనం సంసారంలో పడిపోతున్నామని ప్రాథమిక అంశం. కోరిక అపూర్ణత్వంవల్ల కలుగుతుంది అంటుంది వేదాంతం. మీకు ఉన్నదానితో తృప్తిచెందక, శాంతి, భద్రతలకోసం ఎవరినో, దేన్నో కోరుకుంటారు అంటుంది. సంసారం

ఎలా ఏర్పడుతుందో దశలవారీగా వర్ణిస్తుంది. ఆత్మ అజ్ఞానం వల్ల కోరిక పుడుతుంది; కోరికకు తగ్గ కర్మలు చేస్తారు; కర్మకు తగ్గ ఫలం వస్తుంది; ఆ పుణ్యపాప ఫలాలను అనుభవించటానికి సుఖదుఃఖాలు తప్పవు; ఆ సుఖదుఃఖాలను అనుభవించటం కోసం పునరపి జననం, పునరపి మరణం తప్పదు. దీన్ని సంసారం అంటారు.

అజ్ఞానం → కామం → కర్మ → ఫలం → సుఖదుఃఖాలు → పునరపి జననం, పునరపి మరణం = సంసారం.

మోక్షం అంటే కోరికనుంచి స్వేచ్ఛ పొందటం అంటుంది వేదాంతం. కృష్ణపరమాత్మ కూడా ఈ విషయాన్నే వివరిస్తాడు.

**శ్రీభగవాన్ ఉవాచ**

**ప్రజహాతి యదా కామాన్ సర్వాన్ పార్థ మనోగతాన్ ।**
**ఆత్మన్యేవాత్మనా తుష్టః స్థితప్రజ్ఞస్తదోచ్యతే ॥** – గీత 2.55

ఓ అర్జునా కోరికలన్నీ తీరిపోయి, ఆత్మలోనే రమించే వ్యక్తిని స్థితప్రజ్ఞుడు అంటారు అన్నాడు కృష్ణపరమాత్మ. కఠోపనిషత్తులో ఇదే భావన చూస్తాము.

**యదా సర్వే ప్రముచ్యంతే। కామా యేఽస్య హృది శ్రితాః ।**
**అథ మర్త్యోఽమృతో భవతి। అత్ర బ్రహ్మ సమశ్నుతే** – కఠ 2.3.14

ఎప్పుడైతే కోరికలన్నీ తీరిపోతాయో, అప్పుడే మనిషి అమృతత్త్వాన్ని పొందుతాడు. ఇక్కడే, ఇప్పుడే బ్రహ్మను పొందుతాడు.

వీటిని బట్టి అర్థమయిందేమిటి? కోరికలు తీరితే, మనిషి సంసారంనుంచి విముక్తుడు అవుతాడు. అంటే కోరిక అనేది సంసారానికీ, అవిద్యకూ ప్రతీక అని మనం నేర్చుకున్నాము. అలాంటిది, ఇక్కడ ఉపనిషత్తు భగవంతుడు కోరుకున్నాడు అంటున్నది. అందువల్ల, 'అయ్యో, మనకే సంసారం ఉంది అనుకుంటాము, అయితే భగవంతునికి కూడా సంసారం ఉందా?' అంటారు.

ఈ ప్రశ్నలకు జవాబులు చూద్దాము. ముందు రెండవ ప్రశ్నకు జవాబు చూద్దాము. బ్రహ్మకు కోరిక ఎందుకు ఉంది? భగవంతుడు మాయాశక్తి వల్ల కోరుకున్నాడు. భగవంతుని కోరిక మన కోరికలాగా అజ్ఞానంనుంచి, అపూర్ణత్వంనుంచి పుట్టలేదు. అజ్ఞానంనుంచి పుట్టిన కోరికే సంసారానికి దారితీస్తుంది. అజ్ఞానంనుంచి పుట్టని కోరిక బంధించే కోరిక కాదు. అది హానికరమైనదీ కాదు. భగవంతుడు పూర్ణత్వంకోసం కోరలేదు; **పూర్ణత్వంవల్ల** కోరాడు.

భగవంతునికి అజ్ఞానం, అపూర్ణత్వం లేకపోతే అసలెందుకు కోరాలి? సృష్టెందుకు చేయాలి అనే మొదటి ప్రశ్నకు ఇది దారితీస్తుంది. భగవంతుడు తన ఆటకోసమో, తన సరదా తీర్చుకోవటం కోసమో సృష్టించలేదు. జీవరాశుల కర్మఫలక్షయంకోసం సృష్టించాడు. అనేక జన్మలనుంచీ పోగుచేసుకువస్తున్న సంచిత కర్మలను క్షయం చేసుకోవాలంటే మనుష్యులు సుఖదుఃఖాలను అనుభవించాలి. సుఖదుఃఖాలను అనుభవించాలంటే లోకాలు ఉండాలి. అందువల్ల భగవంతుడు ఈ కర్మఫలక్షయంకోసం పద్నాలుగు లోకాలను సృష్టించాడు.

జీవులు అనుభవించాల్సిన ఈ పుణ్యపాపాలు ఎక్కడ్నుంచి వచ్చాయి? ఆ జీవులు అంతకుముందు సృష్టిలో చేసిన కర్మఫలాలను అనుభవించాలి. ఈ సృష్టిలో చేసిన కర్మలకు ఫలాలను ఇవ్వటానికి వచ్చే సృష్టి చేయాలి భగవంతుడు. అంటే ప్రతి ఒక్క సృష్టి కూడా జీవుల కర్మఫలాలను ఆధారం చేసుకుని వచ్చినదే.

ఎక్కువగా పాపాలు చేసినవారు కష్టాలను అనుభవించటానికి వారికి పాతాళ లోకాలు సృష్టించాలి; ఎక్కువ పుణ్యం చేసినవారు సుఖసౌఖ్యాలను అనుభవించటానికి స్వర్గలోకాలను సృష్టించాలి. రెండూ ఇంచుమించుగా సమానంగా చేసినవారు రెండింటినీ సమానంగా అనుభవించటానికి భూలోకాన్ని సృష్టించాలి. దీన్నిబట్టి అర్థమవుతున్నది ఏమిటి? భగవంతునికి సృష్టించాలనే కోరిక ఒక్కటి ఉంటే చాలదు; జీవులందరి కర్మఫలాలు తెలిసి ఉండాలి. అంతేకాదు, వారి కర్మఫలాలను అనుభవించటానికి వారికి అనువైన వాతావరణం, వారికి అనువైన పరిసరాలు, కుటుంబం ఏర్పరచాలి. ఎటువంటి శరీరం ఇవ్వాలో చూడాలి. ఈ శరీరానికి కారణం పూర్వజన్మ కర్మ. అందువల్ల, ఒక్కముక్కలో చెప్పాలంటే ఈ సృష్టికి మూలం పూర్వసృష్టి.

పూర్వసృష్టిలోని కర్మఫలాలు తర్వాత వచ్చే సృష్టిలో అనుభవించాలి అంటే, మొట్టమొదటి సృష్టి ఎలా వచ్చింది? అది ఏ కర్మఫలాల ఆధారంగా వచ్చింది? సృష్టి ఒక సరళరేఖలా సాగలేదు. సృష్టి ఒక వృత్తంలా సాగుతుంది. దానికి ఆది, అంతం లేదు. ఈ విషయం అర్థం కానంతవరకూ సృష్టిప్రక్రియ అర్థం కాదు. ఈ సరళరేఖ దృష్టినుంచి ముందు బయటపడాలి. వృత్తానికి ఆది, అంతం ఉండదు. వృత్తం కూడా ఒకచోట మొదలుపెట్టి గీస్తాము కదా అంటే మొదలెట్టిన చోట, మళ్ళీ ముగించకపోతే దాన్ని వృత్తం అనలేము. పూర్తి అయిన వృత్తాన్ని చూపించి, ఇది ఎక్కడ మొదలయ్యింది అంటే చెప్పగలరా? సృష్టి కూడా అంతే.

విత్తు ముందా, చెట్టు ముందా అనే ప్రశ్న అందుకే వచ్చింది. విత్తనం లేనిదే చెట్టు రాదు. చెట్టు లేనిదే విత్తనం ఏర్పడదు. అలాగే శరీరం ముందా, కర్మ ముందా అనే ప్రశ్నకు కూడా జవాబు లేదు. మాండూక్యోపనిషత్తులో ఈ వాదన చూస్తాము. శరీరం ముందు అంటే, ఆ శరీరం మనం చేసిన పూర్వజన్మల కర్మవల్లనే ఏర్పడుతుంది. పోనీ కర్మ ముందు

అందామా అంటే శరీరం లేకుండా కర్మ చేయలేము. అందువల్ల ఇది ఒక వృత్తం; ఇది ఒక ప్రవాహం కాదు. అందువల్ల ఒక వృత్తానికి ఆది కాని, అంతం కాని చెప్పలేరు.

అందువల్ల ఏ సృష్టిని తీసుకున్నా కూడా అది మధ్యలో సృష్టి అవుతుంది. దాని ముందొక సృష్టి జరిగింది; ఆ కర్మఫలాలు ఈ సృష్టిలోకి తీసుకురాబడ్డాయి. దాని తర్వాత ఇంకొక సృష్టి జరుగుతుంది; ఈ సృష్టిలోని కర్మఫలాలను ఆ సృష్టిలో అనుభవించాలి.

ఈ రెండు ప్రశ్నలకూ సమాధానాలను టూకీగా చూద్దాము.

భగవంతునికి కోరిక ఎలా ఉంటుంది? – భగవంతునికి అపూర్ణత్వంవల్ల కాదు, పూర్ణత్వంనుంచి వచ్చింది కోరిక.

భగవంతుడు ఎందుకు కోరుకోవాలి? – అన్ని జీవుల కర్మఫలాలను క్షయం చేయటానికి సృష్టి చేయాలని కోరుకున్నాడు. లోక సంగ్రహమేవ అపి.

బంధించని కోరికలను ఎన్నైనా కోరుకోవచ్చు. ఎందుకంటే బంధించని కోరికలు సంసారంలో పడవేయవు. మోక్షం అంటే అసలేమీ కోరికలు ఉండకపోవటం కాదు; మోక్షం అంటే బంధించే కోరికలనుంచి విముక్తి చెందటం. శంకరాచార్యులవారు శుద్ధ కామః, అశుద్ధకామః పదాలను వాడతారు. శుద్ధకామః అంటే బంధించని కోరికలు; అశుద్ధకామః అంటే బంధించే కోరికలు. భగవంతుని కోరికలు – శుద్ధకామః. ఏమిటి భగవంతుని కోరిక?

**బహు స్యాం ప్రజాయేయేతి** – నేను అనేక జీవులు అవుదును గాక! నేను జగత్పితను. నేను ఒక్కడినే ఉన్నాను. అనేక జీవులుగా అవుతాను అనుకున్నాడు. దయానందస్వామీజీ అద్భుతంగా మూడు మాటల్లో వర్ణిస్తారు. అహమ్, ఆవామ్, వయమ్ – ఏకవచనం, ద్వివచనం, బహువచనం. బ్రహ్మచారి ఒక్కడే, అహమ్. అతను పెళ్ళి చేసుకున్నాక **ఆవామ్** అవుతాడు. ఒకరు ఇద్దరవుతారు. తమకంటూ ఒక పుత్రుడు పుట్టుకొచ్చాక, ఇద్దరు ముగ్గురవుతారు, వయమ్. ఒక్కొక్క పిల్లవాడు, పెళ్ళి చేసుకుని, పిల్లలను కంటాడు. అలా వారి వంశాభివృద్ధి అవుతుంది. ఏకః అనేకః భవతి. భగవంతుడు కూడా అలా జీవులుగా అనేకం అవుతాను అనుకున్నాడు.

భగవంతుని సృష్టియొక్క ప్రత్యేకత ఏమిటి? ఈ భూమ్మీద జీవరాశులను తీసుకుంటే మనిషి, మనిషికే జన్మనిస్తాడు, కోతికి ఇవ్వడు; అలాగే జంతువులు. ఆవుకు దూడ పుడుతుంది; కోతికి కోతిపిల్ల పుడుతుంది; కాని ఒక్కడే భగవంతునినుంచి ఇన్ని వేల జీవరాశులు పుట్టాయి. కృష్ణపరమాత్మ కూడా ఆ విషయాన్ని చెప్పాడు.

**సర్వయోనిషు కౌంతేయ మూర్తయః సంభవంతి యాః ।**

**తాసాం బ్రహ్మ మహద్యోనిః అహం బీజప్రదః పితా ॥** – గీత 14.4

ఓ అర్జునా! ఏ జాతినుంచి ఆ జాతి పుట్టినా, వారందరికీ తల్లి ప్రకృతి; తండ్రి పురుషుడు అన్నాడు కృష్ణపరమాత్మ.

**ఇతి** – ఇతి అంటే ఇంతవరకూ భగవంతుడు అనుకున్నాడు అని అర్థం. బహు స్యాం ప్రజాయేయేతి – భగవంతుని కోరిక.

కోరిక పుట్టాక, దాని గురించిన ప్రణాళిక వస్తుంది. ఉదాహరణకు ఒక ఇల్లు కట్టాలంటే ఒక ప్రణాళిక వేసుకోవాలి. ఏ గది ఎటువైపు ఉండాలో చూడాలి. అలాగే భగవంతుడు ఇంత విశ్వాన్ని సృష్టించాలంటే ఎంత ప్రణాళిక వేసుకోవాలి? ఆఖరికి ఒక దోమను కూడా ఎక్కడ ప్రవేశపెట్టాలో చూసుకోవాలి. ఇన్ని వివరాలు చూడాలంటే భగవంతుడు ఎంత సర్వజ్ఞుడు అయివుండాలి? ఒక కుటుంబంలో కొంతమందిని కలిపి సృష్టించాలంటే, అదే వాతావరణం అందులో ఒకరికి పుణ్యఫలాన్ని క్షయం చేస్తే, మరొకరికి పాపఫలాన్ని క్షయం చేయాలి. ఒక పిల్లవాడు ఒక తండ్రికి పుడితే, తండ్రీకొడుకులిద్దరూ వారివారి పుణ్యపాపాలను క్షయం చేసుకుంటారు. తండ్రి చేసుకున్న పుణ్యాన్నిబట్టో, పాపాన్నిబట్టో అటువంటి కొడుకు పుడతాడు. అలాగే కొడుకు చేసుకున్న పుణ్యాన్నిబట్టో, పాపాన్నిబట్టో ఆ ఇంట్లో, ఆ వాతావరణంలో పుడతాడు. ఈ సూత్రాన్ని ఏ బంధానికన్నా అన్వయించవచ్చు. అన్నదమ్ములబంధం; గురుశిష్యులబంధం. ఆ విధంగా ప్రతి ఒక్క సంబంధం కూడా కర్మఫల క్షయంకోసం ఏర్పడినదే. ఇదంతా ప్రణాళిక వేయటాన్ని తపః అంటుంది ఉపనిషత్తు.

**సః తపోఽ తప్యత** – దీని అర్థం అక్షరాలా తీసుకుంటే, భగవంతుడు తపస్సు చేశాడని అర్థం. కాని ఇక్కడ భగవంతుడు తపస్సు చేశాడు అంటే భగవంతుని సర్వజ్ఞత్వాన్ని సూచిస్తుంది.

**యః సర్వజ్ఞః సర్వవిద్ యస్య జ్ఞానమయం తపః**
**తస్మాదేతద్ బ్రహ్మ నామ రూపమన్నం చ జాయతే** – ముండకమ్ 1.1.9

భగవంతుడు సర్వజ్ఞుడు; సర్వవిదుడు. భగవంతుని తపస్సు ఆయనయొక్క జ్ఞానం. ఈ హిరణ్యగర్భ నామం, రూపం, అన్నం అన్నీ ఆయన నుంచే వచ్చాయి.

భగవంతుని మనస్సు మాయ అని చూశాము. అంటే మాయాశక్తితో తపస్సు చేశాడు.

**మాయయా సంకల్ప ఏవ తపః ఇత్యుచ్యతే**

భగవంతుడు తపస్సు చేశాడు అనగానే భగవంతుడు పద్మాసనంలో కూర్చుని తపస్సు చేసినట్టుగా ఊహించుకోకండి! పద్మాసనం వేయాలంటే భగవంతునికి కాళ్ళు, చేతులు ఉండాలి. అప్పటికి పంచభూతాలే సృష్టించబడకపోతే, కాళ్ళూ, చేతులూ ఎక్కడ్నుంచి వస్తాయి? అంతేనా, పద్మాసనంలో కూర్చుని తపస్సు చేయాలంటే, ఒక ప్రదేశం ఉండాలి. ప్రదేశాన్ని

ఆకాశం అంటారు. ఆకాశమే బ్రహ్మనుంచి వచ్చిందని ఈ ఉపనిషత్తులోనే చూశాము. అందువల్ల భగవంతుని తపస్సు మానవమాత్రుడు చేసే తపస్సు వంటిది కాదు.

**స తపస్తప్త్వా** – భగవంతుని తపస్సు ఒక నిముషంసేపో, కొన్ని గంటలపాటో కాదు; అది అంతులేని యుగాల వరకు. ఎందుకంటే ఇది భగవంతుని పరంగా చూస్తున్నాము. అలా తపస్సు చేశాక, ఏం చేశాడు?

**ఇదగ్ం సర్వమసృజత** – భగవంతుడు ఈ సర్వాన్నీ సృష్టించాడు. ఇది మూడవదశ. ఈ దశలను మళ్ళీ ఒకసారి టూకీగా చూద్దాము.

| | | |
|---|---|---|
| దశ 1 | – స అకామయత | – కోరుకున్నాడు |
| దశ 2 | – తపః అతప్యత | – ప్రణాళిక వేశాడు |
| దశ 3 | – ఇదగ్ం సర్వమ్ అస్సృజత | – ఆచరణలో పెట్టాడు |

సర్వంలో ఆకాశం కూడా వస్తుంది. అంటే కాలం, దేశం రెండూ కూడా అన్నింటితో పాటు సృష్టించబడ్డాయి.

**యదిదం కించ** – ఈ జగత్తులో ఉన్న ప్రతిదాన్నీ, మనం అనుభవిస్తున్న ప్రతిదాన్నీ సృష్టించాడు. అందువల్ల ఈశ్వరుడు జగత్తుకు నిమిత్త కారణం – ఈశ్వరః జగతః నిమిత్త కారణమ్.

ఇక్కడ ఉపనిషత్తు ప్రత్యేకించి చెప్పకపోయినా, ఒక విషయాన్ని మనం గ్రహించాలి. మన లౌకిక విషయాల్లో ఒకదాని గురించి ప్రణాళిక వేశాక, దాన్ని ఆచరణలో పెట్టి, ముగించటానికి చాలా సమయం పడుతుంది. మనం ఇంటి ఉదాహరణ ముందే చూశాము. ఇంటి గురించి ప్రణాళిక వేశాక, దాన్ని కట్టటానికి చాలా సమయం పడుతుంది. అంతేకాదు, అది ఎంతో శ్రమతో కూడిన పని. ఒక చిన్న ఇల్లు కట్టటానికే ఇంత సమయం, శ్రమ వెచ్చించాలంటే, ఇంత పెద్ద విశ్వాన్ని సృష్టించాలంటే ఇంకెంత సమయం పట్టాలి? కాని భగవంతుడు ఏమీ శ్రమ పడలేదు అంటుంది ఉపనిషత్తు. సంకల్పం వల్లనే సృష్టించాడు.

**సంకల్ప మాత్రేణ ఇదగ్ం సర్వమ్ అసృజత**

ఇంత పెద్ద విశ్వాన్ని కేవలం సంకల్పంతో, అంటే ఊహాశక్తితో సృష్టించాడా? అదెలా సాధ్యం? సాధ్యమే అంటుంది శాస్త్రం. అంతేకాదు, మీరు ప్రతిరోజూ సృష్టించటం లేదా అని ఎదురు ప్రశ్నిస్తుంది. అర్థం కాలేదా? ప్రతిరోజూ మీరు నిద్రలోకి జారుకోగానే స్వప్నప్రపంచాన్ని సృష్టిస్తారు. అందులో పంచభూతాలు ఉంటాయి, అనేక జీవరాశులు ఉంటాయి. వాటిని సృష్టించటానికి ఎంత సమయం తీసుకుంటారు? ఏమీ తీసుకోలేరు. సంకల్ప మాత్రం చేతనే ఆ స్వప్నప్రపంచాన్ని సృష్టిస్తారు. ఒక్కరోజు కాదు, ప్రతిరోజూ. ఆ స్వప్నప్రపంచాన్ని మీ మనస్సు తనలో నిక్షిప్తమై ఉన్న వాసనల ద్వారా సృష్టిస్తుంది. స్వప్నంలో ఇల్లు కట్టాలంటే,

మీ పడకగదిలో ఇటుకలు, సిమెంటు, పనిముట్లు పెట్టుకుని పడుకోరు. ఇదంతా ఏ మాత్రం ప్రయాస లేకుండా సృష్టిస్తారు.

అయినా మీ మనస్సు అంగీకరించదు. అలా ఎలా స్వప్నప్రపంచంతో పోలుస్తారు అంటుంది. స్వప్నం వేరు, ఈ విశ్వం వేరు. మిథ్యా స్వప్నప్రపంచాన్ని సంకల్పమాత్రంగా సృష్టించవచ్చేమో కాని, సత్యజాగ్రత్ ప్రపంచాన్ని తీసుకువెళ్ళి, మిథ్యా స్వప్నప్రపంచంతో ఎలా పోలుస్తారు అని నిలదీస్తారు మీరు. దానికి శాస్త్రం ఎదురు ప్రశ్నిస్తుంది. 'ఎవరన్నారు ఈ జాగ్రద్ ప్రపంచం సత్యమని?' స్వప్నప్రపంచం వృత్తాంతం ఇచ్చిందే, ఈ జాగ్రద్ ప్రపంచం కూడా స్వప్నప్రపంచంవంటిదే అని చెప్పటానికి. అది స్వప్నం–1 అయితే ఇది స్వప్నం–2. స్వప్నప్రపంచం మీ సంకల్పంవల్ల సృష్టించబడితే, ఈ జాగ్రత్ ప్రపంచం ఈశ్వరసంకల్పం చేత సృష్టించబడింది.

**బీజస్యాంతరివాంకురో జగదిదం ప్రాఙ్నిర్వికల్పం పునః,**
**మాయాకల్పితదేశకాలకలనా వైచిత్ర్య చిత్రీకృతమ్।**
**మాయావీవ విజృంభయత్యపి మహాయోగీవ యః స్వేచ్ఛయా,**
**తస్మై శ్రీగురుమూర్తయే నమ ఇదం శ్రీదక్షిణామూర్తయే** – 2

ఇక చెట్టు విత్తనంలో అవ్యక్తంగా ఉన్నట్టుగా, ఈ జగత్తు భగవంతునిలో అవ్యక్తంగా ఉంది, సృష్టికి ముందు.

ఈ జగత్తు కూడా స్వప్నప్రపంచంలాగా మిథ్య అంటే నమ్మలేరు. కంటికి ఎదురుగా కనిపిస్తోంది, దానితో వ్యవహారం నడుపుతున్నాము, అది ఎలా అంటారు. మీకు కంటికి కనిపించినంత మాత్రాన అది సత్యం కాదు అంటుంది శాస్త్రం. సూర్యోదయం కంటికి కనిపిస్తుంది, కాని విజ్ఞానశాస్త్రం నేర్చుకుంటే అది నిజం కాదని తెలుస్తుంది; భూమి కదలనట్టుగా, స్థిరంగా అనిపిస్తుంది. అదీ నిజం కాదని తెలుస్తుంది.

స్వప్నప్రపంచం కూడా అలాగే సత్యంగా అనిపిస్తుంది. స్వప్నంలో ఉన్నంతసేపూ ఒక స్వాప్నికునికి, తన స్వప్నం, స్వప్నం అని తెలియదు. నిద్రనుంచి లేచాకే, అది స్వప్నం అని తెలుస్తుంది. అదే విధంగా, ఈ జగత్తు కూడా మహాసత్యంగా అనిపిస్తుంది.

**ఉత్తిష్ఠత! జాగ్రత! ప్రాప్య వరాన్ నిబోధత** – కఠ 1.3.14

లే! అప్పుడు ఈ జగత్తు కూడా మిథ్య అని తెలుస్తుంది అంటుంది కఠోపనిషత్తు.

ఆ విధంగా భగవంతుడు ఈ మిథ్యాప్రపంచాన్ని సంకల్పమాత్రంచేత సృష్టించాడు. ఈ సంకల్పశక్తి మాయలో ఉంది.

**ఈశ్వరః సంకల్పమాత్రేణ ఇదం మిథ్యా జగత్ అసృజత**

దీనివల్ల బ్రహ్మ ఉంది, నిమిత్తకారణంగా అని తెలుస్తున్నది.

1. **బ్రహ్మ అస్తి జగతః నిమిత్త కారణత్వాత్**

**తత్ సృష్ట్వా। తదేవానుప్రావిశత్। తదనుప్రవిశ్య।**

2. **జీవాత్మ – బ్రహ్మ అస్తి జీవాత్మరూపేణ వర్తమానత్వాత్** – ఈ జగత్తును సృష్టించాక, భగవంతుడు ఆ జగత్తులో ప్రవేశించాడు. జగత్తులో ప్రవేశించాడు అనే వాక్యాన్ని **అనుప్రవేశ వాక్యం** అంటారు.

సృష్టి ప్రకరణం కొనసాగుతున్నది. ముందు బ్రహ్మ, ఇంకా చెప్పాలంటే, మాయాసహిత ఈశ్వరుడు లేదా సగుణబ్రహ్మ ఈ జగత్తును సృష్టించాడు. జగత్తు మాత్రం ఉండి లాభమేమిటి, అందులో జీవరాశులు లేకపోయాక? జడమైన జగత్తు ఒకటీ ఉంటే చాలదు, అందులో జీవమున్న జీవరాశులు కూడా ఉండాలి. అందువల్ల జగత్తును సృష్టించాక భగవంతుడే జీవరాశులుగా అందులో ప్రవేశించాడు. మనం చూస్తున్న ఈ జీవులు ఎవరో కాదు, సాక్షాత్తూ ఆ సృష్టికర్త బ్రహ్మే.

అదెలా? ఈ వాక్యాన్ని సరిగ్గా అర్థం చేసుకోవాలి. ఈ మంత్రాలన్నీ చాలా ముఖ్యమైన మంత్రాలు. దీన్ని అనుప్రవేశవాక్యం అంటారని చూశాము. శంకరాచార్యులవారు దీనిమీద వివరంగా భాష్యం రాశారు. ఇదే భాగం మళ్ళీ బృహదారణ్యకోపనిషత్తులో వస్తుంది, అక్కడ ఇంకా వివరంగా భాష్యం రాశారు దీనిమీద. దానిమీద ఉపభాష్యకారులు ఇంకా ఎక్కువ వివరంగా భాష్యం రాశారు.

**స ఏష ఇహ ప్రవిష్టః** – బృహదారణ్యకమ్ 1.4.7

జగత్ సృష్టి జరిగాక, పరమాత్మే స్వయంగా జగత్తులో ప్రవేశించాడు అంటున్నది బృహదారణ్యకోపనిషత్తు. అందులోంచి కొన్ని వాదనలు చూద్దాము.

**వాదన 1** – గృహం నిర్మించాక దేవదత్తుడు అందులో ప్రవేశించాడు.

**సిద్ధాంతి జవాబు** – ఈ ఉదాహరణ పరమాత్మకు కుదరదు. అక్కడ దేవదత్తుడు ఇంటి బయట ఉన్నాడు, ఇల్లు కట్టుకున్నాడు, ఇంట్లో ప్రవేశించాడు కాని పరమాత్మ సర్వగతుడు, సర్వవ్యాపి. అంతటా ఉన్న పరమాత్మ ఒకచోటినుంచి ఇంకొక చోటికి ఎలా వెళతాడు?

**వాదన 2** – పరమాత్మ గృహం నిర్మించాక, జీవాత్మ ప్రవేశించాడు. కాంట్రాక్టరు కట్టాక, యజమాని ఇంట్లో ప్రవేశించినట్టుగా.

**సిద్ధాంతి జవాబు** – ఉపనిషత్తు స్పష్టంగా పరమాత్మ సృష్టించి పరమాత్మ అనుప్రవేశం చేశాడని చెబుతున్నది. సృష్టించిన వ్యక్తీ, ప్రవేశించిన వ్యక్తీ వేరుకాదు. ఒక్కరే!

**తత్సృష్ట్వా। తదేవానుప్రావిశత్।**

ఈశ్వరుడే సృష్టించాడు, ఈశ్వరుడే ప్రవేశించాడు, ఈశ్వరుడు సృష్టించి జీవాత్మను పంపలేదు.

పరమాత్మ ప్రవేశించాడని అంటే, శ్రుతి తప్పు చెబుతున్నట్టా? శ్రుతి ఎన్నడూ తప్పు చెప్పదు. ఈ భాగం మరో ముఖ్యమైన భాగాన్ని వివరిస్తుంది అంటున్నారు శంకరులవారు.

శ్రుతి చెప్పే ఇంకో ముఖ్యమైన అంశం – **జీవాత్మ, పరమాత్మ ఐక్యం**. జీవాత్మ, పరమాత్మల ఐక్యం అర్థం చేసుకుంటే పరమాత్మ అనుప్రవేశం చేశాడు అంటే పరమాత్మ, మనస్సు వెనుక సాక్షిలా అందుబాటులో ఉన్నాడని అర్థం.

**పరమాత్మా జీవాత్మరూపేణ వర్తతే**

పరమాత్మ ప్రవేశించాడు అంటే పరమాత్మ అందుబాటులో ఉన్నాడని అర్థం. రామచంద్రుడు ఆఫీసులోకి వచ్చాడు అంటే, మాట్లాడటానికి అందుబాటులో ఉన్నాడని అర్థం. పరమాత్మ విషయంలో కూడా ఎలా వచ్చాడు అనవసరం. అందుబాటులో ఉన్నాడు అవసరం. అందువల్ల అనుప్రవేశ శ్రుతి ద్వారా పరమాత్మ జీవాత్మరూపంలో ఉన్నాడని తెలుసుకుంటే చాలు. జీవాత్మే పరమాత్మ.

ఈ అనుప్రవేశ శ్రుతి భాష్యం ఇంకా లోతుల్లోకి వెళుతుంది. మనం వాటిలోకి వెళ్ళటం లేదు. జీవాత్మ రూపంలో పరమాత్మ ఉన్నాడని తెలుసుకుంటే చాలు అని చూశాము. ఈ విషయాన్ని ఇంకా తేలికగా అర్థం చేసుకోవటానికి మీ స్వప్నవృత్తాంతం చూస్తే చాలు. మీరు స్వప్నప్రపంచం సృష్టించాక, ఆ స్వప్నప్రపంచంలోకి, దాన్ని అనుభవించటానికి మీరే వెళతారు. అంటే జాగ్రద్ పురుషుడైన మీరే స్వప్నపురుషుడు అవుతారు. స్వప్నప్రపంచంలో మీరొక పులిని సృష్టిస్తారు, మీరే అందులోకి ప్రవేశిస్తారు, మీరే ఆ పులిని చూసి భయపడి, పరుగులు తీస్తారు. అంటే జాగ్రద్పురుషుడే, స్వప్నపురుషుడు కూడా! ఇదే సూత్రాన్ని భగవంతునికి అన్వయిస్తే భగవంతుడే ఈ జాగ్రత్ప్రపంచాన్ని సృష్టించి, అందులోకి అనుప్రవేశం చేశాడు.

**ఈశ్వర ఏవ జీవరూపేణ ఉపలభ్యతే**

అందువల్ల జీవాత్మ ఉందంటేనే, అది పరమాత్మ ఉనికికి నిదర్శనం.

కాని స్వప్న సృష్టిని తీసుకున్నప్పుడు అది నూటికి నూరుపాళ్ళూ జాగ్రద్సృష్టికి సరిపోదు. పూర్తిగా సరిపోతే, అది ఉదాహరణ అవదు. ఈ రెండింటి మధ్యా కొన్ని సమాన ధర్మాలు ఉన్నాయి. ఏదైనా ఉదాహరణ చెబితే, వాటిమధ్య ఉన్న సమాన ధర్మాలను తీసుకోవాలి కాని వైధర్మ్యాలను కాదు. ఉదాహరణకు ఒక వ్యక్తిని, 'అతను ఆ సంస్థకు మూలస్తంభం,' అంటారు. అక్కడ మనం తీసుకోవాల్సిన సమానధర్మాలు – మూలస్తంభం ఎలా ఒక భవంతికి ఆధారమో, అలా ఇతను ఆ సంస్థకు ఆధారం. ఇతను లేకపోతే ఆ సంస్థ నిలవదు. ఇది తీసుకోవాలి కాని, అతను కూడా స్తంభంలా గుండ్రంగా ఉంటాడు, జడంవంటి అంశాలను

తీసుకోకూడదు. అదే సూత్రాన్ని స్వప్నదృష్టాంతానికి అన్వయిస్తే, స్వప్న ప్రపంచానికీ, జాగ్రద్ ప్రపంచానికీ మధ్య ఉన్న పోలికలను తీసుకోవాలి కాని, భేదాలను కాదు. ఏమిటా పోలికలు?

ఈశ్వరుడు సంకల్పం మాత్రం చేత ఈ జాగ్రద్ ప్రపంచాన్ని సృష్టించినట్టుగా, మీరు కూడా ఈ స్వప్నప్రపంచాన్ని సంకల్పం మాత్రం చేతనే సృష్టిస్తారు. అందులో అనేక వస్తువులను సృష్టిస్తారు. వాటిని అనుభవించటానికి ఒక ప్రాణమున్న జీవి కావాలి. ప్రాణమున్న జీవి లేకపోతే స్వప్నప్రపంచం సృష్టించి కూడా లాభం లేదు. అందువల్ల, స్వప్నాన్ని సృష్టించిన మీరే, మళ్ళీ స్వప్నప్రపంచంలోకి 'అడుగు' పెడతారు. మీరే ఆ స్వప్న ప్రపంచాన్ని అనుభవిస్తారు.

జాగ్రద్ పురుషుడు అయిన మీరు స్వప్నప్రపంచాన్ని సృష్టించి, స్వాప్నికుడు అవుతారు. దీనివెనుక ఉన్న తతంగం ఏమిటి? ఈ స్వప్నప్రపంచాన్ని సృష్టించేటంత వరకూ, మీరు జాగ్రద్‌పురుషుడు, స్థూలశరీర అభిమాని. ఎప్పుడైతే స్వప్నప్రపంచాన్ని సృష్టించారో, అప్పుడే ఆ స్వప్నప్రపంచంలో వ్యవహారం నడపటానికి ఇంకొక స్వప్నశరీరాన్ని ధరిస్తారు. ఈ జాగ్రద్ శరీరం, ఆ స్వప్న వ్యవహారానికి సరిపోదు. మీరు సృష్టించిన స్వప్నశరీరం మీ మనస్సునుంచి వచ్చింది కాబట్టి వృత్తమయ శరీరం అనీ, ఇంకా మాట్లాడితే మనస్సులో ఉన్న వాసనలనుంచి వచ్చింది కాబట్టి వాసనామయ శరీరం అనీ అంటారు. ఇప్పుడు మీకున్న స్థూలశరీరాన్ని వ్యావహారిక శరీరం అంటారు. ఈ వ్యావహారిక శరీరాన్ని వదిలి, వాసనామయ శరీరాన్ని ధరిస్తారు మీరు.

**వాసాంసి జీర్ణాని యథా విహాయ నవాని గృహ్ణాతి నరోఽపరాణి ।**
**తథా శరీరాణి విహాయ జీర్ణాన్యన్యాని సంయాతి నవాని దేహీ ॥** – గీత 2.22

మనిషి జీర్ణమైన వస్త్రాలను త్యజించి నూతన వస్త్రాలను ధరించినట్టుగా, జీవాత్మ ఈ శరీరాన్ని వదిలి ఇంకొక శరీరాన్ని ధరిస్తుంది అంటున్నాడు కృష్ణపరమాత్మ.

అదే విధంగా, ఈ జాగ్రద్ ప్రపంచాన్ని వదిలి, మీరు స్వప్నప్రపంచంలో ఇంకొక శరీరాన్ని ధరిస్తున్నారు. ఈ శరీరం అప్పుడు మృతదేహంతో సమానం. ఎందుకంటే ఆ సమయంలో మీమీద దోమలు స్వైరవిహారం చేసినా మీకు తెలియదు, మీరు కప్పుకున్న దుప్పటి మీనుంచి కిందికి జారిపోయినా మీకు స్పృహ ఉండదు. మన పెద్దవారు పొద్దున్న లేవగానే ముందుగా స్నానం చేయాలి అంటారు. స్వప్నావస్థలోనూ, జాగ్రదావస్థలోనూ శరీరం మృతదేహంతో సమానం అవుతుంది కాబట్టి, అది అశౌచం అవుతుంది కాబట్టి, దాన్ని శుద్ధి చేయటానికి స్నానం చేయాలి అంటారు.

స్వప్నంలో కొత్త శరీరాన్ని మాత్రమే తీసుకోరు; అందులో వాడే ఇంద్రియాలు కూడా భిన్నంగా ఉంటాయి. స్వప్నప్రపంచంలోని రంగు, రూపులను స్వప్ననేత్రాలతో చూస్తారు.

కళ్ళజోడు అవసరమైతే అక్కడ ఇంకొక కళ్ళజోడు వాడతారు కాని, ఈ కళ్ళజోడును తీసుకువెళ్ళరు. కళ్ళజోడు తీసి పక్కనున్న బల్లమీద పెట్టుకుని పడుకుంటారు. దాని తర్వాత స్వప్న వాహనాల్లో ఇక్కడ్నుంచి కాశీకీ, కాశీనుంచి న్యూయార్క్‌కూ ప్రయాణం చేసివస్తారు. పడుకునే ముందు గొంతుదాకా ఆహారం తిని పడుకున్నా కూడా, అక్కడ మళ్ళీ భోజనం చేస్తారు. ఆ విధంగా మీ స్వప్నప్రపంచంలో మీరొక పరిమితి ఉన్న జీవిగా తిరుగుతారు. అందులోని దేశం, కాలం మీరు సృష్టించిందే కాని, మీకా విషయం తెలియక, మీరు కూడా ఆ పరిమితులు ఉన్న జీవిగా అవస్థలు పడతారు.

మీరు జాగ్రద్ పురుషునిగా, స్వప్నం గురించి ఆలోచిస్తే, మీరే ఆ స్వప్నం యొక్క సృష్టికర్త; స్వాప్నికుడు సృష్టి. స్థూలశరీరం పరంగా చూస్తే మీరే కారణం. స్వప్నశరీరం పరంగా చూస్తే, మీరు కార్యం. కాని మీరు స్వప్నప్రపంచాన్ని సృష్టించి, అందులోకి స్వాప్నికునిగా అనుప్రవేశం చేశారు. ఈ రెండింటిలోనూ సమానంగా ఉన్నది ఏమిటి? సాక్షిచైతన్యం.

**సర్వగ్ం హ్యేతద్బ్రహ్మ । అయమాత్మా బ్రహ్మ**
**సోఽయమాత్మా చతుష్పాత్** – మాండూక్యమ్ 1.2

మాండూక్యోపనిషత్తులో ఉన్నదంతా బ్రహ్మ; బ్రహ్మే ఆత్మ అని మహావాక్యం వస్తుంది. అక్కడ ఆత్మను నాలుగు పాదాలున్న ఆత్మగా వివరిస్తుంది ఉపనిషత్తు. దాని సారం, ఆత్మనైన నేను మూడు వేషాలు వేసుకుని, వాటితో వ్యవహారం చేస్తున్నాను. జాగ్రదావస్థలో జాగ్రద్ పురుషునిగా వేషం వేసుకుని జాగ్రద్ ప్రపంచంతో వ్యవహారం నడుపుతాను. స్వప్నావస్థలో స్వాప్నికునిగా వేషం వేసుకుని స్వప్నప్రపంచంతో వ్యవహారం నడుపుతాను. సుషుప్తి అవస్థలో సుప్తపురుషునిగా వేషం వేసుకుని గాఢనిద్ర పోతాను. నేను వీటికి భిన్నంగా ఉండి, వీటన్నింటిలోనూ సూత్రంగా ఉన్న ఆత్మను. మాండూక్య పరిభాషలో చెప్పాలంటే తురీయాన్ని. నేను నాలుగవ పాదాన్ని మాత్రమే, నాలుగవ దశను కాను.

'జాగ్రద్ పురుషుడనైన నేనే స్వప్నప్రపంచంలోకి అడుగుపెట్టి స్వప్నాన్ని అనుభవిస్తున్నానని ఎలా చెప్పగలరు?' అని అడగవచ్చు మీరు. ఒకవేళ జాగ్రద్ పురుషుడు వేరు, స్వప్న పురుషుడు వేరు అనుకుందాము; అప్పుడేమవుతుంది? స్వాప్నికుడు పొందిన అనుభవాలను జాగ్రద్ పురుషుడు తెలుసుకోలేడు. స్వప్నంలో మీకొక పీడకల వచ్చి ఉండవచ్చు, లేదా తిరుపతి వేంకటేశ్వరస్వామి దర్శనం అద్భుతంగా పొంది ఉండవచ్చు. అది లేచాక, మీరే నలుగురికీ వర్ణించి మరీ చెబుతారు. దీన్నిబట్టి, ఏం తెలుస్తున్నది? జాగ్రద్ పురుషుడు, స్వప్నపురుషుడు ఒకరే అని తెలుస్తున్నది అంటే కారణం, కార్యం రెండూ ఒకటే.

కాని ఈ విషయం మీరు స్వప్నశరీరంతో ఉండగా మీకు తెలియదు. ముందే చూసినట్టుగా ఒక స్వప్నపురుషునికి తను స్వప్నంలో ఉండగా, ఆ స్వప్నం ఒక స్వప్నం అని తెలియదు!

అసలు ఆ మాటకొస్తే స్వప్నపురుషునికి, ఒక జాగ్రద్ పురుషుడు, జాగ్రద్ ప్రపంచమే ఉందని తెలియదు. అతను స్వప్నంలో చాలా అవస్థలు పడతాడు. స్వప్నప్రపంచం అతనికి సుఖాన్నీ ఇస్తుంది; దుఃఖాన్నీ ఇస్తుంది. అతను అందులోనే తిరుగుతూ అవస్థలు పడతూ ఉంటాడే కాని, ఒక గురువు వచ్చి, ఇది నువ్వు సృష్టించిన ప్రపంచం, నువ్వే దీని సృష్టికర్త, నువ్వు నీ నిజస్వరూపానికి లే అంటే అతను నమ్మడు. అవునా, జాగ్రద్ పురుషుడు ఉన్నాడా, నేను నమ్మను అంటాడు. ఎప్పుడు నమ్ముతాడు?

ఆ స్వప్నంనుంచి లేచాక! స్వప్నంనుంచి లేచాక, ఎవరూ విడమర్చి చెప్పనవసరం లేకుండానే, ఆ స్వప్నప్రపంచాన్నీ, అందులో తిరుగాడే స్వప్నపురుషుణ్ణీ కూడా జాగ్రద్ పురుషుడైన తనే సృష్టించాడని స్పష్టంగా అర్థమవుతుంది. అప్పుడింక స్వప్నశరీరంతో అభిమానం ఉండదు. తను స్వప్నంలో సంసారాన్ని అనుభవిస్తున్న ఒక బాధాతప్త జీవి కాదు; ఆ స్వప్నానికే సృష్టి, స్థితి, లయ కారకుడిని అని తెలుసుకొని ఆశ్చర్యపోతాడు! అందువల్ల స్వప్నపురుషుడు మీరు సృష్టించిన కార్యమా లేక మీరే స్వప్నపురుషునికి కారణమా అనే ప్రశ్నకు మీరు ఉన్న అవస్థనుబట్టి ఉంటుంది. మీరు జాగ్రదావస్థలో ఉంటే మీరు కారణం, మీరు స్వప్నావస్థలో ఉంటే మీరు కార్యం.

ఇదే సూత్రాన్ని అన్వయిస్తూ, వేదాంతం మీరు జాగ్రదావస్థలో ఉన్నంతవరకూ, స్థూల శరీరంతో మమేకం చెందుతూ, ఈ జాగ్రద్ ప్రపంచంలో వ్యవహారం నడుపుతున్న ఒక బాధాతప్త జీవిని అనుకుంటారు అంటుంది. ఈ ప్రపంచం మీలో ఉందని మీరు ఎన్నడూ అనలేరు, ఎందుకంటే, ఈ ప్రపంచం మీకు భిన్నంగా, బాహ్యంగా కనిపిస్తున్నది. కాని జాగ్రదావస్థనుంచి అంటే వ్యావహారిక స్థాయినుంచి పారమార్థికస్థాయికి లేస్తే, మీరు ఈ జగత్తులో తిరుగుతున్న ఒక చిన్ని జీవుడు కాదు; ఈ జగత్తునే సృష్టించిన పరమాత్మ అని అర్థం చేసుకుంటారు. ఈ జగత్తు మీనుంచి వచ్చింది, ఈ శరీరం కూడా మీనుంచి వచ్చింది, మీరు ఈ జీవాత్మయొక్క సృష్టికర్త అయిన పరమాత్మ అని నేర్చుకుంటారు.

పరమాత్మే ప్రతి ఒక్క శరీరంలోకి అనుప్రవేశం చేసి, జీవాత్మగా వ్యవహారం నడుపుతున్నాడు. కాని మనకా విషయం జాగ్రదావస్థలో మమేకం చెందినంతవరకూ తెలియదు. స్వప్నప్రపంచంలో మమేకం చెందిన స్వప్నపురుషునికి అసలు తనను సృష్టించిన జాగ్రద్‌పురుషుడు ఉన్నాడనే తెలియదు. నువ్వే ఈ స్వప్నప్రపంచాన్ని సృష్టించి ఇందులోకి అడుగుపెట్టావు అంటే అతను నమ్మడు. ఎప్పుడు నమ్ముతాడు? దాన్నించి నిద్రలేచాక నమ్ముతాడు. కాని స్వప్నపురుషుడు ఉన్నాడంటేనే, జాగ్రద్ పురుషుడు ఉన్నట్టు నిదర్శనం! అదే విధంగా, జీవాత్మ ఉందంటేనే, అది పరమాత్మయొక్క ఉనికికి నిదర్శనం.

**తత్ సృష్ట్వా** – పరమాత్మ ఈ జగత్తును సృష్టించాక,

**తదేవానుప్రావిశత్** – తనే ఈ దుఃఖభూయిష్టమైన జీవాత్మగా ఈ జాగ్రద్ప్రపంచంలో అడుగుపెట్టాడు. అంటే జీవాత్మయొక్క స్థూల–సూక్ష్మ శరీరాలను ఈ స్వప్నం–2లో (జాగ్రదావస్థలో) తీసుకున్నాడు.

**స్వప్నే జాగ్రతి వా య ఏష పురుషో మాయాపరిభ్రామితః।**
**తస్మై శ్రీగురుమూర్తయే నమ ఇదం శ్రీదక్షిణామూర్తయే॥** 8

స్వప్నంలోనూ, జాగ్రదావస్థలోనూ ఈ పురుషుడే ఉన్నాడు. ఆ విధంగా పరమాత్మే ఇప్పుడు జీవాత్మ రూపంలో ఉన్నాడు. ఈ వాక్యాన్ని తిరగేసి చూస్తే దాని అర్థం ఏమిటి? జీవాత్మ ఎవరో కాదు, సాక్షాత్తూ ఆ పరమాత్మే!

**తదను ప్రవిశ్య** – ఈ శరీరంలో జీవాత్మగా అనుప్రవేశం చేశాక, పరమాత్మ, జీవాత్మ చేసే వ్యవహారాలను చేస్తాడు. ఇప్పుడు పరమాత్మ కర్మేంద్రియాలతో కలిస్తే కర్తా లేదా ప్రమాతా అవుతాడు; జ్ఞానేంద్రియాలతో కలిస్తే భోక్తా అవుతాడు. ఆ విధంగా ఈ అద్భుతమైన స్వప్నం–2 కొనసాగుతున్నది. అది అద్భుతంగా ఉన్నన్నాళ్ళూ మనకేం బాధలేదు. కాని అది పీడకలగా మారితే మాత్రం, దాన్నించి లేవక తప్పదు.

స్వప్నప్రపంచంనుంచి నిద్రలేస్తే అది మిథ్య అని తేలుతుంది. జాగ్రద్ప్రపంచంనుంచి లేస్తే (సత్యానికి ఎదిగితే) బ్రహ్మ సత్యం, జగన్మిథ్యా అనే వేదాంతసత్యాన్ని ఔపోసన పడితే, అప్పుడు ఈ జాగ్రద్ శరీరం, ఇంద్రియాలు కూడా మిథ్య అని అర్థం చేసుకుంటారు.

తదనుప్రవిశ్య వాక్యాన్ని మనం పూర్తి చేసుకోవాలి.

**బ్రహ్మైవ జీవాత్మరూపేణ వ్యవహరతి** – అంటే శరీరంలోకి ప్రవేశించాక, బ్రహ్మ జీవాత్మ రూపంలో వ్యవహారం నడుపుతాడు.

**పునశ్చ జన్మాంతరకర్మయోగాత్ । స ఏవ జీవః స్వపితి ప్రబుద్ధః ॥**
**పురత్రయే క్రీడతి యశ్చ జీవః । తతస్తు జాతం సకలం విచిత్రమ్ ॥**
**ఆధారమానందమఖండబోధం । యస్మిన్ లయం యాతి పురత్రయం చ** – కైవల్యమ్ 14

నిద్రపోతున్న జీవాత్మ, స్వప్నప్రపంచంలోకి అడుగుపెడుతుంది, లేదా జాగ్రతావస్థలోకి వస్తుంది. పూర్వజన్మ పుణ్యపాపాలవల్ల ఈ జీవాత్మ ఈ మూడు అవస్థల్లోనూ తిరుగుతుంది. కాని ఈ జీవాత్మ ఎవరో కాదు – సాక్షాత్తూ ఆ పరమాత్మే. అంటే ఏకాత్మ అయిన నాలో పురత్రయాలు లయమవుతాయి.

చాలా అద్భుతమైన శ్లోకం! జీవాత్మగా నేను జాగ్రదావస్థలోనూ, స్వప్నావస్థలోనూ తిరుగుతాను. సుషుప్తిలో ఈ రెండు వేషాలను తీసివేసి, పడుకుంటాను. ఈ అవస్థలు

వచ్చిపోతున్నాయి అంటేనే నేను ఈ పురుషుల్లో ఏదీ కాను. నేను జీవాత్మ అనే అజ్ఞానంలో నేను మూడు అవస్థల్లో తిరుగుతాను. నేను పరమాత్మను అని తెలుసుకుంటే నాలో మూడు అవస్థలు లయమవుతాయి. కాకపోతే ఆ నేను అనేది ఎవరో మర్చిపోకూడదు. నేను శరీరం కాదు, ఇంద్రియాలు కాదు, మనస్సు కాదు, నేను సాక్షి చైతన్యాన్ని.

శంకరాచార్యులవారు జీవాత్మ ఉనికి గురించి మనకు సందేహం లేదు కాబట్టి పరమాత్మ ఉనికి గురించి సందేహం లేదు, ఎందుకంటే పరమాత్మే జీవాత్మగా వ్యవహారం నడుపుతున్నాడు కాబట్టి అంటున్నారు.

2. **బ్రహ్మ అస్తి జీవాత్మరూపేణ వర్తమానత్వాత్**

3. **ఉపాదాన కారణం – బ్రహ్మ అస్తి జగతః ఉపాదాన కారణత్వాత్**

అంతకుముందు బ్రహ్మను జగత్తుయొక్క నిమిత్త కారణం అన్నాము. నిమిత్త కారణంగా బ్రహ్మ కోరుకున్నాడు, ప్రణాళిక వేశాడు, జగత్తును సృష్టించాడు. ఒక వడ్రంగి ఒక కుర్చీ తయారుచేసే ముందు కూడా కోరుకుంటాడు, ప్రణాళిక వేస్తాడు, ఆ కుర్చీని సృష్టిస్తాడు (తయారు చేస్తాడు). ఏదైనా సృష్టించాలంటే దానికొక ముడిసరుకు కావాలని మనకు తెలుసు. కుర్చీని తయారుచేయాలంటే చెక్క కావాలి; ఆభరణం తయారుచేయాలంటే బంగారం కావాలి. దీన్ని ఉపాదాన కారణం అంటారు. కేవలం నిమిత్తకారణం ఉంటే చాలదు, దానికి ఉపాదాన కారణం కూడా కావాలి. ఈ జగత్తు యొక్క నిమిత్తకారణం పరమాత్మ అయితే, దానికి ఉపాదాన కారణం ఏమిటి?

మామూలుగా లౌకికసృష్టిలో ఏ వస్తువుయొక్క సృష్టి చూసినా నిమిత్తకారణం వేరు, ఉపాదాన కారణం వేరు. కుర్చీ విషయమే తీసుకుంటే, వడ్రంగి నిమిత్తకారణం, చెక్క ఉపాదాన కారణం. కాని జగత్తు విషయంలో ఉపాదాన కారణం ఏం ఉంది? పరమాత్మ తప్ప వేరే ఏమీ లేదు పంచభూతాల సృష్టి కూడా ఇంకా జరగలేదు. పంచభూతాలకు కూడా ఉపాదాన కారణం ఏది?

**సదేవ సోమ్యేదమగ్ర ఆసీత్। ఏకమేవాద్వితీయమ్** – ఛాందోగ్యమ్ 6.2.1

ఈ సృష్టికి ముందు సత్ మాత్రమే ఉంది. మరొకటి లేదు. అందువల్ల భగవంతుడే నిమిత్త కారణం, ఉపాదాన కారణం కూడా కావాలి. సాధారణంగా ఇవి రెండూ భిన్నం కాని, ప్రతి ఒక ఉత్సర్గకూ (నియమానికి), ఒక అపవాదం (ఉల్లంఘన) ఉంది. అంటే అసాధారణ సందర్భాలలో నిమిత్త కారణమూ, ఉపాదాన కారణమూ కూడా ఒకటే ఉంటుంది. ఉపనిషత్తే అటువంటి ఉదాహరణను ఇస్తుంది.

**యథోర్ణనాభిః సృజతే గృహ్ణతే చ** – ముండకమ్ 1.1.7

ఒక సాలెపురుగు తనలోంచి దారాలను తీసుకుని తన సాలెగూడును అద్భుతంగా సృష్టిస్తుంది. అంటే సాలెపురుగే నిమిత్త కారణము, ఉపాదాన కారణము కూడా. ఉపనిషత్తు చెప్పే ఇంకొక ఉదాహరణ మీ స్వప్నప్రపంచం. స్వప్నంలో మీరొక ఇంటిని సృష్టిస్తే, దాని నిమిత్త కారణమూ మీరే, దాని ఉపాదాన కారణమూ మీరే. ఎందుకంటే ఆ ఇల్లు మీ వాసనలనుంచి వస్తుంది.

ఒక విషయం గుర్తుంచుకోండి! స్వప్నప్రపంచాన్ని పూర్తిగా ఊహాజనితమైన ప్రపంచంగా కొట్టిపారేయటానికి లేదు. మీరు స్వప్నంలో ఉన్నంతవరకూ అది అక్షరాలా సత్యం. ఒక పులిని చూసి భయపడి పరుగులు తీస్తారు. మీకు చెమటలు పడతాయి. మిమ్మల్ని అంత భయపెట్టిన ఆ స్వప్నం, దాన్నించి లేస్తే అది కేవలం వాసనామయ ప్రపంచం అని గ్రహిస్తారు. కంటికి కనబడని మనస్సు సృష్టించింది ఆ ప్రపంచాన్ని. అదే విధంగా, కంటికి కనబడని, ఆకారం లేని పరమాత్మ ఈ జగత్తును సృష్టించాడు. కంటికి కనబడని, ఆకారం లేని శక్తి, కంటికి కనబడే, ఆకారం ఉన్న వస్తువుగా వ్యక్తమవగాలేనిది, కంటికి కనబడని, ఆకారం లేని భగవంతుడు ఈ జగత్తును సృష్టించలేడా?

ఎలాగైతే మీ స్వప్నప్రపంచానికి మీరే నిమిత్త కారణమూ, ఉపాదాన కారణమో, అలాగే పరమాత్మే ఈ జగత్తుకు నిమిత్త కారణమూ, ఉపాదాన కారణమూ కూడా. స్వప్నప్రపంచాన్ని మీరు మీ మనస్సుతో, వాసనలతో సృష్టిస్తే ఈశ్వరుడు మాయతో, కర్మలతో (కర్మఫలాలను దృష్టిలో పెట్టుకుని) సృష్టిస్తాడు. మనస్సును మాయతోనూ, వాసనలను కర్మలతోనూ పోల్చాలి.

భగవంతుడు ఉపాదానకారణం అని చెప్పేటప్పుడు, మనం వాడే క్రియాపదం మారుతుంది. 'వడ్రంగి సామానును సృష్టించాడు,' అంటాము. అదే చెక్క గురించి చెప్పేటప్పుడు, 'చెక్క కుర్చీగా అయింది,' అంటాము. అంటే ఉపాదాన కారణం సృష్టించదు, అవుతుంది. స్వప్నప్రపంచం గురించి చెప్పేటప్పుడు కూడా 'నేను స్వప్నప్రపంచాన్ని **సృష్టించాను**, నేను స్వప్నప్రపంచాన్ని **అయ్యాను**,' అంటాము. బ్రహ్మ విషయంలో కూడా అలాగే భిన్నపదాలు వాడింది ఉపనిషత్తు.

ఇదగ్ం సర్వమ్ అసృజత – పరమాత్మ ఈ సర్వాన్నీ **సృష్టించాడు** అంది.

అభవత్ – ఉపాదాన కారణం గురించి చెప్పేటప్పుడు పరమాత్మ **అయ్యాడు** అంది. ఇక్కడ భగవంతుడు ఏమేమి అయ్యాడో చెప్పుకొస్తున్నది ఉపనిషత్తు.

**సచ్చ త్యచ్చాభవత్। నిరుక్తం చానిరుక్తం చ। నిలయనం చానిలయనం చ। విజ్ఞానం చావిజ్ఞానం చ। సత్యం చానృతం చ సత్యమభవత్।యదిదం కించ। తత్సత్యమిత్యాచక్షతే। తదప్యేష శ్లోకో భవతి।**

**సచ్చ త్యచ్చాభవత్** – సత్ చ త్యత్ చ అభవత్ – రూపం ఉన్నది, రూపం లేనిది కూడా అయ్యాడు. ఇక్కడ సత్ అంటే సత్‌చిత్ ఆనందం బ్రహ్మలోని సత్ కాదు; అంటే ఉనికి కాదు. ఇక్కడ సత్ అంటే స్థూలప్రపంచం, స్థూలశరీరం; త్యత్ అంటే సూక్ష్మప్రపంచం, సూక్ష్మ శరీరం. ఇంకో విధంగా చెప్పాలంటే మూర్తప్రపంచం, అమూర్తప్రపంచం. కారణ ప్రపంచం గురించి చెప్పటం లేదు, ఎందుకంటే కారణ ప్రపంచం సృష్టించబడలేదు. అది అనాది – అది ఒక ఆది లేకుండా బ్రహ్మతో మాయరూపంలో ఉంది.

**అనిర్వాచ్య అనాది అవిద్యా రూపమ్** – తత్త్వబోధ

నిర్వచింపలేని, ఆదిలేని, అజ్ఞానరూపంలో ఉంది మాయ.

ఇక్కడ క్రియాపదం అభవత్ అని చూశాము. అంటే అయ్యాడు అని అర్థం అని కూడా చూశాము.

భగవద్గీతలో కృష్ణపరమాత్మ విశ్వరూపదర్శనయోగంలో ఓ అర్జునా, నేనే ఆకాశాన్ని **అయ్యాను** అన్నాడు. అందువల్లనే ఆకాశాన్ని భగవంతునిగా కొలుస్తాము మనము. ఆకాశాన్ని చూస్తే, భగవంతుణ్ణి చూసినట్టే. ఆభరణాన్ని ముట్టుకుంటే, బంగారాన్ని ముట్టుకున్నట్టే. కార్యాన్ని చూస్తే, కారణాన్ని చూసినట్టే. ఈ జగత్తులో దేన్ని చూసినా, దేన్ని ముట్టుకున్నా, దేనితో వ్యవహారం నడిపినా, భగవంతుణ్ణి చూసినట్టే, ముట్టుకున్నట్టే, వ్యవహారం నడిపినట్టే అర్థం – 'భగవంతుడు ఎక్కడా లేడు,' అని ఎవరో రాస్తే, దాన్ని కొద్దిగా మార్చి ఒక భక్తుడు 'భగవంతుడు ఎక్కడ లేడు?' అని రాశాడుట. అందువల్ల భగవంతుడు ఎక్కడ ఉన్నాడు అంటే, విశ్వరూప ఈశ్వరునిగా విశ్వం అంతటా ఉన్నాడు.

పొద్దున్నే సూర్యోదయాన్ని చూస్తున్నప్పుడు సూర్యభగవానునికి సూర్యనమస్కారాలు చేయండి. సూర్యుడు మామూలు భౌతికరూపం కాదు, సాక్షాత్తూ ఈశ్వరుడే. అలాగే నదిలో స్నానం చేసేటప్పుడు, వెళుతూనే నదిలో కాళ్ళు పెట్టకండి. ఎందుకంటే జలం సాక్షాత్తూ ఈశ్వరుడే.

**ఆపో వా ఇదగ్ం సర్వమ్**

కొంచెం నీరు చేతిలోకి తీసుకుని, మీ తలమీద ఆ నీటిని కొంచెం చల్లుకుని, అప్పుడు నీళ్ళల్లోకి దిగండి. భగవంతుడు ఎటువంటి ప్రపంచంగా అయ్యాడు?

**స్థూల సూక్ష్మ ప్రపంచ రూపేణ బ్రహ్మ అభవత్**

వ్యష్టిపరంగా చూస్తే అతని స్థూలశరీరం కంటికి కనబడుతుంది కాని మనస్సు, మనస్సులోని ఆలోచనలు, భావోద్రేకాలు, జ్ఞానం కనబడవు. అందువల్ల రెండింటినీ కలిపి మూర్తామూర్త ప్రపంచం అయ్యాడు అని చెప్పవచ్చు.

**నిరుక్తం చానిరుక్తం చ** – నిరుక్తం స్థూలప్రపంచానికి ఇంకొక పేరు. నిరుక్తం అంటే నిర్వచించబడేది అని అర్థం. నిశ్చయ యుక్తం లేదా నిర్వచనీయం అంటారు. నిర్ అంటే స్పష్టంగా నిర్వచించబడగలిగేది – నిశ్చయేన వస్తుం శక్యమ్. సూక్ష్మప్రపంచాన్ని అనిరుక్తం అంటారు. ఎందుకంటే దాన్ని స్పష్టంగా నిర్వచించలేము. మన ఆంతర వ్యక్తిత్వం ఏమిటో మనకే స్పష్టంగా తెలియదు. ఈ వాక్యం అర్థం భగవంతుడు నిర్వచించబడేవి, నిర్వచించలేనివి కూడా అయ్యాడు.

**నిలయనం చానిలయనం చ** – నిలయనం అంటే ఆశ్రయం ఇచ్చేది; అనిలయనం అంటే ఆశ్రయం పొందేది. కంటికి కనబడేది, కనబడనిదానికి ఆధారం. ఉదాహరణకు కంటికి కనబడని గ్యాస్‌కు కంటికి కనబడే సిలిండర్ ఆధారం. అంటే సిలిండర్ మూర్తం, గ్యాస్ అమూర్తం. ఈ స్థూలశరీరాన్ని ఆయతనం అంటారు.

ఇప్పటివరకూ మూడుజతల పదాలను చూశాము. అవి సత్–త్యత్, నిరుక్తం–అనిరుక్తం, నిలయనం–అనిలయనం. అవి స్థూల, సూక్ష్మప్రపంచాలను లేదా మూర్త, అమూర్త ప్రపంచాలను సూచిస్తాయి. వీటికి ఉపనిషత్తు వాడిన పదం **అభవత్** అనే విషయం మర్చిపోకూడదు. అంటే భగవంతుడు ఈ మూర్తామూర్త ప్రపంచం తానే అయ్యాడు.

**విజ్ఞానం చావిజ్ఞానం చ** – భగవంతుడు విజ్ఞానం, అవిజ్ఞానం కూడా తానే అయ్యాడు. విజ్ఞానం అంటే చేతన ప్రపంచం, అవిజ్ఞానం అంటే అచేతన ప్రపంచం లేదా జడప్రపంచం.

సాంకేతికపరంగా చూస్తే, నిజానికి రెండూ జడమే, కాని వాటిని రెండు రకాలుగా చూడవచ్చు. జడప్రపంచంలోకి చలనంలేని బల్ల, కుర్చీ, రాయి వంటివి వస్తాయి. చేతన ప్రపంచంలోకి మనస్సు వస్తుంది. నిజానికి మనస్సు కూడా జడమే. కాని అది చాలా సూక్ష్మమైనది; దానికి చైతన్యాన్ని అరువు తెచ్చుకుని, దాన్ని ప్రతిబింబింపజేసే ప్రత్యేకశక్తి ఉంది. అరువు తెచ్చుకున్న చైతన్యంతో మనస్సు కూడా చైతన్యవంతం అయింది. ఈ ప్రతిబింబ చైతన్యాన్ని చిదాభాస అంటారు. ఇప్పుడు చేతన ప్రపంచం, అచేతన ప్రపంచం అంటే చిదాభాస ఉన్న జీవులు, చిదాభాస లేని జీవులు. మనం జీవించి ఉన్నంతకాలం చిదాభాస సహిత శరీరం ఉంటుంది మనకు. సూక్ష్మశరీరం, స్థూలశరీరాన్ని విడిచి వెళ్ళటం మరణం అంటారు. సూక్ష్మశరీరంతోపాటు మనస్సు, మనస్సులో ఉన్న చిదాభాస కూడా వెళ్ళిపోతాయి. అప్పుడు ఈ శరీరం చిదాభాసరహితశరీరం అవుతుంది. భగవంతుడు చేతన, అచేతన ప్రపంచాలు రెండూ అయ్యాడు.

**సత్యం చానృతం చ సత్యమభవత్**– ఇది చివరి జంట. సృష్టిని రెండుగా విభజించవచ్చు. జాగ్రద్ ప్రపంచం, స్వప్నప్రపంచం. జాగ్రద్ ప్రపంచాన్ని వ్యావహారిక సత్యం అనీ, స్వప్నప్రపంచాన్ని ప్రాతిభాసిక సత్యం అనీ అంటారు. జాగ్రద్ ప్రపంచపరంగా చూస్తే స్వప్నం

మిథ్య, జాగ్రద్ ప్రపంచం సత్యంగా అనిపిస్తుంది. అనృతం అంటే సత్యం కానిది. స్వప్నప్రపంచం అనృతంలోకి వస్తుంది. బ్రహ్మను పారమార్థిక సత్యం అంటారు. వేదాంతంలోని అద్భుతం ఏమిటంటే, ఎవరైతే ఈ పారమార్థిక సత్యానికి లేస్తారో, వారికి ఈ వ్యావహారిక సత్యం కూడా స్వప్నం–2 అయిపోతుంది. అంటే బ్రహ్మ సత్యం, జగన్మిథ్యా అవుతుంది.

ఈ విధంగా మూడు సత్యాలు ఉన్నాయి. అవి –

| | | | |
|---|---|---|---|
| ప్రాతిభాసిక సత్యం | స్వప్నప్రపంచం | నేను చూస్తేనే ఉంటుంది | అది ఉన్నంతసేపే ఉంటుంది |
| వ్యావహారిక సత్యం | జాగ్రద్ ప్రపంచం | నేను వ్యవహారం నడిపేది | జాగ్రదావస్థలో ఉంటుంది |
| పారమార్థిక సత్యం | బ్రహ్మ | ఉన్నదొకటే బ్రహ్మ, అంతిమ సత్యం | మూడు కాలాల్లోనూ ఉంటుంది |

ప్రాతిభాసిక సత్యం స్వప్నంలో ఉన్నంతసేపే ఉంటుంది. అది నాకు మాత్రమే కనబడుతుంది. దాన్నించి నిద్రలేస్తే, స్వప్నప్రపంచం మిథ్య; జాగ్రద్ ప్రపంచం సత్యం అవుతుంది. వ్యావహారిక సత్యం జాగ్రదావస్థలో వ్యవహారం నడపటానికి తోడ్పడుతుంది. జాగ్రదావస్థ ఉన్నంతవరకే ఉంటుంది. పారమార్థిక సత్యంలో పారమార్థిక ప్రపంచం ఉందనుకూడదు. అక్కడ ఉన్నదొకటే బ్రహ్మ. ఏకమేవాద్వితీయం. దాన్ని కూడా మిథ్య అనకూడదు. అది మూడు కాలాల్లోనూ ఉంటుంది. త్రికాలేపి తిష్ఠతి. జాగ్రద్ ప్రపంచం, స్వప్నావస్థలో ఉండదు; స్వప్నప్రపంచం జాగ్రదావస్థలో ఉండదు. ఒక సమయంలో ఉండి, ఇంకొక సమయంలో లేనిదాన్ని మిథ్య అంటారు. బ్రహ్మ గురించి నేర్చుకుంటే, ఈ రెండు ప్రపంచాలూ మిథ్యే అవుతాయి.

**యదిదం కించ** – యత్ ఇదం కిం చ – ఈ సృష్టిలో ఇంకేమి ఉన్నా కూడా అదంతా కూడా బ్రహ్మే. ఉదాహరణకు బంగారు ఆభరణాలు ఏం తీసుకున్నా, వాటిల్లో ఉన్నది బంగారమే.

**తత్సత్యమిత్యాచక్షతే** – ఇప్పుడు పరమాత్మకొక కొత్తపేరు ఇస్తున్నది ఉపనిషత్తు. తత్ సత్యమ్. ఆ బ్రహ్మే సత్యము.

దీన్నించి బ్రహ్మ అస్తి అని చెప్పటానికి మనం మూడవ కారణాన్ని ఏరాలి. బ్రహ్మ ఉపాదాన కారణంగా ఉంది.

గమనిక – బ్రహ్మ అని వాడినప్పుడు నపుంసకలింగం, పరమాత్మ/భగవంతుడు అని వాడినప్పుడు పుంలింగం వాడుతున్నాము.

**బ్రహ్మ అస్తి జగతః ఉపాదానకారణత్వాత్**

దీన్నే ఇంకో విధంగా కూడా చెప్పవచ్చు. దీనికొక ఉదాహరణ చూద్దాము. బంగారం ఆభరణంగా కనబడినప్పుడు, ఆభరణంయొక్క ఉనికిని మనం అనుభవిస్తున్నాము. ఆభరణం ఉంది అంటేనే బంగారం ఉన్నట్టు అర్థం. అదెలా? ఎందుకంటే బంగారమే ఆభరణం

రూపంలో ఉంది. ఇదే సూత్రాన్ని బ్రహ్మకు అన్వయించండి. బ్రహ్మే జగత్తు రూపంలో ఉంది; అంటే జగత్తు ఉందంటేనే బ్రహ్మ ఉన్నట్టు అర్థం.

**కారణమ్ ఏవ కార్యరూపేణ అస్తి**
కారణమే కార్యరూపంలో ఉంది.

**కార్య అస్తిత్వమ్ ఏవ కారణ అస్తిత్వస్య హేతుః**
కార్యంయొక్క ఉనికి, కారణంయొక్క ఉనికికి నిదర్శనం

అందువల్ల మూడవ కారణాన్ని ఇలా కూడా చెప్పవచ్చు.

**బ్రహ్మ అస్తి జగత్ రూపేణ వర్తమానత్వాత్**
జగత్ రూపంలో బ్రహ్మ ఉంది.

ఆభరణం ఉందని మనం చెపితే ఆ ఉంది అనే దాని ఉనికి బంగారంనుంచి అరువు తెచ్చుకున్నదే. అలా ఎలా చెప్పగలరు? ఒకవేళ ఆభరణాలకు విడిగా ఉనికి ఉండివుంటే, ఆ ఆభరణాలనుంచి బంగారాన్ని విడిగా తీయగలగాలి. కాని అలా ఆభరణాలనుంచి బంగారాన్ని విడదీయగలమా? లేదే! ప్రకృతి సూత్రం గుర్తుంచుకోండి – కార్యంయొక్క ఉనికి దాని కారణంమీదే ఆధారపడివుంది. అందువల్ల మనం ఆభరణంయొక్క ఉనికిని అనుభవిస్తున్నామంటే, నిజానికి బంగారంయొక్క ఉనికినే అనుభవిస్తున్నాము. మీరు ఎవరితోనైనా నేను ఒక నగ కొన్నాను అనగానే ఎదుటివారు అడిగే ప్రశ్న ఏమిటి? ఎంత బంగారం ఉంది? ఇదే సూత్రాన్ని జగత్తుకు అన్వయిస్తే – ఆకాశం, భూమి, నీరు ఏది చూసినా వాటి ఉనికి భగవంతుని ఉనికినే చూపిస్తాయి.

**యస్యైవ స్ఫురణం సదాత్మకమసత్కల్పార్థకం భాసతే**
**సాక్షాత్తత్త్వమసీతి వేదవచసా యో బోధయత్యాశ్రితాన్ ॥** – దక్షిణామూర్తి

ఈ సత్యాన్ని శంకరాచార్యులవారు దక్షిణామూర్తి స్తోత్రంలో ఒక్కపాదంలో వెల్లడించారు. ఏ వస్తువుయొక్క ఉనికిని మీరు అనుభవిస్తున్నా కూడా, మీరు బ్రహ్మయొక్క ఉనికిని అనుభవిస్తున్నట్టే. అటువంటి బ్రహ్మ ఉందా లేదా అనే సందేహం ఎందుకు?

3. **బ్రహ్మ అస్తి జగతః ఉపాదాన కారణత్వాత్** లేదా
**బ్రహ్మ అస్తి జగత్ రూపేణ వర్తమానత్వాత్**

**తదప్యేష శ్లోకో భవతి** – ఈ భావనను వివరించటానికి అంటే బ్రహ్మే ఉపాదన కారణంగా అయ్యాడని వివరించటానికి ఈ ఋగ్మంత్రం ఉంది.

**అనువాకం – 7**

**అసద్వా ఇదమగ్ర ఆసీత్। తతో వై సదజాయత। తదాత్మానగ్ం స్వయమకురుత। తస్మాత్తత్సుకృతముచ్యత ఇతి।**

**యద్వై తత్సుకృతమ్। రసో వై సః। రసగ్ం హ్యేవాయం లబ్ధ్వాఽఽనందీ భవతి। కోహ్యేవాన్యాత్ కః ప్రాణ్యాత్। యదేష ఆకాశ ఆనందో న స్యాత్। ఏష హ్యేవానందయాతి। యదా హ్యే వైష ఏతస్మిన్నదృశ్యేఽనాత్మ్యేఽనిరుక్తేఽనిలయనేఽభయం ప్రతిష్ఠాం విన్దతే। అథ సోఽభయం గతో భవతి। యదా హ్యేవైష ఏతస్మిన్నుదరమన్తరం కురుతే। అథ తస్య భయం భవతి। తత్త్వేవ భయం విదుషోఽమన్వానస్య। తదప్యేష శ్లోకో భవతి।**

**వివరణ**

**అసద్వా ఇదమగ్ర ఆసీత్। తతో వై సదజాయత। తదాత్మానగ్ం స్వయమకురుత। తస్మాత్తత్సుకృతముచ్యత ఇతి।**

4. **సుకృతం – బ్రహ్మ అస్తి సుకృత ప్రసిద్ధే** – ఇందులో ఋగ్మంత్రాన్ని చూస్తాము. అది అసద్వాతో మొదలై ఉచ్యత ఇతితో ముగుస్తుంది. ఈ ఋగ్మంత్రం సారాంశం, బ్రహ్మే సృష్టికి నిమిత్తకారణం, ఉపాదానకారణం కూడా.

**బ్రహ్మ అభిన్న నిమిత్త ఉపాదాన కారణం జగతః**

సృష్టి జరగకముందే ఈ జగత్తు ఉంది అంటున్నది శాస్త్రం. అంటే నిజంగా జగత్తుయొక్క సృష్టి కొత్తగా జరగలేదు. ఏ భాషలోనైనా పెద్ద అయోమయంలో పడవేసే పదం '**సృష్టి.**' ఈ పదాన్ని అసలు నిఘంటువులోంచే తీసివేయాలి. ఎందుకంటే ఎవరూ, భగవంతునితో సహా, దేన్నీ కొత్తగా సృష్టించలేరు. అది ఎలా చెప్పగలరు? సైన్సు కూడా స్పష్టంగా నిరూపించింది – వస్తువును కొత్తగా పుట్టించలేము, నాశనం చేయలేము. ఈ విషయాన్ని సైన్సు పుట్టటానికి కొన్ని వేల సంవత్సరాల ముందే శాస్త్రం నిరూపించింది. దాన్ని **సత్కార్యవాదః** అంటారు. దాని అర్థం కూడా అదే. వస్తువును సృష్టించలేము, నాశనం చేయలేము. అంటే జగత్తు అంతకుముందే ఉంది.

నిజంగా అంతకుముందే ఉంటే, మరి సృష్టి జరిగిందని ఎందుకు అంటున్నారు? సృష్టి జరగకముందు జగత్తు ఉన్నా కూడా, అది ఈ రూపంలో లేదు. అది అవ్యక్తంగా ఉంది. అవ్యక్తరూపేణ అస్తి. అవ్యక్తరూపంలో ఉన్నదేదైనా వ్యక్తమవగలదు. ఈ వ్యక్తమవటాన్నే తప్పుగా సృష్టి అంటున్నాము. అందువల్ల సృష్టి పదాన్ని తీసేసి వ్యక్తమయింది అనాలి. ఆ విధంగా, జగత్తు ఎప్పుడూ ఉంది – వ్యక్తంగానో, అవ్యక్తంగానో. అవ్యక్తంనుంచి వ్యక్తంలోకి వస్తే సృష్టి అంటాము; వ్యక్తంలోంచి అవ్యక్తంలోకి వెళ్ళిపోతే లయ అంటాము. అందువల్ల

సృష్టి–లయ రెండూ నిత్యమూ ఉన్న జగత్తుకు జరిగే మార్పులు మాత్రమే. ఈ మార్పులను శాస్త్రం వికారః అంటుంది. సృష్టిని జన్మవికారః అంటే, లయను మరణ వికారః అంటుంది. జగత్తు రాకముందు బ్రహ్మలో అవ్యక్తంలో ఉన్న స్థితిని మాయ లేదా ప్రకృతి అని అంటుంది శాస్త్రం.

**బ్రహ్మాశ్రయా సత్త్వరజస్తమోగుణాత్మికా మాయా అస్తి**

బ్రహ్మను ఆశ్రయించుకుని, సత్త్వ, రజ, తమోగుణాలున్న మాయ ఉంది. అందువల్ల అవ్యక్త జగత్తును మాయ అనవచ్చు.

**అసద్వా ఇదమగ్ర ఆసీత్** – ఇదం అగ్రే ఆసీత్ వై – ఈ జగత్తు వ్యక్తంలోకి రాకముందు అవ్యక్తంలో ఉంది. ఉపనిషత్తు అవ్యక్తం పదం వాడకుండా, అసత్ అనే పదం వాడింది. అసత్ నిఘంటువు అర్థం ఉనికి లేనిది. జగత్తు అవ్యక్తంలో ఉంటే, ఉనికి లేదని ఎలా అంటుంది ఉపనిషత్తు? దానికి శంకరాచార్యులవారు అద్భుతమైన భాష్యం రాశారు. అసత్ అంటే సుతరామూ లేనిది అనికాదు అర్థం. ఎందుకంటే సుతరామూ లేనిదానినుంచి ఉన్నదాని పుట్టుక సాధ్యం కాదు. అవ్యక్తంలో ఉన్న వస్తువు ఉన్నా లేనట్టే లెక్క. ఎందుకంటే అది మన వ్యవహారానికి అందదు. **అవ్యవహార్యమ్.**

ఉదాహరణకు పాలలో అవ్యక్తంగా ఉంటుంది వెన్న. ఎవరైనా మీ దగ్గరికి వచ్చి 'వెన్న ఉందా?' అని అడిగితే, 'లేదు,' అంటారు కాని, 'ఇదుగో ఈ పాలలో ఉంది, తీసుకోండి,' అంటారా? పాలలో అవ్యక్తంగా ఉన్న వెన్న ఉన్నా లేనట్టే అర్థం. అదే విధంగా మట్టిలో, కుండలు అవ్యక్తంలో ఉంటాయి; కాని అదుగో కుండలు ఉన్నాయి అంటామా? కుండ ఆకారం రూపుదిద్దుకునేదాకా వాటికి పేరు ఇవ్వలేము. అలా అది వ్యవహారానికి అందదు కాబట్టి, ఉపనిషత్తు అవ్యక్తానికి, అసత్ పదం వేసింది.

అసద్వా అంటే అసత్ వై. వై అంటే నిశ్చయంగా. ఈ జగత్తు బ్రహ్మలో, నిశ్చయంగా అవ్యక్తరూపంలో ఉంది. ఈ అవ్యక్తదశను మాయాసహితబ్రహ్మ లేదా ఈశ్వరుడు అంటారు. (బ్రహ్మ + మాయ = ఈశ్వరుడు).

**తతో వై సదజాయత** – తతః అంటే ఆ మాయాసహిత బ్రహ్మనుంచి; వై అంటే నిశ్చయంగా; సత్ అజాయత అంటే ఈ నామరూపాత్మకమైన జగత్తు వచ్చింది. ఉదాహరణకు మనం జాగ్రదావస్థలో ఉండగా, వాసనాసహిత జాగ్రద్ పురుషులుగా ఉంటాము. నిద్ర పోయినప్పుడు ఈ వాసనలనుంచి నామరూపాత్మకమైన స్వప్నప్రపంచం వస్తుంది.

**తదాత్మానగ్ంం స్వయమకురుత** – ఈ వ్యక్తప్రపంచం ఈశ్వరునినుంచి వచ్చింది అంటే దాని అర్థం, ఈశ్వరుడే జగత్తుగా మారాడు. వాసనలతో ఉన్న జాగ్రద్ పురుషుడే స్వప్న ప్రపంచంగా,

స్వప్నపురుషునిగా వేరే పరికరం అవసరం లేకుండా మారతాడు. అదే విధంగా ఈశ్వరుడే జాగ్రద్ ప్రపంచంగా, జాగ్రద్ పురుషునిగా వేరే పరికరం లేకుండా మారాడు. స్వయం అంటే తానే; ఆత్మానం అంటే తనను. అంటే ఈశ్వరుడు తనను తానే జగత్తుగా మార్చుకున్నాడు. తనను తానే వాడటంలోని ప్రత్యేకత ఏమిటి?

ఆత్మానం – తనను. అంటే తనకు భిన్నంగా వేరే ఏ ఉపాదాన కారణాన్నీ వాడలేదు (జాగ్రద్ పురుషుడు, స్వప్నప్రపంచానికి ఏ ఉపాదాన కారణాన్నీ వాడనట్టుగా).

స్వయం – తానే. అంటే తనే స్వయంగా అయ్యాడు అంటే ఈ మార్పుకు ఏ పరికరాన్నీ వాడలేదు. వడ్రంగి సామాను చేయటానికి పరికరాలు వాడతాడు, కాని ఈశ్వరుడు అలా ఏ పరికరమూ వాడలేదు.

సృష్టికర్త, ముడిసరుకు, పరికరం – మూడూ ఒక్క ఈశ్వరుడే. అదే ఒక కుర్చీ విషయం తీసుకుంటే ఈ మూడు, మూడు భిన్నమైనవి. సృష్టికర్త వడ్రంగి; కారణం (ముడిసరుకు) చెక్క; కరణం (పరికరం) రంపం. కాని జగత్ సృష్టి విషయంలో ఈశ్వరుడే సృష్టికర్త, కారణం, కరణం. అందువల్ల బ్రహ్మకు ఒక పేరు ఇచ్చింది ఉపనిషత్తు.

**తస్మాత్తత్సుకృతముచ్యత ఇతి** – అందువల్ల బ్రహ్మను **సుకృతమ్** అంది. సు అంటే స్వయమ్, కృతమ్ అంటే కర్తా. ఈశ్వరుడే అనేకంగా అయి, ఈ జగత్తును ఆనందించి, మళ్ళీ అవ్యక్తంలోకి వెళ్ళిపోతాడు. ఈశ్వరసృష్టికీ, జాగ్రద్ పురుషుని సృష్టికీ చిన్న భేదం ఉంది. ఏమిటది? ఈశ్వరునికి ఈ జాగ్రద్ ప్రపంచాన్ని తనే సృష్టించాడని తెలుసు, కాని జాగ్రద్ పురుషునికి ఈ స్వప్నప్రపంచాన్ని తనే సృష్టించాడని తెలియక, అందులో బాధలు పడతాడు. ఈ విషయం దక్షిణామూర్తి శ్లోకంలో కూడా ఇంతకుముందే చూశాము. ఈశ్వరుడు, మూడూ తానే కాబట్టి ఆయనకు సుకృతమ్ బిరుదును ఇచ్చింది శాస్త్రం. ఆయనకు బాహ్యంగా వేరే దేని సహాయమూ అవసరం లేదు. ఇతి అంటే ఇక్కడితో ఋగ్మంత్రం అయిందని అర్థం.

### 4. బ్రహ్మ అస్తి సుకృత ప్రసిద్ధే

ఇక్కడ కొన్ని విషయాలను గమనించాలి. బ్రహ్మ సృష్టికర్త అంటే మాయాసహితబ్రహ్మ అని అర్థం. బ్రహ్మ+మాయ=ఈశ్వరుడు అని చూశాము. నిర్గుణబ్రహ్మ కారణమూ కాదు, కార్యమూ కాదు. కార్య, కారణ విలక్షణం బ్రహ్మ. అలాగని మాయను బ్రహ్మకు భిన్నంగా, వేరేగా చూడము. ఎందుకంటే మాయ ఒక శక్తి. శక్తికి విడిగా ఉనికి లేదు. ఒక వ్యక్తిలోని శక్తి, అతనికి భిన్నంగా ఉండదు. నాట్యాచారుడు, అతని శక్తి వచ్చారని అంటామా? ఒక వ్యక్తి గురించి చెప్పేటప్పుడు అతని మాట్లాడేశక్తి, వినేశక్తి, అర్థం చేసుకునే శక్తులను కలిపే చెబుతాము. అలాగే బ్రహ్మ సృష్టికారణం అన్నప్పుడు మాయాసహిత బ్రహ్మ లేదా ఈశ్వరుడు అని అర్థం చేసుకోవాలి.

ఇక్కడ మాయాసహితబ్రహ్మను అసత్ అంది ఉపనిషత్తు. ఈ జగత్తు చైతన్యం+పదార్థం. ఈ పదార్థం అందుబాటులో ఉన్నప్పుడు, దానితో వ్యవహారం నడపగలుగుతాము. అప్పుడు అది సత్ అవుతుంది.

ఈశ్వరుడు = చైతన్యం + పదార్థం = అసత్ / అవ్యక్తదశ
జగత్తు = చైతన్యం + పదార్థం = సత్ / వ్యక్తదశ

**యద్వై తత్సుకృతమ్। రసో వై సః। రసగ్గ్ం హ్యేవాయం లబ్ధ్వా౭౭నందీ భవతి। కోహ్యేవాన్యాత్ కః ప్రాణ్యాత్। యదేష ఆకాశ ఆనందో న స్యాత్। ఏష హ్యేవానందయాతి।**

5. **ఆనంద ప్రదాతా – బ్రహ్మ అస్తి ఆనందరూపేణ**

**యద్వై తత్సుకృతమ్ । రసో వై సః** – ఆ ప్రసిద్ధమైన సుకృతం ఏదైతే ఉందో, అదే నిశ్చయంగా ఆనందం. ఇక్కడ రసం అంటే ఆనందం. ఈ ప్రపంచంలో ఆనందం అనుభవిస్తున్నామంటేనే అది బ్రహ్మ ఉనికికి నిదర్శనం. ఈ విషయాన్ని రెండు దశల్లో వివరించవచ్చు.

**దశ 1** – ఈ దశలో మనుష్యుల ఆనందాన్ని రెండు రకాలుగా విభజిస్తాము. అవి విషయానందం, వైరాగ్యజన్య ఆనందం.

**విషయానందం** – మామూలు మనిషి, అజ్ఞాని, లౌకిక సుఖాలను కోరే వ్యక్తి తనకు ఆనందం బాహ్యవస్తువులలో దొరుకుతుంది అనుకుంటాడు. భార్య, పిల్లలు, ఇల్లు, మంచి ఆహారం, టీవీల్లో ఆనందం వెతుక్కుంటాడు.

**వైరాగ్యజన్య ఆనందం** – అజ్ఞానిపరంగా చూస్తే, జ్ఞాని, ముఖ్యంగా ఈ బాహ్యవస్తువులన్నింటినీ త్యజించిన సన్న్యాసి జ్ఞాని, నిజానికి దుఃఖంలో మునిగిపోవాలి. అతనికి 'నా' అని చెప్పుకునేవారు లేరు; కనీససుఖాలు లేవు. అలాంటి సన్న్యాసులను చూసి చాలామంది జాలిపడతారు కూడా. కాని అలాంటివారి ఆనందం మాటల్లో కొలవలేనిది.

**సురమందిరతరుమూలనివాసః శయ్యా భూతలమజినం వాసః**
**సర్వపరిగ్రహభోగత్యాగః కస్య సుఖం న కరోతి విరాగః** – భజగోవిందమ్

సన్న్యాసి దేవాలయంలో కాని, చెట్టుకింద కాని పడుకుంటాడు. భూమి అతని పక్క , చర్మం అతని దుస్తులు. అన్ని భోగాలను త్యాగం చేశాడు. అటువంటి వైరాగికి ఆనందం ఎందుకు ఉండదు?

ఈ సన్న్యాసి అన్ని భోగాలను, ఇంటిని, బ్యాంకు బ్యాలన్సులను, బంధుత్వాలను వదిలి వేశాడు. అందువల్ల అతని ఆనందం వైరాగ్యజన్య ఆనందం.

ఇటువంటి జ్ఞానికి ఆనందం ఎక్కడ్నుంచి వస్తుంది? అతను విషయానందం జోలికి పోడుకదా, అంటే ఉపనిషత్తు అతను బాహ్యవస్తువుల్లో ఆనందం పొందడు అంటే, అతని

ఆనందం అంతర్గత ఆనందం అంటుంది. దీన్ని పారిశేష్యన్యాయం అంటారు. జ్ఞాని ఆనందంగా ఉన్నాడు, కాని అతని ఆనందం బాహ్యవస్తువుల్లో లేదు అంటే అతని ఆనందం ఆంతరంగం అయివుండాలి. అంటే మళ్ళీ ఏ కాలేయం నుంచో ఆనందం పొందుతాడు అనకూడదు. అతని ఆనందం మూడు శరీరాలకు అతీతంగా ఉంది.

**స్థూల సూక్ష్మకారణ శరీరాత్ వ్యతిరిక్తః**

అటువంటి ఆనందం ఆత్మనుంచి రావాలి. ఆనంద ఆత్మా, బ్రహ్మ పుచ్ఛం ప్రతిష్ఠా అని చూశాము. అందువల్ల, జ్ఞానికి బ్రహ్మ ఉనికి ఆనందస్వరూపంగా తెలుస్తుంది.

**దశ 2** – నిజానికి అజ్ఞానులకు కూడా ఆనందం బ్రహ్మనుంచే వస్తుంది. కాని, వారి అజ్ఞానంవల్ల, వారికి ఆనందం బాహ్యవస్తువులనుంచి వస్తోందనుకుంటారు. అందువల్ల ఆనందాన్ని భార్యలో, పిల్లలలో, ఇంటిలో, సినిమాల్లో వెతుక్కుంటారు. ఇటువంటి మనస్థత్వానికి శాస్త్రం ఒక చక్కటి ఉదాహరణను ఇస్తుంది. దాన్ని కుక్కతర్కం అంటుంది.

కుక్క ఒక ఎముకను కొరుకుతుంది. ఆ ఎముక గట్టిగా, పదునుగా ఉండటంవల్ల కుక్క నోటికి దెబ్బతగిలి, నోట్లోనుంచి రక్తం కారుతుంది. కుక్క దానికి అన్వయ వ్యతిరేక న్యాయాన్ని అన్వయిస్తుంది. అది ఎముకను కొరకకముందు రక్తం రాలేదు; ఎముకను కొరికిన తర్వాతే రక్తం వచ్చింది; అందువల్ల ఎముకే రక్తం రావటానికి కారణం అని నిర్ధారించుకుంటుంది. కుక్క చేసిన ఈ తర్కంనుంచి మనం నవ్వుకుంటాము. ఎందుకంటే, మనకు తెలుసు, కుక్కకు రక్తం ఎముకనుండి రాలేదు అని.

కుక్కకన్నా మనం తెలివైనవారము అనుకుంటాము. కాని మనం ఆ కుక్కకన్నా ఏమీ తీసిపోలేదు అంటుంది వేదాంతం. అది ఎముక కొరకటంవల్ల, దాన్నుంచి రక్తం వచ్చింది అనుకున్నట్టే, మనం కూడా బాహ్యవస్తువులను అనుభవించటంవల్లనే మనకు ఆనందం వస్తున్నది అనుకుంటాము. నిజానికి బాహ్యవస్తువుల్లో సుఖం లవలేశమయినా లేదు. ఈ నిజాన్ని జీర్ణించుకోవటం చాలా కష్టం, కాని వేదాంతం ఇది సత్యం అంటుంది. మనకు అత్యంత ఆత్మీయుడైన వ్యక్తి కూడా ఇసుమంతైనా ఆనందాన్ని ఇవ్వలేదు.

అలా ఎలా చెప్పగలదు అంటే, ఈ చిన్న తర్కాన్ని గమనించండి: ఒక బాహ్యవస్తువులో ఆనందం ఉంటే, అది సమానంగా అందరికీ ఆనందాన్ని ఇవ్వాలి కదా! కాని అలా జరగటం లేదే! పిల్లలకి చెవులు హోరెత్తించే పాప్ మ్యూజిక్ ఇష్టమయితే, తల్లికి వీనులవిందుగా ఉండే లలితసంగీతం ఇష్టం. పిల్లలు ఆ సంగీతం వింటూ, ఎందుకు కేరింతలు కొడుతున్నారో, ఆవిడకు ససేమిరా అర్థంకాదు. అంటే ఒకరికి ఆనందం కలిగించే వస్తువు ఇంకొకరికి ఏమాత్రం ఆనందాన్ని ఇవ్వటంలేదు సరికదా, చిరాకు పుట్టిస్తున్నది. దీన్నిబట్టి

ఏం అర్థమవుతున్నది? ఆనందం మన దృక్పథంలో, మనం చూసే కోణంలో ఉంది కాని, వస్తువులో లేదని తెలుస్తున్నది. మనమే ఆనందానికి కారణం. ఇది తెలియక, మనం మన ఆనందాన్ని ఎదుటి వ్యక్తికి ఆపాదిస్తున్నాము.

ఈ విషయంలో వేదాంతం ఏమంటున్నది? మనకు నచ్చిన బాహ్యవస్తువును చూస్తే, మనస్సు ప్రశాంతతకు లోనవుతుంది. దాన్ని శాంతవృత్తి అంటుంది. బాహ్యవస్తువుమీద మనకు కలిగే ఆనందంలో తారతమ్యాలు ఉన్నాయనీ, వాటిని ప్రియ, మోద, ప్రమోదాలు అంటారనీ చూశాము. ఇలా ప్రశాంతంగా ఉన్న మానసికస్థితిలో, ఈ ఆనందవృత్తులు ఏర్పడితే, కొత్తగా ఆనందం ఏర్పడదు; మన ఆనంద స్వరూపమే వ్యక్తమవుతుంది.

అందువల్ల అజ్ఞానులు కూడా బ్రహ్మానందం లేదా ఆత్మానందాన్నే అనుభవిస్తున్నారు. కుక్కకు తన రక్తాన్ని రుచి చూస్తున్నదని తెలియనట్టుగా, అజ్ఞానులకు తమ ఆనంద స్వరూపాన్నే అనుభవిస్తున్నారని తెలియదు. జ్ఞానికీ, అజ్ఞానికీ మధ్యనున్న భేదం అదే. జ్ఞానికి తను అనుభవించేది ఆత్మానందం అని తెలుసు; అజ్ఞానికి తెలియదు. అతనికి తెలిసినా, తెలియకపోయినా, ఇద్దరు అనుభవిస్తున్నదీ ఆత్మానందమే. ఆత్మానందమే కోశానందంగా ప్రతిబింబిస్తున్నది. అంతే.

ఆత్మే ఆనంద హేతువు, అనాత్మ కాదు అని ఎలా నిరూపించగలరు? దీనికి జవాబు ఛాందోగ్యోపనిషత్తులోని భూమావిద్య అధ్యాయంలో దొరుకుతుంది. ఆనందం ఎప్పుడు కలుగుతుంది? పూర్ణత్వం కలిగినప్పుడు; అంటే కోరిక తీరినప్పుడు. అపూర్ణత్వం ఉంటే దుఃఖం కలుగుతుంది. అందువల్లనే, ఏదో కొరత ఉందనుకునే వ్యక్తి ఎప్పుడూ దుఃఖంలోనే మునిగివుంటాడు.

ఒక ఎక్సిబిషన్‌లో ఒకవ్యక్తి ఒకరోజు ఐదు రూపాయలకు లాటరీ టికెట్టు కొన్నాడు. ఆరోజు 400 రూపాయల విలువ చేసే చేతిగడియారం అతనికి లాటరీలో వచ్చింది. ఆరోజు ఆనందించాడు కాని మర్నాడు మళ్ళీ మొహం వ్రేలాడేసుకుని వచ్చాడు. ఏమయిందని అడిగితే, ఆరోజు లాటరీలో కానుకగా స్కూటర్ ఇచ్చారుట. ఐదు రూపాయలకు వచ్చిన చేతిగడియారం ఆనందాన్ని ఇవ్వలేదు; తనకి రానేరాని స్కూటర్ గురించి వాపోతున్నాడు. నిజానికి తన స్కూటరే పోయినంతగా బాధపడుతున్నాడు.

**అపూర్ణత్వం దుఃఖమ్। పూర్ణత్వమ్ ఆనందః।**

దానివల్ల ఉపనిషత్తు అనంతమే ఆనందం కాని చిన్న విషయాల్లో ఆనందం దొరకదు అంటున్నది. **న అల్పే సుఖమ్ అస్తి.** ఎండమావుల్లో సుఖాన్ని వెతుక్కున్నట్టు అవుతుంది. ఈ నిర్వచనం ప్రకారం చూస్తే బ్రహ్మ అనంతం, పూర్ణం. అందువల్ల బ్రహ్మ అజ్ఞానికి

అయినా సరే, జ్ఞానికి అయినా సరే ఆనందానికి కారణం. జగత్తులోని ఏ వ్యక్తికీ, ఏ వస్తువూ, ఏ పరిస్థితీ కూడా ఆనందాన్ని ఇవ్వలేవు. అందువల్ల ఉపనిషత్తు ఒకటే చెబుతున్నది – మన మొహంలో విరిసిన ప్రతి ఒక్క చిరునవ్వు కూడా అది ఎప్పుడైనా రానీ, బ్రహ్మ ఉనికికి నిదర్శనం.

**బ్రహ్మ అస్తి ఆనంద ప్రసిద్ధే** లేదా
**బ్రహ్మ అస్తి రసప్రసిద్ధే**

యద్వై తత్సుకృతమ్। రసో వై సః – ఋగ్మంత్రంలో సుకృతం బ్రహ్మగా చెప్పబడిన బ్రహ్మే నిశ్చయంగా రసం (ఆనందం). ఆనందమనే రసాన్ని ఇస్తుంది బ్రహ్మ. జ్ఞానంతో బ్రహ్మను మథించినకొద్దీ, అంతకంతకూ ఆనందరసం వస్తుంది.

సత్యం జ్ఞానమనంతం బ్రహ్మ – సత్యం జ్ఞానమనంతం బ్రహ్మే, జ్ఞానం ద్వారా మీ మనస్సులో తెలిస్తే, సత్-చిత్-ఆనందంగా తెలుస్తుంది. సత్యం-సత్, జ్ఞానం-చిత్; అనంతం-ఆనందం.

**రసగ్గ్ం హ్యేవాయం లబ్ధ్వా౽౽ నందీ భవతి** – అయం అంటే ఇక్కడ అర్థం ఈ మనిషి. రసం లబ్ధ్వా అంటే ఆనందరూపం బ్రహ్మ లబ్ధ్వా అని కలుపుకోవాలి. అంటే ఆనందస్వరూపుడైన బ్రహ్మను పొందితే; ఆనందీ భవతి అంటే ఆ ఆనందం అతని మనస్సులో శాంతంగా ప్రతిబింబిస్తుంది. అనువాకం 8లో ఆనందమీమాంస వస్తుంది. అక్కడ ఈ బ్రహ్మానందం గురించి వివరంగా చూస్తాము. ఇప్పుడు బ్రహ్మానందం ప్రశాంతమైన మనస్సులో లేదా కోరికలు లేని మనస్సులో ప్రతిబింబిస్తుంది అని తెలుసుకుంటే చాలు.

అయం అంటే మనిషి అని చూశాము. అది జ్ఞానీ పురుషుడు, అజ్ఞానీ పురుషునికి కూడా వర్తిస్తుంది. కాకపోతే, ముందే చూసినట్టుగా, జ్ఞానీ పురుషునికి తన ఆత్మానందమే ప్రతిబింబిస్తోంది అని తెలిస్తే, అజ్ఞానీ పురుషుడు అది బాహ్యానందం అనుకుంటాడు.

మధ్యలో రెండు వాక్యాలు వదిలేసి, తర్వాత వాక్యాన్ని చూద్దాము.

**ఏష హ్యేవానందయాతి** – ఏష హి ఏవ అంటే ఈ ఆత్మే ఆనందయాతి అంటే ఆనందాన్ని కలిగిస్తున్నది. ఇక్కడ ఏవ పదం అక్షరలక్షలు విలువచేసే పదం. ఏవ అంటే అది మాత్రమే. ఆత్మ మాత్రమే ఆనందాన్ని ఇస్తుంది.

సాధారణంగా వేదాంతాన్ని అధ్యయనం చేసే కొత్తల్లో, రెండు పదాలను పరిచయం చేస్తుంది వేదాంతం. అవి విషయానందం, ఆత్మానందం. విషయానందాన్ని కోశానందం, ప్రతిబింబానందం అనికూడా అంటారు.

ఇప్పుడు నిజానికి విషయానందం అనేది అసలు లేనేలేదు; ఉన్నది ఒకటే ఆనందం, అదే ఆత్మానందం అంటుంది ఉపనిషత్తు. భార్య, పిల్లలు, వస్తువులు ఆనందం కలిగే మానసిక స్థితిని ఏర్పరుస్తారు; అలాంటి ప్రశాంతచిత్తంలో ఆత్మానందం ప్రతిబింబిస్తుంది. కాని వేదాంతం వారెవరూ లేకుండానే ఆత్మానందం కలుగుతుంది అంటుంది. అంటే మీ కుటుంబసభ్యులను వదులుకోమని ఎన్నడూ చెప్పదు వేదాంతం. మీ కుటుంబసభ్యులను మీరు ఆనందపరచండి కాని వారినుంచి మీకు ఆనందం కలుగుతుంది అనుకుంటే మాత్రం మీరు జీవన్ముక్తులు కాదు. ఆనందం మీ స్వరూపం.

5. **బ్రహ్మ అస్తి ఆనందరూపేణ** లేదా

**బ్రహ్మ అస్తి రసరూపేణ సర్వత్ర వర్తమానత్వాత్**

**కోహ్యేవాన్యాత్ కః ప్రాణ్యాత్। యదేష ఆకాశ ఆనందో న స్యాత్।**

మధ్యలో వదిలేసిన వాక్యాలను ఇప్పుడు చూస్తున్నాము.

6. **చైతన్య ప్రదాతా – బ్రహ్మ అస్తి జడ శరీరే చేష్టా దర్శనత్వాత్**

ఈ భౌతిక శరీరం పదార్థంనుంచి తయారుచేయబడింది. సైన్సు ఈ శరీరం అనేక భౌతికాలనుంచి వచ్చిందని నిరూపించింది. శాస్త్రం పంచభూతాలనుంచి ఏర్పడిందని చెబుతుంది. పంచభూతాలు జడం. జడమైన పంచభూతాలనుంచి ఏర్పడిన శరీరం కూడ జడమే అవాలి. కాని మీ అనుభవం, దానికి భిన్నంగా ఉంది. మీ ఎదురుగా ఉన్న బల్ల, మీ శరీరం – రెండూ జడమే అయినా కూడా, వాటి మధ్య భేదం ఉంది. మీ శరీరం చైతన్యవంతంగా ఉంది. అంటే శరీరం, చైతన్యాన్ని ఎక్కడ్నుంచో అరువు తెచ్చుకుందన్న మాట. ప్రకృతిసూత్రం ఇది: చైతన్యతత్త్వం లేకుండా ఒక జడవస్తువు తెలివిగా పనిచేయలేదు.

**చేతన సహాయం వినా అచేతనమ్ న చేష్టతే**

ఆ విధంగా, అన్ని జడవస్తువులూ చేతనతత్త్వం అయిన బ్రహ్మవల్లనే పనిచేస్తున్నాయి.

**శ్రోత్రస్య శ్రోత్రం మనసో మనః చక్షుషః చక్షుః** – కేన

చెవికి చెవి, మనస్సుకు మనస్సు, కన్నుకు కన్నుగా, ఆత్మ వాటి వెనుక ఉండి, వాటికి వాటి శక్తిని ఇస్తున్నది.

అందువల్ల బ్రహ్మ అస్తి అని నిరూపించటానికి ఇంకొక కారణం, జడశరీరానికి చైతన్యం ఇవ్వటమే. నాకు కనబడటంలేదే అంటే బ్రహ్మ అప్రత్యక్షం. ఫ్యాను తనంతట తాను తిరగలేదు; అయినా తిరుగుతోందంటే, దాని వెనుక కనబడని హస్తం ఉందన్నమాట. అదే విద్యుచ్ఛక్తి. అదే విధంగా ఈ శరీరం వెనక కనబడని చేతనతత్త్వం ఉంది.

**స్థూల సూక్ష్మకారణశరీరాద్వ్యతిరిక్తః పంచకోశాతీతః సన్।**
**అవస్థాత్రయ సాక్షీ సచ్చిదానన్దస్వరూపః సన్ యస్తిష్ఠతి స ఆత్మా॥** – తత్త్వబోధ

ఒక్కముక్కలో చెప్పాలంటే, ఆత్మతత్త్వం లేకపోతే, శరీరం క్షీణించిపోతుంది అని ఉపనిషత్తు ఘోషిస్తున్నది. ఇప్పుడు వెనక్కి వెళదాము.

**యదేష ఆకాశ ఆనందో న స్యాత్** – ఒకవేళ ఈ ఆనందతత్త్వమ్ (బ్రహ్మతత్త్వమ్) ఆకాశంలో లేకపోతే. ఆకాశం అంటే హృదయాకాశంలో లేకపోతే,

**కోహ్యేవాన్యాత్కః ప్రాణ్యాత్** – ఎవరు ఉచ్ఛ్వాసన చేస్తారు? ఎవరు నిశ్వాసను చేస్తారు?

ముందు భాగంలో బ్రహ్మను ఆనందస్వరూపం అంది ఉపనిషత్తు. అందువల్ల ఇప్పుడు బ్రహ్మ పదం బదులు ఆనందః పదం వేసింది. ఆనందస్వరూప బ్రహ్మ. బ్రహ్మ సర్వవ్యాపకమైనా కూడా, పరమాత్మ హృదయగృహంలో అందుబాటులో ఉన్నాడు.

**యో వేద నిహితం గుహాయామ్ పరమే వ్యోమన్**

ఆత్మ గనుక లేకపోయినట్టయితే, ఎవరూ శ్వాసక్రియను జరపలేరు. అంటే అసలు చైతన్యమే ఉండదు. అందువల్ల చైతన్యస్వరూపమే పరమాత్మ ఉనికికి నిదర్శనం. బ్రహ్మను అర్థం చేసుకోకుండా, జీవితాన్ని అర్థం చేసుకోలేము. అందువల్లనే చావు, పుట్టుకలను సైన్సు ఇంకా నిర్వచించలేకున్నది. వేదాంతశాస్త్రంలోనే బ్రహ్మకు సమాధానం దొరుకుతుంది. జడశరీరంలో చేష్టలు అవటమే బ్రహ్మ ఉనికికి నిదర్శనం.

**ఉత్క్రామంతం స్థితం వాఽపి భుంజానం వా గుణాన్వితమ్ ।**
**విమూఢా నానుపశ్యంతి పశ్యంతి జ్ఞానచక్షుషః ॥** – గీత 15.10

మూఢుడు ఈ శరీరంనుంచి వెళ్ళే పరమాత్మను, ఈ శరీరంలో ఉండే పరమాత్మను, విషయవస్తువులను అనుభవించే పరమాత్మను, గుణాలున్న పరమాత్మను అర్థం చేసుకోలేడు. జ్ఞాని మాత్రమే అర్థం చేసుకోగలడు.

ఒక ఫ్యాను తిరుగుతున్నదంటేనే, దాని వెనక విద్యుచ్ఛక్తి ఉన్నట్టు అర్థం; అలాగే ఒక వ్యక్తి చేష్టలు చేస్తున్నాడంటేనే, అతనిలో బ్రహ్మ ఉన్నట్టు అర్థం. అందువల్ల అచేతన శరీరానికి చైతన్యం ఇవ్వటం ద్వారా బ్రహ్మ ఉనికి తెలుస్తున్నది.

6. **బ్రహ్మ అస్తి జడ శరీరే చేష్టా దర్శనతత్వే**

**యదా హ్యేవైష ఏతస్మిన్నదృశ్యేఽనాత్మ్యేఽనిరుక్తేఽనిలయనేఽభయం ప్రతిష్ఠాం విన్దతే। అథ సోఽభయం గతో భవతి। యదా హ్యేవైష ఏతస్మిన్నుదరమన్తరం కురుతే। అథ తస్య భయం భవతి। తత్త్వేవ భయం విదుషోఽమన్వానస్య। తదప్యేష శ్లోకో భవతి।**

### 7. భయ–అభయ ప్రదాతా – బ్రహ్మ అస్తి భయ–అభయ హేతుత్వాత్

ఈ మంత్రభాగంలో అహం బ్రహ్మ అస్మి జ్ఞానం పొందితేనే, అభద్రతాభావన పోతుంది అని ఉపనిషత్తు ఘోషిస్తున్నది. సంసారంయొక్క ప్రాథమిక నిర్వచనం అభద్రతాభావన. ఒక అజ్ఞానికి ఆ భావన తంబూరా శ్రుతిలా ఎప్పుడూ వెన్నంటుతూనే ఉంటుంది. తల్లిగర్భంనుంచి బయట ప్రపంచంలోకి వచ్చిన క్షణంనుంచే ఈ అభద్రతా భావన వెన్నంటుతుంది. అందువల్లనే చిన్నారి బాబు తల్లి కొంగుచాటు బిడ్డగా పెరుగుతాడు. తల్లికాక వేరే ఎవరు ఎత్తుకున్నా కూడా అతనికి తెలిసిపోతుంది.

ఈ అభద్రతాభావన ఉంటే, చేసే ప్రతి పనిలోనూ అది కనబడుతుంది. నిజానికి ఆ పని మామూలు పనిగా ఉండదు, ఒక పోరాటంలా ఉంటుంది. అదే భద్రతాభావనతో పని చేస్తే, తేలిగ్గా లేదా ఒక ఆటలా ఉంటుంది. భద్రతాభావనలు ఆనందంగా ఆడే ఆటగా పని చేస్తే, అభద్రతాభావనలో పోరాటం చేసే పనిలా ఉంటుంది. నిజానికి, మన పనులన్నీ కూడా ఈ అభద్రతాభావనకు ప్రతీకలుగా నిలుస్తాయి. పిల్లలుగా ఉంటే పెద్దవారినుంచి రక్షణ కోరుతాము; అదే పెద్దవాళ్ళం అయితే, మన పిల్లలనుంచి మనం రక్షణ కోరుతాము.

చాలా ఇళ్ళల్లో అత్తా–కోడళ్ళ మధ్య పోరాటాలకు ముఖ్యకారణం ఈ అభద్రతాభావనే. పెళ్ళి అవగానే అబ్బాయి మారిపోయాడు, భార్య కొంగు పుచ్చుకుని తిరుగుతున్నాడు అని కోడలుమీద నిందలు వేస్తారు. ఒక కోడలు చెబుతుంది, 'మా అత్తగారు అంతవరకూ హాలులోనే కూర్చుంటుంది. కాని వాళ్ళబ్బాయి కారు హారను వినగానే, ఏదో పని ఉన్నట్టుగా లేచి లోపలిగదిలోకి వెళ్ళిపోతుంది. వాళ్ళబ్బాయి, అమ్మ ఏదీ అని వెతుక్కుంటూ లోపలికి వస్తాడో లేదో అని ఆయనకు, తల్లి పెట్టే చిన్న పరీక్ష అన్నమాట అది. ఏ కారణంవల్లనైనా ఆయన హాల్లోనే నాతో మాట్లాడుతూ కూర్చుండిపోయారో, ఆరోజు ఇంట్లో పెద్ద గొడవే.'

ఆ అత్తగారు అన్వయ వ్యతిరేక న్యాయం పాటిస్తోందన్నమాట. కొడుకు తనను వెతుక్కుంటూ లోపలికి వస్తే తనంటే ప్రేమ ఉన్నట్టు, రాకపోతే ప్రేమ లేనట్టు ఆవిడ తర్కం. ఏం కోడలితో ఆవిడ కూడా హాలులోనే కూర్చుంటే, అబ్బాయి చక్కగా ఇద్దరితోనూ ప్రశాంతంగా కబుర్లు చెప్పవచ్చుకదా! అతన్ని రెండుగా చీల్చటం ఎందుకు? ఇదంతా అభద్రతాభావననుంచి వచ్చినదే!

ఇది అంత తేలికగా పోదు. ఎందుకంటే జీవితంలో ఏదీ శాశ్వతం కాదు. ఈ రోజు ఉన్నది రేపు ఉంటుందని ఖచ్చితంగా చెప్పలేము. అలా రేపు ఉంటుందో ఉండదో అనే భయం లేనిది అనంతమైన బ్రహ్మ గురించి మాత్రమే అని చెప్పగలము. పరమాత్మ నన్ను విడిచి ఎన్నడూ పోలేదు. ఎందుకంటే నేనే ఆ పరమాత్మను కాబట్టి. నానుంచి నేను ఎలా విడిపోతాను?

**యదా హ్యే వైష** – ఎప్పుడైతే ఈ మనిషి

**ఏతస్మిన్నదృశ్యేఽ నాత్మ్యేఽ నిరుక్తేఽ నిలయనే** – ఈ బ్రహ్మస్వరూపంలో నెలకొని ఉంటాడో, అప్పుడే

**అభయం ప్రతిష్ఠాం విందతే** – అతను అభయం పొందుతాడు. అటువంటి వ్యక్తికి ఏమాత్రం అభద్రతాభావన ఉండదు. అతను కుటుంబసభ్యులతో కలిసివుంటాడు కాని, వారినుంచి భద్రతను కోరటానికి కాదు, తానే వారికి భద్రతను ఇవ్వటానికి.

బ్రహ్మజ్ఞానం ఒక్కటే అభద్రతాభావనను పోగొడుతుంది. అది అభయకారణం అవుతుంది. అది ఎటువంటి బ్రహ్మజ్ఞానమై ఉండాలి? బ్రహ్మ అభయప్రదాతా అని తెలుసుకుంటే చాలదు, అది పూర్తి జ్ఞానాన్ని ఇవ్వదు. టాటానో, బిర్లానో అత్యంత ధనవంతులు అని నేర్చుకుంటే నా బీదరికం పోతుందా? నాకున్న ధనాన్ని నేను పొందితేనే పోతుంది. అలాగే బ్రహ్మ అభయప్రదాతా అంటే నాకు భయం పోదు; ఆ బ్రహ్మను నేనే అనే జ్ఞానం పొందితేనే, నా జ్ఞానం సంపూర్ణమవుతుంది. ఏ విషయంలో అజ్ఞానం ఉంటే, ఆ విషయంలో అజ్ఞానం పోవాలి. ఈ గదిలో చీకటి ఉంటే, ఈ గదిలో లైటు వేస్తేనే ఈ గదిలో చీకటి పోతుంది.

అలాగే బ్రహ్మ అభయప్రదాతా అంటే నా భయం అలాగే ఉంటుంది. ఆ బ్రహ్మను నేనే అనే జ్ఞానం పొందితేనే, అంటే అభద్రతాభావనను పారద్రోలే జ్ఞానం పొందితేనే, నాకు భద్రత కలుగుతుంది. అంటే నాకు అహం బ్రహ్మ అస్మి జ్ఞానం కలగాలి. ఏ=బి, బి=సి అయితే ఏ=సి అవుతుంది. అదే సూత్రం ప్రకారం బ్రహ్మజ్ఞానాన్ని మూడు దశల్లో పొందాలి.

**నేను బ్రహ్మను; బ్రహ్మ అభయప్రదాత; అందువల్ల నేను అభయప్రదాతను**

ఈ అద్వైతజ్ఞానం లేకపోతే, అభద్రతాభావన పోనేపోదు.

**అద్వైతజ్ఞానం వినా భయనివృత్తిః న భవతి**

ఎటువంటి బ్రహ్మ?

అదృశ్యే – కంటికి కనబడని బ్రహ్మ. కంటికి కనబడని అంటే ఆబ్జెక్టుగా కనబడని బ్రహ్మ. ఆబ్జెక్టుగా కనబడని బ్రహ్మ ఒక్క రూపంలోనే ఉండగలదు. అది సబ్జెక్టు అయిన నేనుగా.

**అదృశ్యే బ్రహ్మణి దృక్ స్వరూప బ్రహ్మన్**

చూసే సబ్జెక్టు నేను దృక్, చూడబడే ఆబ్జెక్టు దృశ్యం; అదృశ్యం అంటే బ్రహ్మ దృశ్యం కాదు; చూసే దృక్. ఎందుకు అదృశ్యం?

అనాత్మ్యే – రూపం లేదు కాబట్టి. అనాత్మ్యం అంటే రూపరహితం.

అనిరుక్తే – నిర్వచనానికి అందదు. వాక్కుకి అందదు. వాచామగోచరమ్. ఎందుకు వాక్కుకు అందదు? బ్రహ్మ దృశ్యం అయి, దానికి గుణాలు ఉంటేనే, ఆ వస్తువును వర్ణించవచ్చు. కాని బ్రహ్మ నిర్గుణబ్రహ్మ; గుణాలు లేవు.

అనిలయనే – దేనికీ ఆధారం కాదు. నిలయనమ్ అంటే ఆధారం. అనిలయనం అంటే ఆధారం కాదు. అంటే ఈ పదం ద్వారా ద్వైతాన్ని త్రోసిపుచ్చుతున్నది ఉపనిషత్తు. బ్రహ్మ ఆధారం అంటే, దానిమీద ఆధారపడిన ఆధేయం ఒకటి ఉండాలి. అంటే ద్వైతం రావాలి. కాని అద్వైతంలో ఈ భేదభావన లేదు.

**ఆధార ఆధేయ భేదరహితే బ్రహ్మణి**

ఇక్కడ ఒక విషయాన్ని గమనించాలి. వేదాంతబోధ దశలవారీగా ఉంటుంది. వేదాంతం ప్రాథమిక బోధలో బ్రహ్మను కారణంగానూ, జగత్తును కార్యంగాను వర్ణిస్తుంది. అలాగే బ్రహ్మను విశ్వాధారంగాను, జగత్తును ఆధేయంగాను వివరిస్తుంది. వీటివల్ల ద్వైతభావన వస్తుంది. ఒక సంబంధాన్ని సూచించే పదం వాడినప్పుడల్లా రెండు వస్తువులు ఉన్నట్టు అర్థం వస్తుంది. ఒక వ్యక్తిని తండ్రి అంటే, అతనికొక పుత్రుడు ఉన్నాడని అర్థం వస్తుంది. అలాగే బ్రహ్మను కారణం అంటే, ఒక కార్యం ఉందని అర్థం వస్తుంది. బ్రహ్మను దృక్ అంటే అది చూసే దృశ్యం ఒకటి ఉందని అర్థం వస్తుంది. అలాంటి ద్వైతభావనను పారద్రోలటానికే అనిలయనే అనే పదం వేసింది ఉపనిషత్తు.

**ఆధార ఆధేయ ద్వైత విలక్షణమ్ అద్వైతమ్**

మాండ్యూకోపనిషత్తులో గౌడపాదాచార్యులవారు తన కారికల్లో ఇంకా పైమెట్టుకు తీసుకువెళ్ళిపోతారు. అద్వైతం స్థాయికి వెళితే అద్వైతం పదం కూడా వాడలేము అంటారు. ఎందుకంటే అద్వైతం అంటే ద్వైతం కాదు అని అర్థం వస్తుంది. అందువల్ల ఈ జంట పదాలేవీ అక్కడ వాడలేము. సత్యం–మిథ్యా; దృక్–దృశ్యం; చైతన్యం–జడం; అద్వైతం–ద్వైతం. మరేం వాడాలి అంటే మౌనవాఖ్యానమ్. ఇటువంటి అద్వైతబ్రహ్మలో నెలకొనివుండాలి.

ఇతి విందతే – జ్ఞానం ద్వారా నెలకొనివుండాలి. ఏమిటా జ్ఞానం? ఆ బ్రహ్మను నేనే అనే జ్ఞానం.

**అదృశ్యం బ్రహ్మ అహమ్ అస్మి**
**అనాత్మ్యం బ్రహ్మ అహమ్ అస్మి**
**అనిరుక్తం బ్రహ్మ అహమ్ అస్మి**
**అనిలయం బ్రహ్మ అహమ్ అస్మి**

ఈ జ్ఞానం పొందితే కలిగే ఫలమేమిటి?

**అథ సోఽభయం గతో భవతి** – అథ అంటే అప్పుడు, ఈ జ్ఞానం పొందాక; సః అంటే జ్ఞాని; అభయం గతః భవతి అంటే అభయం పొందుతాడు.

మనం పుడుతూనే ఈ ప్రపంచంమీద ఆధారపడతాము – కుటుంబసభ్యులు, స్నేహితులు, పదవి, ఆస్తిపాస్తులు. తర్వాత శాస్త్రం ఈ ప్రపంచంమీద ఆధారపడే స్థాయినుంచి భగవంతునిమీద

ఆధారపడే స్థాయికి ఎదగమంటుంది. భగవద్గీతలో కృష్ణపరమాత్మ ఈ విషయాన్ని పదేపదే చెబుతాడు. నాశనమయే ఏ వస్తువుమీదా ఆధారపడవద్దని అంటాడు. ఆ భగవంతుడు ఎక్కడ ఉన్నాడు? ఎక్కడో దూరంగా లేడు, సాక్షాత్తూ మీ హృదయంలోనే ఉన్నాడు.

**యో వేద నిహితం గుహాయామ్** – తర్వాత దశ అహం బ్రహ్మ అస్మి. ఆ భగవంతుడు నేనే అని అర్థం చేసుకుంటే, భగవంతునిమీద ఆధారపడే దశనుంచి మీమీదే ఆధారపడే స్థితికి చేరుకుంటారు. ప్రపంచంమీద ఆధారపడే స్థాయి పోయి, నానుంచే ఈ ప్రపంచం వచ్చింది అనే స్థాయికి రావాలి.

**మయ్యేవ సకలం జాతం। మయి సర్వం ప్రతిష్ఠితమ్**

ఒక అల తానొక చిన్న అల అనుకుంటే, దానికి ఆధారం సముద్రం. కాని అదే అల నేను నీరు అని అర్థం చేసుకుంటే, నీటిగా అలే అంత పెద్ద సముద్రానికి అధిష్ఠానం. ఎందుకంటే, నీరు లేకుండా సముద్రానికి ఉనికే లేదు. ఎంత అద్భుతమో చూడండి! దృక్పథంలో ఎంత పెద్ద మార్పో చూడండి! ఒక చిన్న అల, అంత పెద్ద సముద్రానికి అధిష్ఠానం (నీటిగా)! ఈ అంశంమీద లోతుగా విచారణ చేయండి!

ఇంతకుముందే చూశాము, సంసారంలో ప్రాథమిక సమస్య భయం. అది తంబూరా శ్రుతిలాగా భావోద్రేకాల వెనక ఉండి, మనిషిని కుదిపివేస్తూ ఉంటుంది. ఈ భయమనే తంబూరాశ్రుతివల్లనే విద్యాబుద్ధులు నేర్చుకోవాలి, మంచి విద్య పొందాలి; పెద్ద ఉద్యోగం చేయాలి; ఆస్తి అమర్చుకోవాలి అనుకుంటూ, ఒకదాని వెంట ఇంకొకటి అమర్చుకుంటూ పోతారు. పిల్లలు కూడా ఈ ప్రణాళికలో ఒక భాగమే. పిల్లలు ఉంటే వృద్ధాప్యంలో వారి నీడలో జీవితం చీకూచింతా లేకుండా సాగిపోతుందనే ఆశాకిరణం ఉంటుంది. ఎప్పుడైతే ఆత్మజ్ఞానం పొందుతారో, సంసారంయొక్క ప్రాథమిక సమస్య అయిన భయం మటుమాయ మవుతుంది.

అహం బ్రహ్మ అస్మి జ్ఞానం కేవలం బుద్ధికి సంబంధించినది, దానివల్ల లాభం లేదు అనుకునే వారి పరిస్థితి ఏమిటి?

**యదా హ్యేవైష ఏతస్మిన్నుదరమంతరం కురుతే** – ఒకవేళ అజ్ఞాని తనకు, బ్రహ్మకు కాస్త భేదం చూసినా కూడా అతనికి సమస్యే.

జీవ–ఈశ్వర భేదం చూస్తే జీవ–జగత్తు భేదం; జీవ–జీవ భేదం కూడా చూసినట్టు అర్థం. ఉదరమ్ పదాన్ని ఉద+అరమ్‌గా విడదీయాలి. అరమ్ అంటే అల్పం; ఉద్ అంటే అపి; ఉదరమ్ అంటే చాలా స్వల్పమైన భేదం చూసిన కూడా (ఇది నిఘంటువు అర్థం కాదు). కొంచెం భేదం చూసిన కూడా అంటే ఏమిటి?

ఇది రెండు సిద్ధాంతాలను సూచిస్తుంది:

- నేను పరమాత్మకు పూర్తిగా భిన్నం – మహాభేద ద్వైతమ్
- నేను పరమాత్మకు పూర్తిగా భిన్నం కాదు, కాని పరమాత్మలో ఒక భాగాన్ని – అల్పభేదమ్ – విశిష్టాద్వైతమ్

**అథ తస్య భయం భవతి** – ఉపనిషత్తు హడలగొడుతున్నది. పరమాత్మకూ, మీకూ ఏ కాస్త భేదం చూసినా కూడా, మీకు భయమే మిగులుతుంది. భగవంతుణ్ణి మీకు భిన్నంగా మీరు చూస్తే, భగవంతుడు కూడా భీతి కొల్పుతాడు. రుద్రమే ఆ భావనతో మొదలవుతుంది:

**నమస్తే రుద్ర మన్యవ ఉతో త ఇషవే నమః**

ఓ దేవా! నీ కోపానికి మేము నమస్కరిస్తున్నాము.

ఈ నమస్కారం కూడా భయంతో కూడినది. ఇషః అంటే పదునైన బాణం. బాణానికి నమస్కారం అంటున్నాడు భక్తుడు. ఈ మొదటి అనువాకం మొత్తం ఈ బాణానికి ప్రార్థన. ఓ బాణమా నన్ను నాశనం చేయకు అని అర్థం.

భగవంతుణ్ణి చూసి భయపడటమేమిటి? ఆయన సృష్టి–స్థితి కారకుడు కదా అనుకోవచ్చు మీరు. భగవంతుడు సృష్టి–స్థితి కారకుడు మాత్రమే కాదు, లయకారకుడు కూడా అంటుంది శాస్త్రం. అందువల్ల మీరు ద్వైతప్రపంచంలో ఉన్నంతవరకూ భగవంతుడు సృష్టికర్త, స్థితికర్త మాత్రమే కాదు, లయకర్త కూడా.

**శ్రీభగవాన్ ఉవాచ**

**కాలోఽస్మి లోకక్షయకృత్ ప్రవృద్ధో లోకాన్ సమాహర్తుమిహ ప్రవృత్తః ।**
**ఋతేఽపి త్వాం న భవిష్యంతి సర్వే యేఽవస్థితాః ప్రత్యనీకేషు యోధాః ॥** – గీత 11.32

నేను మహత్తరమైన కాలతత్త్వాన్ని. నేను ప్రపంచాన్ని నాశనం చేస్తాను. ఇక్కడ చేరిన యోధులందరూ మరణిస్తారు, నీ ప్రమేయం లేకపోయినా కూడా అంటున్నాడు కృష్ణపరమాత్మ.

అర్జునుడే ముందు నోరు తెరచి అడిగాడు – కృష్ణపరమాత్మను విశ్వరూపదర్శనం చూపించమని. తీరా కృష్ణపరమాత్మ చూపించాక, భయవంతుణ్ణి లయకారణంగా చూసేసరికి భయపడిపోయాడు. విశ్వరూపదర్శనంనుంచి శాంతించమని కోరాడు. అందువల్ల భగవంతుణ్ణి, మీకు భిన్నంగా చూస్తే, భగవంతుడు కూడా భయకారణం అవుతాడు. అహం బ్రహ్మ అస్మి జ్ఞానం మాత్రమే ఈ భయాన్ని పోగొడుతుంది. అద్వైత వేదాంతం ఈ విషయాన్ని చాలా స్పష్టంగా బోధిస్తుంది. ఈ విషయాన్ని ఒప్పుకోకపోతే, వేదాంతం బలవంత పెట్టదు, సరే ద్వైతాన్ని ప్రయత్నించి చూడండి అంటుంది. అంటే అందులోని అంతర్లీన సందేశం, ద్వైతానికి వెళ్ళినా కూడా చివరికి అద్వైతానికి రాకతప్పదు. ఎవరో అద్భుతంగా చెప్పారు, 'విద్య

పొందటం ఖరీదైనది అనేటట్టయితే, సరే అజ్ఞానాన్ని ప్రయత్నించి చూడండి.' అంటే అజ్ఞానానికి ఇంకా ఎక్కువ రుసుం చెల్లించాల్సి ఉంటుంది అని దాని అర్థం.

**మృత్యోస్స మృత్యుం గచ్ఛతి, య ఇహ నానేవ పశ్యతి** – కఠ 2.1.11

ఎవరైతే ఇక్కడ ద్వైతాన్ని చూస్తారో, వారు మృత్యువునుంచి మృత్యువుకు ప్రయాణిస్తూ ఉంటారు. అంటే పునరపి జననం, పునరపి మరణం పొందుతూనే ఉంటారు.

**తత్త్వేవ భయమ్** – అజ్ఞానికి, అదే బ్రహ్మ భయహేతువు కూడా. ఎంత గొప్ప పరిశీలన! జ్ఞానికి బ్రహ్మ అభయప్రదాతా అయితే, అజ్ఞానికి అదే బ్రహ్మ భయహేతువు. ఎలా?

దీనికి ప్రఖ్యాతి చెందిన తాడు–పాము ఉదాహరణ చూద్దాము. తాడు స్పష్టంగా కనిపిస్తే అది భయహేతువు కాదు. అది పాపం జడవస్తువు; ఏమీ హాని చేయలేదు. అందువల్ల తెలిసిన తాడు భయహేతువు కాదు. అదే తాడు తెలియకపోతే, దాన్ని పాముగా పొరపాటు పడి, భయపడతారు. అంటే అజ్ఞానం పొరపాటుకు దారితీస్తుంది. వేదాంతం 'పాము' పదానికి బదులుగా 'తెలియని తాడు' పదం వేసింది. అప్పుడు –

**పాము = పొరపాటు పడిన తాడు = తెలియని తాడు = భయహేతువు**

అదే విధంగా తెలిసిన బ్రహ్మ అద్వైతం, ఆ బ్రహ్మవల్ల ఏమీ భయంలేదు. అది పూర్ణం, అభయం – అందువల్ల భయానికి ఆస్కారం లేదు. కాని బ్రహ్మను ద్వైత బ్రహ్మగా పొరపాటు పడి, భయపడతారు. ద్వైతబ్రహ్మ అంటే జీవ, జగత్తు, ఈశ్వరునిగా చూస్తున్నారు. మీరు ప్రపంచం అంటున్నదాన్ని, వేదాంతం బ్రహ్మను చూసి ప్రపంచంగా పొరపాటు పడుతున్నారు అంటున్నది. ఈ పొరపాటువల్ల ప్రపంచం మిమ్మల్ని బాధిస్తున్నదని భయపడుతున్నారు. అందువల్ల అజ్ఞానికి, అజ్ఞాతం బ్రహ్మ భయహేతువు.

**విదుషః** – అజ్ఞానిని ఉపనిషత్తు విదుషః అంటున్నది. ఇది అయోమయానికి దారితీస్తుంది. విదుషః అసలు అర్థం చూస్తే, పండితుడు. కాని ఉపనిషత్తేమో అజ్ఞానిని విదుషః అంటున్నది. శాస్త్రం తప్పు చెప్పదు. మరి దీన్ని ఎలా అర్థం చేసుకోవాలి? దీనికి మూడు విధాలుగా అర్థం చెప్పవచ్చు:

– విపరీత లక్షణంగా తీసుకోవచ్చు. మనం దైనందిన జీవితంలో కూడా వెర్రివాడిని, వ్యంగ్యంగా అతను బృహస్పతి అంటాము; బృహస్పతి నిజానికి చాలా తెలివైన వ్యక్తి, దేవతలకే గురువు. అలా ఇక్కడ కూడా వ్యంగ్యంగా అంది ఉపనిషత్తు అనవచ్చు.

– విదుషః అంటే తక్కిన విద్యల్లో పండితుడు కాని, వైదికశాస్త్రంలో కాదు. దీనిమీద ఒక కథ కూడా ఉంది.

ఒక పండితుడు ఒక పడవలో నది దాటుతున్నాడు. ఆ పండితుడు నెమ్మదిగా సారంగితో సంభాషణలోకి దిగాడు. 'నీకు సంస్కృతం వచ్చా?' అన్నాడు. రాదని సారంగి చెప్పగానే, 'నీ జీవితంలో నాలుగవ వంతు వృథా అయిపోయింది. పోనీ, నీకు పాణినీ వ్యాకరణం వచ్చా?' అన్నాడు. అదీ రాదంటే, 'అయితే, నీ సగం జీవితం వృథా. పోనీ మీమాంస శాస్త్రం వచ్చా?' దానికీ ఒకటే జవాబు. 'అయితే నీ జీవితంలో ముప్పాతికభాగం వృథా,' అన్నాడు. మరికొంత దూరం వెళ్ళేసరికి, పడవలో చిల్లుపడి, అందులోకి నీరు రాసాగింది. పడవ ముందుకు వెళ్ళే మార్గమేమీ కనబడలేదు ఆ సారంగికి. అప్పుడతను ఆ పండితుణ్ణి ఎదురు ప్రశ్నించాడు. 'మీకు తరణవిద్య వచ్చా?' అంటే ఏమిటన్నాడు పండితుడు. 'ఈత వచ్చా?' రాదన్నాడు పండితుడు. 'అయితే మీ మొత్తం జీవితమే వృథా,' అనేసి నీటిలోకి దూకేశాడు సారంగి. ఆ విధంగా మీకు ఎన్నో విద్యలు వచ్చినా, అది సంసారసాగరాన్ని దాటే తరణవిద్య కాకపోతే ఆ విద్యలు వృథా. సంసారసాగరాన్ని దాటే తరణవిద్య బ్రహ్మవిద్య.

– ఈ వ్యక్తి బ్రహ్మవిద్య కూడా నేర్చుకున్నాడు కాని దానిమీద శ్రద్ధ పెట్టుకోలేదు. అంటే శ్రవణంలో జ్ఞానం పొందాడు కాని, దాన్ని నిశ్చయజ్ఞానంగా మలుచుకోవటానికి అవసరమైన మననం చేయలేదు. సంశయజ్ఞానం ఉన్నా లేనట్టే అర్థం.

**అమన్వానస్య** – అంటే మననం చేసి, నిశ్చయజ్ఞానం పెంపొందించుకోలేదు. కుటుంబంలో ఏదైనా క్లిష్టపరిస్థితి ఎదురైనప్పుడు, తను పొందిన ఈ జ్ఞానాన్ని ఎలా వినియోగించుకోవాలో తెలియదు. ఒక దిగాలు మొహం వేసుకుని, 'ఉపనిషత్తేమో నేను ఆనందస్వరూపుణ్ణి అంటున్నది, కాని నాకు దుఃఖమే మిగిలింది,' అంటాడు. అంటే అతను ప్రజ్ఞ పొందాడు కాని స్థితప్రజ్ఞుడు కాలేదు. అటువంటి వ్యక్తికి బ్రహ్మ భయహేతువుగానే ఉంటాడు.

ఈ విధంగా, బ్రహ్మ ఇటు భయహేతువు, అభయహేతువు కూడా అంటున్నది ఉపనిషత్తు. రెండూ గమనిస్తాము. జ్ఞానులు అభయప్రదాతగా చూస్తారు బ్రహ్మను. వారికేమీ లేకపోవచ్చు జీవితంలో, కాని ఆనందంగా ఉంటారు. ఈ భావాన్ని శంకరాచార్యులవారు అద్భుతంగా వివరిస్తారు కౌపీనపంచకంలో.

> **మూలం తరోః కేవలమాశ్రయంతః**
> **పాణిద్వయం భోక్తుమమంత్రయంతః**
> **కన్థామివ శ్రీమపి కుత్సయంతః**
> **కౌపీనవంతః ఖలు భాగ్యవంతః** – కౌపీన పంచకమ్ 2

నీడకోసం చెట్టుకింద కూర్చుని, తను తినే కాస్త భోజనం అరచేతుల్లోంచి తిని, చిరిగిన తన వస్త్రమే ఆస్తిగా భావించే, కౌపీనవస్త్రాన్ని ధరించే సాధువు ఎంతో భాగ్యవంతుడు

అంటున్నారు శంకరాచార్యులవారు. అందువల్ల భయం, అభయం రెండింటికీ హేతువు బ్రహ్మే. బ్రహ్మ భయ–అభయ హేతువుగా ఉంది.

7. బ్రహ్మ అస్తి భయ అభయ హేతుత్వాత్

ఈ విధంగా బ్రహ్మ ఉందా లేదా అని అడగని పరోక్షప్రశ్నకు ఏడు ప్రత్యక్ష జవాబులు ఇచ్చింది ఉపనిషత్తు.

**తదప్యేష శ్లోకో భవతి** – బ్రహ్మ భయ అభయహేతువు అని నిరూపించటానికి ఋగ్మంత్రం ఉంది అంటున్నది ఉపనిషత్తు.

### అనువాకం – 8

**భీషాఽస్మాద్వాతః పవతే। భీషోదేతి సూర్యః। భీషాఽస్మాదగ్నిశ్చేంద్రశ్చ। మృత్యుర్ధావతి పంచమ ఇతి। సైషాఽఽనందస్య మీమాగ్ంసా భవతి। యువా స్యాత్సాధుయువాఽధ్యాయకః। ఆశిష్ఠో దృఢిష్ఠో బలిష్ఠః। తస్యేయం పృథివీ సర్వా విత్తస్య పూర్ణా స్యాత్। స ఏకో మానుష ఆనందః। తే యే శతం మానుషా ఆనందాః । స ఏకో మనుష్యగంధర్వాణామానందః । శ్రోత్రియస్య చాకామహతస్య।**

**తే యే శతం మనుష్యగంధర్వాణామానందాః । స ఏకో దేవగంధర్వాణామానందః శ్రోత్రియస్య చాకామహతస్య।**

**తే యే శతం దేవగంధర్వాణామానందాః। స ఏకః పితౄణాం చిరలోక లోకానామానందః। శ్రోత్రియస్య చాకామహతస్య।**

**తే యే శతం పితౄణామ్ చిరలోక లోకానామానందాః । స ఏక అజానజానాం దేవానామానందః। శ్రోత్రియస్య చాకామహతస్య।**

**తే యే శతమాజానజానాం దేవానామానందాః। స ఏకః కర్మదేవానాం దేవానామానందః। యే కర్మణా దేవానపియన్తి। శ్రోత్రియస్య చాకామహతస్య।**

**తే యే శతం కర్మదేవానాం దేవానామానందాః। స ఏకో దేవానామానందః। శ్రోత్రియస్య చాకామహతస్య।**

**తే యే శతం దేవానామానందాః। స ఏక ఇంద్రస్యానందః। శ్రోత్రియస్య చాకామహతస్య।**
**తే యే శతమింద్రస్యానందాః। స ఏకో బృహస్పతేరానందః। శ్రోత్రియస్య చాకామహతస్య।**
**తే యే శతం బృహస్పతేరానందాః। స ఏకః ప్రజాపతేరానందః। శ్రోత్రియస్య చాకామహతస్య।**
**తే యే శతం ప్రజాపతేరానందాః। స ఏకో బ్రహ్మణ ఆనందః। శ్రోత్రియస్య చాకామహతస్య।**
**స యశ్చాయం పురుషే । యశ్చాసావాదిత్యే। స ఏకః స య ఏవంవిత్ । అస్మాల్లోకాత్ప్రేత్య। ఏతమన్నమయమాత్మానముపసంక్రామతి। ఏతం ప్రాణమయమాత్మానముపసంక్రామతి। ఏతం**

**మనోమయమాత్మానముపసంక్రామతి। ఏతం విజ్ఞానమయమాత్మానముపసంక్రామతి। ఏతమానంద మయమాత్మానముపసంక్రామతి । తదప్యేష శ్లోకో భవతి।**

**వివరణ**

**భీషాఽ స్మాద్వాతః పవతే। భీషోదేతి సూర్యః। భీషాఽ స్మాదగ్నిశ్చేంద్రశ్చ। మృత్యుర్ధావతి పంచమ ఇతి।**

ఉపనిషత్తు ఈ ఋగ్మంత్రాన్ని కవితా ధోరణిలో చెబుతున్నది. ఈ ప్రపంచం మొత్తము భగవంతుణ్ణి చూసి భయపడుతున్నదిట. అదికూడా ఎవరు? మామూలు మానవమాత్రులు కాదు; దేవతలు. ఆ దేవతలు కూడా మామూలు దేవతలు కాదు; ప్రకృతి సూత్రాలకు అధిష్ఠాన దేవతలు. వీరు గొప్పగా పూజించదగినవారు, స్వయంగా సర్వసమర్థులు. ఉపనిషత్తు ఈ దేవతలు వారి పనులను బాధ్యతాయుతంగా నెరవేరుస్తున్నారు అంటున్నది. సూర్యుడు క్రమం తప్పకుండా ఉదయించి, అస్తమిస్తున్నాడు; భూమి నిరంతరం తిరుగుతూనే ఉంది; వాయువు వీస్తూనే ఉంది. ఈ విశ్వం అంతా ఒక క్రమపద్ధతిలో సాగుతోంది అంటే అందులో ఉన్న ప్రకృతి సూత్రాలు సరిగ్గా పనిచేస్తున్నాయని అర్థం. ప్రకృతి సూత్రాలు సరిగ్గా పనిచేస్తున్నాయంటే, ఆ ప్రకృతి సూత్రాలకు అధిష్ఠానంగా ఉన్న దేవతలు సరిగ్గా పనిచేస్తున్నారని అర్థం.

ప్రకృతి సూత్రాలకు అధిష్ఠానదేవతలు ఉన్నారని ఎలా చెప్పగలరు? ఎక్కడైతే ఒక క్రమపద్ధతి ఉందో, దానివెనక ఒక తెలివైన సూత్రం ఉంది. దాన్ని నియంత్రించే ఒక నియంత ఉన్నాడని అంటుంది ఉపనిషత్తు. ఎలా చెప్పగలదు? మన లౌకికజీవన విధానమే తీసుకోండి! ట్రాఫిక్ సిగ్నల్సు దగ్గర పోలీసు ఆ దరిదాపుల్లో లేకపోతే, ఎవరూ రెడ్‌లైటు పడినా పట్టించుకోరు. ఒకవేళ ఎవరైనా బుద్ధిగా ఆగినా, వెనకనున్నవారు ఊరుకోరు. హారన్లరొదతో హోరెత్తించేస్తారు. అలా దూసుకెళ్ళకుండా, బుద్ధిగా వాహనాలు ఆగాయీ అంటే, అక్కడ పోలీసు ఉన్నాడని మనం గట్టిగా చెప్పవచ్చు.

అదే విధంగా, ప్రకృతి సూత్రాలు, నియమం తప్పకుండా జరుగుతున్నాయంటే, దాని వెనక అధిష్ఠానదేవతలు, విశ్వం స్థాయిలో పోలీసులు ఉన్నట్టే అర్థం. ఆ దేవతలు కూడా సక్రమంగా పనిచేస్తున్నారంటే, వారందరికీ అధిష్ఠానదేవత అయిన ఈశ్వరుడు ఉన్నాడని అర్థం.

**బ్రహ్మ అస్తి దేవానామపి భయహేతుత్వాత్**

మనకన్నా శక్తివంతమైన దేవతలే, వారి అధిష్ఠానదేవతంటే భయపడుతున్నారు. దానికి కారణాన్ని కూడా కఠోపనిషత్తులో చూస్తాము.

**మహద్భయం వజ్రముద్యతం**

**య ఏతత్ విదుః అమృతా తే భవన్తి** – కఠ 2.3.2

**భయాత్ అస్య అగ్నిః తపతి । భయాత్ తపతి సూర్యః**

**భయాత్ ఇంద్రశ్చ వాయుశ్చ । మృత్యుః ధావతి పంచమః ॥**

ఎత్తిపట్టుకున్న వజ్రాయుధంతో భగవంతుడు తిరుగుతున్నాడు కాబట్టి, భయంతో అగ్ని మండుతున్నది; సూర్యుడు ఉదయిస్తున్నాడు; ఇంద్రుడు, వాయువు వారి పనులు చేస్తున్నారు; ఐదవ దేవతనైన నేను కూడా భయంతో నా పని చేస్తున్నాను అని చెప్పుకున్నాడు మృత్యుదేవత అయిన యమధర్మరాజు. ఇక్కడ వజ్రాయుధం ప్రసక్తి రాకపోయినా, ఇంచుమించు అదే భావనను చూస్తాము.

**భీషాఽస్మాద్వాతః పవతే** – వాతః అంటే వాయుదేవత. ఈశ్వరుని భయంచేతనే గాలి వీస్తున్నది. అంటే ఈ దేవతలు కూడా ద్వైతంలోనే ఉన్నారు. ఎత్తిపట్టిన వజ్రాయుధంతో నిరంతరం వారిని గమనిస్తున్న ఈశ్వరుడంటే భయపడుతున్నారు. పవతే అంటే కదులుతున్నారు. భీషా అంటే భయంవల్ల. అంటే భయంవల్లనే వాయుదేవత కదలకుండా ఎన్నడూ నిశ్చలంగా లేదు. వాయుదేవత పని చేస్తున్నట్టు ఏమిటి నిదర్శనం? మనం శ్వాస పీల్చగలుగుతున్నాము.

**భీషోదేతి సూర్యః** – సూర్యుని స్వధర్మం ఉదయించటం, అస్తమించటం. సూర్యుడు తన స్వధర్మాన్ని వదలకుండా చేస్తున్నాడంటే, ఆ భయం వల్లనే. సూర్యుడు పనిచేస్తున్నట్టు ఏమిటి నిదర్శనం? మనకు క్రమం తప్పకుండా రాత్రీ, పగలు ఏర్పడుతున్నాయి.

**భీషాఽస్మాదగ్నిశ్చేంద్రశ్చ (స్వకార్యం కరోతి)** – ఈ క్రియాపదం మనం కలుపుకున్నాము. అగ్నిదేవత, ఇంద్ర దేవతలు వారి పనులను సక్రమంగా చేస్తున్నారు. అగ్ని మండుతున్నది. ఎలా తెలుసు? మనం రోజూ అగ్నిలోనే వంట చేసుకుని, తింటున్నాము. తల్లిగర్భంలో ఎదిగే శిశువుకు కూడా ఆధారం తల్లి శరీరంలోని వేడి. అందువల్లనే చూడండి, నెలలు నిండకుండా పుట్టిన పసికందును, ఆ వేడిని కృత్రిమంగా అందించే ఇన్క్యుబేటర్‌లో ఉంచుతారు. మనస్సులో కలిగే దుఃఖంలోని వేడివల్ల మనస్సు ఎదుగుతుంది. అందువల్లనే దుఃఖాలను మనస్తాపాలు అంటారు.

ఇంద్రుడు దేవతలకు అధిపతి, వరుణదేవత కూడా. వాన, ఉరుములు, మెరుపులు కురిపిస్తున్నాడంటే ఈశ్వరుని భయంతోనే.

**మృత్యుర్ధావతి పంచమ ఇతి** – పంచమ అంటే ఐదవ దేవత. యమధర్మరాజు ఆ పంచమ దేవత. అందరిలోకి యమధర్మరాజు చాలా ముఖ్యమైన దేవత. పుట్టుక, ఎదుగుదల, మరణం అన్నీ కాలంవల్ల జరుగుతాయి. అందువల్ల యమధర్మరాజును కాలయముడు అంటారు. యమధర్మరాజుకు రోజంతా, వారమంతా పని ఉన్నాకూడా, ఆయన సక్రమంగా

తన ధర్మాన్ని నిర్వర్తిస్తున్నాడంటే, దానికి కూడా ఈశ్వరుడే కారణం. యమధర్మరాజు అంత ముఖ్యం కాబట్టే చిన్నవయస్సులో ఉపనయనం చేసినప్పుడే బ్రహ్మచారికి సంధ్యావందనంలో యమవందనమంత్రం నేర్పిస్తారు. అది నేర్చుకుంటే మృత్యుభయం పోతుంది.

పాపం యమధర్మరాజు వస్తే, మనం ఆయనను చూసి భయపడకూడదు. ఆయన ధర్మం ఆయన నెరవేరుస్తున్నాడు అంతే. అందరినీ భయపెట్టే యమధర్మరాజును కూడా భయపెడుతున్నాడు ఈశ్వరుడు. అందువల్లనే మీరు ఆ ఈశ్వరుణ్ణి ప్రార్థిస్తే, యమధర్మరాజు మీ దరిదాపుల్లోకి రాడు. ధావతి అంటే మృత్యుదేవత పరుగులు తీస్తున్నది అని అర్థం.

ఈ మంత్రం సారాంశం: బ్రహ్మను చూసి దేవతలు కూడా భయపడుతున్నారు. అందువల్ల బ్రహ్మ భయ-అభయ ప్రదాతా.

**7. బ్రహ్మ అస్తి భయ-అభయ హేతుత్వాత్**

ఇంతవరకూ చూసిన ఏడు కారణాలనూ మళ్ళీ టూకీగా ఒకసారి చూద్దాము.

1. బ్రహ్మ అస్తి జగతః నిమిత్త కారణత్వాత్ – బ్రహ్మ నిమిత్తకారణము
2. బ్రహ్మ అస్తి జీవాత్మరూపేణ వర్తమానత్వాత్ – బ్రహ్మ జీవాత్మ
3. బ్రహ్మ అస్తి జగతః ఉపాదాన కారణత్వాత్ – బ్రహ్మ ఉపాదాన కారణం
4. బ్రహ్మ అస్తి సుకృత ప్రసిద్ధే – బ్రహ్మ సుకృతం
5. బ్రహ్మ అస్తి ఆనందరూపేణ – బ్రహ్మ ఆనంద ప్రదాతా
6. బ్రహ్మ అస్తి జడశరీరే చేష్టాదర్శనత్వాత్ – బ్రహ్మ చైతన్య ప్రదాతా
7. బ్రహ్మ అస్తి భయ-అభయ హేతుత్వాత్ – బ్రహ్మ భయ-అభయ ప్రదాతా

ఇదీ పరోక్షంగా అడిగిన ప్రశ్నకు ప్రత్యక్ష జవాబు. ఇక్కడ ఒక విషయం గమనించాలి. ఇక్కడ బ్రహ్మ అస్తి అని నిరూపించటానికి తార్కికంగా ఏడు కారణాలు చూపించింది ఉపనిషత్తు. కాని ఉపనిషత్తే ఇంకొక చోట బ్రహ్మ తర్కానికి అందదు అని గట్టిగా నొక్కి వక్కాణిస్తుంది.

**నైషా తర్కేణ మతిరాపనేయా** – కఠ 1.2.9

ఈ జ్ఞానాన్ని తర్కంవల్ల పొందలేరు.

నిజానికి బ్రహ్మను తర్కం ద్వారానే నిరూపించగలిగితే, మతం కూడా సైన్సులో ఒక భాగమైపోతుంది. అలా తర్కం ద్వారా నిరూపించగలమని న్యాయదార్శనికులు అంటారు కాని అద్వైత వేదాంతులు దాన్ని తీవ్రంగా ఖండిస్తారు. శంకరాచార్యులవారు, పరమాత్మను తర్కం ద్వారా నిరూపించలేము అని బ్రహ్మసూత్రంలోని రెండవ సూత్రభాష్యంలో వాదించారు.

**జన్మాద్యస్య యతః** – బ్రహ్మసూత్రములు 2

దాన్ని ఇంకా లోతుగా విశ్లేషించారు ఉపభాష్యకారులు. నైయాయికులు బ్రహ్మ ప్రమాణం చూపించే మూడవ సూత్రం అవసరం లేదని, తర్కం ద్వారానే బ్రహ్మను జగత్కారణంగా తీసుకుని నిరూపించవచ్చనీ అంటారు. దానికి వారి తర్కంలోని లొసుగులు ఎత్తి చూపించి, తర్కంవల్ల కుదరదని నిరూపిస్తారు. తర్కానికి అనుమాన ప్రమాణం వాడతారు. దానికొక వ్యాప్తివాక్యం ఉండాలి. అది సరిగ్గా ఉండాలి. అంటే దాన్ని ఖండించకూడదు. కాని వారి వ్యాప్తివాక్యామే చెల్లదని నిరూపిస్తూ, ఇంకా వారి వాదనల్లో ఉన్న మరికొన్ని లొసుగులను కూడా అక్కడ నిరూపిస్తారు.

ఆ విధంగా అద్వైత వేదాంతం బ్రహ్మను తార్కికంగా నిరూపించలేము అని నొక్కి వక్కాణిస్తుంది. ఎందుకంటే బ్రహ్మకు శాస్త్రమే ప్రమాణం కాని, తర్కం కాదు. అంతమాత్రాన బ్రహ్మ లేనట్టు అర్థం తీసుకోకూడదు. శబ్దం గురించి తెలుసుకోవాలంటే, కంటితో చూసి తెలుసుకోగలమా అని వాదిస్తే, శబ్దం అసలు లేనే లేదని అర్థం కాదు కదా! అదే విధంగా బ్రహ్మ ఉంది, కాని తర్కంతో నిరూపించలేము అంటే, తర్కప్రమాణానికి అందదు బ్రహ్మ అని అర్థం. ఈ విషయం ఇంచుమించు ప్రతి ఉపనిషత్తులోనూ వస్తుంది.

అలాంటప్పుడు ఏడు కారణాలు ఎలా చూపించగలరు బ్రహ్మ ఉందని తార్కికంగా చెప్పటానికి? దానికి జవాబు – తర్కం రెండు రకాలు.

కేవల తర్కః – అది శ్రుతిమీద ఆధారపడని తర్కం. దీన్ని శుష్కతర్కః అని కూడా అంటారు.

శ్రుతిసమ్మత తర్కః – అది శ్రుతిమీద ఆధారపడిన తర్కం. దీన్ని శ్రౌత తర్కః అని కూడా అంటారు.

అద్వైత వేదాంతం ఈ రెండవ తెగలోకి వస్తుంది. అంటే ఇది శ్రుతిసమ్మత తర్కం. కేవల తర్కం కుదరదు అంటే, పరమాత్మ లేదని కాదు అర్థం; కేవలతర్కం చాలదు అని అర్థం. బ్రహ్మసూత్రాల్లో ఒక సూత్రం ఈ విషయాన్ని అంటే కేవలతర్కం ద్వారా బ్రహ్మను నిరూపించలేదు అనే విషయాన్ని లోతుగా విశ్లేషిస్తుంది. అందువల్ల లొసుగు ఉన్నది బ్రహ్మలో కాదు, తర్కంలో. ఆ లొసుగును శాస్త్రసమ్మత తర్కం తీసుకోవటం ద్వారా సరిచేయవచ్చు.

**వాక్యార్థశ్చ విచార్యతాం । శ్రుతిశిరో పక్షః సమాశ్రీయతామ్**
**దుస్తర్కాత్సువిరమ్యతాం । శ్రుతిమతస్తర్కోఽనుసన్ధీయతామ్ ।** – సాధన పంచకమ్

ఈ శ్లోకంలో శంకరాచార్యులవారు రెండు రకాల తర్కాల గురించి చెప్పారు. దుస్తర్కం, శ్రుతిసమ్మత తర్కం. మొదటిది కేవలతర్కం; అంటే శాస్త్రంతో సంబంధం లేదు దానికి. రెండవది శ్రుతిని ఆధారంగా చేసుకుని వచ్చిన తర్కం. శాస్త్రాన్ని నమ్మకుండా, తర్కాన్ని

నమ్మే వ్యక్తి భగవంతుని ఉనికిని, తర్కం ద్వారా నిరూపిద్దామని చూస్తాడు. దాన్ని మామూలు మనుష్యులు స్వీకరిస్తారేమో కాని, జ్ఞాని దానిలో అనేక దోషాలను దర్శిస్తాడు. శాస్త్రంమీద శ్రద్ధ ఉండాలి. అందువల్లనే సాధన చతుష్టయ సంపత్తిలోని శమదమాది షట్కసంపత్తిలో శ్రద్ధ ఒక అంశం.

ఈ నేపథ్యంతో చూస్తే బ్రహ్మ అస్తి అని నిరూపించటానికి వాడిన ఏడు కారణాలు దుస్తర్కం కాదు, శ్రుతిసమ్మత తర్కంనుంచి వచ్చినవి.

శిష్యుడు ప్రత్యక్షంగా అడిగిన రెండు ప్రశ్నలూ అలాగే ఉన్నాయి. అవి –

– మరణానంతరం అజ్ఞాని బ్రహ్మలో ఐక్యమవుతాడా, లేదా?

– మరణానంతరం జ్ఞాని బ్రహ్మలో ఐక్యమవుతాడా, లేదా?

కాని ఇప్పటికీ జవాబు చెప్పడు గురువు. వీటిని పక్కనపెట్టి, మరో ముఖ్యమైన అంశంలోకి అడుగు పెడుతున్నాడు.

## ఆనందమీమాంస

ఈ ఆనందమీమాంస చాలా ముఖ్యమైన అంశం. దీనివల్లనే ఈ వల్లీకి ఆనందమీమాంస అనీ, బ్రహ్మానందవల్లీ అనీ పేర్లు వచ్చాయి. మీమాంస అంటే విచారణ; ఆనందమీమాంస అంటే ఆనందం గురించిన విచారణ.

మంత్రంయొక్క వివరణలోకి వెళ్ళేముందు, మనం ఈ ఆనందమీమాంసయొక్క విహంగవీక్షణం చేద్దాము. మనం ఈ బ్రహ్మానందవల్లీలోనే రెండు రకాల ఆనందం గురించి చూశాము. అవి కోశానందం, ఆత్మానందం. వాటిని ఆనందమయకోశం, ఆనందఆత్మ పదాలు వచ్చినప్పుడు చూశాము.

**తస్య ప్రియమేవ శిరః । మోదో దక్షిణ పక్షః ప్రమోద ఉత్తరః పక్షః ఆనంద ఆత్మా । బ్రహ్మపుచ్ఛం ప్రతిష్ఠా** – అనువాకం 5

అక్కడ కోశానందం, ఆత్మానందాల గురించి చూశాము. వీటిని ఇక్కడ విశ్లేషించబోతున్నాడు గురువు.

– కోశానందం, ఆనందమయకోశంలో ప్రతిబింబించబడే ఆనందం. అంటే ప్రసన్న అంతఃకరణం ఉంటే, ఆత్మానందం, కోశానందంగా ప్రతిబింబిస్తుంది.

– ఆత్మానందం నా స్వరూపం

ఈ ఆత్మానందం, కోశానందాల మధ్య ఐదు భేదాలు ఉన్నాయి.

**ప్రతిబింబానందం–బింబానందం** – కోశానందం ప్రతిబింబానందం అయితే, ఆత్మానందం బింబానందం. మీరు అద్దంలో మీ మొహం చూసుకుంటే, ఆ అద్దంలో మీ మొహంయొక్క ప్రతిబింబం ఏర్పడుతుంది. మీ భుజాలమీద ఉన్న మీ అసలు మొహాన్ని బింబమొహం అంటారు. బింబం అంటే అసలు మొహం, ప్రతిబింబం అంటే అద్దంలో కనబడే మొహం. అద్దం మొహాన్ని ప్రతిబింబిస్తుంది కాబట్టి దాన్ని ప్రతిబింబ మాధ్యమం అంటారు. ఇక్కడ ఆనందం పరంగా చూస్తే, ఆత్మానందం మీ అసలు స్వరూపం కాబట్టి అది బింబానందం; మనస్సు ప్రశాంతంగా ఉన్నప్పుడు అన్నమయకోశంలో ఆ ఆనందంయొక్క ప్రతిబింబం ఏర్పడుతుంది కాబట్టి అది ప్రతిబింబానందం. దీన్నే కోశానందం అనీ, విషయానందం అనీ అంటారు. ఆనందమయకోశం ప్రతిబింబ మాధ్యమం.

**అనిత్యం–నిత్యం** – కోశానందం అనిత్యం అయితే ఆత్మానందం నిత్యం. కోశానందం ప్రతిబింబం అని చూశాము. ఆ ప్రతిబింబం ఎంతసేపు ఉంటుంది? ప్రతిబింబ మాధ్యమం ఉన్నంతసేపే ఉంటుంది. మనస్సు ప్రశాంతంగా ఉన్నప్పుడే ఈ ప్రతిబింబం ఏర్పడుతుందని చూశాము. అందువల్ల అది నిత్యం కాదు. కాని బింబానందం ఎప్పుడూ ఉంటుంది. ఉదాహరణకు మీరు మీ మొహాన్ని అద్దంలో చూసుకుంటారని చూశాము. కాని అద్దం పగిలిపోతే మీ మొహం కూడా పగిలిపోయిందని బాధపడరు. ఎందుకు? మీ బింబమొహం మీ భుజస్కందాల మీద భద్రంగా అలాగే ఉంది. ఆత్మానందం కూడా ఎప్పుడూ అలాగే ఉంటుంది.

**సాతిశయ ఆనందం–నిరతిశయ ఆనందం** – కోశానందంలో స్థాయీభేదాలు ఉంటాయి. మూడు డిగ్రీల్లో ఉంటుంది అది – ఆనందం, ఆనందతరం, ఆనందతమం. ఈ స్థాయీ భేదాలను సాతిశయ ఆనందం అంటారు. ఆత్మానందంలో ఈ స్థాయీభేదాలు ఉండవు. దాన్ని నిరతిశయ ఆనందం అంటారు. వీటినే ఇంకో విధంగా చెప్పాలంటే తారతమ్య సహిత ఆనందం, తారతమ్య రహిత ఆనందం. తార అంటే మధ్యస్థాయి (ఆనందతరం), తమ అంటే మూడవస్థాయి (ఆనందతమం). ఈ మూడు స్థాయిలను ఇంగ్లీషులో వరుసగా – పాజిటివ్ డిగ్రీ, కంపారటివ్ డిగ్రీ, సూపర్లేటివ్ డిగ్రీ అంటారు. దానికి ఉదాహరణ హ్యాపీ. హ్యాపీ, హ్యాపియర్, హ్యాపియస్ట్ అని వరుసగా వస్తాయి.

కోశానందంలో ఈ తారతమ్యాలు ఎందుకు వస్తాయి? దీనికి జవాబు ముందే చూశాము. కోశానందం అంటే ఒక ప్రతిబింబ మాధ్యమంలో ఏర్పడిన ప్రతిబింబం. ప్రతిబింబ మాధ్యమాన్ని బట్టి ప్రతిబింబం మారుతూ ఉంటుంది. అద్దం స్పష్టంగా ఉంటే, అందులో ఏర్పడే మీ ప్రతిబింబం కూడా స్పష్టంగా ఉంటుంది. మీరు వేడివేడి నీళ్ళతో స్నానం చేస్తున్నప్పుడు ఆ వేడినీటి ఆవిరి అద్దాన్ని కప్పివేసి, మీ మొహాన్ని సరిగ్గా ప్రతిబింబించదు. అప్పుడు మీరు అద్దాన్ని తుడిస్తే, మళ్ళీ చక్కగా ప్రతిబింబం ఏర్పడుతుంది. అలాగే మనస్సు ప్రశాంతంగా

ఉంటే, ఆనందం బాగా తెలుస్తుంది. ఐదవ అనువాకంలో ఈ ఆనందంలోని తారతమ్యాలను ప్రియ, మోద, ప్రమోదాలుగా చూశాము. అంటే మనస్సులో ప్రియవృత్తి లేదా మోదవృత్తి లేదా ప్రమోదవృత్తి ఏర్పడుతాయి.

ప్రియం – ఒక వస్తువును చూడగానే కలిగే ఆనందం

మోదం – ఆ వస్తువును మీరు కొంటే కలిగే ఆనందం

ప్రమోదం – ఆ వస్తువును మీరు అనుభవిస్తే కలిగే ఆనందం.

**అనుభవంలోకి వస్తుంది–అనుభవంలోకి రాదు** – కోశానందాలన్నీ అనుభవంలోకి వస్తాయి. అందువల్లనే ఆ ఆనందాల స్థాయిలో తారతమ్యాలు ఉన్నాయి. చివరికి సమాధిస్థితిలో కలిగే ఆనందం కూడా సమాధిలోనే దొరుకుతుంది, లేచాక ఉండదు. అందువల్ల అది కూడా కోశానందంలోకే వస్తుంది. ఇంతకుముందే చూశాము; మాధ్యమం ఎంత బాగుంటే ప్రతిబింబం అంత బాగుంటుంది. సమాధిలో మనస్సు చాలా ప్రశాంతంగా ఉంటుంది. అందువల్ల అప్పుడు ఏర్పడిన ప్రతిబింబ ఆనందం కూడా చాలా ఎక్కువగా ఉంటుంది. కాని సమాధి నుంచి లేవగానే, ఆ ప్రశాంతత పోతుంది, దానితోపాటు ఆనందమూ పోతుంది.

ప్రపంచాన్నంతటినీ చూసే మీ విశాలనేత్రాలను మీరు చూసుకోలేరు. మీ కళ్ళను అద్దంలోనే చూసుకోవాలి. అంటే ప్రతిబింబాన్నే చూడగలరు; ఆ ప్రతిబింబానికి రాకపోకలు ఉంటాయి. అలాగే మీ బింబానందాన్ని మీరు ఎన్నడూ అనుభవించలేరు. దాన్ని ప్రతిబింబ మాధ్యమంలోనే అనుభవించగలరు. ఆత్మానందం సబ్జెక్టు, సబ్జెక్టును ఎన్నడూ అనుభవించలేరు; సబ్జెక్టు యొక్క ప్రతిబింబాన్ని, ఆబ్జెక్టుగా చూడగలరు. బింబానందం అనుభవంలోకి రాదు కాబట్టి, దానికి తారతమ్యాలు కూడా ఉండవు.

**విషయప్రాప్తి–జ్ఞానప్రాప్తి** – కోశానందాన్ని రెండు భిన్న పద్ధతుల ద్వారా పొందవచ్చు. ద్విసాధన సాధ్యః. ఆత్మానందాన్ని ఒక్క పద్ధతి ద్వారానే తెలుసుకోగలము. ఏకసాధన సాధ్యః.

కోశానందాన్ని అనుభవించాలంటే, ప్రశాంతమనస్సు ఉండాలని చూశాము. ఆ ప్రశాంత మనస్సును రెండు భిన్న మార్గాల ద్వారా పొందవచ్చు.

ఎ) మనస్సు సాధారణంగా ఇప్పుడున్న పరిస్థితులమీద అసంతృప్తిని అనుభవిస్తూ ఉంటుంది. మీకు మీ చుట్టూ ఉన్నవారు ఇలా ఉండాలని, మీకు కొన్ని నియమ నిబంధనలు ఉంటాయి. మీరు ఆశించినట్టు ఈ ప్రపంచం ఉంటే, మీ మనస్సు ప్రశాంతంగా, నిశ్చింతగా ఉంటుంది. కాని ఆశించినట్టు లేకపోతే ఆశాభంగం అవుతుంది. అప్పుడు మనస్సు కలత

చెందుతుంది. మనస్సు కలత చెందితే, రజోగుణాత్మకంగా ఉంటుంది మనస్సు. అప్పుడు ఆనందాన్ని అనుభవించలేదు. అటువంటి మనస్సులో ఆందోళన, ఒత్తిడి, చిరాకు, కోపం రాజ్యమేలుతాయి. అంటే సమస్య ఎలా ఏర్పడింది? ఉన్న పరిస్థితి మీ ఆశయాలకు భిన్నంగా ఉండటంవల్ల ఏర్పడింది. వీటి రెండింటి మధ్యా సమతుల్యత ఎలా తీసుకువస్తారు? రెండు విధాలుగా తీసుకురావచ్చు.

– మీరు ఆశించిన పద్ధతుల్లో ఈ బాహ్యప్రపంచాన్ని మార్చటం ద్వారా సమతుల్యతను సాధించవచ్చు. ఇది బాహ్యంగా తెచ్చే మార్పు. దీన్ని కర్మపద్ధతి అంటారు. కర్మ చేయటం ద్వారా లేదా విషయప్రాప్తి కలగటం ద్వారా దీన్ని సాధించవచ్చు. కాని దీనికి చాలా సమయం పడుతుంది. ఇది అజ్ఞాని పద్ధతి.

– బాహ్యప్రపంచం మీరు ఆశించినట్టు లేకపోతే, అది ప్రకృతి నియమం అనీ, దాన్ని మార్చటం మీ చేతుల్లో లేదనీ గ్రహించి, మీరే దానికి తగ్గట్టుగా సర్దుకుపోవటం రెండవ పద్ధతి. దీన్ని వైరాగ్యపద్ధతి అంటారు. ఈ వైరాగ్యం పెంపొందించుకోవాలి అంటే, వివేకం కావాలి. ఇది ఆంతరంగా వచ్చే మార్పు. ఈ మార్పు రావటానికి మీ మనస్సును మార్చుకోవాలి. ఇది జ్ఞాని పద్ధతి.

ఉదాహరణకు మీరు నడిచే దారి మట్టిగా, రాళ్ళమయంగా ఉందనుకోండి. మీ కాళ్ళకు మట్టి అంటకూడదు, రాళ్ళు గుచ్చుకోకూడదు అనుకుంటే, దాన్ని రెండు పద్ధతుల ద్వారా సాధించవచ్చు. ఒకటి, ఆ దారంతా మెత్తటి తివాచీని పరుచుకురావటం; ఇంకొకటి మీరు చెప్పులు వేసుకోవటం. మీరు చెప్పులు వేసుకుని తిరగటం తేలికైన పద్ధతి; ఖర్చులేని పద్ధతి; సమర్థవంతమైన పద్ధతి కూడా. అంటే రెండవ పద్ధతే శ్రేష్ఠమైన పద్ధతి. ఇదంతా కోశానందం గురించి.

ఇప్పుడు ఆత్మానందాన్ని పొందటం ఎలా? అసలు ఈ ప్రశ్నే తప్పు. ఎందుకంటే ఆత్మానందం మీ అసలు స్వరూపం. ఆత్మానందాన్ని ఏదో కర్మచేసి పొందలేరు. దానికి ఒకటే మార్గం ఉంది. అది జ్ఞానం పొందటం ద్వారానే పొందగలరు. ఏమిటా జ్ఞానం? నేను ఆత్మానందాన్ని అనే జ్ఞానం; అంటే నేనే ఆనందస్వరూపాన్ని ఆనందం ఆబ్జెక్టుగా పొందేది కాదు. నేను ఆనందస్వరూపాన్ని అని మీ ఆనందస్వరూపాన్ని తెలుసుకోవటమే.

**వివేక జన్య – వైరాగ్యజన్య చిత్త ప్రసాదః**

ఈ జ్ఞానం పొందాలి. నేను ఆత్మానందాన్ని, నా స్వరూపమే ఆనందం అనే జ్ఞానం పొందాలి.

**అహమేవ ఆనంద స్వరూపః అస్మి**

ఈ భేదాలను టూకీగా ఒకసారి ఈ క్రింది పట్టికలో చూద్దాము.

| **కోశానందం** | **ఆత్మానందం** |
| --- | --- |
| ప్రతిబింబానందం | బింబానందం |
| అనిత్యం | నిత్యం |
| సాతిశయ ఆనందం | నిరతిశయ ఆనందం |
| అనుభవంలోకి వస్తుంది | అనుభవంలోకి రాదు |
| విషయప్రాప్తి | జ్ఞానప్రాప్తి |

ముందు ఉపనిషత్తు కోశానందం గురించి చెప్పి, ఈ కోశానందాన్ని రెండు పద్ధతుల ద్వారా పొందవచ్చు అని చెబుతుంది. అవి విషయప్రాప్తి ద్వారా (బాహ్య పద్ధతి), వైరాగ్య ప్రాప్తి ద్వారా (ఆంతర పద్ధతి). ఉపనిషత్తు రెండు పద్ధతుల గురించి సమాంతరంగా చెబుతూ వస్తుంది. బాహ్యపద్ధతి వాడినా, ఆంతర పద్ధతి వాడినా, రెండింటిలోనూ లక్ష్యం ఒక్కటే. మనస్సును ప్రశాంతంగా చేయటం. దీన్ని చిత్తప్రసన్నతా అంటారు లేదా చిత్తప్రసాద అంటారు.

**ప్రసాదే సర్వదుఃఖానాం హానిరస్యోపజాయతే ।**
**ప్రసన్నచేతసో హ్యాశు బుద్ధిః పర్యవతిష్ఠతే ॥** – గీత 2.65

ప్రశాంత మనస్సులో దుఃఖాలన్నీ నాశనమవుతాయి. అటువంటి ప్రసన్నచేతస్సులో జ్ఞానం స్థిరంగా నిలుస్తుంది అంటున్నాడు కృష్ణపరమాత్మ.

మనస్సు ప్రశాంతంగా ఉంటే, అంటే కామక్రోధాలు రాజ్యమేలనప్పుడు మనస్సులో ఆనందం కలుగుతుంది. మీ అబ్బాయి డిస్టింక్షన్‌లో ఇంజనీరింగ్ పాసయితే, ఆనందంలో ఓలలాడుతుంది మీ మనస్సు. కాని ఆ ఆనందం ఎంతోసేపు నిలవదు. 'మంచి యూనివర్శిటీలో సీటు వస్తుందో రాదో?' ఈ బెంగ వెన్నంటి వస్తుంది. అంటే మళ్ళీ ప్రశాంతత కొరవడుతుంది. ఏది ఏమైనా చిత్తప్రసాదమే కోశానందాన్ని ఇస్తుంది.

ఈ కోశానందంలో తారతమ్యాలు ఉన్నాయని చూశాము. తారతమ్యాలను కొలవాలంటే, ఆ తారతమ్యాలను కొలిచే ఒక పరికరం ఉండాలి. అంటే ఒక కొలత ఉండాలి. ఉదహారణకు భవంతులను కొలవటానికి 200 అడుగులు, 250 అడుగులు అనే కొలతను వాడతారు. ఇక్కడ కూడా ఉపనిషత్తు ఒక కొలతను ఏర్పరచుకుంది. ఒక యూనిట్‌కి మనుష్య ఆనందం అని పేరు పెట్టింది.

ఆ మనుష్య ఆనందాన్ని కొలవటానికి కూడా కొన్ని నియమాలను విధించింది. మనుష్య ఆనందాన్ని ఎలా కొలుస్తారు? అందరూ ఒక విధంగా ఆనందంగా ఉండరు; కొందరు ఆనందంతో చిందులు వేస్తుంటే, మరికొందరు ఎప్పుడు చూసినా చిటపటలాడుతుంటారు.

ఎలా కొలవాలి? నిజానికి ఇక్కడ శాస్త్రం చెప్పే నియమాలకు ప్రతీకగా నిలిచే మనిషి దొరకటం అసాధ్యం. ఒకవేళ అటువంటి మనిషి అంటూ ఉంటే, ఆ మనుష్య ఆనందాన్ని ఒక కొలతగా తీసుకుంది ఉపనిషత్తు. ఈ నేపథ్యంతో ఈ మంత్రంలోకి అడుగు పెడదాము.

**సైషాఽఽనందస్య మీమాగ్ంసా భవతి। యువా స్యాత్సాధుయువాఽధ్యాయకః ఆశిష్ఠో దృఢిష్ఠో బలిష్ఠః। తస్యేయం పృథివీ సర్వా విత్తస్య పూర్ణా స్యాత్। స ఏకో మానుష ఆనందః।**

సి) **కా పరప్రాప్తిః – మోక్షప్రాప్తి అంటే ఏమిటి?**

**వృత్తిభాగము పరంగా – సోఽశ్నుతే సర్వాన్ కామాన్సహ। బ్రహ్మణా విపశ్చితేతి।**

**వ్యాఖ్యానభాగము పరంగా – ఆనంద మీమాంసా ద్వారా – అనువాకం 8**

**సైషాఽఽనందస్య మీమాగ్ంసా భవతి** – పారాయణం చేసేటప్పుడు మీమాంస మీమాగ్ంసా అని వస్తుంది. ఇక్కడ సైషా అంటే ఈ ఎనిమిదవ అనువాకంలోని ఈ క్రింది భాగము ఆనందమీమాంసను చేస్తున్నది అని అర్థం.

**యువా స్యాత్** – ఒక యువకుణ్ణి తీసుకుందాము. అతని అంగాలన్నీ బ్రహ్మాండంగా ఉండి, అతను అత్యంత ఎక్కువగా ఇంద్రియసుఖాలను అనుభవిస్తాడు అనుకుందాము.

**సాధుయువా** – సాధువు పదం యువకునికి విశేషణంగా వాడింది ఉపనిషత్తు. యువకుడే అయినా సజ్జనుడు కాకపోవచ్చు; సజ్జనుడే అయినా, యువకుడు కాకపోవచ్చు. సాధు యువకుడయితే ధార్మిక జీవనం గడుపుతాడు. అంటే అతనికి భగవద్గీతలో కృష్ణపరమాత్మ పేర్కొన్న అమానిత్వం, అదంభిత్వం, అహింస, క్షాంతి, ఆర్జవం వంటి విలువలు ఉంటాయి. ఒక యువకుడు శారీరకంగా బలంగా, ఆరోగ్యకరంగా ఉన్నా కూడా, అతని జీవితం ధార్మికంగా లేకపోతే, అతని మనస్సు అనారోగ్యకరంగా ఉంటుంది. నిజానికి, మనిషి పాటించే విలువలను బట్టి అతని మానసిక ఆరోగ్యాన్ని బేరీజు వేస్తారు. అందువల్ల మానసిక, శారీరక ఆరోగ్యాలు రెండూ బాగుంటేనే అతను పొందే ఆనందం హెచ్చుగా ఉంటుంది.

ఈ విలువలను ఎలా పెంపొందించుకోగలడు? ఇది చాలా అపురూపమైన విషయం. యువతకు ఉండే మొట్టమొదటి సమస్యే గర్వం లేదా మదం. కృష్ణపరమాత్మ పాటించమని చెప్పిన మొట్టమొదటి విలువే అమానిత్వం. గర్వం లేదా మదం లేకపోవటం. గర్వం లేని యువకుడు తక్కిన విలువలను చాలా తేలికగా పాటించగలడు.

**అధ్యాయకః** – ఈ నిరాడంబరతను ఎలా పెంపొందించుకున్నాడు? అతను శాస్త్రాన్ని అధ్యయనం చేస్తాడు కాబట్టి. శాస్త్ర అధ్యయనం ఒక్కటే అమానిత్వాన్ని పెంపొందించగలదు.

**విద్యా దదాతి వినయం వినయాత్ యాతి పాత్రతామ్**
**పాత్రత్వాత్ ధనమాప్నోతి ధనాత్ ధర్మం తతః సుఖమ్॥**

ధర్మశాస్త్ర అధ్యయనం మాత్రమే వినయాన్ని ఇస్తుంది. వేరే ఏ విద్య కూడా ఆ వినయాన్ని ఇవ్వదు. అందువల్ల అధ్యాయకః అంటే గురుకులంలో ధర్మశాస్త్రాన్ని అధ్యయనం చేసిన వ్యక్తి అని అర్థం.

**ఆశిష్ఠః** – ఈ యువకుడు చాలా చురుకైన, సమర్థవంతమైన వ్యక్తి. అప్పుడే అతను విషయ వస్తువులను ఆనందించగలడు. అంటే అతను బద్ధకసామ్రాట్ కాడు.

**దృఢిష్ఠః** – దృఢచిత్తం గలవాడు. అంటే మనోబలం గలవాడు. ఎన్ని ఆటంకాలు ఎదురైనా కూడా అనుకున్నది సాధించగలడు.

**బలిష్ఠః** – శారీరకంగా ఎంతో బలశాలి.

అంటే ఈ యువకునికి విషయవస్తువులను అనుభవించటానికి కావాల్సిన ఆంతరంగ సంపద సమృద్ధిగా ఉంది. శారీరక, మానసిక ఆరోగ్యం ఉంది, శాస్త్ర అధ్యయనం చేశాడు, ధార్మిక జీవనం గడుపుతాడు, చురుకైన వ్యక్తి, దృఢచిత్తం ఉంది, బలశాలి. కాని ఆనందానికి కొలబద్ధగా నిలవాలంటే, ఇవి మాత్రం ఉంటే చాలదు. విషయవస్తువులను అనుభవించాలంటే ఆ వస్తువులు కూడా అందుబాటులో ఉండాలి కదా! ఉదాహరణకు అతను ఆరోగ్యంగా ఉన్నాడు; బాగా ఆకలి వేస్తున్నది కాని, తినటానికి ఆహారం లేకపోతే ఏమిటి ప్రయోజనం?

**తస్యేయం పృథివీ** – అతనికి ముందు చెప్పిన ఆంతర సంపదలతో పాటు, బాహ్యసంపద కూడా ఉందిట. ఏమిటది? ఈ మొత్తం పృథివే అతనికి చెందుతుంది. అదెలా సాధ్యం అని అడగకండి. అటువంటి ఒక పరిపూర్ణమైన పరిస్థితిని ఊహించి చెబుతున్నది ఉపనిషత్తు.

**సర్వా విత్తస్య పూర్ణా స్యాత్** – అంతేనా? మొత్తం పృథివే కాకుండా, ఈ పృథివిలో ఉన్న సంపదంతా, భూమిలో దాగివున్న బంగారు గనులు, వజ్రాల గనులతో సహా, అతనికే చెందుతుంది.

ఆ విధంగా అతనికి ఆనందం కలగటానికి అవసరమైన బాహ్య విషయవస్తువులూ, ఆంతర పరికరాలూ అన్నీ సమృద్ధిగా ఉన్నాయి. అవి ఎప్పటికీ ఉంటేనే ఆనందంలో ఓలలాడగలడు. ఆనందంలో మునిగితేలాలంటే అధ్యాత్మిక, అధిభౌతిక సంపత్తి పూర్తిస్థాయిలో ఉండాలి.

**స ఏకో మానుష ఆనందః** – ఉపనిషత్తు ఒక మనిషి అనుభవించే ఇటువంటి పరిపూర్ణమైన కోశానందాన్ని ఒక మానుష ఆనందం అంటున్నది.

ఈ మానుష ఆనందాన్ని ఒక కొలతగా తీసుకుంది. ఇక్కడ్నుంచి పది స్థాయిల్లో కోశానందాన్ని చూస్తూ వస్తాము. 1 మానుష ఆనందం – 1 కొలత.

**తే యే శతం మానుషా ఆనందాః । స ఏకో మనుష్యగంధర్వాణామానందః । శ్రోత్రియస్య చాకామహతస్య॥**

**తే యే శతం మనుష్యగంధర్వాణామానందాః । స ఏకో దేవగంధర్వాణామానందః శ్రోత్రియస్య చాకామహతస్య॥**

**తే యే శతం దేవగంధర్వాణామానందాః॥ స ఏకః పితౄణాం చిరలోక లోకానామానందః॥ శ్రోత్రియస్య చాకామహతస్య॥**

**తే యే శతం పితౄణామ్ చిరలోక లోకానామానందాః । స ఏక అజానజానాం దేవానామానందః॥ శ్రోత్రియస్య చాకామహతస్య॥**

**తే యే శతమాజానజానాం దేవానామానందాః॥ స ఏకః కర్మదేవానాం దేవానామానందః॥ యే కర్మణా దేవానపియన్తి॥ శ్రోత్రియస్య చాకామహతస్య॥**

**తే యే శతం కర్మదేవానాం దేవానామానందాః॥ స ఏకో దేవానా మానందః॥ శ్రోత్రియస్య చాకామహతస్య॥**

**తే యే శతం దేవానామానందాః॥ స ఏక ఇంద్రస్యానందః॥ శ్రోత్రియస్య చాకామహతస్య॥**

**తే యే శతమింద్రస్యానందాః॥ స ఏకో బృహస్పతేరానందః॥ శ్రోత్రియస్య చాకామహతస్య॥**

**తే యే శతం బృహస్పతేరానందాః॥ స ఏకః ప్రజాపతేరానందః॥ శ్రోత్రియస్య చాకామహతస్య॥**

**తే యే శతం ప్రజాపతేరానందాః॥ స ఏకో బ్రహ్మణ ఆనందః॥ శ్రోత్రియస్య చాకామహతస్య॥**

**వివరణ**

**తే యే శతం మానుషా ఆనందాః । స ఏకో మనుష్యగంధర్వాణామానందః । శ్రోత్రియస్య చాకామహతస్య॥**

ఈ ఆనందమీమాంస పారాయణం చేస్తేనే ఆనందంతో ఒళ్ళు పులకరిస్తుంది. ఇప్పుడు మనుష్య ఆనందంనుంచి పదిస్థాయిల పైకి తీసుకువెళుతుంది ఉపనిషత్తు. ప్రతి ఒక్క స్థాయిలోనూ ముందున్న స్థాయికన్నా వందరెట్ల ఎక్కువ ఆనందం ఉంటుంది. అంటే, మానుష ఆనందం తర్వాత స్థాయి అయిన మనుష్యగంధర్వలోకంలో ఆనందం వందరెట్లు ఉంటుంది. అంటే ఒకటి తర్వాత రెండు సున్నాలు పెట్టుకోవాలి. చిట్టచివరి స్థాయి హిరణ్యగర్భ ఆనందం. మధ్యలో ఒక్కొక్క దశకూ రెండేసి సున్నాలు కలుపుకుంటూ వస్తే, హిరణ్యగర్భ స్థాయికి వచ్చేసరికి (అది పదోస్థాయి కాబట్టి) ఇరవై సున్నాలు పెట్టుకోవాలి. అలా మనిషి ఆనందంతో మొదలుపెట్టి, హిరణ్యగర్భ ఆనందం వరకూ తీసుకువెళుతుంది ఉపనిషత్తు. అదికూడా ఒక్కొక్క స్థాయిలోనూ రెండురకాల ఆనందాన్ని చూస్తాము. అవి విషయప్రాప్తివల్ల కలిగే ఆనందం, వైరాగ్యప్రాప్తివల్ల కలిగే ఆనందం. కోశానందంలోని రెండు రకాలు – విషయప్రాప్తి, వైరాగ్యప్రాప్తి. అవేమిటో వివరంగా చూద్దాము.

**తే యే శతం మానుషా ఆనందాః । స ఏకో మనుష్యగంధర్వాణామానందః** – వంద మానుష ఆనందాలు ఏవైతే ఉన్నాయో, అది ఒక మనుష్యగంధర్వుల ఆనందం అవుతుంది. మనుష్యగంధర్వులు ఈ భూలోకంలో ఉండరు. వారిది గంధర్వలోకం. అత్యంత గొప్ప మానుష ఆనందం పొందేవ్యక్తి ఈ భూమ్మీద ఉంటాడని చూశాము కాబట్టి, అతనికన్నా వందరెట్లు ఆనందాన్ని అనుభవించేవ్యక్తి పైలోకంలో ఉండాలి.

అక్కడ అతని శరీరం, ఇంద్రియాలు, విషయ వస్తువులు మనిషికున్నదానికన్నా శ్రేష్ఠమైనవై ఉంటాయి. మీరు వాడే పరికరం సూక్ష్మంగా ఉన్నకొద్దీ, దాని ద్వారా మీరు పొందే ఆనందం కూడా అంతకంతకూ ఎక్కువవుతూ వస్తుంది. చిన్నారి బాలునిగా ఉన్నప్పుడు మీరు ఎక్కువ విషయ వస్తువులను అనుభవించలేరు. కాని వయస్సు పెరుగుతున్నకొద్దీ, మీ మనస్సు అంతకంతకూ ఎదుగుతూ వస్తుంది. తద్వారా మీరు సంగీతాన్ని, కవితలను, ప్రకృతిని, ఒకటేమిటి – అన్నింటినీ అనుభవించగలుగుతారు. ఉదాహరణకు సైన్సుకు సంబంధించిన వ్యాసాన్ని ఒక శాస్త్రజ్ఞుడు ఆనందించినంతగా ఒక సగటు మానవుడు ఆనందించలేడు.

ఆ విధంగా మీలో ఉన్న కోశమూ, దానికి సంబంధించిన విషయ వస్తువులూ సూక్ష్మతరం అవుతూ వస్తున్నకొద్దీ, ఆనందం స్థాయికూడా పెరుగుతూ వస్తుంది. భారతదేశంలోకన్నా విదేశాల్లో అంతా శుభ్రంగా ఉంటుందనీ, సుఖాలు ఎక్కువగా ఉంటాయని, విషయ వస్తువులు ఎన్నో ఉన్నాయనీ అంటారు. భారతదేశంలోకన్నా విదేశాలలో ఆనందం ఎక్కువ ఉంటే, విదేశాల్లో కన్నా ఊర్ధ్వలోకాల్లో ఇంకెంత ఆనందం ఉంటుంది? ఆ విధంగా మానుష ఆనందం కన్నా మనుష్యగంధర్వ ఆనందం వందరెట్లు ఎక్కువ.

**శ్రోత్రియస్య చాకామహతస్య** – చ అకామహతస్య – ఈ ఆనందమీమాంసలో పదిస్థాయిల్లోనూ ఈ వాక్యం మళ్ళీమళ్ళీ వస్తుంది. అందువల్ల దీన్ని సరిగ్గా అర్థం చేసుకోవాలి. మనుష్యగంధర్వుడు, గంధర్వలోకంలో పొందే ఆనందాన్ని, ఈ భూమ్మీద ఉండే మనుష్యుడు పొందగలడు. ఎటువంటి మనుష్యుడు? వైరాగ్యం పొందిన మనుష్యుడు. కామః అంటే కోరిక; హతః అంటే దానిచేత బాధింపబడటం; కామహతః అంటే కామేన హతః అంటే కామం చేత బాధింపబడుతున్న వ్యక్తి. అతన్ని ఏదో కొరత బాధిస్తూనే ఉంటుంది. అకామహతః అంటే దీనికి భిన్నంగా ఉన్నవ్యక్తి. అంటే ఏదీ కోరని వ్యక్తి. ఈ వైరాగ్యం బలవంతంగా తెచ్చి పెట్టుకుంటే రాదు. అది వివేకం ద్వారా రావాలి. బలవంతంగా చూపించే వైరాగ్యం ఎన్నటికీ ఆనందాన్ని ఇవ్వలేదు. అందువల్ల వైరాగ్యానికి ముందు శ్రోత్రియస్య అనే పదం వేసింది ఉపనిషత్తు.

శ్రోత్రియ అంటే శ్రుతిని అధ్యయనం చేసిన వ్యక్తి. శ్రుతిని అధ్యయనం చేసి జ్ఞానం పొందుతాడు అతను. తద్వారా బాహ్యవస్తువులు ఇసుమంత కూడా ఆనందాన్ని ఇవ్వలేవు అని గ్రహిస్తాడు. అతను కుక్క ఉదాహరణను గుర్తుంచుకుంటాడు. కుక్క నోట్లో రక్తం వస్తే అది, అది తినే ఎముకనుంచి వస్తున్నదనుకుంటుంది; కాని నిజానికి ఆ రక్తం తననుంచే వస్తున్నది. జ్ఞానికి ఈ విషయం అర్థమవుతుంది. బాహ్యవస్తువులు శాంతి, భద్రత, ఆనందాలను ఇవ్వలేవు; తనలోంచే ఆనందం వస్తుంది అని అర్థం చేసుకుంటాడు. అలా ఈ శ్రోత్రియ వ్యక్తికి వివేకజన్య వైరాగ్యం ఏర్పడుతుంది. శ్రోత్రియత్వం వివేకాన్ని సూచిస్తే, అకామహతః పదం వివేకజన్య వైరాగ్యాన్ని సూచిస్తుంది.

అతని వైరాగ్యం ఎంతమేరకు ఉంది? శంకరాచార్యులవారు ఈ వైరాగ్యం పూర్తి వైరాగ్యం కాదు, లేదా అంతిమవైరాగ్యం కాదు అంటున్నారు. ఈ అకామహతఃకు మనుష్య ఆనందంమీద వైరాగ్యం ఉంది. అందువల్ల అతను మనుష్యగంధర్వుడు పొందే అంత ఆనందాన్ని పొందుతాడు. ఈ ఆనందాన్ని ఎలా పొందుతాడు? మనుష్యగంధర్వుని విషయంలో అతని శరీరం, ఇంద్రియాలు, విషయవస్తువులు శ్రేష్ఠంగా ఉంటాయని చూశాము. కాని ఇక్కడ ఈ వైరాగ్యం చెందిన మనిషికి ఇవేవీ ఉండవు కాని, అతని మనస్సు ప్రశాంతంగా ఉంటుంది. ఆ ప్రశాంతత అతనికి ఈ లౌకిక విషయాలవల్ల కలిగే ఆనందంమీద ఏర్పడిన వైరాగ్యంనుంచి వచ్చింది. ఈ విధంగా కోశానందం రెండు విధాలుగా పొందవచ్చు.

మనుష్యగంధర్వానంద – గంధర్వలోకంలో మనుష్యగంధర్వునికి కలిగే ఆనందం.

శ్రోత్రియస్య చ అకామహతస్య – వైరాగ్యంవల్ల కలిగే కోశానందం. ఇక్కడితో రెండవ దశ అయింది.

**మనుష్యగంధర్వ ఆనందం = 100 రెట్లు మానుష ఆనందం**

(ఒకటి తర్వాత రెండు సున్నాలు)

**తే యే శతం మనుష్యగంధర్వాణామానందాః । స ఏకో దేవగంధర్వాణామానందః** – వంద మనుష్యగంధర్వ ఆనందం ఒక దేవగంధర్వ ఆనందం అవుతుంది. అంటే దేవగంధర్వుల ఆనందం –

1 దేవగంధర్వ ఆనందం = 100 రెట్లు మనుష్యగంధర్వ ఆనందం.

అంటే 1 దేవగంధర్వ ఆనందం = 10000 రెట్లు మానుష ఆనందం.

(ఒకటి తర్వాత నాలుగు సున్నాలు)

మనుష్యగంధర్వులకు, దేవగంధర్వులకు మధ్య ఉన్న భేదం ఏమిటి? శంకరాచార్యులవారు తన భాష్యంలో ఆ భేదాన్ని వివరిస్తున్నారు. మనుష్యులై ఉండగా విశిష్టమైన కర్మను,

ఉపాసనను అనుష్ఠించి, గంధర్వత్వాన్ని పొందినవారిని మనుష్యగంధర్వులు అంటారు. పుట్టటమే గంధర్వలోకంలో పుట్టినవారు దేవగంధర్వులు. అందువల్ల వారికి, మనుష్యగంధర్వులకన్నా కొన్ని ప్రత్యేకతలు ఉంటాయి. అందువల్ల ఉన్నది ఒకటే గంధర్వలోకంలో అయినా కూడా దేవగంధర్వుల ఆనందం, మనుష్యగంధర్వుల ఆనందానికి వందరెట్లు ఎక్కువ ఉంటుంది. అంటే వారి నివాసస్థానంలో కూడా తారతమ్యాలు ఉంటాయి.

**శ్రోత్రియస్య చాకామహతస్య** – దేవగంధర్వుడు పొందేటంత ఆనందాన్ని ఇక్కడే, భూలోకంలోనే మనిషి పొందగలడు. అదెలా? వివేకజన్య వైరాగ్యం ద్వారా. మనుష్యగంధర్వ ఆనందం కన్నా ఈ ఆనందం ఎక్కువ అని ఎలా చెప్పగలరు? దీనికి కూడా శంకరాచార్యులవారు జవాబు చెబుతున్నారు. ఇతనికున్న వైరాగ్యం స్థాయి ఇంకా ఎక్కువ ఉంది అంటున్నారు. అంటే ముందు వ్యక్తికి మనుష్య ఆనందం విషయంలోనే వైరాగ్యం ఉంటే, ఈ మనిషికి మానుష ఆనందం, మనుష్యగంధర్వ ఆనందాలమీద వైరాగ్యం ఉంది అని అర్థం.

**తే యే శతం దేవగంధర్వాణామానందాః । స ఏకః పితృణాం చిరలోకలోకానామానందః** – వంద దేవగంధర్వ ఆనందం, ఒక పితృలోక ఆనందం అవుతుంది. పితృలోకం గంధర్వలోకం కన్నా పైన ఉన్నలోకం. ఇక్కడ పితృలోకాన్ని చిరలోకం అంటున్నది ఉపనిషత్తు. చిరలోక లోకానామ్‌లో రెండవ లోకాపదం పితృదేవతలను సూచిస్తుంది. చిరలోకంలో ఉండే వాసి. అతని ఆనందం దేవగంధర్వ ఆనందానికి వందరెట్లు ఉంటుంది.

1 పితృదేవత ఆనందం = 100 రెట్లు దేవగంధర్వ ఆనందం

అంటే 1 పితృదేవత ఆనందం = 1000000 రెట్లు మానుష ఆనందం

(ఒకటి తర్వాత ఆరు సున్నాలు)

**శ్రోత్రియస్య చాకామహతస్య** – పితృలోకంలో పొందే ఆనందాన్ని ఇంకా ఎక్కువ వైరాగ్యం ఉంటే మనిషి భూలోకంలోనే పొందవచ్చు. వైరాగ్యం ఎంత ఎక్కువ ఉంటే, మనస్సు అంత ఎక్కువ ప్రశాంతంగా ఉంటుంది. ఈ వైరాగ్యాన్ని ఎలా కొలుస్తారు? ఈ వైరాగ్యం మానుష ఆనందంమీద, మనుష్యగంధర్వ ఆనందంమీద, దేవగంధర్వ ఆనందంమీద ఉండాలి. అంటే అతనికి మూడు స్థాయిల్లో వైరాగ్యం ఉంటే, నాలుగవ స్థాయిలో పితృదేవతల ఆనందాన్ని పొందుతాడు.

**తే యే శతం పితృణాం చిరలోకలోకానామానందాః । స ఏక ఆజానజానాం దేవానామానందః** – పితృదేవతల వంద ఆనందాలు, దేవలోకానికి వెళ్ళిన దేవతల ఒక ఆనందం అవుతుంది. అజానః అంటే స్వర్గలోకం; అజానజః అంటే స్వర్గలోకవాసి. స్వర్గలోకాన్ని రెండు రకాల కర్మల ద్వారా పొందవచ్చు. అక్కడ కూడా తారతమ్యాలు ఉన్నాయి.

స్మార్తకర్మలను స్మృతిగ్రంథాలు నిర్దేశిస్తాయి. వేదాలు కాని గ్రంథాలను స్మృతిగ్రంథాలు అంటారు. ఈ స్మార్తకర్మలు చేసి, పుణ్యం పొంది స్వర్గలోకానికి వెళ్ళినవారిని, అజానజ దేవతలు అంటారు. ఈ అజానజుల ఆనందం, పితృదేవతల ఆనందంకన్నా వందరెట్లు ఎక్కువ ఉంటుంది.

1 అజానజ దేవత ఆనందం = 100 రెట్లు పితృదేవతల ఆనందం

అంటే 1 అజానజ దేవత ఆనందం = 100000000 రెట్లు మానుష ఆనందం

(ఒకటి తర్వాత ఎనిమిది సున్నాలు)

**శ్రోత్రియస్య చాకామహతస్య** – అజానజ దేవతలు పొందే ఆనందాన్ని ఇంకా ఎక్కువ వైరాగ్యం ఉంటే మనిషి భూలోకంలోనే పొందవచ్చు. శ్రోత్రియ అకామహతః అంటే శ్రుతిని నేర్చుకుని, వివేకం ద్వారా వైరాగ్యం పొందిన వ్యక్తి అని మర్చిపోకూడదు. అతనికి అజాన లోకంకన్నా కింద లోకాల వరకూ, అంటే పితృలోకం వరకూ వైరాగ్యం ఉంది.

**తే యే శతమాజానజానాం దేవానామానందాః । స ఏకః కర్మ దేవానాం దేవానామానందః** – అజానజ దేవతల వంద ఆనందాలు, కర్మ దేవతల ఒక ఆనందం అవుతుంది. ముందు దేవతలను స్మార్తకర్మలు చేసి స్వర్గలోకానికి వచ్చారన్నాము. ఈ కర్మదేవతలు శ్రౌతకర్మలు చేసి, పుణ్యం సంపాదించి స్వర్గలోకానికి వచ్చినవారు. శ్రౌతకర్మలు అంటే శ్రుతి నిర్దేశించిన కర్మలు. ఇవి శ్రుతి నిర్దేశించినవి కాబట్టి, స్మార్తకర్మలకన్నా శ్రేష్ఠమైనవి. అందువల్ల వీరికి కలిగే స్వర్గసుఖాలు కూడా వారికన్నా ఎక్కువే ఉంటాయి. అందువల్ల అజానజ దేవతలకన్నా వందరెట్లు ఆనందాన్ని కర్మదేవతలు అనుభవిస్తారు.

**యే కర్మణా దేవానపియన్తి** – వీరు శ్రౌతకర్మలు చేశారు కాబట్టి ఉపనిషత్తు వీరిని కర్మ దేవతలు అంటున్నది. దేవాన్ అంటే దేవలోకం, అపియంతి అంటే ప్రాప్యంతి అంటే పొందారు.

1 కర్మదేవత ఆనందం = 100 రెట్లు అజానజ దేవతల ఆనందం

అంటే 1 కర్మదేవత ఆనందం = 10000000000 రెట్లు మానుష ఆనందం

(ఒకటి తర్వాత పది సున్నాలు)

**శ్రోత్రియస్య చాకామహతస్య** – కర్మదేవతలు పొందే ఆనందాన్ని, ఇంకా ఎక్కువ వైరాగ్యం ఉంటే మనిషి భూలోకంలోనే పొందవచ్చు. అతనికి కర్మదేవతలకన్నా కింద లోకాల వరకూ అంటే అజానజ దేవతల లోకం వరకూ వైరాగ్యం ఉందని చెప్పవచ్చు. ఇది ఏడవ స్థాయి ఆనందం.

**తే యే శతం కర్మదేవానాం దేవానామానందాః । స ఏకో దేవానామానందః** – కర్మ దేవతల వంద ఆనందాలు దేవలోకంలోని ఒక ఆనందం అవుతుంది. ఈ దేవతలు స్వర్గలోకంలో ఇంకా ఎక్కువస్థాయిలో ఉన్న దేవతలు. అజానజ దేవతలు స్మార్తకర్మలు చేసి స్వర్గలోకానికి వస్తే, కర్మదేవతలు శ్రౌతకర్మలు చేసి స్వర్గలోకానికి వస్తే, ఈ దేవతలు స్వర్గలోకంలో పదవులు ఉన్న దేవతలు. వారు 33 దేవతలు – అష్టవసువులు, ఏకాదశ రుద్రులు, ద్వాదశ ఆదిత్యులు, ఇంద్రుడు, బృహస్పతి. ఈ దేవతలు కర్మ, ఉపాసన సముచ్చయం చేసినవారు. ఉదాహరణకు విష్ణుసహస్రనామం పారాయణం మాత్రం చేస్తే అది కర్మ అవుతుంది. ధ్యానశ్లోకాలను మనసులో చదువుకుని, వాటిలో వర్ణించిన భగవంతుని రూపాన్ని ఊహించుకుంటే, అది ఉపాసన అవుతుంది. అలా చేస్తే కర్మ, ఉపాసనల సముచ్చయం చేసినట్టు అవుతుంది. ఇది ఇంకా ఎక్కువ పుణ్యం ఇస్తుంది. కఠోపనిషత్తులో యమధర్మరాజు నాచికేత యజ్ఞాన్ని, విరాట్ ఉపాసనతో కలిపిచేస్తే ఎక్కువ పుణ్యం వస్తుందని చెప్పాడు. ఆ ఉన్నతఫలంవల్ల ఇలా ఇంద్రాది దేవతలు అవుతారు.

1 దేవత ఆనందం = 100 రెట్లు కర్మదేవతల ఆనందం

అంటే 1 దేవత ఆనందం = 1000000000000 రెట్లు మానుష ఆనందం

(ఒకటి తర్వాత పన్నెండు సున్నాలు)

**శ్రోత్రియస్య చాకామహతస్య** – దేవతలు పొందే ఆనందాన్ని, ఇంకా ఎక్కువ వైరాగ్యం ఉంటే మనిషి భూలోకంలోనే పొందవచ్చు. అతనికి దేవలోకం కన్నా కింద లోకాలవరకూ అంటే కర్మదేవతల లోకం వరకూ వైరాగ్యం ఉందని చెప్పవచ్చు.

**తే యే శతం దేవానామానందాః । స ఏక ఇంద్రస్యానందః** – దేవతల వంద ఆనందాలు ఇంద్రునియొక్క ఒక ఆనందం అవుతుంది. ఇంద్రుడు దేవతలకు అధిపతి. అందువల్ల అతని ఆనందం దేవతల ఆనందం కన్నా వందరెట్లు ఎక్కువ ఉంటుంది.

1 ఇంద్ర ఆనందం = 100 రెట్లు దేవతల ఆనందం

అంటే 1 ఇంద్ర ఆనందం = 100000000000000 రెట్లు మానుష ఆనందం

(ఒకటి తర్వాత పద్నాలుగు సున్నాలు)

**శ్రోత్రియస్య చాకామహతస్య** – ఇంద్రుడు పొందే ఆనందాన్ని, ఇంకా ఎక్కువ వైరాగ్యం ఉంటే మనిషి భూలోకంలోనే పొందవచ్చు. అతనికి ఇంద్రునికన్నా కిందిస్థాయి వరకూ అంటే దేవలోకం వరకూ వైరాగ్యం ఉందని చెప్పవచ్చు.

తత్త్వబోధలో ఈ లోకంలోనూ, స్వర్గలోకాల్లోనూ ఇంద్రియవస్తువులమీద వైరాగ్యం ఉండాలని వస్తుంది. **ఇహ స్వర్గభోగేషు ఇచ్ఛారహితమ్.** దాన్నే ఇక్కడ నాటకీయంగా చూస్తున్నాము.

**తే యే శతమింద్రస్యానందాః । స ఏకో బృహస్పతేరానందః** – ఇంద్రుని వంద ఆనందాలు బృహస్పతి యొక్క ఒక ఆనందం అవుతుంది. బృహస్పతి దేవతలకు గురువు. బృహతి అంటే వాక్కు. అందువల్ల బృహస్పతి అంటే వాచస్పతి, వాక్కుకు అధిపతి. వాక్కు జ్ఞానానికి ప్రతీక. బృహస్పతి ఇంద్రునికి కూడా గురువు కాబట్టి అతని ఆనందం ఇంద్రుని ఆనందం కన్నా వందరెట్లు ఎక్కువ.

1 బృహస్పతి ఆనందం = 100 రెట్లు ఇంద్ర ఆనందం

అంటే 1 బృహస్పతి ఆనందం = 10000000000000000 రెట్లు మానుష ఆనందం

(ఒకటి తర్వాత పదహారు సున్నాలు)

**శ్రోత్రియస్య చాకామహతస్య** – బృహస్పతి పొందే ఆనందాన్ని, ఇంకా ఎక్కువ వైరాగ్యం ఉంటే మనిషి భూలోకంలోనే పొందవచ్చు. అతనికి బృహస్పతికన్నా కిందస్థాయి వరకూ అంటే ఇంద్రుని స్థాయివరకూ వైరాగ్యం ఉందని చెప్పవచ్చు.

**తే యే శతం బృహస్పతేరానందాః । స ఏకః ప్రజాపతేరానందః** – బృహస్పతి వంద ఆనందాలు, ప్రజాపతియొక్క ఒక ఆనందం అవుతుంది. ప్రజాపతి అంటే విరాట్. విరాట్‌ను సమష్టి స్థూలప్రపంచ అధిష్ఠానదేవత అంటారు. బృహస్పతిది ఒక్క శరీరమే, విరాట్‌ది సమష్టి శరీరాలు. అందువల్ల విరాట్ ఆనందం బృహస్పతి ఆనందంకన్నా వందరెట్లు ఎక్కువ.

1 ప్రజాపతి ఆనందం = 100 రెట్లు బృహస్పతి ఆనందం

అంటే 1 ప్రజాపతి ఆనందం = 1000000000000000000 రెట్లు మానుష ఆనందం

(ఒకటి తర్వాత పద్దెనిమిది సున్నాలు)

**శ్రోత్రియస్య చాకామహతస్య** – విరాట్ పొందే ఆనందాన్ని, ఇంకా ఎక్కువ వైరాగ్యం ఉంటే, మనిషి భూలోకంలోనే పొందవచ్చు. అతనికి విరాట్‌కన్నా కిందస్థాయి వరకూ అంటే బృహస్పతి స్థాయివరకూ వైరాగ్యం ఉందని చెప్పవచ్చు.

**తే యే శతం ప్రజాపతేరానందాః । స ఏకో బ్రహ్మణ ఆనందః** – విరాట్ వంద ఆనందాలు, బ్రహ్మయొక్క ఒక ఆనందం అవుతుంది. బ్రహ్మణ అంటే బ్రహ్మ. ఉపనిషత్తులు బ్రహ్మను హిరణ్యగర్భ అంటాయి. అందువల్ల ఇక్కడ బ్రహ్మయొక్క ఆనందం అంటే బ్రహ్మానందమో, ఆత్మానందమో కాదు. అది అసలైన ఆనందం. ఇక్కడ హిరణ్యగర్భ ఆనందం కూడా కోశానందం కిందికే వస్తుంది. అది మానుష ఆనందానికి ఇరవైరెట్లు ఉంటుందని చూశాము, అయినా కూడా అది కోశానందమే. కోశానందం ఎంత ఎక్కువ ఆనందం అయినా, బింబానందంతో సరిపోదు.

హిరణ్యగర్భను సమష్టి సూక్ష్మప్రపంచ అధిష్ఠానదేవత అంటారు. విరాట్ సృష్టికి హిరణ్యగర్భ కారణం. హిరణ్యగర్భ విరాట్‌కన్నా సూక్ష్మం. అందువల్ల హిరణ్యగర్భ ఆనందం విరాట్ ఆనందం కన్నా వందరెట్లు ఎక్కువ.

1 హిరణ్యగర్భ ఆనందం = 100 రెట్లు ప్రజాపతి ఆనందం

అంటే 1 హిరణ్యగర్భ ఆనందం = 100000000000000000000 రెట్లు మానుష ఆనందం

(ఒకటి తర్వాత ఇరవై సున్నాలు)

**శ్రోత్రియస్య చాకామహతస్య** – హిరణ్యగర్భ పొందే ఆనందాన్ని, ఇంకా ఎక్కువ వైరాగ్యం ఉంటే మనిషి భూలోకంలోనే పొందవచ్చు. అతనికి హిరణ్యగర్భకన్నా కిందస్థాయివరకూ అంటే ప్రజాపతి స్థాయివరకూ వైరాగ్యం ఉందని చెప్పవచ్చు.

మనిషి విషయసుఖాలను పొంది, ఆనందం పొందే స్థాయిలను తీసుకుని, హిరణ్యగర్భ లోకం వరకూ తీసుకువెళ్ళింది ఉపనిషత్తు. ఊర్ధ్వలోకాలు అంటే భూలోకంతో కలిపి ఏడు లోకాలు. అవి భూలోకం, భువర్లోకం, సువర్లోకం, మహర్లోకం, జనలోకం, తపోలోకం, సత్యలోకం. సత్యలోకాన్నే బ్రహ్మలోకం అనీ హిరణ్యగర్భలోకం అనీ అంటారు. ఒక్కొక్క లోకానికి వెళ్ళినకొద్దీ అక్కడ పొందే ఆనందం స్థాయి, పొందే వస్తువుల స్థాయి పెరుగుతూ వస్తుంది.

ముందే చూసినట్టుగా మనిషి ఒక్కొక్క లోకానికి వెళుతూ, ఆ లోకాల్లో ఆనందం పొందటం ఒక పద్ధతి. లేదా ఆ లోకాల్లోని ఆనందం శాశ్వతం కాదు; ఎప్పటికైనా అవి హరించిపోతాయని తెలుసుకుని వాటిమీద వైరాగ్యం పెంచుకోవటం ఇంకొక పద్ధతి. ఆ రెండూ సమాంతరరేఖలుగా చూస్తూ వస్తున్నాము. ఒకవైపు విషయవస్తువులు ఎక్కువగా పొంది, ఆనందం ఎక్కువగా అనుభవిస్తూ వస్తూవుంటే, ఇంకొకపక్క తీవ్ర వైరాగ్యం అంతకంతకూ పెరుగుతూ వచ్చి, హిరణ్యగర్భ కిందలోకం వరకూ అంటే ప్రజాపతి ఆనందం వరకూ వైరాగ్యం ప్రదర్శించటం చూశాము. అంటే వైరాగ్యం పొందితే కలిగే ఆనందం ముందు ఈ ఊర్ధ్వలోకాల్లో పొందే ఆనందం సాటిరాదు.

భోగంవల్ల ఆనందం పొందితే, త్యాగంవల్ల కూడా అంతే ఆనందం పొందవచ్చు. నిజానికి త్యాగం ఇంకా ఎక్కువ ఆనందాన్ని ఇస్తుంది. ఈ ఆధ్యాత్మిక పాఠాన్ని మన దేశమే బోధిస్తుంది. తక్కిన దేశాల్లో లౌకిక సుఖాలను ఇంకెంత ఎక్కువగా పొందవచ్చో చూపిస్తే, భారతదేశం మాత్రం ఆ సుఖాలేమీ లేకుండా కూడా ఎంత ఆనందంగా ఉండవచ్చో నేర్పిస్తుంది. అలాగని సుఖాలను అనుభవించవద్దని కొట్టివేయదు మనదేశం, కాని వాటితో మమేకం

చెందకండి, త్యాగంవల్ల కూడా అంతే సుఖం పొందవచ్చు అంటుంది. అందువల్లనే త్యాగులను అంత గౌరవిస్తుంది మన సాంప్రదాయం.

ఒక రాజు ఒక సాధువుని కలిసి, 'మీరు అన్నీ త్యజించారు కదా! దానివల్ల ఏం పొందారు?' అని అడిగాడుట. ఆ సాధువు నవ్వి, ఇలా చెప్పాడు. 'మామూలుగా అయితే, మీ దర్శనం చేసుకోవటానికి నేను పడిగాపులు కాయాల్సి ఉండేది. లేదా ఎవరి ద్వారానో మీ దగ్గరికి రావాలి. మీ దగ్గరికి వచ్చాక కూడా, మీరు మీ సింహాసనంమీద సుఖాసీనులు అయివుంటే, నేను మీముందు చేతులు జోడించుకుని నిలబడాల్సి వచ్చేది. ఇప్పుడో, నన్ను వెతుక్కుంటూ మీరే వచ్చారు; నేను సుఖాసీనుడిని అయివుంటే, మీరు నా ముందు నిల్చున్నారు.' ఇదే త్యాగికీ, భోగికీ మధ్య ఉండే భేదం.

ఇక్కడితో కోశానందం గురించిన మీమాంస ముగిసింది. కోశానందంలో రెండు అంశాలు చూశాము. విషయప్రాప్తి, వైరాగ్యప్రాప్తి. విషయప్రాప్తిలో అంతకంతకూ విషయవస్తువులవల్ల కలిగే ఆనందం పెరుగుతూ వస్తే, వైరాగ్యప్రాప్తిలో విషయవస్తువులమీద వైరాగ్యం అంతకంతకూ పెరుగుతూ వచ్చింది.

**స యశ్చాయం పురుషే। యశ్చాసావాదిత్యే। స ఏకః।**

**ఆత్మానందం**

ఇప్పుడు మనం ఆత్మానందం గురించిన మీమాంసలోకి అడుగు పెడుతున్నాము.

**స యశ్చాయం పురుషే। యశ్చాసావాదిత్యే। స ఏకః** – ఈ మూడు వాక్యాలనూ కలిపితే ఒక మహావాక్యం అవుతుంది. జీవ–ఈశ్వర ఐక్యాన్ని తెలిపే ఏ వాక్యమైనా కూడా మహావాక్యమే.

జీవాత్మ పరమాత్మ ఐక్య బోధక వాక్యమ్

తత్త్వమసి, అహం బ్రహ్మ అస్మి, ప్రజ్ఞానం బ్రహ్మ, అయమాత్మ బ్రహ్మ వాక్యాలను మహావాక్యాలకు ఉదాహరణలుగా చెబుతారు. అటువంటి మహావాక్యాలు ఒక్కొక్క ఉపనిషత్తులోనూ అనేకం ఉన్నాయి. ఇప్పుడు అటువంటి మహావాక్యాన్ని ఒకదాన్ని చూడబోతున్నాము.

సః అయం (ఆనందః) – ఈ (ఆనందం)
యః పురుషే – ఒక మనిషిలో ఉన్న (ఆనందం)
చ అసౌ (ఆనందః) – ఆ (ఆనందం)

**యః ఆదిత్యే** – ఆదిత్యలో ఉన్న ఆనందం. ఇక్కడ ఆదిత్యుడు అంటే హిరణ్యగర్భ. అంటే సమష్టిలో, అత్యంత శ్రేష్ఠమైన ఉపాధి హిరణ్యగర్భది.

**స ఏకః** – ఈ రెండూ ఒకటే.

ఇప్పుడు ఈ పదాల అర్థాలన్నింటినీ కలిపిచూస్తే, మనిషిలో అంటే వ్యష్టిలో ఉన్న ఆనందం, హిరణ్యగర్భలో అంటే సమష్టిలో ఉన్న ఆనందం రెండూ ఒకటే.

ఈ వాక్యాన్ని చూస్తే, ఇంతవరకూ మనం చూస్తూవస్తున్నదాన్ని ఒక్కసారిగా ఖండించి వేస్తున్నది. ఇంతవరకూ ఏం చూశాము? ఆనందమీమాంసలో ఒక మానుష ఆనందాన్ని ఒక కొలతగా తీసుకుని, దానికి వందరెట్లు మనుష్యగంధర్వ ఆనందం అనీ, అలా స్థాయిలు పెంచుకుంటూవచ్చి, హిరణ్యగర్భ ఆనందం, మానుష ఆనందానికి ఇరవైరెట్లు ఎక్కువ అని విశ్లేషించిది ఉపనిషత్తు. అంటే ఒక మనిషి ఆనందానికీ, హిరణ్యగర్భ ఆనందానికీ ఇరవైరెట్లు భేదం ఉంటే, వీటి రెండింటి మధ్యా భేదం జీరోవాల్ట్ బల్బుకీ, సూర్యకాంతికీ మధ్య ఉన్నంత భేదం ఉంటుంది. అలాంటిది ఇప్పుడేమో మానుష ఆనందం, హిరణ్యగర్భ ఆనందం ఒకటే అంటున్నది. శాస్త్రాన్ని తప్పు పట్టకూడదు. శాస్త్రంమీద శ్రద్ధ, గౌరవం పెంచుకోవాలి. మరయితే శాస్త్రం ఎందుకిలా అంది అని కొంచెం లోతుగా విశ్లేషిస్తే మనకు ఈ మహావాక్యం అర్థమవుతుంది.

ఒక పదానికి రెండు అర్థాలు ఉండవచ్చు. వాటిని వాచ్యార్థం, లక్ష్యార్థం అంటారు. వాచ్యార్థం అంటే ప్రత్యక్ష అర్థం; లక్ష్యార్థం అంటే పరోక్ష అర్థం.

ఉదాహరణకు ఎవరైనా జంబంగుడి, లాల్‌గుడి, కారైక్కుడి సంగీత కచేరీ చేస్తున్నాయి అంటే మీకు ఆశ్చర్యం వేస్తుంది. ఎందుకంటే మీకు తెలిసి, ఈ మూడూ కేరళలో ఉన్న మూడు ఊర్లు. ఊర్లు ఎలా సంగీతకచేరీ చేస్తాయి? కాని మీరు కర్ణాటక సంగీతం అంటే చెవి కోసుకునేవారైతే, ఈ వాక్యం అర్థం వెంటనే తెలుస్తుంది. జంబంగుడిలో ప్రఖ్యాతి చెందిన సంగీత విద్వాంసుడు ఉన్నాడు; లాల్‌గుడిలో ప్రముఖ వయోలిన్ విద్వాంసుడు ఉన్నాడు; కారైక్కుడిలో ప్రముఖ మృదంగ విద్వాంసుడు ఉన్నాడు; ఈ ముగ్గురూ కలిసి కచేరీ చేస్తున్నారని అర్థం. అంటే ఆ ఊరిపేర్లు వాచ్యార్థం. ఆ ఊర్లకు చెందిన ప్రముఖ విద్వాంసులు కచేరీ చేస్తున్నారనేది లక్ష్యార్థం.

లక్ష్యార్థం, వాచ్యార్థానికి దగ్గరగా ఉండాలి. వాచ్యార్థం కుదరని చోట, లక్ష్యార్థం ఎలా ఉపయోగించాలో, ఈ ఉపనిషత్తులోనే **సత్యం జ్ఞానమనంతం బ్రహ్మ** వాక్యవిచారణ చూశాము. నియమం ఏమిటంటే, ముందు వాచ్యార్థం ఉపయోగించి చూడాలి. అది ఆ సందర్భంలో కుదరకపోతే, అప్పుడు దానికి లక్ష్యార్థం ఉపయోగించాలి. ఒకవేళ లక్ష్యార్థం కూడా కుదరకపోతే, ఆ వాక్యంలో అర్థం లేదు. కాని శాస్త్రం అలా ఎన్నడూ అర్థంలేని వాక్యాలను బోధించదు. ఎందుకంటే, శాస్త్రం వచ్చింది సాక్షాత్తూ ఆ పరమాత్మ నుంచే. కాబట్టి ఈ రెండింటిలో ఏదో ఒక అర్థం సరిపోవాలి. ఈ నేపథ్యంతో ఈ వాక్యాన్ని చూద్దాము.

ఆనందం పదానికి కూడా వాచ్యార్థం, లక్ష్యార్థం రెండూ ఉన్నాయి. ఆనందం పదానికి వాచ్యార్థం కోశానందం. నేను అంతకుముందు ఆనందంగా ఉన్నాను; ఇప్పుడు ఆనందంగా ఉన్నాను; భవిష్యత్తులో ఆనందంగా ఉంటాను అని చెబుతాము కోశానందం గురించి. ఆనందానికి వాచ్యార్థం తీసుకుంటే, మానుష ఆనందం, హిరణ్యగర్భ ఆనందం – రెండూ కూడా కోశానందాలే. ఈ విధంగా చూస్తే, వాచ్యార్థం కుదరదు. ఎందుకంటే ఈ రెండు ఆనందాల మధ్యా సహస్రాంతం భేదం ఉంది. మానుష ఆనందం 1 కొలత అనుకుంటే, హిరణ్యగర్భ ఆనందం $10^{20}$ అని వచ్చింది.

వాచ్యార్థం కుదరదు కాబట్టి లక్ష్యార్థం చూడాలి. ఇక్కడ లక్ష్యార్థం ప్రకారం ఆనందం అంటే ఆత్మానందం లేదా బింబానందం. అందువల్ల ఈ అనువాకంలో ఎవరైతే ఈ మహావాక్యాన్ని అర్థం చేసుకుంటారో, వారు ఆత్మానంద జ్ఞానం పొందుతారు అని వస్తుంది. అందువల్ల జీవాత్మ–పరమాత్మ ఐక్యం బోధిస్తున్నది అంటే స్వరూప ఆనందదృష్ట్యా ఐక్యజ్ఞానం అని అర్థం చేసుకోవాలి.

జ్ఞానం పొందితే అక్షరాలా స్వరూప ఆనందం పొందుతామని కాదు అర్థం; మనం ఆనందస్వరూపులం అని అర్థం చేసుకుంటే, ఆనందంకోసం అర్రులు చాస్తూ, బాహ్యంగా పరుగులు తీయటం ఆపుతాము. అందువల్ల స్వరూప ఆనందం పొందుతాము అంటే దాని అర్థం మన స్వరూపమే ఆనందం అని అర్థం చేసుకుని, ఆ ఆనందంలో నిలబడి ఉండటం.

**స య ఏవంవిత్। అస్మాల్లోకాత్ప్రేత్య। ఏతమన్నమయమాత్మానముపసంక్రామతి। ఏతం ప్రాణమయమాత్మానముపసంక్రామతి। ఏతం మనోమయమాత్మానముపసంక్రామతి। ఏతం విజ్ఞానమయమాత్మానముపసంక్రామతి। ఏతమానందమయమాత్మానముపసంక్రామతి। తదప్యేష శ్లోకో భవతి ।**

**ఫలం** – ఇప్పుడు ఈ మహావాక్యంలో నిలబడితే కలిగే ఫలాన్ని చూస్తాము.

**స య ఏవం విత్ । అస్మాల్లోకాత్ప్రేత్య** – ఎవరైతే కోశానందం, ఆత్మానందాల గురించిన ఈ సత్యాన్ని తెలుసుకుంటారో, అతను బాహ్యప్రపంచంనుంచి దృష్టిని మరలుస్తాడు. మామూలుగా ప్రేత్య అంటే మరణం అని అర్థం వస్తుంది. కాని ఇక్కడ శంకరాచార్యులవారు దాన్ని బాహ్యప్రపంచంనుంచి వెనుదిరగటం అంటున్నారు. అంటే అతను బాహ్యవస్తువులమీద, తన ఆనందంకోసం ఆధారపడడు. ఇన్నాళ్ళూ విషయవస్తువులు ఆనందం ఇస్తాయని భావించి, వాటివెంట పరుగులు తీశాడు. ఇప్పుడు అతనికి, తనే ఆనందస్వరూపుడనీ, ఆనందం బాహ్యంగా దొరికేది కాదనీ అర్థం అయింది. బాహ్యవస్తువులమీద, మనుష్యులమీద శాంతి, భద్రత, ఆనందాలకోసం ఇంక ఆధారపడడు. ప్రేత్య అంటే మరణించి కాదు, వెనుదిరిగి అని అర్థం.

**ఏతమన్నమయమాత్మానముపసంక్రామతి** – ఉపసంక్రామతి పదాన్ని అక్షరాలా తీసుకుంటే దాటటం లేదా అతీతంగా ఎదగటం. జ్ఞాని అన్నమయకోశానికి అతీతంగా ఎదుగుతాడు అని అర్థం. అతీతంగా ఎదగటం అంటే ఆ కోశంమీద ఉన్న అభిమానాన్ని వదులుకుంటాడు అంటారు శంకరాచార్యులవారు. ఇంకో విధంగా చెప్పాలంటే, నేను అన్నమయాన్ని అనే పొరపాటునుంచి బయటపడతాడు. అతీతంగా ఎదుగుతాడు అంటే అన్నమయం అతని ప్రారబ్దకర్మనుబట్టి, అతనికి తాత్కాలికంగా ఇవ్వబడిన ఉపాధి అనీ, ఈ ఉపాధి పంచభూతాలు ఇచ్చిన కానుక అనీ అర్థం చేసుకుంటాడు. ఎప్పుడైతే ఈ ప్రారబ్ధకర్మ ముగిసిపోతుందో, అప్పుడే ఈ అన్నమయం సమష్టి అన్నంలో కలిసిపోతుంది. అందువల్ల ఉపసంక్రామతి అంటే అన్నమయ అభిమానత్యాగం చేయటం.

**ఏతం ప్రాణమయమాత్మనముపసంక్రామతి** – ఈ జ్ఞాని ప్రాణమయంతో కూడా అభిమానాన్ని పెంచుకోడు.

**ప్రాణమయే ఆత్మ అభిమానం త్యజతి**

ఈ ప్రాణమయం కూడా సమష్టిప్రాణానికి చెందినది; అది జడం, తాను చైతన్యతత్త్వం అని అర్థం చేసుకుంటాడు జ్ఞాని.

**ఏతం మనోమయమాత్మానముపసంక్రామతి** – అదే విధంగా మనోమయం కూడా ఆత్మ కాదు, అది ఒక కోశం మాత్రమే అని అర్థం చేసుకుంటాడు. పంచకోశవివేకం చూసినప్పుడు ఎలా ఒక్కొక్క కోశాన్నీ ముందు ఆత్మ అనుకుంటాడో, తర్వాత అది ఆత్మ కాదని తెలిసిన తర్వాత దాన్ని అనాత్మగా ఐదు దశల్లో ఎలా నిరూపిస్తాడో చూశాము. ఆ ఐదు దశలూ – అనాత్మ నిశ్చయః, కార్యత్వ నిశ్చయః, నామరూపత్వ నిశ్చయః, మిథ్యాత్వ నిశ్చయః, ప్రవిలాపన నిశ్చయః. అక్కడ అలా ఉదాహరణకు మనోమయకోశాన్ని, విజ్ఞానమయ ఆత్మలో లయం చేశాము. ఇప్పుడు ఇంచుమించు అలాగే అవుతున్నది.

**ఏతం విజ్ఞానమయమాత్మానముపసంక్రామతి** – విజ్ఞానమయం కూడా ఆత్మ కాదు, అనాత్మ. భగవద్గీతలో కృష్ణపరమాత్మ దాన్ని జీర్ణించిన వస్త్రంతో పోల్చాడు.

**వాసాంసి జీర్ణాని యథా విహాయ నవాని గృహ్ణాతి నరోఽపరాణి ।**
**తథా శరీరాణి విహాయ జీర్ణాన్యన్యాని సంయాతి నవాని దేహీ ॥** – గీత 2.22

ఎలాగైతే ఒకవ్యక్తి దుస్తులు మార్చి వేరే దుస్తులు వేసుకుంటాడో, అదే విధంగా ఆత్మ కూడా జీర్ణమైన ఈ శరీరాన్ని వదిలి, కొత్త శరీరాన్ని చేపడుతుంది అన్నాడు కృష్ణపరమాత్మ.

**ఏతమానందమయమాత్మానముపసంక్రామతి** – ఆనందమయకోశంమీద అభిమానాన్ని కూడా త్యాగం చేస్తాడు. ఆనందమయకోశంలోనే కోశానందాన్ని పొందుతాడు, కాని జ్ఞాని దాన్ని

కూడా వదులుకుంటాడు. ఎందుకు? కోశానందం కేవలం ప్రతిబింబానందమే కాని, అది అసలు స్వరూపానందంయొక్క ప్రతిబింబం అనీ అర్థం చేసుకుంటాడు. అద్దంలో కనబడే మొహం తన ప్రతిబింబం మాత్రమే, అసలు మొహం తన భుజస్కందాలమీద భద్రంగా ఉందని తెలుసుకుంటే; అద్దం పోతే తను పోయాడని బెంబేలెత్తిపోడు కదా! అసలైన మేలిమి బంగారం అతని చేతిలో ఉంటే, కల్తీ బంగారం వెంట పరుగులు తీస్తాడా?

**(ఆత్మానంద నిష్ఠః భవతి)** – ఈ పదాలను మనం కలుపుకోవాలి. ఒక జ్ఞాని పంచకోశ అభిమానాన్ని ఒక్కొక్కటిగా వదులుకుంటూ వస్తే, అతను చివరికి తన ఒడిలోనే వాలుతాడు. అంటే అతను తన స్వరూప ఆనందంలోనే నెలకొనివుంటాడు. ఆత్మానందంలో నెలకొని ఉంటాడు అంటే అర్థం అతనే ఆత్మానందం అని అర్థం చేసుకుంటాడు. ఈ జ్ఞానాన్ని ఎన్నడూ మర్చిపోడు. అంటే తన స్వరూపమే ఆత్మానందం అని క్షణం కూడా మర్చిపోడు. అభేదజ్ఞానంలో నిలబడి ఉంటాడు. ఆత్మనిష్ఠ అంటే బాహ్యంగా చేసే కర్మకాదు; దీర్ఘకాలం చేసే ధ్యానం అంతకన్నా కాదు. ఇది బుద్ధిలో క్రమేపీ కలిగే మార్పు. నేను ఆత్మను; నా స్వరూపం ఆనంద స్వరూపం అనే జ్ఞానంలో నిలబడటం.

**తదప్యేష శ్లోకో భవతి** – ఆనంద స్వరూపాన్ని వివరించే ఋగ్మంత్రం కూడా ఒకటి ఉంది.

### అనువాకం – 9

**యతో వాచో నివర్తంతే। అప్రాప్య మనసా సహ। ఆనందం బ్రహ్మణో విద్వాన్। న బిభేతి కుతశ్చనేతి। ఏతగ్ం హ వావ న తపతి। కిమహగ్ం సాధు నాకరవమ్। కిమహం పాపమకరవమితి। స య ఏవం విద్వానేతే ఆత్మానగ్గ్ం స్పృణుతే । ఉభే హ్యేవైష ఏతే ఆత్మానగ్గ్ం స్పృణుతే । య ఏవం వేద । ఇత్యుపనిషత్ ॥**

### వివరణ

**యతో వాచో నివర్తన్తే। అప్రాప్య మనసా సహ। ఆనందం బ్రహ్మణో విద్వాన్। న బిభేతి కుతశ్చనేతి।**

**విద్వాన్ న బిభేతి** – ఈ ఋగ్మంత్రంలో ముఖ్యమైన వాక్యం ఇది. ఈ జ్ఞాని ఈ సృష్టిలో దేన్నీ చూసి భయపడడు. ఎందుకు? అతను ఆనందం లేదా పూర్ణత్వం తన స్వరూపలక్షణం అని అర్థం చేసుకున్నాడు. అతని స్వరూపమే ఆనందస్వరూపం అయితే, ఆ ఆనందాన్ని పోగొట్టుకునే అవకాశం ఎక్కడ?

బాహ్యవస్తువులనుంచి పొందిన ఆనందం షరతులతో కూడినది, ఎప్పుడొస్తుందో తెలియదు, ఎన్నాళ్ళుంటుందో తెలియదు, ఎప్పుడు దుఃఖంలో ముంచెత్తి మటుమాయమై పోతుందో అసలే తెలియదు. ఆనందం వచ్చిందనే ఆనందంకన్నా, ఆ వచ్చిన ఆనందం ఏ క్షణంలో

మాయమైపోతుందోననే ఆందోళన తినేస్తుంది మనిషిని. బాహ్యవస్తువులనుంచి వచ్చే ఆనందంలో రెండు దశలు ఉన్నాయి. అవి యోగం, క్షేమం. యోగం అంటే బాహ్యవస్తువులను పొందటం; క్షేమం అంటే ఆ పొందిన వస్తువులను పదికాలాలు నిలబెట్టుకోవటం. కాని జ్ఞానికి ఈ యోగక్షేమాల బెడద లేదు. అతనే ఆనందానికి నెలవు; ఇంక అది వస్తుందో, రాదో బెంగలేదు; వెళ్ళిపోతుందేమోననే ఆందోళన లేదు. యోగక్షేమాల గురించి బెడద అసలే లేదు. అందువల్ల అతను కొంచెం కూడా భయపడడు.

**బ్రహ్మణః ఆనందం (విద్వాన్)** – బ్రహ్మానందం లేదా ఆత్మానందం తన స్వరూపం అని అర్థం చేసుకున్న జ్ఞానికి దాన్ని పోగొట్టుకుంటానేమో అనే భయం ఉండదు. ఎందుకంటే, స్వరూపం నిర్వచనమే ఎన్నటికీ మారనిది అని అర్థం. ఎటువంటి బ్రహ్మ?

**యతో వాచో నివర్తన్తే। అప్రాప్య మనసా సహ** – ఆ బ్రహ్మను వాక్కు, మనస్సు కూడా చేరుకోలేక వెనుదిరుగుతున్నాయి. ఎలా వెనుదిరుగుతున్నాయి?

అప్రాప్య – అక్కడదాకా చేరకుండానే వెనుదిరుగుతున్నాయి. బ్రహ్మను చేరుకున్నాయి అంటే బ్రహ్మ ఆబ్జెక్ట్ అవుతుంది. కాని బ్రహ్మ ఆబ్జెక్ట్ కాదు, సబ్జెక్ట్. సబ్జెక్టును వాక్కు కాని, మనస్సు కాని చేరుకోలేవు. అందువల్ల ఎవరైతే బ్రహ్మ బాహ్యవస్తువు కాదు, తనే అని అర్థం చేసుకుంటాడో అతనికి భయం ఎన్నడూ వేయదు. అభయం ప్రతిష్ఠితాం విందతే.

ఇక్కడితో ఆనందమీమాంస ముగిసింది.

ఈ ఆనందమీమాంస ద్వారా కొన్ని ఉపసిద్ధాంతాలను గ్రహించాలి. ముందుగా మనం ఆత్మానందానికీ, కోశానందానికీ మధ్యనున్న భేదాన్ని బాగా అర్థం చేసుకున్నాము. కోశానందాన్ని విషయప్రాప్తి ద్వారా కాని, వైరాగ్యప్రాప్తి ద్వారా కాని పొందవచ్చు కాని, ఆత్మానందాన్ని జ్ఞానంవల్ల మాత్రమే పొందగలమని అర్థం చేసుకున్నాము. ఇదీ టూకీగా ఆనందమీమాంస.

ఇప్పుడు ఒక జ్ఞాని పరిస్థితిని విశ్లేషిద్దాము.

– జ్ఞాని జ్ఞానం పొందుతాడు కాబట్టి అతను ఆత్మానందాన్ని పొందుతాడు.

– జ్ఞానం పొందటానికి ఒక సాధకునికి కావాల్సిన అర్హతలు – సాధన చతుష్టయ సంపత్తిని కలిగివుండటం. సాధన చతుష్టయ సంపత్తి అంటే వివేకం, వైరాగ్యం, శమాది షట్కసంపత్తి, ముముక్షుత్వం. ఎలాగైతే పీజీ చేయాలంటే ఒక విద్యార్థి డిగ్రీ పాసై ఉండి ఉంటాడో, అలా ఒక జ్ఞాని ఈ సాధన చతుష్టయ సంపత్తిని పొంది ఉండేవుంటాడు. అంటే జ్ఞానికి ఇటు జ్ఞానమూ ఉంటుంది, అటు వైరాగ్యమూ ఉంటుంది.

ఇంతకుముందు కోశానందం గురించి చూసినప్పుడు, వైరాగ్యం ద్వారా కూడా కోశానందాన్ని పొందవచ్చని చూశాము. అంటే జ్ఞాని జ్ఞానం ద్వారా ఆత్మానందాన్ని పొందుతాడు; వైరాగ్యం ద్వారా కోశానందాన్ని కూడా పొందుతాడు. ప్రపంచంలో ఉన్న ఏ ఆనందాన్ని తీసుకున్నా కూడా అది ఈ రెండు తెగల్లో ఏదో ఒక తెగ కిందకు వస్తుంది. అంటే అయితే కోశానందం లేదా ఆత్మానందం అవుతుంది. ఆ విధంగా జ్ఞాని అక్షరాలా విషయప్రాప్తిని పొందకపోయినా ప్రపంచంలో ఉన్న అన్ని రకాల ఆనందాలనూ అనుభవిస్తాడు.

ఈ విధంగా ఆనందమీమాంస ద్వారా ఉపనిషత్తు మొట్టమొదట చెప్పిన చిన్న వాక్యానికి పెద్ద వాఖ్యానం ద్వారా వివరణ చెప్పకనే చెప్పింది.

**లఘుభాగము – సోఽశ్నుతే సర్వాన్ కామాన్ సహ**

**వ్యాఖ్యానభాగము – ఆనందమీమాంస ద్వారా**

– ఒక శిష్యుడు గురువును రెండు అనుప్రశ్నలు ప్రత్యక్షంగా అడిగాడనీ, ఒక ప్రశ్న పరోక్షంగా అడిగినట్టు అర్థం చేసుకోవాలనీ చూశాము. అవేమిటో మళ్ళీ చూద్దాము.

ఎ) బ్రహ్మ ఉందా లేదా? (పరోక్ష ప్రశ్న)

బి) మరణానంతరం అజ్ఞాని బ్రహ్మలో ఐక్యమవుతాడా లేదా?

సి) మరణానంతరం జ్ఞాని బ్రహ్మలో ఐక్యమవుతాడా లేదా?

ఈ మూడు ప్రశ్నల్లో మొదటి ప్రశ్నకు గురువు చాలా వివరంగా జవాబు చెప్పాడు. బ్రహ్మ అస్తి అని ఏడు కారణాల ద్వారా నిరూపించాడు. కాని మీరు గమనిస్తే, గురువు తక్కిన రెండు ప్రశ్నలకూ జవాబు చెప్పకుండా, నిశ్శబ్దంగా ఆనందమీమాంసలోకి వెళ్ళిపోయాడు. ఇంక ఈ వల్లీ మరి నాలుగు పాదాలతో ముగింపుకు వస్తోంది కాని, ఆ ప్రశ్నలకు జవాబులు ఎక్కడా కనబడటం లేదు. అంటే గురువు ఆ ప్రశ్నలను మర్చిపోయాడు అనుకోవాలా? శంకరాచార్యులవారు మన సందేహానికి జవాబు చెబుతున్నారు. ఈ రెండు ప్రశ్నలకు సమాధానం ఫలశ్రుతిలో ఇమిడివుంది అంటున్నారు శంకరాచార్యులవారు.

ఫలశ్రుతి ఏమిటి? జ్ఞాని ఈ పంచకోశాలకు అతీతంగా ఎదిగి, బ్రహ్మానందంలో లేదా ఆత్మానందంలో నెలకొనివుంటాడు. ఇది పరోక్ష జవాబు. అదెలా?

అసలా ప్రశ్నలకే జవాబు ఇవ్వలేమని మనం అంటాము. ఎందుకు? ఆ ప్రశ్నలే తప్పు. తప్పు అయిన ప్రశ్నకు సరియైన సమాధానం అంటూ ఉండదు. ఉదాహరణకు ఎవరైనా చెన్నైలో ఉన్న అడయార్ నుంచి ఆళ్వార్‌పేటకు ఎన్ని కిలోగ్రాములు ఉంది అని అడిగితే, మీరు జవాబు చెబుతారా? చెప్పరు. అడయార్‌కూ, ఆళ్వార్‌పేటకూ మధ్య ఉన్న దూరాన్ని కిలోమీటర్లలో కొలవాలి కాని కిలోగ్రాములతో కాదు.

అదే విధంగా, ఇక్కడ కూడా ప్రశ్నే తప్పు. అజ్ఞాని బ్రహ్మలో కలుస్తాడా, జ్ఞాని బ్రహ్మలో కలుస్తాడా అనే ప్రశ్నల్లో ఉన్న అర్థం బ్రహ్మను వెళ్ళి చేరుకుంటాడా అని. బ్రహ్మను చేరటమా, మానటమా ప్రశ్న ఎప్పుడు వస్తుంది? బ్రహ్మ మీకు భిన్నంగా, దూరంగా ఉన్న గమ్యంగా తీసుకుంటే ఆ ప్రశ్న ఉదయిస్తుంది. కాని బ్రహ్మ ఒక సాధకుడు ప్రయాణం చేసి చేరుకునే గమ్యం కాదు, ఆ సాధకుడే బ్రహ్మ.

ఎవరూ బ్రహ్మను చేరుకోరు. కాని ఈ ప్రశ్నలకు జవాబు చెప్పితీరాలి అంటే ఈ విధంగా చెప్పవచ్చు. అజ్ఞాని బ్రహ్మలో లయమవుతాడా లేదా అంటే అతను లయమవడు. ఎందుకు? అతని ఉద్దేశ్యంలో బ్రహ్మకూ, అతనికీ మధ్య దూరం ఉంది. అతని అజ్ఞానం ఆ దూరాన్ని ఏర్పరచింది. ఆ అజ్ఞానం ఉన్నంతవరకూ ఆ దూరం ఉంటూనే ఉంటుంది. అతను అజ్ఞానంతో మరణిస్తాడు కాబట్టి, అతను బ్రహ్మలో ఐక్యమవడు అని భావించాలి.

ఇకపోతే జ్ఞాని విషయం తీసుకుంటే, అతను బ్రహ్మ తన స్వరూపం అనే జ్ఞానం పొందాడు. అతని దృష్టిలో బ్రహ్మకూ, తనకూ మధ్య దూరం లేదు కాబట్టి, అతను బ్రహ్మలో 'ఐక్యమయినట్టు'గా భావించాలి. ఇవీ ఈ రెండు ప్రశ్నలకూ జవాబులు. వీటితో మూడు ప్రశ్నలకూ జవాబులు వచ్చేసినట్టే చెప్పవచ్చు.

**ఏతగ్ం హ వావ న తపతి। కిమహగ్ం సాధు నాకరవమ్। కిమహం పాపమకరవమితి। స య ఏవం విద్వానేతే ఆత్మానగ్గ్ం స్పృణుతే। ఉభే హ్యేవైష ఏతే ఆత్మానగ్గ్ స్పృణుతే । య ఏవం వేద। ఇత్యుపనిషత్**

**4 ఉపసంహారం–అనువాకం –9**

**జ్ఞానఫలం** – జ్ఞానం పొందాక, జ్ఞాని తన శేషజీవితాన్ని ఎలా గడుపుతాడో వివరిస్తున్నది ఉపనిషత్తు. అంటే అతను పొందే ఫలాన్ని చెబుతున్నది. అజ్ఞాని ఎప్పుడూ సంసారంలో పడి కొట్టుమిట్టాడుతుంటే, జ్ఞాని జీవన్ముక్తిని అనుభవిస్తాడు. అంటే అతను ఇక్కడే, ఇప్పుడే సంసారబంధంనుంచి విముక్తి చెందుతాడు. ఈ భాగం సారాంశం ఇది.

సంసారాన్ని అనేక రకాలుగా నిర్వచించవచ్చు. సంసారం అనేక భావోద్రేకాల రూపంలో బాధపెడుతుంది. సంసారానికి మూలకారణాన్ని శోధిస్తే, అది ఆత్మ అజ్ఞానం. ఈ అజ్ఞానం కారణమయితే, దాని ప్రభావంవల్ల అనేక భావోద్రేకాలను ఎదుర్కోవాల్సి ఉంటుంది. ఇక్కడ ఉపనిషత్తు అలాంటి భావోద్రేకాల్లోంచి రెండు సమస్యలను ఎన్నుకుంది. నేను చేయాలనుకున్నది చేయలేకపోయాను ఒక సమస్య; ఇటువంటి తప్పుడు పని ఎందుకు చేశాను ఇంకొక సమస్య. వాటిని కొంచెం వివరంగా చూద్దాము.

మనిషిని పట్టి కుదిపివేసే బాధల్లో ఒకటి గతం గురించిన ఒక పశ్చాత్తాపం. వయస్సు పెరిగినకొద్దీ, ముందున్న జీవితం భూతద్దంలోంచి కనిపిస్తుంది. అంటే పెద్ద సమస్యగా పట్టిపీడిస్తుంది. మీరు చిన్నవయస్సులో ఉంటే భవిష్యత్తు ఎంతో సుదూరంగా ఉంది, ఆ సుదూర భవిష్యత్తు గురించి రంగురంగుల స్వప్నాలు కంటారు. కాని నలభై లేదా యాభయ్యో పడిలో పడేసరికి, సుదూరంగా ఉన్న భవిష్యత్తు దగ్గరికి వచ్చేస్తుంది; జీవితం తగ్గిపోతుంది. దానితో భవిష్యత్తు గురించి పంచరంగుల స్వప్నాలు కనేబదులు వెనక్కి తిరిగి గతంలోకి తొంగిచూడటం మొదలుపెడతారు. గతంలోకి తొంగిచూసిన కొద్దీ, గతం గురించిన పశ్చాత్తాపం ఎక్కువవుతుంది.

ఎవరో వృద్ధాప్యాన్ని అద్భుతంగా వర్ణించారు. 'భవిష్యత్తు గురించిన రంగుల కలల స్థానంలో, గతం గురించిన బాధలు చోటుచేసుకుంటున్నాయంటే, వృద్ధాప్యంమీద పడుతున్నట్టు అర్థం.' గతంలోకి తొంగిచూడటం అంతకంతకూ ఎక్కువవుతుంది. గతంలోకి తొంగిచూడటం ఎక్కువైనకొద్దీ, సహజంగానే గతం గురించి మాట్లాడటం ఎక్కువవుతుంది. ఒక్కముక్కలో చెప్పాలంటే గతంలోని ఒమిషన్స్, కమిషన్స్ మనస్సును తొలచివేస్తాయి. ఒమిషన్స్ అంటే చేసివుండాల్సినవి చేయకపోవటం. నేను అలా చేసి ఉండాల్సింది, అలా అని ఉండాల్సింది, అలా ఉండి ఉండాల్సింది అనుకోవటం. కమిషన్స్ అంటే చేయకూడనివి చేయటం. నేను అలా చేసివుండాల్సింది కాదు, అలా అని ఉండాల్సింది కాదు, అలా ఉండి ఉండాల్సింది కాదు అనుకోవటం. ఈ రెండే బాధిస్తాయి. ఇదే సంసారం అంటే!

ఈ సంసారంనుంచి ఎన్నడూ తప్పించుకోలేరు, ముఖ్యంగా వృద్ధాప్యంలో. ఎందుకు? మీరు యవ్వనంలో ఉండగా, ఇలా ఏదైనా బాధిస్తే, ఏ పనిలోనో బలవంతంగా కూరుకుపోయి, మీ మనస్సు మిమ్మల్ని తొలిచివేయకుండా, వేరే వ్యాపకం పెట్టుకోగలరు. కాని వృద్ధాప్యంలో మీ పప్పులు ఉడకవు. ఒంటరిగా మంచంమీద పడుకుని, పలికే దిక్కు లేక, చేసే పనిలేక, శూన్యంలోకి చూస్తూ, మీకు తెలియకుండానే గతంలోకి జారిపోతారు. పదవీ విరమణ తర్వాత ధ్యానం చేద్దాంలే అనుకుని, దాన్ని మీరు అశ్రద్ధ చేస్తే, పదవీ విరమణ తర్వాత మీ అంగాలు మీనుంచి విరమిస్తాయి. మేము అలసిపోయాము, ధ్యానం చేయలేము అంటాయి.

అందువల్ల ఖాళీగా కూర్చోవటం తప్ప ఏమీ మిగలదు. అప్పుడు ఈ రెండురకాల పశ్చాత్తాపం కుదిపివేస్తుంది.

**కిమహగ్ం సాధు నాకరవమ్** – నేను ఎందుకు ఈ మంచి పనులను చేయలేదు? అంటే ఒమిషన్స్ గురించి పశ్చాత్తాపం.

**కిమహం పాపమకరవమితి** – నేనెందుకిలా పాపపు పనులను చేశాను? అంటే కమిషన్స్ గురించిన పశ్చాత్తాపం.

ఈ ఒమిషన్స్, కమిషన్స్‌లను కలిపి గిల్ట్ అంటారు. అంటే పశ్చాత్తాపం.

**ఏతగ్ం హ వావ న తపతి** – ఈ పశ్చాత్తాపం అజ్ఞానిని పట్టి కుదిపివేస్తుంది కాని, జ్ఞానిని ఈ పశ్చాత్తాపం బాధించదు. అంటే అతనేమీ పాపాలు చేయలేదా? జ్ఞానం పొందక ముందు అతను కూడా పాపాలు చేసేవుంటాడు. ఒక్క భగవంతుడు తప్ప, ప్రతి ఒక్కరూ పొరపాట్లు చేసే ఉండివుంటారు లేదా పంచమహాపాతకాల్లో ఏదైనా పాతకాన్ని చేసే ఉంటారు. ఒకవేళ ఈ జన్మలో చేయకపోయినా పూర్వజన్మల్లోనైనా చేసేవుంటారు. అందులో జ్ఞాని కూడా వస్తాడు. అయినా ఇవేమీ జ్ఞానిని బాధించవు. ఎందుకు?

**స య ఏవం విద్వానేతే ఆత్మానగ్ం స్పృణుతే** – జ్ఞాని ఈ ఒమిషన్స్, కమిషన్‌లను మిథ్యగా లేదా సంసారంగా కొట్టివేస్తాడు. అవి వ్యావహారిక స్థాయికి చెందినవి. అవి పారమార్థిక స్థాయికి చెందిన అతనిని బాధించలేవు అని జ్ఞాని అర్థం చేసుకుంటాడు. చేయకూడని పాపాలు కాని, చేయని పుణ్యాలు కాని, ఆత్మకు అంటవు. స్వప్నంలో స్వాప్నికుడు చేసిన పుణ్యపాపాలు జాగ్రద్‌పురుషుణ్ణి అంటవు. ఉదాహరణకు స్వాప్నికుడు స్వప్నంలో ఎవరినైనా చంపినా, అతను ఆ స్వప్నంనుంచి నిద్రలేచాక, ఆ హత్య చేసిన పాపం జాగ్రద్‌పురుషుణ్ణి అంటదు, అతన్ని శిక్షించలేదు.

అదే విధంగా, జ్ఞానం పొందకముందు అతనికి వచ్చిన పుణ్యపాపాలు జాగ్రదావస్థకు చెందుతాయి; కాని అతను తన పారమార్థికస్థాయిని తెలుసుకుంటే, ఈ జాగ్రదావస్థ కూడా స్వప్నం–2 అవుతుంది. ఈ స్వప్నం–2లోని అంశాలు, దాన్నించి లేచిన అతనికి అంటవు.

ఎప్పుడైతే, అతను ఈ ఉన్నతస్థాయినుంచి చూస్తాడో, అంటే అహం బ్రహ్మ అస్మి అని అర్థం చేసుకుంటాడో, అప్పుడే వ్యావహారిక స్థాయికి చెందిన అతని జీవితం చాలా చిన్నదిగా, విలువ లేనిదిగా కనిపిస్తుంది. సూర్యుడు ఉదయిస్తే, సూర్యకాంతి ముందు ప్రమిద దీపం వెలవెలబోతుంది. దీన్నే అభిభావః అంటారు. సూర్యుడు ఉదయించాక కూడా, ప్రమిద దీపం వెలుగుతూనే ఉంటుంది; కాని ఆ చిరుదీపం ఉనికి ఉన్నా లేనట్టే అవుతుంది, ఆ ప్రకాశం ముందు. అదేవిధంగా జ్ఞానికి జ్ఞానం పొందాక కూడా శరీరం, అహంకారం, ప్రారబ్ధం ఉంటాయి కాని అవి అతన్ని ఎంతమాత్రమూ బాధించలేవు. జ్ఞానం పొందిన నేపథ్యంలో, చిన్నసూదితో గుచ్చితే బాధ తెలియనట్టుగా, అవి అతన్ని బాధించలేవు.

స్పృణుతే అంటే అలా అతను తన ఉన్నతస్థాయిని తెలుసుకుని, శక్తివంతునిగా మారతాడు.

**ఉభే హ్యేవైష ఏతే ఆత్మానగ్ం స్పృణుతే** – ఈ వాక్యం మళ్ళీ రెండవసారి చెప్పబడింది. అలా రెండవసారి చెబితే, ఇక్కడితో ఈ వల్లీ ముగిసిందని అర్థం. ఆ విధంగా ఎవరైతే తన ఉన్నతస్థాయికి ఎదుగుతాడో, అతను పాపపుణ్యాలనుంచి విముక్తుడవుతాడు.

**పుణ్యపాపే విధూయ** – ముండకమ్

జ్ఞాని తన పుణ్యపాపాలను వదులుకుంటాడు అంటే అవి అతన్ని అంటవు. మీరు సినిమా చూస్తున్నప్పుడు ఆ సినిమా తెరమీద ఆడేది బొమ్మ మాత్రమే అనే జ్ఞానంతో నిలబడగలిగితే తెరమీద కత్తిని చూసి మీరు భయంతో అరవరు. అదంతా మిథ్యా అని తెలుసుకుని, దాన్ని ఆనందంగా చూస్తారు.

ఆ విధంగా జ్ఞానిని తాను చేసివుండాల్సింది అనే బాధ బాధించదు; చేయకుండా ఉండాల్సింది అనే పశ్చాత్తాపమూ బాధించదు. ఈ పనులు చేయటం, చేయకపోవటం కర్తకు సంబంధించినవి – తను అకర్తా, అభోక్తా.

**య ఏవం వేద** – ఈ విషయాన్ని ఎవరైతే అర్థం చేసుకుంటారో అతన్ని ఏ పశ్చాత్తాపమూ క్రుంగదీయదు. అంటే ఒమిషన్సు బాధించవు; కమిషన్సు బాధించవు. జ్ఞానికి గతం గతః. గతాన్ని తలుచుకుని కుమిలిపోడు.

ఒక్కముక్కలో చెప్పాలంటే జ్ఞానఫలం సంసారనివృత్తి. దీన్నే జీవన్ముక్తి అంటారు.

**ఇత్యుపనిషత్** – ఈ విధంగా ఉపనిషత్తు ముగిస్తున్నది.

**ఓం సహ నావవతు। సహ నౌ భునక్తు। సహ వీర్యం కరవావహై। తేజస్వి నావధీతమస్తు మా విద్విషావహై॥ ఓం శాంతిశ్శాంతిశ్శాంతిః॥**

ఈ శాంతిపాఠాన్ని ఈ వల్లీ చివర్లో కూడా పఠించాలి. ఈ వల్లీ మొదలుపెట్టక ముందు శాంతిపాఠాన్ని పఠించేది జ్ఞానప్రాప్తిని కలుగజేయమని; జ్ఞానాన్ని పొందటానికి అనువుగా విఘ్నాలు లేకుండా చేయమనీ కోరటానికి.

ఇప్పుడు ఈ వల్లీ విజయవంతంగా ముగించుకోగలిగినందుకు, ఆటంకాలు లేకుండా, జ్ఞానం పొందినందుకు కృతజ్ఞతలు తెలియజేసుకుంటూ, జ్ఞాననిష్ఠాప్రాప్తిని కలుగజేయమని కోరుతూ చేస్తాము.

సహ నావవతు – జ్ఞానప్రాప్తిని కోరటం

సహ ==నౌ భునక్తు – జ్ఞాననిష్ఠాప్రాప్తిని కోరటం

ఈ జ్ఞాననిష్ఠలో నిలబడలేకపోతే, గురువు బోధ చేసినంతసేపూ అర్థమయినట్టే ఉంటుంది కాని, బయటకు రాగానే ఈ జ్ఞానమంతా ఆవిరయిపోతుంది. అలా ఆవిరయిపోకుండా ఉండాలంటే, పొందిన జ్ఞానాన్ని జ్ఞాననిష్ఠగా మలుచుకోవాలి.

ఇక్కడితో బ్రహ్మానందవల్లీ అయిపోయింది.

# తైత్తిరీయోపనిషత్ - బ్రహ్మానందవల్లీ సారాంశం

తైత్తిరీయోపనిషత్తులోని రెండవ అధ్యాయమైన బ్రహ్మానందవల్లీ ముఖ్యమైన వల్లీ. ఎందుకంటే ఈ అధ్యాయంలోనే వేదాంతబోధ వస్తుంది. మొదటి వల్లీ, మూడవ వల్లీలు సహకారీ సాధనలను వివరిస్తాయి. దీన్నిబట్టి సహకారీ సాధనలు లేకుండా, సాక్షాత్తూ సాధన అయిన రెండవ వల్లీ అర్థం చేసుకోవటం కష్టమవుతుందని మనం గ్రహించాలి.

**అంశపరంగా సారాంశం**

మొత్తం బ్రహ్మానందవల్లీని అంశపరంగా ఐదు భాగాలుగా విభజించవచ్చు.

1. సూత్రభాగము – వేదాంతబోధ సూత్రరూపంలో అనువాకం 1
2. వృత్తిభాగము – సూత్రానికి లఘు వ్యాఖ్యానం అనువాకం 1
3. వ్యాఖ్యానభాగము – ఇంకా లోతైన విచారణ అనువాకాలు 1–5,8
4. ఉపసంహారం – అనువాకం 9
5. అనుప్రశ్నలు – అనువాకాలు 6, 7

1. **సూత్రభాగము** – వేదాంతబోధ సూత్రరూపంలో అనువాకం 1

**బ్రహ్మవిదాప్నోతి పరమ్**

ఈ వల్లీలోని మొట్టమొదటి పాదమే బ్రహ్మవిదాప్నోతి పరమ్. బ్రహ్మను తెలుసుకున్న జ్ఞాని, పరమ పరుషార్థాన్ని పొందుతాడు అంటే మోక్షాన్ని పొందుతాడు. ఆ విధంగా బ్రహ్మవిదాప్నోతి పరమ్ అంటే బ్రహ్మజ్ఞాని బ్రహ్మతో ఐక్యం పొందుతాడు.

ఈ వాక్యం మూడు ప్రశ్నలకు దారితీస్తుంది –

**ఎ) కిం తత్ బ్రహ్మ – ఆ బ్రహ్మ ఎవరు?**

**బి) కథం తస్య వేదనమ్ – ఆ బ్రహ్మను ఎలా తెలుసుకోవాలి?**

**సి) కా పరప్రాప్తిః – మోక్షప్రాప్తి అంటే ఏమిటి?**

వీటినే సంస్కృతంలో చెప్పాలంటే వరుసగా బ్రహ్మలక్షణం, బ్రహ్మవేదన ప్రకారః, పరప్రాప్తి ఫలం అని వస్తాయి.

ఇప్పుడు ఈ మూడు ప్రశ్నలకు జవాబును వృత్తిలో చూస్తాము.

2. **వృత్తిభాగము** – సూత్రానికి లఘు వ్యాఖ్యానం అనువాకం 1

**తదేషాఽభ్యుక్తా। సత్యం జ్ఞానమ్ అనంతం బ్రహ్మ। యో వేద నిహితం గుహాయాం పరమే వ్యోమన్। సోఽశ్నుతే సర్వాన్ కామాన్సహ। బ్రహ్మణా విపశ్చితేతి।**

ఎ) **కిం తత్ బ్రహ్మ – సత్యం జ్ఞానమనంతం బ్రహ్మ**

బ్రహ్మ నిర్వచనం ఒక్క వాక్యంలో ఇచ్చింది ఉపనిషత్తు. సత్యం, జ్ఞానం, అనంతం బ్రహ్మ అంది. దీన్ని లక్షణవాక్యం అంటారు. ఈ లక్షణవాక్య విశ్లేషణను టూకీగా చూద్దాము.

**బ్రహ్మ** – బృహత్త్వమత్వాద్ బ్రహ్మ. బ్రహ్మ నామవాచకం. కాబట్టి బ్రహ్మను విశేషణంతో కొలవలేనంత పెద్దది అని అర్థం చేసుకోవాలి.

**అనంతం** – ముందు అనంతం చూద్దాము. బ్రహ్మకు దేశకాల వస్తు పరిచ్ఛేదాలు లేవు.

దేశకాల వస్తుపరిచ్ఛేదరహితమ్ బ్రహ్మ

**సత్యమ్** – సత్యం అంటే శుద్ధ సత్, స్వతంత్ర సత్, దేశకాల వస్తు పరిచ్ఛేద రహిత సత్. ఒక్కముక్కలో చెప్పాలంటే సత్యం = అనంతసత్తా.

**జ్ఞానమ్** – జ్ఞానం అంటే శుద్ధ చిత్, స్వతంత్ర చిత్, దేశకాల వస్తుపరిచ్ఛేదరహిత చిత్. ఒక్కముక్కలో చెప్పాలంటే జ్ఞానం = అనంతచిత్.

సత్యం జ్ఞానమ్ అనంతం బ్రహ్మ = సత్ చిత్ ఆనందం బ్రహ్మ.

బి) **కథం తస్య వేదనమ్ – యో వేద నిహితం గుహాయామ్ పరమే వ్యోమన్**

గుహ అంటే మనస్సు, నిహితం అంటే అందులో బ్రహ్మ ఉంది. మనస్సులో ఉన్న ఆ బ్రహ్మను తెలుసుకోవటం ఎలా? ఆలోచనలు ఉన్న, ఆలోచనలు లేని మనస్సును చూస్తున్న సాక్షిచైతన్యంగా తెలుసుకోవాలి.

**వృత్తిభావ అభావ సాక్షిరూపేణ**

ఈ సాక్షిచైతన్యం ఎవరో కాదు, నేను. మనస్సును సాక్షిగా చూస్తున్న సాక్షి చైతన్యాన్ని నేను. ఒక్కముక్కలో చెప్పాలంటే **అహం బ్రహ్మ అస్మి.**

సి) **కా పరప్రాప్తిః – సోఽశ్నుతే సర్వాన్ కామాన్సహ । బ్రహ్మణా విపశ్చితేతి**

సః అంటే బ్రహ్మజ్ఞాని; సర్వాన్ కామాన్ అశ్నుతే – అన్ని సుఖాలూ పొందుతాడు, అది కూడా – సహ అంటే ఒక్కసారే. అంటే అన్ని ఆనందాలనూ ఒక్కసారిగా బ్రహ్మానందంగా పొందుతాడు బ్రహ్మజ్ఞాని.

**బ్రహ్మానంద రూపేణ సర్వాన్ విషయానందాన్ ప్రాప్నోతి**

ఆ విధంగా బ్రహ్మానందం సంపూర్ణ భావనను కలుగజేస్తుంది. ఈ బ్రహ్మానందంవల్ల సర్వకామ నివృత్తి కలుగుతుంది.

3. **వ్యాఖ్యానభాగము** – ఇంకా లోతైన విచారణ అనువాకాలు 1–5, 8

ఈ మూడు ప్రశ్నలకూ ఈ క్రింది విధంగా జవాబు దొరుకుతుంది ఈ భాగంలో.

**ఎ) కిం తత్ బ్రహ్మ? – సృష్టిప్రకరణం వివరణ ద్వారా – అనువాకం 1**

**బి) కథం తస్య వేదనమ్ – పంచకోశ వివేకం ద్వారా – అనువాకాలు 1-5**

**సి) కా పరప్రాప్తిః – ఆనందమీమాంస ద్వారా – అనువాకం 8**

**తస్మాద్వా ఏతస్మాదాత్మన ఆకాశస్సంభూతః। ఆకాశాద్వాయుః। వాయోరగ్నిః। అగ్నేరాపః। అద్భ్యః పృథివీ। పృథివ్యా ఓషధయః। ఓషధీభ్యోఽన్నమ్। అన్నాత్పురుషః।స వా ఏష పురుషోఽన్నరసమయః।**

**ఎ) కిం తత్ బ్రహ్మ – సృష్టి ప్రకరణం వివరణ ద్వారా – అనువాకం 1**

ఆ సత్యం జ్ఞానం అనంతం బ్రహ్మ సాక్షి చైతన్యానికి (ఆత్మకు) భిన్నం కాదు. ఆ ఆత్మనుంచి ఆకాశం, ఆకాశంనుంచి వాయువు, వాయువునుంచి అగ్ని, అగ్నినుంచి జలము, జలంనుంచి పృథివి, పృథివినుంచి వృక్షాలు, వృక్షాలనుంచి అన్నం, అన్నంనుంచి పురుషుడు పుట్టాడు. అంటే అన్నరసంనుంచి స్థూలశరీరం పుట్టింది. ఈ విధంగా సృష్టి గురించి వర్ణించింది ఈ ఉపనిషత్తు. ఈ సృష్టి ప్రకరణం ద్వారా బ్రహ్మ లక్షణ నిర్వచనం అంతర్లీనంగా చెప్పబడింది. దాన్ని మనం అర్థం చేసుకోవాలి. బ్రహ్మ సృష్టి చేశాడు అంటే బ్రహ్మ కారణం, జగత్తు కార్యం అయింది. వాటినుంచి బ్రహ్మ నిర్వచనంలో రెండు పదాలు చెప్పవచ్చు.

**బ్రహ్మ సత్యమ్** – బ్రహ్మ సత్యం అని మళ్ళీ రెండు అంశాల ద్వారా చెప్పవచ్చు.

– కారణం కార్యమంతటా ఉంటుంది. బంగారం ఆభరణం అంతటా ఉంటుంది. ఆ సూత్రం ప్రకారం కార్యజగత్తు అంతటా కారణబ్రహ్మ ఉంది.

– కారణం కార్యంలో ఉనికిరూపంలో ఉంది. ఉనికిని సత్తా లేదా సత్ అంటారు. సత్యం నిర్వచనం చూసినప్పుడు ఏమన్నాం? సత్యం = అనంతసత్తా అన్నాము.

**కారణం కార్యే సత్తారూపేణ ప్రతీయతే**

ఈ కారణం కార్యం పుట్టకముందూ, కార్యం ఉన్నప్పుడూ, కార్యం లయమయ్యాక కూడా ఉంటుంది. మట్టి, కుండ పుట్టకముందూ, కుండ ఉనికి ఉన్నప్పుడూ, కుండ నాశనమయ్యాక కూడా ఉంటుంది. మూడు కాలాల్లోనూ ఉండేదాన్ని సత్యం అంటారు. **త్రికాలేపి తిష్ఠతి**. దాన్నే ముందు అనంతసత్తా అన్నాము.

బ్రహ్మ సత్యం కారణత్వాత్

**బ్రహ్మ అనంతమ్** – ఆభరణం, బంగారానికి భిన్నంగా లేదు అని చూశాము అంటే కార్యానికి విడిగా, కారణం లేకుండా ఉనికి లేదు. నీరు లేకుండా అలకు విడిగా ఉనికి లేదు. అలాగే బ్రహ్మ లేకుండా జగత్తుకు విడిగా ఉనికి లేదు. అంటే అసలు ద్వైతం లేదు. కారణం మాత్రమే పదార్థం; కార్యం కాదు.

**వాచాఽఽరంభణం వికారో నామధేయమ్** – ఛాందోగ్యమ్ 2.14

ఆ విధంగా బ్రహ్మ అనంతం.

**బ్రహ్మ జ్ఞానమ్** – ఒక వస్తువుయొక్క ఎఱుక గురించి తెలియకపోతే దాని ఉనికి గురించి మాట్లాడలేము. అందువల్ల ఉనికి ఉందని చెబితే, దాని జ్ఞానం లేదా ఎఱుక గురించి చెప్పినట్టే అర్థం. బ్రహ్మ సత్యం అయితే, బ్రహ్మ జ్ఞానం అవాలి. బ్రహ్మ కారణంగా సత్యం అని చూశాము; అందువల్ల బ్రహ్మ సత్యం, బ్రహ్మ జ్ఞానం.

బి) **కథం తస్య వేదనమ్ – పంచకోశవివేకం ద్వారా – అనువాకాలు 1–5**

**తస్యేదమేవ శిరః। అయం దక్షిణః పక్షః। అయముత్తరః పక్షః। అయమాత్మా। ... బ్రహ్మ పుచ్ఛం ప్రతిష్ఠా। తదప్యేష శ్లోకో భవతి।**

ఈ పంచకోశ వివేక ప్రక్రియలో మన ప్రయాణం అత్యంత స్థూలవిషయమైన శరీరంనుంచి సూక్ష్మాతి సూక్ష్మమైన ఆత్మకు సాగాలి. పంచకోశవివేక ప్రక్రియ అరుంధతీ దర్శనన్యాయం లేదా శాఖాచంద్ర న్యాయానికి దగ్గరగా ఉంది.

అన్నమయం అత్యంత స్థూలమైనది. అంత అత్యంత స్థూలమైన అన్నమయంనుంచి ప్రాణమయానికి, ప్రాణమయంనుంచి మనోమయానికి, మనోమయంనుంచి విజ్ఞానమయానికి, విజ్ఞానమయంనుంచి ఆనందమయానికి ప్రయాణం చేయాలి. అన్నమయం అత్యంత స్థూలమైనదైతే, ఆనందమయం అత్యంత సూక్ష్మమైనది. అంటే అత్యంత స్థూలమైన దాన్నుంచి, క్రమేపీ కొంచెంకొంచెంగా సూక్ష్మమైన దాని ద్వారా, అత్యంత సూక్ష్మమైన దానికి వస్తాము. మనస్సు ఆనందమయానికి వచ్చేసరికి అత్యంత ప్రశాంతతను అనుభవిస్తుంది. మనస్సు ఎంత ఎక్కువ ప్రశాంతంగా ఉంటే, అంత ఎక్కువ ఆనందాన్ని పొందుతుంది. ఆనందమయకోశంలో పొందే ఆనందానికి తారతమ్యాలు ఉంటాయి. వాటిని ప్రియ, మోద, ప్రమోదాలు అంటారు.

ఇప్పటిదాకా పంచకోశవివేక ప్రక్రియలో ఒక్కొక్క కోశాన్నీ ముందు ఆత్మ అన్నాము. ఉదాహరణకు అన్నమయాన్ని ఆత్మ అన్నప్పుడు దానిలో ఐదు అంశాలను చూస్తాము. అవి శిరస్సు, కుడిరెక్క, ఎడమరెక్క, ఆత్మా, ప్రతిష్ఠ. అన్నమయంనుంచి ప్రాణమయంలోకి అడుగుపెట్టేసరికి ప్రాణమయం ఆత్మ, అన్నమయం అనాత్మ అవుతుంది. అన్నమయం అనాత్మ అయితే, ఆ అనాత్మ ఆత్మనుంచి పుట్టాలి. ఆ విధంగా అన్నమయం కార్యం అవుతుంది. ఏ కార్యానికన్నా నామరూపాలు ఉండాలి. నామరూపాలు ఉన్న కార్యం మిథ్య అవుతుంది.

మళ్ళీ రెండవదానికి వచ్చేసరికి, మొదటిదాన్ని కోశంగానో, అనాత్మగానో త్రోసిపుచ్చటం జరుగుతుంది. ఎప్పుడైతే ఒకదాన్ని అనాత్మ అంటామో అప్పుడే తక్కిన అంశాలన్నీ వరుసగా

వస్తాయి. అవి అనాత్మ నిశ్చయః, కార్యత్వ నిశ్చయః, నామరూపత్వ నిశ్చయః, మిథ్యాత్వ నిశ్చయః, ప్రవిలాపన నిశ్చయః. అప్పుడు ముందు కోశం తర్వాత దానిలో లయమయిపోతుంది. అలా అన్నమయకోశంనుంచి మొదలుపెట్టి, ఆనందమయకోశానికి వస్తాము. ఆనందమయ కోశంలో విజ్ఞానమయకోశం లయమయిపోతుంది.

ఈ పంచకోశ వివేకాన్ని ఒక పట్టికలో చూద్దాము.

**పంచకోశ వివేకం – పట్టిక**

**కోశాలు – వాటి అంగాలు**

| కోశం | శిరః | దక్షిణపక్షః | ఉత్తరపక్షః | ఆత్మా | పుచ్ఛం |
|---|---|---|---|---|---|
| అన్నమయం | శిరస్సు | కుడిచేయి | ఎడమచేయి | శరీరం | కాళ్ళు |
| ప్రాణమయం | ప్రాణం | వ్యానం | అపానం | సమానం | పృథివీ దేవత |
| మనోమయం | యజుర్వేదం | ఋగ్వేదం | సామవేదం | ఆదేశం | అథర్వణవేదం |
| విజ్ఞానమయం | శ్రద్ధా | ఋతం | సత్యం | యోగః | మహః |
| ఆనందమయం | ప్రియం | మోదం | ప్రమోదం | ఆనందం | బ్రహ్మ |

ఇప్పుడు ఆనందమయకోశంనుంచి ఆత్మకు వెళ్ళాలి. ఎలా వెళ్ళాలి? కొంతమందేమో మనస్సు చాలా ప్రశాంతంగా ఉంటే ఆత్మ అలా పైకి లేస్తుంది అనుకుంటారు. దయానంద స్వామీజీ దాన్ని సబ్‌మెరైన్ సైకాలజీ అంటారు. ఆత్మకోసం వెతకమని ఉపనిషత్తు ఎన్నడూ చెప్పదు.

**అనుభవిస్తున్న నువ్వే అది ఎప్పటికీ, అనుభవించబడుతున్న వస్తువు కాదు ఎన్నటికీ**

ప్రియ, మోద, ప్రమోదాలు ఆనందమయకోశంలో కనబడే కోశానందాలు. ఆత్మనైన నేను ఈ ప్రియ, మోద, ప్రమోదాల సాక్షిని. ఆ ఆనందం ఉన్నా లేకపోయినా, ఆత్మనైన నేను ఉంటాను. నేను ఆనంద ఆత్మను. ఆత్మానందం అంటే అనుభవంలోకి వచ్చే ఆబ్జెక్టు కాదు; అనుభవిస్తున్న సబ్జెక్టు అని చూశాము. నేను దుఃఖంలో మునిగిపోయి ఉన్నాకూడా, నేను ఆత్మగా ఆనందస్వరూపుణ్ణి. ఇలా సాక్షిచైతన్యంగా చూసే, ఈ ఆత్మానందమే బ్రహ్మ.

**ఆనంద ఆత్మా । బ్రహ్మ పుచ్ఛం ప్రతిష్ఠా**

ఇది ఒక మహావాక్యం. కాకపోతే అహం బ్రహ్మ అస్మి మహావాక్యం చెప్పినంత స్పష్టంగా ఐక్యాన్ని ఈ వాక్యం బోధించదు.

సి) **కా పరప్రాప్తిః – ఆనందమీమాంస ద్వారా – అనువాకం 8**

**సైషాఽఽనందస్య మీమాగ్ంసా భవతి ... ఇత్యుపనిషత్** – అనువాకం 8

(అనువాకాలు 6, 7 తర్వాత చూద్దాము) ఈ అనువాకంలో ఆనందమీమాంస చూస్తాము. మీమాంస అంటే విచారణ. ఆనందమీమాంస అంటే ఆనందం గురించిన విచారణ. ఆనందం రెండు రకాలు. అవి – కోశానందం, ఆత్మానందం. వాటి మధ్య భేదాలను ఈ క్రింది పట్టికలో చూద్దాము.

| **కోశానందం** | **ఆత్మానందం** |
|---|---|
| ప్రతిబింబానందం | బింబానందం |
| అనిత్యం | నిత్యం |
| సాతిశయ ఆనందం | నిరతిశయ ఆనందం |
| అనుభవంలోకి వస్తుంది | అనుభవంలోకి రాదు |
| విషయప్రాప్తి | జ్ఞానప్రాప్తి |

మళ్ళీ కోశానందం రెండు రకాలుగా పొందవచ్చు. అవి విషయప్రాప్తి, వైరాగ్యప్రాప్తి. ఉపనిషత్తు కోశానందంలోని ఈ రెండు పద్ధతులను గురించి సమాంతరంగా చెబుతూ వస్తుంది. రెండు పద్ధతుల్లోనూ మనస్సును ప్రశాంతంగా చేయాలి.

ఆనందమీమాంస చేయటానికి ఒక కొలతను తీసుకుంది ఉపనిషత్తు. ఈ భూమ్మీద ఒక యువకుడు – శారీరకంగా బలిష్ఠుడు, మానసికంగా ఆరోగ్యవంతుడు, భూమ్మీద ఉన్న, భూమిలోపల ఉన్న ఐశ్వర్యాన్నంతటినీ పొందిన వ్యక్తియొక్క ఆనందాన్ని తీసుకుంది. అటువంటి వ్యక్తి నిజంగా ఉండే అవకాశం లేదు కాని, అది ఒక కొలతగా తీసుకుంది ఉపనిషత్తు.

1 మానుష ఆనందం – 1 కొలత.

అలా మానుష ఆనందంతో మొదలుపెట్టి అంచెలంచెలుగా హిరణ్యగర్భ ఆనందం స్థాయికి వెళ్ళింది. మధ్యలో దశలు మనుష్యగంధర్వ ఆనందం, దైవగంధర్వ ఆనందం, పితృదేవతల ఆనందం, అజానజ దేవతల ఆనందం, కర్మదేవతల ఆనందం, దేవతల ఆనందం, ఇంద్రుని ఆనందం, బృహస్పతి ఆనందం, ప్రజాపతి ఆనందం. ఒక్కొక్క స్థాయికీ వందరెట్లు ఆనందం పెరుగుతూ వస్తుంది. అంటే హిరణ్యగర్భ ఆనందం వచ్చేసరికి $10^{20}$ అవుతుంది ఆనందం. అంటే ఒకటి తర్వాత ఇరవై సున్నాలు కలుపుకోవాలి. ఇదంతా విషయప్రాప్తి వల్ల కలిగే ఆనందం. అంటే ఆ లోకాలకు వెళ్ళి పొందే ఆనందం.

దీనికి సమాంతర రేఖగా, వైరాగ్యం ద్వారా పొందే ఆనందాన్ని చెప్పుకొస్తుంది. శ్రోత్రియస్య చాకామహతస్య అంటుంది. అంటే వివేకం ద్వారా వైరాగ్యం పొందిన వ్యక్తి, అతనికి వైరాగ్యం ఉన్న స్థాయిని బట్టి ఆయా లోకాలలో కలిగే ఆనందాన్ని భూలోకంలో ఉండే పొందుతాడు. ఉదాహరణకు చివరిస్థాయి అయిన హిరణ్యగర్భ ఆనందం తీసుకుంటే,

ఈ వివేకంతో కూడిన విరాగి హిరణ్యగర్భ పొందే ఆనందాన్ని ఇక్కడే పొందుతాడు. అతనికి హిరణ్యగర్భకన్నా కిందస్థాయి వరకూ అంటే ప్రజాపతి స్థాయి వరకూ వైరాగ్యం ఉందని చెప్పవచ్చు.

ఇదీ కోశానందం గురించిన వివరణ.

**ఆత్మానందం – స యశ్చాయం పురుషే । యశ్చాసావాదిత్యే । స ఏకః**

ఇదొక మహావాక్యం. మనిషిలో అంటే వ్యష్టిలో ఉన్న ఆనందం, హిరణ్యగర్భలో అంటే సమష్టిలో ఉన్న ఆనందం రెండూ ఒకటే. ఇక్కడ లక్ష్యార్థాన్ని తీసుకోవాలి. జ్ఞాని తను పొందిన జ్ఞానంవల్ల పంచకోశాలమీద అభిమానాన్ని ఒక్కొక్కటిగా వదులుకుంటూ వస్తాడు.

కాని వీటిలో ఏ పద్ధతిలో ఆనందం పొందిన వ్యక్తి కూడా ఆత్మానందాన్ని పొందలేడు. కాని ఆత్మానందం పొందిన వ్యక్తి ఆత్మానందంతో పాటు, వైరాగ్యప్రాప్తి ద్వారా కోశానందాన్ని కూడా పొందుతాడు.

జ్ఞానం పొందిన జ్ఞాని ఖచ్చితంగా ఆత్మానందాన్ని పొందుతాడు. జ్ఞానం పొందిన వ్యక్తికి వైరాగ్యం ఉండే ఉండివుంటుంది. డిగ్రీ పాసయిన వ్యక్తి పీజీ చేయవచ్చు, చేయక పోవచ్చు; కాని పీజీ పాసయిన వ్యక్తి డిగ్రీ కూడా పాసయి ఉంటాడు. అలాగే కోశానందం పొందిన వ్యక్తి ఆత్మానందాన్ని పొందలేడు కాని, ఆత్మానందాన్ని పొందిన వ్యక్తి వైరాగ్యం ద్వారా కోశానందాన్ని కూడా పొందగలడు. అతను అహం బ్రహ్మ అస్మి అనే జ్ఞాననిష్ఠలో ఉంటాడు కాబట్టి ఎప్పుడూ ఆనందంలోనే నెలకొని ఉంటాడు. ఈ రెండు ఆనందాలను పొందటమే పరాప్రాప్తిః అంటారు. సర్వాన్ కామాన్ సహ అంటే ఆత్మానందం, కోశానందం కూడా పొందుతాడు అని అర్థం. జ్ఞాని కోశానందాన్ని పొందితే, అది అతనికి అదనపు ఆనందం. ఎందుకంటే అతను కోశానందం పొందినా, పొందకపోయినా అతనికేమీ భేదం ఉండదు.

4. **ఉపసంహారం** – అనువాకం 9

**యతో వాచో నివర్తంతే। అప్రాప్య మనసా సహ। ఆనందం బ్రహ్మణో విద్వాన్। న బిభేతి కుతశ్చనేతి।**

జ్ఞాని తన ఆనందం కరిగిపోతుందని భయపడడు. తన స్నేహితుల కష్టసుఖాలలో పాలుపంచుకుంటాడు జ్ఞాని. అప్పుడది కోశానందం అవుతుంది. కాని కోశానందం అనుభవించినా, అనుభవించకపోయినా తను నిత్యమూ ఆనందస్వరూపుడని తెలుసు జ్ఞానికి. అందువల్ల అతను భయపడడు.

జ్ఞానఫలం కూడా చెబుతున్నది ఉపనిషత్తు. జ్ఞాని తను జ్ఞానం పొందకముందు గడిపిన జీవితంలోకి తొంగిచూడడు. అతను జ్ఞానం పొందకముందు ఎన్నో ఒమిషన్స్, కమిషన్స్ చేసి ఉండవచ్చు. అంటే చేయాల్సిన పని చేసి ఉండకపోవచ్చు, చేయకూడని పనులు చేసి ఉండవచ్చు. ఈ రెండు బాధలూ కలిసి పశ్చాత్తాపంలో క్రుంగిపోయేలా చేస్తాయి మనిషిని. అదే సంసారం అంటే. కాని జ్ఞానిని ఈ సంసారం పట్టికుదిపివేయదు. సంసారం యొక్క ఒక నిర్వచనం బాధ, పశ్చాత్తాపం. కర్తకు ఈ పని చేయలేదే అనే పశ్చాత్తాపం ఉంటుంది; భోక్తకు నన్ను వారు ఇలా అన్నారే అనే బాధ ఉంటుంది. జ్ఞాని తను కర్తా కాదు, భోక్తా కాదు, అవి అనాత్మకు చెందినవి, అందువల్ల మిథ్య అని తెలుసుకుంటాడు కాబట్టి, అవి అతన్ని బాధించవు. అందువల్ల అతన్ని సంసారం బాధించదు.

ఎప్పుడైతే అతను తన ఉన్నతస్థాయినుంచి చూస్తాడో, అంటే అహం బ్రహ్మ అస్మి అని అర్థం చేసుకుంటాడో, అప్పుడే వ్యావహారిక స్థాయికి చెందిన జీవితం చాలా చిన్నదిగా, విలువ లేనిదిగా కనిపిస్తుంది. అందువల్ల అతను పాపపుణ్యాలనుంచి విముక్తుడవుతాడు. దీన్నే **పరాప్రాప్తి** అంటారు.

5. **అనుప్రశ్నలు** – అనువాకాలు 6, 7

**అథాతోఽ నుప్రశ్నాః। ఉతావిద్వానముం లోకం ప్రేత్య। కశ్చన గచ్ఛతీ3। ఆహో విద్వానముం లోకం ప్రేత్య। కశ్చిత్సమశ్నుతా3 ఉ।**

ఈ అనువాకాల్లో శిష్యుడు గురువుకు మూడు అనుప్రశ్నలు వేస్తాడు. ఇంతవరకూ జరిగిన బోధలోంచి వచ్చిన ప్రశ్నలను అనుప్రశ్నాః అంటారు. ఆ అనుప్రశ్నలు ఇవి –

**ఎ) బ్రహ్మ ఉందా లేదా? (పరోక్ష ప్రశ్న)**

**బి) మరణానంతరం అజ్ఞాని బ్రహ్మలో ఐక్యమవుతాడా, లేదా?**

**సి) మరణానంతరం జ్ఞాని బ్రహ్మలో ఐక్యమవుతాడా, లేదా?**

గురువు పరోక్ష ప్రశ్నకు వివరంగా జవాబు చెప్పుకొస్తాడు. బ్రహ్మ ఉందా లేదా అనే సందేహం ఎందుకు వచ్చింది? బ్రహ్మ వ్యవహారాలకు అందదు, గుణాలు లేవు అంటుంది ఉపనిషత్తు. అలా వ్యవహారాలకందని, గుణాలు లేని బ్రహ్మ ఎలా ఉంటుంది? అందువల్ల బ్రహ్మ ఉందా లేదా అనే సందేహం వస్తుంది. బ్రహ్మ ఉంది అని నిరూపిస్తూ గురువు ఏడు కారణాలను చూపిస్తాడు. అవి –

1) బ్రహ్మ అస్తి జగతః నిమిత్త కారణత్వాత్ – బ్రహ్మ నిమిత్త కారణం
2) బ్రహ్మ అస్తి జీవాత్మరూపేణ వర్తమానత్వాత్ – బ్రహ్మ జీవాత్మ
3) బ్రహ్మ అస్తి జగతః ఉపాదాన కారణత్వాత్ – బ్రహ్మ ఉపాదాన కారణం

4) బ్రహ్మ అస్తి సుకృత ప్రసిద్ధే – బ్రహ్మ సుకృతం
5) బ్రహ్మ అస్తి ఆనందరూపేణ – బ్రహ్మ ఆనందప్రదాతా
6) బ్రహ్మ అస్తి జడశరీరే చేష్టాదర్శనత్వాత్ – బ్రహ్మ చైతన్యప్రదాతా
7) బ్రహ్మ అస్తి భయ–అభయ హేతుత్వాత్ – బ్రహ్మ భయ–అభయ ప్రదాతా

ఇదీ పరోక్షంగా అడిగిన ప్రశ్నకు ప్రత్యక్ష జవాబు. కాని ప్రత్యక్షంగా అడిగిన జవాబులకు గురువు పరోక్షంగా జవాబు చెప్పాడు. ఆ ప్రశ్నలు ఏమిటి? మరణానంతరం అజ్ఞాని బ్రహ్మలో ఐక్యమవుతాడా, లేదా; జ్ఞాని బ్రహ్మలో ఐక్యమవుతాడా, లేదా? అసలా ప్రశ్నలే తప్పు. దూరాన్ని కిలోమీటర్లలో కొలవాల్సింది పోయి కిలోగ్రాముల్లో కొలిచినట్టు అవుతుంది.

బ్రహ్మలో ఐక్యం అయ్యే ప్రసక్తే లేదు. ఎందుకు? బ్రహ్మలో ఐక్యం అవాలి అనే ఆలోచనే బ్రహ్మను సాధ్యంగా, దూరంగా ఉన్న ఆబ్జెక్టుగా భావించటంవల్ల వస్తుంది. ఉపనిషత్తేమో బ్రహ్మ ఆబ్జెక్టు కాదు, సబ్జెక్టు అయిన నువ్వే బ్రహ్మవు అంటుంది. అందువల్ల జ్ఞాని అయినా, అజ్ఞాని అయినా కూడా అతను బ్రహ్మే. కర్ణుడు కుంతీపుత్రుడు; అతనికా జ్ఞానం కలగక ముందూ కుంతీపుత్రుడే, కలిగిన తర్వాతా కుంతీపుత్రుడే. అందువల్ల బ్రహ్మలో వెళ్ళి ఐక్యం అయ్యే ప్రసక్తి లేదు. నేను అంతకుముందూ, ఇప్పుడూ, ఎప్పుడూ బ్రహ్మనే.

కాని ఈ ప్రశ్నలకు జవాబు ఇచ్చి తీరాలంటే, ఈ విధంగా చెప్పవచ్చు. అజ్ఞాని బ్రహ్మలో లయమవుతాడా, లేదా అంటే అతను లయమవడు. ఎందుకు? అతని ఉద్దేశ్యంలో అతనికీ, బ్రహ్మకూ మధ్య దూరం ఉంది. అతని అజ్ఞానం ఆ దూరాన్ని ఏర్పరచింది. అతను ఆ అజ్ఞానంతో మరణిస్తాడు కాబట్టి అతను బ్రహ్మలో ఐక్యమవడు అని భావించాలి. ఇకపోతే జ్ఞాని దృష్టిలో బ్రహ్మకూ, తనకూ మధ్య దూరం లేదు కాబట్టి, అతను బ్రహ్మలో 'ఐక్యమయినట్టుగా' భావించాలి. ఇవీ పరోక్ష జవాబులు.

కాని అజ్ఞానులు, 'నాకీ జన్మలో మోక్షం రాకపోతే, వచ్చే జన్మలో అయినా మోక్షం పొందుతానా? మళ్ళీ మీరే వచ్చే జన్మలో కూడా గురువుగా వస్తారా?' అంటారు.

**శాస్త్రం శారీరమీమాంసా దేవస్తు పరమేశ్వరః ।**
**ఆచార్యాశ్శంకరాచార్యాః సంతు మే జన్మజన్మని॥**

శంకరులవారి భాష్యమైన శారీరమీమాంసే (బ్రహ్మసూత్రభాష్యం) శాస్త్రంగా, పరమేశ్వరుడే దైవంగా, శంకరాచార్యులవారే నాకు ఆచార్యులుగా జన్మజన్మలకీ కలగాలి అని ఒక ప్రార్థన ఉంది. జ్ఞానికి జీవన్ముక్తి, విదేహముక్తి కలుగుతాయి. పునర్జన్మ ఉండదు. కాని ఇది తెలియని అజ్ఞాని, బ్రహ్మను పొందలేను అనుకుంటాడు.

జ్ఞాని విషయంలో అతనికీ, బ్రహ్మకూ మధ్య దూరమే లేదు. అతనే బ్రహ్మ. అందువల్ల అతను బ్రహ్మను చేరుకోవాలి అని ఆశించడు. ఒకవేళ నేను ఐక్యం పొందాను అని అతను చెప్పినా అది మళ్ళీ అతని అజ్ఞానాన్ని సూచిస్తుంది. ఉపనిషత్తు బోధ అర్థం మనం ఎన్నడూ బంధజీవులం కాదు, ముక్తపురుషులం. అందువల్ల జ్ఞాని బ్రహ్మలో ఐక్యం 'అయినట్టుగా' భావించాలి.

# తైత్తిరీయోపనిషత్ - భృగువల్లీ

## ఉపోద్ఘాతం

ఉపనిషత్తులోని ముఖ్యమైన ఆత్మజ్ఞానం రెండవ అధ్యాయం అయిన బ్రహ్మానందవల్లీలో చెప్పబడింది. ఈ మూడవ అధ్యాయం అయిన భృగువల్లీలో కేవలం సూచనప్రాయంగా చెప్పబడింది. అదికాక, మరికొన్ని సంబంధిత అంశాల గురించి వస్తాయి ఇందులో. ఈ వల్లీలో పది అనువాకాలు ఉన్నాయి. వాటిలోని అంశాలు ఇవి –

**బ్రహ్మజ్ఞాన సాధనాని** – బ్రహ్మజ్ఞానం పొంది, ఆ జ్ఞానఫలం అనుభవించాలంటే ఆ జ్ఞానాన్ని జీర్ణించుకోవటానికి అవసరమైన సాధనలను జ్ఞానసాధనాని అంటారు. అవి రెండు రకాల సాధనలు. అవి –

| | |
|---|---|
| సాక్షాత్ సాధన | – ప్రత్యక్షంగా, దగ్గరగా జ్ఞానానికి తోడ్పడే సాధన |
| పరంపరా సాధన | – పరోక్షంగా జ్ఞానం పొందటానికి తోడ్పడే సాధన. |

1. **బ్రహ్మజ్ఞాన సాక్షాత్ సాధన అనువాకాలు 1–6** – సాక్షాత్ సాధన వేదాంతవాక్య విచారణ చేయటానికి తోడ్పడుతుంది. వేదాంతంలో ఉన్న మహావాక్య విచారణ చేస్తుంది. ఇది చాలా ముఖ్యమైన సాధన. ఎందుకంటే, ఈ సాధన ద్వారానే ఆత్మజ్ఞానం పొందగలము. బ్రహ్మానందవల్లీలో చూసిన పంచకోశవివేక ప్రక్రియ ఈ వల్లీలో మళ్ళీ ప్రత్యేకించి చెప్పబడింది. అక్కడ విచారణ అంటే ఇక్కడ తపస్సు అంది. ఈ వల్లీలో ఈ పంచకోశవివేకం గురించి చూస్తున్నంతసేపూ ఈ తపస్సు అనే పదం పదేపదే వస్తుంది.

**తపసా బ్రహ్మ విజిజ్ఞాసస్వ। తపో బ్రహ్మేతి। స తపోఽతప్యత। స తపస్తప్త్వా॥**

– అనువాకం 2

ఈ ఒక్క వాక్యంలోనే తపస్సు అనే పదం నాలుగుసార్లు వచ్చింది. అంతేకాదు, ఈ వల్లీలో అనేకసార్లు వస్తుంది. అందువల్ల ఈ వల్లీని వేదాంత విచారవల్లీ అని లేదా పంచకోశ విచారవల్లీ అని కూడా అనవచ్చు. తపస్సుకు అనేక అర్థాలు ఉన్నాయి. నిజంగా తపస్సు చేయటం, శ్రద్ధగా ఒక పని చేయటం, వ్రతంలా చేయటం. ఇక్కడ తపస్సు అంటే విచారణ (తప – ఆలోచన).

2. **బ్రహ్మజ్ఞాన సహకారీ సాధనాని అనువాకాలు 7–10(కొంతభాగం)**– ఇవి పరంపరా సాధనలు, ఇవి పరోక్షంగా తోడ్పడతాయి. కొన్ని ఉపాసనలు అందులోకి వస్తాయి. ఆ ఉపాసనలు చిత్తఏకాగ్రతకు తోడ్పడతాయి. ఉపాసన చేస్తే జ్ఞానం కలగదు; ఎంత గొప్ప ఉపాసకుడైనా సరే, జ్ఞానం పొందాలంటే వేదాంత విచారణ చేసితీరాలి.

ఈ విషయాన్ని బాగా అర్థం చేసుకోవాలి. ఉపాస్యదేవత ప్రత్యక్షంగా జ్ఞానాన్ని ప్రసాదించలేదు; జ్ఞానం వేదాంత విచారణవల్ల మాత్రమే వస్తుంది. ఉపాస్యదేవత ప్రత్యక్షంగా ఇవ్వకపోయినా, ఉపాసకునికి మంచి గురువు దొరికేలా దీవిస్తుంది. మంచి గురువు అందుబాటులో లేకపోతే, ఉపాస్యదేవతే గురువుగా మారి బోధ చేస్తుంది.

ఈ వల్లీలో నాలుగు ఉపాసనల గురించి వస్తుంది.

**విరాట్ ఉపాసన** – మొత్తం సృష్టిని విరాట్‌గా భావించి ఉపాసన చేయాలి.

**అధ్యాత్మిక ఉపాసన** – బ్రహ్మను, ఉపాసకుని అంగాలమీద ఆవాహన చేసి ఉపాసన చేయాలి. వాక్కు, పాణి, పాదం, పాయువు, ఉపస్థ అయిన పంచకర్మేంద్రియాలమీద ఈ ఉపాసన చేయాలి.

**అధిదైవిక ఉపాసన** – బాహ్యంగా ఉన్న శక్తులను తీసుకుని వాటిమీద ఉపాసన చేయాలి. అవి నక్షత్రాలు, విద్యుత్తు, వృష్టి, పశువు.

**ఆకాశ ఉపాసన** – ఆకాశంయొక్క విభూతులమీద ఉపాసన చేయాలి. ఎందుకంటే ఆకాశం ఎన్నో విధాలుగా బ్రహ్మను పోలివుంటుంది.

**వ్రతాలు** – ఉపనిషత్తు నాలుగు వ్రతాలను కూడా నిర్దేశించింది. అవి –

**అన్నం న నిన్ద్యాత్ । తద్వ్రతమ్ ।** – ఆహారాన్ని నిందించకూడదు. అది వ్రతము.

**అన్నం న పరిచక్షీత । తద్వ్రతమ్ ।** – ఆహారాన్ని పారవేయకూడదు. అది వ్రతము.

**అన్నం బహుకుర్వీత । తద్వ్రతమ్ ।** – ఆహారాన్ని సమృద్ధిగా పండించాలి. అది వ్రతము.

**న కంచన వసతౌ ప్రత్యాచక్షీత । తద్వ్రతమ్ ।** – ఇంటికి వచ్చిన అతిథిని తిరస్కరించ కూడదు. అది వ్రతము.

ఈ విధంగా ఉపాసనలు, వ్రతాలు వేదాంత విచారణ, జ్ఞానసాధనలోకి వస్తాయి. కాకపోతే, విచారణ సాక్షాత్ సాధన అయితే ఉపాసనలు, వ్రతాలు సహకారీ సాధనలు అవుతాయి.

3. **బ్రహ్మజ్ఞానఫలమ్ అనువాకం 10**– పైన చెప్పిన మూడు సాధనలనూ పాటిస్తే, ఆ సాధకుడు ఖచ్చితంగా జ్ఞానాన్ని పొందుతాడు. ఈ ఫలాన్ని జ్ఞానఫలం అంటారు. దీన్ని శీక్షావల్లీలో వివరంగా చూశాము. అక్కడ కర్మయోగం గురించి, ఐదు ఉపాసనల గురించి వచ్చినప్పుడు, జ్ఞానఫలం గురించి కూడా వచ్చింది. ముందే జ్ఞానఫలం వచ్చేస్తే, ఇప్పుడు మళ్ళీ ఎందుకు దాని గురించి చెబుతున్నది ఉపనిషత్తు?

ఒకవేళ వేదాంతబోధ విన్నాక కూడా, మనకు ఆ జ్ఞానఫలం కలగకపోతే, ఆ లోపం వేదాంతంలో లేదు సుమా, మీలోనే ఉంది అని ఉపనిషత్తు చూపించదలుచుకుంది. మనం ఒకవేళ మనస్సును ఈ వేదాంతబోధకు సంసిద్ధం చేసుకోకపోయినా, వేదాంతం అర్థం కానందుకు వేదాంతాన్ని తప్పుపడతాము. అది సర్వసాధారణం. దీన్ని ఎవరో చక్కగా వర్ణించారు, 'పొరపాటు చేయటం మానవ సహజం, కాని దానికి వేరెవరినో నిందించటం మరీ మానవ సహజం.'

ఆ పొరపాటు మీరు చేయకూడదు. శాస్త్రాన్ని ఎన్నడూ నిందించకూడదు. శాస్త్రంవల్ల ఇప్పటికే ఎందరో జ్ఞానం పొంది, స్థితప్రజ్ఞులు అయ్యారు. మీరు కూడా శాస్త్రప్రమాణం మీద శ్రద్ధ పెట్టుకుని నేర్చుకుంటే, ఆ ఫలాన్ని మీరు కూడా పొందుతారు. ఒకవేళ, ఎవరికైనా జ్ఞానం రాకపోతే, సమస్య ప్రమాత (సాధకుడు)లో ఉందికాని, ప్రమాణం (శాస్త్రం)లో లేదు. శాస్త్రాన్ని ఒక్కటే కాదు, పాపం కష్టపడి బోధించిన గురువునూ నిందించ కూడదు. గురువు చక్కగా చెప్పలేదు అనకూడదు. ఈ శాస్త్రాన్ని సాక్షాత్తూ మనకు అందించిన భగవంతుణ్ణి అసలే నిందించకూడదు. అందువల్ల ఒకవేళ శాస్త్రం అర్థం కాకపోతే, వెనుతిరిగి మిమ్మల్ని మీరే ఆత్మపరీక్ష చేసుకోవాలి. మీకు జ్ఞానయోగ్యతను ఇచ్చే సాధన చతుష్టయ సంపత్తి సమృద్ధిగా ఉందో లేదో చూసుకోండి. సాధన చతుష్టయ సంపత్తా! అంటే ఏమిటి? ఈ ప్రశ్న కలిగితే, తత్త్వబోధలో అదంటే ఏమిటో వస్తుంది. దాన్ని గురించి నేర్చుకోండి.

జ్ఞానయోగ్యత కావాలంటే నాలుగు అర్హతలు ఉండాలి. అవి వివేకం, వైరాగ్యం, శమాది షట్కసంపత్తి, ముముక్షుత్వం.

**శమాది సహితః శ్రవణాదికం కుర్యాత్**

అన్నారు శంకరాచార్యులవారు వేరే సందర్భంలో. అంటే శ్రవణ, మనన, నిదిధ్యాసనలను సాధన చతుష్టయ సంపత్తితో కలిపి చేయాలి.

వేదాంత శ్రవణంతో పాటుగా, సమాంతరంగా సాధన చతుష్టయ సంపత్తి కూడా ఉందో లేదో ఎప్పటికప్పుడు బేరీజు వేసుకుంటూ ఉండాలి. కర్మయోగం వదిలేసి, సన్న్యాసం స్వీకరించినా కూడా, సాధన చతుష్టయ సంపత్తిని పెంపొందించుకోక తప్పదు. ఈ సహకారీ సాధనలను నొక్కివక్కాణిస్తున్నది ఈ భృగువల్లీ.

## శాంతిపాఠం

**ఓం సహ నావవతు। సహ నౌ భునక్తు। సహ వీర్యం కరవావహై। తేజస్వినావధీతమస్తు మా విద్విషావహై। ఓం శాంతిశ్శాంతిశ్శాంతిః॥**

ఈ మూడవ వల్లీ కూడా శాంతిపాఠంతో మొదలవుతుంది. బ్రహ్మానందవల్లీలో ఉన్నదీ, ఈ వల్లీలో ఉన్నదీ కూడా ఒకటే శాంతిపాఠం.

ఈ శాంతిపాఠంలో శిష్యుడు ముందు గురువుతో సత్సంబంధం నెలకొనాలని ప్రార్థన చేస్తాడు. గురుశిష్యుల మధ్య సత్సంబంధం లేకపోతే, బోధ సరిగ్గా ఫలించదు. భార్యాభర్తల మధ్య సత్సంబంధం లేకపోతే ఆ కుటుంబం పటిష్ఠంగా నిలవదు. అలాగే గురుశిష్యుల మధ్య సత్సంబంధం లేకపోతే విద్య సక్రమంగా ప్రవహించదు. గురువుకు శిష్యునిమీద అభిమానం, వాత్సల్యం ఉండాలి; శిష్యునికి గురువుమీద శ్రద్ధాభక్తులు ఉండాలి.

ఈ శాంతిపాఠం సారాంశం చూస్తే శిష్యుడు ఇందులో నాలుగు అంశాలను కోరుతున్నాడు.

**సహ నావవతు** – గురుశిష్యుల మధ్య సత్సంబంధం ఉండాలి. గురువు శ్రోత్రియ బ్రహ్మనిష్ఠ గురువై ఉండాలి; శిష్యునికి అచంచల దీక్ష, ప్రమాణబుద్ధి ఉండాలి.

**సహ నౌ భునక్తు** – గురుశిష్యులిద్దరూ అవసరమైన ప్రయత్నం చేయాలి. అంటే ప్రయత్నలోపం ఉండకూడదు.

**సహ వీర్యం కరవావహై** – శాస్త్ర అధ్యయనం ద్వారా శిష్యునికి జ్ఞానప్రాప్తి కలగాలి. శ్రవణం ద్వారా శిష్యునికి తన స్వరూపం తెలియాలి.

**తేజస్వినావధీతమస్తు మా విద్విషావహై** – జ్ఞానప్రాప్తి మాత్రమే కలిగితే చాలదు. జ్ఞానఫలప్రాప్తి కూడా కలగాలి. లేకపోతే ఆ జ్ఞానం కేవలం బుద్ధిలో కలిగిన జ్ఞానంగా మిగిలిపోతుంది. ఆ జ్ఞానం స్వాభావికంగా మారాలి. జ్ఞాననిష్ఠలో నిలబడాలి. అంటే స్థితప్రజ్ఞునిలా జీవితం గడపాలి. తన స్వరూపంలో నిలబడగలగాలి. ఇదీ అసలు ఫలం.

**ఓం శాంతిః శాంతిః శాంతిః** – అధ్యాత్మిక, అధిభౌతిక, అధిదైవిక విఘ్నాలు కలగకుండా ఉండాలి.

ఈ శాంతిపాఠం సారాంశాన్ని మళ్ళీ చూస్తే – గురుశిష్యుల మధ్య సత్సంబంధం ఉండి, జ్ఞానసముపార్జనకోసం సరియైన ప్రయత్నం చేసి, జ్ఞానం పొంది, జ్ఞాననిష్ఠలో నిలబడుగాక! ఈ ప్రయత్నంలో ప్రారబ్ధకర్మవల్ల కలిగే ఆటంకాలు ఏమైనా ఉంటే, తాత్కాలికంగా ఆ ఆటంకాలు పక్కకు తొలగుగాక!

ఈ విధంగా శాంతిపాఠం పఠించి, ఆటంకాలు తొలగకుండా తాత్కాలికంగా స్టే ఆర్డర్ తెచ్చుకున్నాం అంటారు స్వామీజీ. ఈ ఉత్సాహంతో వల్లీలోకి అడుగుపెడదాము.

## అనువాకం – 1

**భృగుర్వై వారుణిః। వరుణం పితరముపససార। అధీహి భగవో బ్రహ్మేతి। తస్మా ఏతత్ ప్రోవాచ। అన్నం ప్రాణం చక్షుశ్శ్రోత్రం మనో వాచమితి। తగ్ం హోవాచ। యతో వా ఇమాని భూతాని జాయన్తే। యేన జాతాని జీవన్తి। యత్ప్రయన్త్యభిసంవిశన్తి। తద్విజిజ్ఞాసస్వ। తద్బ్రహ్మేతి। స Ôá|౨_ తప్యత। స తపస్తప్త్వా।**

### 1. బ్రహ్మజ్ఞానసాక్షాత్ సాధన – అనువాకాలు 1–6

తైత్తిరీయోపనిషత్తు బ్రాహ్మణోపనిషత్తు కాబట్టి, ఈ ఉపనిషత్తు గద్యరూపంలో ఉంటుందని చూశాము. ఇక్కడ కూడా అలాగే ఉంటుంది.

ఈ తైత్తిరీయోపనిషత్తులోని మూడు వల్లీలకు కూడా వాటిల్లో వచ్చిన మొదటి పదాలతో ఆయా పేర్లు వచ్చాయి.

| | | |
|---|---|---|
| శీక్షాం వ్యాఖ్యాస్యామః | – శీక్షావల్లీ | – మొదటి వల్లీ |
| బ్రహ్మవిదాప్నోతి పరమ్ | – బ్రహ్మవల్లీ / బ్రహ్మానందవల్లీ | – రెండవ వల్లీ |
| భృగుర్వై వారుణిః | – భృగువల్లీ | – మూడవ వల్లీ |

ఈ వల్లీ గురుశిష్యులను పరిచయం చేయటంతో మొదలవుతుంది. మామూలుగా ఉపనిషత్తుల్లో బోధ గురు–శిష్య–సంవాదరూపంలో ఉంటుంది. అది ఒక శిష్యునికీ–ఒక గురువుకూ మధ్య ఉండవచ్చు (కఠోపనిషత్తు); అనేక శిష్యులకీ–ఒక గురువుకూ మధ్య ఉండవచ్చు (ప్రశ్నోపనిషత్తు); అనేక శిష్యులకూ–అనేక గురువులకూ మధ్య ఉండవచ్చు (బృహదారణ్యకోపనిషత్తు).

అలా గురు–శిష్యుల సంవాదరూపంలో బోధించటంయొక్క అంతరార్థం – వేదాంత బోధను గురువు ద్వారానే పొందాలి తప్ప, శిష్యుడు స్వంతంగా నేర్చుకోవటానికి ప్రయత్నించ కూడదు. శంకరభాష్యాలు అనువాదాల్లో దొరికినా కూడా, ప్రత్యక్షంగా ఒక గురువు సమీపంలో కూర్చుని నేర్చుకోవాలి. గురువు సాంప్రదాయ తాళంచెవితో శాస్త్రాన్ని విప్పుతాడు.

ఇలా గురు–శిష్య సంవాదం ద్వారా బోధ సాగాలి అని తెలిసినా, తైత్తిరీయోపనిషత్తులో మొదటి రెండు వల్లీలలో గురు–శిష్యులను ప్రవేశపెట్టలేదు. అందువల్ల ఉపనిషత్తు, వ్రతభంగం అవకుండా ఉండటానికి, ఈ మూడవవల్లీలోనైనా ప్రవేశపెడదామని భావించి, గురు–శిష్యులను పరిచయం చేస్తున్నది. ఇక్కడ ప్రత్యేకత గురు–శిష్యులు తండ్రీ–కొడుకులు కూడా. తండ్రే గురువు అయితే, పుత్రునికి అది అదనపు అవకాశం. తండ్రి బోధను సంపూర్ణంగా చేస్తాడు. పుత్రుడు ఇంట్లో ఉండే బ్రహ్మవిద్యను నేర్చుకుంటాడు. ఈ నేపథ్యంతో ఈ మంత్రభాగాన్ని చూద్దాము.

**భృగుర్వై వారుణిః। వరుణం పితరముపససార। అధీహి భగవో బ్రహ్మేతి। తస్మా ఏతత్ ప్రోవాచ। అన్నం ప్రాణం చక్షుశ్శ్రోత్రం మనో వాచమితి। తగ్ం హోవాచ।**

**భృగుర్వై వారుణిః** – ఉపనిషత్తు ముందస్తుగా ఒక గొప్ప ఋషిని పరిచయం చేస్తున్నది. ఆయన పేరు భృగువు.

**మహర్షీణామ్ భృగురహమ్** – గీత 10–25

మహర్షులలో నేను భృగువును అని సాక్షాత్తూ కృష్ణపరమాత్మే తన విభూతులు గురించి చెప్పుకున్నాడు. భృగువు ముందు బ్రహ్మ మానసపుత్రులలో ఒకరు. కాని ఆ భృగువు దక్షయజ్ఞంలో మరణించాడు. మళ్ళీ ఆ భృగువు వరుణుని పుత్రునిగా జన్మించాడు. ఈ భృగువు వేరు, ఆ భృగువు వేరు అని చూపించటానికి భృగుర్వై వారుణిః అంటున్నది ఉపనిషత్తు. దశరథుని పుత్రుడైన రాముణ్ణి దాశరథి అని పిలిచినట్టుగా వరుణుని పుత్రుణ్ణి వారుణి అంటారు.

**వరుణం పితరముపససార** – తండ్రియైన వరుణుని దగ్గరకు భృగువు వెళ్ళాడు. తండ్రి దగ్గరకు తనయుడు వెళ్ళటం ప్రత్యేకమైన విషయమేమీ కాదు. కాని ఇక్కడ సందర్భం వేరు. తనయుడు, తండ్రి దగ్గరకు ఏవో లౌకిక కోరికలను తీర్చమని అడగటానికి వెళ్ళటం లేదు. తనకు బ్రహ్మవిద్యను బోధించమని అడగటానికి వెళ్ళాడు. వై అనే పదం ఈ సందర్భం ప్రత్యేకమైనది అని చెప్పటానికి వాడబడింది. ఈ సందర్భం చిరకాలం గుర్తుండిపోయే ప్రసిద్ధమైన సందర్భం అవుతుంది తరువాత.

అంత ముఖ్యమైన సందర్భం కాబట్టి, భృగువు సాంప్రదాయపద్ధతిలో వెళ్ళాడని కలుపుకోవాలి. ఏమిటా సాంప్రదాయ పద్ధతి?

**తద్విజ్ఞానార్థం స గురుమేవాభి గచ్ఛేత్**
**సమిత్పాణిః శ్రోత్రియం బ్రహ్మనిష్ఠమ్** – ముండకమ్ 1.2.12

అందువల్ల జ్ఞానం పొందటానికి శ్రోత్రియ బ్రహ్మనిష్ఠ అయిన గురువు దగ్గరకు సమిధలు తీసుకుని వెళ్ళాలి.

భృగువు శ్రద్ధాభక్తులతో వెళ్ళాలి. ఎలా చెప్పగలము?

**భగః** – తండ్రిని తండ్రిగా సంబోధించకుండా ‘ఓ భగవాన్,’ అని సంబోధించటంలోనే భృగువు శ్రద్ధాభక్తులు తెలుస్తున్నాయి. మామూలుగానే మన సాంప్రదాయంలో తండ్రిని గౌరవించటం ఉంది; కాని ఆ తండ్రి, గురువు కూడా అయితే ఇంకా ఎక్కువగా గౌరవించాలి. తనయునికి ఉపనయనం చేసేటప్పుడు గాయత్రీ మంత్రాన్ని తండ్రి, తన తనయునికి చెవిలో బోధిస్తాడు. అందువల్ల ఉపదేశం పొందేముందు పుత్రుడు, తండ్రికి పాదపూజ చేస్తాడు.

**అధీహి బ్రహ్మ ఇతి**– నాకు బ్రహ్మజ్ఞానం బోధించండి అని కోరాడు. ఈ ప్రశ్ననుంచే శిష్యుని అర్హత తెలుస్తున్నది. భృగువుకు వివేకం, వైరాగ్యం, శమాది షట్కసంపత్తి, ముముక్షుత్వాలతో కూడిన సాధన చతుష్టయ సంపత్తి ఉందని చెప్పవచ్చు. ఎందుకంటే, తన సమస్య ఏమిటో తెలుసుకున్నాడు, దానికి పరిష్కారం ఏమిటో కూడా అర్థం చేసుకున్నాడు. తన సమస్య ఆత్మ అజ్ఞానం అనీ, దానికి బ్రహ్మజ్ఞానం లేదా ఆత్మజ్ఞానం పొందటం ఒకటే పరిష్కారమనీ కూడా తెలుసుకున్నాడు. అంతేకాదు, బ్రహ్మజ్ఞానం తనంతట తను పొందలేననీ, గురువు ద్వారానే, గురు ఉపదేశం ద్వారానే పొందగలడని కూడా తెలుసుకున్నాడు. ఆ విధంగా భృగువుకు మోక్షఇచ్ఛ, జ్ఞానఇచ్ఛ, గురువు ఆవశ్యకత, శాస్త్రంమీద శ్రద్ధ ఉన్నాయి. ఈ దశలన్నీ దాటుకు రావటానికే ఒక శిష్యునికి కొంతకాలం పడుతుంది. కాని భృగువు అది గ్రహించుకుని, గురువు వద్దకు వచ్చాడు. తండ్రి కూడా అతనికీ అర్హతలు ఉన్నాయని వెంటనే గ్రహించాడు. అందువల్లనే తన పుత్రునికి పరీక్షలేమీ పెట్టకుండానే తన బోధను మొదలెట్టాడు.

**తస్మా ఏతత్ప్రోవాచ** – తన పుత్రుడు–శిష్యుడు అయిన భృగువుకు తండ్రి ఈ విధంగా బోధించాడు. తస్మా పదాన్ని విడదీస్తే తస్మై అని వస్తుంది. తస్మై పుత్రాయ – ఆ సంసిద్ధుడైన పుత్రునికి, ప్రోవాచ – తండ్రి బోధించాడు. ఏతద్ – ఈ క్రింది విషయాలు బోధించాడు. ఏం బోధించాడు?

**అన్నం ప్రాణం చక్షుశ్శ్రోత్రం మనో వాచమితి** – ఇతి అంటే ఇక్కడితో తండ్రి చెప్పిన మాటలు ముగిశాయి. ముందుగా, తండ్రి పంచకోశ వివేకం చేయటానికి అవసరమైన లక్షణాలను చెబుతున్నాడు.

అన్నం అంటే అన్నమయకోశం; ప్రాణం, వాచమ్ అంటే ప్రాణమయకోశం. వాక్కు కర్మేంద్రియం. అందువల్ల వాక్కు తక్కిన అన్ని కర్మేంద్రియాలకు ప్రతీక. కర్మేంద్రియాలు – వాక్కు, పాణి, పాదం, పాయువు, ఉపస్థలు. పంచప్రాణాలు + పంచకర్మేంద్రియాలు కలిపి ప్రాణమయకోశం కిందికి వస్తాయి. చక్షువు, శ్రోత్రం, జ్ఞానేంద్రియాలు. ఈ రెండూ పంచజ్ఞానేంద్రియాలను సూచిస్తాడు. పంచ జ్ఞానేంద్రియాలు చక్షువు, శ్రోత్రం, నాసిక, నాలుక, చర్మం. మనః అంటే మనస్సు. అందులో చత్వారి అంతఃకరణ వస్తుంది. అవి మనస్సు, బుద్ధి, చిత్తం, అహంకారం.

**మనశ్చ జ్ఞానేంద్రియ పంచకం మిలిత్వా యో భవతి స మనోమయః కోశః**

పంచజ్ఞానేంద్రియాలతో కూడిన మనస్సు మనోమయకోశం. ఇక్కడ మనస్సు అంటే మనస్సు, చిత్తం, అహంకారం వస్తాయి.

ఈ విధంగా వరుణుడు పంచకోశాలలో మూడింటి గురించే చెప్పాడు కాని తక్కిన రెండు కోశాలను కూడా మనం కలుపుకోవాలి. దాన్ని ఉపలక్షణం అంటారు. తక్కిన రెండు కోశాలు విజ్ఞానమయకోశం, ఆనందమయకోశం. విజ్ఞానమయకోశంలోకి కూడా పంచజ్ఞానేంద్రియాలు, మనస్సు వస్తాయి. కాకపోతే ఇక్కడ మనస్సు అంటే బుద్ధి, చిత్తం, అహంకారం వస్తాయి. ఆనందమయకోశంలోకి కారణశరీరం వస్తుంది.

పంచకోశాల గురించి టూకీగా –

1. అన్నమయకోశం – స్థూలశరీరంలోని అనేక అంగాలు
2. ప్రాణమయకోశం – పంచప్రాణాలు + పంచ కర్మేంద్రియాలు – క్రియాశక్తి
3. మనోమయకోశం – పంచజ్ఞానేంద్రియాలు + మనస్సు – ఇచ్ఛాశక్తి
4. విజ్ఞానమయకోశం – పంచజ్ఞానేంద్రియాలు + బుద్ధి – జ్ఞానశక్తి
5. ఆనందమయకోశం – కారణశరీరం

వీటిని బ్రహ్మ లబ్ధమయ్యే ద్వారాలుగా చెప్పాడు వరుణుడు. శంకరాచార్యులవారు దీన్ని ఇలా వర్ణించారు.

**బ్రహ్మోపలబ్ధౌ ద్వారాణి ఉక్తవాన్**

**తగ్ం హోవాచ** – దాని తర్వాత, వరుణుడు తన బోధను కొనసాగిస్తూ, బ్రహ్మ నిర్వచనాన్ని చెప్పబోతున్నాడు. దాన్ని బ్రహ్మలక్షణం అంటారు.

**యతో వా ఇమాని భూతాని జాయన్తే। యేన జాతాని జీవన్తి। యత్ప్రయన్త్యభిసంవిశన్తి। తద్విజిజ్ఞాసస్వ। తద్బ్రహ్మేతి। స తపోఽ తప్యత। స తపస్తప్త్వా।**

ఇంతకుముందు అధ్యాయంలో బ్రహ్మయొక్క ఒక నిర్వచనం చూశాము. అది **సత్యం జ్ఞానమనంతం బ్రహ్మ**. ఆ నిర్వచనాన్ని శాస్త్రంలో స్వరూపలక్షణం అంటారు. ఇక్కడ ఇంకొక నిర్వచనాన్ని చూస్తున్నాము. దాన్ని తటస్థలక్షణము అంటారు. అది పరోక్షంగా వస్తుంది కాని, అది కూడా చాలా ముఖ్యమైన లక్షణం.

**జన్మాదస్యయతః** – బ్రహ్మసూత్రాలు 2

నిజానికి వ్యాసాచార్యులవారు తన బ్రహ్మసూత్రాలలో రెండవ సూత్రంలోనే బ్రహ్మను నిర్వచించటానికి ఈ తటస్థ లక్షణాన్నే తీసుకున్నారు. ఆ సూత్రం అర్థం ఈ ప్రత్యక్ష ప్రపంచం యొక్క సృష్టిస్థితి లయకారణం బ్రహ్మ. బ్రహ్మసూత్రాల్లో ఒక్కొక్క సూత్రానికి ఒక విషయవాక్యం ఉంటుంది. అంటే దానికి మూలమైన ఏదైనా ఉపనిషత్తు వాక్యం ఉంటుంది. అక్కడ ఆ రెండవ సూత్రానికి మూలమైన విషయవాక్యం, ఇదుగో ఈ మంత్రమే – యతోవా ఇమాని భూతాని జాయంతే. భాగవతంలో, వ్యాసాచార్యులవారు ఈ నిర్వచనాన్నే ఇస్తారు.

ఇంత ముఖ్యమైన ఈ నిర్వచనంయొక్క అర్థం బ్రహ్మ జగత్తుయొక్క సృష్టి, స్థితి, లయ కారణం. ఇప్పుడు ఈ మంత్రం అర్థం చూద్దాము.

**యతో వా ఇమాని భూతాని జాయంతే** – ఇక్కడ బ్రహ్మ అని ప్రత్యక్షంగా చెప్పడు వరుణుడు. యతః అంటే దానినుంచే. అన్ని భూతాలూ పుట్టాయి అన్నాడు. భూతాని అంటే రెండు అర్థాలు చెప్పవచ్చు – అన్ని ప్రాణులు, పంచభూతాలు. రెండూ కలిపితే దానినుంచే మొత్తం సృష్టి జరిగింది. అది **సృష్టికారణం.**

**యేన జాతాని జీవంతి** – దేనిచేత జీవించుచున్నాయో, అంటే స్థితి పొందుతున్నాయో. అది **స్థితికారణం.**

**యత్ప్రయంత్యభిసంవిశంతి** – దేనిలో ఇవన్నీ లయమవుతున్నాయో; ప్రయంతి అంటే లయం జరిగినప్పుడు. యత్ అభిసంవిశంతి అంటే ఈ జీవులన్నీ అందులో లయమవుతున్నాయి. అంటే అది **లయకారణం.**

పురాణాల్లో ముగ్గురు దేవుళ్ళు సృష్టి, స్థితి, లయ కారకులని నేర్చుకుంటాము. బ్రహ్మ సృష్టికారణం, విష్ణుమూర్తి స్థితికారణం, శివుడు లయకారణం. కాని నిజానికి ఈ ముగ్గురూ మనం పొరపాటు పడినట్టుగా ముగ్గురు భిన్న దేవుళ్ళు కాదు. ఈ ప్రాథమిక సూత్రం తెలియక, వీరిలో ఎవరు గొప్ప అని వాదోపవాదాలకు దిగుతాము. పాపం బ్రహ్మదేవుణ్ణి పక్కన పెట్టేస్తాము ఈ వాదనల్లో. శివ, విష్ణువుల మధ్యనే పోటీ. శివభక్తులు శివుణ్ణి కీర్తిస్తే, విష్ణుభక్తులు విష్ణుమూర్తిని స్తుతిస్తారు. అద్వైత వేదాంతి మాత్రం, ఇందరు దేవుళ్ళు లేరు, ఉన్నదొకటే పరమాత్మ అని అర్థం చేసుకుంటాడు. కృష్ణపరమాత్మ కూడా ఆ విషయం చెప్పాడు భగవద్గీతలో.

**యో యో యాం యాం తనుం భక్తః శ్రద్ధయార్చితుమిచ్ఛతి ।**
**తస్య తస్యాచలాం శ్రద్ధాం తామేవ విదధామ్యహమ్ ॥** – గీత 7.21

ఏ భక్తుడు ఏ దేవుణ్ణి భక్తితో కొలిచినా, వారికి ఆ దేవుని ద్వారానే వారి కోరికలు నేను తీరుస్తాను అన్నాడు కృష్ణపరమాత్మ. అంటే అక్కడ కృష్ణపరమాత్మ తనను ఏకరూప భగవాన్‌గా చెప్పటం లేదు. అద్వైత వేదాంతం ఇష్టదేవతకు పూజ చేయవద్దు అనదు, కాని ఆ పేరుతో తక్కిన దేవతలను ద్వేషించవద్దు అంటుంది. అందరు దేవుళ్ళు సమానమే. నిజానికి, 'అందరు,' పదం కూడా వాడకూడదు. అంతమంది దేవుళ్ళు లేరు. ఉన్నదొక్కటే నిర్గుణ బ్రహ్మ. ఆ బ్రహ్మే జగత్తుయొక్క సృష్టి, స్థితి, లయ కారణం. దానికి నిదర్శనం ఈ మంత్రమే. కాకపోతే అదెవరో నువ్వు తెలుసుకో అంటున్నాడు వరుణుడు. అంటే ఏదైతే జగత్తుయొక్క సృష్టి, స్థితి, లయ కారణమో అది బ్రహ్మ అని బ్రహ్మలక్షణం చెప్పాడు.

**తద్విజిజ్ఞాసస్వ తద్బ్రహ్మేతి** – దానిని నువ్వు తెలుసుకో, అది బ్రహ్మ అన్నాడు. ఎలా తెలుసుకోవాలి?

**స తపోఽ తప్యత** – దానిమీద నువ్వు తపస్సు చేయి అన్నాడు. తపస్సు అంటే ఇక్కడ విచారణ చేయమని అర్థం.

ఇప్పుడు గురువు చెప్పిన రెండు సూచనల మేరకు శిష్యుడు విచారణ చేయాలి.

1. బ్రహ్మ ఉపలబ్ధి ద్వారాణి – అన్నం ప్రాణం చక్షుశ్శ్రోత్రం మనో వాచమితి

2. బ్రహ్మ లక్షణమ్ – యతోవా ఇమాని భూతాని జాయంతే। యేన జాతాని జీవంతి। యత్ప్రయంత్యభిసంవిశంతి।

పంచకోశవివేకాన్ని బ్రహ్మలక్షణాన్ని దృష్టిలో పెట్టుకుని చేయాలి. ఇక్కడ ఇంకొక అంశాన్ని కూడా గ్రహించాలి మనం. వరుణుడు భృగువుని విచారణ చేయమన్నాడు కదా అని, కొంతమంది ఆత్మవిచారణ స్వంతంగా చేయాలి అనుకుంటారు. 'నేనెవరు?' అని ధ్యానంలో కూర్చుని శోధిస్తే జవాబు వస్తుందనుకుంటారు. కాని ఇక్కడ శిష్యుడు శాస్త్రంలో చెప్పిన మహావాక్యాలను గురువు చేసిన బోధ ఆధారంగా విచారణ చేయబోతున్నాడు. అందువల్ల,

ఆత్మ విచారణ = గురుశాస్త్ర వాక్యవిచారణ = ప్రమాణ విచారణ

స్వంతంగా విచారణ చేస్తే మనస్సు శూన్యంగా అవుతుంది. ఆ శూన్యం వచ్చాక ఏం చేయాలో తెలియదు. ఆ ప్రశాంతస్థితిలో బ్రహ్మ పైకి వస్తాడు అని అనుకుంటారు కాని, వేదాంతం బ్రహ్మను అలా తెలుసుకోలేము అంటుంది. బ్రహ్మ అనుభవంలోకి వచ్చే ఆబ్జెక్టు కాదు.

**Ever the experiencer, never the experienced**

**అనుభవించే నువ్వే ఎప్పటికీ అది, అనుభవించబడే వస్తువు కాదు ఎన్నటికీ**

బ్రహ్మజ్ఞానం గురువు ద్వారానే పొందాలని కృష్ణపరమాత్మ కూడా భగవద్గీతలో చెప్పాడు.

**తద్విద్ధి ప్రణిపాతేన పరిప్రశ్నేన సేవయా।**

**ఉపదేక్ష్యంతి తే జ్ఞానం జ్ఞానినస్తత్త్వదర్శినః॥** – గీత 4.34

బ్రహ్మజ్ఞానాన్ని గురువు ద్వారా, గురువుకు నమస్కారం చేసి, సేవలు చేసి, ప్రశ్నలు వేసి పొందాలి. అప్పుడు ఆ గురువు నీకు ఆ జ్ఞానాన్ని బోధిస్తాడు.

**స తపస్తప్త్వా** – ఆ విధంగా భృగువు తపస్సు చేశాక (ఒక నిర్ణయానికి వచ్చాడు), తను ప్రయాణిస్తున్నది సరియైన మార్గమో కాదో తెలుసుకోవటానికి మళ్ళీ గురువు వద్దకు వచ్చాడు.

**కొన్ని ముఖ్యాంశాలు**

భృగువు ఏం విచారణ చేశాడో, వరుణుడు దానికి ఏం జవాబు చెప్పాడో చూసే ముందు మనం కొన్ని ముఖ్యాంశాలను గమనించాలి.

1. బ్రహ్మను జగత్కారణంగా వర్ణించింది ఉపనిషత్తు. దాన్ని తటస్థ లక్షణం అంటారని చూశాము. ఈ తటస్థ లక్షణంలో మళ్ళీ నిమిత్త కారణం, ఉపాదాన కారణం వస్తాయి. ఉదాహరణకు కుండ విషయం తీసుకుంటే కుండకు కుమ్మరి నిమిత్త కారణం, మట్టి ఉపాదాన కారణం.

అలాగే బ్రహ్మ ఉపాదాన కారణంగా ఇక్కడ చూస్తాము (బ్రహ్మే నిమిత్త కారణం కూడా, కాని అది ఇక్కడ అప్రస్తుతం). ఒక పదాన్ని వాడినప్పుడు, అన్నివేళలా దాని ముఖ్యార్థాన్ని తీసుకోకూడదు. ముఖ్యంగా ఉదాహరణ వాడినప్పుడు.

ఉదాహరణకు ఒక వ్యక్తిని అతను ఆ సంస్థకు మూలస్తంభం వంటివాడు అంటే ఏమిటి అర్థం? అతను స్తంభంలాగా కదలకుండా, గుండ్రంగా ఉన్నాడనా? ఎంతమాత్రమూ కాదు. స్థంభం ఎలా ఒక భవంతికి ఆధారమో, అలా ఇతను తన సంస్థకు ఆధారం. అంతవరకే అర్థాన్ని తీసుకోవాలి. ఒక పోలిక చెప్పినప్పుడు అందులో సాధర్మ్యాలు ఉంటాయి, వైధర్మ్యాలు ఉంటాయి. మనం పోలికలను మాత్రమే తీసుకోవాలి.

అలాగే ఇక్కడ బ్రహ్మ కారణం అంటే బ్రహ్మ మూలకారణం, బ్రహ్మ నుంచే కార్యాల సృష్టి జరిగిందని అర్థం; మట్టినుంచి కుండ వచ్చినట్టుగా అని చూశాము. కాని ఆ కారణాలకూ, బ్రహ్మ అనే కారణానికీ మధ్య వ్యత్యాసం ఉంది. ఆ కారణాలు కార్యంగా మారినప్పుడు మార్పు చెందుతాయి. మట్టి కుండగా మారుతుంది; చెక్క కుర్చీగా మారుతుంది; బంగారం ఆభరణంగా రూపుదిద్దుకుంటుంది. పాలు పెరుగుగా పరిణామం చెందుతుంది; విత్తనం చెట్టుగా మొలకెత్తుతుంది. అంటే, సాధారణంగా ఉపాదాన కారణం పరిణామం చెందుతుంది. అందువల్ల దాన్ని పరిణామి ఉపాదాన కారణం అంటారు. పరిణామం అంటే వికారం చెందుతుంది. కాని బ్రహ్మ వికారాలకు లోనుకాదు; నిర్వికారం. అందువల్ల బ్రహ్మను వివర్త ఉపాదాన కారణం అంటారు. అంటే బ్రహ్మ ఉపాదాన కారణమే కానీ, పరిణామి ఉపాదాన కారణం కాదు, బ్రహ్మ వివర్త ఉపాదాన కారణం.

ఈ విషయాలను దృష్టిలో పెట్టుకుని భృగువు విచారణ చేయాలి. పంచకోశాలను, బ్రహ్మ నిర్వచనాన్ని బేరీజు వేసుకుంటూ విచారణ చేయాలి. పంచకోశాల్లో ఒక్కొక్క కోశాన్ని విశ్లేషించుకుంటూ వచ్చి, ఇదికాదు, ఇదికాదు అని అర్థం చేసుకుంటూ, చివరకు బ్రహ్మ స్వరూపాన్ని తెలుసుకుంటాడు. ముందు అధ్యాయంలోనే పంచకోశ వివేక ప్రక్రియను వివరంగా చూశాము. కాబట్టి ఇక్కడ అంత వివరణ రాదు.

2. ఇక్కడ బ్రహ్మ తటస్థ లక్షణం చూశాము, అందులో కూడా ఉపాదాన కారణం చూశాము. బ్రహ్మే నిమిత్త కారణం కూడా. ఒక కుండ తీసుకుంటే, దానికి నిమిత్త కారణం కుమ్మరి, ఉపాదాన కారణం మట్టి అని చూశాము. నిమిత్త కారణానికీ, ఉపాదాన కారణానికీ సూక్ష్మమైన భేదం ఉంది. నిమిత్త కారణాన్ని సృష్టిమాత్ర కారణం అంటారు. అంటే కుమ్మరి బాధ్యత కుండ చేయటంతో తీరిపోతుంది; అతను ఎక్కడో కేరళలో ఉండి కుండను చేశాడనుకుందాము. అతను కుండతోపాటు వేరే ఊరికి వెళ్ళడు. కాని ఉపాదాన కారణం విషయానికి వచ్చేసరికి, ఉపాదాన కారణం సృష్టి, స్థితి, లయలు మూడింటికీ కారణం. కుండ మట్టినుంచి పుడుతుంది, మట్టివల్లనే కుండగా చెలామణి అవుతుంది, పగిలిపోతే మట్టిలోనే లయమవుతుంది.

3. కాని సృష్టి విషయంలో బ్రహ్మ ఉపాదాన కారణం మాత్రమే కాదు, నిమిత్త కారణం కూడా. ఎందుకంటే సృష్టికి ముందు బ్రహ్మ మాత్రమే ఉంది. వేరే ఏదీ లేదు. అందువల్ల బ్రహ్మను అభిన్న నిమిత్త ఉపాదాన కారణం అంటారు. నిమిత్త కారణానికి మేకర్ అనీ, ఉపాదాన కారణాన్ని మెటీరియల్ అనీ అంటారు ఇంగ్లీషులో. అందువల్ల పూజ్యస్వామీజీ సృష్టి గురించి చెప్పేటపుడు మేకర్ అండ్ మెటీరియల్ ఆర్ రోల్డ్ ఇంటు వన్ అంటారు.

4. బ్రహ్మ ఉపాదాన కారణంగా కూడా వివర్త ఉపాదాన కారణం అని చూశాము. అంటే ఇప్పుడు పూర్తి నిర్వచనం చూస్తే –

**అభిన్న నిమిత్త వివర్త ఉపాదాన కారణం బ్రహ్మ**

5. ఇంకో ముఖ్యమైన అంశం. ఈ జడప్రపంచం చైతన్యంనుంచి వచ్చింది. కంటికి కనబడని చైతన్యంనుంచి, కంటికి కనబడే పాంచభౌతిక జగత్తు వచ్చింది. ఈ సిద్ధాంతం ఒక్క అద్వైత వేదాంతంలోనే చూస్తాము. దీన్ని చేతన వాదన అంటారు. బ్రహ్మసూత్రాల్లో రెండవ సూత్రం వివరణ చూస్తాము. అందులో ఎలా అద్వైతం ఒక్కటే చేతనవాదన నిరూపిస్తుందో వస్తుంది. ఆ సూత్రమే దీనికి నిదర్శనం. అంటే పదార్థానికి మూలకారణం పదార్థం కాదు, చైతన్యం!

బ్రహ్మను సృష్టికారణంగా చూసినప్పుడు ఈ విషయాలను మనస్సులో పెట్టుకోవాలి.

## అనువాకం – 2

**అన్నం బ్రహ్మేతి వ్యజానాత్। అన్నాద్ధ్యేవ ఖల్విమాని భూతాని జాయన్తే। అన్నేన జాతాని జీవన్తి। అన్నం ప్రయన్త్యభిసంవిశన్తీతి। తద్విజ్ఞాయ। పునరేవ వరుణం పితరముపససార। అధీహి భగవో బ్రహ్మేతి। తగ్ం హెూవాచ। తపసా బ్రహ్మ విజిజ్ఞాసస్వ। తపో బ్రహ్మేతి। స తపోఽ తప్యత। స తపస్తప్త్వా॥**

ఎ) **అన్నమే బ్రహ్మ** – భృగువు ఈ అనువాకంలో అన్నమయకోశాన్ని తీసుకుని దాని సృష్టి, స్థితి, లయ కారణమెవ్వరో విచారణ చేస్తాడు. అన్నమయకోశం అంటే స్థూలశరీరం. స్థూలశరీరం అన్నంనుంచి పుట్టింది. అన్నం అంటే ఆహారం; ఆహారం అంటే భూమ్మీద ఉన్న స్థూలపదార్థం.

**పృథివ్యా ఓషధయః ఓషధీభ్యోఽన్నమ్** – పృథివినుంచి చెట్లు వచ్చాయి. చెట్లనుంచి ఆహారం వస్తుంది.

**అన్నాత్ పురుషః** – పురుషః అంటే అన్నమయకోశం. అందువల్ల అన్నమే శరీరానికి ఉపాదాన కారణం.

అంతేకాదు, బ్రహ్మానందవల్లీలోని రెండవ అనువాకం అన్నమే ఈ స్థూలశరీరానికి సృష్టి స్థితి లయకారణం అని వివరించింది.

**అన్నాద్వై ప్రజాః ప్రజాయంతే । యాః కాశ్చ పృథివీగ్ం శ్రితాః ।**
**అథో అన్నేనైవ జీవంతి । అథైనదపి యంత్యన్తతః ।**

ఈ భూమ్మీద జీవరాశులన్నీ అన్నంనుంచే పుట్టాయి; అన్నంవల్లనే స్థితి పొందుతాయి; అన్నంలో లయమవుతాయి.

అన్నం ఈ స్థూలశరీరానికి కారణం అంటే, ప్రత్యక్షంగా కాదు; పరోక్షంగా. అన్నం తండ్రి శరీరంలోకి వెళ్ళి శుక్రంగాను, తల్లి శరీరంలోకి వెళ్ళి శోణితంగాను మారుతుంది. ఆ రెండింటి కలయికవల్ల శిశువు రూపుదిద్దుకుంటుంది తల్లిగర్భంలో. ఆ శిశువు భూమ్మీద పడ్డాక, అన్నంవల్లనే స్థితిపొందుతుంది. ఆ వ్యక్తి మరణించినప్పుడు, స్థూలశరీరం పంచభూతాలలో కలిసిపోతుంది. అది మళ్ళీ భూమిలో కలిసి, వృక్షసముదాయానికి ఎరువుగా మారి, తరువాత వచ్చే తరానికి వృక్షాలు ఆహారం అందించటానికి తోడ్పడుతుంది. అంటే ప్రతి వ్యక్తి కూడా తరువాత వచ్చే తరానికి పరోక్షంగా ఆహారం అవుతాడు. ఆ విధంగా, అన్నం జీవరాశులన్నిటికీ (మనుష్యులు, జంతువులు, చెట్లు) సృష్టి, స్థితి, లయకారణం కాబట్టి, బ్రహ్మ గురించి వరుణుడు ఇచ్చిన నిర్వచనానికి అన్నం సరిగ్గా సరిపోతుంది. అందువల్ల అన్నమే బ్రహ్మ అని నిశ్చయించుకున్నాడు భృగువు.

**అన్నం బ్రహ్మేతి వ్యజానాత్** – (భృగువు) అన్నం బ్రహ్మ అని తెలుసుకున్నాడు. బ్రహ్మ అంటే అన్నింటికన్నా పెద్దది, సర్వవ్యాపకం. అన్నం కూడా పెద్దది, సర్వవ్యాపకం. అందువల్ల తన విశ్లేషణ సరియైనదే అనుకున్నాడు.

**అన్నాద్ధ్యేవ** – అన్నాత్ హి ఏవ – హి అంటే చాలా స్పష్టంగా తెలుస్తున్నది. ఏమిటి స్పష్టంగా తెలుస్తున్నది. అన్నమే ఈ స్థూలశరీరానికి సృష్టి స్థితి లయకారణమని తెలుస్తున్నది. దీన్ని ప్రత్యక్షసిద్ధమ్ అంటారు.

**ఖలు ఇమాని భూతాని జాయన్తే** – ఖలు అంటే నిశ్చయంగా. నిశ్చయంగా ఈ ప్రాణులన్నీ అన్నంనుంచే పుదుతున్నాయి. అన్నం సృష్టికారణం.
**అన్నేన జాతాని జీవన్తి** – పుట్టినవి అన్నంవల్లనే జీవిస్తున్నాయి. ఏమైనా సందేహం ఉంటే, నాలుగు రోజులు అన్నం తినటం మానేసి చూస్తే, మీకే తెలుస్తుంది. అన్నం స్థితికారణం.
**అన్నం ప్రయన్త్యభిసంవిశన్తీతి** – ప్రయంతి అంటే మరణకాలంలో. అభిసంవిశంతి అంటే లయమవుతాయి. అంటే మరణకాలంలో ఈ ప్రాణులు అన్నంలో లయమవుతాయి. అన్నం లయకారణం కూడా.

ఆ విధంగా భృగువు అన్నమే బ్రహ్మ అని నిర్ణయించుకున్నాడు. తన విచారణకు మురిసిపోయాడు కూడా. కాని, మళ్ళీ లోతుగా ఆలోచిస్తే, తన విచారణలో చిన్న లోపం కనబడింది. అదేమిటో, ఇక్కడ ఉపనిషత్తు పేర్కొనలేదు కాని, మనం కలుపుకోవచ్చు.

అన్నం అన్నమయకోశానికి సృష్టి స్థితి లయకారణం అన్నంతవరకూ అది సరియైన విచారణే! కాని అది మూలకారణం కాదు. దాన్ని ఆపేక్షిక కారణం అంటారు. ఉదాహరణకు మీ తల్లిదండ్రులు మీ జన్మకు కారణం. కాని వారు మూలకారణం కాదు. వారు, వారి తల్లిదండ్రులనుంచి పుట్టారు. మూలకారణం అంటే అదే అన్నింటికీ కారణం అవ్వాలి కాని, అది ఇంకోదానికి కార్యం కాకూడదు. అంటే ఒక్కమాటలో చెప్పాలంటే కారణం లేని కారణం అవ్వాలి. అన్నం అలా కారణం లేని కారణం కాదు, అదే ఇంకో కారణంనుంచి పుట్టింది. దానికి శ్రుతి, యుక్తి ప్రమాణాలు ఉన్నాయి.
**శ్రుతి ప్రమాణం** – అన్నం ఓషధులనుంచి పుట్టింది.

**పృథివ్యా ఓషధయః, ఓషధీభ్యోఽన్నమ్ ।** – బ్రహ్మానందవల్లీ

**యుక్తి ప్రమాణం** – తర్కం కూడా అది నిరూపిస్తుంది. అన్నమయంగా మారటానికి అన్నం మారుతుంది. ఏదైతే మారుతుందో, అది కార్యం అవుతుంది.

**యత్ యత్ సవికారం । తత్ తత్ కార్యమ్ ।**

అన్నం ఆరు మార్పులకు లోనవుతుంది.

**అస్తి, జాయతే వర్ధతే, విపరిణమతే, అపక్షీయతే, వినశ్యతి** – తత్త్వబోధ

ఈ ఆరు వికారాల్లో ఒకటి పుట్టుక. అన్నానికి పుట్టుక ఉంది, అంటే అది మూలకారణం కాలేదు.

**న జాయతే మ్రియతే వా కదాచిత్** – గీత

బ్రహ్మకు లేదా ఆత్మకు పుట్టుకా లేదు, మరణమూ లేదు. కాబట్టి అన్నం బ్రహ్మ కాదు. ఈ తర్కంతో నిరాశపడిన భృగువు మళ్ళీ తండ్రి దగ్గరకు వెళ్ళాడు; తండ్రిని మార్గం చూపమని అడగటానికి.

**తద్విజ్ఞాయ** – ఆ విషయాన్ని తెలుసుకుని; అంటే ముందు అన్నమే బ్రహ్మ అనుకుని, మళ్ళీ లోతుగా విశ్లేషించి అన్నం బ్రహ్మ కాదని తెలుసుకుని, నిరాశపడి,

**పునరేవ వరుణం పితరముపససార** – మళ్ళీ తండ్రియైన (గురువైన) వరుణుణ్ణి సమీపించి, మళ్ళీ (అడిగాడు),

**అధీహి భగవో బ్రహ్మేతి** – ఓ భగవాన్! నాకు బ్రహ్మ గురించి బోధించు అన్నాడు. నాకు ఆపేక్షిక కారణం గురించే తెలిసింది కాని, మూలకారణం గురించి తెలియలేదు అని దాని ఉద్దేశ్యం.

**తగ్ంహోవాచ** – తండ్రి–గురువు అయిన వరుణుడు పుత్రుడు–శిష్యుడు అయిన భృగువుతో ఈ విధంగా అన్నాడు.

మళ్ళీ గురువు కొత్తగా చెప్పేదేమీ లేదు. చెప్పాల్సిందేదో ముందే చెప్పేశాడు. బ్రహ్మ ఉపలబ్ధి ద్వారం, బ్రహ్మలక్షణం చెప్పేశాడు. అంటే పంచకోశాలకు సృష్టి స్థితి లయ కారణమెవరో, అది బ్రహ్మ అన్నాడు. జిగ్సా పజిల్‌లాగా ఇచ్చాడు. ఆ పజిల్ గొప్పదనం ఏమిటంటే, అందులోనే సమస్యా ఉంటుంది, అందులోనే పరిష్కారమూ ఉంటుంది. ఆ పరిష్కారాన్ని వెతుక్కోవటంలో ఉంది తెలివంతా! ఒక ముఖ్యమైన ముక్క అన్ని ముక్కలను కలిపి చిత్రాన్ని పూర్తిచేయటానికి తోడ్పడుతుంది. తండ్రి నువ్వు సరియైన మార్గంలోనే ప్రయాణిస్తున్నావని ఒక సూచన చేశాడు. ఇంక అతను అదే మార్గంలో దూసుకువెళ్ళాలి.

ఎవరో అద్భుతంగా చెప్పారు: ఒక సమస్యను పరిష్కరించటానికి అన్ని దారులు మూసుకు పోయాయి అనుకుంటే, ఒక విషయం గట్టిగా గుర్తుంచుకోవాలి. అది అన్ని దారులు మూసుకుపోలేదని.

**తపసా బ్రహ్మ విజిజ్ఞాసస్వ** – తపస్సుతో బ్రహ్మను తెలుసుకో అన్నాడు. ఇక్కడ తపస్సు అంటే విచారణ అని చూశాము.

**తపో బ్రహ్మేతి** – తపస్సే బ్రహ్మ అని చెప్పాడు. తపస్సే బ్రహ్మ అనే వాక్యాన్ని అక్షరాలా తీసుకోకూడదు. తపస్సు బ్రహ్మజ్ఞానానికి సాధనం అని అర్థం చేసుకోవాలి.

డబ్బే సర్వస్వం అని అంటే, దాని అర్థం ఏమిటి? డబ్బు ద్వారా సర్వస్వాన్నీ పొందవచ్చని అర్థం. డబ్బు ద్వారా మనకు అవసరమైన ఆహారాన్ని, దుస్తులను, విద్యను పొందవచ్చని; ఆఖరికి గుడిలో ఈశ్వరదర్శనాన్ని కూడా పొందవచ్చని అర్థం!

**స తపోఽ తప్యత । స తపస్తప్త్వా** – భృగువు మళ్ళీ తపస్సు చేశాడు, మళ్ళీ తపస్సు చేశాక (ఈ విధంగా నిర్ణయించుకున్నాడు).

## అనువాకం – 3

**ప్రాణో బ్రహ్మేతి వ్యజానాత్। ప్రాణాద్ధ్యేవ ఖల్విమాని భూతాని జాయన్తే। ప్రాణేన జాతాని జీవన్తి। ప్రాణం ప్రయన్త్యభిసంవిశన్తీతి। తద్విజ్ఞాయ। పునరేవ వరుణం పితరముపససార। అధీహి భగవో బ్రహ్మేతి। తగ్ం హోవాచ। తపసా బ్రహ్మ విజిజ్ఞాసస్వ। తపో బ్రహ్మేతి। స తపోఽ తప్యత। స తపస్తప్త్వా॥**

బి) **ప్రాణమే బ్రహ్మ** – ఇప్పుడు భృగువు రెండవ కోశం అయిన ప్రాణమయకోశంలోకి అడుగు పెడుతున్నాడు. ప్రాణమయకోశం యొక్క సృష్టిస్థితి లయకారణాలేమిటో అన్వేషించాడు. సమష్టి ప్రాణమే వ్యష్టి ప్రాణమయకోశాలన్నింటికీ కారణం అని అర్థం చేసుకున్నాడు.

**ప్రాణం దేవా అనుప్రాణన్తి । మనుష్యాః పశవశ్చ యే ।**
**ప్రాణో హి భూతానామాయుః । తస్మాత్సర్వాయుషముచ్యతే** – బ్రహ్మానందవల్లీ 3

దేవతలు, మనుష్యులు, జంతువులు ప్రాణం వల్లనే జీవిస్తున్నాయి. ప్రాణమే జీవజాలానికి ఆయుష్షు. అందువల్లనే ప్రాణాన్ని సర్వాయుషం అంటారు. ఆ విధంగా ప్రాణమే ప్రాణమయ కోశానికి సృష్టి స్థితి లయకారణం.

**ప్రాణో బ్రహ్మేతి వ్యజానాత్** – ప్రాణమే బ్రహ్మ అని భృగువు తెలుసుకున్నాడు. ప్రాణతత్త్వం అన్నం కన్నా సూక్ష్మమైనది. దేనికన్నా మూలకారణం వెతుకుతున్నప్పుడు, అత్యంత స్థూలమైన దాన్నుంచి, అత్యంత సూక్ష్మమైన దానివైపుకు సాగాలి మన ప్రయాణం.

అన్నమయకోశం అత్యంత స్థూలమైనది, భౌతికమైనది, కంటికి కనబడేది. ప్రాణమయం దానికన్నా సూక్ష్మమైనది, భౌతికం కానిది, కంటికి కనబడనిది. భృగువు ప్రాణమే బ్రహ్మ అని భావించగానే తనకు జవాబు దొరికిందని మురిసిపోయాడు.

**ప్రాణాద్ధ్యేవ ఖల్విమాని భూతాని జాయంతే** – వ్యష్టి ప్రాణమయకోశాలన్నీ ప్రాణం నుంచే పుడుతున్నాయి. ప్రాణం సృష్టికారణం.

**ప్రాణేన జాతాని జీవంతి** – పుట్టినవి ప్రాణంవల్లనే జీవిస్తున్నాయి. ప్రాణం స్థితికారణం.

**ప్రాణం ప్రయన్త్యభిసంవిశన్తీతి** – మరణకాలంలో ఈ ప్రాణులు ప్రాణంలో లయమవుతాయి. ప్రాణం లయకారణం కూడా. అందువల్లనే ఒక వ్యక్తి మరణించినప్పుడు, అప్పుడు పఠించే అంత్యేష్ఠి మంత్రాలలో అతని వ్యష్టిప్రాణాలు సమష్టిప్రాణంలో కలవాలని, అలా కలిస్తే అతని ప్రయాణం సుగమంగా సాగుతుందని అర్థం వస్తుంది.

ఆ విధంగా భృగువు ప్రాణమే బ్రహ్మ అని నిర్ణయించుకున్నాడు. తన విచారణకు మురిసిపోయాడు కూడా. కానీ, లోతుగా మళ్ళీ ఆలోచిస్తే, తన విచారణలో చిన్న లోపం

కనబడింది. ప్రాణం కూడా మూలకారణం కాదు, ఆపేక్షిక కారణం అని అర్థం చేసుకున్నాడు. దీనికి కూడా శ్రుతి, యుక్తి ప్రమాణాలు ఉన్నాయి.

**శ్రుతి ప్రమాణం** – ప్రాణం బ్రహ్మనుంచి పుట్టింది.

**ఏతస్మాజ్జాయతే ప్రాణః** – ముండకమ్ 2.1.3

ఈ బ్రహ్మనుంచి ప్రాణం పుట్టింది.

**యుక్తి ప్రమాణం** – తర్కం ప్రకారం ఏదైతే మారుతుందో, అది కార్యం అవుతుంది. యత్ యత్ సవికారం, తత్ తత్ కార్యమ్

ప్రాణః కార్యమ్ సవికారత్వాత్ అన్నవత్

ప్రాణం కూడా సవికారం కాబట్టి, అన్నంలాగా అది కూడా కార్యమే. అందువల్ల అది మూలకారణం కాదని భృగువు నిర్ణయించుకున్నాడు. నిరాశ చెందిన భృగువు మళ్ళీ తండ్రి దగ్గరకు వెళ్ళాడు.

**తద్విజ్ఞాయ పునరేవ వరుణం పితరముపససార** – ఈ విషయాన్ని తెలుసుకుని, మళ్ళీ తండ్రిని సమీపించి, మళ్ళీ అడిగాడు.

**అధీహి భగవో బ్రహ్మేతి** – ఓ భగవాన్! నాకు బ్రహ్మ గురించి బోధించు అన్నాడు.

**తగ్ం హోవాచ** – తండ్రి ఈ విధంగా అన్నాడు.

**తపసా బ్రహ్మ విజిజ్ఞాసస్వ** – తపస్సుతో బ్రహ్మను తెలుసుకో అన్నాడు.

**తపో బ్రహ్మేతి** – తపస్సే బ్రహ్మ అని చెప్పాడు.

**స తపోఽ తప్యత । స తపస్తప్త్వా** – భృగువు మళ్ళీ తపస్సు చేశాడు, మళ్ళీ తపస్సు చేశాక (ఈ విధంగా నిర్ణయించుకున్నాడు).

## అనువాకం – 4

**మనో బ్రహ్మేతి వ్యజానాత్। మనసో హ్యేవ ఖల్విమాని భూతాని జాయన్తే। మనసా జాతాని జీవన్తి। మనః ప్రయన్త్యభిసంవిశన్తీతి। తద్విజ్ఞాయ। పునరేవ వరుణం పితరముపససార। అధీహి భగవో బ్రహ్మేతి। తగ్ం హోవాచ। తపసా బ్రహ్మ విజిజ్ఞాసస్వ। తపో బ్రహ్మేతి। స తపోఽ తప్యత। స తపస్తప్త్వా॥**

సి) **మనసే బ్రహ్మ** – ఇప్పుడు భృగువు మూడవకోశం అయిన మనోమయకోశంలోకి అడుగు పెడుతున్నాడు. మనోమయకోశం యొక్క సృష్టి స్థితి లయ కారణాలేమిటో అన్వేషించాడు. సమష్టి మనస్సే వ్యష్టి మనోమయకోశాలన్నింటికీ కారణం అని అర్థం చేసుకున్నాడు.

రెండవ అధ్యాయంలో – మయ వచ్చి కలిస్తే అది కార్యమనీ; మయ లేకపోతే కారణమనీ చూశాము. ఆ విధంగా మనోమయం (వ్యష్టి) కార్యం అయింది; మనః (సమష్టి) కారణం అయింది. మళ్ళీ ప్రాణానికి చూసిన మాటలన్నీ వస్తాయి.

మనసే బ్రహ్మ అని భృగువు తెలుసుకున్నాడు. మనస్సు సృష్టికారణం, స్థితికారణం, లయకారణం కూడా అని తెలుసుకున్నాడు. తన విచారణకు మురిసిపోయాడు కూడా.

శాస్త్రం ప్రకారం మనస్సు సూక్ష్మమైన ద్రవ్యంశం. మనస్సును ఆలోచనల ప్రవాహంగా కొంతమంది నిర్వచిస్తారు కాని, శాస్త్రం ఆ నిర్వచనాన్ని అంగీకరించదు. దృగ్దృశ్య వివేకంలో మనస్సుకు రెండు అంశాలు ఉన్నాయని చూస్తాము. అది ద్రవ్యంశం, వృత్త్యంశం. మనస్సును కొలనుతో పోల్చవచ్చు. ప్రశాంతంగా ఉన్న కొలను అడుగుభాగం ద్రవ్యంశం; పైన లేచే అలలు వృత్త్యంశం అని చెప్పవచ్చు. పైన అలలు లేచినా, లేవకపోయినా కొలను అలాగే ఉంటుంది.

ఇదే సూత్రాన్ని మనస్సుకు అన్వయించవచ్చు. వృత్త్యంశంనుంచి అనేక వృత్తులు (ఆలోచనలు) లేస్తాయి. ఆ వృత్తులు సుషుప్తిలో ఉండవు. ఒకవేళ కొంతమంది నిర్వచించినట్టుగా మనస్సు ఆలోచనల ప్రవాహమే అయితే, ఆలోచనలు ముగింపుకు వస్తే, మనస్సు కూడా ముగింపుకు రావాలి. కాని అలా జరగటం లేదే! సుషుప్తిలో ఆలోచనలు ఆగిపోతాయి, కాని మనస్సు యొక్క ద్రవ్యంశం కొనసాగుతుంది. అలా ఆ ద్రవ్యంశం కొనసాగకపోతే, మనం గాఢనిద్రనుంచి లేవలేము. కాని నిద్ర లేవగానే, మన మనస్సు కూడా లేస్తోంది అంటేనే, మనస్సు అంటే ఆలోచన కాదు అని చెప్పకనే చెప్పినట్టవుతుంది. ఆలోచన మనస్సు యొక్క పని. ఆలోచనలు పనిచేసినా, చేయకపోయినా, సూక్ష్మమైన మనస్సు అలాగే కొనసాగుతుంది. సమష్టి మనస్సును బ్రహ్మ అనుకున్నాడు భృగువు.

కాని లోతుగా మళ్ళీ ఆలోచిస్తే, తన విచారణలో చిన్నలోపం కనబడింది. మనస్సు కూడా మూలకారణం కాదు, ఆపేక్షిక కారణమే అని అర్థం చేసుకున్నాడు. దీనికి కూడా శ్రుతి, యుక్తి ప్రమాణాలు ఉన్నాయి.

**శ్రుతి ప్రమాణం** – మనస్సు కూడా బ్రహ్మనుంచి పుట్టింది.

**ఏతస్మాజ్జాయతే ప్రాణః మనః సర్వేంద్రియాణి చ** – ముండకమ్ 2.1.3

ఈ బ్రహ్మనుంచి ప్రాణం, మనస్సు, అన్ని ఇంద్రియాలు పుట్టాయి.

**ఓం బ్రహ్మాదేవానాం ప్రథమః సంబభూవ** – ముండకమ్ 1.1.1

బ్రహ్మదేవుడు (హిరణ్యగర్భ) దేవతలందరికన్నా ముందు పుట్టాడు. అందువల్ల సమష్టి మనస్సు (హిరణ్యగర్భ) కార్యం.

**యుక్తి ప్రమాణం** – మనస్సు కార్యం ఎందుకంటే, మనస్సు అనేక వికారాలకు లోనవుతుంది. కాని బ్రహ్మ నిర్వికారం. అందువల్ల మనస్సు బ్రహ్మ కాదు.

ఇంక తక్కినదంతా అలాగే వస్తుంది. మళ్ళీ భృగువు తండ్రి దగ్గరకు వెళ్ళాడు. బ్రహ్మ గురించి చెప్పమన్నాడు. నువ్వు తపస్సు చేసి తెలుసుకో అన్నాడు తండ్రి.

**అనువాకం – 5**

**విజ్ఞానం బ్రహ్మేతి వ్యజానాత్। విజ్ఞానాద్ధ్యేవ ఖల్విమాని భూతాని జాయన్తే। విజ్ఞానేన జాతాని జీవన్తి। విజ్ఞానం ప్రయన్త్యభిసంవిశన్తీతి। తద్విజ్ఞాయ। పునరేవ వరుణం పితరముపససార। అధీహి భగవో బ్రహ్మేతి। తగ్ం హోవాచ। తపసా బ్రహ్మ విజిజ్ఞాసస్వ। తపో బ్రహ్మేతి। స తపోఽతప్యత। స తపస్తప్త్వా॥**

డి) **విజ్ఞానమే బ్రహ్మ** – ఇప్పుడు భృగువు నాలుగవ కారణం అయిన విజ్ఞానమయకోశంలోకి అడుగు పెడుతున్నాడు. తక్కిన వివరాలన్నీ అలాగే వస్తాయి. సమష్టి విజ్ఞానమే విజ్ఞానమయ కోశాలన్నింటికీ సృష్టి స్థితి లయకారణం అనుకున్నాడు. అందువల్ల విజ్ఞానమే బ్రహ్మ అని అనుకున్నాడు.

విజ్ఞానం కూడా పదార్థమే, కాకపోతే అది మనస్సు కన్నా సూక్ష్మంగా ఉంటుంది. సూక్ష్మంలోని తారతమ్యాలు ఈ విధంగా అర్థం చేసుకోవచ్చు. జీవితంలో ఏంచేసినా ఈ మూడుదశల్లో చేస్తాము. జ్ఞానశక్తి → ఇచ్ఛాశక్తి → క్రియాశక్తి.

**జ్ఞానశక్తి** – ప్రపంచంలో ఏ విషయవస్తువునైనా అనుభవించాలంటే, ముందు వస్తువు గురించిన జ్ఞానం ఉండాలి. వస్తువే తెలియకపోతే, దాని అనుభవం ప్రసక్తి ఎలా వస్తుంది?

**ఇచ్ఛాశక్తి** – జ్ఞానశక్తి, ఇచ్ఛాశక్తికి దారితీస్తుంది. ఒక వస్తువు గురించి తెలిస్తే, ఆ వస్తువు మీద కోరిక పుడుతుంది. వస్తువే తెలియకపోతే, దానిమీద కోరిక ప్రసక్తి ఎలా వస్తుంది? కొన్ని సంవత్సరాల క్రితం పిల్లలు వీడియోగేమ్స్ కావాలని అడిగివుండరు. ఎందుకంటే అప్పుడు ఆ గేమ్సే లేవు. ఆ విధంగా, జ్ఞానశక్తి వల్ల ఇచ్ఛాశక్తి ఏర్పడుతుంది. అంటే జ్ఞానం కారణం, ఇచ్ఛ కార్యం. కారణం, కార్యంకన్నా సూక్ష్మంగా ఉంటుంది కాబట్టి జ్ఞానం, ఇచ్ఛకన్నా సూక్ష్మంగా ఉంటుంది.

**క్రియాశక్తి** – ఇచ్ఛాశక్తి, క్రియాశక్తిని ప్రేరేపిస్తుంది. ఒక వస్తువును అనుభవించాలనే కోరిక, ఆ వస్తువును అనుభవించే క్రియను ప్రేరేపిస్తుంది. ఆ విధంగా ఇచ్ఛాశక్తి కారణం, క్రియాశక్తి కార్యం అవుతాయి. క్రియాశక్తిని ప్రాణం సూచిస్తుంది. ప్రాణం సమష్టి రజోగుణంనుంచి వచ్చింది. ఇచ్ఛాశక్తి కారణం, క్రియాశక్తి కార్యం అవుతాయి. ఇప్పుడు ఈ మూడు శక్తులను మళ్ళీ చూస్తే, అవి జ్ఞానశక్తి → ఇచ్ఛాశక్తి → క్రియాశక్తి. ఇదే వరుసక్రమంలో ఈ కోశాలు వస్తాయి.

**విజ్ఞానమయం → మనోమయం → ప్రాణమయం**

సమష్టి విజ్ఞానమయాన్ని హిరణ్యగర్భ అనికూడా అంటారు. హిరణ్యం అంటే బంగారం. బంగారం ఎన్నడూ ఎలా ప్రకాశాన్ని కోల్పోదో, అలా జ్ఞానం ఎన్నడూ తన ప్రకాశాన్ని కోల్పోదు. ఆ విధంగా జ్ఞానాన్ని ప్రకాశంతో పోలుస్తారు. హిరణ్యం అంటే సర్వజ్ఞానం; గర్భ అంటే లోపల. అందువల్ల హిరణ్యగర్భ అంటే సర్వజ్ఞానాన్ని లోపల ఇముడ్చుకున్నాడు అని వస్తుంది.

**హిరణ్యం సర్వజ్ఞత్వం గర్భే అంతః యస్య సః హిరణ్యగర్భః**

అందువల్ల సమష్టి విజ్ఞానమే హిరణ్యగర్భ. అందువల్ల విజ్ఞానమే బ్రహ్మ అనుకున్నాడు భృగువు. కాని తర్వాత కథంతా షరా మామూలే.

విజ్ఞానం కూడా కార్యమే, కారణం కాదు అని తెలుసుకున్నాడు. కఠోపనిషత్ సమష్టి విజ్ఞానాన్ని మహతః అంటుంది.

**మహతోఽ వ్యక్తముత్తమమ్** – కఠ 2.3.7

మహత్‌కన్నా సమష్టి కారణశరీరం ఇంకా శ్రేష్ఠం, ఇంకా సూక్ష్మం అంటుంది. అంటే ఇది కూడా కారణం. కార్యం, మూలకారణం కాలేదు. మళ్ళీ శ్రుతి, యుక్తి ప్రమాణాల ద్వారా విజ్ఞానం బ్రహ్మ కాదని తెలుసుకున్నాడు. మళ్ళీ తండ్రి దగ్గరికి వెళ్ళాడు; తండ్రి మళ్ళీ అదే విధంగా తపస్సు చేయమన్నాడు. ఇప్పటిదాకా నాలుగు కోశాలను విజయవంతంగా దాటాడు భృగువు.

### అనువాకం – 6

**ఆనందో బ్రహ్మేతి వ్యజానాత్। ఆనందాద్ధ్యేవ ఖల్విమాని భూతాని జాయన్తే। ఆనందేన జాతాని జీవన్తి। ఆనందం ప్రయన్త్యభిసంవిశన్తీతి। సైషా భార్గవీ వారుణీ విద్యా। పరమే వ్యోమన్ ప్రతిష్ఠితా। స య ఏవం వేద ప్రతితిష్ఠతి। అన్నవానన్నాదో భవతి। మహాన్ భవతి ప్రజయా పశు భిర్బ్రహ్మవర్చసేన। మహాన్ కీర్త్యా॥**

ఇ) **ఆనందమే బ్రహ్మ** – ఇక్కడ భృగువు ఐదవకోశం అయిన ఆనందమయకోశంలోకి అడుగు పెట్టలేదు. దాన్ని దాటి ముందుకు వచ్చేశాడు. ఆనందమే బ్రహ్మ అన్నాడు.

**ఆనందో బ్రహ్మేతి వ్యజానాత్** – అందువల్ల ఇక్కడ భృగువు ఆనందం అంటే ఆనందమయ కోశం కాదు. ఆనందమయకోశాన్ని మిగతా వాటిని విశ్లేషించినట్టుగా విశ్లేషించలేదు.

**తస్య ప్రియమేవ శిరః। మోదో దక్షిణః పక్షః ప్రమోద ఉత్తరః పక్షః।**
**ఆనంద ఆత్మా। బ్రహ్మ పుచ్ఛం ప్రతిష్ఠా॥** – బ్రహ్మానందవల్లీ 5

బ్రహ్మానందవల్లీలో ఆనంద ఆత్మా అని వచ్చింది. ఇక్కడ ఈ అనువాకంలో ఆనందో బ్రహ్మేతి వ్యజానాత్ అని వచ్చింది. ఆనందం=ఆత్మ; ఆనందం=బ్రహ్మ అనే ఈ రెండు వాక్యాలను కలిపితే, మనకు వచ్చే మూడవ వాక్యం ఆత్మ=బ్రహ్మ.

అంటే ఆత్మ, బ్రహ్మ, ఆనందం మూడూ పర్యాయపదాలు. ఆత్మ లేదా బ్రహ్మ జగత్కారణం బ్రహ్మ అని చూశాము కాబట్టి, ఇక్కడ ఆనందం అంటే అనుభవంలోకి వచ్చే ఆనందం కాదు; ఆనందం అంటే జగత్ కారణబ్రహ్మ.

ఆ విధంగా తండ్రి ఇచ్చిన సమస్యాపూరణానికి భృగువుకు సమాధానం దొరికింది. తండ్రి ఏమన్నాడు?

**యతో వా ఇమాని భూతాని జాయన్తే। యేన జాతాని జీవన్తి।**
**యత్ప్రయన్త్యభిసంవిశన్తి। తద్విజిజ్ఞాసస్వ। తద్బ్రహ్మేతి।**

ఒక $\times$ ని ఇచ్చాడు తండ్రి. దేనినుంచైతే ఈ జీవులన్నీ పుడుతున్నాయో, పుట్టాక దేనిచేత జీవిస్తున్నాయో, దేనిలో లయమవుతున్నాయో అది బ్రహ్మ. దానిని తెలుసుకో అన్నాడు.

భృగువు ఆ $\times$ ని తీసి ఆనందం పదం వేశాడు. అవే మాటలు వేశాడు.

**ఆనన్దో బ్రహ్మేతి వ్యజానాత్। ఆనన్దాద్ధ్యేవ ఖల్విమాని భూతాని జాయన్తే। ఆనన్దాద్ధ్యేవ భూతాని జీవన్తి। ఆనన్దం ప్రయన్త్యభిసంవిశన్తీతి।**

ఆనందం నుంచే ఈ జీవులన్నీ పుడుతున్నాయి; పుట్టాక ఆనందం చేత జీవిస్తున్నాయి; ఆనందంలో లయమవుతున్నాయి. ఆనందమే బ్రహ్మ. ఖలు – అంటే నిశ్చయంగా. ఇక భృగువుకు ఈ విషయంలో సందేహం లేదు. అందువల్ల ఇంక తండ్రి దగ్గరకు తిరిగి వెళ్ళలేదు. మనం గమనించాల్సిన ఇంకొక అంశం తండ్రి తటస్థలక్షణం ఇచ్చి బ్రహ్మ ఎవరో శోధించి తెలుసుకోమన్నాడు. భృగువు స్వరూపలక్షణం తెలుసుకున్నాడు. బ్రహ్మ స్వరూపలక్షణం **సత్యం జ్ఞానమనంతం బ్రహ్మ** అని బ్రహ్మానందవల్లీలో చూశాము.

ఆనందం అంటే అనంతం అని అర్థం చేసుకోవాలి. మామూలుగా ఆనందం అంటే సంతోషం, ఆనందం అంటాము. కాని అవి ఆనందంలోని తారతమ్యాలను సూచిస్తాయి. ప్రియ, మోద, ప్రమోదాలను ఆనందం యొక్క తారతమ్యాలను చూశాము. ఆ ఆనందాలు అనుభవంలోకి వస్తాయి. అనుభవంలోకి వచ్చేది ఏదైనా సరే, అది పరిమితి ఉన్నది అవుతుంది, అశాశ్వతం అవుతుంది, కార్యం అవుతుంది. కార్యం ఎన్నడూ కారణం కాలేదని చూశాము. అందువల్ల ఇక్కడ ఆనందం అంటే అనంతం, అనంత చైతన్యం. దీన్ని సమాధి స్థితిలో పొందే ఆనందంగా కూడా భావించకూడదు. ఎందుకంటే అది కూడా శాశ్వతంగా నిలవదు.

ఆనందం = పూర్ణత్వం = సత్ తత్త్వం = చిత్ తత్త్వం = అనంతత్త్వమ్. అన్నీ కలిపి సత్యం జ్ఞానం అనంతం బ్రహ్మ.

చైతన్యానికి ఐదు అంశాలు చూస్తాము ఎప్పుడూ. ఆ ఐదు అంశాలనే చైతన్యం పదం తీసి, ఉనికికి వాడాలి; ఆ ఐదు అంశాలనే ఉనికి పదం తీసి, ఆనందానికి వాడాలి. ఇప్పుడు ఆ ఐదు అంశాలను ఆనందం పరంగా చూద్దాము. అవి,

1. ఆనందం, శరీరంలో ఒక భాగం కాని, లక్షణం కాని, దాన్నుంచి ఉత్పత్తి అయిన వస్తువు కాని కాదు.
2. ఆనందం, స్వతంత్ర వస్తువు. అది శరీరం అంతటా వ్యాపించి, శరీరాన్ని, ముఖ్యంగా మనస్సును ప్రకాశింపచేస్తుంది.
3. ఆనందం, శరీరం సరిహద్దులకే పరిమితమవలేదు.
4. ఆనందం, శరీరం నాశనమయితే నాశనమవదు. శరీర పతనానంతరం కూడా ఆనందం ఉంటుంది?
5. ఆనందం, శరీరం లేకపోయినా ఉంటుంది కాని తెలియదు. ఆనందాన్ని ప్రతిబింబింప చేసే మాధ్యమం లేదు కాబట్టి ఆనందం తెలియదు. అంతమాత్రాన ఆనందం లేనట్టు కాదు.

ఈ విధంగా ఆనందమే బ్రహ్మ అని తెలుసుకున్నాడు. ఇక్కడ ఇంక సందేహం కలుగలేదు భృగువుకు. మళ్ళీ ఆలోచించినా కూడా అన్నం, ప్రాణం, మనస్సు, విజ్ఞానంలాగా ఆనందం ఆపేక్షిక కారణం కాదు, మూలకారణం అని తెలుసుకున్నాడు. అంతేకాదు, ఇంతకుముందు శ్రుతి, యుక్తి ప్రమాణాల ద్వారా ముందువి మూలకారణం కాదని ఎలా తెలుసుకున్నాడో, అలా ఇప్పుడు కూడా శ్రుతి, యుక్తి ప్రమాణాలు ఉపయోగించి, వాటి ద్వారా ఆనందమే మూలకారణం అని నిశ్చయంగా తెలుసుకున్నాడు.

**శ్రుతి ప్రమాణం** – శ్రుతి ఆనందం మూలకారణం అని చెబుతున్నది.

**తస్మాద్వా ఏతస్మాదాత్మన ఆకాశస్సంభూతః**

ఈ వాక్యం ద్వారా ఆకాశం కూడా ఆత్మనుంచి పుట్టింది కాని, ఆత్మ దేన్నించీ పుట్టలేదని అర్థమవుతున్నది.

**యుక్తి ప్రమాణం** – యుక్తి ప్రమాణం ద్వారా కూడా ఆత్మకు వికారాలు లేవని చెప్పవచ్చు. విజ్ఞానం, మనస్సులకు వికారాలు ఉన్నాయి కాని, ఆత్మకు వికారాలు లేవు. ఎందుకంటే విజ్ఞానం, మనస్సులు పుడతాయి కాని ఆత్మకు ఎన్నడూ పుట్టుక లేదు. వికారాలను సాక్షిగా చూస్తుంది కాని ఆత్మ మారదు.

**న జాయతే మ్రియతే వా కదాచిత్ నాయం భూత్వా భవితా వా న భూయః** – గీత 2.20

ఆత్మకు చావు పుట్టుకలు లేవు.

అందువల్ల ఆత్మే మూలకారణం. బ్రహ్మ = ఆత్మ అని చూశాము. ఆత్మ అంటే నేను. అందువల్ల ఆనందో బ్రహ్మేతి వ్యజానాత్ అంటే అహం బ్రహ్మాస్మి వ్యజానాత్ అని అర్థం. భృగువు ప్రయాణం ముగిసింది. శిష్యునికి అర్థమయితే, గురువుకూ పనిలేదు. ఆ విధంగా గురుశిష్యుల సంభాషణ ఇక్కడితో ముగిసింది. అందువల్ల, ఉపనిషత్తు అందుకుని, ఈ సంవాదాన్ని ముగిస్తున్నది.

**సైషా భార్గవీ వారుణీ విద్యా। పరమే వ్యోమన్ ప్రతిష్ఠితా। స య ఏవం వేద ప్రతితిష్ఠతి।**

**సైషా భార్గవీ వారుణీ విద్యా** – ఆత్మ=నేను; ఆత్మ=బ్రహ్మ; బ్రహ్మ=జగత్కారణం అయితే నేను=జగత్కారణం అవుతాను.

> **మయ్యేవ సకలం జాతం । మయి సర్వం ప్రతిష్ఠితమ్**
> **మయి సర్వం లయం యాతి । తద్బ్రహ్మాద్వయ మస్మ్యహమ్** – కైవల్యమ్ 19

నానుంచే అన్నీ పుట్టాయి, నేనే స్థితికారణం; నాలోనే అన్నీ లయం అవుతాయి. నేను ఆ అద్వయం బ్రహ్మను.

కాకపోతే నేను సృష్టికారణం అన్నప్పుడు, ఆ నేను ఎవరో మర్చిపోకూడదు. నేను పంచకోశాలకు చెందినవాడిని కాను; నేను పంచకోశాలకు అతీతుడను.

> **పంచకోశ విలక్షణ సాక్షి చైతన్యమ్ అహమస్మి**

ఈ జ్ఞానాన్ని అంతకుముందు బ్రహ్మవిద్య అంటే, ఇక్కడ రెండు కొత్త పేర్లు ఇస్తున్నది ఉపనిషత్తు.

**భార్గవీ విద్యా** – భృగువు పొందిన విద్య కాబట్టి భార్గవీ విద్యా అంటున్నది ఉపనిషత్తు.

> **భృగుణా ప్రాప్త ఇతి భార్గవీ**

**వారుణీ విద్యా** – వారుణీ విద్యా అంటే వరుణుడనే గురువు బోధించిన విద్య.

> **వరుణేన ప్రోక్తా వారుణీ**

**పరమే వ్యోమన్ ప్రతిష్ఠితా** – ఈ జ్ఞానం అన్నమయకోశంతో ప్రారంభమై, సాక్షిచైతన్య ఆత్మతో ముగుస్తుంది. ప్రతిష్ఠితా అంటే ముగుస్తుంది. సాక్షిచైతన్యం ఎక్కడ ఉంది?

పరమే వ్యోమన్ – హృదయాకాశంలో ఉంది. ఉపనిషత్తు ఈ జ్ఞానాన్ని భృగువు మాత్రమే పొందలేదు. ఎవరైతే ఈ పంచకోశవివేకం చేస్తారో (ఈ తపస్సు చేస్తారో), వారికి కూడా ఈ జ్ఞానం కలుగుతుంది అంటున్నది.

**య ఏవం వేద** – ఎవరైతే ఈ ఆంతర్గత ప్రయాణం చేస్తారో,

**ప్రతితిష్ఠతి** – అతను జీవితంలో బాగా స్థిరపడతాడు. మనం లౌకికవిజయాల ద్వారా జీవితంలో స్థిరపడాలని పరుగులు తీస్తూ ఉంటాము. చదువు, ఉద్యోగం, పెళ్ళి, పిల్లలు అంటూ ఒకదాని వెంట ఒకదానికోసం జీవితాంతం అర్రులు చాస్తూనే ఉంటాము. కాని ఉపనిషత్తు జీవితంలో స్థిరబడటానికి ఒక్కటే మార్గం ఉంది – అది జ్ఞానం ద్వారానే సాధ్యం అంటుంది. అంటే దీని అర్థం జీవితంలో స్థిరపడాలనే తపననుంచి విముక్తి పొంది, నిశ్చింతగా, సుఖంగా ఉంటారు.

అసలు ఆధ్యాత్మిక జీవనం గడిపితే, ఆధ్యాత్మిక విజయం మాత్రమే కాదు, లౌకిక విజయాలు కూడా కలుగుతాయి. కాని, చాలామందికి ఈ విషయం అర్థం కాదు. అందువల్ల ఉపనిషత్తు లౌకికవిజయాలు కూడా వస్తాయి సుమా అని ఊరిస్తున్నది. ఇది భగవద్గీతను వ్యక్తిత్వ వికాసానికి వాడినట్టు ఉంటుంది. కృష్ణపరమాత్మ బోధించిన ఉద్దేశ్యం వేరు, దాన్ని వాడుతున్న ఉద్దేశ్యం వేరు. అష్టాంగయోగం విషయంలో కూడా అంతే. దాన్ని చెప్పిన కారణం వేరు, దాన్ని వాడుతున్న కారణం వేరు. బి.పీ. తగ్గించుకోవటానికి అద్భుత సాధన అంటారు కొందరు.

**అన్నవానన్నాదో భవతి। మహాన్ భవతి ప్రజయా పశుభిర్బ్రహ్మవర్చసేన। మహాన్ కీర్త్యా॥**

**అన్నవాన్ అన్నాదో భవతి** – మనిషికి కావాల్సిన ప్రాథమిక ఫలం కలుగుతుంది అంటున్నది ఉపనిషత్తు. అతను అధికమైన అన్నాన్ని (ఆహారాన్ని) పొందుతాడు. సమృద్ధిగా అన్నం ఉండి, దానికి జతగా ఆరోగ్యం లేకపోతే ఏమిటి లాభం? అందువల్ల ఈ జ్ఞానం సమృద్ధిగా దొరికిన ఈ ఆహారాన్ని తృప్తిగా అనుభవించే శారీరక, మానసిక ఆరోగ్యం కూడా ఈ సాధకునికి ఉంటుంది అంటున్నది ఉపనిషత్తు.

**మహాన్ భవతి** – అనేక రకాలుగా మహాత్ముడు అవుతాడు.

**ప్రజయా** – మంచి పిల్లలు పుడతారు. సన్న్యాసి విషయం తీసుకుంటే మంచి శిష్యులు ఉంటారు. శిష్యులు కూడా పిల్లలతో సమానం. ఎందుకంటే,

**త్వమేవ మాతా చ పితా త్వమేవ**– నువ్వే తల్లివీ, తండ్రివీ అని కీర్తిస్తారు.

**పశుభిః** – శిష్యులు ఎక్కువగా ఉంటే, గురుకులం ఏర్పాటు చేయాలి. గురుకులం ఏర్పాటు చేస్తే, దాన్ని నిర్వహించటానికి అనేక నిధులు కావాలి. పశువులు అంటే మామూలుగా ఆవులు. ఆ రోజుల్లో వాటిని సంపదగా చూసేవారు. అంతేకాక, సంపదగా తీసుకోవచ్చు.

**బ్రహ్మవర్చసేన** – బ్రహ్మవర్చస్సు పొందుతాడు. జ్ఞానంవల్ల అతని మొహం దేదీప్యమైన కాంతితో ప్రకాశిస్తూ ఉంటుంది. అంతేకాదు, తన పూర్ణత్వాన్ని కనుగొంటాడు కాబట్టి,

ఆనందస్వరూపునిగా, ఎప్పుడూ నిశ్చింతగా ఉంటాడు. అందువల్ల అతని మొహం ఆకర్షణీయంగా ఉండి, తేజస్సు ఉట్టిపడుతూ ఉంటుంది.

**మహాన్ కీర్త్యా** – గొప్ప కీర్తిమంతుడవుతాడు. గొప్ప గురువును వెతుక్కుంటూ శిష్యులు దేశం నలుమూలలనుంచీ వస్తారు. ఈ గురువుకు కూడా, అతని కీర్తిప్రతిష్ఠలు నలుదిశలా వ్యాపించి, శిష్యులు వెతుక్కుంటూ వస్తారు. ఇంతవరకూ లౌకికఫలం.

ప్రతితిష్ఠతి అని ముందు చూసిన ఫలం ఆధ్యాత్మికఫలం. అతను బ్రహ్మలో నెలకొని ఉంటాడు అని దాని అర్థం. ఇక్కడితో పంచకోశవివేకప్రక్రియ ముగిసింది. దాని సారాంశం చూద్దాము.

## పంచకోశ వివేకప్రక్రియ సారాంశం – అనువాకాలు 1-6

భృగువు తన తండ్రిని బ్రహ్మవిద్య బోధించమని అడిగితే, వరుణుడు బ్రహ్మ ఉపలబ్ధి స్థానం, బ్రహ్మ లక్షణం చెప్పి, విచారణ చేసి తెలుసుకో అన్నాడు. బ్రహ్మ ఉపలబ్ధిస్థానం తెలుసుకోవటానికి పంచకోశ వివేకం చేయాలి. అలాగే భృగువు ఒక్కొక్క కోశాన్ని పరిశీలించుకుంటూ వచ్చాడు. ఈ పంచకోశ వివేకాన్ని రెండవ అధ్యాయంలో వివరంగా చూశాము. అందుకని ఇక్కడ అంత లోతుగా సాగదు ప్రయాణం.

వరుణుడు దేన్నించైతే ఈ సృష్టి స్థితి లయ జరిగిందో అది బ్రహ్మ అన్నాడు. భృగువు ఆనందంనుంచి ఈ సృష్టి, స్థితి, లయ జరిగిందనీ, ఆనందమే బ్రహ్మ అనీ తెలుసుకున్నాడు. ఈ ఆనందఆత్మ పంచకోశాలలో లేదు. పంచకోశ విలక్షణ ఆత్మ అని నేర్చుకున్నాడు.

**పంచకోశాతీతః సన్** – తత్త్వబోధ

పంచకోశాలకు అతీతంగా ఉంది ఆత్మ అని తత్త్వబోధలో వస్తుంది.

తండ్రి తపస్సు చేసి తెలుసుకో అన్నాడు. తపస్సు అంటే వేదపూర్వభాగంలో వచ్చే తపస్సు కాదు; తపస్సు అంటే ఏకాగ్రతతో చేసే విచారణ.

**మనశ్చ ఇంద్రియశ్చ ఐకాగ్రం పరమం తపః**

దీన్నిబట్టి ఆత్మజ్ఞానాన్ని విచారణ ద్వారా పొందాలని తెలుస్తున్నది.

భృగువు అంత గొప్ప మహర్షి అయినా, అధీహి భగవో బ్రహ్మేతి అని అడుగుతూ వచ్చాడు. దీన్నిబట్టి బ్రహ్మవిద్యను స్వంతంగా నేర్చుకోవటానికి ప్రయత్నించకూడదు; శాస్త్ర అధ్యయనం గురువు ద్వారానే చేయాలని అర్థమవుతున్నది. భృగువంతటి మహర్షికే గురువు కావాల్సివస్తే, మామూలు మనుష్యులం మనమెంత?

ఈ వల్లీలో వరుణుడు ఇచ్చిన నిర్వచనం తటస్థ లక్షణం. బ్రహ్మ సృష్టి స్థితి లయ కారణం అని నిర్వచించటానికి ఈ వల్లీనుంచి ఉటంకిస్తారు. నిజం చెప్పాలంటే ఈ నిర్వచనం ఉండబట్టే, ఈ వల్లీ అంత ప్రఖ్యాతి చెందింది.

అంతేకాదు, బ్రహ్మవిద్య పొందితే కలిగే ఫలాలను కూడా చూశాము. అవి ఆధ్యాత్మిక ఫలం, లౌకికఫలం. ఆధ్యాత్మికఫలం జీవన్ముక్తిని కలుగజేస్తుంది. అంటే అతను ఇక్కడే, ఇప్పుడే సంసారంనుంచి మోక్షం పొందుతాడు. లౌకికఫలంలో సమృద్ధిగా ఆహారం, పిల్లలు, ఐశ్వర్యం, బ్రహ్మవర్చస్సు, గొప్ప కీర్తి పొందుతాడు.

## 2. **బ్రహ్మజ్ఞాన సహకారీ సాధనాని – అనువాకాలు 7-10 (కొంతభాగం)**

### ఉపోద్ఘాతం

ఈ అనువాకాల్లో ఉపనిషత్తు కొన్ని ఉపాసనలను నిర్దేశిస్తున్నది. ఆ ఉపాసనలు చిత్త ఏకాగ్రతను కలుగజేసి, జ్ఞానయోగ్యతాప్రాప్తిని ఇస్తాయి. ఈ ఉపాసనలను ఇక్కడ వ్రతాలు అంది. ఎక్కువగా ఈ వ్రతాలు అన్నానికి సంబంధించినవై ఉంటాయి.

అన్నానికి ఎందుకంత ప్రాముఖ్యతను ఇచ్చింది?

వేదాంత విచారణలో ముందుగా స్థూలశరీరంతో విచారణ మొదలుపెడతాము. స్థూలశరీరం అంటే అన్నమయకోశం. మనం మొదట్లో అన్నమయకోశానికే ఎక్కువ విలువను ఇస్తాము. మన కాలాన్నీ, శక్తినీ ఈ అన్నమయకోశానికి ఎక్కువగా వినియోగిస్తాము. అందువల్ల ఈ వ్రతాల ద్వారా, అన్నానికి పెద్దపీట వేస్తాము. అన్నం, అన్నమయకోశానికి కారణం అని చూశాము. పంచకోశవివేకప్రక్రియ లేదా తపస్సు అనే ఆధ్యాత్మిక విచారణ అనే నిచ్చెనమీద, మనం మొదటిమెట్టుమీద ఉన్నాము. ఈ అనువాకాల్లో నాలుగు ఉపాసనలను చూస్తాము. అవి విరాట్ ఉపాసన, అధ్యాత్మిక ఉపాసన, అధిదైవిక ఉపాసన, ఆకాశ ఉపాసన.

**విరాట్ ఉపాసన** – తరువాత వచ్చే అనువాకాల్లో విరాట్ ఉపాసన వస్తుంది. ఈ ఉపాసనలో జగత్తును భగవంతుని శరీరంగా చూడటం నేర్చుకుంటాము. అలా జగత్తును భగవంతుని శరీరంగా చూడటంవల్ల, జగత్తును సమష్టిగా చూడగలుగుతాము.

ఇది వేదాంతంలో మాత్రమే దొరికే ప్రత్యేకమైన బోధ. సమష్టి స్థూలప్రపంచాన్ని విరాట్ అనీ, సమష్టి సూక్ష్మప్రపంచాన్ని హిరణ్యగర్భ అనీ, సమష్టి కారణప్రపంచాన్ని ఈశ్వరుడు అనీ అంటుంది శాస్త్రం. తక్కిన మతాలు, భగవంతుడు ఎక్కడో దూరంగా ఉన్నాడు అంటే మన వేదాంతం ఒక్కటే ఈశ్వరుడు జగత్తుకు దూరంగా లేదు, నిజానికి జగత్తు ఈశ్వరుని యొక్క ప్రకటిత నామరూపం అని బోధిస్తుంది.

జగత్తులో అనేక భిన్నవస్తువులు ఉంటే, ఒకదానికీ ఇంకొకదానికీ మధ్య దూరం ఉంటే, విశ్వం అంతా ఒకటే ఈశ్వరుడు అని ఎలా చెప్పగలరు? దీన్ని అర్థం చేసుకోవటానికి వ్యష్టిపరంగా చూస్తాము.

**అధ్యాత్మిక ఉపాసన** – వ్యష్టిపరంగా ఒక వ్యక్తికి అనేక అంగాలు ఉంటాయి. కాని మనం ఆ భిన్న అంగాలను భిన్నంగా చూడము. ఒక్క శరీరంగా చూస్తాము. ఎందుకంటే అన్ని అంగాలకూ ఒకదానితో ఇంకొకదానికి సంబంధం ఉండటమే కాక, ఒకదానిమీద ఒకటి ఆధారపడి ఉంటాయి కూడా. ఒక్క అంగం దెబ్బతిన్నా కూడా, దాని ప్రభావం తక్కిన అంగాలమీద పడుతుంది. ఉదాహరణకు డయాబెటిస్ వస్తే అది ముందు పాంక్రియాస్‌ని దెబ్బతీస్తుంది కాని, నెమ్మదిగా కాలక్రమేణా ఒక్కొక్క అంగాన్నీ దెబ్బతీస్తూ వస్తుంది. దాని ప్రభావం కంటిమీద, గుండెమీద, మెదడుమీద, పాదాలమీద కనబడుతూ ఉంటుంది. ఇలా ఒకదానితో ఇంకొకదానికి సంబంధం ఉందని మనకు కంటికి కనబడదు.

**అధిదైవిక ఉపాసన** – అదే విధంగా మొత్తం విశ్వం ఒకటే సమష్టి శరీరం; విశ్వంలోని ప్రతి ఒక్క అంగానికి ఇంకొక అంగంతో సంబంధం ఉంది. అందువల్లనే మనం వాతావరణ పరిరక్షణ గురించి, పర్యావరణ సమతుల్యత గురించి రక్షణ తీసుకోవాల్సి ఉంటుంది. అడవులను నాశనం చేయటంవల్ల వానలు తగ్గటం, కరువు కాటకాలు ఏర్పడటం, జన బాహుళ్యం ఇంకెక్కడో అవస్థపడటం జరుగుతూ ఉంటుంది.

నిజానికి మనం సృష్టి గురించి ఎంత జాగ్రత్తగా, ఎంత లోతుగా పరిశీలిస్తే, అంత దగ్గరగా మనుష్యులు, జంతువులు, వృక్షసంపద, ప్రకృతి, సూర్యుడు అన్నీ ఒకదానితో ఇంకొకటి ఎంత దగ్గరగా పెనవేసుకుని ఉన్నాయో అర్థమవుతుంది. దీన్ని బటర్‌ఫ్లై ఎఫెక్ట్ అంటారు. ఒక సీతాకోకచిలుక తన రెక్కలను అల్లల్లాడించటంవల్ల కలిగిన చిరు కంపనం ఎక్కడో దూరంగా ఉన్న నక్షత్రమండలాన్ని ప్రభావితం చేయగలదు. అందుకే అంటారు, 'ఒక నక్షత్రానికి ఇబ్బంది కలుగకుండా, ఒక పువ్వును కోయలేరు.'

అలా ఈ జగత్తు అంతా ఒకదానికొకటి ఆశ్రితాలై ఉన్నాయి. ఈ జగత్తు అంతా ఈశ్వరుని శరీరం. ఈ పరస్పర సంబంధాన్ని మూడు జతల వస్తువులను తీసుకుని, రెండు రకాల సంబంధాలతో వివరించుకు వస్తున్నది ఉపనిషత్తు.

**అన్న-అన్నాద సంబంధం** – అన్నం అంటే తినబడేది; అన్నాదం అంటే తినేది. అంటే వాడబడేది, వాడేది. మనం జీవించి ఉండగా, మనం చెట్లనుంచి ఆహారం తిని జీవిస్తాము. అప్పుడు జగత్తు అన్నం, మనం అన్నాదం అయ్యాము. కాని మనం మరణించాక, ఈ సంబంధం తారుమారు అవుతుంది. జగత్తుకు మన శరీరం అన్నం అవుతుంది. అంటే మనం అన్నం, జగత్తు అన్నాదం అవుతుంది.

**ప్రతిష్ఠా–ప్రతిష్ఠిత సంబంధం** – పరస్పర ఆధార–ఆధేయ సంబంధం. ప్రతిష్ఠ అంటే ఆధారం; ప్రతిష్ఠితం అంటే ఆధారపడేది లేదా ఆధేయం. ఇవి కూడా తారుమారు అవుతూ ఉంటాయి. ఉదాహరణకు మనం పిల్లలుగా ఉన్నప్పుడు మన తల్లిదండ్రులమీద మన ఆహారంకోసం, వసతికోసం, అవసరాలకోసం ఆధారపడతాము. అంటే ఆ దశలో తల్లిదండ్రులు ప్రతిష్ఠ, పిల్లలమైన మనం ప్రతిష్ఠితం. కాని వయస్సుమీద పడేసరికి, వృద్ధాప్యం వచ్చేసరికి, మనకు ఆధారంగా ఇన్నాళ్ళూ ఉన్న తల్లిదండ్రులు ఇప్పుడు మనమీద ఆధారపడతారు. మనం వారి కనీస అవసరాలను, వారి బాగోగులను చూస్తాము. అంటే ఇప్పుడు మనం ప్రతిష్ఠ, మన తల్లిదండ్రులు ప్రతిష్ఠితం అయ్యారు.

గురుకులవాసం కూడా ఉదాహరణగా తీసుకోవచ్చు. గురుకులంలో విద్య నేర్చుకునే బ్రహ్మచారికి అవసరమైనవన్నీ గురువే సమకూరుస్తాడు. ఒక్క రూపాయి కూడా అతనినుంచి తీసుకోడు. ఆ దశలో గురువు ప్రతిష్ఠ, శిష్యుడు ప్రతిష్ఠితం అవుతారు. కాని శిష్యుడు విద్య నేర్చుకుని, బయటకు వెళ్ళాక లేదా గృహస్థు అయ్యాక గురుకులానికి అవసరమైన ఆర్థికసహాయం చేయాలి. దాన్ని బ్రహ్మయజ్ఞం అంటారు. అలా బయటకు వెళ్ళిన శిష్యులు చేసిన ధనసహాయంతో, గురువు తరువాత వచ్చే శిష్యులకు నిరాటంకంగా బోధ చేయగలుగుతాడు. అప్పుడు శిష్యుడు ప్రతిష్ఠ, గురువు ప్రతిష్ఠితం అవుతారు. అంటే ఈ పరిస్థితులు మారుతూ ఉంటాయి.

మనం కొన్ని ఉదాహరణలను చూశాము. ఉపనిషత్తు మూడు జంటలను తీసుకుని, వాటి ద్వారా అన్న–అన్నాద సంబంధాన్ని, ప్రతిష్ఠా–ప్రతిష్ఠిత సంబంధాన్ని వివరించుకు వస్తున్నది. అవి **ప్రాణం–శరీరం; అగ్ని–జలం; పృథివీ–ఆకాశం**.

ఈ మూడు జంటల ఉపాసనలను చూడటం ద్వారా, జగత్తులో ఆశ్రయ–ఆశ్రితాలు అన్నీ అర్థమవుతాయి. నిజానికి ధర్మం పాటించటం అంటే, ఈ ప్రకృతి నియమాలను ఉల్లంఘించకపోవటమే అని అర్థం. చెట్లను నరికితే, చెట్లకూ, మనుష్యులకూ మధ్య ఉన్న అనుబంధాన్ని మనం నరికినట్టు అవుతుంది. భగవంతుడు తెలివిగా ఈ రెండింటి మధ్య సమతుల్యతను ఏర్పరచాడు. మనం ఆక్సిజన్ పీల్చి, కార్బన్ డై ఆక్సైడ్ వదులుతాము. చెట్లు కార్బన్ డై ఆక్సైడ్‌ను పీల్చి, ఆక్సిజన్‌ను వదులుతాయి. ఎంత అద్భుతమైన సమతుల్యతో చూడండి; కాని వృక్షసంపదను నాశనం చేయటం ద్వారా విశ్వం యొక్క ఊపిరితిత్తులను నాశనం చేసి, తద్వారా పర్యావరణ సమతుల్యతను దెబ్బతీస్తున్నాము. విశ్వంయొక్క ఊపిరితిత్తులను పాడుచేయటం ద్వారా, మన ఊపిరితిత్తులను నాశనం చేసుకుని, తత్సంబంధిత వ్యాధులను కోరి తెచ్చుకుంటున్నాము.

గురుస్తోత్రాన్ని అందరూ ఒకరాగంలో, ఏకకంఠంలో పఠించాలి. అందులో ఏ ఒక్కరి కంఠం జత కలవకపోయినా శ్రుతి దెబ్బతింటుంది; మొత్తం స్తోత్రం గందరగోళంగా ఉంటుంది. ఇదే సూత్రం ధర్మసూత్రానికి కూడా వర్తిస్తుంది. ఎవరైనా అధర్మానికి పాలుబడితే, వెంటనే దాని ఫలితం తెలియకపోవచ్చు కాని, కొన్ని సంవత్సరాల తర్వాత వాటి ఫలం కనిపిస్తుంది. పైగా ఆ జరిగిన నష్టాన్ని తిరిగి పూడ్చలేము.

**ఏవం ప్రవర్తితం చక్రం నానువర్తయతీహ యః ।**

**అఘాయురింద్రియారామో మోఘం పార్థ స జీవతి ॥** – గీత 3.16

ఇలా పరంపరగా కొనసాగుతున్న సృష్టి చక్రానికి అనుకూలంగా ప్రవర్తించని వ్యక్తి పాపి. అటువంటి వ్యక్తి జీవితం వ్యర్థం.

ఎవరికైతే కుటుంబంతో, సమాజంతో, ప్రకృతితో ఉండాల్సిన సమతుల్యత గురించి తెలియదో అతను స్వార్థపరుడు అవుతాడు. అతని జీవితవిధానం అతనికి వ్యర్థమే కాకుండా, సృష్టిని దెబ్బతీస్తుంది. అందువల్ల ఈ విషయాన్ని బాగా అర్థం చేసుకోవాలి.

సంధ్యావందన శ్లోకాల్లో ఈ సమతుల్యతను గుర్తుచేసే శ్లోకాలు ఉంటాయి. నవగ్రహ తర్పణంలో – ఆదిత్యం తర్పయామి, సోమం తర్పయామి, అంగారకం తర్పయామి, బుధం తర్పయామి, బృహస్పతం తర్పయామి అంటూ కొనసాగుతుంది. అంటే ఈ సౌర మండలం ఎలా ఒకదానితో ఒకటి పెనవేసుకుని ఉందో తెలుస్తుంది. మన జీవితాలు అంతకంతకూ సంకుచితమైపోయి, మన కుటుంబ పరిధి దాటి బయటకు రావటం లేదు. కాని ఇలాంటి ప్రార్థనలు చేస్తే విశాలదృక్పథం ఏర్పడుతుంది. ఈ ప్రార్థనల్లో అన్ని దిక్కులకూ నమస్కారం చేస్తున్నాను అని వస్తుంది. ప్రాచై దిశే నమః, దక్షిణాయై దిశే నమః.

ఈ విధంగా, ఈ మూడు జంటలమీద ఉపాసనలు చేస్తే, విశ్వంలో ఉన్న సమతుల్యత గురించి తెలుస్తుంది మనకు. మన భక్తిమార్గం మూడు దశల్లో సాగుతుంది. ఏకరూప ఈశ్వరుడు, అనేకరూప (విశ్వరూప) ఈశ్వరుడు, అరూప ఈశ్వరుడు. విశ్వరూప ఈశ్వరుని స్థాయికి రాకుండా, అరూప ఈశ్వరుణ్ణి అర్థం చేసుకోలేము. ఈ జంటలను వరుసగా రాబోయే మూడు అనువాకాల్లో చూస్తాము. ఈ నేపథ్యంతో ఈ అనువాకాల్లోకి అడుగు పెడదాము.

## అనువాకం – 7

**అన్నం న నిన్ద్యాత్। తద్వ్రతమ్। ప్రాణో వా అన్నమ్। శరీరమన్నాదమ్। ప్రాణే శరీరం ప్రతిష్ఠితమ్। శరీరే ప్రాణః ప్రతిష్ఠితః। తదేతదన్నమన్నే ప్రతిష్ఠితమ్। స య ఏతదన్నమన్నే ప్రతిష్ఠితం వేద ప్రతితిష్ఠతి। అన్నవానన్నాదో భవతి। మహాన్ భవతి ప్రజయా పశుభిర్బ్రహ్మవర్చసేన। మహాన్ కీర్త్యా॥**

ఎ) **కర్మయోగం** – కర్మయోగం అంటే సత్కర్మలను సద్భావనతో చేయాలి. సత్కర్మలను గురించి చెప్పటానికి, ఇక్కడ ఉపనిషత్తు అన్నాన్ని ఉదాహరణగా తీసుకుంది. అన్నంమీద వ్రతాలను చెప్పింది.

ఇందులో మొదటి వ్రతాన్ని, మొదటి జంటనూ చూస్తాము.

**వ్రతం 1 – అన్నం న నిన్ద్యాత్** – ఇది మొట్టమొదటి వ్రతం. మీకు వడ్డించబడిన అన్నాన్ని నిందించకూడదు. కొంతమంది ఎంత కమ్మగా వండిన ఆహారాన్ని అయినా, సణక్కుండా తినలేరు.

**యదృచ్ఛాలాభ సంతుష్టః** – సాధన పంచకమ్

ప్రారబ్ధకర్మవల్ల ఏది ఆహారంగా దొరికితే దానితో తృప్తి పడాలని శంకరాచార్యులవారు సాధనపంచకంలో చెబుతారు. మంచి ఆహారం దొరికితే, మీరు పుణ్యం చేసుకున్నట్టు, మంచి ఆహారం దొరకకపోతే, మీరు పాపం చేసుకున్నట్టు అర్థం. అందువల్ల, మీరు తినే ఆహారాన్ని సణుక్కుంటూ తినే అలవాటు ఉంటే, ఇప్పట్నుంచీ దాన్ని మానేయండి.

**తద్వ్రతమ్** – దీన్ని ఒక వ్రతంగా పాటించాలి. భృగువు తన విచారణలో మొదటిదశలో అన్నమే బ్రహ్మ అన్నాడు.

**అన్నం బ్రహ్మేతి వ్యజానాత్**

అన్నం పరబ్రహ్మ స్వరూపం. అందువల్ల అన్నాన్ని విమర్శించకూడదు.

బి) **ఉపాసనయోగం** – భృగువల్లీలో ఈ భాగంలోనే నాలుగు ఉపాసనలను చూశాము. అవి విరాట్ ఉపాసన, అధ్యాత్మిక ఉపాసన, అధిదైవిక ఉపాసన, ఆకాశఉపాసన.

**ఉపాసన 1 – విరాట్ ఉపాసన**

(తక్కిన ఉపాసనలను అనువాకం 10లో చూస్తాము)

**జంట 1 – ప్రాణం–శరీరం అన్న–అన్నాద సంబంధం**

**ప్రాణో వా అన్నమ్। శరీరమన్నాదమ్** – అన్న–అన్నాద సంబంధంలో మొదటి జంటను చూస్తున్నాము. అది ప్రాణం–శరీరం. ప్రాణం అన్నం, శరీరం అన్నాదం అంటున్నది ఉపనిషత్తు. మనం శ్వాస పీల్చుకున్నప్పుడు ప్రాణవాయువును లోపలికి పీల్చుకుంటాము. అంటే ప్రాణవాయువు అన్నం అయింది; దాన్ని పీల్చుకునే శరీరం అన్నాదం అయింది.

**ప్రాణో వా అన్నాదః। శరీరమ్ అన్నమ్** – ఉపనిషత్తు ఈ వాక్యాన్ని ఇంత ప్రత్యక్షంగా చెప్పదు కాని మనం దీన్ని కలుపుకుందాము. ఈ కోణంలో చూస్తే ప్రాణం అన్నాదం, శరీరం అన్నం అయ్యాయి. ఈ కోణంలో చూస్తే, వ్యాయామం చేసినప్పుడు మనలోని

ప్రాణశక్తివల్ల కొవ్వు పదార్థం కరిగిపోతుంది. అంటే ప్రాణశక్తి శరీరాన్ని తినేస్తున్నది. అప్పుడు శరీరం అన్నం, ప్రాణశక్తి అన్నాదం అవుతాయి.

**ప్రాణం–శరీరం ప్రతిష్ఠా–ప్రతిష్ఠిత సంబంధం**

**ప్రాణే శరీరం ప్రతిష్ఠితమ్** – ప్రాణంమీద శరీరం ఆధారపడివుంది.

**శరీరే ప్రాణాత్ ప్రతిష్ఠితః** – శరీరంమీద ప్రాణం ఆధారపడివుంది.

అంటే శరీరం, ప్రాణం రెండూ ఒకదానిమీద ఇంకొకటి ఆధారపడివున్నాయి. ఒక కోణంలో చూస్తే ప్రాణశక్తివల్లనే శరీరం పనిచేస్తున్నది. అంటే ప్రాణం వల్లనే చేతనశక్తి, క్రియాశక్తి సమకూరుతాయి. కాబట్టి ప్రాణం ప్రతిష్ఠ, శరీరం ప్రతిష్ఠితం అంటే ప్రాణం ఆధారం, శరీరం ఆధేయం.

ఇంకొక కోణంలోంచి చూస్తే, ప్రాణశక్తి శరీరం అనే ఈ పెట్టెలో ఉన్నప్పుడే ఈ కార్యకలాపం అంతా జరుగుతుంది. అంటే ప్రాణానికి శరీరం ఆధారం, ప్రతిష్ఠ; ప్రాణం ఆధారపడింది, ప్రతిష్ఠితం. ఆ విధంగా ప్రాణం–శరీరం ఒకదానిమీద ఒకటి ఆధారపడి ఉన్నాయి.

**తదేతదన్నమన్నే ప్రతిష్ఠితమ్** – మొదటి అన్నం ప్రాణాన్ని, రెండవ అన్నం శరీరాన్ని సూచిస్తాయి. అంటే ప్రాణం–శరీరాల మధ్య అన్న–అన్నాద సంబంధం ఉంది. ఒకదానికొకటి ఆధారం.

ఈ సంబంధంమీద ఉపాసన చేస్తే కలిగే ఫలమేమిటో చెప్పుకొస్తున్నది ఉపనిషత్తు.

**స య ఏతదన్నమన్నే ప్రతిష్ఠితం వేద ప్రతితిష్ఠతి** – వేద అంటే ఇక్కడ ఉపాసనం కరోతి. ఎవరైతే ఈ ప్రాణం–శరీరాల ప్రతిష్ఠా–ప్రతిష్ఠితం సంబంధంమీద ఉపాసన చేస్తారో, అతనికి జీవితంలో ఏ కొరతా ఉండదు. అతనికి అన్నీ సమృద్ధిగా లభిస్తాయి.

**అన్నవానన్నాదో భవతి। మహాన్ భవతి। ప్రజయా పశుభిర్బ్రహ్మవర్చసేన। మహాన్ కీర్త్యా** – ఈ ఫలాలన్నీ ముందు అనువాకంలో చూశాము. అతనికి సమృద్ధిగా అన్నం దొరుకుతుంది, మహాత్ముడు అవుతాడు, మంచి పిల్లలు పుడతారు, పశుసంపద ఉంటుంది, బ్రహ్మవర్చస్సు పొందుతాడు, గొప్ప కీర్తిమంతుడు అవుతాడు.

## అనువాకం – 8

**అన్నం న పరిచక్షీత। తద్వ్రతమ్। ఆపో వా అన్నమ్। జ్యోతిరన్నాదమ్। అప్సు జ్యోతిః ప్రతిష్ఠితమ్। జ్యోతిష్యాపః ప్రతిష్ఠితాః। తదేతదన్నమన్నే ప్రతిష్ఠితమ్। స య ఏతదన్నమన్నే ప్రతిష్ఠితం వేద ప్రతితిష్ఠతి। అన్నవానన్నాదో భవతి। మహాన్ భవతి ప్రజయా పశుభిర్బ్రహ్మవర్చసేన। మహాన్ కీర్త్యా॥**

ఇందులో రెండవ వ్రతాన్నీ, రెండవ జంటనూ చూస్తాము.

**వ్రతం 2 – అన్నం న పరిచక్షీత** – మీకు పెట్టిన ఆహారాన్ని పారవేయకూడదు. ఆహారాన్ని వృథా చేయటం అంటే అన్నాన్ని అగౌరవపరచినట్టు అవుతుంది. (అన్నాన్ని వృథాచేస్తే, వృద్ధాప్యంలో సరిగ్గా అన్నం దొరకదని ఒక నమ్మకం.)

కాని కడుపునిండా భోజనం చేశాక, మళ్ళీ తినాల్సివస్తే ఏంచేయాలి? కడుపునిండా తిన్నాక మళ్ళీ తింటే అది శరీరాన్ని అగౌరవపరచినట్టు అవుతుంది. కొన్ని సందర్భాల్లో ఇరుకున పడతాము: అన్నాన్ని గౌరవించాలా, అన్నమయాన్ని (శరీరాన్ని) గౌరవించాలా? దానికి జవాబు ఒకటే. వీలున్నంతవరకూ అటువంటి పరిస్థితి ఎదురవకుండా చూసుకోండి. అంటే మీరు తినగలిగినంతే వడ్డించుకోండి. మీ కంచంలో వడ్డించినదాన్ని పారేయకూడదు. అప్పుడూ సమస్యే! ఎవరైనా బలవంతంగా, తినగలిగినదానికన్నా ఎక్కువ వడ్డిస్తే ఏం చేయాలి? అలాంటప్పుడు ఒకవేళ ఆహారాన్ని పారేస్తే, ఆ పాపం వడ్డించినవారికి వెళుతుంది. అందువల్ల అన్నం పారేయకూడదు అంటే మీ కంచంలో వృథా చేయకూడదు, ఎవరికీ వద్దన్నాక కూడా వడ్డించకూడదు. ఆ విధంగా అన్నాన్నీ, అన్నమయాన్నీ కూడా అగౌరవ పరచకూడదు.

**తద్వ్రతమ్**– ఇది వ్రతం.

**జంట 2 అగ్ని–జలం అన్న–అన్నాద సంబంధం**

**ఆపో వా అన్నమ్। జ్యోతిరన్నాదమ్** – ఒక కోణంలో జలం అన్నం, అగ్ని అన్నాదం. మనం నీరు తాగినప్పుడు దాన్ని వైశ్వానర అగ్ని స్వీకరిస్తుంది. అంటే నీరు అన్నం అయింది; దాన్ని అరిగించే అగ్ని అన్నాదం అయింది.

**ఆపో వా అన్నాదః। జ్యోతిః అన్నమ్** – మనం ఈ వాక్యాన్ని కలుపుకుంటాము. ఈ కోణంలో చూస్తే జలం అన్నాదం, అగ్ని అన్నం అయ్యాయి. బాహ్యంగా అగ్నిజ్వాలలు రేగుతుంటే, వాటిమీద నీరుపోసి, ఆర్పివేస్తాము. ఇక్కడ నీరు అగ్నిని తింటోంది. అప్పుడు అగ్ని అన్నం, జలం అన్నాదం అవుతాయి.

**అగ్ని–జలం ప్రతిష్ఠా–ప్రతిష్ఠిత సంబంధం**

**అప్సు జ్యోతిః ప్రతిష్ఠితమ్** – నీటిమీద అగ్ని ఆధారపడివుంది.

**జ్యోతిష్యాపః ప్రతిష్ఠితాః** – అగ్నిమీద నీరు ఆధారపడివుంది.

సృష్టి ప్రకరణం చెప్పినప్పుడు శాస్త్రం అగ్ని, జలానికి ఆధారం అని చెబుతుంది.

**ఆకాశాద్వాయుః। వాయోరగ్నిః। అగ్నేరాపః**

ఆకాశంనుంచి వాయువు, వాయువునుంచి అగ్ని, అగ్నినుంచి జలము పుట్టాయి. అంటే అగ్ని కారణం అయింది; నీరు కార్యం అయింది.

**అగ్నిః జలస్య కారణమ్। జలమ్ అగ్నేః కార్యమ్**

కారణం ఎప్పుడూ కార్యానికి ఆధారం అవుతుంది. ఆభరణాలకు బంగారం ఆధారం; కుర్చీకి చెక్క ఆధారం. ఆధారాన్ని ప్రతిష్ఠ అనీ, ఆధేయాన్ని ప్రతిష్ఠితం అనీ అంటారు. ఆ విధంగా అగ్ని ప్రతిష్ఠ, జలం ప్రతిష్ఠితం అయ్యాయి, ఒక కోణంలోంచి చూస్తే.

కాని వీటినే ఇంకో కోణంలోంచి చూస్తే, వీటి స్థానాలు తారుమారు అవుతాయి. రెండు సందర్భాలు చెప్పవచ్చు రెండో కోణానికి.

– ఒక భాష్యకారుడు వర్షించే మేఘాలు, మెరుపు తీసుకున్నాడు. వర్షించే మేఘాలనుంచి మెరుపు పుడుతుంది. వర్షించే మేఘాలు జలతత్త్వం అయితే మెరుపు అగ్నితత్త్వం. ఆ విధంగా జలం ప్రతిష్ఠ, అగ్ని ప్రతిష్ఠితం అయ్యాయి.

– మన శరీరంలో అగ్నితత్త్వం ఉంటుంది. దాన్ని శరీర ఉష్ణోగ్రతరూపంలో అనుభవిస్తాము. బాహ్యంగా వాతావరణంలో తీవ్రమైన మార్పులు హఠాత్తుగా వచ్చినా కూడా, మన శరీర ఉష్ణోగ్రత 98.4 దాటి ఉండదు. బాహ్యవాతావరణంతో సంబంధం లేకుండా, అగ్నితత్త్వం ఒకేలా ఉంటుంది. అలా ఎలా ఉంటుంది? ప్రకృతి దాన్ని జలతత్త్వంతో సాధిస్తుంది. బయట వాతావరణం వేడెక్కినప్పుడు, శరీరానికి చెమటలు పడతాయి. ఆ చెమటల ద్వారా (జలతత్త్వం ద్వారా) అధిక వేడిని బయటకు పంపుతుంది. ఈ చెమటలు పట్టకపోతే, మనం జీవించటం కష్టం. అందువల్ల, చెమటలు బాగా పోసినప్పుడు తిట్టుకోకుండా, అటువంటి సహజ పద్ధతిని ఏర్పరచిన భగవంతునికి కృతజ్ఞతలు చెప్పుకోవాలి. అంతేకాదు, బయట మరీ వేడిగా ఉన్నప్పుడు నీళ్ళు బాగా తాగుతాము. అది కూడా అగ్నిని తగ్గిస్తుంది. అలా సహజమైన థర్మోస్టాట్‌ను ఏర్పరచాడు భగవంతుడు. ఈ రెండు సందర్భాలలోనూ అగ్ని ప్రతిష్ఠితం, జలం ప్రతిష్ఠ అయ్యాయి.

మొదటి కోణం ప్రకారం అంటే జలానికి అగ్ని కారణం కాబట్టి అక్కడ అగ్ని ప్రతిష్ఠ, జలం ప్రతిష్ఠితం అయ్యాయి. ఈ విధంగా రెండింటి మధ్యా ప్రతిష్ఠ–ప్రతిష్ఠితం సంబంధం ఉంది. ఈ సంబంధంమీద ఉపాసన చేయమంటున్నది ఉపనిషత్తు. ఈ సంబంధం కేవలం జలం–అగ్ని మధ్య మాత్రమే కాదు, మొత్తం విశ్వంలోని పర్యావరణానికి, వాతావరణానికి మధ్య ఉండే సమతుల్యతను సూచిస్తుంది.

**స య ఏతదన్నమన్నే ప్రతిష్ఠితం వేద ప్రతితిష్ఠతి** – ఈ సంబంధంమీద ఎవరైతే ఉపాసన చేస్తే, వారికి వచ్చే ఫలం కూడా ప్రతిష్ఠితం ఫలం వస్తుంది. ఎందుకంటే దేనిమీద ఉపాసన చేస్తే, ఆ ఫలం వస్తుంది. తక్కిన ఫలాలన్నీ ఇంతకుముందు చూసినవే.

## అనువాకం - 9

**అన్నం బహుకుర్వీత। తద్వ్రతమ్।పృథివీ వా అన్నమ్। ఆకాశోన్నాదః। పృథివ్యామాకాశః ప్రతిష్ఠితః। ఆకాశే పృథివీ ప్రతిష్ఠితా। తదేతదన్నమన్నే ప్రతిష్ఠితమ్। స య ఏతదన్నమన్నే ప్రతిష్ఠితం వేద ప్రతితిష్ఠతి। అన్నవానన్నాదో భవతి। మహాన్ భవతి ప్రజయా పశుభిర్బ్రహ్మ వర్చసేన। మహాన్ కీర్త్యా॥**

ఇందులో మూడవ వ్రతాన్నీ, మూడవ జంటనూ చూస్తాము.

**వ్రతం 3 – అన్నం బహుకుర్వీత** – ఆహారాన్ని సమృద్ధిగా పండించాలి. అంటే అన్నానికి కరువు ఏర్పడకూడదు. దేశం సుభిక్షంగా ఉండాలి. మీ దగ్గర అధికంగా ఉన్న ఆహారాన్ని అన్నార్తులకు పంచండి. ఎందుకంటే ఆకలి మనిషికి తీరాల్సిన ప్రథమ అవసరం. ఆకలి తీరితేనే ఉన్నతమైన లక్ష్యాల గురించి ఆలోచించగలుగుతాడు.

**తద్వ్రతమ్** – దీన్ని ఒక వ్రతంగా పాటించాలి. ఎంతసేపూ నేనూ, నావాళ్ళు బాగుంటే చాలు అని గిరిగీసి కూర్చోకూడదు. విశాల దృక్పథం పెంచుకుని, ఎదుటివారి బాగోగులు చూడాలి. ఏకాదశికి ఉపవాసం ఉండటంవల్ల కలిగే అనేక ఫలాలలో ఒకఫలం ఆకలి అంటే ఏమిటో తెలిసివస్తుంది. ఆకలి అంటే ఏమిటో తెలిస్తేనే, ఆకలితో అలమటించిపోయే అన్నార్తుల బాధను గ్రహించి, వారిని సేదదీర్చగలము.

### జంట 3 – పృథివి–ఆకాశం అన్న–అన్నాద సంబంధం

**పృథివీ వా అన్నమ్। ఆకాశోఽన్నాదః** – ఒక కోణంలో చూస్తే పృథివీ అన్నం; ఆకాశం అన్నాదం. సృష్టి జరిగినప్పుడు ఆకాశం, వాయువు, అగ్ని, ఆపః, పృథివీ – ఈ వరుస క్రమంలో వస్తాయి. కాని ప్రళయం వచ్చినప్పుడు ఈ పంచభూతాలు వెనకనుంచి లయమవుతూ వస్తాయి. అంటే పృథివి జలంలో, జలం అగ్నిలో, అగ్ని వాయువులో, వాయువు ఆకాశంలో లయమవుతాయి.

పృథివీ → ఆపః → అగ్ని → వాయు → ఆకాశ

మొదటిదీ, చివరిదీ చూస్తే పృథివీ ఆకాశంలో లయమవుతుంది. అంటే పృథివీ అన్నం అయింది; ఆకాశం అన్నాదం అయింది.

**పృథివీ వా అన్నాదమ్। ఆకాశః అన్నమ్** – మనం ఈ వాక్యాన్ని కలుపుకోవాలి. ఈ కోణంలో చూస్తే, పృథివీ అన్నాదం, ఆకాశం అన్నం. ఇంట్లోని ఫర్నీచర్ ఇంట్లోని ఖాళీ స్థలాన్ని మ్రింగివేస్తుంది. ఫర్నీచర్ అంటే పృథివీ; అది ఆకాశాన్ని తింటోంది – అప్పుడు ఆకాశం అన్నం, పృథివీ అన్నాదం అవుతాయి.

**పృథివీ-ఆకాశం ప్రతిష్ఠా-ప్రతిష్ఠితం సంబంధం**

**పృథివ్యామాకాశః ప్రతిష్ఠితః** – పృథివీమీద ఆకాశం ఆధారపడివుంది.

**ఆకాశే పృథివీ ప్రతిష్ఠితా** – ఆకాశంమీద పృథివీ ఆధారపడివుంది.

అంటే పృథివీ, ఆకాశం రెండూ ఒకదానిమీద ఇంకొకటి ఆధారపడివున్నాయి. ఒక కోణంలో చూస్తే ఆకాశంమీద పృథివీ ఆధారపడివుంది. ఆకాశంనుంచి తక్కిన భూతాల సృష్టి జరిగింది. అందువల్ల ఆకాశం కారణం, పృథివీ కార్యం.

**ఆకాశాద్వాయుః। వాయోరగ్నిః। అగ్నేరాపః। అద్భ్యః పృథివీ**

ఆ విధంగా చూస్తే ఆకాశం ప్రతిష్ఠ (కారణత్వాత్), పృథివీ ప్రతిష్ఠితమ్ (కార్యత్వాత్).

ఇంకో కోణంలో చూస్తే భూమి ప్రతిష్ఠా, ఆకాశం ప్రతిష్ఠితం. ఆకాశంలోనే అన్నీ ఉంటాయి నిజమే కాని, వ్యావహారిక ప్రపంచంలో పృథివీ ఆకాశానికి ప్రయోజనకత్వాన్ని చేకూరుస్తుంది. గదికి గోడలుండటంవల్ల గదిలోని ఆకాశం వినియోగంలోకి వచ్చింది. ఆ విధంగా పృథివీ ప్రతిష్ఠా, ఆకాశం ప్రతిష్ఠితం అయ్యాయి.

**తదేతదన్నమన్నే ప్రతిష్ఠితమ్** – పృథివీ-ఆకాశాల మధ్య అన్న-అన్నాద సంబంధం ఉంది. ఒకదానికొకటి ఆధారం.

**స య ఏతదన్నమన్నే ప్రతిష్ఠితం వేద ప్రతితిష్ఠతి** – ఎవరైతే ఈ పృథివీ-ఆకాశాల ప్రతిష్ఠా-ప్రతిష్ఠితం సంబంధంమీద ఉపాసన చేస్తారో, అతనికి జీవితంలో ఏ కొరతా ఉండదు. అన్నీ సమృద్ధిగా లభిస్తాయి. తక్కిన ఫలాలన్నీ ఇంతకుముందు చూసినవే.

ఈ మూడు జంటలు కేవలం జగత్తులో ప్రతిదీ ఎలా ఒకదానిమీద ఇంకొకటి ఆధారపడ్డాయో చూపటానికి చెప్పబడ్డాయి. ఈ విశ్వమంతా భగవంతునియొక్క శరీరం. అరవంలో భగవంతుణ్ణి పెరుమాళ్ అంటారు. పెరుమాళ్ అంటే పెరుమ్ ఆళ్ (పెద్దమనిషి). అందువల్ల ఈ ఉపాసన విశ్వరూప ఉపాసన. దీన్నే **విరాట్ ఉపాసన** అంటారు.

ఈ విధమైన ఉపాసనలవల్ల ఈ క్రింది విషయాలు తేటతెల్లమవుతున్నాయి.

– జగత్తు అంతా ఈశ్వరుని శరీరం. కాబట్టి ఈశ్వరుడు ఎక్కడో లోకాలలో దూరంగా లేడు. అవ్యక్తంగా ఉన్న ఈశ్వరుడు జగత్తుగా ప్రకటితమవుతున్నాడు.

– ఇలా సృష్టిలో ప్రతిదీ ఒకదానిమీద మరొకటి ఆధారపడితే దేనికీ స్వతంత్రంగా ఉనికి లేదు. సాంకేతిక పరిభాషలో చెప్పాలంటే, స్వతంత్రంగా ఉనికి లేనిది మిథ్య. అందువల్ల మనం అనుభవిస్తున్న ప్రతిదీ మిథ్యే.

– అలా జగత్తులో ఒకదానిమీద ఇంకొకటి ఆధారపడితే, ఏదీ సత్యం కాదు. అది మిథ్య అన్నాం. ఉన్న జగత్తు మిథ్య అయితే, దానికొక సత్య అధిష్ఠానం ఉండాలి. ఈ మిథ్యాజగత్తుకు సత్యఅధిష్ఠానమే బ్రహ్మ.

**బ్రహ్మ సత్యం, జగన్మిథ్యా**

– అంతేకాదు సబ్జెక్టు, ఆబ్జెక్టు కూడా ఒకదానిమీద ఒకటి ఆధారపడివున్నాయి. సబ్జెక్టు అంటే ప్రమాతా, ఆబ్జెక్టు అంటే ప్రమేయం. ప్రమాత లేనిదే ప్రమేయానికి ఉనికి లేదు; ప్రమేయం లేనిదే ప్రమాతకు ప్రమాత హోదా ఉండదు. గురువు లేనిదే శిష్యులకు ఉనికి లేదు; శిష్యులు లేనిదే గురువుకు గురువు హోదా ఉండదు. అంటే రెండూ కూడా మిథ్యే. బ్రహ్మ ప్రమాతృప్రమేయ విలక్షణమ్.

ప్రమాతా, ప్రమాణం రెండూ మిథ్య అయితే, ప్రమాతృ, ప్రమేయ విలక్షణమైనదేదో ఉండాలి. దాన్ని తురీయం అంటుంది మాండూక్యోపనిషత్తు. అది నువ్వే అంటుంది.

**ప్రమాతృప్రమేయ విలక్షణ తురీయ బ్రహ్మ అహమస్మి**

దీనితో విశ్వరూప ధ్యానం లేదా విరాట్ ఉపాసన అయిపోయింది.

ఈ వివరాలన్నీ సారాంశం చివర్లో ఒక పట్టికలో చూడవచ్చు.

**అనువాకం – 10**

**న కంచన వసతౌ ప్రత్యాచక్షీత। తద్వ్రతమ్। తస్మాద్యయా కయా చ విధయా బహ్వన్నమ్ ప్రాప్నుయాత్। ఆరాధ్యస్మా అన్నమిత్యాచక్షతే। ఏతద్వై ముఖతోఽన్నగ్ం రాద్ధమ్। ముఖతోఽస్మా అన్నగ్ం రాధ్యతే। ఏతద్వై మధ్యతోఽన్నగ్ం రాద్ధమ్। మధ్యతోఽస్మా అన్నగ్ం రాధ్యతే। ఏతద్వా అంతతోఽన్నగ్ం రాద్ధమ్। అంతతోఽస్మా అన్నగ్ం రాధ్యతే। య ఏవం వేద।**

**క్షేమ ఇతి వాచి। యోగక్షేమ ఇతి ప్రాణాపానయోః। కర్మేతి హస్తయోః। గతిరితి పాదయోః। విముక్తిరితి పాయౌ। ఇతి మానుషీ స్సమాజ్ఞాః।**

**అథ దైవీః। తృప్తిరితి వృష్టౌ। బలమితి విద్యుతి। యశ ఇతి పశుషు। జ్యోతిరితి నక్షత్రేషు। ప్రజాతిరమృతమానంద ఇత్యుపస్థే। సర్వమిత్యాకాశే।**

**తత్ ప్రతిష్ఠేత్యుపాసీత। ప్రతిష్ఠావాన్ భవతి। తన్మహ ఇత్యుపాసీత। మహాన్ భవతి। తన్మన ఇత్యుపాసీత। మానవాన్ భవతి। తన్నమ ఇత్యుపాసీత। నమ్యన్తేఽస్మై కామాః। తద్బ్రహ్మేత్యుపాసీత। బ్రహ్మవాన్ భవతి। తద్ బ్రహ్మణః పరిమర ఇత్యుపాసీత। పర్యేణం మ్రియన్తే ద్విషన్తస్సపత్నాః। పరి యేఽప్రియా భ్రాతృవ్యాః।**

**స యశ్చాయం పురుషే। యశ్చాసావాదిత్యే। స ఏకః। స య ఏవంవిత్। అస్మాల్లోకాత్ ప్రేత్య। ఏతమన్నమయమాత్మానముపసంక్రమ్య। ఏతం ప్రాణమయమాత్మానముపసంక్రమ్య। ఏతం**

**మనోమయమాత్మానముపసంక్రమ్య। ఏతం విజ్ఞానమయమాత్మానముపసంక్రమ్య। ఏతమానందమయమాత్మానముపసంక్రమ్య।**
**ఇమాంల్లోకాన్ కామాన్నీ కామరూప్యనుసంచరన్। ఏతత్సామ గాయన్నాస్తే। హా (3) వు। హా (3) వు। హా (3) వు। అహమన్నమహమన్నమహమన్నమ్। అహమన్నాదో(3) ఽహమన్నాదో(3) ఽహమన్నాదః। అహగ్గం శ్లోకకృదహగ్గం శ్లోకకృదహగ్గం శ్లోకకృత్। అహమస్మి ప్రథమజా ఋతా (3) స్య। పూర్వం దేవేభ్యో అమృతస్య నా (3) భాయి। యో మా దదాతి స ఇదేవమా (3) వాః। అహమన్నమన్నమదన్తమా (3) ద్మి। అహం విశ్వం భువనమభ్యభవామ్। సువర్న జ్యోతీః। య ఏవం వేద। ఇత్యుపనిషత్।**

**వివరణ**

**న కంచన వసతౌ ప్రత్యాచక్షీత। తద్వ్రతమ్। తస్మాద్యయా కయా చ విధయా బహ్వన్నమ్ ప్రాప్నుయాత్। ఆరాధ్యస్మా అన్నమిత్యాచక్షతే। ఏతద్వై ముఖతోఽన్నగ్ం రాద్ధమ్। ముఖతోఽస్మా అన్నగ్ం రాధ్యతే। ఏతద్వై మధ్యతోఽన్నగ్ం రాద్ధమ్। మధ్యతోఽస్మా అన్నగ్ం రాధ్యతే। ఏతద్వా అంతతోఽన్నగ్ం రాద్ధమ్। అంతతోఽస్మా అన్నగ్ం రాధ్యతే। య ఏవం వేద।**

ఇందులో నాలుగవ వ్రతాన్ని చూస్తాము.

**వ్రతం 4 – న కంచన వసతౌ ప్రత్యాచక్షీత** – ఇంటికి వచ్చిన అతిథిని వసతి ఇవ్వకుండా తిరస్కరించకూడదు. అంటే ఎవరైనా ఇంట్లో ఆశ్రయం కోరివస్తే, అతనిని పొమ్మనకూడదు. పూర్వకాలం అనుకోని అతిథి వస్తే అది దైవకృపగాను, వచ్చిన వ్యక్తిని దైవసమానంగాను భావించేవారు. శీక్షావల్లీలో అతిథిదేవోభవ అని చూశాము.

ఈ విధివాక్యాన్ని ఇప్పటి కాలమాన పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని ఆచరించాలి. పూర్వం అంటే యాత్రికులు తీర్థయాత్రలకు కాలినడకన బయలుదేరేవారు. పగలంతా ప్రయాణం చేసి, రాత్రివేళ ఎక్కడో బస చేసేవారు. పూర్వం హోటళ్ళు లేవు కాబట్టి, ఎవరైనా ఇంటి తలుపు తట్టక తప్పేదికాదు. కాని ఇప్పుడు వీధికొక హోటలు వెలిసింది. అందువల్ల మనమూ అనవసరంగా ఎవరికీ భారంగా ఉండకూడదు. చెప్పాపెట్టకుండా అసలు వెళ్ళకూడదు. వచ్చిన ఆగంతకుణ్ణి కూడా త్వరగా నమ్మి ఆతిథ్యం ఇవ్వకూడదు. ఇప్పటి రోజులు బాగాలేవు. అందువల్ల ఈ వ్రతాన్ని ఇప్పటి రోజులకు తగ్గట్టుగా మలుచుకుని, జాగ్రత్తగా ఆచరించాలి.

**తద్వ్రతమ్** – ఇది ఒక ఉపాసన.

అతిథికి ఆతిథ్యం ఇస్తే సరిపోదు, అతనికి ఆహారాన్ని కూడా ఏర్పరచాలి. మీరు కాసేపు బయటకూర్చోండి, మేము భోజనం చేసివస్తాము అనకూడదు. ధర్మశాస్త్రం ప్రకారం ఇంట్లో

అతిథి ఉన్నప్పుడు అతనికి నీరు ఇవ్వకుండా మీరు తాగితే అది మత్తుపానీయం తాగటంతో సమానం; వారికి ఆహారం పెట్టకుండా, మీరు మాత్రం భుజిస్తే అది మాంసభక్షణంతో సమానం.

పూర్వకాలంలో అందువల్లనే అన్నం ఎక్కువగా వండేవారు. అతిథి అంటేనే చెప్పకుండా వచ్చే వ్యక్తి అని అర్థం. అందువల్ల ఎవరు, ఎప్పుడు వస్తారో తెలియదు కాబట్టి, అలా ఎవరైనా అనుకోకుండా వచ్చినా, వారికి సరిపడేటంత అన్నం వండేవారు. పూజ్య స్వామీజీ రోజూ వంట వండని ఇంటిని గృహం అనటానికి వీలులేదు అనేవారు. ఇంటి యజమానిని గృహపతి అనీ, అతను రాజేసే అగ్నిని గార్హపత్య అగ్ని అంటారు. అతిథికి బయటనుంచి తెప్పించిన భోజనం కూడా పెట్టకూడదు; ఇంట్లోనే వండి, భగవంతునికి అర్పించి, తర్వాత అతనికి పెట్టాలి.

**నాన్నోదకసమం దానం, తిథిర్నైకాదశీ సమా।**
**న గాయత్ర్యాః పరోమన్త్రః, న మాతుః పరదైవతమ్ ॥**

అన్నపానాదులను మించిన దానం లేదు; ఏకాదశి ఉపవాసాన్ని మించిన వ్రతం లేదు; గాయత్రీని మించిని మంత్రం లేదు; తల్లిన మించిన దైవం లేదు.

**తస్మాత్ బహ్వన్నం ప్రాప్నుయాత్** – అందువల్ల సమృద్ధిగా అన్నాన్ని సంపాదించాలి (అన్నదానం చేయాలి).

**యయా కయా చ విధయా** – ఏ విధంగానైనా సరే, ఎక్కువ అన్నం సంపాదించాలని ఉపనిషత్తు అంటున్నది. అంతమాత్రాన అధర్మంగా సంపాదించమని కాదు అర్థం. ధర్మపరంగానే సంపాదించాలి. అలాగే అన్నం సమృద్ధిగా ఉండగానే సరిపోదు. దాన్ని అతిథి అభ్యాగతులకు పంచిపెట్టే బహుదొడ్డగుణం కూడా ఉండాలి. దానికి కూడా ఎంతో పుణ్యం చేసుకుని ఉండాలి.

**శతేషు జాయతే శూరః సహస్రేషు చ పండితః**
**వక్తా శతసహస్రేషు। దాతా భవతి వా న వా॥**

వందల్లో ధీరుడొక్కడుంటాడు; వేలల్లో పండితుడొక్కడుంటాడు; లక్షల్లో ఉపన్యాసకుడు ఒక్కడుంటాడు; కాని అసలైన దాత ఉన్నాడో లేడో!

దానం చేయాలంటే అంతర సంపద ఉండాలి. బాహ్యంగా కోట్లలో మునిగితేలుతున్నా, అంతర సంపద లేకపోతే, రూపాయి కూడా ఇవ్వడు. పదిరూపాయలు మాత్రమే ఉన్న వ్యక్తి చిరునవ్వుతో రూపాయో, రెండో దానం చేస్తాడు కాని, కోటి రూపాయలు ఉన్న వ్యక్తి రూపాయి కూడా రాల్చకపోవచ్చు.

ఇక్కడ అలా పీనాసితనం చూపకుండా, అతనితో మనసారా పంచుకోమంటున్నది ఉపనిషత్తు. అంతేకాదు, వేళకాని వేళ, అనుకోకుండా వచ్చిన అతిథికి, వీరికేమైనా ఇబ్బంది కలిగిస్తున్నానేమోననే మొహమాటం ఉంటుంది. అందువల్ల, యజమానే అతని మొహమాటాన్ని పారద్రోలి, అతను మామూలుగా ఉండేలా చేయాలి. అతని రాక వారికేమీ ఇబ్బంది కాదని సూచించాలి అంటున్నది ఉపనిషత్తు. అదెలా?

**ఆరాధ్యస్మా అన్నమిత్యాచక్షతే** – అస్మై అన్నమ్ అరాధి అంటే వైదిక సంప్రదాయం ప్రకారం ఆ అభ్యాగతునికి భోజనం ముందే సిద్ధం చేయబడింది అని చెబుతారు. అరాధి అంటే సంసిద్ధంగా ఉందని అర్థం.

ఇతి ఆచక్షతే అంటే ఈ విధంగా గృహస్థు, అతిథితో పలికి, అతన్ని లోపలికి ఆహ్వానించాలి.

అన్నదానం చేయటంలో కూడా తారతమ్యాలు ఉంటాయని చెబుతున్నది ఉపనిషత్తు. కొంతమంది దానం చేయటంలో ఆనందాన్ని పొందితే, మరికొందరు వ్యతిరేకభావనతో దానం చేస్తారు. ఉపనిషత్తు ఈ దానాలను మూడు తెగల కింద విభజిస్తున్నది.

**ఉత్తమ దానం** – మాటల్లో, చేతల్లో కూడా ఈ దాత, దానం చేయటంలో తనకు కలిగే ఆనందాన్ని పంచుకోవటం. దానం చేయగలగటం తన అదృష్టంగా భావిస్తాడు.

**అధమ దానం** – సణుక్కుంటూ, విసుక్కుంటూ, ఇష్టం లేకుండా దానం చేయటం.

**మధ్యమ దానం** – మరీ పొంగిపోకుండానూ, సణగకుండానూ చేసే మధ్యమరకం దానం.

ఈ దానాల్లో తారతమ్యాలు ఉన్నాయి కాబట్టి, సహజంగానే ఈ దాతలకు కలిగే ఫలాల్లో కూడా తారతమ్యాలుంటాయి అంటున్నది ఉపనిషత్తు. మీరు ఆనందంగా దానం చేస్తే, మీ వృద్ధాప్యం ఆనందంగా సాగిపోతుంది. మీరు సణుక్కుంటూ దానం చేస్తే, మీక్కూడా సణుక్కుంటూ సేవ చేస్తారు. ఒక్కముక్కలో చెప్పాలంటే, మీరు ఎదుటివారిని ఎలా చూస్తే, వారు మిమ్మల్ని అలాగే చూస్తారు. ఇది ప్రకృతి సూత్రం అంటున్నది ఉపనిషత్తు.

ఈ ప్రపంచం ఒక అద్దం. మీరు అద్దంలో చూసి చిరునవ్వు నవ్వితే, అదీ మీకు చిరునవ్వు పంచుతుంది; అద్దంలో చూసి మీరు ఉరిమితే, అది కూడా మిమ్మల్ని ఉరిమి చూస్తుంది.

**యథా కర్మ, తథా ఫలమ్**

ఎటువంటి కర్మ చేస్తే, అటువంటి ఫలం వస్తుంది.

**ఏతద్వై ముఖతోఽన్నగ్ం రాద్ధమ్** – ఈ ఆహారాన్ని శ్రద్ధగా వండి, సమర్పిస్తే,

**ముఖతోఽస్మా అన్నగ్ం రాధ్యతే** – అలా సమర్పించిన అన్నదాతకు కూడా భవిష్యత్తులో అన్నం అదే విధంగా అందజేయబడుతుంది.

**ఏతద్వై మధ్యతో౽న్నగ్ం రాద్ధమ్** – మధ్యరకంగా అన్నదానం చేస్తే,
**మధ్యతో౽స్మా అన్నగ్ం రాధ్యతే** – అతనికి కూడా అదే మధ్యరకంగా అందజేయబడుతుంది.
**ఏతద్వా అంతతో౽న్నగ్ం రాద్ధమ్**– అధమరకంగా అన్నదానం చేస్తే,
**అంతతో౽స్మా అన్నగ్ం రాధ్యతే** – అతనికి కూడా అధమరకంగానే అందజేయబడుతుంది.
**య ఏవం వేద** – ఇందాక చూసిన ప్రకృతి సూత్రాన్ని గుర్తుపెట్టుకోవాలి. ప్రపంచం మీకేమీ కొత్తగా ఇవ్వదు. మీరు ప్రపంచమనే బ్యాంకులో దేన్ని జమచేస్తే, దాన్నే తిరిగి తీసుకోగలరు. మీరు సుఖాన్ని జమ చేస్తే సుఖాన్ని, దుఃఖాన్ని జమ చేస్తే దుఃఖాన్ని మాత్రమే తీసుకోగలరు.

**(సః తత్ ఫలమ్ ఆప్నోతి)** – ఈ వాక్యాన్ని మనం కలుపుకోవాలి. ఈ జ్ఞానం పొందిన వ్యక్తికి ఈ ఫలం కలుగుతుంది. అంటే ఈ తారతమ్యాలను తెలుసుకున్న వ్యక్తి, ఉత్తమ దానం ఇచ్చే అవకాశం ఉంది; సహజంగానే ఉత్తమఫలం వస్తుంది.

ఇప్పుడు ఉపనిషత్తు మరికొన్ని ఉపాసనలను గురించి చెప్పబోతున్నది.

**క్షేమ ఇతి వాచి। యోగక్షేమ ఇతి ప్రాణాపానయోః। కర్మేతి హస్తయోః। గతిరితి పాదయోః। విముక్తిరితి పాయౌ। ఇతి మానుషీ స్సమాజ్ఞాః।**

మొదటి తరహా ఉపాసనలు అధ్యాత్మం అంటే మన శరీరభాగాలకు సంబంధించినది. రెండవ తరహా అధిదైవిక ఉపాసనలు. అది దేవతలమీద ఉపాసన.

బి) **ఉపాసనయోగం – అనువాకం 10 (కొంతభాగం)**

**ఉపాసన 2 – అధ్యాత్మిక బ్రహ్మ ఉపాసన – (ఉపాసన 1**–విరాట్ ఉపాసన అనువాకం 7లో చూశాము.) మామూలుగా ఉపాసన చేసేటప్పుడు ఉపాస్య దేవతను ఆవాహన చేయటానికి ఒక ఆలంబనం తీసుకుంటాము. ఉదాహరణకు శివలింగంమీద శివుణ్ణి, సాలిగ్రామంమీద విష్ణుమూర్తిని ఆవాహన చేస్తాము. కాని ఇప్పుడు చూడబోయే ఉపాసన శరీర అంగాలమీద చేస్తాము. మన శరీర అంగాలమీద బ్రహ్మను ఆవాహన చేస్తాము కాబట్టి దీన్ని అధ్యాత్మిక ఉపాసన అంటారు.

> **ఏతద్ధ్యేవాక్షరం బ్రహ్మ, ఏతద్ధ్యేవాక్షరం పరమ్ ।**
> **ఏతద్ధ్యేవాక్షరం జ్ఞాత్వా, యో యదిచ్ఛతి తస్య తత్ ॥** – కఠ 1.2.16

ఓంకారమే సగుణబ్రహ్మ; ఓంకారమే నిర్గుణబ్రహ్మ. ఎవరు దేన్ని ఉపాసిస్తే, దాన్నే పొందుతారు.

ఇక్కడ ఒక్కొక్క అంగాన్నీ బ్రహ్మ యొక్క ప్రకటితరూపంగా, బ్రహ్మయొక్క మహిమగా చూస్తాము. భగవద్గీతలో విభూతియోగాన్ని గుర్తుకు తెస్తుంది ఇది. ఇక్కడ ఆధ్యాత్మిక బదులు

మానుషీ అనే పదాన్ని, ఉపాసన బదులు సమాజ్ఞః అనే పదాన్ని వేసింది ఉపనిషత్తు. అందువల్ల మానుషీ సమాజ్ఞః అంటే అధ్యాత్మిక బ్రహ్మ ఉపాసనలు.

**క్షేమ ఇతి వాచి (బ్రహ్మ ఉపాసీత)** – వాగింద్రియంలో క్షేమం రూపంలో బ్రహ్మను ఉపాసించాలి. వాచి అంటే వాగింద్రియం. క్షేమం అంటే మంగళం. ప్రతి ఉపాసన తర్వాత **బ్రహ్మ ఉపాసీత** పదాలను కలుపుకోవాలి. వాగింద్రియం ఒక్క వాక్కుకి సంబంధించినదైతే ఉపనిషత్తు అది మొత్తం క్షేమాన్ని కలుగజేస్తుందని ఎందుకు అంటున్నది? ఒక వ్యక్తి తన మాటలవల్ల ఎంతో కీర్తిప్రతిష్ఠలు పొందగలడు, లేదా మరణాన్ని కూడా కోరితెచ్చుకోగలడు అని అర్థం.

**లక్ష్మీర్వసతి జిహ్వాగ్రే। జిహ్వాగ్రే మిత్రబాన్ధవాః**
**బన్ధనం చైవ జిహ్వాగ్రే। జిహ్వాగ్రే మరణం ధృవమ్ ॥**

నాలుకమీద లక్ష్మీదేవి నివసిస్తూంటుంది. నాలుక వల్లనే మిత్రులు, బంధువులు ఏర్పడుతారు. మనుష్యుల మధ్య సంబంధాలు మాటలవల్లనే పటిష్టం అవుతాయి. మాటల వల్లనే వీగిపోతాయి కూడా. మాట తూలితే వెనక్కి తీసుకోలేము. అందువల్ల నాలుకే మరణాంతకం కూడా! మంచి మాటలు మాట్లాడటానికి ఎందుకు వెనకాడాలి? **వచనే కా దరిద్రతా.** మంచి మాటలు మాట్లాడితే ఒంటరితనం బాధించదు. అదే మాట తూలితే, ఎంత అందగాడైనా, అతన్ని చూసి ఆమడదూరం పారిపోతారు.

**యోగక్షేమ ఇతి ప్రాణాపానయోః (బ్రహ్మ ఉపాసీత)** – ప్రాణ అపానాలలో యోగక్షేమ రూపంలో బ్రహ్మను ఉపాసించాలి. ప్రాణం అంటే మనం వదిలే శ్వాస – ప్రాగ్ గమనవాన్ వాయుః; అపానం అంటే మనం పీల్చే శ్వాస – అథోగమనవాన్ వాయుః.

ఆ విధంగా బ్రహ్మను ఉచ్ఛ్వాస నిశ్వాసలకు కారణంగా ఉపాసన చేయాలి. ఈ రెండు శ్వాసలు యోగక్షేమాలు. యోగం అంటే **అప్రాప్తస్య ప్రాప్తిః యోగః**. మన దగ్గర లేనిదానిని సంపాదించుకోవటం. క్షేమం అంటే అలా సంపాదించుకున్నదానిని నిలబెట్టుకోవటం. **ప్రాప్తస్య రక్షణం క్షేమః**. యోగక్షేమాలు మనం ఉంటేనే ఉంటాయి; అంటే మనం శ్వాస పీల్చి, వదులుతుంటేనే అవి ఉంటాయి. మనం శ్వాస పీల్చటం మానేస్తే (మరణిస్తే) అవి మనకు ఏమీ ఉపయోగం కావు. ఈ విషయాన్ని అద్భుతంగా వివరించే కౌంటు లియో టాల్‌స్టాయ్ కథ ఒకటి ఉంది.

ఒక ధనవంతునికి చాలా భూమి ఉంది. అతను ఎవరికైనా కోరినంత భూమి ఇస్తానన్నాడు. కాకపోతే ఒక షరతు విధించాడు. ఏమిటది? అతను సూర్యోదయంనుంచి సూర్యాస్తమయం వరకూ పరుగు తీయాలి. అతను పరుగులు తీసినంత మేరకు భూమి అతని పరం అవుతుంది. ఒక వ్యక్తి అన్నపానాదులు కూడా స్వీకరించకుండా పరుగులు తీస్తూనే ఉన్నాడు.

సూర్యాస్తమయానికి కొన్ని ఘడియలు మిగిలాయి. బాగా రొప్పుతున్నాడు. శ్వాస ఆగిపోయే పరిస్థితి. అయినా ఇంకొంచెం పరుగు తీస్తే ఇంకొంచెం భూమి స్వంతం చేసుకోవచ్చు అని అడుగులు వేసాడు. ఫలితం – అక్కడే తుదిశ్వాస వదిలాడు. ఎవరికోసం ఆ పరుగులు తీసినట్టు? తనే లేకపోయాక ఆ ఆస్తినెలా అనుభవిస్తాడు? ప్రాణాపానాలు సవ్యంగా పనిచేస్తున్నంతసేపే యోగక్షేమాలు ఉంటాయి. అందువల్ల ప్రాణాపానాలమీద బ్రహ్మ ఉపాసన చేయాలి.

**కర్మేతి హస్తయోః (బ్రహ్మ ఉపాసీత)** – చేతులమీద పని రూపంలో ఉన్న బ్రహ్మను ఉపాసించాలి. ధర్మ, అర్థ, కామాలను కర్మ ద్వారానే పొందగలము. నిజానికి మోక్షం కూడా పరోక్షంగా కర్మమీదే ఆధారపడి వస్తుంది. మోక్షం ఎలా కర్మవల్ల వస్తుంది? మోక్షం జ్ఞానంవల్లనే కదా కలుగుతుంది? మోక్షం జ్ఞానంవల్లనే కలుగుతుంది కాని, కర్మ చేస్తే చిత్తశుద్ధి కలుగుతుంది. చిత్తశుద్ధివల్ల జ్ఞానం వస్తుంది. జ్ఞానం వల్ల మోక్షం వస్తుంది.

**కర్మణా చిత్తశుద్ధిః చిత్తశుద్ధ్యా జ్ఞానప్రాప్తిః జ్ఞానప్రాప్త్యా మోక్షః**

శ్రీరుద్ర పారాయణ చివర్లో భక్తులు తన ఎడమచేతిని భగవంతునిగా కీర్తిస్తారు.

**అయం మే హస్తో భగవత్తరః**

ఎడమచేయే భగవంతుడు అయితే, పుణ్యకార్యాలు చేసే కుడిచేయి ఇంకెంత గొప్పదై ఉండాలి? అందువల్ల పుణ్యకార్యాలు రెండు చేతుల ద్వారా చేస్తాము. నిజానికి మనం చేతుల గొప్పదనం గ్రహించము. వాటిని పట్టించుకోము. చేతికి ఏ ఫ్రాక్చరో అయితేనో, పక్షవాతం వస్తేనో గాని దాని విలువ తెలుసుకోము. ఇలా శ్రీరుద్రం రోజూ చదివితే, చేతుల విలువ గుర్తుంచుకుంటాము.

**గతిరితి పాదయోః (బ్రహ్మ ఉపాసీత)** – చేతులను మెచ్చుకునే ధ్యాసలోపడి, కాళ్ళయొక్క ప్రాముఖ్యతను మర్చిపోకూడదు. చేతులతో కర్మ చేయాలంటే, కాళ్ళతో పూజగది దాకానో, శివుని గుడి దాకానో వెళ్ళగలగాలి కదా. అంటే చేతులు మంచిపనులు చేయాలంటే, కాళ్ళు అక్కడికి తీసుకువెళ్ళాలి. అందువల్ల కాళ్ళమీద నడకరూపంలో ఉన్న బ్రహ్మను ఉపాసించాలి.

**విముక్తిరితి పాయౌ (బ్రహ్మ ఉపాసీత)** – విసర్జనేంద్రియంమీద, విడిచిపెట్టే రూపంలో ఉన్న బ్రహ్మను ఉపాసించాలి. పాయువు అంటే విసర్జనేంద్రియం. విముక్తి అంటే మనం నేర్చుకునే మోక్షం కాదు; ఇక్కడ విముక్తి అంటే శరీరంలో ఉన్న వ్యర్థపదార్థాలనుంచి విముక్తి పొందటం. ఈ ఉపాసననుంచి మనం నేర్చుకునే గొప్ప పాఠం, శరీరంలోని ప్రతిభాగమూ పవిత్రమైనదే. అశుద్ధం అనుకునే పాయువుమీద కూడా ఉపాసన చేయమని వేదాంతం అంటున్నది. ఎందుకంటే, అది శరీరాన్ని శుద్ధి చేస్తుంది. అందువల్ల శరీరం ఆరోగ్యంగా ఉంటుంది.

పాయువు విలువ కూడా అది తన పని తాను చేసుకుంటూ పోతున్నంతవరకూ తెలియదు. ఏ మలబద్ధకమో, విరోచనాలు పట్టుకుంటేనో దాని విలువ తెలుస్తుంది.

శీక్షావల్లీలో కూడా మనను మనం పవిత్రంగా భావించుకోవాలని వస్తుంది. మనని మనం కించపరుచుకునే అలవాటు ఉంటే, వేదాంతం నేర్చుకోలేము. వేదాంతం నేర్చుకున్నాక అహం బ్రహ్మ అస్మి అని చెప్పగలగాలి. మనను మనమే గౌరవించుకోలేకపోతే, ఎదుటివారు మనను ఎలా గౌరవిస్తారు? దయానందస్వామీజీ అంటారు – ఎవరైనా నువ్వు చాలా మంచివాడివి అంటే మీరు ఆశ్చర్యంగా అవునా, ఏ విషయంలో అంటారు. అలా మిమ్మల్ని మీరు కించపరచుకోకూడదు. ఈ విషయం అర్థం చేసుకోవాలి

ఇంకొక ముఖ్యమైన పాఠం – దేహాన్ని ద్వేషించకూడదు. ఆత్మజ్ఞానం పొందితే ఈ శరీరం అనాత్మ అని నేర్చుకుంటాము. అది అనాత్మ కాబట్టి దేహాభిమానం పెంచుకోవద్దు అంటుంది. కాని వచ్చిన చిక్కేమిటంటే, దేహాభిమానం పెంచుకోవద్దు అంటే దేహద్వేషాన్ని పెంచుకుంటారు కొంతమంది. అలా విపరీతధోరణికి పోకూడదనే శాస్త్రం ఈ కార్యకరణసంఘాతం పవిత్రమైనదనీ, దీన్ని ఉపయోగించే మోక్షం పొందాలనీ చెబుతున్నది. అందువల్ల దేహంలోని అంగాలమీద ఉపాసన.

**దేహే ఈశ్వరబుద్ధిః కర్తవ్యా**

**ఇతి మానుషీస్సమాజ్ఞాః** – దీనితో అధ్యాత్మిక ఉపాసన అయిపోయింది. ఉపనిషత్తు ఇక్కడితో అధ్యాత్మిక ఉపాసన అయిపోయింది అంది కాని, అధిదైవ ఉపాసన చివర్లో ఇంకొక అధ్యాత్మిక ఉపాసన వచ్చింది. ఇది వేదమంత్రం కాబట్టి మనం శాస్త్రాన్ని తప్పు పట్టకూడదు. ముందు దాన్ని చూశాక, ముందుకు వెళదాము.

**ప్రజాతిరమృతమానంద ఇత్యుపస్థే।**

**వివరణ**

**ప్రజాతిరమృతమానంద ఇత్యుపస్థే (బ్రహ్మ ఉపాసీత)** – ఉపస్థలో సంతానం రూపంలో ఉన్న బ్రహ్మను ఉపాసించాలి. ఉపస్థ అంటే జననేంద్రియం. గుర్తుంచుకోండి, మన వైదిక సాంప్రదాయంలో ఏదీ అమంగళకరం కాదు; దేన్నీ త్రోసిపుచ్చకూడదు. మన శరీరంలో ఉన్న ప్రతి ఒక్క అంగానికీ ఒక ప్రత్యేక విధి ఉంది. అసలు ఏ పరికరాన్ని కూడా ధార్మికం లేదా అధార్మికం అని పేరు పెట్టకూడదు. దానికా పేరు మనం వాడేదాన్ని బట్టి వస్తుంది. ఉదాహరణకు కత్తిని ఉపయోగించి ఎవరినైనా చంపితే అది అధార్మికం; అదే కత్తితో కూరగాయలను కోస్తే అది ధార్మికం.

జననేంద్రియం మూడు పనులను చేస్తుంది – ప్రజాతిః, అమృతమ్, ఆనందః.

**ప్రజాతిః** – తన సంతతిని పెంపొందించే శక్తి.

**అమృతమ్** – శాశ్వతత్త్వం. ముందు అంశాన్ని పునఃపరిశీలిస్తే, తన సంతతి ద్వారా వంశాభివృద్ధి జరిగి, తను శాశ్వతంగా ఉంటాడు. ఎవరైనా మరణించినప్పుడు వేసే వార్తల్లో 'అతని భార్య, ఇద్దరు పిల్లలు జీవించివున్నారు,' అని వస్తుంది. అంటే వారి రూపంలో ఇతను జీవించే ఉంటాడు.

**ఆనందః** – శాశ్వతత్త్వం ఎప్పుడు ఆనందమే. మరణించిన తండ్రి ఫోటో పెట్టుకోవటమో లేదా మనవళ్ళకు వారి పేరు పెట్టటమో చేయటం ద్వారా చిరకాలం నిలిచేలా చేస్తారు. అదీ కాదంటే, వారి పేర ఏ దానధర్మాలో చేస్తారు. అలా చిరకాలం నిలిచిపోవాలనే ఆశ మనిషిలో స్వతఃసిద్ధంగా ఉంటుంది. అందువల్లనే మరణం దుఃఖాన్ని కలుగజేస్తుంది. ఆ విధంగా, ఉపస్థ పిల్లల ద్వారా ఆనందాన్ని కలుగజేస్తుంది.

ఇంకా చెప్పాలంటే ఉపస్థేంద్రియం ప్రత్యక్షంగా సంతతిని కలుగజేసి, పరోక్షంగా శాశ్వతత్త్వానికి దారితీసి, తద్వారా ఆనందాన్ని కలుగజేస్తుంది. అందువల్ల ఈ మూడు గుణాలమీద ఉపాసన చేయాలి.

శంకరాచార్యులవారు ఎంత లోతుగా విశ్లేషిస్తారో ఇక్కడ మనకు తెలుస్తుంది. సాధారణంగా ఏదైనా కర్మ లేదా ఉపాసన గురించి శాస్త్రం చెబితే, వెంటనే దానివల్ల కలిగే ఫలం గురించి కూడా చెబుతుంది. కాని ఇక్కడ ఎందువల్లనో చెప్పలేదు. మనం దాన్ని కలుపుకోవచ్చు అంటున్నారు శంకరులవారు. ఫలం కూడా మళ్ళీ అది చేసే విధానాన్నిబట్టి మారుతుంది. నిష్కామ ఉపాసనగా చేస్తే అంతకుముందు చూసినట్టే చిత్తశుద్ధి, చిత్త ఏకాగ్రత, చిత్తవిశాలత కలుగుతాయి. సకామంగా చేస్తే, ఉపాసనకొక నియమం ఉంది. దాన్ని ఇక్కడ గుర్తు తెచ్చుకోవచ్చును.

**యథా యథోపాసతే తదేవ భవతి** – శతపథ బ్రాహ్మణమ్

దేనిమీద ఉపాసన చేస్తే, అది పొందుతాడు. ఆ ఫలాలేమిటో చూద్దాము.

**అధ్యాత్మిక బ్రహ్మ ఉపాసన – ఫలం**

| **లక్షణం** | **అంగం** | **ఫలం** |
|---|---|---|
| క్షేమ | వాక్కు | క్షేమంగా ఉంటారు |
| యోగక్షేమం | ప్రాణ అపాన | వస్తువులను పొంది, పదికాలాలు నిలుపుకుంటారు |
| కర్మ | పాణి | కర్మలు ఎక్కువగా చేసే శక్తి |
| గతి | పాదం | కాళ్ళు శక్తివంతంగా ఉంటాయి |

| | | |
|---|---|---|
| విముక్తి | పాయువు | వ్యర్థపదార్థాలనుంచి విముక్తి |
| ప్రజాతిరమృతమానందః | ఉపస్థం | సంతానం, శాశ్వతత్త్వం, ఆనందం కలుగుతాయి |

**అథ దైవీః। తృప్తిరితి వృష్టౌ। బలమితి విద్యుతి। యశ ఇతి పశుషు। జ్యోతిరితి నక్షత్రేషు। సర్వమిత్యాకాశే।**

**ఉపాసన 3 – అధిదైవిక బ్రహ్మ ఉపాసన** – ఇంతవరకూ అధ్యాత్మిక బ్రహ్మ ఉపాసన చూశాము; ఇప్పుడు అధిదైవిక బ్రహ్మ ఉపాసన చూడబోతున్నాము.

**అథ దైవీః (సమాజ్ఞా)** – సమాజ్ఞా మనం కలుపుకోవాలి. దైవీ అంటే అధిదైవికం. ఇందులో ప్రకృతిలో ఉన్న అధిష్ఠాన దేవతలను బ్రహ్మయొక్క విభూతిగా తీసుకోవాలి.

**తృప్తిరితి వృష్టౌ (బ్రహ్మ ఉపాసీత)** – వర్షంలో తృప్తిరూపంలో ఉన్న బ్రహ్మను ఉపాసించాలి. వృష్టి అంటే వర్షం. మానవజాతికంతటికీ వర్షం ఎంతో ముఖ్యం. వర్షం పంటలను పండించటం ద్వారా ప్రత్యక్షంగా తృప్తిని ఇస్తే, పరోక్షంగా వేరే కారణాల ద్వారా తృప్తిని ఇస్తుంది. ప్రాథమిక తృప్తి శారీరకం. సమృద్ధిగా పంటలను పండించి, ఆకలిని తీర్చటం ద్వారా తృప్తిని ఇస్తుంది. అంతేకాదు, వర్షం సక్రమంగా పడితే, దేశ ఆర్థిక పరిస్థితి బాగుండి, మనుషులకు తృప్తిని ఇస్తుంది. ఈ విషయాన్ని ప్రశ్న, ఛాందోగ్య, బృహదారణ్యకోపనిషత్తులలో అనేక సందర్భాలలో చూస్తాము. తిరుక్కురళ్, తిరువళ్ళువర్ మహాత్ముల విభూతులు వర్ణించిన వెంటనే ఆకాశం, మేఘాలు, వర్షంయొక్క విభూతులను వర్ణిస్తాయి.

**బలమితి విద్యుతి (బ్రహ్మ ఉపాసీత)** – మెరుపులో బలం లేదా శక్తిరూపంలో ఉన్న బ్రహ్మను ఉపాసించాలి. మెరుపుమీద ఉపాసనను కేనోపనిషత్తులో కూడా చూస్తాము. అందులో బ్రహ్మ యక్షుని రూపంలో ఒక మెరుపులా మెరిసి, మాయమవుతాడు. ఒక్క మెరుపు మెరిస్తేనే అందులో ఎంతో శక్తి ఉంటుంది, కాని దురదృష్టవశాత్తూ మానవాళికి ఆ శక్తిని విద్యుచ్ఛక్తిగా వినియోగించుకునే సాంకేతిక పరిజ్ఞానం ఇంకా రాలేదు.

**యశ ఇతి పశుషు (బ్రహ్మ ఉపాసీత)** – పశువుల్లో కీర్తిరూపంలో ఉన్న బ్రహ్మను ఉపాసించాలి. పశువు అంటే ఆవు; పూర్వకాలంలో ఆవులను కూడా సంపదగా భావించేవారు. ఆవులను దక్షిణగా ఇచ్చేవారు. జనక మహారాజు పండితుల సభను ఏర్పాటుచేసి వేదవిత్తునకు వేయి ఆవులను బహుమానంగా ఇస్తానని ప్రకటించాడు బృహదారణ్యకోపనిషత్తులో. పూర్వం ఎంత ఎక్కువ పశుసంపద ఉంటే, అతని కీర్తిప్రతిష్ఠలు కూడా అంత ఎక్కువగా ఉండేవి. ఎందుకంటే అంత సంపద ఉన్న వ్యక్తి ధార్మికపనులకే తన సంపదను ఉపయోగిస్తాడని శాస్త్రం భావిస్తున్నది. అతని సమాజసేవ అతనికి కీర్తిని తెచ్చిపెడుతుంది.

**జ్యోతిరితి నక్షత్రేషు (బ్రహ్మ ఉపాసీత)** – నక్షత్రాల్లో జ్యోతిరూపంలో ఉన్న బ్రహ్మను ఉపాసించాలి.

**యదాదిత్యగతం తేజః జగద్భాసయతేఽఖిలమ్ ।**
**యచ్చంద్రమసి యచ్చాగ్నౌ తత్తేజో విద్ధి మామకమ్ ॥** – గీత 15.12

సమస్త జగత్తును ప్రకాశింపజేసే సూర్యుని తేజస్సు, చంద్రుని తేజస్సు, అగ్ని తేజస్సు నా తేజస్సే అని తెలుసుకో అంటున్నాడు కృష్ణపరమాత్మ.

ఇలా అధిష్ఠాన దేవతలమీద ఉపాసనలు చేయటం ద్వారా ఈ మొత్తం విశ్వాన్ని ఈశ్వర విభూతిగా చూడగలుగుతాము. సర్వత్ర ఈశ్వరదర్శనం చేయించటమే శాస్త్రంయొక్క ముఖ్యోద్దేశం. ఈశ్వరుణ్ణి విశ్వంలోనే కాదు, మన శరీరంలో కూడా దర్శించాలి.

అధ్యాత్మిక ఉపాసనకు ఫలం చెప్పనట్టే అధిదైవిక ఉపాసనకు కూడా ఉపనిషత్తు ఫలాన్ని చెప్పలేదు. అక్కడలాగే, ఇక్కడ కూడా కలుపుకోవాలి. ఇది సకామ ఫలం.

**అధిదైవిక బ్రహ్మ ఉపాసన – ఫలం**

| **లక్షణం** | **దేవత** | **ఫలం** |
|---|---|---|
| తృప్తి | వృష్టి | తృప్తి కలుగుతుంది |
| బలం | మెరుపు | బలం/శక్తి కలుగుతుంది |
| యశస్సు | పశువు | యశస్సు పొందుతాడు |
| జ్యోతి | నక్షత్రాలు | కీర్తిమంతుడవుతాడు |

నిష్కామఫలం చిత్తశుద్ధి, చిత్తఏకాగ్రత, చిత్తవిశాలత.

**సర్వమ్ ఇతి ఆకాశే (బ్రహ్మ ఉపాసీత)** – ఆకాశంలో సర్వంగా ఉన్న బ్రహ్మను ఉపాసించాలి. ఆకాశ ఉపాసన అన్నింటికన్నా చాలా సూక్ష్మమైన ఉపాసన. అందువల్ల దీన్ని కొంత విశ్లేషిద్దాము.

**ఆకాశాద్వాయుః వాయోరగ్నిః అగ్నేరాపః అద్భ్యః పృథివీ** – బ్రహ్మానందవల్లీ 1

ఆకాశంనుంచి పంచభూతాల్లోని తక్కిన నాలుగు వచ్చాయి. అంటే ఆకాశం కారణం, తక్కినవన్నీ కార్యం. అన్నీ ఆకాశంనుంచి పుట్టాయి అంటే ఆకాశానికి భిన్నంగా దేనికీ ఉనికి లేదని అర్థం.

**కారణ రూప ఆకాశే సర్వకార్యరూప జగత్**

భగవద్గీతలో ఆకాశానికీ బ్రహ్మకు చాలా దగ్గర పోలికలు ఉన్నాయని చూశాము. అందువల్ల ఆకాశం, బ్రహ్మ ఉపాసనకు శ్రేష్ఠమైన ఆలంబన.

**యథా సర్వగతం సౌక్ష్మ్యాత్ ఆకాశం నోపలిప్యతే ।**
**సర్వత్రావస్థితో దేహే తథాత్మా నోపలిప్యతే ॥** – గీత 13.33

అంతటా వ్యాపించివున్న ఆకాశం సూక్ష్మం అవటంవల్ల వాటి గుణదోషాలు ఆకాశానికి అంటవు. అలాగే అన్ని ప్రాణులలోనూ స్థితమై ఉన్న ఆత్మ నిర్గుణమవటంవల్ల వాటి గుణదోషాలు ఆత్మకు అంటవు.

అంతేకాదు, ఆకాశానికీ, బ్రహ్మకూ చాలా సమాన లక్షణాలు ఉన్నాయి. అవి సూక్ష్మం, ప్రత్యక్ష అగోచరం, అసంగం, అఖండం, ఏకం, సర్వగతం, సర్వాధారం. అందువల్ల ఆకాశ ఉపాసన చేయటం నేర్చుకుంటే, మన బుద్ధి పదునుగా, సూక్ష్మంగా తయారై, సూక్ష్మాతి సూక్ష్మమైన ఆత్మను అర్థం చేసుకోవటానికి సిద్ధంగా ఉంటుంది. అందువల్ల ఆకాశ ఉపాసన గురించి ఇప్పుడు వివరంగా చెప్పుకొస్తున్నది ఉపనిషత్తు.

**సర్వమిత్యాకాశే। తత్ ప్రతిష్ఠేత్యుపాసీత। ప్రతిష్ఠావాన్ భవతి। తన్మహ ఇత్యుపాసీత। మహాన్ భవతి। తన్మన ఇత్యుపాసీత। మానవాన్ భవతి। తన్నమ ఇత్యుపాసీత। నమ్యన్తే౽స్మై కామాః। తద్బ్రహ్మేత్యుపాసీత। బ్రహ్మవాన్ భవతి। తద్ బ్రహ్మణః పరిమర ఇత్యుపాసీత। పర్యేణం మ్రియన్తే ద్విషన్తస్సపత్నాః। పరి యే౽ప్రియా భ్రాతృవ్యాః।**

**ఉపాసన 4 – ఆకాశ ఉపాసన** – ఆకాశంలోని ఒక్కొక్క మహిమను తీసుకుని, దానిమీద ఉపాసన చేస్తాము. అలా చేయటంవల్ల కంటికి కనబడని, ప్రమేయం కాని ఆకాశాన్ని ప్రమేయంగా ఉపాసన చేయటం నేర్చుకుంటాము.

**తత్ ప్రతిష్ఠా ఇతి ఉపాసీత** – ప్రతిష్ఠ అంటే ఆధారం. ఇక్కడ శంకరాచార్యులవారు ఒక విషయాన్ని గ్రహించాలి అంటున్నారు. ఇక్కడ ఆకాశం అంటే జడమైన ఆకాశంగా కాకుండా, ఆకాశదేవతగా భావించాలి అంటున్నారు. విష్ణుసహస్రనామంలో విశ్వాధారం గగన సదృశమ్ అని చూస్తాము. విశ్వానికి ఆధారంగా ఉపాసన చేయాలి.

**ప్రతిష్ఠావాన్ భవతి –** ప్రతిష్ఠమీద ఉపాసన చేస్తే అతను కూడా అందరికీ ఆధారం అవుతాడు.

నిజానికి మనం శారీరకంగా, మానసికంగా, ఆర్థికంగా బలంగా ఉన్నన్నాళ్ళూ ఆధారం గురించి ఆలోచించము. వయస్సు పెరిగినకొద్దీ, క్రమేపీ బలహీనత పొడచూపి, ఆధారం కోసం వెతుకుతాము. పిల్లలకు మనమీద అపారంగా ప్రేమ ఉన్నా, వారు ఎక్కడో దూర దేశాల్లో ఉంటే, మనకు అవసరానికి రాగలరో లేదో అనే చింత ఉంటుంది. ఈ ఉపాసన చేస్తే, మనకు అవసరమైన ఆశ్రయం దొరుకుతుంది. ఏమిటా నమ్మకం? కృష్ణపరమాత్మే ఇచ్చాడా హామీ!

**అనన్యాశ్చిన్తయన్తో మాం యే జనాః పర్యుపాసతే ।**
**తేషాం నిత్యాభియుక్తానాం యోగక్షేమం వహామ్యహమ్ ॥** – గీత 9.22

ఎవరైతే నన్నే నిరంతరం అనన్యభక్తితో ప్రార్థన చేస్తారో, వారి యోగక్షేమాలను నేనే చూస్తాను.

**తన్మహ ఇత్యుపాసీత** – తత్+మహః. తత్ అంటే ఆకాశదేవత. ఆకాశంలో మహత్తు రూపంలో బ్రహ్మను ఉపాసించాలి.

**మహాన్ భవతి** – ఉపాసకుడు కూడా గొప్పవాడు అవుతాడు.

**తన్మన ఇత్యుపాసీత** – తత్+మనః. ఇక్కడ మనః అంటే బుద్ధి. మానుతే అనేన ఇతి మనః. ఆకాశంలో మనస్సు రూపంలో బ్రహ్మను ఉపాసించాలి. దానికి ఫలం ఏమిటి?

**మానవాన్ భవతి** – ఉపాసకుడు గొప్ప మేధావి అవుతాడు.

**తన్నమ ఇత్యుపాసీత** – తత్+నమః. ఆకాశంలో నమస్కార రూపంలో బ్రహ్మను ఉపాసించాలి.

**నమ్యంతేఽస్మై కామాః** – అస్మైకామాః నమ్యంతే – అతని కోరికలన్నీ ఆ ఉపాసకునికి దాసోహం అంటాయి. అతను కోరకుండానే, అతని చెంతకు వచ్చి, అతనికి సేవ చేస్తాయి. ఇక్కడ కామాః అంటే కోరిన వస్తువులు. అతను ఆకాశంలో నమస్కార రూపంలో బ్రహ్మను ఉపాసిస్తే, కోరికలన్నీ వెతుక్కుంటూ వస్తాయి అంటే అతని కోరికలు తీరుతాయి.

**తద్బ్రహ్మేత్యుపాసీత** – ఆకాశంలో ఆకాశతత్త్వాన్ని నిర్గుణబ్రహ్మగా ఉపాసించాలి.

**బ్రహ్మవాన్ భవతి** – ఈ ఉపాసకుడు కూడా అనంతం అవుతాడు. అంటే శారీరకంగా కాదు, అతని కీర్తిప్రతిష్ఠలు, అతని సంపద, అతని కుటుంబం అన్నీ అపారంగా ఉంటాయి. ఆ రోజుల్లో పెద్ద కుటుంబం ఉండటం కూడా గొప్పగా భావించేవారు. ఆ విధంగా అతని కీర్తిప్రతిష్ఠలు అనంతంగా ఉంటాయి.

**తద్బ్రహ్మణః పరిమర ఇత్యుపాసీత** – తత్+బ్రహ్మణః. ప్రతి ఉపాసనలోనూ తత అంటే ఆకాశతత్త్వం. పరిమరః అంటే నాశకారణం.

**పరితః సర్వం రియన్తే అనేన ఇతి పరిమరః**

ఆకాశతత్త్వంలో నాశకారణంగా బ్రహ్మను ఉపాసించాలి. ఎందుకంటే ప్రళయంలో అన్నీ చివరికి ఆకాశంలో లయమవుతాయి. సృష్టి జరిగినప్పుడు ఆకాశంనుంచి వాయువు, అగ్ని, జలం, పృథివి వస్తే, ప్రళయంలో వెనకనుంచి లయ జరగుతూ వస్తుంది. అంటే పృథివి జలంలో, జలం అగ్నిలో, అగ్ని వాయువులో, వాయువు ఆకాశంలో లయమవుతాయి. అంటే అన్నీ చివరికి ఆకాశంలో లయమవుతాయి. ఆకాశతత్త్వంలో ఉన్న సంహారశక్తిమీద ఉపాసన చేస్తే ఉపాసనకుని శత్రువులందరూ సంహరించబడతారు అంటున్నది ఉపనిషత్తు.

ఉపనిషత్తు శత్రువులను రెండు తెగల కింద విభజించింది. మిమ్మల్ని ద్వేషించేవారు, మీరు ద్వేషించేవారు. అంటే కొంతమందికి మీమీద ద్వేషం ఉంటే, మరికొంతమందిమీద మీకు ద్వేషం ఉంటుంది.

**ద్విషన్తస్సపత్నాః** – సపత్నాః అంటే శత్రువులు. ద్విషంతః అంటే మిమ్మల్ని ద్వేషించేవారు.

**అప్రియా భ్రాతృవ్యాః** – భ్రాతృవ్యః అంటే శత్రువులు. అప్రియః అంటే మీరు ద్వేషించేవారు. ఒక్కమాటలో చెప్పాలంటే శత్రువులందరూ,

**పరిమ్రియంతే** – మరణిస్తారు.

ఉపనిషత్తు ఇలా మీ శత్రువులందరూ నశిస్తారని చెబుతుంటే దాన్ని మీరు అంత తేలిగ్గా స్వీకరించలేరు. ఎందుకు? మిమ్మల్ని కొంతమంది ద్వేషించవచ్చు; మీరు మరో కొంతమందిని ద్వేషించవచ్చేమో కాని అంతమాత్రాన వారి నాశనం కోరుకుంటారా? ఇక్కడ ఖంగారు పడాల్సిందేమీ లేదు; నాశనం పదాన్ని అక్షరాలా తీసుకోకూడదు.

శత్రువులు నాశనమవుతారు అంటే శత్రుత్వభావన నాశనమవుతుందని అర్థం. ఎప్పుడైతే శత్రుత్వభావన నాశనమవుతుందో, అప్పుడే మీకు ఇంక శత్రువులంటూ ఉండరు. ఇప్పుడు ఈ అర్థంతో ఈ వాక్యాలను మళ్ళీ చూస్తే, మిమ్మల్ని ద్వేషించే శత్రువులు నాశనం అవుతారు అంటే వారు ఇంక మిమ్మల్ని ద్వేషించరు. అలాగే మీరు ద్వేషించే శత్రువులు నాశనం అవుతారు అంటే, వారిని మీరు ఇంక ద్వేషించరు. ఒక్కముక్కలో ఫలం చెప్పాలంటే –

– మీమీద మీ శత్రువుల దృక్పథంలో మార్పు వస్తుంది.

– మీ శత్రువులమీద మీ దృక్పథంలో మార్పు వస్తుంది.

ఇలా దృక్పథంలో మార్పు రావటంవల్ల మీలో ఉన్న ద్వేషభావనను నాశనం చేస్తారు. ఈశ్వరసృష్టి అద్భుతంగానే ఉంటుంది; మనమే దానికి మన రాగద్వేషాలను పులిమి దానిని విషపూరితం చేస్తున్నాము.

**సంపూర్ణం జగదేవ నందనవనం సర్వేఽపి కల్పద్రుమా**

ఈ జగత్తు మొత్తం నందనవనం అంటారు శంకరాచార్యులవారు.

**అద్వేష్టా సర్వభూతానాం మైత్రః కరుణ ఏవ చ**

నా భక్తుడు ఏ ప్రాణిమీద ద్వేషభావం లేనివాడు. అన్నింటిమీద అవ్యాజమైన ప్రేమ, కరుణ కలవాడు అంటాడు కృష్ణపరమాత్మ.

మూడవ ఉపాసన ఆకాశ ఉపాసన. దాని ఫలం ఉపనిషత్తే చెప్పినా కూడా మళ్ళీ పట్టికలో చూద్దాము.

**ఆకాశ ఉపాసన – ఫలం**

| **లక్షణం** | **ఆలంబన** | **ఫలం** |
|---|---|---|
| ప్రతిష్ఠా | ఆకాశం | అందరికీ ఆధారం అవుతాడు |
| మహః | ఆకాశం | గొప్పవాడు అవుతాడు |

| | | |
|---|---|---|
| మనః | ఆకాశం | గొప్ప మేధావి అవుతాడు |
| నమః | ఆకాశం | కోరికలన్నీ దాసోహం అవుతాయి |
| బ్రహ్మ | ఆకాశం | అనంతం అవుతాడు |
| పరిమర | ఆకాశం | శత్రువులు నాశనం అవుతారు |

దీనితో భృగువల్లీలోని ఉపాసన భాగం అయిపోయింది. మూడవ అధ్యాయంయొక్క ప్రధాన అంశం, జ్ఞానసాధనకు తోడ్పడే ఉపాసనలను నిర్దేశించటం. నిజానికి ఇక్కడితో ఉపాసనలు అయిపోయాయి కాబట్టి ఈ వల్లీ ఇంక శాంతిపాఠంతో ముగుస్తుంది అని భావిస్తారు ఎవరైనా.

3. **బ్రహ్మజ్ఞానఫలం – అనువాకం 10 (చివరిభాగం)** – బ్రహ్మజ్ఞానఫలం జీవన్ముక్తి; మనం విదేహముక్తిని కూడా కలుపుకోవాలి. ఇక్కడ జీవన్ముక్తిని నాలుగు రూపాల్లో వర్ణించింది ఉపనిషత్తు. అవి – పంచకోశ అభిమాన త్యాగః, సర్వ అభిమాన సహితత్వమ్, స్వతంత్రత్వమ్, ఆనందః.

కాని ఉపనిషత్తు ఆలోచన దానికి భిన్నంగా ఉంది. మామూలుగా మానవనైజం ఏమిటంటే, మనం చివరగా విన్నదాన్నో, చదివినదాన్నో గుర్తు పెట్టుకోవటం. అందువల్ల ఒకవేళ ఉపనిషత్తు ఈ ఉపాసనలతో ఇక్కడ ముగిస్తే, తైత్తిరీయోపనిషత్తు ఉపాసనలను మాత్రమే బోధిస్తుంది సుమా అని పొరపాటు పడే అవకాశం ఉంది. కాని మనం అలా పప్పులో కాలు వేయటం ఇష్టంలేదు ఉపనిషత్తుకు. తైత్తిరీయోపనిషత్తు ప్రధాన అంశం బ్రహ్మజ్ఞానం. దాన్ని మనం రెండవ అధ్యాయంలో వివరంగా చూశాము. ఉపాసన, ఈ బ్రహ్మజ్ఞానానికి రావటానికి తోడ్పడే సోపానం మాత్రమే. అందువల్ల భృగువల్లీ మళ్ళీ బ్రహ్మజ్ఞానం బోధించి, దానితో ముగించదలుచుకుంది.

బ్రహ్మజ్ఞాన సారాంశం ఏమిటి? జీవాత్మ–పరమాత్మ ఐక్యజ్ఞానం. దీన్ని రెండవ అనువాకంలో ఒక మహావాక్యంతో చూశాము.

**స యశ్చాయం పురుషే యశ్చాసావాదిత్యే। స ఏకః॥**

ఇప్పుడు రాబోయే భాగంలో ఇదే మహావాక్యాన్ని మళ్ళీ చెప్పి, ఆ బ్రహ్మజ్ఞానఫలాన్ని కూడా చెప్పబోతున్నది.

**స యశ్చాయం పురుషే। యశ్చాసావాదిత్యే। స ఏకః। స య ఏవంవిత్। అస్మాల్లోకాత్ ప్రేత్య। ఏతమన్నమయమాత్మానముపసంక్రమ్య। ఏతం ప్రాణమయమాత్మానముపసంక్రమ్య। ఏతం మనోమయమాత్మానముపసంక్రమ్య। ఏతం విజ్ఞానమయమాత్మానముపసంక్రమ్య। ఏతమానందమయమాత్మానముపసంక్రమ్య।**

**ఎ) పంచకోశ అభిమాన త్యాగః**

ఈ భాగం బ్రహ్మానందవల్లీలో ఎనిమిదవ అనువాకాన్నే మళ్ళీ చెబుతున్నది. కాకపోతే వ్యాకరణపరంగా చిన్న భేదం ఉంది. బ్రహ్మానందవల్లీలో ఉపసంక్రామతి అంటే ఇక్కడ భృగవల్లీలో ఉపసంక్రమ్య. రెండింటి అర్థం ఒకటే. ఇప్పుడు ఐక్యం గుర్తు చేస్తున్నది.

**యః (ఆనందః) పురుషే (వర్తతే)** – జీవాత్మలో ఉన్న ఆనంద ఆత్మా

**యః (ఆనందః) ఆదిత్యే (వర్తతే)** – ఆదిత్యునిలో ఉన్న ఆనంద ఆత్మా

**స ఏకః** – రెండూ ఒకటే.

ఆదిత్యుడు అంటే అసలు సూర్యుడు, కాని ఇక్కడ మనం సమష్టిగా లేదా ఈశ్వరునిగా తీసుకోవాలి. జీవాత్మ–పరమాత్మల ఐక్యం గురించి చెప్పేటప్పుడు, సాధారణంగా చైతన్యపరంగా వాటి ఐక్యం గురించి బోధిస్తుంది ఉపనిషత్తు.

**చైతన్య స్వరూప దృష్ట్యా ఐక్యమ్**

కాని ఇక్కడ ఆ ఐక్యాన్ని ఆనందపరంగా చూస్తున్నాము.

**ఆనంద స్వరూప దృష్ట్యా ఐక్యమ్**

ఏ బింబానందమైతే వ్యష్టిలో ఉందో, అదే బింబానందం సమష్టిలోనూ (హిరణ్యగర్భ ఉపాధిలోనూ) ఉంది. భేదాలు ఉన్నది ప్రతిబింబ ఆనందంలో. ఎందుకంటే ప్రతిబింబం దాన్ని ప్రతిబింబించే మాధ్యమాన్నిబట్టి ఉంటుంది. మాధ్యమం స్థాయినిబట్టి, ఆనందస్థాయి మారుతూ వస్తుంది. మనిషి అనుభవించే ప్రతిబింబ ఆనందంలో ప్రియ, మోద, ప్రమోదాలనే తారతమ్యాలు ఉంటాయని చూశాము. అలాగే ఉపాధినిబట్టి కూడా ప్రతిబింబం స్థాయి మారుతూ వస్తుంది. అందువల్లనే మనుష్యగంధర్వ ఆనందంకన్నా దైవగంధర్వ ఆనందం వందరెట్లు ఎక్కువని, అలా ఆనందం స్థాయిని పెంచుకుంటూ రావటాన్ని ఆనంద మీమాంసలో వివరంగా చూశాము.

బింబ ఆనందంలో అటువంటి స్థాయీభేదాలు ఉండవు. ఎందుకంటే అది శుద్ధ ఆనందం, అనుభవంలోకి వచ్చేది కాదు, ప్రమేయంగా తెలుసుకునేది కాదు; అది చైతన్యంయొక్క స్వరూపం. ఈ ఆనందం అందరిలోనూ ఒకటే. చైతన్యం ఎలాగైతే అన్నింటిలోనూ సమానంగా ఉందో, అదే విధంగా చైతన్యంయొక్క స్వరూపమైన ఆనందం కూడా అందరిలోనూ ఒకటే.

**స య ఏవంవిత్** – నేను ప్రతిబింబ ఆనందాన్ని కాను, నేను బింబ ఆనందాన్ని, ప్రతిబింబ ఆనందం ప్రతిబింబ మాధ్యమంలో ఏర్పడిన నాయొక్క ప్రతిబింబమే అని ఎవరైతే తెలుసుకుంటారో,

**అస్మాల్లోకాత్ప్రేత్య** – ఈ బాహ్యప్రపంచంమీద అతనికున్న అభిమానాన్ని వదులుకుంటాడు. నావారు, నా ఇల్లు, నా ఆస్తి అని బాహ్యావస్తువులతో మమేకం చెందటాన్ని మమకారం అంటారు. ఈ జ్ఞానం పొందితే అతను ఈ మమకారాన్ని వదులుకుంటాడు. ఎందుకంటే ఈ వస్తువులన్నీ తన స్థూలశరీరానికి చెందుతాయి కాని తనకు చెందవని తెలుసుకుంటాడు. అంటే బాహ్యప్రపంచం అనాత్మ అని అర్థం చేసుకుంటాడు కాబట్టి ఈ అభిమానం పోతుంది.

**ఏతమన్నమయమాత్మానముపసంక్రమ్య** – జ్ఞాని అభిమానత్యాగాన్ని చేస్తాడు. అంటే తన స్థూలశరీరంనుంచి విడివడతాడు. తను స్థూలశరీరం అనుకుని పొరపాటు పడడు. నా శరీరం అనుకుంటే అహంకారం; నావారు అనుకుంటే మమకారం. ఇప్పుడు అహంకారం కూడా పోతుంది.

**ఏతం ప్రాణమయమాత్మానముపసంక్రమ్య** – క్రమంగా ఒక కోశంనుంచి ఇంకొక కోశానికి వచ్చి, దాన్నించి కూడా విడివడుతూ వస్తాడు. అన్నమయంనుంచి విడివడి ప్రాణమయానికి వచ్చి, దాన్నించి కూడా విడివడతాడు.

**ఏతం మనోమయమాత్మానముపసంక్రమ్య** – ఇక్కడ కూడా అంతే. ప్రాణమయంనుంచి విడివడి, మనోమయానికి వచ్చి, ముందు మనోమయమే ఆత్మ అనుకుని, తరువాత దాన్నుంచి కూడా విడివడతాడు.

**ఏతం విజ్ఞానమయమాత్మానముపసంక్రమ్య** – మళ్ళీ అదే పద్ధతి. మనోమయంనుంచి విడివడి, విజ్ఞానమయమే ఆత్మ అనుకుని, తరువాత దాన్నుంచి కూడా విడివడతాడు జ్ఞాని. అలా ఒక్కొక్క కోశాన్ని అనాత్మగా త్రోసిపుచ్చుతాడు. ఎప్పుడైతే ఒక కోశాన్ని అనాత్మ అని అర్థం చేసుకుంటాడో అక్కడ వరుసగా ఐదు అంశాలను అర్థం చేసుకుంటాడు. అవి అనాత్మ నిశ్చయః, కార్యత్వ నిశ్చయః, నామరూప నిశ్చయః, మిథ్యాత్వ నిశ్చయః, ప్రవిలాపనమ్. ఇవన్నీ వివరంగా బ్రహ్మానందవల్లీలో చూశాము. అవి ఇక్కడ గుర్తు తెచ్చుకోవాలి. మయట్ కలిస్తే అది మార్పుకు లోనవుతుంది అని అర్థం. కాని నేను నిర్వికార ఆత్మను; సవికార అనాత్మను కాను అని జ్ఞాని అర్థం చేసుకుంటాడు.

**ఏతమానందమయమాత్మానముపసంక్రమ్య** – మళ్ళీ అదే పద్ధతి. విజ్ఞానమయకోశంనుంచి విడివడి, ఆనందమయమే ఆత్మ అనుకుని, తరువాత దాన్నించి కూడా విడివడతాడు. ఈ భృగువల్లీలో కూడా భృగువు పంచకోశవివేకం చేశాడని చూశాము. అతను ఈ ఐదవ కోశాన్ని వదిలేసి, సరాసరి ఆత్మకు వచ్చేశాడు. ఎందుకంటే పద్ధతి తెలుస్తే చాలు.

ఆనందమయం అంటే ప్రతిబింబ ఆనందం లేదా అనాత్మ ఆనందం. అది ఎంత గొప్ప ఆనందమైనా కూడా అది కూడా అనుభవంలోకి వచ్చేదే. అంటే దానికి కూడా రాకపోకలు

ఉంటాయి. కాబట్టి అది ఆత్మానందం కాదు. ఆనందమీమాంసలో చూశాము హిరణ్యగర్భ లోకంలో పొందే ఆనందాన్ని $10^{20}$గా చూశాము. అంటే ఒకటి తర్వాత ఇరవై సున్నాలు వస్తాయి. కాని అంతగొప్ప ఆనందం కూడా ప్రతిబింబానందమే, ఆత్మానందం కాదు.

ఎవరైనా నేను ఆత్మానందాన్ని అనుభవించాను అని చెబితే, అసలు ఆ వాక్యమే పరస్పర విరుద్ధంగా ఉంది. అనుభవించాను అంటే గతంలో అనుభవించాడు అని అర్థం. గతంలో అనుభవించాడు అంటే ఇప్పుడు లేదనేగా అర్థం? ఆత్మానందం మీ స్వరూపం. అందువల్ల అతను అనుభవించిన ఆనందం అనాత్మానందం అని అర్థం చేసుకోవాలి.

ఈ ఆత్మానందాన్ని అనుభవించటం ఎలా? మళ్ళీ ఆ ప్రశ్నే తప్పు. ఇందాక ఏమన్నాం? అనుభవంలోకి వచ్చింది అంటేనే అది గతంలో ఉంది కాని, వర్తమానంలో లేదన్నాము. అలా ఒక సమయంలో వచ్చి, ఇంకొక సమయంలో పోయేదాన్ని కార్యం అంటారు. కార్యం కారణం కాలేదు. అందువల్ల ఆ ఆనందం లెక్కలోకి రాదు. ధ్యానంలో పొందే ఆనందం, అలా అనాత్మానందంలోకి వస్తుంది కాని ఆత్మానందంలోకి రాదు. అందువల్ల ఆ ఆనందంతో మమేకం చెందకూడదు. నిజానికి అది ఒక ప్రతిబంధకం. దాన్ని సాంకేతిక పరిభాషలో రసాస్వాదం అంటారు.

**ఆత్మనిష్ఠః భవతి** – ఈ మహావాక్యాన్ని పూర్తి చేయటానికి మనం ఈ వాక్యాన్ని కలుపుకోవాలి. జ్ఞాని అలా అనుభవంలోకి రాని, ప్రమేయం కాని, సాక్షిచైతన్యమైన అహం ఆత్మా అనే జ్ఞానంలో నిలుస్తాడు.

**ఇమాం ల్లోకాన్ కామాన్నీ కామరూప్యనుసంచరన్। ఏతత్సామ గాయన్నాస్తే। హా3వు। హా3వు।హా3వు।। అహమన్నమహమన్నమహమన్నమ్। అహమన్నాదో3ఽ హమన్నాదో3 ఽ హమన్నాదః। అహగ్గ్ శ్లోకకృదహగ్గం శ్లోకకృదహగ్గం శ్లోకకృత్। అహమస్మి ప్రథమజా ఋతా3స్య। పూర్వం దేవేభ్యో అమృతస్య నా3భాయి। యో మా దదాతి స ఇదేవ మా3వాః। అహమన్నమన్నమదన్తమా3ద్మి। అహం విశ్వం భువనమభ్యభవా3మ్। సువర్న జ్యోతీః। య ఏవం వేద। ఇత్యుపనిషత్।**

ఇంతవరకూ బ్రహ్మజ్ఞానంయొక్క సారాంశం, దానివల్ల కలిగే పంచకోశ అభిమాన త్యాగం చూశాము. ఇప్పుడు జ్ఞానఫలం వస్తుంది. జ్ఞానఫలం జీవన్ముక్తి ఫలం. జీవన్ముక్తుడు పూర్ణత్వాన్ని అనుభవిస్తాడు. 'అహం పూర్ణః' అని చెప్పగలుగుతాడు. అది తాత్కాలికంగా వచ్చిన అనుభవం కాదు; కాని జ్ఞానం పొంది, తన స్వరూపం ఆత్మానందం అని తెలుసుకోవటంవల్ల వచ్చిన పూర్ణత్వం. అతను సంసారంనుంచి శాశ్వతంగా విడివడతాడు.

ఈ జ్ఞానఫలం, ఈ భాగంలో ఒక పాటరూపంలో వస్తుంది. జ్ఞాని పాట పాడుతున్నాడంటే, తన ఆనందాన్ని పాట రూపంలో వ్యక్తం చేస్తున్నాడన్నమాట. ఈ పాటను సామగానం

అంటారు. సామగానం ప్రత్యేకంగా ఉంటుంది. హా3వు హా3వు హా3వు అని వస్తుంది. అంతకుముందు కూడా హ్రస్వం, దీర్ఘం, ప్లుతం అనే పదాలను చూశాము. హ్రస్వం అంటే ఒక చిటికె వేసేటంత కాలంలో పలకాలి; దీర్ఘం రెండు చిటికెలు వేసేటంతకాలం పలకాలి. రెండుకన్నా ఎక్కువ ఉంటే దాన్ని ప్లుతం అంటారు. ఇక్కడ మూడు ఉంది కాబట్టి మూడు చిటికెలు వేసేటంతకాలం పలకాలి.

**బి) సర్వ అభిమాన సహితత్వమ్ –**

**అనుసంచరన్** – ఈ జ్ఞాని ఎవరితోనూ సంగత్వం పెంచుకోకుండా, యదేచ్ఛగా తిరుగుతాడు. ఈ జ్ఞానిని శంకరాచార్యులవారు పరమహంస పరివ్రాజిక జ్ఞాని అంటారు. అంటే సన్న్యాసిజ్ఞాని. ఎందుకంటే గృహస్థుజ్ఞాని ఆంతర సన్న్యాసం పాటించినా, అతను బాహ్యంగా సంగత్వం లేకుండా తిరగలేడు.

**సి) స్వతంత్రత్వమ్ –**

**ఇమాంల్లోకాన్** – ప్రపంచమంతటా తిరుగుతాడు. ఏ చెట్టుకిందో శయనిస్తాడు.

**కామాన్నీ** – ఇక్కడ కామా అంటే ఏది వస్తే అది అని అర్థం. అంటే ఏ ఆహారం ఇచ్చినా సంతోషంగా స్వీకరిస్తాడు.

**కామరూపీ** – సన్న్యాసి అవటంవల్ల అతనికి ప్రత్యేకించి ఈ పాత్ర ధరించాలనే నియమం ఏమీ లేదు. అందువల్ల ఎప్పుడే పాత్ర (రూపం) ధరించాల్సివస్తే అప్పుడా రూపాన్ని ధరిస్తాడు. సమాజం ఏదైనా పర్వదినాల్లో భక్తి కార్యక్రమాలను నిర్వచించమని కోరితే, అప్పుడు భక్తునిగా మారి పూజలు చేస్తాడు. అక్కడ కర్మకాండ గురించి ఎక్కువగా చెప్పి, వేదాంతం గురించి తక్కువగా మాట్లాడతాడు. శంకరమఠాల్లో ఉన్న ఆచార్యులు పూజలు చేస్తూ ఉంటారు. వారు వారికోసం చేయనవసరం లేకపోయినా, లోకశ్రేయస్సుకోసం చేస్తారు.

ముముక్షువులతో మాట్లాడాల్సివస్తే, గురువుగా మారి, వారికి బ్రహ్మవిద్యను బోధిస్తాడు. పిల్లల్లో పిల్లవాడిగా మారిపోతాడు; వ్యాకరణంలో ఆరితేరినవారికి వ్యాకరణం బోధిస్తాడు. మీమాంసకులకు మీమాంస బోధిస్తాడు. శిష్యులు వ్యక్తిగత సమస్యలతో వస్తే సలహాదారుడుగా మారతాడు! ఇలా ఒక పాత్రలోంచి ఇంకో పాత్రలోకి చాలా తేలికగా మారగలడు. ఎందుకంటే, ఆ పాత్రలన్నీ మిథ్యాపాత్రలనీ, తను వాటికి భిన్నంగా ఉన్నాడనీ తెలుసు ఆ జ్ఞానికి. శంకరాచార్యులవారు అటువంటి జ్ఞానిమీద **జీవన్ముక్తానందలహరి** అని రాశారు.

**డి) ఆనందః –**

**ఏతత్సామ గాయన్నాస్తే** – పైన చెప్పబడిన విధంగా తిరుగుతూ, ఈ క్రింది విధంగా సామగానం చేస్తాడు. సామ పదానికి రెండు అర్థాలు ఉన్నాయి. గానం; బ్రహ్మ. శంకరాచార్యులవారు ఇక్కడ సామ అంటే బ్రహ్మ అని అర్థం అంటున్నారు.

**సమత్వాద్ బ్రహ్మ ఏవ సామ**

అన్ని ప్రాణులలోనూ సమానంగా ఆత్మరూపంలో ఉంది బ్రహ్మ. జ్ఞాని ఈ పాటను, ఆ బ్రహ్మ తనే అనే జ్ఞానంతో పాడతాడు. బ్రహ్మమహిమ, తన మహిమే అనే జ్ఞానంతో పాడతాడు. నేనే అందరికన్నా గొప్పవాడను అంటుంటే, అది గర్వం కాదా?

**యద్యద్విభూతిమత్ సత్త్వం శ్రీమదూర్జితమేవ వా** – గీత 10.41

ఎవరిలో ఏ విభూతి ఉన్నాకూడా అది నా తేజస్సుయొక్క అంశంనుంచే కలిగినదిగా తెలుసుకో అంటున్నాడు కృష్ణపరమాత్మ. ఇక్కడేమో జ్ఞాని అన్నీ నా విభూతులే అంటున్నాడు. ఏది సరియైనది?

రెండూ సరియైనవే. మీరు అనాత్మతో మమేకం చెందితే, ఏ విభూతి కూడా మీకు చెందినది కాదు. ఎందుకంటే, అనాత్మపరంగా చూస్తే, మీరు వ్యష్టిలోకి వస్తారు. వ్యష్టి యొక్క విభూతి ఎప్పుడూ సమష్టికి చెందుతుంది. కార్యాకరణ సంఘాతపరంగా చూస్తే, మీరు అహంకారం అవుతారు. అందువల్ల మీ విభూతులన్నీ భగవంతునికే సమర్పించాలి. దాని బదులుగా మీరు అనాత్మ కాదు ఆత్మ అని అర్థం చేసుకుంటే, మీరు ఇంక వ్యష్టి కాదు, సమష్టిలోకి వస్తారు. అంటే అనంతం బ్రహ్మ అవుతారు. అప్పుడు అన్ని విభూతులు మీవే. దేహదృష్టితో శరణు వేడండి; ఆత్మదృష్టితో మీ విభూతుల గురించి పాడుకోండి.

**హా3వు హా3వు హా3వు** – సంస్కృతంలో హా అంటే అహో అని అర్థం. అహో అంటే ఆశ్చర్యం. అహో! ఎంత ఆశ్చర్యం అని పాడుతున్నాడు. ఏమిటా ఆశ్చర్యం?

నిర్గుణం, ఒక తతంగం ద్వారా ఎన్నటికీ సగుణం కాలేదు; నిర్వికారం ఎన్నటికీ సవికారం కాలేదు. కాని, ఎలాగో తార్కికంగా సాధ్యం కానిది సాధ్యమయింది; ఎప్పటికీ ముక్తుడయిన పరమాత్మ ఎలాగో బాధాతప్త సంసారి అయిన జీవాత్మగా మారాడు. ఎంత ఆశ్చర్యం! అది కూడా, అలాంటి ఇలాంటి ఆశ్చర్యం కాదు, కనీవినీ ఎరుగని ఆశ్చర్యం. అహో మూడుసార్లు చెప్పబడింది. అంటే అది ఆశ్చర్యంలోని స్థాయిలను పెంచుకుంటూ పోతున్నది. మొదటి హా3వు ఆశ్చర్యాన్ని సూచిస్తే, రెండవ హా3వు ఆశ్చర్యతరాన్ని సూచిస్తే, మూడవ హా3వు ఆశ్చర్యతమాన్ని సూచిస్తున్నది. ఇప్పుడు నేనెవరు అనే ప్రశ్న ఉదయిస్తుంది.

**అహమన్నమహమన్నమహమన్నమ్** – అహం అన్నమ్ అని మూడుసార్లు చెబుతున్నాడు. అన్నం అంటే భోగ్యప్రపంచం. నేనే అనుభవించబడే భోగ్యవస్తువును. ఆశ్చర్యంలోని హెచ్చుస్థాయిలను సూచించటానికి మూడుసార్లు చెప్పబడింది.

**అహమన్నాదోఽ 3 అహమన్నాదోఽ 3హమన్నాదః** – మళ్ళీ అహం అన్నాదః అని మూడుసార్లు చెబుతున్నాడు. అన్నాదః అంటే భోక్తా. నన్ను నేనే భోగ్యవస్తువుగా, భోక్తగా విభజించుకున్నాను.

స్వప్నవృత్తాంతం చూస్తే, ఇది అర్థమవుతుంది. నేను నిద్రపోయినప్పుడు, జాగ్రద్‌పురుషునిగా నేను ఒక్కడినే. కాని స్వప్నప్రపంచంలో నన్ను నేనే భోక్తగానూ, భోగ్య వస్తువుగానూ విభజించుకుంటాను. అంటే స్వప్నప్రపంచమూ నేనే, స్వాప్నికుడినీ నేనే.

**భోక్తా అహమస్మి, భోగ్యః అహం అస్మి**

అహం అన్నాదం పదం ఆశ్చర్యంలోని హెచ్చుస్థాయిలను సూచించటానికి మూడుసార్లు చెప్పబడింది.

**అహగ్గ్ం శ్లోకకృదహగ్గ్ం శ్లోకకృదహగ్గ్ం శ్లోకకృత్** – శ్లోకకృత అంటే భోక్తా, భోగ్యాలను ఒకచోట చేర్చే పరికరం. ఉదాహరణకు చూసే నేను, చూడబడే వస్తువు కన్ను ద్వారా కలపబడతాయి; వినే నేను, వినబడే వస్తువు చెవి ద్వారా కలపబడతాయి. ఈ పరికరాన్ని కరణం అంటారు. ఈ పదం కూడా ఆశ్చర్యంలోని హెచ్చుస్థాయిలను సూచించటానికి మూడుసార్లు చెప్పబడింది. జ్ఞాని నేనే కర్తా, కర్మ, కరణం అంటున్నాడు.

ఈ మూడు వాక్యాలను కలిపితే, నేనే త్రిపుటిని అంటున్నాడు. అఖండ నిర్వికల్ప అహమస్మి. అటువంటి నిర్వికల్పమైన నేను సవికల్ప ప్రపంచంగా కనిపిస్తున్నాను.

**అహమస్మి ప్రథమజా** – మొట్టమొదట పుట్టినది నేనే.

**బ్రహ్మా దేవానాం ప్రథమః సంబభూవ** – ముండకమ్ 1.1.1

దేవతలలో బ్రహ్మదేవుడు మొట్టమొదట పుట్టాడు. పురాణాల్లో కూడా బ్రహ్మదేవుడు విష్ణుమూర్తి నాభి నుంచి ఉద్భవించి, సృష్టి ప్రకరణం చేశాడని నేర్చుకుంటాము. ఆ బ్రహ్మను, ఉపనిషత్తు పరిభాషలో, ఆ హిరణ్యగర్భను నేనే.

**ఋతా3స్య** – ఈ ప్రపంచంలో. ఋతం అంటే జగత్తు లేదా ప్రపంచం.

**పూర్వం దేవేభ్యః** – దేవతల కన్నా కూడా ముందు నేను పుట్టాను అంటున్నాడు జ్ఞాని. ఈ మూడు వాక్యాలను కలిపితే –

**పూర్వం దేవేభ్యః ప్రథమజా ఋతస్య అహమస్మి**

ఈ విశ్వంలో, నేను దేవతలకన్నా ముందు పుట్టాను. బ్రహ్మ ముందు పుట్టాడని ముండకంలో చూశాము కాబట్టి, ఈ రెండూ కలిపితే నేనే బ్రహ్మను అంటున్నాడు జ్ఞాని. నేను సగుణరూపంలో ఉన్నాకూడా, నేను నిర్గుణబ్రహ్మను.

**అమృతస్య నా3భాయి (అస్మి)** – నేను అమృతత్వానికి నాభిని. నాభాయి అంటే నాభి, అంటే ఆధారం. నేను నిర్గుణబ్రహ్మను, నేనే ఈ అశాశ్వతమైన జగత్తుగా, జీవులుగా ప్రకటితమవుతున్నాను.

ఇప్పుడు జ్ఞాని అన్నదానాన్ని స్తుతిస్తున్నాడు. భృగువల్లీలో ప్రత్యేకించి అన్నదానం యొక్క గొప్పతనాన్ని చూస్తాము. ఇక్కడ ఒక ప్రత్యేకమైన భావనను చూస్తాము. అన్నాన్ని దానం చేయటం ద్వారా అన్నాన్ని వర్థిల్లజేస్తున్నాడు అంటున్నది ఉపనిషత్తు. మామూలుగా మన భావన ఏమిటి? దానం చేస్తే ఉన్నది కరిగిపోతుంది; మనం దాచుకోవాలంటే ఎవరికీ ఏమీ దానం చేయకూడదు అనుకుంటాము. కాని ఇక్కడ వేదాంతం, మీరు దానం చేస్తే మీకు పెరుగుతుంది అంటున్నది. అంటే ఇప్పుడు, మీ దగ్గర ఉన్నప్పుడు మీరు ప్రపంచానికి ఇస్తే, మీకు అవసరమైనప్పుడు ప్రపంచం మీకు తిరిగి ఇస్తుందని అర్థం. ఇప్పుడు మీరు అన్నదానం చేస్తే, మీకు ఆకలి వేసినప్పుడు ప్రపంచం మీ ఆకలి తీరుస్తుంది. అందువల్లనే మన పెద్దలు అంటారు, 'ఇస్తూ ఉంటే వస్తూ ఉంటుంది.' ఈ భావన ఇప్పుడు చూస్తాము.

**యో మా దదాతి స ఇదేవమా3వాః** – ఇక్కడ మా అంటే అన్నం. స ఇదేవమావాః ని సః ఇద్ ఏవమ్ ఆవాః అని విడదీసుకోవాలి. సః అంటే అతను; ఆవాః అంటే రక్షిస్తున్నాడు; ఇద్ ఏవమ్ అంటే ఈ విధంగా మాత్రమే. ఇప్పుడు ఈ పదాలన్నీ కలిపిచూస్తే ఎవరైతే ఇతరులకు అన్నాన్ని ఇస్తున్నాడో అతను ఈ ఇవ్వటం ద్వారా ఈ అన్నాన్ని రక్షిస్తున్నాడు.

కాకపోతే, జ్ఞాని ఇక్కడ తనదైన శైలిలో చెబుతున్నాడు. అన్నం అనకుండా మా అంటున్నాడు. ముందు వాక్యాల్లో నేనే అన్నాన్ని అన్నాడు. ఆ అర్థాన్ని ఇక్కడకు తెచ్చుకోవాలి. అందువల్ల మా అంటే అన్నరూపమైన నన్ను ఇస్తే, నన్ను రక్షించిన వ్యక్తి అవుతాడు అంటున్నాడు. అంతేకాదు, అలా చేయకపోతే, అన్నం దానం చేయని వ్యక్తిని దహించివేస్తుంది అని బెదిరిస్తున్నాడు కూడా.

**అహమన్నమ్** – అన్నమైన నేను

**అహమన్నమన్నమదంతమా3ద్మి** – ఎవరైతే ఇతరులకు అన్నాన్ని పెట్టకుండా తానే తింటున్నాడో, అతన్ని తినేస్తున్నాను. అంటే ఎవరికీ పెట్టకుండా తినే వ్యక్తికి అనారోగ్యం కలిగి, అతను నాశనం అవుతాడు. దీని అర్థం అన్నదానం చేసితీరాలి.

**అహం విశ్వం భువనమభ్యభవామ్** – నేను ఈ సకలమైన జగత్తులో వ్యాపించియున్నాను. ఈ నేను అనేది ఎవరో మర్చిపోకూడదు. కార్యకరణ సంఘాతంగా చూస్తే, నేను చాలా పరిమితి ఉన్న జీవిని. ఈ శరీరమైన నేను సర్వవ్యాపకం అని చెబితే, ఒక అల నేను ఈ సముద్రమంతా వ్యాపించి ఉన్నానని చెప్పినట్టు అవుతుంది. అది ఎప్పుడు సబబు? అల తనను అధిష్ఠానమైన నీరుగా అర్థం చేసుకున్నప్పుడు సాధ్యమవుతుంది. అలాగే జ్ఞాని నేను సర్వవ్యాపకం అంటే ఆ నేనును ఆత్మగా తీసుకోవాలి. పంచకోశ విలక్షణ అహం అని తీసుకోవాలి.

**సువర్న జ్యోతీః** – నేను జ్యోతిని. ఇక్కడ జ్యోతి అంటే చైతన్యస్వరూపం అని అర్థం. చైతన్య స్వరూపాన్ని స్వయంజ్యోతి అంటారు. సువః అంటే సూర్యుడు; న అంటే పోలిక; జ్యోతీః అంటే ప్రకాశం. మొత్తం కలిపితే నా ప్రకాశం సూర్యున్ని పోలివుంది. భగవద్గీతలో కూడా ఈ పోలికను చూస్తాము. ఈ సువర్నజ్యోతీః అర్థం అహం బ్రహ్మ అస్మి.

ఈ విధంగా ఉపనిషత్తు జ్ఞానం పొంది, జీవన్ముక్తి పొందిన జ్ఞాని పాడే పాటను ముగిస్తున్నది.

**య ఏవం వేద।** – ఈ జ్ఞానాన్ని ఎవరైతే పొందుతారో,

**(స ముక్తః భవతి)** – జ్ఞానిలాగానే అతను కూడా జీవన్ముక్తుడు అవుతాడని ఈ ఫలాన్ని మనం కలుపుకోవాలి. ఎవరు పొందితే వారు జీవన్ముక్తులు అవుతారు అంటే ఎవరైనా పొందవచ్చు అని అర్థం. ఏ వర్ణానికి చెందిన వ్యక్తైనా – బ్రాహ్మణుడు, క్షత్రియుడు, వైశ్యుడు, శూద్రుడు ఎవరైనా; ఏ ఆశ్రమానికి చెందిన వ్యక్తైనా – బ్రహ్మచారి, గృహస్థు, వానప్రస్థ, సన్న్యాసి; ఏ వయస్సుకు చెందిన వ్యక్తైనా – బాలుడు, యువకుడు, వృద్ధుడు; ఏ లింగానికి చెందిన వ్యక్తైనా – స్త్రీ, పురుషుడు; ఎవరైనా బ్రహ్మజ్ఞానానికి అర్హులే.

అందువల్ల ఎటువంటి సంకోచాలు లేకుండా, ఎవరైనా బ్రహ్మజ్ఞానం పొంది జీవన్ముక్తులు అవవచ్చు అని అంటున్నది ఉపనిషత్తు.

**ఇత్యుపనిషత్** – ఇక్కడితో మూడవ అధ్యాయమైన భృగువల్లీ ముగిసింది; తైత్తిరీయోపనిషత్తు కూడా ముగిసింది.

**తైత్తిరీయోపనిషత్ సమాప్తా**

**ఓం సహ నావవతు। సహ నౌ భునక్తు। సహ వీర్యం కరవావహై। తేజస్వి నావధీతమస్తు మా విద్విషావహై॥ ఓం శాంతిశ్శాంతిశ్శాంతిః॥**

ఉపనిషత్తు ఆరంభించే ముందు విఘ్నాలు లేకుండా ఉపనిషత్తును అధ్యయనం చేసి బ్రహ్మవిద్యను పొందాలని శాంతిపాఠం పఠిస్తే, ఉపనిషత్తు ముగిశాక, విఘ్నాలు లేకుండా చేసి, నిరాటంకంగా ఉపనిషత్తును అధ్యయనం చేసి, బ్రహ్మవిద్యను పొందినందుకు కృతజ్ఞతా పూర్వకంగా మళ్ళీ శాంతిపాఠాన్ని పఠిస్తాము.

# తైత్తిరీయోపనిషత్ - భృగువల్లీ సారాంశం

ఉపనిషత్తులోని ముఖ్యమైన ఆత్మజ్ఞానం రెండవ అధ్యాయం అయిన బ్రహ్మానందవల్లీలో చెప్పబడింది. ఈ మూడవ అధ్యాయం అయిన భృగువల్లీలో కేవలం సూచనప్రాయంగా చెప్పబడింది. అదీకాక, మరికొన్ని సంబంధిత అంశాల గురించి వస్తాయి ఇందులో.

ఈ తైత్తిరీయోపనిషత్తులోని మూడు వల్లీలకు కూడా వాటిల్లో వచ్చిన మొదటి పదాలతో ఆయా పేర్లు వచ్చాయి. ఆ నియమం ప్రకారం ఈ వల్లీ కూడా భృగుర్వై వారుణిః తో మొదలవటంవల్ల దీనికి భృగువల్లీ అనే పేరు వచ్చింది. ఇది కూడా గద్యరూపంలో ఉంది. ఇందులో పది అనువాకాలు ఉన్నాయి. వాటిలోని అంశాలు ఇవి.

1. బ్రహ్మజ్ఞాన సాక్షాత్ సాధన - అనువాకాలు 1-6
2. బ్రహ్మజ్ఞాన సహకారీ సాధనాని - అనువాకాలు 7-10 (కొంత భాగం)
3. బ్రహ్మజ్ఞాన ఫలం - అనువాకం 10

**1. బ్రహ్మజ్ఞాన సాక్షాత్ సాధన - అనువాకాలు 1-6**

ఈ సాక్షాత్ సాధనను బ్రహ్మవిచార సాధన అనవచ్చు. ఈ సాధనను తపః అనే సాంకేతిక పదంతో పేర్కొంటుంది ఉపనిషత్తు. ఈ అనువాకాల్లో ఉపనిషత్తు కొన్ని అంశాలను నొక్కి చెబుతున్నది.

ఎ) బ్రహ్మ విచారణ స్వంతంగా చేయకూడదు. గురువు, శాస్త్రం ద్వారా చేయాలి. ఎవరైనా స్వంతంగా విచారణ చేస్తే, అతనికి నిశ్చయజ్ఞానం కలుగదు. అది ఊహాగానం అవుతుంది.

బి) స్వంతంగా శాస్త్రాన్ని అధ్యయనం చేయకూడదు. గురువు ద్వారా చేయాలి. గురువు లేకుండా అధ్యయనం చేస్తే ఆ జ్ఞానం అసంపూర్ణం అవుతుంది; సరిగ్గా అర్థం కాకపోయినా ఫర్వాలేదు, తప్పుగా అర్థం చేసుకునే ప్రమాదం ఉంది.

సి) గురువు శ్రోత్రియ బ్రహ్మనిష్ఠ అయిన గురువై ఉండాలి. ఆయన స్వంతంగా, శాస్త్రం జోలికి పోకుండా బోధించకూడదు.

భృగువు తండ్రిని విద్యను బోధించమని అడగటం ద్వారా స్వంతంగా విచారణ చేయకూడదని చెబుతున్నది ఉపనిషత్తు.

గురుశిష్యులుగా వరుణుడు, భృగువులను పరిచయం చేయటం ద్వారా ఉపనిషత్తును గురు-శిష్యుల సంవాదం రూపంలో నేర్చుకోవాలని నిర్దేశిస్తున్నది ఉపనిషత్తు.

భృగువు, తండ్రియైన వరుణుణ్ణి బ్రహ్మవిద్య బోధించమని అడిగితే, వరుణుడు శాస్త్రంలోంచి రెండు సూచనలను ఇచ్చాడు. దీనివల్ల శాస్త్రం ద్వారానే తెలుసుకోవాలని తెలుస్తున్నది.

వరుణుడు బ్రహ్మజ్ఞానాన్ని ప్రత్యక్షంగా బోధించలేదు. రెండు సూచనలను మాత్రం ఇచ్చాడు. వాటి ద్వారా విచారణ చేయి అన్నాడు.

1. **బ్రహ్మ ఉపలబ్ధి ద్వారాణి** – అన్నం ప్రాణం చక్షుశ్శ్రోత్రం మనోవాచమితి
2. **బ్రహ్మలక్షణమ్** – యతోవా ఇమాని భూతాని జాయంతే। యేన జాతాని జీవంతి। యత్ప్రయంత్యభిసంవిశంతి॥

పంచకోశ వివేకాన్ని, బ్రహ్మలక్షణాన్ని దృష్టిలో పెట్టుకుని చేయాలి. ఆత్మవిచారణ అనేక మార్గాల ద్వారా చేయవచ్చు. కాని ఇక్కడ పంచకోశ వివేకప్రక్రియను చూశాము. ఈ ప్రక్రియ వివరంగా రెండవ అధ్యాయంలో చూశాము కాబట్టి, ఇందులో అంత వివరంగా రాలేదు.

భృగువు అన్నింటికన్నా స్థూలమైన అన్నమయకోశంతో మొదలుపెట్టాడు తన విచారణ. ముందు అన్నమే సృష్టి స్థితి లయకారణం అనుకున్నాడు. కాని శ్రుతి, యుక్తి ప్రమాణాల ద్వారా కాదని విశ్లేషించాడు. దాని తర్వాత వరుసగా ప్రాణమయకోశానికి వెళ్ళి ప్రాణం బ్రహ్మ అనుకుని, మళ్ళీ అది కాదని మనోమయకోశానికి వెళ్ళి సమష్టి మనస్సు బ్రహ్మ అనుకుని, మళ్ళీ అది కాదని, విజ్ఞానమయకోశానికి వెళ్ళి, సమష్టి బుద్ధి బ్రహ్మ అనుకుని, మళ్ళీ అది కాదని కూడా తెలుసుకున్నాడు. ఇక తరువాత వచ్చే కోశం ఆనందమయకోశం. కాని భృగువుకి ఇప్పటికి విషయం అర్థమయిపోయింది. దాన్ని వదిలేసి, ఆనందమే బ్రహ్మ అని తెలుసుకున్నాడు.

**ఆనంద ఆత్మా। బ్రహ్మ పుచ్ఛం ప్రతిష్ఠా।** – బ్రహ్మానందవల్లీ 5

బ్రహ్మానందవల్లీలో ఆనందఆత్మా అని వచ్చింది. ఇక్కడ ఆనందో బ్రహ్మేతి వ్యజానాత్ అని వచ్చింది. ఆనందం=ఆత్మ; ఆనందం=బ్రహ్మ, అనే ఈ రెండు వాక్యాలనూ కలిపితే మనకు వచ్చే వాక్యం ఆత్మ=బ్రహ్మ. ఆనందం అంటే అనుభవంలోకి వచ్చే కోశానందం కాదు; ఆనందం అంటే జగత్కారణం బ్రహ్మ. ఆ విధంగా తండ్రి ఇచ్చిన సమస్యా పూరణానికి భృగువుకు సమాధానం దొరికింది. దేన్నించైతే సృష్టిస్థితిలయ జరిగిందో, అది బ్రహ్మ అన్నాడు. ఆనందంనుంచి సృష్టి స్థితి లయ జరిగింది కాబట్టి ఆనందమే బ్రహ్మ అని అర్థం చేసుకున్నాడు భృగువు.

జగత్కారణం తటస్థ లక్షణం అయితే ఆనందం స్వరూపలక్షణం. అలా గురువైన వరుణుడు తటస్థలక్షణం ఇస్తే, శిష్యుడైన భృగువు బ్రహ్మయొక్క స్వరూపలక్షణమైన ఆనందాన్ని దాని

ద్వారా తెలుసుకున్నాడు. ఆనందం అంటే అనంతం అని అర్థం చేసుకోవాలి. విద్యను భార్గవీ వారుణీ విద్యా అంటారు. ఈ బ్రహ్మజ్ఞానం పొందితే ఆధ్యాత్మిక ఫలం, లౌకికఫలాలు రెండూ కలుగుతాయి.

**2. బ్రహ్మజ్ఞాన సహకారీ సాధనాని – అనువాకాలు 7–10 (కొంతభాగం)**

ఈ సాధనలు బ్రహ్మజ్ఞానాన్ని ప్రత్యక్షంగా కలుగజేయవు కాని, వాటి సహాయం లేనిదే బ్రహ్మజ్ఞానాన్ని పొందలేము. చెట్టుకున్న ఒక కాయ పండుగా మారుతుంది. కాయ, పండుకు సాక్షాత్తు కారణం; ఆ చెట్టుకు నీరు పోస్తేనే అది సాధ్యం. అందువల్ల నీరు సహకారీ సాధన. ఆ సహకారీ సాధనలు కర్మయోగం, ఉపాసనయోగం.

ఎ) **కర్మయోగం** – కర్మయోగం అంటే సత్కర్మలను సద్భావనతో చేయాలి. సత్కర్మలను గురించి చెప్పటానికి, ఇక్కడ ఉపనిషత్తు అన్నాన్ని ఉదాహరణగా తీసుకుంది. అన్నంమీద వ్రతాలను చెప్పింది.

| | | |
|---|---|---|
| వ్రతం 1 – | అన్నం న నింద్యాత్ | – మీకు వడ్డించబడిన అన్నాన్ని నిందించకూడదు. |
| వ్రతం 2 – | అన్నం న పరిచక్షీత | – మీకు పెట్టిన ఆహారాన్ని పారవేయకూడదు. |
| వ్రతం 3 – | అన్నం బహుకుర్వీత | – ఆహారాన్ని సమృద్ధిగా పండించాలి. |
| వ్రతం 4 – | న కంచన వసతౌ ప్రత్యాచక్షీత | – ఇంటికి వచ్చిన అతిథికి వసతి ఇవ్వకుండా అతనిని పొమ్మనకూడదు. |
| | బహ్వన్నం ప్రాప్నుయాత్ | – సమృద్ధిగా అన్నాన్ని సంపాదించాలి. అన్నదానం చేయాలి. |

ఈ వ్రతాలను, ఉపాసనలను కలిపి చూశాము 7–9 అనువాకాల్లో. దాన్ని మనం వీలుకోసం విడదీసుకున్నాము. అతిథి సేవలో భాగంగా అన్నదానం గురించి వస్తుంది. అది మనుష్యయజ్ఞం కిందికి వస్తుంది.

బి) **ఉపాసనయోగం** – భృగువల్లీలో ఈ భాగంలోనే నాలుగు ఉపాసనలను చూశాము. అవి విరాట్ ఉపాసన, అధ్యాత్మిక ఉపాసన, అధిదైవిక ఉపాసన, ఆకాశఉపాసన.

**ఉపాసన – 1 విరాట్ ఉపాసన** – ఈ విరాట్ ఉపాసనలో ఈ విశ్వమంతా భగవంతుని శరీరంగా భావించాలి.

**త్రిభువనవపుషం విష్ణుమీశం నమామి**

జగత్తు అంతా ఒకదానికొకటి ఆశ్రితాలై ఉన్నాయి. ఈ పరస్పర సంబంధాన్ని, మూడు జతల వస్తువులను తీసుకుని, రెండు రకాల అనుబంధాలతో వివరించుకు వచ్చింది ఉపనిషత్తు.

రెండు రకాల సంబంధాలు – అన్న–అన్నాద సంబంధం, ప్రతిష్ఠా–ప్రతిష్ఠిత సంబంధం

మూడు జతల వస్తువులు – ప్రాణ–శరీరం; అగ్ని–జలం; పృథివీ–ఆకాశం

ఈ వివరాలను ఒక పట్టికలో (చివర్లో) చూద్దాము. ఈ మూడు జంటలు కేవలం జగత్తులో ప్రతిదీ ఎలా ఒకదానిమీద ఆధారపడ్డాయో చూపటానికి చెప్పబడ్డాయి. ఆకాశం, సూర్యుడు, చంద్రుడు, నక్షత్రాలు, నదులు, వృక్షసంపద, పశుపక్ష్యాదులు, మానవాళి అంతా విశ్వరూప ఈశ్వరునియొక్క అనేక అంగాలు. ఈ విధమైన ఉపాసనలవల్ల ఈ క్రింది విషయాలు తేటతెల్లమవుతున్నాయి.

- ఈశ్వరుడు జగత్తుగా ప్రకటితమవుతున్నాడు
- మనం అనుభవిస్తున్న ప్రతిదీ మిథ్యే
- బ్రహ్మ సత్యం, జగన్మిథ్యా
- ప్రమాతృప్రమేయ విలక్షణ తురీయబ్రహ్మ అహమస్మి

విరాట్ ఉపాసన ఫలం – ఈ ఉపాసనను నిష్కామంగా చేస్తే చిత్తశుద్ధి, చిత్తఏకాగ్రత, చిత్తవిశాలత ఏర్పడుతుంది.

**అన్నవానన్నాదో భవతి। మహాన్ భవతి। ప్రజయా పశుభిర్బ్రహ్మవర్చసేన। మహాన్ కీర్త్యా।**

సకామంగా చేస్తే అతనికి సమృద్ధిగా అన్నం దొరుకుతుంది, మహాత్ముడు అవుతాడు, మంచి పిల్లలు పుడతారు, పశుసంపద ఉంటుంది; బ్రహ్మవర్చస్సు పొందుతాడు; గొప్ప కీర్తిమంతుడు అవుతాడు.

**ఉపాసన 2 – అధ్యాత్మిక బ్రహ్మ ఉపాసన** – ఇందులో బ్రహ్మను మన శరీర అంగాలమీద ఆవాహన చేస్తాము. మన శరీర అంగాలు సజావుగా పనిచేస్తున్నన్నాళ్ళూ మనం వాటి గురించి పట్టించుకోము. అవి మొరాయించినప్పుడే వాటి విలువ తెలుస్తుంది. ఈ ఉపాసనను ఐదు కర్మేంద్రియాలమీద, ప్రాణశక్తి మీద చేస్తాము. కర్మేంద్రియాలు – వాక్కు, పాణి, పాదం, పాయువు, ఉపస్థం. వాటి వెనక ప్రాణశక్తి ఉండాలి కాబట్టి ప్రాణంమీద కూడా ఉపాసన చేయాలి.

ఇవి నిష్కామంగా చేస్తే చిత్తశుద్ధి, చిత్తఏకాగ్రత, చిత్తవిశాలత ఏర్పడుతాయి. సకామంగా చేస్తే దానికి తగ్గ ఫలం వస్తుంది. ఇవన్నీ వివరంగా పట్టికలో చూడవచ్చు.

**ఉపాసన 3 – అధిదైవిక బ్రహ్మ ఉపాసన** – దీనిలో ప్రకృతిలో ఉన్న శక్తులమీద ఉపాసన చేస్తాము. ఈ శక్తులు లేకపోతే మానవ మనుగడే సాగదు. ఆ శక్తులు – వృష్టి, మెరుపు, పశువు, నక్షత్రాలు. ఈ నాలుగూ వ్యవసాయానికి దోహదం చేస్తాయి. నక్షత్రాలు ఉంటే అవి ఎండాకాలాన్ని సూచిస్తాయి. ఎండాకాలంలో సూర్యుడు తన ప్రకాశంతో, మేఘాలు వాననీటితో నిండటానికి దోహదం చేస్తాడు. వానతో పాటు మెరుపులు వస్తాయి. పంట పండించటానికి పశుసంపద కావాలి. ఈ విధంగా మన జీవితం ఈ శక్తులతో పెనవేసుకుని ఉంది.

**తపామ్యహమహం వర్షం నిగృహ్ణామ్యుత్సృజామి చ** – గీత 9.19

సూర్యరూపంలో నేనే తపిస్తున్నాను. సముద్రంనుంచి నీటిని గ్రహించి, వర్షరూపంలో మళ్ళీ వదులుతాను అంటున్నాడు కృష్ణపరమాత్మ.

ఈ ఉపాసన ఫలాన్ని ఇక్కడ చెప్పలేదు ఉపనిషత్తు. నిష్కామంగా చేస్తే చిత్తశుద్ధి, చిత్త ఏకాగ్రత, చిత్తవిశాలత ఏర్పడతాయి. సకామంగా చేస్తే దానికి తగ్గ ఫలం వస్తుంది. ఇవన్నీ వివరంగా పట్టికలో చూడవచ్చు.

**ఉపాసన 4 – ఆకాశ ఉపాసన** – ఆకాశంలోని ఒక్కొక్క మహిమను తీసుకుని దానిమీద ఉపాసన చేస్తాము. ఎందుకంటే ఆకాశానికీ, బ్రహ్మకూ చాలా సమానలక్షణాలు ఉన్నాయి. అవి సూక్ష్మం, ప్రత్యక్ష అగోచరం, అసంగం, అఖండం, ఏకం, సర్వగతం, సర్వాధారం. అందువల్ల ఆకాశ ఉపాసన నేర్చుకుంటే మన బుద్ధి పదునుగా, సూక్ష్మంగా తయారై, సూక్ష్మాతి సూక్ష్మమైన ఆత్మను అర్థం చేసుకోవటానికి సిద్ధంగా ఉంటుంది. ఆకాశంలోని కొన్ని లక్షణాలు తీసుకుని ఉపాసన చేస్తే, కలిగే ఫలం ఏమిటో వివరంగా పట్టికలో చూడవచ్చు. ఆకాశంలో ఉపాసనకు తీసుకున్న లక్షణాలు ప్రతిష్ఠా, మహః, మనః, నమః, బ్రహ్మ, పరిమర.

ఈ కర్మ, ఉపాసనలు ప్రత్యక్షంగా జ్ఞానాన్ని ఇవ్వవు కాని సాధన చతుష్టయ సంపత్తిని పెంపొందిస్తాయి. ఈ సంపత్తిని పొందితే, అధికారి అయి, పంచకోశవివేకం ద్వారా జ్ఞానం పొంది, జ్ఞానఫలం కూడా పొందవచ్చు.

### 3. బ్రహ్మజ్ఞానఫలం – అనువాకం 10 (చివరి భాగం)

బ్రహ్మజ్ఞానఫలం జీవన్ముక్తి. జీవన్ముక్తి అంటే ఇక్కడే, ఇప్పుడే మోక్షాన్ని అనుభవించటం. ఈ జ్ఞాని మరణించాక విదేహముక్తి పొందుతాడు. పునర్జన్మ లేకపోవటాన్ని విదేహముక్తి అంటారు. ఇక్కడ విదేహముక్తి గురించి చెప్పలేదు కాని మనం కలుపుకోవచ్చు. ఉపనిషత్తులో జీవన్ముక్తిని రకరకాలుగా వివరిస్తారు. ఇక్కడ జీవన్ముక్తిని నాలుగు రూపాల్లో వర్ణించింది ఉపనిషత్తు.

**ఎ) పంచకోశ అభిమాన త్యాగః** – మళ్ళీ ఒకసారి బ్రహ్మజ్ఞానాన్ని బోధించి, తద్వారా పంచకోశ అభిమాన త్యాగాన్ని ఫలంగా చెప్పింది ఉపనిషత్తు.

**స యశ్చాయం పురుషే యశ్చాసావాదిత్యే। స ఏకః**

జీవాత్మలో ఉన్న ఆనంద ఆత్మా, ఆదిత్యునిలో ఉన్న ఆనంద ఆత్మా రెండూ ఒకటే అని చెప్పటం ద్వారా మహావాక్యాన్ని గుర్తుచేసింది. జ్ఞాని పంచకోశ వివేకం ద్వారా క్రమంగా ఒక కోశంనుంచి ఇంకొక కోశానికి వచ్చి, దాన్నించి కూడా విడివడుతూ వస్తాడు. ఈ పంచకోశాలు అనాత్మ అని అర్థం చేసుకుంటే, తన స్వస్వరూపంలో నిలబడతాడు.

**అదృశ్యే అనిలయనే అభయం ప్రతిష్ఠాం విందతే**

తన స్వరూపం పూర్ణం, ఆనంద స్వరూపం, అభయ స్వరూపం. ఈ విషయం ఉపసంక్రమ్య పదం ద్వారా సూచించబడింది.

**బి) సర్వ అభిమాన సహితత్వమ్** – జ్ఞానికి అసంగంగా ఉండి విసుగుపుడితే, అభిమానం పెంచుకుంటాడు. ఆ అభిమానం ఏ ఒక్కదానిమీదో కాదు, సర్వ అభిమాన సహిత్వమ్. ఇది సామగానంగా పాడతాడు.

**అహమన్నమహమన్న మహమన్నమ్**

ఆ విధంగా అతను నిర్గుణబ్రహ్మగా అసంగంగా ఉంటాడు లేదా ఈశ్వరునిగా సమష్టిలో ఉంటాడు. అందువల్ల వేదాంతం అయితే అన్నింటినుంచీ విడవడండి, లేకపోతే అన్నింటితో సంబంధం పెంచుకోండి అంటున్నది. కొన్నింటితో అనుబంధం పెంచుకుంటే, మీరు సంసారజీవుడు; అన్నింటితోనూ సంగత్వం పెంచుకుంటేనో, అన్నింటితోనూ సంగత్వం త్యజిస్తేనో మీరు బ్రహ్మ.

**సి) స్వతంత్రత్వమ్** – ఇలా కొన్నింటితో అభిమానం వదులుకుంటే, యదేచ్ఛగా సంచరిస్తాడు జ్ఞాని. అతను యదేచ్ఛగా ప్రపంచమంతా తిరుగుతాడు. ఏ ఆహారం ఇచ్చినా సంతోషంగా స్వీకరిస్తాడు. ఏ పాత్ర ధరించాల్సి వస్తే అది సంతోషంగా ధరిస్తాడు.

**ఇమాన్ లోకాన్ కామాన్నీ కామరూప్యనుసంచరన్**

అహంకార, మమకారాలనుంచి విడివడటమే జీవన్ముక్తి.

**డి) ఆనందః** – జ్ఞాని ఆనందంగా సామగానం చేస్తాడని చూశాము.

హా3వు, హా3వు, హా3వు

అహెూ ఎంత ఆశ్చర్యం అని తన ఆశ్చర్యాన్ని మూడు స్థాయిల్లో చూపిస్తున్నాడు.

**అహం విశ్వం భువనమభ్యభవామ్ సువర్ణజ్యోతీః।**

నేను సకలమైన జగత్తులో వ్యాపించివున్నాను. నేను స్వయంజ్యోతిని. సువర్ణజ్యోతీః అర్థం అహం బ్రహ్మ అస్మి.

ఈ విధంగా జీవన్ముక్తి పొందిన జ్ఞాని తన ఆనందాన్ని వ్యక్తపరుస్తాడు.

**ఓం సహ నావవతు। సహ నౌ భునక్తు। సహ వీర్యం కరవావహై। తేజస్వి నావధీతమస్తు మా విద్విషావహై॥ ఓం శాంతిశ్శాంతిశ్శాంతిః॥**

ఉపనిషత్తు ఆరంభించే ముందు విఘ్నాలు లేకుండా ఉపనిషత్తును అధ్యయనం చేయాలని ప్రార్థిస్తే, ఇప్పుడు చివర్లో నిరాటంకంగా ఉపనిషత్తును అధ్యయనం చేసి, బ్రహ్మవిద్యను పొందినందుకు కృతజ్ఞతలు చెప్పుకుంటున్నాము.

ఓం తత్సత్। సర్వం శ్రీ కృష్ణార్పణమస్తు

ఓం పూర్ణమదః పూర్ణమిదం పూర్ణాత్ పూర్ణముదచ్యతే
పూర్ణస్య పూర్ణమాదాయ పూర్ణమేవావశిష్యతే
ఓం శాంతి శ్శాంతి శ్శాంతిః

**పట్టిక 1 – విరాట్ ఉపాసన – మూడు జంటలు – రెండురకాల సంబంధాలు**

| **జంట** | **అన్నమ్** (తినబడేది) | **అన్నాదమ్** (తినేది) | **వివరణ** | **ప్రతిష్ఠా** (ఆధారం) | **ప్రతిష్ఠితమ్** (ఆధేయం) | **వివరణ** |
|---|---|---|---|---|---|---|
| 1. ప్రాణం–శరీరం | ప్రాణం | శరీరం | శ్వాసక్రియ ద్వారా శరీరం ప్రాణాన్ని తింటుంది | ప్రాణం | శరీరం | ప్రాణశక్తివల్లనే శరీరం పనిచేస్తుంది |
| | శరీరం | ప్రాణం | వ్యాయామం చేసినప్పుడు ప్రాణం శరీరాన్ని తింటుంది | శరీరం | ప్రాణం | శరీరంలో ఉంటేనే ప్రాణం పనిచేస్తుంది |
| 2. జలం–అగ్ని | జలం | అగ్ని | నీటిని అగ్ని స్వీకరిస్తుంది (తింటుంది) | జలం | అగ్ని | ఎ) వర్షించే మేఘాలనుంచి మెరుపు పుడుతుంది<br>బి) శరీరానికి పట్టే చెమట లోపల అగ్నిని (వేడిని) తగ్గిస్తుంది |
| | అగ్ని | జలం | మంటలు వస్తుంటే, నీరు అగ్నిని ఆపుతుంది (తింటుంది) | అగ్ని | జలం | అగ్నినుంచి జలం పుట్టింది |
| 3. పృథివి–ఆకాశం | పృథివి | ఆకాశం | పృథివి ఆకాశంలో లయమవుతుంది. ఆకాశం తింటుంది | పృథివి | ఆకాశం | గదిలో గోడలుండటంవల్ల ఆకాశం వినియోగంలోకి వచ్చింది |
| | ఆకాశం | పృథివి | ఇంట్లోని ఫర్నిచర్ ఇంట్లోని ఆకాశాన్ని తింటుంది | ఆకాశం | పృథివి | ఆకాశంనుంచి పృథివి పుట్టింది |

### పట్టిక 2 – అధ్యాత్మిక బ్రహ్మ ఉపాసన – ఫలం

| **లక్షణం** | **అంగం** | **ఫలం** |
|---|---|---|
| క్షేమ | వాక్కు | క్షేమంగా ఉంటారు |
| యోగక్షేమం | ప్రాణ అపాన | వస్తువులను పొంది, పదికాలాలు నిలుపుకుంటారు |
| కర్మ | పాణి | కర్మలు ఎక్కువగా చేసే శక్తి |
| గతి | పాదం | కాళ్ళు శక్తివంతంగా ఉంటాయి |
| విముక్తి | పాయువు | వ్యర్థపదార్థాలనుంచి విముక్తి |
| ప్రజాతిరమృతమానందః | ఉపస్థం | సంతానం, శాశ్వతత్త్వం, ఆనందం కలుగుతాయి |

### పట్టిక 3 – అధిదైవిక బ్రహ్మ ఉపాసన – ఫలం

| **లక్షణం** | **దేవత** | **ఫలం** |
|---|---|---|
| తృప్తి | వృష్టి | తృప్తి కలుగుతుంది |
| బలం | మెరుపు | బలం/శక్తి కలుగుతుంది |
| యశస్సు | పశువు | యశస్సు పొందుతాడు |
| జ్యోతి | నక్షత్రాలు | కీర్తిమంతుడవుతాడు |

### పట్టిక 4 – ఆకాశ ఉపాసన – ఫలం

| **లక్షణం** | **ఆలంబన** | **ఫలం** |
|---|---|---|
| ప్రతిష్ఠా | ఆకాశం | అందరికీ ఆధారం అవుతాడు |
| మహః | ఆకాశం | గొప్పవాడు అవుతాడు |
| మనః | ఆకాశం | గొప్ప మేధావి అవుతాడు |
| నమః | ఆకాశం | కోరికలన్నీ దాసోహం అవుతాయి |
| బ్రహ్మ | ఆకాశం | అనంతం అవుతాడు |
| పరిమర | ఆకాశం | శత్రువులు నాశనం అవుతారు |

# దశశాంతి మంత్రములు

1. మం॥ ఓం శం నో  మిత్రః శం వరుణః। శం నో భవత్వర్యమా। శం న ఇన్ద్రో బృహస్పతిః । శం నో విష్ణురురుక్రమః । నమో బ్రహ్మణే। నమస్తే వాయో। త్వమేవ ప్రత్యక్షం బ్రహ్మాసి। త్వామేవ ప్రత్యక్షం బ్రహ్మ వదిష్యామి। ఋతం వదిష్యామి। సత్యం వదిష్యామి। తన్మామవతు । తద్వక్తారమవతు। అవతు మామ్। అవతు వక్తారమ్॥

ఓం శాన్తిః శాన్తిః శాన్తిః॥

2. మం॥ ఓం సహ నావవతు। సహ నౌ భునక్తు। సహ వీర్యం కరవావహై।
తేజస్వి నావధీతమస్తు, మా విద్విషావహై ॥

ఓం శాన్తిః శాన్తిః శాన్తిః ॥

3. మం॥ ఓం యశ్ఛన్దసామృషభో విశ్వరూపః। ఛన్దోభ్యోఽధ్యమృతాత్సంబభూవ। స మేన్ద్రో మేధయా స్పృణోతు। అమృతస్య దేవ ధారణో భూయాసమ్ । శరీరం మే విచర్షణమ్। జిహ్వా మే మధుమత్తమా। కర్ణాభ్యాం భూరి విశ్రువమ్। బ్రహ్మణః కోశోఽసి మేధయా పిహితః । శ్రుతం మే గోపాయ॥

ఓం శాన్తిః శాన్తిః శాన్తిః ॥

4. మం। ఓమ్ అహం వృక్షస్య రేరివా। కీర్తిః పృష్ఠం గిరేరివ।
ఊర్ధ్వపవిత్రో వాజినీవ స్వమృతమస్మి। ద్రవిణగ్ం సవర్చసమ్। సుమేధా అమృతోఽక్షితః। ఇతి త్రిశఙ్కోర్వేదానువచనమ్॥

ఓం శాన్తిః శాన్తిః శాన్తిః ॥

5. మం॥ ఓం పూర్ణమదః పూర్ణమిదం పూర్ణాత్ పూర్ణముదచ్యతే ।
పూర్ణస్య పూర్ణమాదాయ పూర్ణమేవావశిష్యతే॥

ఓం శాన్తిః శాన్తిః శాన్తిః॥

6. మం॥ ఓం ఆప్యాయన్తు మమాఙ్గాని। వాక్ప్రాణశ్చక్షుః శ్రోత్రమథో బలమిన్ద్రియాణి చ సర్వాణి। సర్వం బ్రహ్మౌపనిషదం । మాహం బ్రహ్మ నిరాకుర్యామ్। మా మా బ్రహ్మ నిరాకరోదనిరాకరణమస్త్వనిరాకరణం మేఽ స్తు। తదాత్మని నిరతే య ఉపనిషత్సు ధర్మాస్తే మయి సన్తు। తే మయి సన్తు॥

ఓం శాన్తిః శాన్తిః శాన్తిః॥

7. మం॥ ఓం వాఙ్మే మనసి ప్రతిష్ఠితా, మనో మే వాచి ప్రతిష్ఠితమ్। ఆవిరావీర్మ ఏధి। వేదస్య మ ఆణీస్థః। శ్రుతం మే మా ప్రహాసీరనేనాధీతేనాహో రాత్రాన్సందధామి। ఋతం వదిష్యామి। సత్యం వదిష్యామి। తన్మామవతు । తద్వక్తారమవతు। అవతుమామ్। అవతువక్తారమ్। అవతువక్తారమ్॥

ఓం శాన్తిః శాన్తిః శాన్తిః॥

8. మం॥ ఓం భద్రం నో అపివాతయ మనః ॥

ఓం శాన్తిః శాన్తిః శాన్తిః ॥

9. మం॥ ఓం భద్రం కర్ణేభిః శృణుయామ దేవాః। భద్రంపశ్యేమాక్షభిర్యజత్రాః। స్థిరైరఙ్గైస్తుష్టువాగ్ంసస్తనూభిః। వ్యశేమ దేవహితం యదాయుః। స్వస్తి న ఇన్ద్రో వృద్ధశ్రవాః । స్వస్తి నః పూషా విశ్వవేదాః । స్వస్తి నస్తార్క్ష్యో అరిష్టనేమిః । స్వస్తి నో బృహస్పతిర్దధాతు ॥

ఓం శాన్తిః శాన్తిః శాన్తిః ॥

10. మం॥ ఓం యో బ్రహ్మాణం విదధాతి పూర్వం। యో వై వేదాంశ్చ ప్రహిణోతి తస్మై తగ్ం హ దేవమాత్మబుద్ధిప్రకాశం, ముముక్షుర్వై శరణమహం ప్రపద్యే ॥

ఓం శాన్తిః శాన్తిః శాన్తిః